

సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు, హైదరాబాద్

1.

సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు

మొదటి రెండవ భాగాలు

సురవరం ప్రతాపరెడ్డి

ప్రధాన సంపాదకులు
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా॥ సి. నారాయణరెడ్డి
అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు
డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాద్ - 500 001.

2

సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు

SURAVARAM PRATAPAREDDY VYASAALU

ప్రచురణ:
ఆంధ్ర సారస్వత పరిషత్
తిలక్ రోడ్, హైదరాబాద్ - 500 001.

ప్రథమ ముద్రణ : 1988
ద్వితీయ ముద్రణ : మార్చి, 2015

పేజీలు : 402

ప్రతులు : 1000

వెల : రూ. 240/-

ప్రతులకు:
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాద్ - 500 001.
ఫోన్ : 040-24753724

ముద్రణ:
సాయిలిఖిత ఆఫ్‌సెట్ ప్రింటర్స్
హైదరాబాద్.

అనుక్రమణిక

మొదటి భాగం :: సారస్వత వ్యాసాలు

రెండవ భాగం :: సాంస్కృతిక, చారిత్రక వ్యాసాలు

❖ ❖ ❖

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road,
Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

అవతారిక

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కాళోజి నారాయణరావు, శ్రీ బూర్గుల రామకృష్ణా రావు, శ్రీ లోకనంది శంకర నారాయణరావు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943 మే 26న రూపుదిద్దుకొని, ఈ రోజు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్య మిత్రులు డా॥ దేవులపల్లి రామానుజరావుగారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతో పాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్యకళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నది. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలువరించింది. 2013లో పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. తెలంగాణ ప్రత్యేకతలోని వివిధ పార్శ్వాలను ఆవిష్కరించే సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నిపుణుల ప్రసంగ వ్యాసాలను "వ్యాసగుళుచ్ఛం" పేరుతో పరిషత్తు రెండు భాగాలు వెలువరించింది.

వివిధ రంగాలలో తెలంగాణ వైశిష్ట్యాన్ని విశదీకరించే "తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం"పై సదస్సు వంటి కార్యక్రమాలను పరిషత్తు ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమై 2014 జూన్ 2వ తేదీన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణను సర్వతోముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయడం హర్షణీయం. తెలంగాణ భాషా సామిత్య కళాసంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఏడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో ముందుకు సాగుతున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు పాత్రలో భాగంగా విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నది. వాటిలో కొన్ని – తెలంగాణ మాండలిక పదాలు – ప్రయోగ వైశిష్ట్యం, తెలంగాణ ప్రాచీన తెలుగు కవుల కవితా ప్రాభవం, తెలంగాణ చిత్రకళ, శిల్పకళల వైభవం, తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలపై సదస్సు, తెలంగాణ కవయిత్రుల, కథయిత్రుల రాష్ట్రస్థాయి సమ్మేళనం.

తెలంగాణ వైభవోన్నతిపై పరిషత్తు గ్రంథప్రచురణను చేపట్టింది. ఈ పరంపరలో ప్రస్తుత గ్రంథం 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు' దీనికర్త – నిజాం ఏలుబడికింద తెలుగు తీవ్ర ఉపేక్షకు గురైన దశలో ఆ భాషను పరివ్యాప్తం చేసి, సముద్దీపంగావించిన అగ్రేసర వైతాళికుడు – శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు. భాష, సాహిత్యం, పరిశోధన, విమర్శ, చరిత్ర, విద్య, సంఘసేవ, స్వాతంత్ర్య సమరం, పత్రికారంగం, గ్రంథాలయోద్యమం, సంస్థానిర్వహణ మొదలైన అనేక రంగాలలో విశేష కృషి చేసిన మేధాసంపన్నుడాయన. ఆంధ్ర సారస్వత పరిషత్తు వ్యవస్థాపనలో ఆయన కీలక భూమిక వహించడం గమనార్హం. సురవరం వారు వివిధ ప్రక్రియల్లో 30కి పైగా అమూల్య గ్రంథాలను వెలయించిన సారస్వతమూర్తి. ఒక సందర్భంలో ఆ మహనీయునికి నేనర్పించిన పద్యనివాళి'.

అతడు ప్రతాపరెడ్డి; యిరులై పడియున్న తెలంగువారి గుం
డె తెరల దుల్పివెల్గులను నిల్పిన మిత్రుడు? మూర్ఛవోయిన
ట్టి తెలుగుజాతి సంస్కృతికి టీకలు దీసిన మల్లినాథుడె
న్ని తరములైన ప్రాతపడనేరని సృష్టికి నాట్యుడాతడే.

వ్యాసరచనలో ప్రతాపరెడ్డి గురుసిద్ధహస్తులు. 'గోలకొండ పత్రిక' సంపాదకులు గానే కాకుండా ఇతర పత్రికలలో, ప్రచురణలలో ఆయన రచించిన 150కి పైగా వ్యాసాలు వస్తువైవిధ్యం, ఆలోచనా నైశిత్యం, పరిశోధనాపాటవం, శైలీరామణీయక వంటి గుణ విశేషాలు సంతరించుకున్నాయి. వీటిలో నుండి 46 సాహిత్య, సాహిత్యేతర వ్యాసాలను నేను అధ్యక్షుడిగా వున్న 'సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి' సంస్థ లోగడ ఆచార్య ఎస్వీ రామారావు సంపాదకత్వాన రెండు భాగాలుగా ప్రచురించింది. జిజ్ఞాసువులైన పాఠకులకు, పరిశోధకులకు అత్యంత ఉపయుక్తంగా వుంటుందని పరిషత్తు ఈ వ్యాసాలను ఒక సంపుటిగా ప్రచురిస్తున్నది.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగే అందరి మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

(డా॥ సి. నారాయణరెడ్డి)

హైదరాబాదు
తేది: 15 మార్చి, 2015

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : 040-24753724

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విభిన్నమైన కార్యక్రమాల్లో పుస్తక ప్రచురణ విశిష్టమైంది. పరిషత్తు ప్రచురించిన గ్రంథాల పట్టికను చూస్తే ఎంత గొప్పవైన ప్రచురణలు వచ్చాయో తెలుస్తుంది. పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు పరీక్షల నిర్వహణ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే సదస్సుల నిర్వహణ, పెద్దల పేరిట నిర్వహించే సంస్మరణ ప్రసంగాలు, పరిణతవాణి ప్రసంగ పరంపర కొనసాగుతూ అనుబంధంగా పుస్తక ప్రచురణ జరుగుతున్నది. 2013 సంవత్సరంలో పరిషత్తు అధ్యక్షులు డా. సి. నారాయణరెడ్డి నేతృత్వంలో సప్తతి పూర్తి సందర్భంగా ఏడాది పొడవునా అనేకమైన ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. 'తెలంగాణ తెలుగు సాహిత్య వికాసం', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-ప్రయోగ రీతులు', 'తెలంగాణ ప్రాచీన నృత్య రీతులు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'తెలంగాణ కవయిత్రులు, కథయిత్రుల సమ్మేళనం' వంటి అనేక సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరుణంలో తెలంగాణలో సాహిత్య చైతన్యాన్ని పెంపొందించే కృషిలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పరిషత్తు భావించింది. నవ్యస్ఫూర్తితో ప్రచురణల్ని కూడా వెలువరించాలని నిర్ణయించింది. గత సంవత్సరం పరిణతవాణి ప్రసంగాలతో కూడిన తాజా సంపుటి, 'తెలంగాణ సాహిత్య వికాసం', 'వ్యాసగుళుచ్ఛం' రెండు సంపుటాలు ప్రచురించడం జరిగింది. వాటిని పాఠకులు ఆదరించారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ నూతన యుగోదయవేళ తెలంగాణకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనం జరగాలి. ఆ అధ్యయనానికి కావలసిన పఠనసామాగ్రిని సమకూర్చుకోవాలి. ఇప్పటివరకు ఉమ్మడి చరిత్రలో అంతర్భాగంగా వుండి తగినంత ప్రాధాన్యం లభించలేదని ప్రజల్లో వున్న

అసంతృప్తిని పోగొట్టాలి. ఆ దిశగా ఆంధ్ర సారస్వత పరిషత్తు అందిస్తున్న ప్రచురణల్లో 'తెలంగాణ సాహిత్య చరిత్ర', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు–కావ్యప్రయోగాలు', 'కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్యసేవ', 'మాఊరు మాట్లాడింది', 'తెలంగాణ గిరిజన భాషాసాహిత్యాలు', 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసావళి', 'తెలంగాణ ప్రముఖుల పరిణతవాణి', 'బంజారాల వివాహ ఆచార పద్ధతులు', 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు', 'తెలంగాణ చరిత్ర', 'తెలుగు జానపద సాహిత్యం– స్త్రీల గేయాల్లో సంప్రదాయం' ఈ సంవత్సరం వెలువడుతున్నాయి.

నిద్రాణమైన తెలంగాణ భాషా సాంస్కృతిక సీమలో తమ బహుముఖీనమైన వాఙ్మయ సృష్టితో వెలుగులు నింపి పునరుజ్జీవింపజేసిన ఘనత సురవరం ప్రతాపరెడ్డి గారికి దక్కుతుంది. తొలితరం కథారచయితగా, ప్రౌఢతర పద్య రచన చేసిన కవిగా, పరిశోధకునిగా, విమర్శకునిగా, పత్రికా సంపాదకునిగా అనేక అంవాల్లో ప్రతాపరెడ్డి గారిని తెలంగాణకు వైతాళికునిగా చెప్పుకోవచ్చు. తరతరాలుగా తెలుగు బాషా సాహిత్యాలు అణగారి వున్న కాలంలో కూడా కవులకు కొదవలేదని చాటి చెప్పి తెలంగాణ ఆత్మగౌరవాన్ని సమున్నతస్థానంలో నిలిపారు. వారి జీవిత చరిత్ర రచన, రచనల పునర్ముద్రణ విషయంలో సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్టు చేసిన కృషి ఎన్నదగింది. విద్వన్మణి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సురవరం వారిపై ప్రామాణికమైన పరిశోధన చేసినారు. సురవరం గురించి సాధికారికంగా ప్రసంగించే వారిలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రథమ స్థానీయులు. సురవరం వారి రచనలు ఈనాడు చాలావరకు లభిస్తున్నాయి.

సాహిత్య సాంస్కృతిక అంశాలపై వారు రాసిన వ్యాసాలు అమూల్య సంపద. ఇవి అలభ్యమని చెప్పి రెండు సంపుటాల వ్యాసాలను మాకు ఇవ్వటంతో పాటు పునర్ముద్రించే అవకాశం కల్పించిన సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్టు వారికి, డా. సురవరం పుష్పలత గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

దీని సంపాదకులుగానే గాక పరిషత్తు ప్రచురణల పరిశీలక సంఘం సభ్యులుగా తమ పూర్తి సహకారాన్ని అందించిన ఆచార్య ఎస్వీ రామారావు, సభ్యులు డా. తిరుమల శ్రీనివాసాచార్య, డా. డి. చంద్రశేఖర్‌రెడ్డిగార్లకు కృతజ్ఞతలు.

హైదరాబాదు
తేది:20 మార్చి, 2015

(జె. చెన్నయ్య)

తెలంగాణ వైతాళికుని వ్యాస ప్రదీప్తి

తన కలం ద్వారా సుప్త తెలంగాణమును మేలుకొల్పిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. ఆయన బహుముఖ ప్రజ్ఞానిధి. పత్రికా సంపాదకుడు. పరిశోధక వతంసుడు. సంఘ చరిత్ర నిర్మాత. స్వాతంత్ర్య సమరయోధుడు. అది ఆంధ్ర మహాసభ కానీ, గ్రంథాలయోద్యమం కానీ, లిపి–భాషా సమస్య కానీ, విద్యార్థి వసతిగృహ స్థాపన కానీ – ఆయన కృషి సల్పని రంగం లేదు. అయితే ప్రతాపరెడ్డిగారు ప్రధానంగా పాత్రికేయులు. గోలకొండ పత్రికను ఆలంబనగా చేసుకొని వారు తన ఉద్యమాలను కొనసాగించారు. చెన్నపట్నం నుండి కాశీనాథుని నాగేశ్వరరావుగారి ఆంధ్రపత్రిక, మచిలీపట్నం నుండి ముట్నూరి కృష్ణారావుగారి కృష్ణాపత్రిక ఏ విధంగా తెలుగుజాతి ప్రగతికి దోహదం చేశాయో, భాగ్యనగరం నుండి గోలకొండ పత్రిక కూడా ఆ విధంగానే సమాజ చైతన్యానికి సహకరించింది.

ప్రతాపరెడ్డిగారు నిరంతర జిజ్ఞాసువు. నిశితమైన పరిశీలనా చక్షువు. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, రామాయణ విశేషములు, హిందువుల పండుగలు ఆయన పరిశోధనా శేముషికి నిదర్శనాలు. ఇవేకాక వారి ప్రతిభకు పతాకలైన వ్యాసాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. అయితే అవన్నీ పాత పత్రికల పుటల్లో, వ్రాతప్రతుల రూపంలో చెల్లాచెదరుగా ఉన్నాయి. అవి వెలుగులోనికి వస్తే వారి పరిశోధనా వ్యక్తిత్వం ఎంత విశిష్టమైనదో నిరూపితం కాగలదు. వారిలో ఎంత విద్వత్తు నిక్షిప్తమై ఉన్నదో వెల్లడి కాగలదు.

సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు మొదటి భాగం వారి సాహిత్య వ్యాసాల నుండి ఏరిన ముత్యాల సంపుటం. ఇవి 1922–53 మధ్య 30 సంవత్సరాల కాలంలో వివిధ పత్రికల్లో ప్రచురితమైనవి. ప్రతాపరెడ్డిగారు గోలకొండ పత్రిక (1926–47)లోనే కాక సమకాలీన పత్రికలు పెక్కింటిలో రచనలు వెలువరించారు. వానిలో పేర్కొన తగినది పి.ఎన్. శర్మ, గడియారం రామకృష్ణశర్మగారి సంపాదకత్వంలో వెలువడిన సుజాత (1927–30, 1950–53). పి.వి. రాజమన్నార్ గారి 'కళ' (మద్రాసు–1922)

లోనూ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'ప్రబుద్ధాంధ్ర' (రాజమండ్రి–1930)లోనూ వారి రచనలు ప్రచురితమైనాయి. ఇంకా మీజాన్ (1942), విభూతి (1940), ప్రజాబంధు (1935) మొదలగు పత్రికలలోని వ్యాసాలు కూడా ఈ సంకలనంలో ఉన్నాయి.

వీనియందలి వ్యాసాల వరుస కాలక్రమాన్ని అనుసరించి కాక విషయ విభాగాన్ని దృష్టిలో పెట్టుకొని కూర్చబడింది. సాహిత్య వీథిలోని అన్ని కోణాలపై సురవరం వారి దృష్టి ప్రసరించింది. మొదటి వ్యాసం ప్రాకృత కావ్యమైన గాథాసప్తశతిలోని సామాజిక చిత్రణను, కవితా వైశిష్ట్యాన్ని సమగ్రంగా దర్శింపజేస్తుంది. రెండు మూడు వ్యాసాలు వివిధ యుగాలలో వెలసిన ఆంధ్ర వాఙ్మయ సంగ్రహ సమీక్షలు. తర్వాతి ఆరువ్యాసాలు ప్రక్రియా విమర్శలు. పల్లెపదాలపై ప్రతాపరెడ్డిగారి ఆసక్తి ప్రశంస నీయమైనది. జానపద వాఙ్మయం గురించిన వారి రచనలు ప్రత్యేక సంపుటంగా రాదగినవి. పది, పదకొండు వ్యాసాలు లోకోక్తులు. శబ్దాల వ్యుత్పత్తికి సంబంధించినవి. వారి భాషా పరిజ్ఞానానికి తార్కాణాలు. తర్వాతి తొమ్మిది వ్యాసాలు నన్నెచోడుడు మొదలుకొని అనర్ఘరాఘవకర్త వరకు గల ప్రాచీనాంధ్ర కవుల, కావ్యాలపై సమాలోచనలు. కవుల దేశకాల చర్చలు, కావ్య కర్తృత్వవాదాలు, కవిత్వానుశీలనం వీనిలో చోటుచేసుకొన్నాయి.

మొదటి భాగంలో సురవరం సాహిత్య వ్యాసాలు ప్రకటితం కాగా, రెండవ భాగంలో సాహిత్యేతర వ్యాసాలు సంకలితమైనాయి. 1928–52 మధ్య 25 సంవత్సరాల కాలంలో వ్రాయబడిన 25 వ్యాసాలు ఇందులో చేరినవి. వీనిలో చాలామటుకు గోలకొండ పత్రికలో ప్రచురితములైనవి. ఇంకా శోభ, సుజాత, ప్రబుద్ధాంధ్ర, మాతృసేవ పత్రికలలోని వ్యాసాలు ఇందు చోటుచేసుకొన్నాయి. రెండు వ్యాసాలు మాత్రం ప్రతాపరెడ్డి దివంగతులైన తర్వాత ప్రచురితమైనట్టివి.

సామాజిక, సాంస్కృతిక రంగాలలోని అన్ని కోణాలపై సురవరం వారి దృష్టి ప్రసరించింది. మొదటి నాలుగు వ్యాసాలలో వర్ణ వ్యవస్థ, హిందూ సమాజంలో స్త్రీ స్థానం మొదలగు అంశాలు వేద, శాస్త్ర, స్మృతి ప్రమాణాలతో పరిశీలించబడ్డాయి. తర్వాతి ఆరు వ్యాసాలలో ఆయుర్వేదం, తాంబూలం, మామిడిపండు మున్నగువాని ఉపయోగాలు వివరింపబడ్డాయి. ఇవి ప్రతాపరెడ్డి సహజ వ్యంగ్య, హాస్య ధోరణి విలసితంగా కొనసాగాయి.

సాంఘిక చరిత్ర నిర్మాణానికి పూనుకొన్న రెడ్డి గారు దేశ చరిత్రపై ఆసక్తి కనపరచడం సహజమే. ఈ సంపుటిలోని ఎనిమిది వ్యాసాలు స్థల చరిత్రకు సంబంధించినవి. తెలంగాణాలోని అనేక స్థలాల చరిత్రను ప్రతాపరెడ్డిగారు త్రవ్వి

తీశారు. జంటనగరాలలో మనం నిత్యమూ దర్శించే ప్రదేశాల గురించిన విశేషాలు వెల్లడించారు. చివరి ఆరు వ్యాసాలు పూర్వులు, సమకాలీనులు అయిన వ్యక్తుల చిత్రణలు. నైజాము ప్రభుత్వాన్ని ఎదిరించిన సురవరం వారు హజరత్ ఉమర్ గురించి వ్రాయటం వారి విశాల దృష్టికి నిదర్శనం. మాడపాటి, రాజాబహద్దర్ అను పరిచయం చేసిన రచనలు ఆధునిక రేఖా చిత్రాలకు తొలి రూపాలుగా పేర్కొనదగినవి.

ఈ రెండు భాగాలలోని కొన్ని వ్యాసాలు ధారావాహికంగా పత్రికల్లో ముద్రితమైనట్టివి. వాని కూర్పులో స్వల్పమైన మార్పులు తప్ప ప్రతాపరెడ్డి గారి రచనలు యథాతథంగా ఇందులో ప్రచురితమైనాయి. ఇవి ఆయా సందర్భాలలో పత్రికల కోసం వ్రాసినవి కావటం వల్ల వాడుక భాషకు దగ్గరగా వుండటం, తెలంగాణా ప్రాంతంలోని పలుకుబడులు, మాండలికాలు వీనిలో చాలావరకు చోటుచేసుకోవటం గమనించవలసిన అంశం. సురవరం వారి లోకజ్ఞతకూ, బహు విషయ పరిజ్ఞానానికీ ఈ వ్యాసాలు దీపికలు.

పరిశోధన, విమర్శ సమతూకంగా సమ్మేళనం చెందిన విశిష్ట రచనలు సురవరం వారివి. కొమర్రాజు లక్ష్మణరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి మున్నగు మహనీయుల కోవకు చెందిన పరిశోధకాగ్రగణ్యులు వారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ప్రగతి పథంలో కొనసాగుతున్న శుభతరుణంలో సాహిత్య వైజయంతి ప్రచురించిన సురవరం వ్యాసాలు రెండు భాగాలను కలిపి ఒకే సంపుటంలో ముద్రించి పాఠకులకు అందుబాటులోనికి తేవటానికి ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు పూనుకోవటం ముదావహం. పరిషత్తు అధ్యక్షులు, ప్రియతమ గురువర్యులు ఆచార్య సి. నారాయణరెడ్డిగారి ఆధ్వర్యంలో ఈ సారస్వత యజ్ఞం కొనసాగుతున్నందుకు వారికి నా కృతజ్ఞతాభివాదములు.

హైదరాబాదు
తేది: 15 మార్చి, 2015

(ఆచార్య ఎస్వీ రామారావు)

గాథా సప్తశతి

సంస్కృతమందు కాని, ప్రాకృతమందు కాని, దేశభాషలందు కాని గాథా సప్తశతితో సమానమగు కవిత లేదు. శాలివాహన చక్రవర్తులలో నొకడగు హాలుడు తన యాస్థానమందును తనకన్న ముందు కాలమందును నుండిన కవుల యొక్కయు కవయిత్రుల యొక్కయు ప్రాకృత పద్యముల నేర్చి కూర్చి యందు తన సొంత పద్దెములను కొన్నింటిని జేర్చి 800 పద్యముల పరిమితిగా సంకలించి ప్రపంచాని కందించెను. అదే గాథా సప్తశతి. హాలుడు తనను గూర్చి యేమియు తెలుపుకొనలేదు. ప్రతి శతకానంతర మొక పద్యములో తాను సంకలన కర్తనని మాత్రము తెలుపుకొనెను.

"రసిక జన హృదయ దయతే
కవివత్సల ముఖ సుకవి సంకలితే"

అని ప్రథమ ద్వితీయ తృతీయ పంచమ షష్ఠ శత కాంతములందును "నరపాల హాల రచితే ప్రాకృత కావ్యేత్ర సప్తశతే' అని సప్తమ శతకాంత మందును "అత్ర చతుర్థం విరమతి నిసర్గ రమ్యం శతం హిగాథానాం! మధురత్వేనామృత మపినోలగతి హృదయే" అని చతుర్థ శతకాంతమందును వ్రాసెను. ఈ పద్యములు నిసర్గ రమ్యమైనవనియు వాటి మాధుర్యము ముందర అమృతము కూడ చప్ప చప్పనిదే యనియు కవి హృదయము.

పై శ్లోకాలలో "కవివత్సల ముఖ సుకవి సంకలితే" అనునది యను మానమునకు తావిచ్చినది. రాజులు మందులనియు కవులు యశః కాముకులనియు, ఇతరులచే వ్రాయించిన కవితలకు పైకమిచ్చి తమ పేర్ల నతికింతురనియు, మన దేశమందు కథలల్లినారు. ఆ కథలలో నీ కథయు చేరినది. హాలుని యాస్థానమందు కవి వత్సలుడో, శ్రీపాలితుడో యొకడుండెననియు, అతడే సంకలనకర్తయనియు, హాలుని పేరు ద్రవ్యాశచే తగిలించె ననియు నందురు. కాని యది నిరాధారము, శతకాదియందే హాలుడిట్లు వ్రాసెను.

"సప్త శతకాని కోటేర్మధ్యే
కవి వత్సలేన హాలేన
గాథానాం రచితాని హి
నానాలంకార లలితానామ్" 1,3.

హాలుడే కవివత్సలుడు, హాలుని గురించి మనకు అయిదవ శతకమందు మరికొన్ని విషయములు తెలియవచ్చినవి.

దదతా సంవాహన సుఖ
రస సంతుష్టేన తవక రేలాక్షాం
విక్రమ నరేంద్ర చరితం
చరణేన హి శిక్షితం తస్యాః 5-64

భార్యభర్తతో నిట్లన్నది. లక్కరంగు పూసిన నా సవతి కాళ్ళు పిసికినది నీ యరచేతిలోని లక్క గుర్తులే చెప్పుచున్నవిలే.

నా సవతి విక్రమార్క చక్రవర్తి యంతటిది! విక్రమార్కుడు శత్రుసంబాధమున పేరొందిన భటుని కొక్కొక్కని కొకలక్ష యిచ్చెడివాడు. (ప్రాకృతములో లక్ష - లక్కయు సంబాధము - సంవాహము ఒకటే) విక్రమార్కుని యొక్క యొక ప్రసిద్ధ చర్యను పేర్కొనుటచే విక్రమార్కుడు హాలునికన్న ముందుండిన చక్రవర్తియనియు, అతడు కల్పిత పురుషుడు కాడనియు దీనివలన స్పష్టమైనది.

"దీనులైన వారి తేకువ దీర్చి ర
క్షింప నేర్చువార లిరువురిలను
పార్వతీశుడైన పరమేశ్వరుడు, రాజ
వల్లభుండు శాలివాహనుండు. 5-62.

(గాథా సప్తశతీసారమున శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, లెక్చరర్, మైసూరు యూనివర్సిటీ, వ్రాసిన పద్యాల నుదాహరింతును. వారు అనువదించిన వాటిని ముఖ్యమని తోచిన వాటిని సంస్కృత మూలముననే యుదాహరింతును.)

కాళ్ళు పిసుకుటకు 564లో విక్రమార్కుడే యుపమానమును 566లో దీనుల నుద్ధరించుటలో నీశ్వరునితో తుల్యత్వమునకు శాలివాహన నరేంద్రుని పోల్చుటలో విక్రమార్క శాలివాహన వంశాలకుండు పోటీ సూచితము. దీనులనుటకు మూలములో

"అవణాయి" అని కలదు. అది ఆపన్నాని యనియు అపర్ణాని యనియు నగును. అపర్ణయన పార్వతి. అపర్ణులు పార్వతేయులు అనగా శైవులు. ఆకులు కట్టని ఆదిమ నగ్నజనులలో వెలసిన దేవత యనియు సూచితమను కొందును. హాలుని కాలమందు శైవము బౌద్ధముతో పాటు ముఖ్యమతమనియు శాలివాహనులు శైవులనియు దీని నుండియే కాక,

అలుకమెయి జేవురించిన యాదిశక్తి
మోము జందురు నీడలో మొలచియుండ
పూజ తామర దాల్చిన పోల్కి బొలుచు
హరుని సంధ్యా జలాంజలి కెరగుదీరు. 1-1

అని ప్రథమ పద్యము నుండియు

సంధ్య వార్చగ దోసిట జలము పట్టి
నపుడు గౌరీ ముఖాంబుజమందు దోప
మంత్ర మంతయు నొక మాఱు మఱచి పట్టి
మోవినిగదల్చు శివునకు మ్రొక్కులిడుదు 7-111

అని పాఠకుల శృంగార రసానందమందు ముంచి తేల్చిన తుది పద్యము నుండియు నిస్సందేహముగా వెల్లడియైనది.

"తవరణజలద సమయ భయ
చల విహ్వల పక్షకైరనుప్రియతే" 5-71

శాలివాహనుని శత్రువులు విజితులై భయ విహ్వలులై విధేయులై అనుసరించి సేవించిరని హాలుడు వ్రాసుకొనెను. సప్తశతిలో హాలుని గురించి సూచనలివియే. శాతవాహనులాంధ్ర రాజులని పురాణాలలో పేర్కొనబడినారు. హాలుడు క్రీస్తు శక ప్రథమ శతకమందుండిన వాడని పలువురు చరిత్రకారులు నిర్ణయించినారు. ఔరంగబాదు జిల్లాలోని యిప్పటి పైఠానును అప్పటి ప్రతిష్ఠాన పురమును రాజధానిగా మధ్య దేశమంతయు నేలిన చక్రవర్తి. బహుశః ఇతడే శాలివాహన శక ప్రవర్తకుడై యుండును. ఇతనిని గూర్చి భట్ట శ్రీ మధురానాథ శాస్త్రి గారిట్లు సంస్కృత పీఠికలో వ్రాసిరి.

"కథా సరిత్సాగరములోని రాజును గూర్చిన కథ కలదు. ఇతనికి మొదట సంస్కృతము రాకుండెను. ఇతని భార్యయగు మలయవతి కది బాగుగా వచ్చి యుండెను. ఒకనాటి జలకేళిలో రాజు నీటితో రాణిని కొట్టగా "మోదకైస్తాడయ" యనగా కుడుములు తెప్పించి కొట్టగా నామె పరిహసింప సిగ్గుపడి శర్వవర్మ బోధచే అచిరకాలమందు పండితుడయ్యెను. బాణాదులిట్లితనిని గూర్చి వ్రాసిరి.

"అవినాశినమగ్రామ్యమకరోత్

సాతవాహనః విశుద్ధ జాతిభిః

కోశరత్నైరివ సుభాషితైః" కాని యిది యుపచార వాక్య సూత్రమేమో? అభినంద ప్రణీతమగు రామచరిత మహాకావ్యమందు "హాలేనోత్తమ పూజయాకవి వృషః శ్రీ పాలితోలాలితః ఖ్యాతిం కామపి కాళిదాస కవి యోనితాః శకారాతినాః శ్రీహర్షోనిత తార గద్యకవియే బాణాయవాణీఫలం। సద్య! సత్క్రియ యాభినందనుపిచ శ్రీహారవర్షో గ్రహత్!" అని శ్రీ పాలితుడను కవియే హాలుని పేర నీ సంకలనము చేసెనని వ్రాసినారు. దీనిని బట్టి శ్రీపాలితుడే దీని కర్తయనుట భావ్యము" భట్టశ్రీ గారు మరల ఇట్లు వ్రాసిరి.

"కేనానన్నాఢ్య రాజన్య రాజ్యే ప్రాకృత భాషిణః

కాలేశ్రీ సహసాం కన్యకేన సంస్కృత భాషిణః"

అని భోజుడు సరస్వతీ కంఠాభరణమందు వ్రాసెను. "అఢ్యరాజు (హాలుని) రాజ్యమందందరు ప్రాకృతము మాట్లాడిరి. విక్రమార్కుని రాజ్యమందందరును సంస్కృతము మాట్లాడిరి అని యితడు తెలిపెను. సప్తశతి శృంగార రసభూయిష్టము. ఇది అపూర్వ ధ్వని కావ్యము. రుద్రట, మమ్మట, వాగ్భట, విశ్వనాథ, భోజాది సాహిత్యశాస్త్రకర్తలు దీని నుండి యుదాహరణములను గైకొనిరి".

సప్తశతి యందు 200 పద్యాలలోపాలితుని పేర నుండునవి తొమ్మిది పద్యాలు మాత్రమే. హాలుని పేరనుండు పద్యములు 47. ఈ పద్యాల నెవరు వ్రాసినట్లు? సహజముగా సంకలనకర్త తన పద్యాల నెక్కువగా చేర్చును. మరియు సంకలనము చేయుట కూడ కష్టమగు పనియా?

దానికి పాలితుడే యవసరమా? అభినందుని శ్లోకము పాలిత పక్షముగా నుండిన నంతకు చాలా ప్రాచీనుడగు "బాణాదుల" శ్లోకాలు హాలుని పక్షాన

వాదించినవి కదా. రాజుల కవిత్వాలకుండు నీ అపప్రథ హాలునికిని తగిలినది. హాలుడు సంకలనకర్త కాదనుటకు ప్రబలాధారములు కానరాలేదు.

సప్తశతి కవులు

సప్తశతి పద్యాలలో ఇంచుమించు 250 పద్యాలకు కర్తలెవరో తెలియరాలేదు. ఇందు పలువురి స్త్రీల పద్యాలున్నవి. రేవా (1-87-90). రోహయే (2-6-3), మాధవి (1-91), అణ్ణుల లక్ష్మి (3,28,63,74,76), పాహయీఏ (1-70-83), వద్ధవాహయే (1-60-70-86) శశిప్రభా (4-4) అనువారు కవయిత్రులు. ఈ విషయమాకాలపు స్త్రీల యౌన్నత్యమును సూచించును.

ఇంకను ఇట్టి పద్యముల సంకలనములనేకములుండినట్లు ప్రాచీనులన్నారు. ఈ సప్తశతీ ప్రాశస్త్యమును దీనిపై పుట్టిన 19 వ్యాఖ్యానములే చాటుచున్నవి. అందు గంగాధరభట్టు వ్యాఖ్య ప్రసిద్ధమైనది. సప్తశతిలోని పద్యాలు సాహిత్య శాస్త్రకారులు విశేషంగా నుదాహరించుకొనిరి. భోజుడందరికన్న నెక్కుడుగా నీ పద్యాలు తన సరస్వతీ కంఠాభరణమందుదాహరించుకొనెను. ధ్వన్యాలోకకారుడును కొన్ని (2-75) పద్యాల నుదాహరించుకొనెను. మమ్మటుడు (1-44, 7-65), 7-67, 2-82, 5-55, 2-75) కొన్ని పద్యాలనుదాహరించుకొనెను.

భాష

సప్తశతిలోని భాష మహారాష్ట్ర ప్రాకృతము. ప్రాచీనులలో పలువురు సంస్కృత పండితులు ప్రాకృతమే సుకుమార సుందర భాషయని మెచ్చుకొనిరి. హాలుడే యిట్లనెను.

"అమృతం ప్రాకృత కావ్యం."
చెవుల కమృతంబు ప్రాకృత
కవనము చదువంగ వినగ గాననివారల్
పువువిల్తు శాస్త్ర మర్మము
వివరించెదరెట్లు సిగ్గువిడిచి మనమునన్" 12

కర్పూర మంజరియను ప్రాకృత నాటకములో రాజశేఖరుడిట్లు వ్రాసెను.

పరుషాః సంస్కృతబంధాః
ప్రాకృత బంధోపి భవతి సుకుమారః
పురుష మహిళానాం
యాపదిహాంతరం తానదేతేషాం॥

స్త్రీ పురుషులకెంత భేదమో యంత ప్రాకృత సంస్కృతాలకున్నదని భట్టశ్రీగారు వజ్జాలగ్గ అను ప్రాకృత గ్రంథమునుండి ఈ క్రింది శ్లోకమునుదాహరించిరి.

"లలితే మధురాక్షరే
యువతి జనవల్లభే సశృంగారే
సతి ప్రాకృత కావ్యే
కః శక్నోతి సంస్కృతం పఠితుం.

లలిత మధురమై యువతి జనాహ్లోదియైన ప్రాకృత కావ్యాన్ని వదలి సంస్కృతము నెవడు పఠింప సహించును. పై విషయాలనుబట్టి చూచిన శాలివాహనుల కాలము వరకు ప్రాకృత భాషలు జనుల మాతృభాషలగుటచేత వాటిపై గల యభిమానముచే సంస్కృతమును చిన్నచూపుతో జూచియుందురు. వివిధ ప్రాకృతములలో సప్తశతిలోనిది మహారాష్ట్ర ప్రాకృతమందురు. మహారాష్ట్రుల మాతృభాషలోనిపదాలిందెన్ని కలవోయేమో కాని మన తెనుగులో సాధారణమై వాడుకలోనున్న బహుపదములు సప్తశతిలో కానవచ్చును. ఎట్లనగా

అత్తశబ్దము శ్వశ్రుమాతులాని శబ్దములకు మారుగా గ్రంథమందంతటను చాల మారులు వచ్చినది. అత్తా తహర మణిజ్జం (శ్వశ్రుతధా రమణీయం (4-8) మామ భార్య మాతులానికి "మామి"యని పలుమారు వాడినారు. (1-93, 99) ఇది మన మామకు సన్నిహితమగుమాట. పొట్ట (1-83, 2-71), పడి (పతిత) (5-27) వల (వలగొను) 1-25 పల్లి (పల్లె) 1-30 పాడి (పాడియావు 1-65) కంటె 1-75 కాకి (22) మడ (ఏటిమడ 2-5) దేవళ (ము) 2-9, చేట (2-69) అద్దం 3-4, సవతి 3-11, దివ్వె 3-22, కడప 3-29, అవ్వ (ఆశ్చర్యార్థకము - ఒరంగల్ ప్రాంతమందలి యాశ్చర్యార్థక ప్రయోగము) 3-73 గంజి 3-86, చిప్పెర (చిప్పెర గడ్డి అలుము) 4-30 తరము (శక్యము) 4-49, గంటు (ముడిగ్రంథి) 4-51, తుపరీ (తువ్వ తొగరి-కంది-తువ్వనేల) 4-58 ఇట్టి పదాలు లభ్యమగు చున్నవి. గోదావరిని గోదాయనియు (1-58), గోలా యనియు (2-3) పలుమారు వాడినారు. పూర్వ రూపము గోలాయని తర్వాత గోదా యనియు (అదే గోదా ఏరు- గోదారి) తర్వాత గోదావరి యనియు గ్రహింపవచ్చును. సప్తశతీ శృంగారరంగములు పల్లెలు, తటాకములు, పంటపొలాలు, గోదావరీ తీరములు, వింధ్య పరిసరాలు, దేవళములు.

అనుకరణములు

సప్తశతి ప్రాశస్త్యమును గ్రహించి యనేక కవులు దానిననుకరించిరి. అందు ముఖ్యులు అమరుడు, గోవర్ధనాచార్యుడు. బిహారి. అమరుడు అమరశతకమును వ్రాసెను. గోవర్ధనుడు ఆర్యాసప్తశతిని రచించెను. బిహారి వ్రజ భాషలో బిహారి సత్సయి (సప్తశతి) వ్రాసెను. వీరుకాక మరికొందరు దీని భావముల గ్రహించిరి. భట్టశ్రీగారు 1-46లోని యీ క్రింది

"రాతి మనసుతోడ నాతడు రేవూరు వదలి పోవుననెడు వార్తగలిగే వానికెపుడు దెల్లవారకయే యుండ రాత్రి తల్లి పెరిగిరావే నేడు".

అను పద్యమునకు హిందీలో నీ క్రిందిది కలదని తెలిపినారు.

సజన్ సకారై జాయగే
నైన్ మరేగే రోయ్
విధవా ఐసీరైన్ కరే
భోర్ కబ్ హినహోయ్.

మరియు 2-61 "ఊర్ధ్వాక్షః పిబతిజలం" అను పద్యాన్ని అప్పయ దీక్షితుడు మాటలు మార్చి ఇట్లు వ్రాసెననెను.

'యదోర్ధ్వాక్షః పిబత్యంబు
పథికో విరళాంగుళిః
తథా ప్రపా పాలికాపి
ధారాం వితనుతేతనుం॥' (క్రీడాభిరామములో 3-38)

'విక్రీణీతే మాఘే ప్రావరణం పామరోహి బలదేన నిర్ధూమ ముర్మరని భౌనూనం 'శ్యామాస్తనౌ పశ్యన్' (3-38) అను పద్యానికి 'మాఘమాసంబు పులివలె మలయుచుండ పచ్చడంబమ్ముకొన్నాడు. పణములకును ముదితచన్నులు పొగలేని ముర్మరములు చలికి నొఅగోయ కేలుండు సైరికుండు'- అను పద్యము కలదు.

సప్త శతిలోని (4-15)
జంఝావాతోత్తృణితే
గృహేరుదిత్యానిస్సహ నిషణ్ణాం
దర్శయతి గతిపతికాం

విద్యుదుద్యోతో జలధారాణాం అను పద్యానికి క్రీడాభిరామములో నీ క్రింది పద్యము కలదని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు తమ పీఠికలో వ్రాసిరి.

మ. "పటు జంఝూ పవనోత్తృణాలయములో భద్రంబునం బట్టెకం
కటిపై ముచ్చము డింగి నిర్భర వియోగగ్లాని శోషిల్లియె
క్కటి నిద్రించుచునున్న వాడవనితన్గర్జా వచః ప్రౌఢిమన్ –
దటి దుద్యోతము సూపునట్టు నడురే ధారాధరశ్రేణికిన్॥"

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారిట్లు పీఠికలో రాసినారు. "వంగూరి సుబ్బారావుగారు ఎక్కడ నుండి సంపాదించారో కాని శ్రీనాథుని శాలివాహన సప్తశతి లోనిదని యీ క్రింది పద్యముదాహరించిరి.

'వారణసేయ దావగొనవా, నవనారిజమందు తేటిక్రో।
వ్వారుచునుంట నీవెరుగవా, ప్రియవా తెరగంటి గంటికె।
వ్వారికి గెంపురాదె, తెగవా మగవారల దూర, నీ విభుం।
డారసి నీనిజం బెరుగు నంతకు నంతకు నోర్వు నెచ్చెలీ॥'

కాని యిప్పటి సప్తశతిలో దీనికి మూలమైన ప్రాకృత గాథ కానరాదు".

నూనూగు మీసాల నూత్న యౌవనమున శాలివాహన సప్తశతి నొడివితి అని శ్రీనాథుడు చెప్పియుండెను. కాని యది యింతవరకు లభ్యము కాలేదు. సప్తశతి పద్యాలను బోలిన ప్రాకృత పద్యాలను కొన్నింటిని మమ్మటాదు లుదాహరించిరి. కాని యవి యెచ్చటివో తెలియదు. ఆర్యా సప్తశతికి దారి చూపినది శాలివాహన సప్తశతియే కాని ఆర్యా సప్తశతి పద్యాలు వీటి ముందర దిగదుడుపుగా నున్నవి. హాలుని గోవర్ధనుడు పూర్తిగా అనుకరించెను. ఇక అమరుక కవి శ్లోకాలను గురించి విచారింతము. అమరుక కవి బహుశ క్రీ.శ. 200 ప్రాంతము వాడై యుండును. అతని కసాధారణకీర్తి కలిగెను. 'అమరుకవే రేకః శ్లోకః ప్రబంధ శతాయతే' అను నానుడి యేర్పడెను. అమరు కవి యొక్కొక్క శ్లోకము నూరు ప్రబంధాలకు సాటియనిరి. అట్టి కవి తన పెక్కు శ్లోకాలలో పూర్ణముగ గాథా సప్తశతి భావములను దింపుకొనెను. భట్టశ్రీ మధురానాథ శాస్త్రిగారు గాథలకును అమరుని శ్లోకాలలో గల సంపూర్ణ సామ్యములను చక్కగా నిరూపించినారు. ఉభయ గ్రంథ శ్లోకాలను పూర్తిగా నుదాహరించుటకు వీలులేనందున రెంటిని మాత్రము చూపించి తక్కినవి సూచింతును.

"కృత కస్వాప నిమీలితనయన
సుభగ దేహి మహ్యామవకాశం
గండ పరిచుంబ నోద్గత పులక
పునర్నైవ చిరయిష్యే. 1-20"

శూన్యం వాసగృహం విలోక్య శయనాదుత్థాయ కించిచ్ఛనై।
ర్నిద్రావ్యాజ ముపాగతస్యసుచిరం నిర్వర్ణ్య పత్యుర్ముఖం।
విశ్రబ్ధం పరిచుంబ్య జాతపులకా మాలోక్యగండస్థలీం।
లజ్జానమ్రముఖీ ప్రియేణహసతా బాలాచిరం చుంబితా॥"

అమరుక శతకం - 77

"దయతే ప్రసీద, కుపితా కాని
సుతనుత్వం, పరేస్తికః కోపః?
కోస్తిపరో? నాథత్యం! కిమితిహి,
మనుదురిత శక్తిరియం" 4-84

'బాలే! నాథ! విముంచ మానిని రుషం, రోషాన్మయా కింకృతం,
ఖేదోస్మాను, నమేపరాధ్యపతి భవాన్ సర్వే పరాధామయి,
తత్కింరోదిషి గద్గదేన వచసా, కస్యాగ్ర తోరుద్యతే,
నన్వేతన్మమ, కాత వాస్మి దయితానాస్మీ త్యతో రుద్యతే" అమరు. 53.

ప్రణయ కుపిత 1-27
అన్యోన్య కటాక్ష 2-99
వీటికి సాటి అమరుక శ్లోకము
ఏకస్మిన్ శయనే... 19
స్థగయిష్యామి 4-14
దీనికి అమరుని అనుకరణము
భ్రూ భంగేరచితేపి-24
యత్పృచ్ఛసి నివాసన్మాం 7-11
దీనికి అమరుని అనుకరణము
అంగానామదితానవం-45

అమరుడు అను రాజు చావగా అతని శరీరములో పరకాయ ప్రవేశవిద్యచే ఆదిశంకరాచార్యులు ప్రవేశించి అమరు రాజై అతని భార్యతో సుఖించి యీ శతకము వ్రాసెనని యొక అద్భుత కథకు విచిత్ర రూపమేర్పడినది. ఇదంతయు నవిశ్వసనీయము. శంకరుని కాలము 700–800 మధ్యకాలము. అమరుని ఆనందవర్ధన, మమ్మటాదులు గ్రహించినందున వారిరువురు క్రీ.శ. 10–11 శతాబ్దముల వారగుటవలన అమరుడు క్రీస్తు శకము 700 ఆ ప్రాంతము వాడనిన పొరపాటుండదు. అమరుడెవ్వడో తెలియదు.

విహారి సత్సయీ వ్రాసిన విహారి కవి యెప్పటివాడో తెలియదు. అమరు గోవర్ధనుల తర్వాత వాడని మాత్రమే భట్టశ్రీ గారన్నారు. సత్సయీలోని భాష యిప్పటి హిందీకి చాలా దూరముగానున్నది. కబీరు, తులసీదాసుల భాష కన్న చాలా ప్రాక్తన మైనది. కావున అది క్రీ.శ. 1200–1300 ప్రాంతముదిగా నుండును. సత్సయీలోని చాలా దోహలు (ద్విపదలు) గాథా సప్తశతి నుండి యేర్పడినవే యని భట్టశ్రీ గారెత్తి చూపినారు.

తెనుగు సేత

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు అసాధారణ కవి పండితులు. సంగీత సాహిత్య విద్యానామక యుగళంబు గ్రోలినవారై బహు భాషలను, ప్రాకృతమును నెరిగిన వారగుటను, తెనుగున ఉత్తమ వచన శైలిని, మధుర కవితను నల్లగలిగినవారు. వారు గాథా సప్తశతిలోని 395 పద్యముల నేరి తెనుగించినారు. వారి విచక్షణ సరియైనదే. పచ్చి శృంగారమును, అనవసరమగు పద్యాలను, అనుత్తమమైన వాటిని పరిహరించినారు. మూలమందలి భావములను అందలి గంభీరతను చెడకుండా సుందరముగా సులభ గ్రాహ్యమగునట్లుగా చేతికందించినారు. వారే దానికి పీఠిక వ్రాయవలసి యుండెను. అటులే కొంత చేసినట్లే! శ్రీనాథుని కృతియుత్పన్నమైన వ్యథను వీరు తొలగించినారు.

నాటి ఆచారాలు

గాథా సప్తశతి యొక్క కాలమును నిర్ణయించినాను. కావున ఆ కాలమందలి సాంఘికాద్యాచార విశ్వాసము లెట్టివో సప్తశతిలోని వర్ణలను బట్టి మనము స్పష్టముగా నిరూపింపవచ్చును. గాథలన్నియు నుద్దేశ పూర్వకముగా శృంగార భూయిష్టముగా సంకలింపబడినందున నా కాలమున జనులందరు శృంగారలంపటులని తలపరాదు.

మత విశ్వాసాలు - ఉత్సవములు

ఆ కాలమందు కొన్ని పురాణ దేవతలకు విశేష వ్యాప్తి యుండినట్లున్నది. రామలక్ష్మణులు (1-35) వామనుడు (5-6) రాధాకృష్ణులు (1-89) గణపతి (4-79) పేర్కొనబడినారు. అందు పాపము గణపతి పొట్టగలవాడగుటచే ఒక విలాసినికి రహస్య సంగతిలో తలగడగా పనికి వచ్చెను.

యౌవనములో సురతసమయ పరిధానీకృత గణపతి వార్ధక్య దశలో పాప పరిహర్తగా పూజితుడయ్యెను. ఎందరు పౌరాణిక దేవతలు పుట్టినను గిట్టినను నేటివలననే నాడును గ్రామదేవతలకే ప్రాముఖ్యముండెను.

'ఈవు చేతులారా నిచ్చినదని ప్రాచి
పూలసరము తావి పోయి యున్న
నింతి దాల్చుచున్న దింకను, వ్రత పూజ
ముగియ, నూరి వేల్పు బొమ్మవోలె (2-94)

(ఉదాహృతాంధ్ర పద్యములన్నియు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారివని యెరుగవలెను). ఆ గ్రామ దేవర్లకు దున్నపోతుల బలి ఇచ్చుచుండిరి.

కేవల హిందూ మతమే కాక బౌద్ధమతము కూడా మంచి వ్యాప్తిలో నుండెను. అందుచేత రెండు తావులలో తత్ప్రసక్తియు వచ్చినది.

భిక్షకుండు నాభి నీక్షించుచుండగా
నదియు వానిమోము నరయుచుండె
అతని చేతిచిప్ప నామె చేతుల తట్ట
కాకులేరి తినుచు గాకుచేసె (2-62)

ఇచట వీడు దొంగ సన్యాసి!

చిలుక ముక్కు వన్నెచే నొప్పు మోదుగు
పూలవరపు పొలిచె నేలనెల్ల
బుద్ధ దేవు చరణములు మ్రొక్క బుడమిపై
వ్రాలియుండు భిక్షు జాలమట్లు 4-8

స్త్రీలు వాయనము లిల్లిల్లు దిరిగి యిచ్చు వాడుక యుండెను. (4-28) పండుగలలో హెూలీ పండుగ (ఫల్గుణోత్సవము) చాల ముఖ్యమైనది. స్త్రీ పురుషులు

రంగులు చల్లుకొనుచు వినోదించెడి వారు. (4-69) 6-35 చూత లతికా క్రీడయనున దుండెను. ప్రియతమ నామమేమి చెప్పుమని ప్రియులు చూత లతికతో లేక నవ పలాశ లతతో కొట్టుట యీ క్రీడా విశేషమట! (1-28; 5-56) శైవ సాంప్రదాయకము లోని కాపాలికులందందుండిరి. (5-8) ప్రజలకు శకునాలపై విశ్వాసముండెను. "ఏ కోపి కృష్ణ సారో నదదాతివలనన్ ప్రదక్షిణం గంతుం" (1-25)

ధన నిక్షేపములు

నిన్న మొన్నటివరకు మనదేశమందలి ధనికులకు భూవివరములే బేంకులై యుండెననగా ఆ కాలమందు జనులు ధనమును, వెండి, బంగారును భూమిలో పూడ్చి దాచి పెట్టుకొనుచుండిరనిన చిత్రముగాదు. గాథలందు విరివిగా నీవిషయ చర్చలు వచ్చినవి.

"తగిన చోటు గాదు దాచుట కిది; యేల
సాహసంబు జేయ జనెదు కొడుక! 2-54

భూమిలో పాతిన ధనము పలుమారు నష్టమైనదని యిందు సూచితము.

"చరోజనులు సారె సారెకు జూతురు
భయము కోరికయును పైకొనంగ
వీరవరుని పత్ని వీగు జన్నుల; పాము
కాచు కొన్నలిచ్చి కడవలట్లు 6-72

బహుకాలము భూస్థాపితమైన ధనములపై పాములు కావలి యుండునన్న విశ్వాస మానాటికే ప్రాతదై యుండెను.

శిక్షలు

శిరచ్ఛేద శిక్ష పొందిన వాణ్ణి వధ్య స్థానమునకు తీసుకొని పోవుచూ తప్పెట వేసి యందరికి తెలియునట్లుగా వాని తప్పును, వాని శిక్షను ప్రకటించెడి వారు.

దొంగతనం చేసిన వారికి మరణ దండనము, శ్మశానమందు చెట్టుపై వ్రేలాడ గట్టుట యానాటి యాచారముగా కానవచ్చును. "శంకా శ్మశాన పాదలంబిత చోరే ణేవ ఖరేన" (6-36) అనుటయే నిదర్శనము. వ్యభిచారులను గ్రామాధికారులు శిక్షించుచుండిరి. (6-56)

స్త్రీల వేషభూషలు

స్త్రీలు స్నానము చేయునపుడు పసుపు రుద్దుకొనుచుండిరి. (1–80) కన్యలకు తొలి సమర్త కాలమందు పసుపులో నెయ్యి కలిపి ముఖమునకు చేతులకు కాళ్లకును రుద్దుచుండిరి. (3–46) ఇచ్చట మూలమందు "వర్ణఘృత లిప్తముఖం" అను పదముపై శ్రీ మధురానాథ శాస్త్రిగారిట్లు వ్యాఖ్యానించిరి. "హరిద్రావర్ణ మిశ్ర ఘృతం వర్ణఘృతం దేశ విశేష రజస్వలా ముఖం వర్ణఘృతేన, లిప్యతి ఇతికా చిత్రృథా" ఉత్తర హిందూ స్థాన మందీయాచారము లేదనియు "ఒకానొక దేశవిశేషమందు" ఈ యాచారముండె ననియు వ్యాఖ్యాత్రభిప్రాయము. ఇది ద్రావిడాచారము. సప్తశతిలో గోదావరీ తీర వాసుల యాచారాలు వర్ణించినందునను నేటికిని ఆంధ్రులలో నీయాచారముండుట వలనను దేశ విశేష నాంధ్రదేశమనుట స్పష్టము (చూడుడు 122 మరియు 619). ముత్తయిదువలు కాళ్ళకు లంకరంగు పూసుకొనుచుండిరి. (2–27) బుక్క పిండిని (కర్పూరాది గంధ ద్రవ్యకృత వర్ణ ధూళి) ప్రియులొండొరులపై చల్లుకొనుచుండిరి. (4–12) విలాసినుల ప్రసాదనములలో అద్దము, దువ్వెన ముఖ్యమైనవి. (3–4 మరియు 1–80) నాట్యమాడు స్త్రీలు ముఖమునకు హరిదళమును (అర్ధళము – హరితాల మండిత ముఖీనటీవ) పూసుకొనెడివారు. (1–9) పూర్వమిండ్ల పెరడులందు ఆంకోల (ఊడుగ) వృక్షములు పెంచుచుండిరి. వాటి పూల సువాసన యువతీ జనాహ్లాదకారి (5–97) ముత్తయిదువలు కొప్పుముడిని, జడను వేసుకొనుచుండిరి. (3–73) మరువము స్త్రీలకు ప్రీతికరమైయుండెను. (2–22) ధనిక యువతులు మరకతమణి పద్మరాగ సంవలితములైన (పచ్చల కెంపుల) కంటెలను ధరించిరి. (1–25) మట్టిగాజులను తొడుగుకొను నాచారము తెనుగు ముత్తయిదువలలో నిప్పటికే రూఢమై పోయెను. (5–38) "భగ్నకరవలయాని" అనుటలో భగ్న శబ్దమును బట్టి యవి మట్టి గాజులే యనవలెను. మరియు (5–53) వ్యాఖ్యలోనవి "కాచాది నిర్మితం" అని వివరించినారు.

స్త్రీలకు చీర రవిక ప్రధాన వస్త్రములు. రంగు వస్త్రములపై వారికి ప్రీతి మెండు. కుసుమవన్నె నుత్తమమైనదిగా నీలి వన్నెను సాధారణమైనదిగా భావించిరి. రవికలు "కుసుంభరంజితములు" (6–45) కుసుమవన్నె (చెంగావి) చీర యువతులకు ముచ్చట గొలుపునట్టిది.

దొరకకుండ నేడు దొరికిన చెంగావి
చీరకట్టె కాపువారి కోడ
లదిగో, చిన్నదయ్యు నడగక తిరిగెడు
విరివియైన యూరి వీధులందు. (3-4)

ఆనాటి పడచుల భావములో నీలిరంగు చీర మంచిది కాదట. పట్టుచీరయయిన భేషట! (6-20) ఉత్తర హిందూస్థానమందు స్త్రీల రవిక కట్టు వీపున నుండెడిది. దాక్షిణాత్య స్త్రీల కంచుక బంధనము ముందువైపే యుండెడిది. ముందు భాగమందు రెండు పార్శ్వములందు కొంత సందు కలిగి పొట్టపై రవిక రెండంచులను ముడివేయుట ఆనాటికే రూఢియై యుండెను. (7-20) "ద్వ్యంగుల లలిత కావాటక, పినద్ధ సవిశేష నీలకంచులికా" స్త్రీలు నూపురములు ధరించుచుండిరి. (2-88)

జనుల యాచారములు కొన్ని

పిడుకల కాల్చుట ప్రాతకాలపు దురాచారమే (2-29). జనులు ముఖ్యముగా స్త్రీలు ఇప్పపూల నేరి సారాయి చేసుకొనుచుండిరి. ఆనాడు ఇప్ప సారాయికి లైసెన్సు లేకుండెనన్నమాట (3-3 మరియు 2-4). ప్రాత సారాయి (జీర్ణ సుర) చాలా రుచికలదై మైకమును మదనోన్మాదమును కలిగించు నట్టిదని యొక కవి యిట్లనెను.

"ఊరినిండ వయసువారు; ప్రాయము; ముదు
సలి మగండు; నవవసంత వేళ;
ప్రాతపడిన కల్లు చేతనున్నది; ఇంక
చెడక చావగలమే; చెప్పవమ్మ. (2-97)

పండ్లు తోముకొనుటకు జనులు కానుగ పుల్లలను వాడుచుండిరి. (2-65, 6-53). స్నానము చేయునపుడు నలుగు పిండిని వాడుచుండిరి. ఆ పిండిని రుద్దుకొని కడుగుకొనినప్పుడు 'జంబూకషాయము' ఏర్పడుచుండెను. (2-89) పిల్లలకు అక్షరాభ్యాసము 'ఓనమాల'తో సీధంనమః'తో ప్రారంభమగు చుండెను. (2-9).

'వర్ణావలీమప్య జానంతో లోకాలోకైర్గౌరవాభ్యధికాః
సువర్ణకార తులా ఇవ నిరక్షరా లిపిస్కంధై రుధ్యంతే.

ఈ శ్లోకంలో శ్లేష కలదు. దీనిపై సాహిత్యాచార్య భట్టశ్రీ మధురానాథశాస్త్రి గారిట్లు వ్యాఖ్యానించిరి. "జనైః ఓనమః సిద్ధం సిద్ధిరస్తు ఇత్యారభ్యాం వర్ణమాలా మప్యజానంతో లోకాః గౌరవాభ్యధికాః" అని వ్రాసిరి. 'నమఃసిద్ధం' అని సాహిత్యా చార్యులవారు వ్రాయుట పాణినేయులకు, పాతంజలులకు సరిపడునో లేదో? ఉత్తరములు వ్రాసుకొనునప్పుడు 'స్వస్తి' అను పదములతో ప్రారంభించుచుండిరి. పూర్వమందలి శాసనాలన్నియు స్వస్తి పదములతో ప్రారంభించుట భారతీయ చారిత్రకులెరిగియే యున్నారు. వ్రాతకు సాధనము లేఖిని యొకటి. తాటియాకులో భూర్జపత్రాలో వాడి యుందురు. గాథలు దాక్షిణాత్యమువి కాన తాటాకులే వాడిరనవలెను. మరి లేఖిని యన గంట మనవలెను.

"వడకి చెమరించు వ్రేళ్ళకు వశముగాక
నిలిచి నడవక జారు నీ కలము తోడ
స్వస్తి శబ్దమె ముగియంప జాలనైతి
కమ్మ నింకేమి వ్రాయంగగలను చెలియ" (3-44)

జనులిండ్ల గోడలపై చిత్తరువులు వ్రాయించుకొనువారు (3-17). ఆ యాచారము క్రీస్తుశకము 19వ శతకాంతమువరకు ప్రచలితమై యుండెను. ఇండ్ల ముందు అరుగుల గదులుండెడివి. అవి పలుమారు బాటసారులకు రాత్రులందు విశ్రమస్థానాలగుచుండెను. (3-54). ధర్మశాస్త్రోక్తి ప్రకారము పుత్రులు తండ్రుల ఋణములను తీర్చుచుండిరి. (2-13) చలివేంద్రములు పెట్టి పథికులకు నిదాఘకాలమందు ప్రపాపాలికలు ప్రచురించుచుండిరి. (2-61) రాజులు ధనికులు ధర్మకార్యములను శాసనాల ద్వారా ప్రకటించుకొనుచుండిరి. (3-32) గ్రామములందు అగ్ని ప్రమాదములు జరిగినపుడు స్త్రీ పురుషులు బావి వద్ద నుండి బారులు తీరి చేతుల యంచెలపై కడవలందించి యగ్నినార్పుచుండిరి. (3-29) జనులు మర్రి యాకులను విస్తళ్ళుగా కుట్టి యందు భుజించుచుండిరి. బాటసారులు విశేషముగానట్లు చేసెడివారు. కాని కాకి మున్నగు పక్షుల రెట్టకలిగిన మర్రి యాకులను వాడకుండిరి. (2-66) పెద్దవారి యాగమనమున వారి యడుగులకు మడుగులొత్తు చుండిరి. వారింటికి రాగానే రెండు కలశములతో కాలు మొగము కడుగుకొన నీరిచ్చుచుండిరి. (2-40)

పంటలు

వరిచేలు, జనుపచేలు విరివిగా నుండెను.

"పండి తెల్లబారు వరితోటలను జూచి
యేల మొగము వంచి యేడ్చెదమ్మ
చూడు, జనుపచేను సొగసయ్యె హరిదళం
బలదుకొన్న యాటవెలది వోలె" (1-4)

(రహస్య సంకేతస్థానముగా వరికి మారు జనుపచేను సిద్ధమైనదని విలాసినికి ధైర్యము చెప్పుట).

నువ్వులు కూడా పండించుచుండిరి. (1-3) మరికొన్ని తావులందు (బహుశా మహారాష్ట్ర ప్రాంతమందు) యవలు పండించుచుండిరి. వాటి కడవిపందుల బాధ యుండెను (5-3) సెనగలు కూడా పండించుచుండిరి. (6-57) ఆముదము లేక నూనెతో పత్తిని వెలిగించి దీపముగా వాడుచుండిరి. (3-64) వెలగపండ్లు, లడ్లు జనులకు ప్రీతిగా నుండెను. (7-41) ఓడిపట్టి దుర్దినములైనప్పుడు నిష్ఠాపరులు జ్యోతిశ్శాస్త్ర ప్రకారము గుణించుచుండిరి (5-35; పై ఈ శ్లోకమునందలి వ్యాఖ్యను జ్యోతిర్వేత్తలు చూచుకొనగలరు.) "ప్రత్తిచేను దున్నవలసి మంచి దినాన మడకపూజలు సేయ" (2-65) యనుటచే ఏరువాక పున్నమ సూచితమవుచున్నది. నేటికినీ ఆంధ్రులు ఏరువాక నాడు మడకపూజ సేయుదురు. (ఏఱు=నాగలి).

వినోదములు

ఆనాటి జనుల వేడుకలో ముఖ్యమైనవి నాటకాలు. అవి యక్షగానాలా? లేక సంస్కృత ప్రాకృత నాటకాలా? గట్టిగా చెప్పజాలము. సంస్కృత మర్యాదలతో కూడిన ప్రాకృత నాటకాలై యుండినవో? సంస్కృతము మాతృభాష నుండి దేవభాషగా హాలుని కనేక శతాబ్దములకు ముందే మారియుండెను. జనులకు వివిధ ప్రాకృతములు మాతృభాషలయ్యెను. కావున జనసామాన్యాని కాహ్లాదము నిచ్చునవి ప్రాకృత నాటకాలేయై యుండును. ఆ నాటకాలకును యక్షగానాల వాసన గోదావరీ ప్రాంతాలలో నుండియుండును. ఆనాటి నుండి యీ శతాబ్దివరకు నాటకాలాడువారు ముఖములకు అర్ధళము (హరిదళము- హరితాళము) పూసుకొనుచుండిరి. స్త్రీల

పాత్రలను భోగము పడుచులు వేయుచుండిరా యను భ్రమ "హరిదళంబలదుకొన్న యాటవెలది వోలె" యను శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి అనువాదము నుండి కలుగును. కాని మూలమందు "నటి" వలె యనియే కలదు. "సురత నాటకము మనకు పూర్వరంగము" (4-44) అని యొకచో వర్ణించుటచేత రంగములు, పూర్వరంగము అను నాటక లక్షణములు పాటింపబడినవని యూహింప వీలుకలుగుతున్నది. మరొకతావున (4-51) నాట్య సూచన చేయబడినది.

గోడల మీద చిత్తరువులు వ్రాయించుకొనుచుండిరని తెలిపినాను. మరొకటి కనుడు.

మలినచిత్తుడైన మరదికి నిల్లాలు
గోడమీద వ్రాసికొన్న యట్టి
రాము వెంట దిరుగు సౌమిత్ర చరితంబు
చిన్న నవ్వుదోప జెప్పిచూపు. (1-35)

సమిష్టి కుటుంబాలలో నందందు రావణాంశజులుండుట చిత్రము కాదు. అందు నొక కవి మరల ఇట్లనెను.

చెడ్డ మనసు కలిగి యడ్డాడు మరది బా
ధలను దెగువగల్గు దయితుతోడ
చెప్పదింటి బ్రతుకు చెడునంచు మదిలోన
యడచి నవయు కోడలార్యశీల. (1-59)

'బ్రతుకు బొంగరంబు వంటిది' (5-6) అని తెలుగుసేతలో కలదు కాని మూలమందు 'చలం జీవనం' అని కలదు. జీవనము శాశ్వతము కాదు అని యర్థమే యనుకొందును. కుండల పోత మోటకూడ నాకాలమందుండెను. దానిని సంస్కృతంలో ఘట యంత్రమనిరి. దానినే 'రహట్టఘటక'యనిరి. నేడును 'రహట్' మోట యంత్రమును గురించి ప్రకటించుటను గమనించుతున్నాము.

"రిక్తా నమంతి సుచిరం రహట్ట ఘటకా ఇవే హకాపురుషా!" రహట్టపై భట్టశ్రీగారిట్లు వ్యాఖ్యానించారు. "రహట్టో ఘటయంత్రం... ఉదకం లబ్ధ్వాయథా ఘటికా ఊర్ధ్వముఖాభవంతి తథా దుర్జనా అపిస్వల్ప లాభ ఏవదర్పేణ మస్తకమున్న యంతి". పాచికల యాట బహు ప్రాచీనమైనది. కాయలను నడుపు నప్పుడిండ్లకు

దుగ, తిగ, చౌ, పంచ, బద్రికాది సంకేత పదములుండెను. తురకలు వచ్చిన తరువాత వాటి స్థానంలో ఉర్దూ పేర్లేర్పడెను. దస్, పచ్చీస్, తీస్, బారా, చెక్కా అను సంకేతాలు మన యిండ్లలో మన స్త్రీల వాడుకకు వచ్చెను. ఈనాడీ యాటను "పచ్చీసాట" యంటున్నారు. హాలుడిట్లు దానిని వర్ణించెను.

"శునక ప్రచురే గ్రామే భ్రామయంతి తవకృతేన సా బాలా
పాశకశారీవ గృహంగృహేణ భాదిష్యతే కదాప్యంగ" (2-38)

దూతి విటునితో ఇట్లనెను. ఓయీ నీ కొరకు కావన్నెలాడి ఊరునం గండు కుక్కలున్నను లెక్కపెట్టక పచ్చీసు కాయవలె ఇల్లిల్లు తిరుగుచున్నది. పాశకశారిపై భట్ట శ్రీగారిట్లు వ్యాఖ్యానించిరి. "షతు ష్పటీగుటికా ద్యూత ఘటికా యధాద్యూత ష్టస్యప్రతి గేహం భ్రామ్యతి తథాగృహేణ గృహేణ గృహం భ్రామ్యతీ సా బాలా."

ఉత్పల్లికా క్రీడ నొకచో వర్ణించినారు (2-96) అదెట్టిదో యర్థము కాలేదు. "ఉత్థానంశ యానస్య పాద యోరు పవిష్టానాం బాలానాం ముహుః పతనోత్పతన రూపాక్రీడా ఉత్పల్లి కేత్యాఖ్యాయే" టీకాకారులన్నారు.

– సుజాత (15 ఏప్రిల్ 1951)

కవితా ప్రాశస్త్యము

గాథా సప్తశతిలోని కవిత యసాధారణమైనది. విశ్వ వాఙ్మయములో దీని యనుకరణములే కలవు కాని ఇట్టిది మరొకటి లేదు. దీనినుండి భావములను విరివిగా గ్రహించిన అమరు శ్లోకాలకు "అమరు కవేరః శ్లోకః ప్రబంధ శతాయతే" అన్న కీర్తి కలిగినపుడు అమరు మాతృకయగు నీ గాథాసప్తశతి నేమనవలెను. గాథా సప్తశతిలోని నాయికా నాయకులు, దూతీచేటికలు, అత్తకోడండ్రు, గ్రామణి గ్రామీణులు జొన్న, జనుప, నువ్వు, వరి, పెరిగిన పొలాలో చేసిన దుడుకులను, నర్మ గర్భముగా పదుగురికొక యర్థంగా తమ యిద్దరికొక యర్థంగా నుండు సంకేతములను చెప్పుకొనుటలను, నదీతీరాలలోని చాటు మాటు దాటులను, వన్నెలాడుల వయ్యారపు విహారములను, విలాసినిల చూపులోని మూగ పలుకరింతను, పథిక విటులలోని ఇంగితములను గ్రహించు మితిమీరిన చురుకు దనమును, సవతుల సహింపులేని తాకట్లను, మనము చిరునవ్వులతో మన్నింపవలెను. అందలి కవిత మనకెట్లాదేశిం చినది. ఉత్తమ టాకీలోని ప్రేమగాథలలో నటించిన వ్యక్తులను చూచి వచ్చిన తర్వాత

మన భావాంబరముపై నవి పలుమారెట్లు పునర్నాట్యము చేయునో యటులే 200 ఏండ్ల క్రిందట గోదావరి తీరములోనూ, పల్లె ప్రాంతములందునూ, చెరువు చెట్ల దాపులందును, శృంగార విలాసములతో కాలము గడిపిపోయిన యువతీయువకు లీనాడును నేనాడును గాథలను తిరుగ వేసినప్పుడంతయు మన మనోనాటక రంగమందు టికెటులేని నాటకములాడి మనల గిలిగింతలు పెట్టి మనకు బ్రహ్మంగారిని చూపి (ఆనందోబ్రహ్మ) వెడలి పోవుచుందురు.

గాథలోని కవిత, కవితలోని యసాధారణత, భాష, భాషలోని సౌకుమార్యము భావము, భావములో గంభీరత, ఛలోక్తులు, ఛలోక్తులలోని చందన స్పర్శ, మాయా మర్మములు లేనట్లుగా భాసించు ముగుద ముద్దుగుమ్మలముచ్చట్లలో దాగిన సుందర సుకుమార నర్మగర్భితములు, ఎన్నని చెప్పవలెను, శృంగార లోకమంతయు సప్తశతీ గీతములలో పంచాక్షరిలో శివునివలె చక్కగా నిమిడి యున్నదనిన కొంతకు కొంత వక్తయొక్క యభిప్రాయము వెల్లడి కాగలిగి నట్లనవచ్చును.

700 గాథలలో అన్నియు నుత్తమములనుటయు లేదు. కాని అందలి పనికి రాని గీతాలన్నియును బహు ప్రబంధాలలోని బహువర్ణనలకన్న రమ్యమైనవే యని నేననుకొందును. శ్రీ రాళ్ళపల్లి శర్మగారి భావములో 700లో 395 గాథలుత్తమమైనవి. కాని నా యభిప్రాయములో ఇంచుమించు మరి 50–60 ఉత్తమ పద్యాలను వారు చిన్నచూపుతో చూచినారు. మొత్తముపై (500) పద్యాలు సప్తశతిలోనివి అత్యంతానంద సంధాయకములు, వీటిలోని ప్రాశస్త్యమును ఎత్తి చూపవలెనన్న నన్నిటిగురించి తనివితీర వ్యాఖ్యానించుటయే సమంజసమగు కార్యము. అదికాని పని కాన మాసరకు (నమోనాకు) కొన్నింటి మాత్రమెత్తి చూపిన స్థాలీపులాక న్యాయ నిదర్శనమగును.

"బిసిసీ పత్రి నిశ్చల నిస్పందా పశ్య రాజతి బలాకా
నిర్మల మరకతభాజన పరిస్థితాశంఖుక్తిరివ (1–4)

దీనిని శ్రీ శర్మగారు తెనుగింపలేదు. పల్లవనాయికా నాయకులకొక సరస్తీరము సంకేతఘటనా ప్రదేశముగా నేర్పాటై యుండెను. కాని యందొకరు వచ్చి కాచుకొని ఇంకొకరు రానందున విసుగుకొని పోయి మరల పదిమందిలో రాని వ్యక్తిని చూచి తమ బాస తమకే పూర్ణార్థమిచ్చునట్లుగా నీ గాథ బహువిధ బావముల వెల్లడిస్తున్నది. ఎట్లనగా.

"చూచితివా! కమల పత్రముపై కొంగ నిశ్చలముగా చకితము కాకుండా నిలిచినది. శుభ్రమైన మరకతపు తట్టలో శంఖముంచినట్లుగా నాబలాక యున్నది."

పై గీతములో మరేమి లేకున్నను ఉత్తమోపమాన మున్నందున నంత మాత్రకే యది రమ్యమైనది. కాని యొక విశేషమున్నది. కొంగలు అందులో పెంటివి మెలకువ కలవి. అచ్చట యేమైన ఆకుల చప్పుడు కాని, మనిషి కాలిచప్పుడు కాని వినిన నిశ్చలముగా నిస్పందముగానే యుండును. కావున ఆ సంకేతస్థానము అత్యంత నిర్జన ప్రదేశమని ప్రియులలో నొకరింకొకరితో తెలుపుదురు. అనగా ఆ చెరువు వద్ద ఆ కమలముల సమృద్ధి కల ప్రదేశమున్నది కదా! అచ్చట మనుష్య సంచారము లేదు అది మన యేకాంతమునకద్భుత సంఘటనాస్థానము.

ఇంతేకాదు. మరొక విశేషమున్నది. ప్రియులతో నొకరిట్లనుచున్నారు. "నీవు నాకన్న ముందాగురుతుగల చోటికి పోయి నేను రాలేదని తిరిగిపోతివన్న మాట పూర్తిగా కల్ల.

నీ పలుకు చొప్పున నీవే ముందుపోయి వచ్చి యుండి తర్వాత నేను పోయినప్పుడు మనుష్య సంచారమును వినిన జూచిన బలాక అంతనిర్మల నిస్పందగా నేలయుండును. దానిలో చకితత్వలక్షణమే కానరాదు. దాని నిశ్చలతయే నీ మాటలు దుబ్బరలని సాక్ష్యమిచ్చునది.

అంతేకాదు. ఇంకొక విశేషమున్నది. నీవు నాకన్న ముందుగా పోయినది కల్ల నేను ముందుగా పోయియుంటిని. అది కొంగ యొక్క నిశ్చలతవల్ల తెలుస్తున్నది" తిరిగి వచ్చితినని సమాధానము.

ఇంతటితో కథ ముగియలేదు. ప్రియాప్రియులు సంకేతస్థానమందు కలియనే కలిసినారు. అప్పుడు ఒకరింకొకరితో సంభోగ కాలమందిన పద్యమిది. ఎందుకనగా (మరుగునకై సంస్కృత ప్రమాణమునుదాహరించి వదలుదును).

"కల్లోలినీ కాననకందరాదౌ దుఃఖాశ్రయే చార్పిత చిత్తవృత్తిః
మృదుక్రమారంభమభిన్నధైర్యః శ్లథోపిదీర్ఘం రమతే రతేషు"

ఈ చిన్నగాథలో ఈ రెండు పంక్తులలోనే ఇన్ని కథలిమిడియున్నవి. "ఏకఃశ్లోకః ప్రబంధశతాయతే" అని యూరకే అన్నారామరి? మరొకటి చిత్తగించవలెను.

'మగని పయనమన్న మాటెవ్వడాడెనో
వానిమనసుపాడుగాను; తాను
విన్న మొదలు విసముగొన్నట్లు కోడలి
యవయవంబు లెల్ల నయవసాగె (2-11)

సవతిని నిందపాలు చేయుటకో లేక యున్నంత తెలుపుటకో దాని సవతి పై విధముగానన్నది. సవతి జారుడు పనిపై ప్రవాసము వెళ్ళుచున్నాడని దానికెట్లో తెలియకుండునా. తెలియనే తెలిసినదమ్మా! ఇక చూడు, అప్పటినుండి మొగము చిట్లించుకొని రుసరుసమని ఇంటి పనులన్నియు అడ్డదిడ్డిగా చెడజేయుచున్నది. దానికావార్త విసమునాకినట్లు కసిబిసియైనది. ఇంత విచ్చలవిడి తగునమ్మా? అని సవతి పోరొకదిక్కు

దీనికింకొక కథ కూడ సాధ్యమైనది. ఏమనగా – పతి ప్రవాస మందున్నందున ఆ సుందరిని నాకు కూర్పుమని యెకలంపటవిటుడు తార్పుకత్తెను విచారింపగా నాదూతి యిట్లంటున్నది. "వయ్యారపు అయ్యవారూ! ఆ యువతి పతి వియోగముచే దుఃఖతయై యింటి పనులే చేయనొల్లదే, అంతటి పతిదత్తమానస నీకు చిక్కునా? అది వ్యర్థ ప్రయత్నము" అని మందలించుట యిందు ద్యోతకమైనది.

అయితే మరొక విస్పష్టభావము పైననే కానవస్తున్నది. అత్తగారు తానెంతగా గట్టిగా కోడలి నెత్తిన మిరియాలు నూరినను, తన కొడుకు ప్రవాసమున కేగనున్నాడని కన్నకడుపు కావున తానాయసపడినదై తన కోడలి విరహతాపముపై కరుణ కలిగి ఇరుగుపొరుగు అమ్మలక్కలతో వెల్లడించుకొను వరకు మనసు పట్టలేకపోయినది. అత్త యిట్లన్నది. "నా కోడలికి దాని మగని ప్రవాస వార్త యెవరు చెప్పిరో యేమోనమ్మా విన్నప్పటినుండి మొగమింత చేసుకొని యింటిపనులన్నీ ముట్టక దుఃఖముతో బాధపడుతుందమ్మా- నా కోడలు!"

మరొక గీతమును తిలకించండి.

"ముద్దు కొడుకు మొదట మొలచిన పలుదోయి
గొరికి కొరికి కాటు వరిచెనిదిగొ
రేగుపండు గంటిరే! యని పెండ్లాము
నగుచు దెచ్చి పెట్టె మగనిచేత. (2-100)

ఆముక్తమాల్యదలో పై యభిప్రాయము నిచ్చు నీ క్రింది పద్యము మొదట మనకు మతికి వచ్చును.

తన యుదరంబునం బొడమి తామ్రరుచిచ్ఛట లుల్లసిల్ల గో,
ల్కొనుధరణీజ సంతతికిఁగోరక దంతములించుకంత, ని
క్కినయది యాదిగాగ జెలగెన్ వనలక్ష్మి; కడుంజెలంగగా
జను బ్రియుడైన మాధవుని సంగతిమీదట జాల గల్గుటన్.

ఆము. (5–116)

ప్రసవానంతరము కన్న శిశువునకు తొలి రెండు పండ్లు మొలచిన తర్వాత భార్యాభర్తల పునస్సమాగమ కాలమని హిందువులలో శిష్టాచారమైనది. ఒక యిల్లాలు తాను పతి సంభోగ సుఖానుభవ యోగ్యతను పొందినదని తన పతికి సుకుమారముగా నెచ్చరిస్తున్నది. దానికి సాక్ష్యమేమి? ఇదిగో పలుకాటుల పడిన రేగుపండు. అదెక్కడున్నది. ఇదిగో యిప్పుడే నీ చేత నుంచుచున్నాను. అయితే భార్య "ప్రహసిత వదన"గా రేగుపండును తన భర్త సేత నెందుకుంచెను? అది అనుమానానికి తావిచ్చునని సరస్వతీ కంఠాభరణమందు "వికసితనయనా" యని కలదు. అప్పుడు భావము సుందర తరమగును. కాని ప్రహసిత వదనయను పదముపై తృతీయ పంథగా వ్యాఖ్యలు చేయునలవాటు పడిన గంగాధరుడిట్లంటున్నాడు. "యువతి కుమారునికి పండ్లు వచ్చువరకు తాళజాలనిదై తానే దంత యుగళాంకితము చేసి రేగుపంటిని భర్తకిచ్చినది. అందుచేతనే మగడు నమ్మడని ప్రహసిత వదనయైనది" ఇదే ధోరణిలో నాలోచించిన మనమింకను నిట్లన వచ్చును. ప్రత్యక్ష ప్రమాణముండగా అనుమాన ప్రమాణమేల? చిట్టివాని కొత్త చిరుపండ్లు చూడుమాయని శిశువు నోట భర్త వ్రేలిని పెట్టించి కొరికించి తాము నవ్వవచ్చును. శిశువునూ నవ్వించవచ్చును. అట్లు చేయక పిల్లవానిపండ్లు చూపించక రేగుపండుపై కాట్లను చూపింపనవసరమేమి? ఇది ఇట్లుండనిండు. రేగుపండునే కొరికించి చూపనేల? వేరు మెత్తని చిన్నపండు – ద్రాక్షవంటిది బాగుండదా? నాకిట్లు తోచినది. రేగుపండు వసంతాగమ కాలమందు సమృద్ధి. అందుచే కవి దానిని సూచించెనేమో. మరియు ఇతర భారతీయులలో యే ప్రాంతమందు కలదో లేదో కాని తెనుగునాటనొక యాచారము కలదు. సంక్రాంతి పండుగనాడు ఏడాదిలోపలి శిశువులను కూర్చొనబెట్టి వారి తలలపై నుండి రేగుపండ్లను

దిగబోసి యాపండ్లను బీదలకు పంచిపెట్టుదురు. అందుచే కవి రేగుపండునే తన గాథలో నుంచి యుండును. ప్రతిగాథకిన్ని కథలు! అన్నియు మనోహరములగు కథలే!

రమ్యమైనరూపు, రమణుడూరను లేదు;
పేదరికము; పెద్ద వీధినిల్లు;
పరువమైన వయసు; పొరుగింటిచెలి జార;
యైన నౌర! చెడదు చాన; చూడు. (1-36)

స్త్రీ చెడుటకు కావలసిన అంగములన్నియు సిద్ధమే కాని "చెడదు చాన చూడు"! ఇదెవ్వరో పెద్దలన్న మాటగా భాసించును. లేదా కళంకకారణాభిశంకచే జనులు వృథాగా నన్ను నిందింతురు. నాకు చరిత్ర దోషము లేదు అని నిజదోష గోపనము చేసికొనుచు నొక కులట పలికిన పలుకులనవచ్చును.

కొండ సెలయేటి సుడికి జిక్కుకొని కలగి
తిరుగుచును కేసరంబులు విరిగిపోవ
కొంత మునుగుచు తేలుచు గొదమితేటి
వెంటనంటి, కడిమిపూవు వెల్లబోయె. 4-37

కడిమి పువ్వు నీటి సుడిలో కొట్టుకొని పోతున్నది. దాని మధువు నీటపడిన వెంటనే క్షాళితమైనది. కాని, తుమ్మెద మాత్రము దాని వెంటనే పడినది. దీనివెనుక యెంత కరుణారసము దాగినదో చూడుడు. పువ్వుపై గల తమకము తుమ్మెద కెంత గొప్పది. "ఎన్ని పువ్వులన్ వ్రాలదుతేటి" అని తారాశశాంక కవి యన్నట్లుగా – ఆ పువ్వు కాక వేరే మంచి పూలు లేవా? ఆ తుమ్మెదకు? తేనె యేమియు లేదు, పువ్వు నలిగినది. కొన్ని రేకులు విరిగినవి, సంపూర్ణ శైథిల్యమిప్పుడో అప్పుడో! మరి దానితో నేమి పని. నీచులే ద్రోహులై యుందురు. తుమ్మెదనైన చూచి మనుష్యులు బుద్ధితెచ్చుకొనరాదా? తాననుభవించిన స్త్రీ బిగువు సడలగా తిరిగి చూడని ప్రియులను గూర్చి యీ సంబోధన.

వల నడుమను సాగిన పో
గులలో మీగాళ్ళు దవులుకొన సొలీడిం
పలరె, కనరాని దార
మ్ముల గూర్చిన యొంటి పొగడపువ్వవలె గంటే! 1-63

ఉపమానము బహుసుందరము. పొగడపువ్వును చూడనివా రీకాలంలో చాలామంది! చూచిన వారికి దీనిని సాలెపురుగుతో నుపమించుట యానందమిచ్చును. కాని మరొక కథయిందు దాగినది. ఒంటి సాలీడు. ఇంటిలో తాను తప్ప మరెవ్వరు లేరు. అందుచేతనే సాలీడింటి నిండుగా వలనల్లినాడు. 'అత ఏవ సురుచిరం రతోత్సవోఽనుభూయతాం ఇత్యర్థోధ్వన్యతే'. అందుచే నిర్భయముగా ఆనందింప వచ్చునని హెచ్చరిక!

లోభివాని చేతిలో సిరియెంతగా
వెలయుచున్న సుంతఫలము లేదు
తెరువునడుచు వేళ కరకు వేసవియెండ
మాడువానికి నీడవోలె.... 2–36

ఇది మంచినీతియే! అందులోను మంచి యుపమానముతో గూడిన నీతియే! ఒకదూతి లోభివిటునికి చల్లగా మెల్లగా సూచించినది. నీవు విరివిగా ధనమును వ్యయించకున్న ఆ సుందరి లభింపదు! ఈ దూతియు ఊరక రాయబారులు జరుపజాలదు!!

ఊర గొడుకు లేక యుండగ కోడలు
వచ్చి కాళ్ళు మ్రొక్క వంగినపుడు
గాజులెల్ల జారగా జూచి కడు గోప
కత్తె యయ్యు నేడ్చె నత్తగారు. 5–93

మూలములో వలయద్వయమని కలదు. చేతికొక్కొక గాజుండ నవలెను. కాని తెనుగు సేతలో గాజులెల్ల అన్నారు. రెండు గాజులేమి! గాజులన్నియు జారినవని వారి యభిప్రాయమై యుండును! కృశించి కృశించి సన్నగిల్లుటవలన గాజులెప్పుడో జారిపడి పగిలిపోగా సౌభాగ్య చిహ్నముగా రెంటి నా సౌభాగ్యవతి మగనిమీద ప్రాణము నిలుపుకొన్నట్టిది. ఎటులో నిలుపుకొన్నది. ఆ యవస్థను కోపగత్తెయగు నత్త యెందుకు చూచును? ఏదో నిమిత్త కారణముగా తనను మ్రొక్కవచ్చినపుడు బాగుగా సన్నగిల్లిన చేతుల చూడగలిగినది. అప్పుడైనను కోడలిపై కరుణగలిగినదో లేదో? తన కొడుకు జ్ఞాపకము వచ్చి వాని బహుకాల ప్రవాసమును తలచుకొని యేడ్చియుండును. ఒక యేకాంకికకు కావలసినంత కరుణారసమిందున్నది.

కాని రసభంగము చేయదలచిన యొక వ్యాఖ్యాత యిట్లన్వయించినాడు. అంతటి యాప్రేమ యాకాంతకు తన ప్రియ భర్తపై నుండగా నామెను విటుడు కోరుట వ్యర్థమని దూతీ సూచనయట! లేదా యామె భర్తతో ఏమయ్యా! నీవు లేనందున కృశించి చావసిద్ధంగానున్న నీ భార్యను గూడ కెందుకాలస్యము చేసెదవు అని యతని భార్య యొక్క దయనీయస్థితిని యతనితల్లి దుఃఖమును ఎందరో మిత్రులు తెలిపిరని వ్యాఖ్యానింపవచ్చును.

ఇంచుమించు ప్రతి పద్యము అమృతఝరియై (అమృతం ప్రాకృత కావ్యం 1-2) కామతత్వ చింతామణియై (కామస్యతత్త్వ చింతాం1-2) స్వభావ రమణీయమై (7-101) రసిక జన హృదయదయితై (1-101) అమృతమును కూడ నిరాకరింప జేయు మాధుర్యము కలదై (మధురత్వే నామృతమ ప్రియచ్ఛృత్వానోలగతిహ్రదయే (4-101) నానాలంకార లలితమై (1-3) ధ్వని ప్రధానమై సంతతాహ్లాద కారియై, గంభీర భావ పరంపరా సంపూరితమై రస సిద్ధుల పూర్ణ చంద్రోదయ ఘటికయై శ్లాఘాపాత్ర మైనట్టి గాథా సప్తశతి భారతీయ సాహిత్య రత్నములలో కొహినూర్! గాథలో కూర్చిన హాలుని రాజ్యమెన్నడో పోయెను. కాని యతని కావ్య సామ్రాజ్యమునకు కొట్టుబాటు లేదు. దానికి నిత్యనూత్నత కలదు. సుకవితా యద్యస్తి రాజ్యేనకిం?

ఇట్టిగాథలలో నూరింటి నేరి వ్యాఖ్యానించిన సర్వజ్ఞ చక్రవర్తి పెదకోమటి వేమభూపాలుని వ్యాఖ్య యేది? ఇంచుమించిరువది పండితులు వ్రాసిన వ్యాఖ్యానాలేవీ? ఈ గాథలకు తెలుగు వ్యాఖ్యలను వ్రాసి ఉత్తమ పీఠికను చేర్చి ముద్రించుట అవసరము. ఈ సప్తశతిని రసికులందరును చదివి యానందింతురు గాక.

సంధ్యోపాత్త జలాంజలి బింబిత గౌరీముఖాంబురుహం
స్ఫురితాధరం ముద్ధైవహి విగళిత మంత్రం హరీం నమత. 7-100

సంధ్య వార్చగ దోసిట జలమువట్టి
నపుడు గౌరీముఖాంబుజ మందుదోప
మంత్రమంతయు నొకమారు మరచినట్టి
మోవిని గదుల్చు శివునకు మ్రొక్కులిడుదు.

శివునికి పట్టిన గతియే సప్తశతీ పాఠకులందరికిని పట్టుగాక!

సుజాత. (15 మే 1951)

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర

ఆంధ్ర భాష, ఆంధ్ర వాఙ్మయము చాలా ప్రాచీనమైనదేకాని మనకు లభించిన మొదటి గ్రంథము 900 ఏండ్లనాటి ఆంధ్ర మహాభారతమే. ఆంధ్రుల ప్రశంస సంస్కృత మహాభారతములో, రామాయణములో, ఐతరేయ బ్రాహ్మణములో – ఇట్టి అతి ప్రాచీన గ్రంథాలలో లభించినది. ఆంధ్రులు క్రీ.పూ. 200 ఏండ్ల ప్రాంతము నుండి మహా సామ్రాజ్యాలు స్థాపించి ప్రపంచ ఖ్యాతి కాంచిన వారు. అట్టివారి భాషలో క్రీ.పూ. 200 ఏండ్ల నాటి నుండి క్రీ.శ. 1050 వరకు అనగా నన్నయ భట్టు కాలము వరకు ఇంచుమించు 1200 ఏండ్ల కాలములో వ్రాసిన ఒక గ్రంథము కూడా లభించక పోవుట చాలా ఆశ్చర్యకరము. నన్నయ భట్టుకు పూర్వము తెనుగు భాష, తెనుగు కవిత్వము లేదని కాదు. ఆ రెండున్నూ ఉండెను. కాని మనకు గ్రంథమొకటైన దొరుకలేదనుటయే విచారకరమైనది.

నన్నయ కంటె ఏడు నూరేండ్లకు పూర్వము నుండి అనగా క్రీ.శ. నాల్గవ శతాబ్దము నుండి తెనుగు రచనలు ఉండినట్లు మనకు కొన్ని నిదర్శనాలు కనిపించుచున్నవి. దినేశ చంద్ర సర్కారుగారు "శాతవాహనుల తర్వాతి వారు" అను తమ ఇంగ్లీషు గ్రంథములో ఇట్లు వ్రాసినారు.

"ఇక్ష్వాకు రాజుల ప్రాకృత శాసనాలు కొన్ని జగ్గయ్యపేటలో లభించినవి. నాగార్జున కొండలోని రికార్డుల భాషను గూర్చి అది ఒక విధమైన ప్రాకృతమని బహుశా కన్నడమయి యుండునని స్టెన్ కొనోవ్‌గారు అభిప్రాయపడిరి. నాగార్జున కొండలో కొన్ని ప్రాకృత శాసనాలు దొరికినవి" అయితే జగ్గయ్యపేట, నాగార్జున కొండ అను నీ రెండు స్థలాలు తెనుగు నడిగడ్డలో నున్నందున అచ్చటి ప్రాకృత భాష తెనుగు రూపమై యుండియుండును. కాని కన్నడము కానేరదు. కన్నడమైనను క్రీ.శ. నాల్గవ శతాబ్దిలో తెనుగు నుండి అంతగా భిన్నించినట్టిది కాదు.

ఇక్ష్వాకులు, అశ్మక, ములక దేశములు రాజ్యము చేసినట్లు వాయు పురాణము చెప్పుచున్నది. ములక దేశము నిప్పటికిన్ని మొలకసీమ అని పిలుచుచున్నారు. అది యిప్పటి పాలమూరు జిల్లా. అక్కడ నుండి ములకసీమ (మురికినాడు) కర్నూలు, కడప మున్నగు ప్రాంతాల నాక్రమించుకొని యుండెను.

శాలంకాయనులు అను రాజవంశము వారు తెనుగుదేశములో క్రీ.శ. 5వ శతాబ్దమందు రాజ్యము చేసినారు. వారి శాసనాలలో మన కర్థమగు కొన్ని తెనుగు పద్యములున్నవి. ఊరు, చెరువు, మునుడు ఇట్టి పదాలు కొన్ని గలవు. క్రీ.శ. 5వ శతాబ్దమందు అనగా నన్నయభట్టు కంటె 600 ఏండ్లకు ముందు ఆంధ్రదేశమున రాజ్యము చేసిన విష్ణుకుండిన రాజుల దాన శాసనములలో ఒక దానియందు “వర్షంబుల్” అను తెనుగు పదము గలదు. ఇట్టి నిదర్శనములను బట్టి తెనుగు భాషయు, తెనుగు రచనయు (శాసనములోనే అనుడు) క్రీ.శ. 400 నుండి యుండెననుట స్పష్టము.

విష్ణుకుండిన రాజుల వంశములోని వాడగు జయాశ్రయుడు అను బిరుదు గల మాధవవర్మ నన్నయకు అయిదు నూరేండ్లకు ముందుండినవాడు. అతడు జనాశ్రయచ్ఛందమను ఛందఃశాస్త్రమును వ్రాసెను. అందు శీర్ష లక్షణము అనగా సీస పద్య లక్షణములను తెలిపినాడు.

నన్నయకు పూర్వము తరువోజ, సీసము, అక్కరలు విశేషముగా ఉండి యుండును. నన్నయ తరువోజలు, అక్కరలు అను కొన్నిపద్యాలను మహాభారతములో వ్రాసెను. తర్వాతి కవులు వాటిని పరిహరించిరి. నన్నయకంటె ముందు ద్విపదలోను, దాని భేదములగు వృత్తములోను వ్రాసి జనులు పాడుకొను చుండిరి. ఇంచుమించు క్రీ.శ. 1240 నుండి 1300 వరకుండిన పాల్కురికి సోమనాథుడు తనకన్నా ముందు కాలములో నుండిన చాలా విధములైన పాటలను గూర్చి ఇట్లు తన పండితారాధ్య చరిత్రలో వ్రాసెను.

“మదినుబ్బి సంసార మాయాస్తవంబు
పదములు, తుమ్మెద పదముల్, ప్రభాత
పదములు, శంకర పదముల్, నివాళి
పదములు, వాలేశు పదములు, గొబ్బి

పదములు, వెన్నెల పదములు -- సెజ్జ
వర్ణన మరి గణ వర్ణన పదములు"

ఇట్టి వెన్నో యుండెనట!

నన్నయభట్టు రాజమహేంద్ర వరము రాజధానిగా పరిపాలించిన రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి. అతడు క్రీ.శ. 1050 ప్రాంతమందుండినవాడు. అతనికంటె ముందుండిన కవితలో కొన్ని పద్యాలు కొన్ని శాసనాలలో మనకు లభించినవి. గుంటూరు మండలంలోని అద్దంకిలో ఒక శాసనము దొరికినది. అది క్రీ.శ. 848 ప్రాంతములోనిది. అనగా నన్నయభట్టు కంటె ఇన్నూరేండ్లకు పూర్వముది. నన్నయకంటె ముందు మనకు తెనుగు రచనలే దొరుక లేదనుట చేత మనకు దొరికిన ఈ అద్దంకి శాసనములోని ఒక పద్యము, ఒక వచనము ఎంతైనా విలువ చేయుట చేత వాటి నిందుదాహరింతును.

తరువోజ: పట్టంబుగట్టిన ప్రధమంబునేణ్డు
బలగవ్వ ం బొప్పంగ బైవేచి సేన
పట్టంబు గట్టిఇచ్చ ప్రభు బణ్డరంగు.
బఇచ్చన సమత్త! పడువతో బోయ
కొట్టంబుల్వణ్డెణ్డు గొణి వేంగి నాణ్టిం
గొళల్చి యాత్రి భువనాంకుశ బణనిల్చి
కట్టెపుదుర్గంబు గడుబయల్చేసి
కణ్డు కూర్చెజ వాడగావిఇచ్చ మెచ్చి"

వచనము: పండ రంగు పరమమహేశ్వరుణ్డు ఆదిత్య భట్టారకుని ఇచ్చిన భూమి
యెనుబొది పుడ్ల అడ్ల పట్టునేల. దమ్మ పురంబున దమ్మములు. వీని
రక్షిఇచ్చన వారికి అస్వమేదంబున ఫలంబు అగు".

నన్నయ కంటె ముందటిదగు రెండవ శాసనము, యుద్ధమల్లుని బెజవాడ శాసనము. అది క్రీ.శ. 898 ప్రాంతముది. అనగా నన్నయ భట్టు కంటె 150 ఏండ్ల కన్న ముందటి శాసనము. దానిలో 5 మధ్యాక్కరలు ఒక వచనము మనకు లభించినవి. అందలి పద్యమొకటి యుదాహరింతును.

"జనసుత చేబ్రోల నుణ్డి బెజవాడ జాత్రకు వచ్చి
త్రినయను సుతుణ్డొణ్డు సోట మెచ్చక తివిరి యిన్నెలన
యనఘుణ్డు సేకొని యిన్దు ప్రత్యక్షబయన్న నిచ్చ
గని మల్లణ్డెత్తించె గుడియు మతంబునుం గార్తికేయునకు"

ఈ విధముగా నన్నయ భట్టు కంటెముందు తెనుగు రచనలుండెను. నన్నయభట్టు కంటె ముందు కాలములో కొందరు తెనుగువారు కన్నడములో కావ్యాలను రచించిరి. నన్నయకన్న ముందుండిన తెనుగు వాఙ్మయ స్థితి మనకింతకంటె యెక్కువగా తెలియదు. ఇక నన్నయ కాలం నుండి నేటివరకు ఆంధ్ర వాఙ్మయ చరిత్ర ఘట్టములను సంగ్రహముగా తెలుపుదుము. ఈ చరిత్రను ఏడు భాగాలుగా విభజింపవచ్చును.

1. ఆది యుగము (పూర్వ చాళుక్య యుగము)
2. కాకతీయ యుగము
3. రెడ్డి యుగము
4. విజయనగర యుగము
5. తంజావూరి యుగము
6. సంధియుగము
7. ఆధునిక యుగము

ఈ యుగములను గురించి వివరించుటకు పూర్వమొక విషయమును స్మరింపవలెను. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వములో ఆధర్వణాచార్యులను గూర్చి వ్రాయుచు ఇట్లు వ్రాసినారు.

"ఆధర్వణ కారికలలో పంచమ కాండమందిట్లున్నది. ఆధర్వణ శిఖోపనిషది త్రిమూర్తీనాం సంస్కృతాంధ్ర ప్రాకృతాః ప్రియంకరాః"

అందు యొక చోట ఇట్లు వ్రాసినారు.

"ప్రాకృతే షడ్విధేచాపి వాల్మీకిం వా మహేశ్వరం ధ్యాయేత్ అత్రతు మామేవస్మరేత్ పండిత సమ్మతః" – ఆధర్వణ కారికలలో పంచమ కాండము, 8వ కాండము, 4వ కాండము అని యుదాహరించినారు. (కాని వావిళ్ళ ముద్రిత ప్రతిలో ఈ విభాగము

లేదు. మరియు ఉదాహరింపబడిన విషయాలున్ను కానరావు) ఇంకను అందిట్లు వ్రాసినారు. ప్రాచీనాంధ్ర వేత్తలుగా నీక్రిందివారు (అథర్వణ కారికలలో) పేర్కొనబడినారు. బృహస్పతి, కణ్వుడు, హేమచంద్రుడు, పుష్పదంతుడు, రావణుడు, గౌతముడు, ధర్మరాజు... ఈ గ్రంథమందు పూర్వాంధ్ర వ్యాకర్తలుగా హరి, శ్రీకవి, విష్ణుశర్మ, ధూర్వహుడు, శృంగార భూషణుడు అనువారు కూడ పేర్కొనబడినారు. ఈ ప్రాచీనాంధ్ర వైయ్యాకరణులను గురించి మనకేమి తెలియదు. "సర్వస్వము" వారు ఏ అథర్వణ కారికల నుండి పై వాటి నుదహరించిరో తెలియదు. ఇప్పటి ముద్రిత పత్రికలో అవేవియు కానరావు.

నన్నయ భట్టు ఆంధ్ర శబ్ద చింతామణిని వ్రాసెనందురు. కాని దానిని ఎలకూచి బాల సరస్వతియో మరెవ్వరో వ్రాసినారని కొందరి తలంపు. నన్నయ ప్రయోగాలు కొన్ని ఆంధ్ర శబ్ద చింతామణికి విరుద్ధమగుట దానికి తార్కాణమందురు. సకల భాషా వాగనుశాసనుడు అను బిరుదము పొందిన వాడగుటచేత నన్నయ యేదో వ్యాకరణము రచించి యుండును. ఇక పైన పేర్కొనిన ఆంధ్ర సారస్వత చరిత్రలోని యేడు యుగములను వివరించుట అవసరము.

> "మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్ కుండలీంద్రుండు, త
> న్మహనీయ స్థితి మూలమై నిలువ, శ్రీనాథుండు ప్రోవన్, మహో
> మహులై సోముడు, భాస్కరుండు వెలయింపన్ సొంపు వాటించు నీ
> బహుళాంధ్రోక్తి మయ ప్రపంచమునఁ దత్త్వాగల్భ్య మూహించెదన్"

ఈ పద్యమును రామరాజ భూషణుడు తన వసుచరిత్రలో వ్రాసెను. అనగా వారే తనకన్న ముందుండిన మహా కవులని అతని అభిప్రాయము. ఆంధ్ర సారస్వతమునకు మూలస్తంభములనియు అతని భావము. తనకన్న పూర్వులైన ఇతర కవులనతడు మెచ్చుకొనలేదన్నమాట.

1. ఆదియుగము

నన్నయభట్టు మొదలుకొని తిక్కన సోమయాజి కాలము వఱకు స్థూలముగా ఈ యుగమును విభజింపవచ్చును. నన్నయ రాజరాజనరేంద్ర చాళుక్యరాజు యొక్క ఆస్థానకవి. క్రీ.శ. 1050 ప్రాంతమువాడు. అతడు మహాభారతములో ఆదిపర్వము,

సభాపర్వము, అరణ్యపర్వములో ముప్పాతిక భాగము రచించి పోయెను. తర్వాత నెల్లూరిలో మనుమసిద్ధి రాజ్యము చేసిన కాలములో క్రీ.శ. 1250 ప్రాంతములో తిక్కన సోమయాజి విరాటపర్వము మొదలుకొని భారతము తుదివరకు తెనిగించెను. తర్వాత రెడ్ల యాస్థానమందుండిన ఎఱ్ఱాప్రగడ కవి భారతములోని అరణ్య పర్వ శేషమును పూరించెను. ఈ ముగ్గురు మహాభారత కవులను కవిత్రయము వారందురు. వారు వాడిన పదాలు, చేసిన ప్రయోగాలు అన్నియు అందరికిని ప్రమాణమైనవి. మహాభారతము మన తెనుగులో, ఆది గ్రంథమైనను, నేటికిని ఉత్తమోత్తమమని అందరిచే గౌరవింపబడుచున్నది.

నన్నయ తర్వాత ఇంచుమించు నూరేండ్లకు నన్నెచోడుడు అను రాజు కుమార సంభవము అను చక్కని తెనుగు కావ్యమును రచించెను.

2. కాకతీయ యుగము

ఓరుగంటిని రాజధానిగా జేసుకొని తెనుగు దేశమును కాకతీయులు క్రీ.శ. 1140 నుండి 1340 వరకు రాజ్యము చేసిరి. ఈ కాలములోమొదటి ప్రతాపరుద్రుడు, మహాదేవరాజు, గణపతిదేవుడు, అతని కూతురు రుద్రమ్మ, ఆమె మనుమడు రెండవ ప్రతాపరుద్రుడు కాకతీయ వంశపు రాజులు. ఢిల్లీ సుల్తానగు అల్లావుద్దీన్ ఖిల్జీ కాలములో ఓరుగంటి రాజ్యము పడిపోయెను. కాని 1320 నుండి 1440 వరకు నామకార్థముగా కొంత కాలము హిందువుల పరిపాలన ముండెను.

కాకతీయుల కాలములో అనగా 1140 నుండి 1340 మధ్యకాలములో ఉత్తమ సారస్వతము బయలుదేరెను. ఈ కాలములోనే పాల్కురికి సోమనాథుడు (క్రీ.శ. 1250–1300 ప్రాంతమువాడు) బసవపురాణము, పండితారాధ్య చరిత్ర అను ద్విపద శైవ వాఙ్మయమును రచించెను. ఇతడు జనగామ తాలూకాలోని పాలకుర్తివాడు. కాకతీయుల సామంతుడును, రాయచూరు ప్రభువును అయిన గోనబుద్ధారెడ్డి రంగనాథ రామాయణమును తన తండ్రి విఠల (రంగనాథుని) పేర ద్విపదగా రచించెను. గోనబుద్ధారెడ్డి "కవి లోక భోజుండు". మల్లికార్జున పండితారాధ్యుడు "శివతత్త్వసారము" అను మంచి శైవ గ్రంథమును రచించెను. ఈ కాలమందే నెల్లూరిలో మనుమసిద్ధి రాజు నొద్ద తిక్కన సోమయాజియుండెను. ఇతని కన్న మించిన

కవి నేటివరకు పుట్టలేదు. ఇతడు నిర్వచనోత్తర రామాయణమును, మహాభారతములోని పదియేను పర్వములను రచించెను. ఇతని గొప్పతనమేమన ఇతనికే అభినవదండి అను బిరుదుగల కేతన తన దశకుమార చరిత్రమును అంకితమిచ్చి యిట్లు చెప్పుకొనెను-

"కవిత జెప్పి యుభయ కవి మిత్రు మెప్పింప
నరిది బ్రహ్మకైన నతడు మెచ్చ
బరగ దశకుమార చరితంబు జెప్పిన
ప్రోడ నన్ను వేరె పొగడనేల?"

దశకుమార చరిత్ర కథలు చాలా మనోహరములైనవి. తిక్కన సోమయాజి శిష్యుడగు మారన మార్కండేయ పురాణమును రచించెను. తిక్కన శిష్యునిది కావున అది ఉత్తమమైనది. తిక్కన సోమయాజి ఉభయకవి మిత్రుడు. సకల విద్యాకళా విచక్షణుడు, కవిబ్రహ్మ, బుధజనవిరాజి. కావ్య ప్రౌఢి పాటించు శిల్పమున పారగుడు. తను కావించిన సృష్టి తక్కొరులు చేయలేదు. సాటిలేని వాడనిపించుకొన్న ఆంధ్ర కవి కుల గురువు.

క్రీ.శ. 1300 ప్రాంతముననున్న మంచన అను కవి కేయూర బాహు చరిత్రమును రచించెను. పుస్తకము చాలా చిన్నదే కాని కవిత చాలా గొప్పది.

కాకతీయ యుగములోనే శతకములారంభమయ్యెను. అందు ముఖ్యమైనవి (బద్దెన) భద్ర భూపాలుడను నతనిచే రచితమని చెప్పబడు సుమతిశతకము, నీతి శాస్త్ర ముక్తావళి, పాల్కురికి సోమనాథుని వృషాధిపశతకము, యథావాక్కుల అన్నమయ్య "సర్వేశ్వర శతకము".

3. రెడ్డియుగము

అద్దంకి, కొండవీడు, కోరుకొండ, రాజమహేంద్రవరములను రాజధానులనుగా జేసుకొని రెడ్డిరాజులు తెనుగు సీమను క్రీ.శ. 1300 నుండి 1450 వరకు రాజ్యము చేసిరి. ఒక దిక్కున సామ్రాజ్య విచ్ఛిత్తి కాగా ఇంకొక దిక్కున రెడ్డి రాజులు ఆంధ్రులను రక్షించి పాలించినవారైరి.

రెడ్డి రాజుల నాశ్రయించిన కవులలో ప్రఖ్యాతులైనవారు ఎఱ్ఱాప్రగడ, శ్రీనాథుడు, వామనభట్ట బాణుడు, వెన్నెలకంటి సూరన, నిశ్శంక కొమ్మన.

రెడ్డిరాజులు స్వయముగా సంస్కృత గ్రంథాలు, వ్యాఖ్యలు రచించిరి. కుమారగిరి వసంత రాజీయమను నాట్యశాస్త్రమును సంస్కృతమున రచించెను. పెదకోమటి వేమభూపాలునికి సర్వజ్ఞ చక్రవర్తి అను బిరుదముండెను. ఈరాజుల రసికతవలన దేశమందు కవులు బహుళమై శ్రీనాథుని హాస్యమునకు పాత్రులైరి. శ్రీనాథుడు కొండవీటి వీధిలో తిరుగు గాడిద నుద్దేశించి యిట్లు పద్యమల్లెను -

"బూడిద బుంగలై యొడలు పోడిమి దిక్క మొగంబు వెల్లనై
వాడల వాడలం దిరిగి వాదును వీడును చొచ్చొచోయనన్
గోడల గొందు లందొదిగి కూయుచు నుందువు కొండవీటిలో
గాడిద! నీవునుం గవివి కావుగదా యనుమాన మయ్యెడిన్".

ఈ కాలములోని ఎఱ్ఱాప్రగడ భారతములోని అరణ్య పర్వశేషమును ముగించిన కవిత్రయములోనివాడు. అతడు నృసింహ పురాణమును, హరివంశమును రచించెను. ఆ రచనతో ప్రబంధ పరమేశ్వరుడను బిరుదమును పొందెను.

రెడ్ల ఆస్థాన కవియు, ఆస్థాన విద్యాధికారియునైన శ్రీనాథుడు ఆనాటి వెలమ రాజులను, విజయనగర చక్రవర్తులను, ఇతర రాజులను దర్శించి వారిచే పూజితుడై దిగ్విజయమొంది తన గొప్పదనమును చూపెను. విజయనగరములో డిండిమభట్టు అను ఉద్దండుని జయించి 'నన్ను జయించేవారు లేరు" అని కంచు ఢక్కను మ్రోగించు కొనుచుండిన ఆ డిండిమభట్టు ఢక్కను పగులగొట్టించి విజయనగర చక్రవర్తిచే ముత్యాల శాలలో బంగారు దీనారాలతో స్నాతుడై కవి సార్వభౌమ బిరుదమందెను. అట్టి శ్రీనాథుడు శృంగార నైషదమును, కాశీఖండమును, భీమ ఖండమును రచించెను. ఇంకా ఇతర కావ్యాలు వ్రాసెను. పల్నాటి వీరుల కథలను ద్విపదగా ఇతడే వ్రాసెనని యందురు. ఎవరు వ్రాసినను అది చక్కని వీరకావ్యము. శ్రీనాథుడు భోగి, బమ్మెర పోతన యోగి.

శ్రీనాథునికి సమకాలికుడగు వల్లభరాయలు అను చిన్న రాజుండెను. అతడు క్రీడాభిరామమను శృంగార ప్రధానమగు వీధి నాటకమును రచించెను. కాని అది శ్రీనాథుడే వ్రాసినట్లు శైలి తెలుపుచున్నది. ఇద్దరునూ కలిసి వ్రాసిరో యేమో కాని కాకతీయుల నాటి సాంఘిక చరిత్రకు క్రీడాభిరామమే ముఖ్యాధారమగు చక్కని గ్రంథము.

వెన్నెలకంటి సూరన విష్ణు పురాణమును రచించెను. ఇది భారత భాగవతములవలె ఆంధ్రులలో ప్రచారమైనట్టిది కాదు. అయినను ఇతనిది చక్కని కవిత.

ఈ వంశమువాడే వెన్నెలకంటి అన్నయ్య అను కవియుండెను. అతడే కాలమువాడో తెలియదు కాని ప్రచురణకర్తలు అతడు క్రీ.శ. 13వ శతాబ్ద్యనంతరము వాడన్నారు. బహుశః ఈ రెడ్డియుగములోనివాడేనేమో! ఈ అన్నయ్య కవి "షోడశకుమార చరిత్రము"ను రచించెను. ఇది చక్కని కవిత. అచ్చు పోసినట్లు ఒకే ధోరణిలో విసుగెత్తించు కవిత్వమును, కథలను వ్రాసిన ప్రబంధ కవుల రచనలను చదివిన వారి కిట్టి కథలు చాలా ఆనందమునిచ్చును. ఈతని షోడశకుమార చరిత్ర కథలు మనోహరమైనవి. ఇట్టి కథలను వ్రాసిన వారిలో పేర్కొనదగినవారు వీరు.

జక్కన – విక్రమార్క చరిత్ర
అనంతామాత్యుడు – భోజరాజీయము
కదిరీపతి – శుకసప్తతి
కొరవి గోపరాజు – సింహాసన ద్వాత్రింశిక
కేతన – దశకుమార చరిత్ర
మంచన – కేయూర బాహుచరిత్ర
వెంకటనాథుడు – పంచతంత్రము
పింగళి సూరన – కళాపూర్ణోదయము
ఇవన్నియు ఉత్తమ కవితలు.

ఇంచుమించు క్రీ.శ. 1380 ప్రాంతంలో నుండినవాడు రావిపాటి త్రిపురాంతకుడు. సంస్కృతములో ప్రేమాభిరామము రచించెను. అది మాయమై పోయినది. త్రిపురాంతక కవిని (తిప్పన్నను) గూర్చి క్రీడాభిరామములో ఇట్లన్నారు.

"నన్నయభట్టు తిక్కకవి నాయకులన్న హుళక్కిభాస్కరుం
డన్నను చిమ్మపూడి యమరాధిపుడన్నను సత్కవీశ్వరుల్
నెన్నుదుటం గరాంజలులు నింతురు జేయని రావిపాటి తి
ప్పన్నయ నంతవాడ తగునా యిటు దోసపు మాటలాడగన్?"

ఇతని తెనుగు కృతి త్రిపురాంతకోదాహరణము. ఇది ఒక్కటే మనకు లభించినది. అది ఉత్తమశైలి కలిగినట్టిది.

రెడ్డిరాజుల సమకాలికులు రాచకొండ దేవరకొండలకు ప్రభువులైన వెలమరాజులు. అందు సర్వజ్ఞ బిరుదు వహించిన సింగమనాయకుడు సంస్కృతములో రచనలు చేసెను. అతని కాలమందే, అతని సీమ యందే కోలాచల మల్లినాథ సూరి యుండెను. జనగామ తాలూకాలో బమ్మెర అను గ్రామము కలదు. అది పాల్కురికి సోమనాథుని పాలకుర్తికి రెండు మూడు మైళ్ళ దూరముననున్నది. ఆ గ్రామము పోతనామాత్యుని జన్మదేశమై పవిత్రమైనది. పోతనామాత్యుడు ఆంధ్ర మహాభాగవత మును రచించిన మహాకవి. అతని భాగవతము అనేకులు పారాయణము చేయుదురు. అతనికి శిష్యులైన ఏర్చూరి సింగయ్య, వెలిగందల నారయ్య, గంగయ్య అనువారు భాగవతములో కొన్ని భాగములను రచించిరి.

సర్వజ్ఞ సింగభూపాలుడు భాగవతమును తన కంకిత మీయనందున దానిని పాతి పెట్టించగా ఖిలమైన భాగాలను పోతన శిష్యులచే పూరించిరను అపవాదము కల్పితమయ్యెను. అది అబద్ధము. ఆ ముగ్గురు శిష్యులలో ఒకరు కూడ సూచన మాత్రముగానైనను ఆ మాట వ్రాయలేదు. అట్లయితే వారెందుకు కొన్ని భాగాలను వ్రాసిరనగా పోతన తన శిష్యులను అనుగ్రహించుటకై వారిచే కొన్ని భాగాలను వ్రాయించి తనతోపాటే వారిని గూడ వందనీయులనుగాజేయ సంకల్పించి యుండేనేమో. ఆ ముగ్గురు శిష్యుల కవనము కూడా పోతన కవితకు కుడియెడమగా ప్రశంసా పాత్రముగా నున్నది.

పోతన భగవద్భక్తుడు. అతడు భక్తిరసాన్ని అద్వితీయముగా అసామాన్యముగా భాగవతమందు చిప్పిల్లజేసెను. భక్తిరస ఘట్టములందు అతడు కవిత్రయాన్నే కాక ఆంధ్ర కవులందరిని కూడా మించినవాడయ్యెను. ప్రహ్లాద చరిత్ర, కుచేలోపాఖ్యానము, గజేంద్రమోక్షము, ధృవచరిత్ర, అంబరీషోపాఖ్యానము ఉత్తమమైన భక్తిరస ప్రధాన ఘట్టములు. అందు ప్రహ్లాద చరిత్ర అగ్రస్థానమలంకరించును.

"మందార మకరంద మాధుర్యమున దేలు
మధుపంబు వోవునే మదనములకు"

అను పద్యము వంటి పద్యాలు అందు నిండుగా గలవు. క్రీ.శ. 1420 ప్రాంతంలో రాచకొండ రాజుల యాశ్రములో నుండిన కొరవి గోపరాజు అతని సింహాసన ద్వాత్రింశిక మనోహరమగు విక్రమార్క కథల కావ్యము.

4. విజయనగర యుగము

క్రీ.శ. 1323లో మహ్మదీయులు ఓరుగంటిని పట్టుకొనిరి. ఆ సమయములో ఓరుగంటి నుండి సంగమ అనునతని అయిదుగురు కుమారులు హంపికిని, దాని దగ్గర నుండు కంపిలికిని వెళ్ళి అచ్చట విజయనగర దుర్గమును తుంగభద్రా తీరమందు నిర్మించి, కీ.శ. 1336లో విజయనగర సామ్రాజ్య స్థాపన చేసిరి. ఆ సోదరులలో హక్క (మొదటి హరిహరరాయలు) బుక్క(రాయలు) ముఖ్యులు. క్రీ.శ. 1347లో బహమనీ రాజ్యము స్థాపితమయ్యెను. అది కొంతకాలానికి అయిదు చీలికలై పంచ సుల్తానులకు మూలమయ్యెను. హరిహరరాయ కాలము బహమనీ సుల్తానులతో పోరాడుటతో సరిపోయెను. అతని కొడుకు రెండవ హరిహరరాయలు క్రీ.శ. 1379 నుండి 1404 వరకు రాజ్యము చేసెను. తర్వాత మొదటి దేవరాయలు రాజయ్యెను. అతని కాలములో బహమనీ దాడి ఎక్కువై బాధ కలిగించెను. రెండవ దేవరాయలు 1421–1448 వరకు రాజ్యము చేసెను. అతడును దుర్బలుడగురాజు. తుదకు క్రీ.శ. 1486లో సాళువ నరసింహరాయలను చంద్రగిరి సామంతరాజు విజయ నగరాన్ని ఆక్రమించుకొని రాజ్యము చేసెను. అతడు ప్రబలుడై రాజ్యమును విస్తరించి, తురక ప్రభువులనోడించి రాజ్యమును స్థిరపరచెను. అతని కొడుకు ఇమ్మడి నరసింగ రాయలు. అతనిని క్రీ.శ. 1505లో అతని సేనాని తుళు వంశమువాడగు నరస నాయకుడు చంపి రాజ్యము నాక్రమించుకొనెను. అతని కుమారుడు శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1509 నుండి 1529 వరకు దేదీప్యమానంగా, దిగ్విజయమానంగా రాజ్యం చేసెను. విజయనగర రాజ్యము గోదావరి నుండి రామేశ్వరము వరకు వ్యాపించి, మహాసామ్రాజ్యమై సుల్తానుల బలమును భంగపఱచిన దయ్యెను. శ్రీకృష్ణదేవరాయల తర్వాత అతని తమ్ముడు అచ్యుతరాయలు చక్రవర్తి యయ్యెను. అతడు దుర్బలుడు, అతని తమ్ముని కొడుకగు సదాశివరాయలు క్రీ.శ. 1542లో చక్రవర్తియయ్యెను. అతడు నామకార్థముగా రాజుగా నుండెను. కాని శ్రీకృష్ణదేవరాయలు అల్లుడగు అళియ రామరాజు నిజమైన చక్రవర్తిగా పరిపాలించెను. క్రీ.శ. 1565లో అయిదుగురు దక్కన్ సుల్తానులు కలిసి తళ్ళికోట యొద్ద రామరాజుతో యుద్ధము చేసి అతనిని చంపి విజయనగరమును ధ్వంసము చేసిరి. కాని విజయనగర బలము నాశనము కాలేదు.

రామరాజు తమ్ముడు తిరుమలరాజు పెనుగొండను రాజధానిగా చేసుకొని విజయనగర సామ్రాజ్యాన్ని పాలించెను. అతని తర్వాత శ్రీరంగరాయలు చంద్రగిరిని రాజధానిగా చేసుకొని ఇంచుమించు 1650 వరకు రాజ్యము చేసెను. అటు తర్వాత విజయనగర సామ్రాజ్యము సంపూర్ణముగా నశించెను.

ఇక 1350 నుండి 1650 వరకు వాఙ్మయ స్థితి ఎట్టిదో కనుగొందము.

ఈ 300 ఏండ్ల కాలమును ప్రబంధ యుగమని చెప్పవచ్చును. ఈ కాలంలో అష్టాదశ వర్ణనలతో సంస్కృతపద భూయిష్టశైలితో శబ్దాలంకార బాహుళ్యముతో గొప్ప గొప్ప ప్రబంధాలు రచింపబడెను.

మొదట బుక్కరాయల కాలంలో నాచసోమనాథుడను మహాకవి యుండెను. అతనికి గుత్తి దుర్గము క్రింద నుండు పెంచికలదిన్నెను అగ్రహారముగా బుక్కరాయలు దానము చేసినందున అతడాగ్రామము వాడనుట స్పష్టము. ఆ దాన శాసనములో కవి నిట్లు వర్ణించినాడు.

"యాజుషాణాం వరేణ్యాయ సకలాగమ వేదినే
అష్టాదశ పురాణానా మభిజ్ఞాతార్థ వేదినే
అష్ట భాషా కవిత్వశ్రీ వాణీ విజిత సంపదే
సోమాయ నాచనాం భోధేః సోమాయామిత తేజసే"

దీనిని బట్టి అతని పాండిత్య కవిత్వ మహత్వము సువ్యక్తమగుచున్నది.

తిక్కనవలె అతడు అసాధారణ కవి. అతడు ఉత్తర హరివంశమును రచించెను. అతడు క్రీ.శ. 1340 ప్రాంతమువాడు. అతడు "సకల భాషా భూషణుడు", "సాహిత్య రస పోషణ సంవిధాన చక్రవర్తి". "అలికంబున యక్షిని దాచినట్టి సర్వజ్ఞుడు", అష్ట భాషా కవిత్వ విశారదుడు", "నవీన గుణ సనాథుడు". సీస పద్యము ఇతని చేతిలో పరిణతి నందెను.

కల్హార మకరంద కలిత మందాకినీ
  లహరీపరీత కోలాహలంబు
బాలేందు చంద్రికా పరభాగశోభా ప
  రాగ సంభావితా రగ్వధంబు
సేవాసమాసన్న సిద్ధ సీమంతినీ
  తాలవృంతోత్తాల తాండవంబు

కాత్యాయనీ దత్త కర్ణావతంస క
　　ర్పూర ఖండామోద పూరితంబు
మారుతంబది నామీద మలసియాడ
గలుగునొకొ నాకు నొకనాడు కన్నులార
శివుని జూచు పుణ్యంబును చింతనెరయ
మొదలి వేలుపుఁ బొడగంటి మ్రొక్కగంటి.

ఈ నడకను శ్రీనాథుడు నేర్చుకొని తన సీసపద్యాలను తీర్చిదిద్ది యలంకరించుకొనెను. నాచన సోమనాథుడు సామెతలను ఎక్కువగా వాడిన మొదటి తెనుగు కవి. ఉత్తమ హాస్యమునకుఁగూడ నితడే మొదటివాడు.

మొదటి దేవరాయల మంత్రిగా నుండిన సిద్ధనకు జక్కన కవి తన విక్రమార్క చరిత్రను అంకితమిచ్చెను. జక్కన క్రీ.శ. 1430–1447 ప్రాంతమందుండెను. తన కవిత్వమును గూర్చి యిట్లు వ్రాసుకొనెను.

"చక్కన నీవైదుష్యము
చక్కన నీకావ్యరచన చాతుర్యంబుల్
చక్కన నీవాగ్వైఖరి
చక్కన నీ వంశమమహిమ జక్కన సుకవీ!"

ఇతడు చక్కని కథలు వ్రాసెను. సంస్కృతాంధ్రములందు అనర్గళధార గలవాడు.

కల్పాంత దుర్దాంత కలుషాంతక స్వాంత
　　దుర్వార వహ్నికి నోర్వవచ్చు
నిష్ఠుర నిర్ఘోష నిర్ఘాత సంఘాత
　　జాత మహివహ్ని సైపవచ్చు
ప్రళయ కాలాభీల ఫాలలోచన ఫాల
　　భాగానలస్ఫూర్తి బ్రతుకవచ్చు
కాకోదరేంద్ర ఫూత్కార సంభవ తీవ్ర
　　కాకోల దహనంబు గదియవచ్చు

కాక సైరింపవచ్చునే లోకదహన
దర్పితంబైన యస్మత్ప్రతాప వహ్ని
తావకోత్సాహ సాహసౌదార్య ధైర్య
గతికి మెచ్చితి విక్రమార్క క్షితీంద్ర!"

అని సంస్కృత పద జటిలముగా వ్రాసెను.

"పలుకులు వేయు నేటికిక, బ్రాహ్మణసూనుడ వీవు, నీకు దో
ర్బలమున కేమి కారణము, బాపనపోటును, కప్పుకాటునుం
గలదె ధరిత్రి? భట్టిమొన గట్టిగ నమ్మకు, మోసపోకు, నీ
కొలదులె రాచకార్యములు, కోమటి బుద్ధుల దీర్పదీరునే?"

అని లలితముగా గూడ రచించెను.

పిల్లలమఱ్ఱి పినవీరన సూర్యాపేట యొద్దనుండు పిల్లలమఱ్ఱివాడు యందురు. అతడు జైమినీ భారతము వ్రాసి సాళువ నరసింహరాయల కంకితమిచ్చెను. అతని శృంగార శాకుంతలము, జైమినీ భారతము ప్రసిద్ధ కావ్యములు. "వాణి నా రాణియని యెద విరుచుకొని పలికినదీ పినవీరనయేనట! ఈ వీరభద్రుడు "విపులచాటూక్తి నిర్ణిద్రుడు". తుళు వంశపు నరసింహరాయలకు నంది మల్లయ్య, ఘంట సింగయ్య అను జంటకవులు తమ వరాహపురాణము నంకితమిచ్చిరి.

శ్రీకృష్ణదేవరాయల కాలము ఆంధ్ర సారస్వతమునకు మహోవైభవకాలము. అతని యాస్థానములో అష్టదిగ్గజములు అను ఎనిమిది మంది కవులుండిరని ప్రతీతి. కాని యందు పేర్కొనబడిన కవులలో కొందరు అతని ఆస్థానమువారు కారు.

శ్రీకృష్ణదేవరాయలు స్వయముగా మహాకవి. అతడు ఆముక్తమాల్యదను వ్రాసెను. దానినతడు వ్రాయలేదనీ, మను చరిత్ర వ్రాసిన అల్లసాని పెద్దన వ్రాసెననీ అందురు. కాని ఈ రెండు పుస్తకముల శైలిని చూచిన రెంటికిని ఏమిన్నీ పోలిక లేదు. ఆముక్తమాల్యద శైలి చాలా బిరుసు. మను చరిత్ర శైలి తీర్చి దిద్ది మృదువుగా, ఇంపుగా నుండునట్లు వ్రాసినది. ఆముక్త మాల్యద సానబట్టని గనిలోని రత్నము – మను చరిత్ర మెఱుగిచ్చి వంకలు దిద్దిన వజ్రము.

"గృహసమ్మార్జనమో, జలాహరణమో, శృంగారపల్యంకికా
వహనంబో, వనమాలికాకరణమో, వాల్లభ్య లభ్యధ్వజ
గ్రహణంబో, వ్యజనాతపత్ర ధృతియో, బ్రాగ్దీపికారోపమో
నృహరీ! వాదములేల? లేరెయితరుల్ నీ లీలకుం బాత్రముల్"

– ఆముక్త మాల్యద

"బహురత్నద్యుతి మేదురోదర దరీభాగంబులం బొల్చుని
మ్మిహికాహార్యమునం జరింతు మెపుడుం బ్రేమన్ నభోవాహినీ
లహరీ శీతల గంధవాహ పరిఖేల న్మంజరీ సౌరభ
గ్రహణేందిందిర తుందిలంబులవి మత్కాంతార సంతాపముల్"

– మనుచరిత్ర

ఏ పద్యము చూచినను రెంటిలో ఇట్టి శైలి భేదముండును – కాన శ్రీకృష్ణరాయలే ఆముక్త మాల్యదను రచించెనని విశ్వసింపవలెను. బ్రాహ్మణేతరుల కవిత్వమెంత మంచిదైనను అది కాకజుష్టంబైన హవ్యంబువోలె గ్రాహ్యంబు కాదు" అని తిట్టిన అప్పకవి తన అప్పకవీయములో ఆముక్తమాల్యదను ఉదాహరించిపుడంతయు అది పెద్దన్నగారిది అని వ్రాసెను. అక్కడనుండి ఈ కథకు వేళ్ళు వచ్చెను. ఆముక్త మాల్యదను విష్ణు చిత్తీయమనియు నందురు. శైలి బాగుగా లేకున్నను అందలి భావములు వర్ణనలు అనితర కావ్య లభ్యములు.

కృష్ణదేవరాయలకు ముఖ్యుడైన ఆస్థాన కవి అల్లసాని పెద్దన. అతనికి "ఆంధ్ర కవితాపితామహ" అను బిరుదమిచ్చి అతని కాలికి ఆ చక్రవర్తి స్వయముగా గండపెండేరమును తొడిగించెను. శ్రీకృష్ణ దేవరాయలు చనిపోయిన తర్వాత అల్లసాని పెద్దన అతనిని తలచుకొని వాపోయిన పద్యమును చదువు ఆంధ్రులు కూడ ఆనాటి వైభవమును తలచుకొని దుఃఖింపక మానరు. పెద్దన రాయల గూర్చి ఇట్లు విలపించెను.

"ఎదురైనచో దన మద కరీంద్రము డిగ్గి
    కేలూత యొసగి యెక్కించు కొనియె
మను చరిత్రంబందు కొనువేళ పురమేగ
    పల్లకి తనకేల బట్టి యెత్తి

బిరుదైన కవి గండపెండేరమున కీవె
తగుదని తానె పాదమున దొడిగె
గోకట గ్రామాద్యనేకాగ్రహారంబు
లడగిన సీమలయందు నిచ్చె
ఆంధ్ర కవితా పితామహా యల్లసాని
పెద్దన కవీంద్రయని నన్ను బిలుచునట్టి
కృష్ణ రాయలతో దివి కేగలేక
బ్రతికి యున్నాడ జీవచ్ఛవంబ నగుచు."

శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన మందలి అష్ట దిగ్గజము లెవరనగా! 1. అల్లసాని పెద్దన, 2. నంది తిమ్మన (ముక్కు తిమ్మన), 3. అయ్యలరాజు రామభద్ర కవి 4. ధూర్జటి, 5. మల్లన (ప్రౌఢకవి), 6. పింగళి సూరన, 7. రామరాజ భూషణుడు, 8. తెనాలి రామకృష్ణుడు. తుది ముగ్గురు కృష్ణరాయల కాలములో గ్రంథాలేవి రచింపలేదు. నంది తిమ్మనకు ముక్కు పెద్దదిగా నుండెనేమో ముక్కు తిమ్మన అనియే అతడు ప్రసిద్ధి నొందెను.

"ముక్కు తిమ్మనార్యు ముద్దు పలుకు"

అని నానుడి యేర్పడెను. అతడు పారిజాతాపహరణము రచించెను. అది ఉత్తమ కావ్యాలలో చేరినట్టిది.

"జలజాతాసన వాసవాది సురపూజా భాజనంబై తన
ర్చు లతాంతాయుధు కన్న తండ్రి శిరమచ్చో వామ పాదంబునన్
దొలగంద్రెసె లతాంగి యట్లయగు నాథుల్ నేరముల్ సేయ పే
రలుకం జెందిన యట్టి కాంతలుచిత వ్యాపారముల్ నేర్తురే?"

ఇట్టి సుందర పద్యములను నంది తిమ్మన వ్రాసెను.

కృష్ణరాయల కాలములో యెల్లనార్యుడు - నాదెండ్ల గోప ప్రధాని కూడా రచనలు చేసిరి. అవి అంత గొప్పవి కావు.

ధూర్జటి కవి కాళహస్తి మాహాత్మ్యము అను కావ్యమును రచించెను. అది ఉత్తమ ప్రబంధాలలో చేరినట్టిది. మల్లన రాజశేఖర చరిత్రము కూడ అదే శ్రేణిలో చేరినది.

ఆళియ రామరాజు ఆస్థానకవి యగుటచే రామరాజ భూషణుడు అను ఖ్యాతి గాంచిన భట్టుమూర్తి కవి వసుచరిత్రను వ్రాసెను. అందు శ్లేషలు. యమకములు, ఉత్ప్రేక్షలు విశేషముగా గలవు. అతడు వ్రాసిన పద్ధతిపై ఇతరులు వ్రాయబోయి వెల్లకిలబడిరి. అతనిని పూర్తిగా ప్రతి పద్యములో అనుకరించిన వాడు కొల్లాపుర మాధవరాయలు. అతడు చంద్రికా పరిణయము రచించెను.

రామరాజు కాలములో పింగళి సూరన కళాపూర్ణోదయమును రచించెను. అది అద్భుత కల్పనా కథ. అది తెనుగు సారస్వతములో అపూర్వమగు గ్రంథము. ఇతని ప్రభావతీ ప్రద్యుమ్నము కూడా చక్కని గ్రంథము. ఇతడు మొదటి ద్వ్యర్థి కావ్యమగు రాఘవ పాండవీయము రచించెను.

ఇదే కాలములో తెనాలి రామకృష్ణుడు పాండురంగ మాహాత్మ్యమును రచించెను. అందు మారుమూల పదాలు బహుళము. కొన్ని వర్ణనలు చక్కగా ఆకర్షకములుగా నున్నవి.

విజయనగర సామ్రాజ్య కాలములో ఈ క్రింది వారుకూడా రచనలు చేసిరి. మనుమంచి భట్టు, దుగ్గన, తాళ్ళపాక చిన్నన్న, సంకుసాల నృసింహకవి (కవి కర్ణ రసాయన కర్త) రామభద్రకవి, ఎల్లన (శృంగార మల్హణ చరిత్రకర్త) రామరాజరంగన్న, కుమార దూర్జటి (కృష్ణరాయ విజయము), తిరువెంగళ నాథుడు, మున్నగు పలువురు తమశక్తికొలది పద్యకావ్యములు రచించిరి. కాని ఉత్తమ శ్రేణిలోనివికావు.

విజయనగరపు తుదిరాజగు శ్రీరంగరాయలు చంద్రగిరిలో రాజ్యము చేసిన కాలముననో ఇంచుక తర్వాతి కాలముననో క్రీ.శ. 1600–1650 ప్రాంతములో వుండినవాడు కదిరీపతి. ఇతడు అనంతపుర మండలములోని కదిరి నివాసి. ఇతడు శుకసప్తతి యను కథల పుస్తకమును రచించెను. ఈ శుకసప్తతి తెనుగు సారస్వతములో తృతీయ పంథ త్రొక్కినదనవచ్చును. ఇందు హాస్యము, తెనుగు నుడికారము, లలితమగు శైలి, లోకానుభవము, చక్కని శృంగార రసము అన్నియు నిండి ప్రతి పద్యము మనోహరముగా నుండును. ఇతని వర్ణనలు ఇతర ప్రబంధ కవులవలె అంధాను కరణములు కావు. విరహ తాపం కలిగితే కవులందరు చంద్రుని, గాలిని, చిలుకలను, వసంతుని తిట్టిరి. ఈ కవి కథలోని ఒక బ్రాహ్మణుడు విరహతాపము పొంది యిట్లవస్థపడినాడు.

"ఒడిలోన పంచాంగ ముంచు కొన్నదిగాన
కెటుపోయె ననుచు నూరెల్ల వెదకు
పనిలేనిపని వీధి జనుచు గ్రమ్మరు నాత్మ
గృహమంచు నెంచి యిల్లిల్లు దూరు
అపుడు భుక్తి యొనర్చి యవునసే సంకటి
తింటినాయని యింటి తెఅవ నడుగు
కుఱచ దోవతి కట్టుకొని యెవ్వరోయిట్లు
గట్టిపోయిరటంచు గలవరించు

గడియలో తెల్లవాఱె, భాస్కరుడు గ్రుంకె
జాగులేలంచు సందెపై సందెవార్చు
కంతుమాయల నుమ్మెత్తకాయఁ దిన్న
పొలుపు సారెకు దెల్పునప్పుడమి వేల్పు".

వర్ణనయైనను సరే సహజాలంకారములతో స్వభావోక్తులతో చక్కని తెనుగుతో నిండియుండును.

గోలకొండ కవులు

విజయనగర రాజుల కాలములో గోలకొండ కుతుబ్షాల కాలములో అందు ముఖ్యముగా ఇబ్రహీం కుతుబ్షా కాలములో పలువురు తెనుగు కవులుండిరి. అందు ముఖ్యులు మొదటి అచ్చ తెనుగు కావ్యమగు యయాతి చరిత్రమును వ్రాసిన పొన్నగంటి తెలగనార్యుడు, మాలిక్ ఇబ్రాహీం కుతుబ్షా (మల్కిభరాముని) ఆస్థాన కవియైన అద్దంకి గంగాధర కవియునై యుండిరి. ఇతడు తపతీ సంవరణోపాఖ్యానమును రచించెను. గోలకొండ ఖిల్లాలో కరణముగా నుండిన సారంగుతమ్మయ వైజయంతీ విలాసమను మంచి కావ్యమును రచించెను. ప్రౌఢ కవి మల్లారెడ్డియును ఈ కాలమువాడే. అతడు దోమకొండ ప్రభువులకు పూర్వ పురుషుడు. అతడు షట్చక్రవర్తి చరిత్ర మున్నగు పెక్కు గ్రంథాలను రచించెను. నిరంకుశోపాఖ్యానమును వ్రాసిన కందుకూరి రుద్రయ్య ఈ కాలము వాడే. ఓరుగల్లును కొంత కాలము పాలించిన షితాబ్‌ఖాన్ (సీతాపతి) కాలములో చరిగొండ ధర్మన్న చిత్ర భారతమును రచించెను.

క్రీ.శ. 1450 ప్రాంతములో రాయచూరు మండలములో కృష్ణాతీర మందుండిన అనంతామాత్యుడు భోజరాజరాజీయమను ఉత్తమ కావ్యమును రచించెను. ఇందలి శైలి సరళమే కాక విశిష్ట పాండిత్యముతో కూడినట్టి స్వభావ వర్ణన లిందెక్కువ కలవు. ఇతడు గొప్పలాక్షణికుడు. రసాభరణము అను అలంకార శాస్త్రమును రచించెను. క్రీ.శ. 1600 ప్రాంతమువాడు. కొల్లాపురము రాజగు మల్ల భూపాలు నాశ్రయించి బాలసరస్వతి మల్ల భూపాలీయము రచించెను. ఇది భర్తృహరి శతకత్రయానికి తెనుగుసేత.

ఇంచుమించు క్రీ.శ. 1500 ప్రాంతమున సర్వజ్ఞ సింగభూపాలుని పుత్రుడగు మాధవుని వద్ద రాచకొండలో నుండునట్టి గౌరన అను కవి హరిశ్చంద్ర ద్విపదను, నవనాథ చరిత్ర ద్విపదను రచించెను. ఈ రెండును ఉత్తమ రచనలు. అందు హరిశ్చంద్ర ద్విపదయేమిన్న. ద్విపద ప్రబంధాలలో నిది పూజ్య స్థానమందినది. గౌరన కుమారుడు భైరవుడు. శ్రీరంగ మాహాత్మ్యమను ప్రబంధమును రచించెను.

5. తంజావూరు యుగము

ఆంధ్ర సామ్రాజ్యము క్రమక్రమముగా దక్షిణాభిముఖమయ్యెను. విజయనగర సామంతులుగా, మండలాధిపతులుగా మధురను, తంజావూరును నాయకరాజులు పాలించుచుండిరి. అందులో మధుర సారస్వత పోషణకు ప్రసిద్ధికెక్క దయ్యెను. తంజావూరు రాజులు మాత్రము ఆంధ్రసారస్వతమును పోషించిన తుదిరాజులు. ఆ రాజులను గూర్చి ముందుకొంత తెలుసుకొనవలెను.

విజయనగర చక్రవర్తియగు అచ్యుతదేవరాయల భార్యకు చెల్లెలి భర్తయగు చిన చెన్నప్ప నాయకుడు క్రీ.శ. 1540 ప్రాంతమందు తంజావూరికి నాయక రాజయ్యెను. అతని కుమారుడు అచ్యుత నాయకుడు క్రీ.శ. 1561 లో రాజయి, ఇంచుమించు 50 ఏండ్లు రాజ్యము చేసెను. అతని తర్వాత తంజావూరు రాజ్యము క్షీణించి తుదకు శివాజీ సోదరుడైన ఏకోజీ వశమై మహారాష్ట్రుల పాలనములోనికి వెళ్లి ఇంగ్లీషువారు ప్రభువులైన తర్వాత వారి వశమై పోయెను.

తంజావూరి రాజులలో రఘునాథరాయల కాలమునను, విజయరాఘవుని కాలమునను ఆంధ్ర సారస్వతము ఇంచుమించు నూరేండ్లకాలము పోషింపబడిన దయ్యెను. ఈ రాజుల కాలములో పలువురు స్త్రీలు, భోగస్త్రీలు కూడా సంస్కృతాంధ్రము

లందు రచనలు చేసిరి. రఘునాథ రాజు స్వయముగా మహా పండితుడు; ఉత్తమకవి. సంగీతములో కొత్త రాగములను కనిపెట్టి ప్రచారము చేసినాడు. అప్రతిహత వీరుడు. ఈతడు రచించిన బహు సంస్కృతాంధ్ర గ్రంథములు లభించినవి కావు. వాల్మీకి చరిత్ర మనునదొక్కటి ముద్రితమైనది. అది యుత్తమ శ్రేణిలో చేరిన గ్రంథము.

రఘునాథ నాయకుని ఆస్థానకవి చేమకూర వేంకటపతి, "ఈ చేమకూర చక్కెర మడిలో అమృతము పాటించి పెట్టినది" అని శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రిగారనిరి. ఈ చేమకూర వెంకటపతి సారంగధర చరిత్రము, విజయవిలాసము అను రెండు ప్రబంధములను రచించెను. ఈ రెండును ఆంధ్ర సారస్వతమందు అమూల్యమగు రత్నములు.

విజయ రాఘవుని కాలములో ఉత్తమ కావ్యాలు వెలవడలేదు. కాని పలువురు స్త్రీ పురుషులు యక్షగానాలను, చరిత్రలను మున్నగు వాటిని రచించిరి. అందు రంగాజమ్మ మన్నారు దాస విలాసము ముఖ్యమైనది. కాళకవి, వేంకటపతి సోమయాజి యనువారును ప్రబంధాలు వ్రాసిరి.

మధుర రాజులు

తంజావూరు రాజులెట్లు విజయనగరానికి యుండిరో అటులే మధుర నాయకులును అదే కాలములో సామంతులై తర్వాత స్వతంత్రులై యించుమించు తంజావూరు పడిపోయినప్పుడే పడిపోయిరి.

వారి కాలములో కొందరు సాధారణ ప్రబంధాలు వ్రాసిరి. అందులో ముఖ్యుడు శేషము వేంకటపతి తారాశశాంకము వేంకటకృష్ణప్ప నాయకుడు అహల్యా సంక్రందనమును వ్రాసెను. అతడే జైమినీ భారతమును వచనముగా వ్రాసెను. మట్ల అనంత భూపాలుడు, విజయరంగ చొక్కనాథుడును ప్రబంధాలు రచించిరి. వీరిలో శేషము వేంకటపతి తారాశశాంకము చక్కని శైలిగలది.

6. సంధి యుగము

విజయనగర పతనానంతరము చిల్లర పాలెగాళ్ళను, ధనికులను ఆశ్రయించి పలువురు కవులు రచనలు చేసిరి. వారినే యుగములోను చేర్చుటకు వీలు లేనందునను వారు మన ఆధునిక యుగానికి పూర్వులయినందునను క్రీ.శ. 1700-1900

వరకుండు కాలమును సంధి యుగమని పేర్కొననైనది. ఈ కాలములో ఉత్తమ రచనలు కానవచ్చుట లేదు. అట్లున్నను సారస్వత చరిత్రలో ఆ కవులను గూడ సూచించుట అవసరము. ఈ కాలములో ముఖ్యులైన కవులను వారి రచనలను సూచింతుము.

శంకర కవి	-	హరిశ్చంద్రోపాఖ్యానము
చిత్రకవి సింగరార్యుడు	-	బిల్హణీయము
కిరీటి వెంకటాచార్యులు	-	అచలాత్మజా పరిణయము
కుమ్మరి మొల్ల	-	రామాయణము
ముద్దు పళని	-	రాధికా సాంత్వనము
ఆడిదము సూరకవి	-	రామలింగేశ శతకము
కూచిమంచి తిమ్మకవి	-	రసికజన మనోభిరామము మున్నగు బహు గ్రంథములు
కూచిమంచి జగ్గకవి	-	చంద్రరేఖా విలాపము, సుభద్రా పరిణయము
శిష్టు కృష్ణమూర్తి	-	అనర్ఘ రాఘవము
కాణాదము పెద్దన	-	ఆధ్యాత్మ రామాయణము, ముకుంద విలాసము
తరిగొండ వెంకమ్మ	-	వెకటాచల మహాత్మ్యము

ఈ సంధి యుగములో ఇద్దరిని గురించి ప్రత్యేకముగా సూచింపవలెను. ఒకరు వేమన. ఇంకొకరు త్యాగరాజు. వేమన క్రీ.శ. 1700-1750 ప్రాంతములోని వాడు. అతడు ఆట వెలదులు వ్రాసినట్లుగా ఏ తెలుగు కవియు నేటివరకు వ్రాయలేదు. అతడు మహాకవి. గొప్ప వేదాంతి, అందులో సకల జనులకు అర్థమగు వేదాంతమును భోదించినాడు. అతడు అపూర్వ సంఘసంస్కర్త. సంస్కర్తలు విమర్శిస్తేనే జనులకు కోపము. వేమన లోపమున్న వారిని తిట్టి అందరిని నవ్వించి మెప్పు పొందినవాడు. అతని పద్యాలు కంఠపాఠము రాని తెనుగు విద్యావంతుడు కానరాడు.

క్రీ.శ. 1759 నుండి 1857 వరకు తంజావూరులోని తిరువాడిలో నివసించిన త్యాగరాజు ఆంధ్రుల చరిత్రలో అద్వితీయుడైన గాయక చక్రవర్తి, అంతేకాదు. మొత్తము

ద్రావిడ భాషా కుటుంబమునకంతటికి ఇతడే సంగీత మందు ఆశ్రయ భూతుడైనాడు. ఇతని కీర్తనలు పాడినవారే గాయకులు. ఇతని కీర్తనలు పాడలేని వారు దక్షిణ దేశమందు గాయకులనిపించుకొనరు.

ఈ యుగములోని తక్కిన కవులెవరనగా

కనుపర్తి అబ్బయ	– కవిరాజ మనోరంజనము
నారాయణ దిట్ట కవి	– రంగరాయ చరిత్ర
అయ్యలరాజు నారాయణ కవి	– హంస వింశతి
చెదలువాడ మల్లయ	– విప్ర నారాయణ చరిత్ర
కంకంటి పాపరాజు	– ఉత్తర రామాయణము
పుష్పగిరి తిమ్మన	– సమీర కుమార విజయము
పిండిప్రోలు లక్ష్మణ కవి	– లంకా విజయము
గోపీనాథము వేంకట కవి	– గోపీనాథ రామాయణము
ఓగిరాల జగన్నాధ కవి	– సుమనో మనోభి రంజనము

7. ఆధునిక యుగము

క్రీ.శ. 1880 ప్రాంతము నుండియే రచనలు చేసిన వారైను వారు మన కాలములో 1900 తర్వాత గతించినవారు పలువురు రచయితలుండినందున అట్టివారిని ఈ యుగములో చేర్చనైనది. నిజముగా ఈ యుగము అచ్చు విరివిగా ప్రారంభమైన నాటినుంచి అనగా 1770–1820 లో నుండిన బ్రౌన్, అదే కాలములో అతని యొద్దనుండిన జూలూరి అప్పయ కాలము నుండియే లెక్క పెట్టవలెను. అచ్చు పద్ధతి యూరోపు నుండి మనకు లభించినది. క్రీ.శ. 1577 లోనే గోవాలో చేరిన పోర్చుగీసు వారిచే ప్రవేశపెట్టబడెను. మొదటి తమిళ నిఘంటువు క్రీ.శ. 1679లో అచ్చయ్యెను. మొదటి అచ్చుపుస్తకాలు క్రైస్తవుల బైబిలు గ్రంథాలే. మన తెనుగులో క్రీ.శ. 1800 ప్రాంతములో అచ్చు మొదలయ్యెను. కాని 1860 తర్వాతనే దానికి వ్యాప్తి కలిగెను. బ్రౌను అను ఇంగ్లీషు పండితుడు ఇంగ్లీషు తెనుగు నిఘంటువును రచించెను. అతడు వేమన పద్యాలను ఇంగ్లీషులోనికి అనువదించెను. తెనుగులో తాతాచార్యుల కథలు అను పుస్తకాన్ని వ్రాసెను. అతడు తెనుగు తాటాకు పుస్తకాలను తెప్పించి మద్రాసులో ప్రాచ్య లిఖిత పుస్తకాగారములో నుంచెను. మెకంజీ అను

మరొక ఇంగ్లీషువాడు 1788 నుండి 1820 ప్రాంతము వఱకు మద్రాసులో ఇంజనీయరుగా నుండెను. అతడు తెనుగుదేశములోని చారిత్రక గాథలను అన్నింటిని వ్రాయించి "కైఫియత్తులు" సమకూర్చి అదే లిఖిత పుస్తకాగారములో నుంచెను. నేటికిని అవి అమూల్యమైనవి. కాని వాటిని ముద్రించు ఆలోచన ఎవ్వరున్నూ చేయనందున అవి శిథిలమై పోతున్నవి. యూరోపు నుండి మన దేశమునకు వచ్చిన మిషనరీలకు మనము చాలా ఋణపడియున్నాము. వారు మన దక్షిణ భాషలలోని ఆటవిక భాషలకు గూడ వ్యాకరణాలు వ్రాసి ఆ భాషలలో క్రైస్తవమత పుస్తకాలను రచించి అచ్చువేసిరి. క్రీ.శ. 1856లో కాల్డ్వెల్ అను ఇంగ్లీషు పండితుడు తెనుగు, తమిళము, కన్నడము, మళయాళము మున్నగు దాక్షిణాత్య ద్రావిడ భాషల కన్నింటికిని ఒక భాషా శాస్త్రమును రచించి ముద్రించెను. "కురుఖు" అను లిపిలేని ఆటవిక భాషకు డాక్టర్ హెూర్ అనువాడు వ్యాకరణము వ్రాసెను. "మల్తో" అను మరొక భాషకు డ్రొజే అనువాడు వ్యాకరణము వ్రాసెను. గొండి భాషకు విలియం సన్ వ్యాకరణము వ్రాసెను. "కోదు" భాషకు బుషే మొదలగు ముగ్గురు పాశ్చాత్యులు వ్యాకరణములు వ్రాసి బైబిలును ఆ భాషలో ముద్రించిరి. గ్రియర్సన్ అను ఇంగ్లీషువాడు భారతీయ భాషలన్నింటిని గురించి పుస్తకాల సంపుటముల ననేకముగా రచించి ముద్రించెను. (Linguistic survey) మన తెనుగునకు గూడ క్రీ.శ. 1850 ప్రాంతములో ఫ్రెంచి మిషనరీలు నిఘంటువును, వ్యాకరణమును వ్రాసిరి. క్రీ.శ. 1807లో తెనుగు వ్యాకరణమొకటి అచ్చయ్యెను. ఈ విధంగా ఇంగ్లీషు, ఫ్రెంచి, పోర్చుగీసువారు మన ద్రావిడ భాషలకు చేసిన సేవలో దశాంశమైనను నేటికిని మనము చేయలేదు.

ఇంగ్లీషువారు మన దేశమును జయించి మనల బానిసలనుగా చేసి రాజకీయముగా, ఆర్థికముగా పతితులనుగా జేసిరి. కాని మన సారస్వతానికి వారు అపారముగా ఉపకారము చేసినవారైరి.

ఒక వేయి యేండ్ల నుండి మనము వ్రాసిన పురాణాలనే వ్రాస్తూ, వర్ణించిన శృంగారాన్నే మళ్ళీ మళ్ళీ వర్ణిస్తూ, వ్రాసిన పద్యాలనే వ్రాస్తూ ఉండిన వారము. మనలో గొప్ప మార్పును ఇంగ్లీషు వాఙ్మయము కలిగించెను. ఇంగ్లీషు విద్య దేశమందు వ్యాపించిన కొలది మనలో మార్పులు కలిగెను. తత్ఫలితముగా వచనములు, నవలలు, నాటకాలు, సైన్సులు, చరిత్రలు, భూగోళము, చిన్న కథలు, ఖండకావ్యాలు, గేయములు,

కొత్త వర్ణనలు, నూత్న విధ విమర్శలు, వ్యాసములు, ఏకాంకికలు, హాస్య రచనలు, పరిశోధనలు, శాసనములు, భాషా శాస్త్రము, వివిధ పత్రికలు, పర భాషా సారస్వతముల భాషాంతరీకరణములు. కుప్ప తెప్పలుగా మనలో బయలుదేరెను. ఇతర దేశ భాషల పరిచయమేగాక, ప్రపంచములో అన్ని భాషల పరిచయము మనకు కలిగెను. ఈ కారణాల చేత మనవారి వేయేండ్ల కృషి ఒక యెత్తు. 1859 నుండి నేటివరకు జరిగిన ఈ నూరేండ్ల కృషి ఒక యెత్తు అనిన అతియోక్తి కానేరదు.

ఆధునిక యుగములో కలిగిన మార్పులు సూక్ష్మముగా తెలుపనైనది. ఆ మార్పులకు కారకులైన కవి పండితుల పట్టికలను ఇచ్చుటకు సాధ్యముకాని పని. అందువల్ల క్రీ.శ. 1900 నుండి ఇంతవరకు భాషా సేవ చేసినవారి పేరులు సూచించుటకు వీలు లేదు.

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర అతి సంగ్రహముగా ఇందు సూచితమైనది. ఇందు ఉత్తమ కృతులని సూచించిన వన్నియు సారస్వత ప్రియులు చదువవలెను.

ఖుతుబుషాహీల ఆంధ్ర భాషా పోషణము

గోలకొండ రాజ్యము నేలిన ఖుతుబుషాహీ ప్రభువులు గాఢమైన స్వమతాభిమానులే కాని బహమనీ సుల్తానులవలె పరమత ధ్వంసకులు కారు. రాజ్యకాంక్ష బాగా కలిగినవారే కాని బహమనీలవలె రక్తపిపాసులు కారు. స్వభాషను మాత్రమే వీరు బహమనీలవలె ప్రేమించినవారు. దక్షిణ దేశమందు శిశుప్రాయమై యున్న ఉర్దూకు వీరు అవలంబన మిచ్చి పోషించిరి. ఈ ఖుతుబుషాహీలు స్వయముగా ఉర్దూ కవనమల్లిరి. పైగా తాము విశేషముగా తెలుగు దేశమును పాలించిన వారగుటచేత తెలుగును కూడా పోషించిరి. తమ సనదులను పార్సీలో వ్రాయించి యిచ్చుచు ఆ విషయములనే తెలుగులో వ్రాయించి ఇచ్చిరి. తెనుగు మండలములలో తెనుగు ద్వారానే రాజ్య వ్యవహారములను సాగించిరి.

మొదటి ఖుతుబుషా చిన్న కుమారుడును మూడవ గోల్కొండ సుల్తాను అగు ఇబ్రహీం ఖుతుబుషా ఏడేండ్లపాటు విజయనగరమందుండి తెనుగు బాగా నేర్చుకొనెను. తాను గోలకొండ సుల్తాను అయిన తరువాత విజయనగరమును నాశనము చేయుటకు ముఖ్య కారకుడయ్యెను. విజయనగర చక్రవర్తియగు అళియ రామరాజుకు దత్తపుత్రుడుగా స్వయంగా ఏర్పడిన అహమద్‌నగర్ సుల్తాను అగు అలీ ఆదిల్షాయును రామరాజుచే ఏడేండ్లు స్వపుత్రునివలె రక్షింపబడిన గోలకొండ ఇబ్రహీమును రామరాజును తళ్ళికోట యుద్ధములో చంపి విజయనగరమును భస్మము చేసి తుంగభద్రలో కడిగి వేసిరి. ప్రపంచంలో కని వినీ ఎరుగని ఉపకారమంటే ఇదొక్కటే యుండవచ్చును. ఈ విధంగా ఇబ్రహీము ఆంధ్రులకు క్షమింపరాని అపకారము చేసినను అతని కొద్దిపాటి తిరిపపు ఆదరణమును మాత్రము ఆంధ్రులు మరువ లేకపోయిరి. ఇదింకొక విచిత్రమగు కృతజ్ఞత. ఇబ్రహీం పేరునే మార్చి ఇభరాముసు చేసిరి. అతడు ఆంధ్రుల కందరికీ అభిరాముడయ్యెను.

"మల్కిభరాముడు' ఆంధ్రమును బాగా ఎరిగి యుండెను. సలక్షణముగా మాట్లాడుచుండెను. కవుల శ్రావ్యమగు కవితా ధారా సుధారసమును కుత్తుక బంటిగా గ్రోలెను. తన్మయుడై తల ఆడించెను. ఆవేశపరుడై అడ్డా దిడ్డగా తెనుగు కవనమును స్వయముగా అల్లెను. రమ్ము పొమ్మని కవులతో సరసమాడెను. అద్దంకి గంగాధర కవిని పిలిపించి తపతీ సంవరణోపాఖ్యానమును వ్రాయించి కృతినందెను. అల్లాకాని రసులల్లా కాని ఇబ్రహీం సుల్తానును రక్షించి పోషించుగాక అని అద్దంకి దీవించలేదు. "శౌరి ఘనుడై కరుణారసవృష్టిచే నిరాయాసత బ్రోచుగావుత నృపాగ్ర... మాల్కిభరాము శాందిపున్" అని దీవించెను. ఇబ్రహీము అందులకు సంతసించి గంగాధరునితో నిట్లనెను.

"పెక్కు కృతుల్ చమత్కృతులు బెంపుగ నందితిగాని స
మ్యక్కృతి కన్యపైగల మమత్వము... వర్తింపదు"

ఇట్లని తపతీ సంవరణోపాఖ్యానమను పౌరాణిక గాథను కృతి పొందెను. సుల్తాను ఆంధ్రభాషను పోషించినది చూచి అతని సేనలో గొప్పయధికారియై యుండిన అమీన్ ఖాన్ గూడ ఒక కృతిని అందెను.

పొన్నగంటి తెలగనార్యుడు యయాతి చరిత్రము అను అచ్చతెనుగు కావ్యమును రచించి అమీన్‌ఖానున కంకితమిచ్చెను. తెనుగు వాఙ్మయములో ఇదే మొదటి అచ్చ తెనుగుకృతి. అమీన్‌ఖాను కూడ మంచి సరసుడు. ఎన్నియో తరాల నుండి గోలకొండకు 20 మైళ్ళ దూరములోనున్న పొట్ల చెరువులో అతని పూర్వీకులు నివసించియుండిరి. అతని కుటుంబము హిందువులను ప్రేమించి ఆదరించుచుండెను. అతడు చిన్న దర్బారు చేసి "దీవులేలు బలియులు రౌతుల్ మొదల్గా దను గొలువన్ సంతసమంది కబ్బములు పేర్కొవించు" ఆనందించుచుండెడివాడు. అతనికి ముఖ్య సచివుడు మరింగంటి అప్పన్న అను ఆంధ్రుడు. అమీన్‌ఖాను ఏమాత్రమున్నూ మతద్వేష మేకోశములోను లేనివాడు. పైగా హిందువులను తనవారివలె ప్రేమించువాడు.

"కడక నమీనుఖానుడు జగంబు తనుం బొగడంగ వేడ్కతో
విడువక యెప్పుడుం బుడమి వేల్పుల బిడ్డల పెండ్లిచేయు".

అమీనుఖానునికి ముగ్గురు భార్యలు. అందరును ఉత్తమ పతివ్రతలు. పొట్లచెరువులోని జనులందరికిని చల్లని తల్లులు. అందు బడేబీబీ అను పెద్ద భార్య సాక్షాత్తు అన్నపూర్ణాదేవియే!

"అత్తవారిండ్లకు నరుగు కన్నియలకు
కట్నంబు లిచ్చుచు గారవించు,
ప్రొద్దు ప్రొద్దుననె యెప్పుడు లేచి వాడల
పసి బిడ్డలకునెల్ల పాలుబోయు,
ఆ కొన్న వారల కద్దమి రేయైన
ఆరగించబెట్టు నరసి యరసి
పాలునీరెనసిన బాగుగా పెనిమిటి
తలపులో మెలకువ మెలగ నేర్చు

ఔర తన పుట్టినింటికి నత్తవారి
యింటికిని వన్నెదెచ్చిన తుంటవిల్తు
తల్లివంటి బడేబీబీ దరమె పొగడ
తమ్మి పూమీద నెలకొన్న దంటకైన"

ఒక ముసల్మాన్ స్త్రీ ఆ కాలములో హిందువులపై అంతటి, ఇంతటి అభిమానము చూపుట అసామాన్యమైన విశిష్టగుణమనవలెను.

అంతకు నూరేండ్ల క్రిందటనే బహమనీ సుల్తాను ఒక్క ముసల్మాను ప్రాణానికి ఒక లక్ష హిందువుల ప్రాణాలను తీసుకుంటాను, ఇదే మా మతాచారము అని చెప్పియుండెను. మహమూదుషా బహమనీ ఒక లక్ష హిందువులను చంపేవరకు అన్నము తినక పోయెను. అట్టి కాలములో అమీన్‌ఖాన్, అతని భార్యయు హిందువులను ప్రేమించినారంటే అది చాలా గొప్ప విషయము. అమీన్‌ఖాను బహుభాషావేత్త, అతని తమ్ముడు.

"అరబీ, పారసీ, గుజరాతీ, ఆరే, అచ్చ తెలుగు, కన్నోజి మొదలుగా గలవి తెలిసి వ్రాయదారి కన్నట్టి వాడు గతాత ఖాను". ఇతడు,

"యిభరము శాహు చేపట్టె యనుంగుగా
నడుపబాయక మూడు తరాల నుండి కన్పట్టు అమీనుఖానుడు"

ఖుతుబుషా వంశము వారు తెనుగు దేశములో చెరువులు కట్టించిరి. అనేక గ్రామాలను నిర్మించిరి. ఇతర ప్రాంతాల నుండి సమర్థులను పిలిపించి, వారికి జాగీరులిచ్చి క్రొత్త గ్రామాలను స్థాపింపచేసిరి. అట్టివారిలో దోమకొండ ప్రభువుల పూర్వీకులు ముఖ్యులు. రాజా మల్లారెడ్డి తన 'శివ ధర్మోత్తరమున' నిట్లు వ్రాసుకొనెను.

"ఘనుడా కాచనృపాల శేఖరుడు మున్ కర్ణాట రాజ్యంబు నం
దున దుర్గాధిపతిత్వ వైభవముతోడ్తో కాంచి సుల్తాను పి
ల్పున కృష్ణానది దాటి యా, మెదకు, బల్ దుర్గంబు క్రిందన్ జిరం
తనమౌ బిక్కనవోలునుండె నవి యాత్మస్థాన రాజంబుగన్".

ఈ సంఘటన ఇబ్రహీం తర్వాతి వాడగు మహమ్మద్ కుతుబుషా కాలంలో అనగా 1612 క్రీ.శ.లోని మాట. ఆ మహమ్మద్ ఖుతుబుషా దోమకొండ పూర్వ ప్రభువులను చాలా గౌరవించెను.

"భవ్య సులతాను మహమదు పాదుషాహో
లబ్ధ భూషణ లలిత పల్యంకితాత
పత్ర చామర సామ్రాజ్య భరిత విభవ
రమ్య గుణశాలి శ్రీ కామరడ్డి మౌళి".

రాజా మల్లారెడ్డి గొప్ప కవి. సంస్కృతాంధ్రములందు అద్వితీయ పాండితీ ప్రతిభను తన కవనమందు ప్రకాశింపజేసినాడు. అతడొక చాటువులో తాను ఖుతుబుషా ప్రభువుల కాస్థాన కవినని చెప్పుకొనెను. మల్లారెడ్డి సమకాలికుడైన గణనాథ కవి యను నతడు గొప్ప "సత్కవి" యనియు, అతని తండ్రి పండిత వరేణ్యుడనియు మల్లారెడ్డి తన పద్మ పురాణములో వ్రాసినాడు. అట్టి గణనాథ కవి ఖుతుబుషా (అనగా 1617లో) ఆస్థాన కవిగా నుండెననియు తెలిపియున్నాడు.

"ధీనిధి, సాహితీయుతు, ప్రతీతయశున్ కుతుపావనీశ్వరా
స్థాన మహాకవీంద్రు, నిజ దర్శన కౌతుక వైభవాగతున్
శ్రీ నరసింహ పండిత వరేణ్యకుమారు గణేశధీరు స
మ్మానముతో నెదుర్కొని నమస్కృతి జేసి వసింప జేయుచున్"

ఇట్టి "మహా కవీంద్రుడైన" గణనాథ కవిని గురించి మనకింతకంటే ఎక్కువగా తెలియకపోవుట సంతాపకరము. అతడు "కుతుపావనీశ్వరాస్థాన కవీంద్రుడు". కాని

అతని గురించి మనమేమియు నెరుగజాలకున్నాము. మల్లారెడ్డి పుణ్యాన అతని పేరైన మనకు తెలిసినది. ఇదే మహమ్మద్ ఖుతుబుషా కాలములో గోలకొండ దుర్గములోనే సారంగుతమ్మయ అను గొప్ప కవియుండెను. అతడు సుల్తాన్ ఆశ్రయము కలిగినవాడేయని తానే తన వైజయంతీ విలాసములో ఇట్లు వ్రాసుకొనెను.

"ఇనసమతేజు తా నృపులనెల్ల మహమ్మదు షాహి యేలు నీ
యెనుబది నాల్గు దుర్గముల నేలిన యేలిక గోలకొండ, త
ద్ఘన నగరస్థలిన్ కరణికం బొనరించెడు తమ్మమంత్రి, యా
జనపతి రమ్ము పొమ్మన ప్రజల్ జయవెట్ట గృహస్థు తాననన్"

గోలకొండ నగరానికి సారంగుతమ్మయ్య కరణము కావున పాదుషాకీతనితో పనిబడుచుండెను. అట్లున్నను తమ్మయ్య తన దైవభక్తిచే తన కావ్యాన్ని శ్రీరామార్పణము చేసెను.

కందుకూరి రుద్రకవి వంశములో చాలామంది రుద్రకవి నామములుండిరని అందొక రుద్రకవి మల్కిభరాము (ఖుతుబుషా)చే 1480 శా.శ.లో రెంటచింతల పాలెము అను నగ్రహారమును పొందెదనియు వంగూరు సుబ్బారావుగారు శతక కవుల చరిత్రలో వ్రాసినారు. శ్రీ వంగూరి సుబ్బారావుగారు అదే చరిత్రలో మరొక చోట నిట్లు వ్రాసినారు –

ఏనుగు పెద లక్ష్మణకవి తన తుల్యామాహత్మ్యములో తన కృతిపతియగు వత్సవాయి తిమ్మరాజు పుత్రుడగు రాయ జగపతిరాజును గూర్చి యిట్లు వ్రాసెను.

"సుల్తానబ్దుల్ హసన్ కోటీశ్వరుని చేత మాటిమాటికి బహుమానమందె మరియు పింగలి మాదన్న భానుజీ మంత్రజ్ఞువలన సన్మానమందె అక్కన్న మొదలైన యట్టి పెద్దలచేత మేలు భూషణములు మెప్పులందె"

అక్కన్న మాదన్నలు సేవించినది అబ్దుల్ హసన్ పాదుషాను కాదు. వారు సేవించినది అబుల్ హసన్ తానీషాను. దీనిని బట్టి కుతుబుషాల సామంతులును తెనుగును బాగుగా పోషించినట్లు నిదర్శనములు కనబడుచున్నవి.

కంచెర్ల గోపన్న అక్కన్న మాదన్నల మేనల్లుడని ప్రతీతి. భద్రాచల ప్రాంతమందలి నేలకొండపల్లి గ్రామనివాసి. అతడే ప్రసిద్ధ రామదాసు. అతడు గొప్ప కవి. రామభక్తుడు. భద్రాచల తహసీల్దారుగా నియుక్తుడై వసూలైన పన్నును దేవాలయానికి వినియోగించి బందీకృతుడయ్యెను.

అబుల్ హసన్ తానీషాకు మంత్రి అక్కన్న. అతడే ఈ దక్కన్ రాజ్యములోని తుది ఆంధ్ర మంత్రి. నాటి నేటివరకు మరల ఆంధ్రులు తలయెత్తలేదు. అక్కన్న మాదన్నలు తెనాలి రామలింగడు అను కమసాలి వ్రాసిన ధీరజనమనో విరాజితము అను తెనుగు కృతికి కృతిపతులైరి. ఆ గ్రంథ మందలి మొదటి రెండు పద్యాలిట్లున్నవి.

శ్రీరమ్యార్థి కళావతంస పద రాజీవార్చనాసక్తు లు
ర్వీరామాధిప కార్య సంఘటన ప్రావీణ్యాధికారుల్ మహా
పారావార గభీరు లాశ్రిత జన వ్రాతావనుల్ సంతతో
దారుల్ యక్కన మాదనాహ్వయులు తత్త్వజ్ఞాన సంపూర్ణులై.

అందనుజన్ముడు మాదన

చందన మందార కీర్తి సంశోభితుడై పొందున సగ్రజుతో నిం
పొందగ తగురీతి పల్కె నురువాక్యములన్

ఈ విధముగా మనకు కుతుబుషా కాలములో సుల్తానుల ఆదరములో వెలసిన ఆంధ్ర కృతులను గురించి కొంతవరకు తెలియవచ్చినది. ఇబ్రహీం కాలము నుండి తానీషా కాలమువరకును గోలకొండ నేలిన సుల్తానులు తెలుగువారిని ఆదరించిరి. తెనుగుభాషను పోషించి, తెనుగు స్త్రీలను పెండ్లాడిరి. తెనుగు స్త్రీలలో ఉంపుడు గత్తెల నుంచుకొనిరి. వారిలో భాగ్యమతి, ప్రేమావతి, తారామతి అనువారు ప్రసిద్ధులు. భాగీరథి అను స్త్రీ ఒక సుల్తాను పట్టపు భార్యయై యుండెను.

కుతుబ్షాకాలమునకు ముందు దేశభాషలపై ముసల్మాను ప్రభువుల కాదరణ లేకుండెను. వారి తరువాత ఏర్పడిన ఆసఫ్జాహి వంశము వారును "ముల్కీ" భాషలకు ఏ మాత్రమును ప్రోత్సాహమును కలిగించినవారు కారు. తెనుగు మంత్రులు, తెనుగు సుబేదారులు, తెనుగు సేనానులు కూడా కుతుబ్షాల అనంతరము ఎక్కడా కూడా లేకపోయిరి. ఇప్పుడు నిజాము రాష్ట్రములోని విద్యావిధానములో తెనుగు దిక్కులేనిదై క్షయమందుచున్నది. ఇది పూర్వాపర సంబంధములతో పరికించిన కుతుబుషాలకు ఈ విషయములో ధన్యవాదములు సమర్పించుకొనుట కృతజ్ఞతా విధియై యున్నది.

తెలుగు వాఙ్మయంలో హాస్యరసము

నవరసములలో హాస్యరసమొకటియని భరతుని కాలమునుండియు ఆలంకారికులందరున్నూ అంగీకరించినారు. హాస్యమన నేమియో అందరెఱుగుదురు.

"సచ వికృతపరవేషాలంకార దార్ష్య లౌల్య కుహకాసత్ప్రలాప వ్యంగ్య దర్శన దోషోదాహరణాదిభిర్విభావై రుత్పద్యతే". అది ఆరువిధాలు. 1. స్మితం, 2. హసితం, 3. విహసితం, 4. ఉపహసితం, 5. అపహసితం 6. అతిహసితం అని ఇతరులను అనుసరించుట, వికృతముగా నాచరించుట, వ్యంగ్యముగా సంభాషించుట, పరదోషముల హేళనము చేయుట ఇట్టివన్నియు హాస్యమనబడును.

సంస్కృత వాఙ్మయములోనే హాస్యరసము తక్కువ. అది కావ్యాలలో పరిశోధించితే కాని కనబడదు. నాటకాలలో హాస్యానికిగాను విదూషకుని ప్రత్యేకముగా సృష్టించిరి. కాని వాడెల్లప్పుడును తిండిపోతు బాపడై యుండెను. భాణములలో హాస్యమును ప్రధానముగా పోషించదలచిరి. కాని యదంతయు పచ్చి బూతుల పంచాంగముగా పరిణమించెను. చాటువులలోను బూతులను వదలితే మిగిలిన హాస్యము తక్కువే.

ఇదే మర్యాద తెనుగునకునూ వర్తించునని స్థూలముగా చెప్పవచ్చును. తెనుగు ప్రబంధాలలోను పురాణాలలోను హాస్యము చాలా తక్కువ. నాటకాలు నిన్న మొన్నటివరకు లేకపోయెను. వాటికి బదులుగా శతకాలు వ్రాసిరి. అందులో కొన్నిటియందు హాస్యరసము కనబడుచున్నది. చాటువులలోనే యెక్కువగా హాస్యరసము నిండియున్నది.

హాస్యానికి తెనుగువారు ప్రసిద్ధి. తెనాలి రామలింగడు జగద్విఖ్యాతుడు. మర్యాద రామన్న కూడా తెనుగువాడేమో? అక్బరు చక్రవర్తి విదూషకుడై యుండిన వీరబలుడు

(బీర్బల్) గోదావరి డెల్టాలో పుట్టి పెరిగిన తెనుగువాడని చాలామందికి తెలియనే తెలియదు. ఇట్లుండినను తెలుగు సాహిత్యములో హాస్యసము విరివిగా కానరాకుండుట యెందులకు? పలువురు తెనుగు విద్వాంసులు హాస్యమంటే పచ్చి శృంగారమని భాణములను చూచి భ్రమపడిరి. అందుచేతనే తెనుగు సాహిత్యములో శృంగారాతిశయ వర్ణనలందును, జుగుప్సా వర్ణనలందును హాస్యమును సాధింపజూచినారు.

శతక వాఙ్మయములో హాస్యము కొంతవరకు కనపడుతున్నది. చంద్రశేఖర శతకము ముఖ్యముగా పేర్కొనదగినది. కాని దాని కర్త యెవరో తెలియదు. భాష నెల్లూరి యాస. రామలింగేశ శతకములోను, కుక్కటేశ్వర శతకములోను కొన్ని మంచి భాగాలు కలవు. వేణుగోపాల శతకము బాగున్నది. కాని తత్కర్త తిట్టనిది నవ్వింపలేదు. కవి చౌడప్ప సరేసరి. పుస్తకమంతా బూతుల బుంగయే. భాషీయ దండకము 200 ఏండ్ల నాటిది. కర్నూలు జిల్లా భాష అందు కలదు. అది బాగానే యున్నది.

ఇక పురాణ ప్రబంధాలను గురించి విచారింతము. పురాణాలు సంస్కృతము నుండి పరివర్తనము చేయబడినట్టి ఇతిహాసాదికములు. అందు హాస్య రసమునకు తావు లేదు. అయినను మన తెనుగు భారతములో అందందు మూలములో లేనట్టి హాస్య రసమును తిక్కన సోమయాజిగారు పోషించినారు. కీచకుని చంపుటకై ద్రౌపదికి మారుగా నర్తనశాలలో చీకటిలో భీముడు కాచుకొనియున్నాడు. కీచకుడు కామావేశముతో ద్రౌపదియే అందు కలదని తన కామ వికారమును ప్రకటించుకొనును. అప్పుడు భీముడిట్లనును.

ఇట్టివాడవు కావున నీవు నిన్ను
బొగడికొనదగు నకట నా పోల్కియాడు
దాని వెదకియు నెయ్యడనైన నీకు
బడయ వచ్చునె యెఱుగక పలికితిట్లు.

నా యొడలు సేర్చి నప్పుడ
నీ యొడ లెట్లగునొ దాని నీ వెరిగెదు న
న్నే యబలల తోడిదిగా
జేయదలంచితివి తప్పు సేసితి గంటే.

నను ముట్టి నీవు వెండియు
వనితల సంగతికి బోవు వాడవె యైనం
దను వేఁ బడసినఫలమే
కనియెద విదె చిత్తభవ వికారములెల్లన్.

కీచకుని దౌర్జన్యమును విరాటుని సభలో ద్రౌపది చెప్పుకొనినను ఎవ్వరున్నూ వినలేదు. ధర్మరాజు ఆమెతో నీవేమి నాట్యకత్తెవా? ఇకపో అని మందలింపగా ద్రౌపది నర్మోక్తిగా నిట్లు పలికెను.

"నాదు వల్లభుండు నటుడింత నిక్కంబు
పెద్దవారి యట్ల పిన్నవారు
గాన పతుల విధమకాక యే శైలూషి
గానసంగ రాదు కంకభట్ట.

అట్లగుటం జేసి నాకు నాట్యంబులునుం బరిచితంబ, మత్పతి శైలూషుండ కాడు. కితవుండునుం గావున జూదరియాలికి గరువతనం బెక్కుడిది".

ఇదంతయూ గూడ మూలములో లేనట్టిది. శ్రీకృష్ణరాయబారమప్పుడు కృష్ణుడు భీమునితో సరసమాడుట, ద్రోణుని భీముడాక్షేపించుట, కర్ణుడు భీముని నిందించుట, ఇట్టి ఘట్టములు భారతములోపలుతావుల కాననగును. నాచన సోముడు ఊర్వశీ నరకాసురుల సంభాషణమందును, హంస డింభకోపాఖ్యాన మందును హాస్యరసమును చాలా యుత్కృష్టముగా పోషించినాడు. తెనాలి రామకృష్ణుని నిగమశర్మోపాఖ్యానములో హాస్యపుజాడ కానవచ్చును. గౌరన తన హరిశ్చంద్రలో కాలకౌశికుడు, వీరబాహువు, నక్షత్రకుడు అనుపాత్రల పోషించునప్పుడు హాస్యమును ప్రదర్శించినాడు. హరిశ్చంద్రుని వీరబాహు విట్లు వెక్కిరించెను.

"………. ఈ రాజు
సుకవాసి, పని పంద, చూపు గుబ్బంబు
మామిడి క్రింది సోమరి, మేదకుండు
బూమె తుంటరి, ఎనుబోతుపైన వాన,
మొండరి, చల్లచప్పుడు, గోడ చేఁప్ప
చండిపోతు నట్టి జాడనున్నాడు -

ఇట్టి శబ్ద చిత్రములు కొంతవఱకు పాలకుర్కి సోమనాథునిలో కూడ కనబడుచున్నవి. చేమకూర వెంకటకవి రెండు కావ్యాలలోను కొంతవరకు హాస్యము స్ఫురించుచున్నది. కదిరీపతి తన శుకసప్తతిలో తేలికయగు హాస్యమును గ్రంథమంతటను నింపియుండుటచేత దానికి తెనుగు సాహిత్యములో ఒక విశిష్టత యేర్పడుచున్నది. రంకు కథలు కాకుండినచో శుకసప్తతి తెనుగు వాఙ్మయములో అగ్రస్థానము వహించి యుండెడిది. శ్రీనాథునిలో అందందు హాస్యము కానవచ్చును. కాని విశేష భాగము పచ్చి శృంగారమే. బువ్వపు బంతి మున్నగు శృంగార నైషధ ఘట్టములట్టివే, వల్లభరాయని క్రీడాభిరామములోను ఇదే అవస్థ, కోళ్ళ పందెములోను, పొట్టేళ్ళ పందెములోను చచ్చినవాటికై కవి విలపించి శ్రోతల నవ్వించిన భాగాలు అందముగా నున్నవి.

జగ్గకవి తన చంద్రరేఖా విలాపమును హాస్యరస ప్రబంధరాజము అని వర్ణించుకొనెను. కాని గ్రంథమంతయు పచ్చిబూతులతో నిండినది,

నీతులకేమి యొకించుక
బూతాడక దొరకునవ్వు పుట్టదు ధరలో

అన్న కవిచౌడప్ప ఇతని కాదర్శకవిగా కనబడుచున్నాడు. కాని

పదినీతులు పదిబూతులు
పది శృంగారములు గల్గు పద్యములు

చౌడప్ప వ్రాసెను. ఇందునీతులే లేవు. అందుచేత అచ్చన బుచ్చనలోపల అచ్చనయే మేలు అన్నట్లు చౌడప్పయే మేలు రకమువాడు.

ఇక మరొక్కని గూర్చి ప్రశంసింపవలసి యున్నది. అతడు వేమన. అతని పద్యాలలో నీతులును, హాస్యమున్నూ మేళవించి యున్నవి. అతని పద్యాలలోనూ కొన్ని బూతుపద్యాలు ఉన్నవి. అట్టివి అతని పేరుతో స్వార్థులు రచించినట్లున్నది. చాటువులలో మంచి హాస్యమున్నది. హాస్యరసమును గ్రోలదలచిన వారు చాటువులను చదువవలయును కొన్ని యుదహరింతును –

లంక పొగాకును తెచ్చియు
పొంకముగా సున్నమేసి పొడిచేసిరయా

పంకజనాభుడు నూరెను
శంకరుడది పీల్చి పీల్చి శాభాస్ అనియెన్॥,

మంచిదినమునాడు మంగలి దొరకక
చంద్రశేఖరుండు జడలు దాల్చె
కొండియేమొ కట్టె గోపాలదేవుండు
బ్రహ్మదేవుడెన్ని పాట్లు పడెనొ!

శివుడద్రిని శయనించుట
రవిచంద్రులు మింటనుంట రాజీవాక్షుం
డవిరళముగ శేషునిపై
పవళించుట నల్లిబాధపడలేక సుమీ॥

చాకివానిచేత జగడాలు పడలేక
సిరిగలాడు పట్టుచీర కట్టె
శివుడు తోలుకప్పె సీ! యని మదిరోసి
భైరవుండు చీర పారవైచె.

అన్యాపదేశ పదములను చేర్చి చమత్కరించుట ఒక హాస్యము. హైదరాబాదు అగ్రహారికుడు తన అగ్రహార స్థితిని జంగలాత్ అధికారికి తౌరక్యాంధ్ర సంస్కృత భాషల సమ్మేళనముతో కూడిన శ్లోకాలతో ఇట్లు మనవి చేసుకొనెను.

ఫలం లేదు మజ్కూర్ కలం బందుహోల్ సాల్
అలంమోదగాకుల్ క్వచిత్ టేకుమాకుల్
అవుర్‌కోయ కొంపల్ మరీమాల కొంపల్
హయేముళ్ళ కంపల్ హమారే గ్రహారే.

తుమారా జవానుల్ హమారే గ్రహారే
కదాపీహిదంగా సజా చేయకుండన్
హుకుందీయతాం నౌహకం చాపిదద్యాత్
ఖుదాతే ముదేస్తాత్ సదాజంగలీశ॥

ఆధునిక వాఙ్మయములో వచనములోను నాటకాలలోను హాస్యరసమును ప్రధానముగా పోషించినవారు పలువురు కలరు. వీరేశలింగంగారి ప్రహసనాలు సాధారణమైనవే. చిలకమర్తివారు తమవి ప్రహసనాలని చెప్పినందున తెలియవచ్చినవి. పానుగంటి వారి సాక్షి ఒక భాగము చదివితే వారి రచనలన్నీ చదివినట్లే. బారిష్టర్ పార్వతీశం ఉత్తమోత్తమ హాస్యరస గ్రంథరాజము. కాని అది నేటికి అసంపూర్తిగానే ఉన్నది. మునిమాణిక్యాంగొరక్కరే గృహజీవనమును లలిత హాస్యముతో వర్ణించినారు. వేంకటరాయశాస్త్రిగారి ప్రతాపరుద్రీయము అద్భుత హాస్య రస ప్రపూరితము. ధర్మవరం కృష్ణమాచార్యులందందు హాస్య రంగములను రచించిరి. ఇటీవల మల్లాది అవధానిగారు హాస్యరచనల రచించిరి. కాని తల్లితో వసంత మాడినట్లు వారు గుడిపాటివారి వలె పురాణ పురుషులను అవహేళనము చేయజూచిరి. భమిడిపాటి కామేశ్వరరావుగారి రచనలలో హాస్యమున్నది. వ్యావహారిక భాషా మకుటమగు కన్యాశుల్కాన్ని ఎవరున్నూ మరువకూడదు – కాని ఇంగ్లీషు డొక్కశుద్ధి కలవారే దాన్ని ఆనందించగలుగుతారు. గిరీశాన్ని, పేరిగానిని, యెంకిని, కాంతమ్మను, జంఘాలశాస్త్రిని, పార్వతీశాన్ని, కిన్నెరసానిని సృష్టించి ఆంధ్రులను ఆనందసాగర తరంగములపై ఓలలాడించిన కవి కుమారులు అపారమగు భాషాసేవ చేసినట్టి సిద్ధహస్తులు; అయినను ఆధునికాంధ్ర వాఙ్మయములో హాస్యరసము ఇంకా ప్రారంభ దశలోనే యున్నదని చెప్పవలెను.

బాల వాఙ్మయం

నేడు అన్ని దేశములలో బాల వాఙ్మయమునకు ప్రాధాన్యమియ్యబడుతున్నది. 'బాల వాఙ్మయమే దేశాభివృద్ధికి పునాది' అని గ్రహించినారు. కొన్ని దేశములీ విషయమున చాలా వెనుకబడి యున్నవి. అట్టి దేశాలలో మన ఇండియా చేరినదనవలెను.

ప్రాచీన కాలములో హిందువులు, బౌద్ధులు బాల వాఙ్మయముపై కృషి బాగా చేసినట్లు కానవస్తున్నది. పిల్లలకు ముఖ్యమైనవి కథలు, బొమ్మలు. బొమ్మలతో కథలు చూపించి నిరూపించుట అత్యంత శ్రేష్టమగు పద్ధతి. మన ప్రాచీన శిల్పములన్నియు ఈ విధానమునకు తోడ్పడుచుండిన ప్రతి దేవతా స్థానములో స్తంభములమీద గోడలమీద, కప్పుపైనా, గోపురములలోన పౌరాణిక కథలు బొమ్మలుగా చెక్కబడు చుండెను. కొన్ని తావులలో రంగులతో చిత్రింపబడుచుండిన చదువురాని వారు సహితము ఆ బొమ్మలను చూచి ఇవి బౌద్ధుల కథలు, ఇవి కృష్ణలీలలు, ఇవి పాండవుల కథలు, ఇవి రామాయణ ఘట్టములు అని ఒకరికొకరు చూపుకొని, చెప్పుకొని చెప్పుకొని ఆనందించెడివారు. బౌద్ధ మత వ్యాప్తి కాలములో బౌద్ధ జాతక కథలను శిల్పములలో నిరూపించిరి. అజంతా, ఎల్లోరా, అమరావతి, మధురా, తంజావూరు, లేపాక్షి, శుచీంద్రము వంటి నూర్లకొలది దేవస్థానములలో పౌరాణిక గాథలను శిలలపై చెక్కిరి; గచ్చుతో చేసిరి, చిత్రించిరి.

ఆంధ్ర కర్ణాటక దేశాలలో 'తోలు బొమ్మలాటలు" అనునవి ఇంచుమించు 1000 ఏండ్ల నుండి ప్రచారములో నుండినట్లు మన కాధారాలు కానవస్తున్నవి. అంతకన్న పూర్వమెప్పుడు ప్రారంభమయ్యెనో తెలియదు. తోలు బొమ్మల మూలాన కూడ పురాణ కథలను చక్కగా గ్రహించుచుండిరి.

మన పురాణాలలో జంతువుల కథలు, బాలుర కథలు బహు సుందరముగా వ్రాయబడినవి. (ధృవ చరిత్ర, ప్రహ్లాద చరిత్ర, చిరకారి చరిత్ర మొదలైన వానిని మన బాలురందరెరుగుదురు. జంతువులు మాట్లాడినట్లు, మనుష్యులవలె వర్తించునట్లు నీతి కథలు వ్రాయుటకు ప్రారంభించిన వారు హిందువులేనని పాశ్చాత్య పరిశోధకు లంగీకరిస్తున్నారు. అట్టి కథలలో పంచతంత్రము జగద్విఖ్యాతి కాంచినది. దానిని ఇంచుమించు ప్రాశ్చాత్య భాషలన్నింటిలో అనువదించారు. క్రీస్తుశకము ఆరవ శతకమందే దానిని పార్శిలోనికి "అన్వారస్సు హేలీ" అను పేరుతో తర్జుమా చేసిరి. మన కరటకదమనకులే ఫార్శిలోని కలీలా దమాగ్‌లు. హితోపదేశము, బేతాళ పంచవింశతి, కథా సరిత్‌సాగరము, దశకుమార చరిత్ర, సాలభంజిక కథలు, ఇట్టివి కొల్లలుగా మన దేశమందు రచించిరి. ప్రజలలో ఉండిపోయిన కథలు వేలో లక్షలో చెప్పజాలము. పిట్టమ్మా కాకమ్మా కథలు, అవ్వ కథలు విశేషమయ్యెను. అనగనగా ఒక ఊరు, ఒక రాజు అని ప్రారంభించి కథ కంచికి మనమింటికి అని ముగించుట దాక్షిణాత్యుల పరిపాటి.

"పిల్లల పాటలు" అను విభాగము కూడ మనలో సమృద్ధిగా నుండెను. ఆ పాటలలో పెద్దలు కూడ పేర్కొనదగిన విశేషము లిమిడియుండెను. ఏమో అర్థము కాని ప్రాసల మాటలను..... ...... యర్థమే కానవస్తున్నది.

"కొంగ రాజు – కాలు విరిగే
దానికేమి మందు –
వెల్లుల్లిగడ్డ నూనెమ్మ బొడ్డు
నూటొక్క ధర

అనుదానిలో కాలు చేతులు విరిగినప్పుడు చేయవలసిన చికిత్స కలదు.

చెమ్మ చెక్క – చారడేసి బొక్కు

అనువాటిలో మాచకమ్మలకు తగిన మందు తెలపబడినది. ఇటులే చాలా పాటలలో వైద్యపు చిట్కాలిమిడియున్నవి. ఈ వాఙ్మయ భాగము అనాదృతమై విస్మృతమై పోయినది. పునురుద్ధరణము జరుగుతున్నది.

ప్రాశ్చాత్య దేశములలో గ్రిమ్సు ఫెయిరీ కథలు, అండర్సన్ కథలు ప్రసిద్ధములు. ఇంగ్లీషులో ఛార్లస్ డిక్కెన్స్ అను నతడు పిల్లల కథలను రమ్యముగా వ్రాసిన వారిలో ప్రథముడు.

అచ్చుయంత్రము లభివృద్ధియై, ఫోటో బ్లాకులు చేయుట వృద్ధియైన తర్వాత పాశ్చాత్య దేశములలో పిల్లల వాఙ్మయము అపారముగా వృద్ధియయ్యెను. సచిత్రమైన చరిత్రలు భూగోళములు, కథలు, పాటలు, విశేషములు, విచిత్రములు మున్నగు విషయములు అతి సుందరముగా ఆకర్షణీయముగా అతి సులభ భాషలో అర్థమగునట్లు విజ్ఞానము ప్రసాదించునట్లు రచించి ముద్రించిన గ్రంథములు వేలకొలదిగా పెరిగిపోయినవి. యూరపు, అమెరికా బాలురీవిషయములో ధన్యులైనారు. అందు పెద్ద నగరాలలో ప్రత్యేకముగా బాలుర గ్రంథాలయములు, బాలుర పత్రికలు కలవు. అనేక గ్రంథ ప్రకాశక సంస్థలు బయలుదేరి బాలురకు చరిత్ర, భూగోళము సైన్సులు పరిశ్రమలు, దేశ దేశ జనులు, వారి యాచార వ్యవహార విశేషములు, మున్నగు సహస్ర విషయములను తెలుపు ముచ్చటగు గ్రంథములను ప్రచురించారు.

మన పిల్లలకు చరిత్ర భూగోళ ఖగోళములన్న తలనొప్పి కాని ఆ దేశాలలోని గ్రంథములను చూచిన వాటిపై అత్యంత ఆసక్తి ఆనందము జనించును. చరిత్ర తేదీల పంచాంగము కాదనియు భూగోళము పేరుల వరుసకాదనియు స్పష్టమగును.

పట్టు, ప్రత్తి మున్నగునవి ఆదిలో ఏ దేశము వారు కనిపెట్టిరి? ఆ చెట్లు సంఘమున కుపరికరించునట్లు చేసిరి. అన్ని విషయాలు బొమ్మలతో చిన్న చిన్న గ్రంథాలు రచించినారు. మన పట్టభద్రులు ముప్పాతిక మందికి తెలియని విషయాలు కూడా ఆ చిట్టి పొత్తములలో గోచరించును. మన దేశములో సాధారణమైనట్టి బత్తాయ, పప్పాయ, సపోటా వంటి ఫలములు, వేరుశనగ వంటి నూనెగింజలు, మిరపవంటి ఘాటైనవి, పొగాకు వంటి విష వస్తువులు, మన దేశములోనివి కావనియు అవి అమెరికావంటి దేశాలనుండి మన దేశములో 300 ఏండ్లనుండి ప్రవేశపెట్టబడినవని ఎందరెరుగుదురు. అట్టి సహస్రాధిక విషయాలను... సచిత్ర గ్రంథముల నుండి పాశ్చాత్య బాలురు గ్రహించగలుగుతున్నారు.

దీనినిబట్టి తేలిన విషయమేమనగా మనము ఆదిలో బాల వాఙ్మయానికి ప్రపంచానికి దారి చూపినవారము. తుదిలో పాశ్చాత్యుల నుండి మరల నూతనముగా గుణపాఠం నేర్చుకోవలసిన వారమైనాము. పాశ్చాత్య దేశములలో నూటి కించుమించు నూరుమంది చదువుకొన్నారు. మనము నూటికి 15 మందియే చదువుకొన్నవారము. కావున మన మొదటిపని నూటికి నూరుమంది విద్యావంతులగునట్లు కృషిచేయుట

పాశ్చాత్య దేశాలలో ధనికులు తమ ద్రవ్యమును విద్యాభివృద్ధికై వినియోగింతురు. అమెరికాలో ఒక్క హెన్రీ కార్నెజీ అను కోటీశ్వరుడు 5000 గ్రంథాలయములకు భవనములు నిర్మించి వాటి నిండుగా గ్రంథములుంచి అవి చక్కగా నిరంతరాయముగా సాగునేర్పాట్లు చేసెను. అతడొక గ్రంథాలయమునకు మాత్రమే ఇంచుమించు ఏడుకోట్లు రూపాయలిచ్చెను. మన దేశములో ధనికులీవిధముగా సహాయము చేయుట కానరాదు. అందందు కొందరు కొన్ని లక్షలిచ్చినది అతి స్వల్పమగు సేవయే. మూడవది మన జనులలోని భావములు, రుచులు మారవలెను. మంచిదేది చెడ్డదేది గ్రహింపవలెను. ఈనాడు చెత్త పత్రికల కెక్కువ ప్రచారమున్నది. మంచి పత్రికలు బిచ్చమెత్తుకొనుచున్నవి. సినిమా తారల మూడురంగుల బొమ్మలు చూచి తబ్బిబ్బై ఆనంద సాగరములో మునిగి ఉక్కిరిబిక్కిరై ఆ చెత్తను కొనువారే బహుళము. వెర్రిమొర్రి కథలు, దొంగ కథలు వ్రాస్తే వాటికి ప్రచార మెక్కువ.

మన తెలుగులో ఈనాడు బాల, చందమామ వంటి పత్రికలున్నవి. వాటి అనుకరణలు బయలుదేరి అపచారమే చేయుచున్నవి. పై రెండు పత్రికలలో కూడా విజ్ఞానప్రదమైన విషయాలు తక్కువగా కానవస్తున్నవి.

విద్యాశాఖవారు బాల వాఙ్మయము సిద్ధము చేయించి సచిత్రముగా ప్రచురించు టకు కొంత ధనము ప్రత్యేకించి దారిచూపవలెను. మన కేంద్ర ప్రభుత్వ మీ విషయమున శ్రద్ధ కనబరచుచున్నది. కాని ద్రవ్యము మాత్రము ప్రత్యేకించినట్లుగా కానరాదు. హైదరాబాదు ప్రభుత్వము కూడా కేంద్ర ప్రభుత్వాదేశముపై బాల వాఙ్మయ సమితి నేర్పాటు చేసినది. కాని యింతవరకూ వాఙ్మయమునకై ఏమియు ద్రవ్యమును ప్రత్యేకించలేదు.

ఈ అనాదృత వాఙ్మయముపై విద్యావంతుల దృష్టి కేంద్రీకృతము కావలెను.

గేయ వాఙ్మయం

దేశికవిత:

పూర్వములో దేశికవిత ప్రాముఖ్యత వహించి యుండెను. కాని నన్నయ భట్టు నుండి మార్గకవిత స్థిరపడిపోయి దేశికవిత పల్లెలలో పామర జనులలో దాగిపోయెను. మార్గకవిత సంస్కృత మర్యాదలతో రాజుల ఆస్థానములలో మురిసిపోయినది. దానిని పల్లెటూరివారు నేటివరకు కూడ ఆదరింపక శిష్టమ్మన్యులచే అనాదృతమైన ఆదేశి కవితకే ప్రాముఖ్యతనిచ్చిరి. ఈ దేశికవిత పల్లెటూరివారి పాటలలో నేటివరకును నిలిచియున్నది.

అప్పకవి విభజన:

అప్పకవి కావ్యములను ద్వివిధములుగా - ప్రబంధములనియు, చాటుప్రబంధములనియు - విభజించెను. చాటు ప్రబంధములు మరల రెండు విధములట. (1) సంఖ్యా బద్ధములనియు (2) అసంఖ్యా బద్ధములనియు. సంఖ్యాబద్ధములలో ఉదాహరణములు, ముక్తకాదులు చేరినవి. అసంఖ్యా బద్ధములో గద్య, రగడ, ద్విపద, దండకము, మంజరి చేరినవి. ఈ రెండవ భాగమందే గేయ వాఙ్మయ మిమిడియున్నది.

అప్పకవి ఛందస్సును విభజించుచు దానిని కూడ రెండు భాగములు చేసెను.

“పాద నియమంమంబుగల యట్టి పద్యసమితి
వృత్తములు, జాతులను అన ద్వివిధమయ్యె
నిట నిసర్గగణంబులు వృత్తములగు
జాతు లుపగణ మాత్రల జరుగుచుండు”

ఈ రెండింటిలో మన చర్చకు సంబంధించినది 'జాతులు', ఈ జాతులు రెండు విధాలట.

జాతి–ఉపజాతి అని. అందు జాతిలో షడ్విధ కందములు, ఉత్సాహి, తరువోజ, అక్కరలు, మంజరి, ద్విపద, త్రిపద, చతుష్పద, పంచపది, షట్పద, నవవిధ రగడలు, కళికలు చేరినవి. ఉపజాతిలో నవ విధ గీతములు, సప్తవిధసీసములు చేరినవి.

అప్పకవి తన ఛందోభాగములో లాలి, పెండ్లి పాట, శ్రీ ధవళము, సువ్వాలె, సువ్వి, యక్షగానము, అను పాటలకు ఛందస్సు నిచ్చి యున్నాడు.

గేయ వాఙ్మయ నిరసనము:

పూర్వము సంస్కృతములో నారితేరిన పండితులు అచ్చ తెనుగు గూడిన పల్లె పాటలను నిరసించినారు. ఈ పల్లెపాటలు విశేషముగా ద్విపదలోను, రగడలోను నుండెడివి. ఈ పాటలను 'పదములు' అనియు వ్యవహరించుచుండిరి. శ్రీనాథుడు యొక చాటువున.

"ముది విటులు విధవ లంజలు
పదకవితలు మారు బాస బాపన వారల్"

అని పాటలను వ్రాయు కవులను పడ దిట్టె నందురు. మరియు వేణుగోపాల శతక కారుడు

"ద్విపద కావ్యంబు ముదిలంజ దిడ్డి కంతి"

అని చెడ దిట్టెను.

అయినను శ్రీకృష్ణదేవరాయల కాలములో సహితము కొందరు గొప్ప పండితులు ద్విపదలను, పదములను వ్రాసి సంస్కృత పండితుల చేత సహితము మెప్పొందిరి.

"చిన్నన్న ద్విపద కెరగును
బన్నుగ పెద తిరుమలయ్య పదమున కెరగున్
మిన్నంది మొరసె నరసిం
గన్న కవిత్వంబు పద్య గద్య శ్రేణిన్"

అని తెనాలి రామలింగడు చెప్పెను.

పాటల వివరములు

తెనుగు వారు పల్లెలలో పాడుకొను పాటలు నానా విధములై యున్నవి. వారి నిత్యజీవనముతో అవి సంబంధించినవై యున్నవి. అందు కొన్ని భేదములివి.

1. ఏల పాటలు, 2. ఉయ్యాల పాటలు, 3. పెండ్లి పాటలు, 4. దసర పాటలు, 5. మేలుకొలుపులు 6. ధవళాలు, 7. సువ్వాల, 8. దంపుడు, విసురుడు పాటలు, 9. మోటపాటలు, 10. భిక్షగాండ్ల పాటలు 11. జంగం పాటలు, 12. తత్వాలు, 13. రాటము పాటలు, 14. వినోదాలు, 15. స్తోత్రాలు 16. కోలన్న పాటలు, 17. రల్లు పాటలు మున్నగునవి.

ద్విపదలు

ద్విపదలను గురించి ముఖ్యముగా చెప్పవలసినదేమన పల్లెపాటలలో ముప్పాతిక భాగము ద్విపద వాఙ్మయమే. రాగభేదములచే ద్విపదను పది పదియేను విధములుగా పాడుకొన వీలున్నది. అదేవిధముగా నేటికిని జనులు పాడుకొనుచున్నారు. ఎట్లనగా:

1. దసరా పాటలు.

"శ్రీగణాధీశాయ శివకుమారాయ"

ఇత్యాది చరణము లన్నియు ద్విపదలే.

2. జంగం కథ అనబడు తందాన కథలు విశేషముగా ద్విపదల యొక్క రూపమే.

శ్రీనాథుని వంటివాడు "పల్నాటి వీరుల సుద్దులను" ద్విపదలో వ్రాసెను. ఈ సుద్దులన్నియు ద్విపదలో వ్రాసినవే. తాళ, లయ యుక్తముగా పూర్వము నుండియు పాడుచుండినవనుటకు క్రీడాభిరామములోని ఈ పద్యమే నిదర్శనము.

ద్రుత తాళంబున వీర గుంఫిత
        కథుం ధుం ధుం కటాత్కార సం
గతి వాయించుచు నాంతరాళిక యతి
        గ్రామాభిరామంబుగా
యతి గూడన్ ద్విపద ప్రబంధమున
        వీరానీకముం బాడెనొ

క్షత ప్రత్యేకముగా గుమారకులు
ఫీట్కా రంబునం దూలగన్.

బాలనాగమ్మ కథలో ప్రారంభమిట్లున్నది.

"కాళికి పడమట మున్నూ రామల
ఆ భూమికి ఒక చక్ర పట్నమేమి
పట్నము నేలు సహ భోజరాజా"

ఇదంతయు ద్విపదయే.

3. రాటపు పాటలు కూడ ద్విపదలోనే యున్నట్లున్నవి. శుక సప్తతిలో రాటముల వర్ణించుచు కదిరీపతి యిట్లు వ్రాసెను.

"ప్రాయంపు పడుచుల పనిగొంటివే దూది"
"అనెడు తేనీయ పాట చినుకు లీన"

ఇందు ఉదాహృత మొదటి భాగము ఒక మాత్రా భేదముతో ద్విపదగా నున్నది.

4. ధవళాలు, సువ్వాలలు అనునవి పల్లెలో ముఖ్యముగా వివాహములలో పాడుకొనుచుందురు. కదిరీపతి కాలములో సహితమివి చాలా ప్రాధాన్యత వహించినట్లు కనబడుచున్నది.

"ఆ లలనా మణి కౌ గ
య్యాళి యొకానొక్కవేళ నక్కరతో సు
వ్వాలున్ శోభనములు ధవళాలున్
మొదలైన పాటలం దగనేర్చు"

అని తన శుకసప్తతిలో వర్ణించినాడు.

మేలుకొలుపులు

ఇది చాలా మనోహరమైన గానము. నిన్న మొన్నటివరకు పల్లెటూరి బళ్ళలో తెల్లవారు జామువనే బాలురు బళ్ళలో

"తెల్లవారెను మేలుకొలుపులు
అల్లనల్లన వికసె కుముదము
... ...
కృష్ణా మేలుకోరా...."

అని శ్రావ్యముగా భూపాళ రాగయుక్తముగా పాడుచుండెడివారు. ఈ మేలు కొలుపుల ధాటిలోనే డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు "ఉమర్ ఖయ్యాము"ను రచించినారు.

శృంగారము

నగరవాసులకు కృతకశృంగారము మెండు. పల్లెటూరి వారిది నిజమైన శృంగారము. పూర్వము వ్రాసిన శృంగార గేయములలో ముఖ్యమైనవి "క్షేత్రయ్య పదములు". ఇవి క్షేత్రయ్య కవిచే తంజావూరి రఘునాథరాయల కాలములో రచింపబడిన పాటలు. ఇప్పుడు కొన్ని పాటలు ముద్రితములు. "సారంగపాణి పదములు" అనునవి కూడ చాలా వ్యాప్తిలో నున్నవి. నావద్ద నున్న ప్రతి 1899 క్రీ.శ. బరూరు త్యాగరాయ శాస్త్రులవారి కంపెనీలో ముద్రితమైనట్టిది. ఈ పదములను నాలుగు భాగములుగా విభజించినారు. అందొక భాగములో గ్రామ్యభాషలో పాటలు కలవు. తెలంగాణాలో చాలా ప్రాంతములలో "చందమ్మ-వెంకయ్య" పాటలు ప్రచారములో నున్నవి. కాని అవి పామరులలోబడి మార్పులు చెంది బూతులతో నిండిపోయినవి.

యక్షగానాలు – తోలుబొమ్మలు

ఈ వాఙ్మయమును గురించి తందాన కథవలె ప్రత్యేకముగా చెప్పవలసి యుండును. యక్షగానాలు పూర్వములో గొప్ప గొప్ప కవులచేత వ్రాయబడెను. అప్పకవి, కంకంటి పాపరాజువంటి గొప్ప కవులు యక్షగానాలు వ్రాసిరి. అయినను మనము చూచునట్టి యక్షగానాలలోను, విశేషించి తోలుబొమ్మల పాటలలోను, ప్రదర్శనముల లోను తుచ్ఛ శృంగారము, బూతులు కనబడుచున్నవి.

తత్వాలు:

పాటలలో తత్వాలు విశేషముగా ఇమిడియున్నవి. తెనుగువారిలో చాలా తత్వాలు రచించి అనేక శిష్యులను ఆకర్షించిన గురువులు చాలామంది కలరు. అందు పేర్కొనదగిన వారెవరనగా:-

1. పోతులూరి వీరబ్రహ్మం –వీరు కర్నూలు ప్రాంతము వారుగా కనిపింతురు. వీరు గొప్ప సంఘ సంస్కారులు.

ఏ కులమని నన్నెవరడిగిన
నేమని తెల్పుదు నీ లోకులకూ
పలుగాకులకూ - దుష్టాత్ములకూ

అని కులాలను తిరస్కరించిన మహానుభావులు.

2. దూదేకుల సిద్ధప్ప - (పింజారి) మెదకు మండలవాసుడేమో.

3. ఏగంటప్ప - పోతులూరి వారి తర్వాత దేశమంతటను ఖ్యాతిగాంచిన వాడు.

4. తోట గజేంద్రకవి - వైష్ణవ మతప్రచారకుడు. ఇతని గురించి మద్రాసు 'కళ' పత్రికలో పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రులవారు వ్రాసి యుండిరి. పాటలు మనోహరముగా నుండును.

"పుట్టుట యెల్లను గిట్టుట కొరకే
పుణ్యమేమి రాదోరన్నా!
చావక పుట్టుట జన్మదేశమున
జరుగుచు నుందుర వోరన్నా!

ఈ ప్రకారముగా బోధించినాడు.

5. అనిమ పాపయ్య 6. జ్ఞాన బ్రహ్మానందయోగి 7. వీరలింగ గురులు, 8. కంబగిరి, 9. ఇంద్రపీఠ భీమన్న, 10. వర నారాయణదాసు, 11. ఆదికేశవులు, 12. చిత్తూరు నరసింహదాసు 13. పరశురామ నరసింహ దాసు 14. వీరస్వామి 15. మహ్మదు హుసేను.

ఈ మహ్మదు హుసేను శైలి కుదాహరణము.

"ఒకటి మొదలూ వృక్షము
లెక్కకు మిక్కిలి కొమ్మలురా
ఎక్కి చూచితే ఎంతో పొడవు నా
కాశమంటినదిరా
రెండు త్రోవలూ కూడిన చోట
రేపు ఒక్కటేరా
రెండు రేకులా పద్మములోపలి
అఖండ తేజమురా"

16. బాలకృష్ణదాసు 17. శివయోగీంద్రులు, 18. తరికొండ వెంకమ్మ 19. అంగప్ప 20. చుండూరు చెన్నుదాసు 21. పోకల శేషాచలం 22. నాసీర్ మహమ్మద్ ఇతని శైలి కుదాహరణము.

"మేలుకొనుమీ తత్పదంబున
మేలుకొనుమీ త్వంపదంబున
మేలుకొనిమీ అసిపదంబున
మేదినిలో వెలినీ -
ఆత్మా - మేలుకొనవే.
వాదులాడుచు వారు వీరని
భేదముననే మోదమెరుగక
లేదు జననము లేదు మరణము
లేదు నీకెపుడూ - ఆత్మా,
చాలుపుష్పము మేలుకొమ్మని
గాలమార్యుల మూలమెరిగిన
ఫాల లోచనను విష్ణుకమలము
బోల జాలుదురే - ఆత్మా
ఇట్టి యాత్మకు నిద్రమెలుకువ
పుట్టబోదని గుట్టుదెలిపిన
గురుడు గాలిబు కరుణనాసరు
గట్టి మాటలను - ఆత్మా

ఈ తత్వాల చర్చను ముగించుటకు పూర్వమింకొక్కరి విషయము చెప్పవలసి యున్నది. రాయలసీమలోని సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమగు "కదిరి"లోని నృసింహస్వామిని పూర్వమొక హరిజనుడు దర్శింపగోరగా పూజారులు నిరాకరించి తలుపులు తాళ మేసుకొని పోగా ఆ హరిజనులు వీరావేశము పొంది యిట్లు పాడిరట.

"బేట్రాయి సామి దేవుడా
కదిరీ నరసింహరాయుడా
కాటామరాయుడా
నన్నేలీనవాడ - బేట్రాయి"

ఈ ప్రకారముగా శ్రీ విష్ణువు యొక్క దశావతారములు వర్ణించి పాడెననియు తలుపులు విరిగిపడి దేవునిదర్శన మతనికి లభించెననియు జనులు చెప్పుకొందురు.

వివిధములు

పల్లెటూరి వారు వినోదార్థము ఎన్నియో పాటలు పాడుకొందురు. అవన్నియు సమకూర్చుట చాలా అవసరము.

"ధీరుడా జమదారుడా
మళ్లెన్న డొస్తవు నాయుడా"

అని యుల్లాసమును ప్రకటించిన పాటలు

"బండిరా పొగ బండిరా
దొరలెక్కు రైలుబండిరా
వంగిదండం పెట్టువరకు
మంగపట్నం చేరెరా"

అని రైళ్ళను గురించి పాటలను

"దిగు దిగురా నాగా
దివ్య సుందరి నాగా"

అనునట్టి పాటలను "పెరుమాళ్ళ చిన్నని"

పాటలు "బాలబాలికల" పాటలు ఇంకను నిట్టివి వేనవేలు. జానపదులలో నిలిచియున్నవి. భావకవులమని చెప్పుకొనువారు భాషాసేవ చేయదలచిన ఈ అనాదృతమైన వాఙ్మయమును పునరుద్ధరించి సంస్కరించి ఉన్నత స్థానమలంకరింప జేతురుగాక.

పల్లెపదాలు

1

నన్నయభట్టు కాలమునుండియు ఆంధ్రులు సంస్కృత ప్రాబంధిక కవితా పద్ధతికే ప్రాధాన్యతనిచ్చిరి. నన్నెచోడుడు తన కుమార సంభవములో నిట్లు వ్రాసెను.

“మును మార్గ కవిత లోకం
బున వెలయగ దేశికవితబుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జనజాళుక్య రాజు మొదలుగ పలువుర్”.

అనగా చాళుక్య రాజుల కాలములో (మార్గ కవిత) సంస్కృత కవితా పద్ధతి దేశాన్ని ముంచివేసిందట, అప్పటికే (దేశి కవిత) సంస్కృత మర్యాదకు భిన్నమైన తెనుగు కవిత్వము ప్రచారములో నుండినది. మరల అట్టి దానినే చాళుక్యుల తర్వాత శివకవులు తెలుగుదనాన్ని నిలబెట్టే ప్రయత్నం చేసి పుణ్యం కట్టుకున్నారు. బసవ పురాణంలో పాల్కురికి సోమనాథ కవి నాథుడిట్లు వ్రాసినాడు:

“ఉరుతర గద్యపద్యోక్తుల కంటె
సరసమై పరగిన జాను దెనుంగు
చర్చింపగా సర్వ సామాన్య మగుట
గూర్చెద ద్విపదలు కోర్కెదైవార
తెలుగు మాటలనంగ వలదు వేదముల
కొలదియు కాజూడుడిలనెట్టులనిన.

ఇదే సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో తన కాలమందుండిన నానావిధ పదములను (పాటల భేదములను) గురించి యిట్లు పేర్కొన్నాడు.

"మదినుబ్బి సంసార మాయాస్తవంబు
పదములు "తుమ్మెద పదముల్" "ప్రభాత
పదములు" "పర్వత పదము" "లానంద
పదములు" "శంకర పదముల్" "నివాళి
పదములు" "వాలేశు పదములు" "గొబ్బి
పదములు" "వెన్నెల పదములు" సెజ్జ
వర్ణన, మరి "గణ వర్ణన పదము"
ఆర్ణవ ఘోషణ ఘూర్ణిల్లుచుండ
బాడుచు నాడుచు పరమహర్షమున...."

జానుతెనుగులోనేమి విశేషము? అనిన సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో మరలనిట్లు పల్కినాడు.

"ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ట రచన,
మానుగా సర్వసామాన్యంబుగామి,
జానుతెనుగు విశేషము ప్రసన్నతకు"

సోమనాథుడు పేర్కొన్న తుమ్మెదపదాలు, ప్రొద్దు పొడుపు పాటలు, నివాళి పాటలు, వాలేశు పాటలు, గొబ్బిళ్ళు, వెన్నెల పాటలు ఇవన్ని యెందరికి తెలియును? ఇందులో చాల భాగము నశించినట్లే కదా?

తెనుగువారు సంస్కృత కవులననుసరింపబోయి అటు పూర్తిగా సంస్కృతాన్ని సాధించలేకపోయిరి. ఇటు తమ జాతీయతను పోగొట్టుకొనిరి. పైగా తమ స్వచ్ఛతను నిలబెట్టే దానికి ప్రయత్నం చేసిన మహానుభావులను బాగా వెక్కిరించినారు.

"ఇవేం పాటలోయ్, పిచ్చికుంట్ల పాటలు, ముసలితనాన మిండరికమువలె మొగడుపోయిన పిదప జేసే లంజరికము వలెనే ఉందే" అని కొక్కిరించినాడట శ్రీనాథకవి సార్వభౌముడు. అతని ఆసరాచూచుకొని వేణుగోపాల శతకం వ్రాసినాతడు "ఇదేటి ద్విపదనోయ్. ముసలితనాన లంజరికం చేసేదాని సరసంగా ఉందే" అని వెక్కిరించినాడు. విజయనగర రాజులు, రెడ్డిరాజులు మరీ విజృంభించి పూర్తిగా దేశికవితను అణగద్రొక్కిరి.

ధనికులు కృతక లోకంలో సంచారం చేసినారు. బీదవారు దిక్కులేక వెర్రిచూపులతో చూచినారు. పండితులు రాణివాసాల ముచ్చట్లు వ్రాసినారు. గిరికాదేవి, వరూధిని, యామినీ పూర్ణ తిలక వంటివారు విరహతాపాలు పొంది చిగురుటాకులు కలువలు తెప్పించుకొని వాటిపై పండుకున్నారు. ఉస్సురంచూ బుసకొట్టినారు. చంద్రుణ్ణి ఏడుతరాలటూ ఏడుతరాలిటూ ఎగదీసి దిగతీసి చెడతిట్టినారు. మన్మథుణ్ణి మరీ తూర్పారబట్టినారు. కోయిలలను ఒక చెట్టు మీదనైనా ఒక క్షణమైనా కూర్చోనిచ్చిన వారు కారు. ఇట్లు నానా భీభత్సపడినారు. చదువురాని వారికి కీలకాలన్ని తెలియకపోయెను. చంద్రమ్మ యెంకయ్యలు తమకు వచ్చినట్లు వినోదం చేసుకున్నారు. బుద్ధులు చెప్పేవారు లేనందున ఇచ్ఛావిహారంగా ప్రవర్తించుకున్నారు. లేకపోతేనా చంద్రమ్మ ముందుర గిరికాదేవి నాల్గు గిరాట్లు కొట్టియుండేది. పామర జనులు తమకు తోచిన భావాలను దేశీయగానములలో ద్విపదలలో రగడలలో పాడుకున్నారు. అవియే వారికానందము కలిగించి వారి జీవితాలను తరింపజేసినవి. పల్లెటూరి వేదాంతులు తమకు తోచిన తత్వాలు పాడినారు. జనులు గుంపులు గుంపులుగా మూగినారు. వారికి దాసానుదాసులైనారు. పీఠాధిపతులు అప్పుడప్పుడు తమ ప్రాంతాలకు ఏనుగునెక్కి భేరీభాంకారములతో పంచమహాధ్వనులతో సకలాట్ట హాసములతో వచ్చేవారు. పెద్ద పెద్ద సిద్ధాంత చర్చలు చేస్తే పల్లెటూరివారు మనకేమి తెలుస్తుంది పదరా అని వెళ్ళిపొయ్యేవారు. ఉగాది దాటిందంటే జంగం కథ వారు వచ్చి తాంబూరా ఢక్కా తీసుకొని తాండ్ర పాపారాయుని కథనో, బాలనాగమ్మ కథనో, కాంభోజరాజు కథనో, స్థానిక వీరుల సుద్దులనో తందాన తాన లయ యుక్తముగా రాత్రుల్లంతా పాడినప్పుడు పిల్లలూ తల్లులూ ముసలివారు, కాపులూ, గొల్లలూ, మాలలూ, మాదిగలూ మున్నగు జాతుల వారంతా ముచ్చటగా వినిపొయ్యేవారు. బయలు నాటకాలో తోలుబొమ్మలోవస్తే మునిమాపే జనులు ఊరి ముందటి బయలంతా నిండిపోయి గొంగళ్ళను వేసుకొని ముచ్చటగా కూర్చునేవారు. ఈ విధంగా రాజాదరణ లేకున్నా పండితులు నిరసించినా, కవులు వెక్కిరించినా, బీద జనులు మాత్రం తమ నిజమైన "దేశికవిత"ను పోషించుతూ వచ్చినారు.

"ఈ దేశికవితలో ఏమైనా పొగడదగిన విషయముందా? ఎందుకింత ఆర్భాటం చేస్తారు. ఏదీ? ఏమీ విశేషమో చూపించండీ" అని భాషా సనాతనులెవరైనా

హుంకరించవచ్చును. మనవి చేసుకుంటాను వినండి. సవాలుకు సవాలు చేస్తే అదే మంచి జవాబు. "మీ ప్రాబంధిక కవిత్వంలో మీరేమి గొప్ప తనం చూపించుతారయ్యా" అని ప్రశ్న వేయుచున్నాను. ఎంతసేపు చెప్పినా పంచకావ్యాల మాటే. అందు అస్వాభావికము, కృతకము ఎంత కలదో చెప్పండి. పదాడంబరము కవిత్వమేనా? నోరుబట్టని సంస్కృత దీర్ఘసమాసాలు తెనుగేనా? వర్ణనలన్నీ సహజమేనా? కథలలో నవ్యతయున్నదా? లేక "ఉండంగా ఉండంగా ఒక రాజుండె, ఆయన వేటకు పోయెను, ఒక సుందరాంగిని చూచెను. మన్మథుడు నాయికా నాయకులపై బాణాలు వేసెను. ఇద్దరున్నూ పొర్లి పొర్లి చచ్చే అంత విరహతాపం అనుభవించి, ఎట్లో భేటీ అయినారు. తర్వాత పెండ్లి, శోభనం, పుత్ర జననం, కథ కంచికి మనమింటికి" ఇంతకు మించిందిం కేమైనా ఉన్నదా? కొన్ని ఉత్తమ గ్రంథాలున్నవిలెండి, అవి వ్రేళ్ళమీద లెక్కకు వచ్చేవిగా నున్నవి.

మరి తందాన కథలలో, పాటలలో, జానపదుల గేయాలలో, స్త్రీల పాటలలో నిజమైన కవిత ఉంది. ఉత్ప్రేక్షాతిశయోక్తులను, శాస్త్రోక్తముగా సరిచూచి వీరు వ్రాయించుకోలేదు. ద్వ్యర్థిత్ర్యర్థి చతుర్థి అను వ్యర్థములను గాని, చక్ర, నాగ, ఖడ్గాది బంధాలను గాని చెక్కించుకోలేదు. వీరి భాషను మనమింకా నేర్చుకోవలసియున్నది. వీరి పాటలలో నిజమైన తెనుగు నుడికారమున్నది. సూటిగా మనకు తగిలే భావాలున్నాయి. వీరి కథలకు భాష్యకారులతో, పౌరాణికులతో, వ్యాఖ్యాన కర్తలతో అవసరము లేదు.

"అయితే వీటివలన నేమి లాభమయ్యా" అని ఒక గడ్డు పండితుడు నిలదీసి అడుగవచ్చును. మాటకు మాట. "మీ ప్రబంధాల వల్ల ఏమి లాభమయ్యా" అంతకంటే ఎక్కువ లాభకారి కాకున్నా అంతమాత్రమైనా లాభకారిలెండి. ఏ జాతి తన పూర్వ సంస్కృతిని, తన జనుల విశ్వాసములను, భారత గాథలను, కథలను, పాటలను విస్మరించునో ఆ జాతికి నిష్కృతియే లేదు. పాశ్చాత్య దేశాలలోను గత శతాబ్దములో (Folk Tales) జనుల కథలను, (Folk songs) జనుల పాటలను, (Ballads) వీర గాథలను ఉదహరించినారు. ప్రాచీనమందు పాళిలో బౌద్ధ జైనులు వ్రాసిన "జాతక కథలు" సంస్కృతమందు వ్రాసిన హితోపదేశ కథలు, భేతాళ పంచవింశతి, పంచతంత్ర కథలు, కథాసరిత్సాగరము ఇట్టి వాటిలోనెల్ల పిట్ట కథలు, నక్క బావ కథలు, పిల్లిమామ కథలు ఎందుకు వ్రాసినారు వారంతా పిచ్చి పుల్లయ్యలేనా మరి.

క్రీ.శ. 1703లో స్కాట్లండు దేశీయుడగు ఆంద్రూ ప్లెచ్చర్ అను దేశభక్తుడు "ప్రతి జాతి యొక్క జానపదములు ఆ జాతి యొక్క శాసనాల కన్నను ముఖ్యమైనవి" అని సెలవిచ్చెను. మన తెనుగు వారిలోని జానపదులు చారిత్రక గాథలు, శృంగారము, వేడుకలు, వినోదాలు, కష్ట సుఖాలు అన్నింటిని గేయ రూపములో పాడుకొంటూ వచ్చినారు. శోభనాలు, సువ్వాలలు, ధవళాలు, సుద్దులు ఇవన్నియూ గాన యుక్తములే. మోటకొట్టినా, కలుపు తీసినా, దంచినా, విసిరినా, బంతి తిప్పినా, చేల కోతలు కోసినా, పండుగలు పబ్బాలు చేసుకొన్నా, తుదకు శవాన్ని కాటికి తీసుకొనిపోయినా తదనుగుణ్యమైన గానములను చేసినారు. ఇవన్నియు నుద్ధరించినచో భాషకు గొప్ప అభివృద్ధి. కవితకు విజృంభణము, జన సామాన్య సముద్ధరణానికి సులభ మార్గము అలవడుతుంది.

2

పూర్వమందు తెనుగుదేఫశములో మార్గకవిత, దేశికవిత యను రెండు విధాల కవిత్వముండినట్లు మనకు మొదటిసారి నన్నెచోడుని కుమార సంభవము ద్వారా తెలిసినట్లు చూపించియుంటిని. అయితే ఈ విభాగము తెనుగు కవులు చేసినదేనా లేక మరెందైనా ఇట్టి మర్యాద యుండెనా అని చూచిన ఇది అతి ప్రాచీనము నుండియు వర్తించినదని తెలియగలదు. ఆది కావ్యమగు వాల్మీకి రామాయణములోని బాలకాండలోని చతుర్థ సర్గలో కుశలవులు వాల్మీకిచే రచితమగు రామయాణమును శ్రీరాముని కాలములోనే వారి సన్నిధిలోనే గాన లయయుక్తముగా పాడిరని తెలుపబడినది. ఎట్లన -

శ్లో॥ తతస్తు తౌ రామవచః ప్రచోదితా
వగాయతాం మార్గవిధాన సంపదా
సచాపిరామః పరిషద్గతశ్శనై
ర్బుభూషయాసక్త మనాబభూవ   బాల -4 సర్గ శ్లో.31

అనగా శ్రీరాముల ప్రేరణచే ఆ లవకుశులు "మార్గము" అనునట్టి పద్ధతితో గానము చేసిరి. రాముడును చాలా ఆనందించిన వాడయ్యెను అని యర్థము. ఈ శ్లోకముపై వ్యాఖ్యానకర్త లిట్లభిప్రాయమిచ్చినారు.

"మార్గ విధాన సంపదా దేశీ మార్గశ్చేతి ద్వాగాన ప్రకారౌ
తత్రమార్గస్సార్వత్రికః దేశిక్వాచిత్కః
దేశిశేషణైరపేక్ష్యేణ శాస్త్ర ప్రతిపాది
తో మార్గస్సార్వత్రికరాగ ప్రకారః
తయోర్మధ్యే మార్గ నిర్వాహ సామగ్ర్యా గాయతాం"

మార్గము, దేశి అను రెండు విధాలైన గానములుండెననియు, మార్గవిధాన గానము దేశమంతటను వ్యాపించినట్టి సార్వత్రికమైనట్టిదనియు, దేశి విధాన గానము కేవలము క్వాచిత్కమైనదనియు అనగా కొన్ని ప్రాంతాలలో నుండినట్టిదనియు వ్యాఖ్యాన కర్తలు తెలిపినారు. అనగా మార్గ గానము సంస్కృత భాషాయుక్తమనియు దేశిగానము, ప్రాంతీయ ప్రాకృతాది భాషలతో కూడినట్టిదనియు మన మర్థము చేసుకొనవచ్చును.

మొదటి వ్యాసము వ్రాసిన తర్వాత ఏప్రిల్ నెల మాడరన్ రెవ్యూ చూచితిని. అందు "ఊర్మిళాదేవి నిద్ర" అను తెనుగునాటి పాటను ఇంగ్లీషు ఛందస్సులో అనువదించి 5–6 పుటల పెద్ద వ్యాసాన్ని దేవేంద్ర సత్యార్థి అనువారు వ్రాసినది చూచితిని. నేనున్నూ ఎన్నెన్నో గ్రంథాలు చదివినానని గర్వించిన వాణ్ణి కదా– మరి మాడరన్ రెవ్యూలో ఒక పంజాబీ పండితునిచేత శ్రమించి సంపాదించినట్టి తెనుగు దేశములోని ఆడువారు పాడుకొను పాట నింతవరకు చూడకపోతినే అని వెంటనే గ్రంథమెంతటిదో వెలయెంతనో తెలియక 6 అణాలు మనిషి చేతిలో బెట్టి గుజరీ పాతచ్చులో దొరకవచ్చును 'ఊర్మిళాదేవి నిద్ర' అనే పుస్తకాన్ని కొనుక్కురా అని పంపితిని. 8 పుటల గ్రంథము వెల ఒక అణా. అందు ప్రారంభమిట్లున్నది.

శ్రీరామ భూపాలుడూ
పట్టాభి
షేకుడై కొలువుండగా
భరత శత్రుఘ్నులపుడా
సౌమిత్రి
వరునకు సేవలు చేయగా

ఈ ధాటిపై కథంతా నడిచింది. ఇట్టివింకా చాలా కథలున్నవని విన్నాను. ఒకనాడు పని కల్పించుకొని పాతచ్చు పెద్దచ్చు పుస్తకాల వారి వద్దకు పోయి అవన్ని

సేకరించుతానులెండి. అయితే చెప్పవచ్చినదేమంటే మన తెనుగు ఊర్మిళను గౌరవింపకపోతిమి. ఇంగ్లీషులో కెక్కవరకు గౌరవము కలిగినది. చూచినారా? ఇతర రాష్ట్రాల వారు దేశికవిత నుద్ధరించుటకై యెంత కృషి చేయుచున్నారో?

పూర్వము మనదేశములో "కోలన్న" లేక "కోలాటము" అను వేడుక ఆటపాటలతో కూడినది సాధారణముగా నుండెడిది. ఆడువారు కోలాటమును జడవలె త్రాళ్ళనల్లుట ఇప్పటి నాగరికులకు పరిచితమైంది. కాని పురుషులు 10-12 మంది కలిసి యెత్తులు అందెలు వేయుచు పాటలు పాడుచు కోలలు కొట్టుచు పండుగల వేళలలో వెన్నెల రాత్రులలో వినోదాలు చేసేవారు. సుమారు 200 ఏండ్ల క్రిందటి వాడగు గండ్లూరు నరసింహరాయ కవియను కర్నూలు మండల కవి తన భాషీయదండకములో ఒక స్త్రీచే నిట్లు పలికించినాడు. "నీవాడ కోలన్న వేస్తుండగా చూసినాల్నుండి నాకిట్లరా తాపమంటింది. (విరహతాపము కలిగింది)" ఇప్పుడు మన దేశీకోలన్న మాయమగుచున్నాడు. పండరి భజనలు ఆస్థాన మాక్రమించుకున్నవి. ఈ కొత్తదానిలో మన పూర్వపు దానిలోని ధాటి, దర్జా, వీరత్వము కానరావు.

మనదేశములో జంగము కథలు (తందాన కథలు) ఎన్నియున్నవి, విద్యావంతులమనుకొన్నవారు వాటిలో ఒకటి రెండైన ఎప్పుడైనా విన్నారా? మరి భావకవులమని చెప్పుకొనుచు ప్రబంధాల పేరు చెప్పితే తలనొప్పి కలిగిందని తలపట్టుకొనువారు, ఈ జంగము కథలలో పాట, భావము, చరిత్ర, వర్ణన, సులభశైలి, అచ్చతెనుగు నుడికారము, అన్నియు నున్నవి కదా. ఉద్ధరించే ప్రయత్నమేమైన చేసినారా? ఈ నిజాము రాష్ట్రములోనే వనపర్తి సంస్థాన పూర్వీకులగు సవై వెంకటరెడ్డి, రాజారామేశ్వరరావు అను వీరుల కథలను, చించోడివారి పూర్వీకుల కథలను, గద్వాల వారిలో సోమనాద్రి కథను, పాపన్న వారి పూర్వీకులలో రాణీ శంకరమ్మ, నరసింహారెడ్డి, సదాశివరెడ్డి కథలను తందానవారు తరతరాలనుండి చెప్పుచున్నారు కదా! పై సంస్థానాల వారు తమ పూర్వీకుల యశోగానాలను సమకూర్చి సంస్కరించి, చారిత్రక సమన్వయముతోను, ఇతరాధారాములతోను కూడిన పీఠికతో ముద్రించరాదా? అదొక కష్టమా? నష్టమగు కార్యమా? నిజాం రాష్ట్రములో ఇంకను ఎన్నియో కథలు ఆదరము లేక కాలగర్భములో పడి మాయమగుచున్నవి. భాషా సేవ జేయదలచిన వానికి చేతి నిండుగా పనియే దొరకును.

స్త్రీలకు విద్య యెందుకు? స్త్రీలను నమ్మరాదు; (పురుషులను మాత్రము నమ్మవచ్చునేమో, పాపము వారెంతటి మేదకులో యేమో) స్త్రీలకు చదువు వచ్చిన తంటాలు చేయుదురు అను భావాలు హిందువులలో విశేషముగా వ్యాపించిపోయెను. ఆ కారణముచేతనోయేమో స్త్రీలు ఊర్మిళాదేవి నిద్రవంటి పాటలపై అభిమానము కలవారైరి. పెండ్లి పేరంటములలోను, పండుగలలోను, స్త్రీలు నానా విధములగు పాటలను పాడుకొని కాలము వెళ్ళబుచ్చుకొందురు. ఇప్పుడు ఆ సంతతివారు కూడ అరుదగుచున్నారు. ఆధునిక స్త్రీలకు పాతదంతయు మోటైపోవుచున్నది. తమ జాతీయ సంస్కృతిని విస్మరించుచున్నారు. కాని పాశ్చాత్య పద్ధతిలో అమిత దుష్టములగు నాచారములే మనవారి కెక్కువగా పట్టుబడుచున్నవి. వృద్ధులైన స్త్రీల నుండి పాటలనన్నిటిని సేకరించి వ్రాసుకొని కాపాడుట చాలా యవసరము. నానా ప్రాంతములలో ఇప్పటికిని పాటలు నేర్చినట్టి ముదుసళ్ళగు ఆడువారు చాలామంది కలరు. ఆ ముసలమ్మలు మోటువారనియు, విద్యాశూన్యులనియు, మూర్ఖులనియు, నవనాగరికులు భావించినందున వారిలో దాగినట్టి గేయ వాఙ్మయము ప్రకాశమగుట లేదు.

ఈ సందర్భములో ఒక సూచన చేయదలచినాను. మన ఆంధ్రులను ఆశ్రయించుకొని ఆంధ్రులుగానే పరిగణింపబడునట్టి అడవిజాతులవారు కలరు. చెంచులు అను తెగవారు కర్నూలు జిల్లాలోను మహబూబు నగరము జిల్లాలోను ఆమ్రాబాదులోను కలరు. అనగా శ్రీశైల ప్రాంతములో వీరున్నారు. మరియు "కోయదొరలు" అనుపేరుతో కోయజాతివారు వరంగల్ జిల్లాలోనున్నారు. సవరలు గంజాం జిల్లాలో కలరు. ఈ సవరలు (శబరులు) ఆంధ్రులు కారు. కాని పై చెంచుకోయవారాంధ్రులు. వారికి సమీపములోగల నాగరికులు వారి నుద్ధరించు విషయములో ఏమియు శ్రద్ధ తీసికొనుటలేదు. ఏ ఇంగ్లాండునుండియో, ఏ అమెరికా నుండియో వచ్చిన పాద్రీలు ఇట్టి జాతులకై శ్రమించుచున్నారు. వీరి భాషకు వ్యాకరణాలు, గ్రంథాలు వ్రాసినారు. వీరికి బళ్ళు స్థాపించినారు. వీరితో జీవితాలు గడిపి సంస్కరించినారు. మరి మనము వారి ప్రక్కననే యుండియు వారి భావాలు, వారి ఆచారాలు గమనింపకపోతిమి. ఈ చెంచుల నాటకము చాల అందముగా నుండును. వీరి పాట, వీరి ఆట మన ఆంధ్రులెల్లరు చూచినారు. గావున వీరికి

సమీపములోనుండు మహబూబునగరు, వరంగల్ జిల్లా ఆంధ్రులు చెంచు కోయ సోదరుల విషయమై మంచి శ్రద్ధ తీసుకొని వారి పాటలను సేకరించగలరు. అవి కూడా భాషకుపకరించుకునేమో!

భారతదేశములోని మహారాష్ట్రులు, కర్ణాటకులు, బంగాళీలు, హిందీవారు, తమ తమ భాషలలోని పల్లె పాటలను అప్పుడే సమకూర్చి అనేక గ్రంథాలను ముద్రించినారు. మన తెలుగులో ఒక గ్రంథమైనా ఈ విషయానికి సంంధించినది కలదా? లేదు మరి తక్కిన భారతీయులకన్న మనమే తెలివిపరులమా యేమి? ఈ గేయ వాఙ్మయాన్ని ఉద్ధరించుటలో గ్రాంథిక వాదులకన్న భావకవుల మీదనే యెక్కువ భారమున్నది.

3

ఇదివరలో పల్లెపాటల యొక్క ప్రాముఖ్యమును వీలైనంతవరకు తెలుపుకున్నాను. అయితే ఇది ఎవరో నావంటి చాదస్థులకు పట్టిన పిచ్చియేనా కాక మరెవ్వరైనా యిట్టి పిచ్చివారున్నారా అని కొందరికైనా సంశయము కలుగవచ్చును. భారతదేశములో మనము తప్ప తక్కిన అన్ని భాషల వారును జానపదుల వాఙ్మయమును సేకరించి ఉద్ధరించి సమకూర్చి ముద్రించి తమ తమ భాషా సముద్ధరణమునకు తోడ్పడినారు. రెండవ వ్యాసములో దేవేంద్ర సత్యార్థి గారు మాడరన్ రెవ్యూలో వ్రాసిన మన ఊర్మిళాదేవి నిద్రను గురించిన దీర్ఘ వ్యాసమును గురించి సూచించితిని. సత్యార్థిగారు పంజాబు వాస్తవ్యులు. వారు మన తెలుగుదేశానికి వచ్చి తెనుగు వారి పరిచయాన్ని కలిగించుకొని మీలోనున్న పాటలేమి? అని విచారించి వాటిని సమకూర్చుకొని తర్జుమా చేసుకొని కష్టపడుచున్నారు కదా? వారి శ్రద్ధలో శతాంశమైన మనకు కలదా? ఈ సత్యార్థి గారు బెంగాలు, కాశ్మీరు, అయోధ్య, నాగపూరు, ఆంధ్ర, కర్ణాటక మున్నగు ప్రాంతాలన్ని తిరిగినారు.

ఈ సత్యార్థిగారు "రూరల్ ఇండియా" అను మాసపత్రికలో జనవరి సంచికలో "భారతదేశపు పల్లెపాటలే జాతీయ వాఙ్మయము" అనునొక అమూల్య వ్యాసమును వ్రాసినది చూడ తటస్థించినది. దానిని చదివిన తర్వాత మనమెంత వెనుకబడినామో మన వాఙ్మయానికి మనమెట్లపచారము చేయుచున్నామో మనకెంత అశ్రద్ధయు

అనాదరణమును మన సోదరుల పాటలపై కలదో విశదమగును. సత్యార్థిగారు వ్రాసిన వ్యాసము నుండి కొన్ని భాగాల నిందుదుహరింతును.

"పంజాబులో నూర్లకొది గొల్లలు మంచి మంచి భావయుక్తమైన పాటలు పాడుచున్నారు.

గోండులు అను అడవిజాతి వారిలో మంచి సుందరమైన గానాలు కలవు.

"ఆంధ్ర దేశమందు పల్లెపడుచులు ప్రత్తి విరుచునపుడు ముద్దయిన పాటలు పాడుదురు".

"పఠాన్ స్త్రీలు శతాబ్దముల తరబడి అందమైన పాటలు పాడుకొనుచున్నారు.

క్రీ.శ. 1872లో గోవర్ అను యూరోపియన్ దక్షిణ దేశపు పల్లెపాటలు (Folk songs of Southern India) అను గ్రంథాన్ని ముద్రించినారు. ఈ వాఙ్మయాన్ని తెలుపు మొదటి గ్రంథమిదే. 1885లో సర్.ఆర్.సి. టెంపిల్ పంజాబు లిజెండులు అను గ్రంథాన్ని ప్రకటించెను. చంద్రకుమారదేవు తూర్పు బంగళా గేయములు ప్రకటించెను. దీనినే ఇటీవల రోమన్ రోలెండుగారి సోదరి ఫ్రెంచి భాషలో తర్జుమా చేసి ప్రకటించెను. కే.యం. మున్షీ గుజరాతు వాఙ్మయము అను గ్రంథాన్ని ప్రకటించి అందు చాలా పాటలు ముద్రించెను. దానికి మహాత్మాగాంధీగారు పీఠిక రాశారు. రామనరేశత్రిపాఠీగారు "గ్రామగీతములు" అను గ్రంథాన్ని హిందీలో ప్రకటించెను. ఒక రైలు స్టేషనులో కొందరు స్త్రీలు తమ భర్తలు కలకత్తాకు పోవుచుండగా వారిని సాగనంపుటకై ఒక పాట పాడిరి. దాని అందము చందము విని త్రిపాఠీగారికి ఆనందమైనది. ఆనాటి నుండి వారు గ్రామ గీతాలను సమకూర్చుటలో నిమగ్నులైరి. స్త్రీలు వరి పొలాలలో కలుపు తీస్తూ పాడినప్పుడు అదేపనిగా పొంచి యుండి ఈ త్రిపాఠీగారు పొలములోని వరాలపై కూర్చుని విన్నది విన్నట్లుగా వ్రాసుకున్నారు. కొన్ని గ్రామాలలోని మంది అతన్ని చూచి ఎవరో ప్రభుత్వచారుడని భయపడి దూరము పోయినారు. ఇతడేదో తప్పుజేసి జైలు నుండి తప్పించుకొని పారివచ్చినాడురా అని గుసగుసలు పోయినారు. ఎట్లయితేనేమి పట్టినపట్టు వదలని ధీరుడు. అతడు హిందీలో "కవితాకౌముది" అను పేరుతో అయిదు పెద్ద సంపుటాలు ప్రకటించినాడు. అందులో పూర్వకవిత, ప్రాచీన కవిత,

మధ్యకవిత, ఆధునిక కవిత ప్రకటించి తుది అయిదవ సంపుటములో "గ్రామగీతములు" ప్రకటించినాడు.

పండిత రామశరణదాసుగారు ఉర్దూలిపిలో "పంజాబుకే గీత్" అను గ్రంథాన్ని ప్రకటించినారు. సంత్‌రాం పంజాబీగీత్ అను గ్రంథాన్ని ప్రకటించెను. ఈ రెంటిలోను జానపదుల ప్రేమగానాలు పూర్వకాలము నుండి అనుశ్రుతముగా వచ్చుచున్న వాటిని సేకరించి ముద్రించినారు.

"రాజస్థాన్‌కీ లోకగీత్" అను హిందీ పాటల గ్రంథములో 230 పాత పాటలను క్రోడీకరించి ముద్రించినారు. ఇవన్నియు రాజపుత్ర స్థానములోని స్త్రీల పాటలు. ఇంకను ఈ పద్ధతిపై అచ్చైన గ్రంథాల సంఖ్య పెరుగుతూ వచ్చినది.

మదన్‌లాలూగారు మార్వాడీ గీతములను, నిహాల్ చందువర్మగారు మార్వాడీ గీతములను, భేటూరాం మాలీగారు మార్వాడీ గీతా సంగ్రహమును, తారాచందు ఓఝాగారు మార్వాడీ స్త్రీ గీత సంగ్రహమునున్ను జగదీశ సింగు గహిలోటు గారు మార్వాడకీ గ్రామగీత్‌నున్ను ప్రకటించినారు.

వెరియర్ ఎల్విన్ అను ఇంగ్లీషు పాద్రీగారు 290 గోండుపాటలను సేకరించి అరణ్యగానము (songs of the forest) అను పేర ప్రకటించినారు. మహారాష్ట్ర భాషలోని పాటలను కొన్నిటిని సేకరించి వామన్ కృష్ణ చోర్‌ఘారే అనువారు సాహిత్యాచే మూలధన్ అను గ్రంథాన్ని ప్రకటించినారు.

పై సత్యార్థిగారి వ్యాసములోని విషయమును చూడగా భారతీయ భాషా కుటుంబంలో చేరిన కాశ్మీరీ, పంజాబీ, రాజస్థానీ, హిందీ, మరాఠీ, బెంగాలీ, గోండు, గుజరాతీ మున్నగు భాషలన్నిటిలోను గ్రామ గీతములు సేకరించి ముద్రింపబడినవి కర్ణాటకులును ఇట్టి గేయాలను ప్రకటించినారని తెలిపినాను. ఇక మిగిలిన వారము మనమే! ఇతరులను చూచియైన మనము గుణపాఠము నేర్చుకొందుము గాక. మన యువకులలో ఈ విషయమైన శ్రద్ధ హెచ్చగుగాక. నశించిపోవుచున్న వీర కథలు, సుద్దులు, తందాన పాటలు, ఏల పాటలు మున్నగునవన్నియు నుద్ధరింపబడు గాక!

4

మన తెనుగు దేశములోని జనులు తాము పనులు జేయునప్పుడు పాటలు పాడుచుందురు. మోటకొట్టిన, కలుపు తీసిన, దంచిన, విసరిన, రాట్నము త్రిప్పిన,

కళ్లాలలో బంతులు త్రిప్పిన, బండితోలిన, బరువులాగిన, ఏ కాయ కష్టము చేసినను సరే ఆ సమయములలో పాటలు పాడుచుందురు. అవన్నియు సేకరించవలసిన అవసరము చాలా కలదు.

తుదకు చిన్న పిల్లలు గూడ ఏవో పాటలు పాడుచుందురు. శ్రీ చింతాదీక్షితులు గారు పిల్లలకై వాచకములు ప్రకటించినారు. అందు పిల్లల పాటలను కొన్ని చేర్చినారు. అయినను వారుగూడ వానిలోని అంతరార్థమును గుర్తించిన వారు కారు. దానిని మొట్టమొదటిసారి గుర్తించినవారు మిత్రులగు ఆయుర్వేదాచార్య శ్రీ వేదాల తిరుమల వేంకట రామానుజస్వామిగారు. బాలబాలికల పాటలందు పెక్కింటిలో వైద్యపు చిట్కాలున్నవని వారు గుర్తించినారు. ఆ చికిత్స పాటలలో నెట్లిమిడియున్నదో ఆచార్యులవారు ఒక చిన్న గ్రంథముగానే ప్రకటించవలసినదని పలుమార్లు కోరినాను. కాని వారట్లు చేయుటలేదు.

స్త్రీలలో ముసలివారిప్పటికిన్ని పలుతావులలో కొన్ని కథలను పాటలుగా పాడుకొనుచుందురు. ఊర్మిళాదేవి నిద్ర, రామాయణ కీర్తనలు, కామేశ్వరీ పాటలు మున్నగునవి వారిలో ప్రచారమందున్నవి. వల్లభరాయుడు తన క్రీడాభిరామములో ఒక బ్రాహ్మణ వితంతువు రామాయణమును తెల్లవార్లు పాడుచుండెనని ఇట్లు వర్ణించినాడు.

ఉ. కోయిల పంచమ స్వరము
క్రొల్చిన భంగిని విద్ధి చూచి రా
మాయణ మారుకాండములు
నచ్యుత జాగర వేళబాడెనా
రాయ వితంతురత్న మను
రాగముతోడ నమశ్శివాయ శాం
తాయ సమస్త దోష హరణాయ
సమానమె దాని కెవ్వరున్

కామేశ్వరీ లేక మహాలక్ష్మి పాటలను పాడుచుండిరని అదే క్రీడాభిరామమందిట్లు వర్ణింపబడినది.

గీ. రాగమున నుండి లంఘించు రాగమునకు
నురు మయూరు ద్వయంబుపై నొత్తగిల్ల
కావ తల్లీ మహాలక్ష్మి కైట భారి
వలపు పాడుచు వచ్చె జక్కుల పురంధ్రి

జమదగ్ని భార్యయు, పరశురాముని తల్లియునగు రేణుకను కాకతీయుల కాలములో ఏకవీరాదేవి అను పేర పూజించుచుండిరి. ఇప్పటికిని తెనుగుదేశమందు కొన్ని ప్రాంతాలలో ఈరమ్మ (ఏకవీరమ్మ) అను దేవతను పామరులు పూజింతురు. తెనుగు స్త్రీలకు చాలామందికి ఈరమ్మ అను పేరు కూడా పెట్టుదురు. ఈ వీరమ్మయే ఎల్లమ్మ. నేటికిని పల్లెలలో ఎల్లమ్మ దేవరను చేయుదురు. ఆమె కథను బవని వారు (మాదిగజాతిలో ఒక శాఖ) రెండు రాత్రుల వరకు చెప్పుదురు. అదంతయు రేణుకా పరశురాముల కథయే. ఈ కథలను పాడినట్లు క్రీడాభిరామములోనే యిట్లు వర్ణించినారు.

గీ॥ వాద్యవైఖరి కడు నెరవాది యనగ
నేకవీరామహాదేవి యెదుట నిల్చి
పరశురాముని కథలెల్ల ప్రౌఢి బాడె
చారుతర కీర్తి బవనీల చక్రవర్తి

ఆంధ్రదేశమందు బహు ప్రాంతాలలో కోలాటమును పురుషులు వేయుచు పాటలు పాడేవారు. దీనినే రాయలసీమలో కోలన్న పాటలు అనిన్నీ కోలంట్ల ఆట యనిన్ని యందురు. 200 ఏండ్ల క్రిందట కర్నూలు జిల్లా కవియైన గండ్లూరి నరసింహరాయ కవియను నతడు భాషీయ దండకములో దీనిని వర్ణించినాడు. ఒక స్త్రీ తన ప్రియుడు 'కోలన్న' వేయుచుండగా చూచి మరునాడతనితో ఇట్లన్నదట. "నీవాడ కోలన్న వేస్తుండగా చూచినాట్నుండి నాకి ట్లిరాతాపమంటింది– నీ మీద మోహాన నే తాళలేనోయి" (ఇరాతాపమనగా విరహతాపము)

విజయనగర చక్రవర్తులు తాము దండయాత్రలు చేయుటకుముందు ప్రొద్దుననే కొన్ని శకునాలను చూచేవారు. శ్రీకృష్ణదేవరాయలు కటకంపై దండెత్తుటకాలో చించినప్పుడు ఒకనాడు తెల్లవార చీకటిలో ఒక చాకలి యిట్లు పాడుకొనుచుండుట విననయ్యెను.

కొండవీడు మనదేరా
కొండపల్లి మనదేరా
కాదని యెవ్వరు వాదుకు వచ్చిన
కటకందాకా మనదేరా॥

పల్లెపాటలలో జన సామాన్యమందుండు భాష, భావములు పూర్తిగా నిండి యున్నవి. గ్రంథస్థ భాషలోనికి పల్లె పదాలలోని పదాలెక్కలేదు. అట్టి పదాలు వేలకొలదిగా ఉన్నవి. ఆ పదాలన్నియు ఏ నిఘంటువులందును లేవు. ఆ సుందరమగు పదాలు విద్యావంతుల అనాదరణముచేత మూలబడియున్నవి. మరియు జనసామాన్యమునుండి విద్యావంతులు దూరమగుచు వచ్చినారు. ఈ కారణముచేత భాషకు కూడా చాలా నష్టము కలిగినది. శుకసప్తతి కవితలోని కొన్ని పదాలు ఏ నిఘంటువులోనులేవు. "బందారాకు" "నభరువాడు" "కూనలమ్మ చీర" ఇట్టి పదాలు 100 వరకైనా కదిరీపతి యొక్క శుకసప్తతిలో కలవు. ఈ దేశ ప్రాంతమందలి ఈలకత్తి కూడ నిఘంటువులలో లేదు. దానిని శుకసప్తతిలోన పాడిరి. ఇట్టి పదాలలో అనేక పదాలకర్థమును మంగలివారిని పల్లెటూరివారిని విచారించి తెలుసుకొన గలిగితిని. 300 ఏండ్ల క్రిందట ఒక ప్రామాణిక కవి వాడిన పదాలకే యీ గతి పట్టినప్పుడు పల్లెపదాలలో ఎన్ని పదాలు ఇప్పుడు విద్యావంతులకర్థమగునో యేమో?

భారతదేశమం దితర భాషలలోని పల్లెపదాలను గొప్ప గొప్ప పండితులు సమకూర్చి గ్రంథస్థము చేసి పెద్ద పెద్ద సంపుటాలుగా ప్రకటించినారు. తుదకు ముండా, కోయ, గోండు, భిల్లు, సంథాలులవంటి ఆటవికుల పాటలు గూడా ముద్రితములైనవి. మనము మన పల్లెపదాలను ఇంతవరకు ఒకచోట చేర్చి ముద్రించకపోయితిమి. ఈ కార్యమును ముఖ్యముగా భావకవులు చేయవలసి యుండెను. వారు గూడా చేయకపోయిరి. ఈ నిజాం రాష్ట్రములోనే చాలా తందాన కథలున్నవి. అవి విశేషముగా మన తెనుగు సంస్థానాలకు సంబంధించినవి. మన సంస్థానాధిపతులును తమకు సంబంధించిన జంగముల కథలనైనా ముద్రింపించక పోయిరి. అవి అనాదరణచేత దినదినము నశించిపోవుచున్నవి. విద్యావంతులు పల్లెపదాలను శ్రద్ధతో ఉద్ధరించి మరల వాటికి మంచి ప్రచారమును కలిగించవలెను. కొన్ని పల్లె పదాలలో అసభ్యత కలదు. అట్టి వాటిలో మంచి భావాలను గ్రహించి అసభ్యతను పరిహరించవలెను. మంచి పాటలు వేలకు వేలు కలవు. వాటిని సేకరించితే అదొక మహోపకారమగును.

పల్లెపాటలు

స్కాట్లండు దేశీయుడు ఆంద్రూ ఫ్లెచర్ అనునతడు క్రీ.శ. 1203లో ఇట్లన్నాడు. "ప్రతి జాతియొక్క జానపదములు ఆ జాతియొక్క శాసనాలకన్నను ముఖ్యమైనవి." యూరపు దేశములో పల్లెపాటల ప్రాముఖ్యమును ఏండ్ల క్రిదట గుర్తించిరి. మనవారు 2000 ఏండ్లకు పూర్వమే గుర్తించి మధ్యకాలములో అదంతా మరచిపోయి యిప్పుడు మళ్ళీ పాశ్చాత్యులను జూచి పునరుద్ధరించుకొను ప్రయత్నము చేస్తున్నారు.

సంస్కృతములో అనేక విధాల పాటలుండెడివి. రత్నావళి వంటి నాటకాలలో కొన్ని మనకు నిదర్శనాలు దొరుకుచున్నవి. గీత గోవిందములోని పాటలు భక్తి శృంగార రసములతో కూడినవి. పూర్వము సంస్కృతములో చాలా విధములగు పాటలుండినట్లు కాళిదాసాదుల వర్ణనల వలన తెలియవస్తున్నది.

శ్లో॥ ఇక్షుచ్ఛాయ నిషాదిన్య
స్తస్య గోప్తుర్గుణోదయం
ఆ కుమార కథోద్ఘాతం
శాలిగోప్యో జగుర్యశః ॥ రఘువంశము-4-20

వరి పైరును కావలికాచే స్త్రీలు ప్రక్కన నుండిన చెరకు చేలలో చెరకు గడల నీడలలో కూర్చుని రఘు మహారాజు చరిత్రను పాటలుగా పాడుకొని కాలము గడిపిరి అని కవి వర్ణించినాడు. రఘు మహారాజు కాలములో పొలము కాచువారు పాటలు పాడుకొనుచుండిరని స్పష్టమైనది.

శ్లో॥ శరైరుత్సవ సంకేతాన్
సకృత్యా విరతోత్సవాన్
జయోదాహరణం బాహ్వోర్గా
పయామాస కిన్నరాన్ రఘువంశము 4-28

రఘుమహారాజు ఉత్సవ సంకేతులను గణములను జయించిన తర్వాత కిన్నరులను ఒక దేశమువారు అతని జయోదాహరణమును పాటలుగా గానము చేసిరి. ఉదాహరణమనగా ఒక విధముగ ప్రబంధము. మన తందాన కథ వంటిది.

సంస్కృతములో దేశీగానము, మార్గవిధానగానము అను గానపద్ధతులుండెను. శ్రీరాముని చరిత్రమును వాల్మీకి మార్గవిధానముగా రచించి కుశలవులచే గానము చేయించెను.

శ్లో॥ తతస్తుతౌ
రామవచ ప్రచోదితౌ
ఆగాయతాం
మార్గ విధాన సంపదా — వాల్మీకి రామాయణము - బాలకాండ

సంస్కృతములో కన్న తెలుగులో బహు విధాల పల్లె పాటలుండెను. నన్నయభట్టు భారత రచనతో ఆ పాటలు క్రమక్రమముగా అనాదృతములయ్యెను. తుదకు ద్విపద కావ్యము రచించుట ఉత్తమ కవిత కాదను భావము ముదిరిపోయెను. అందుచేత పాల్కురికి సోమనాథుడు దాని విశిష్టతను తెలుపుటకై ప్రత్యేక శ్రద్ధను చూపవలసి వచ్చెను. తన కాలములోను అంతకు ముందు తెనుగు దేశములో ప్రచారమందుండిన పాటలను కొన్నింటిని పాల్కురికి పండితారాధ్య చరిత్రలో వ్రాసి వుంచినందున మనకు వాటి పేరులైనా తెలియవచ్చుటకు వీలు కలిగినది. తుమ్మెద పదాలు, ప్రభాత పదాలు, పర్వత పదాలు, ఆనంద పదాలు, శంకర పదాలు, నివాళి పదాలు, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు ఇట్టి వింకా చాలా పదాల జనులు "పాడుచు ఆడుచుండిరి" అని అతడు తెలిపినాడు.

ఇప్పటికిని తెనుగు దేశంలోని స్త్రీలలో అనేక పాటలు నిలిచిపోయినవి. ఇప్పటికిని కొన్ని యిండ్లలో పెండ్లిండ్ల కాలములో సువ్వాలలు, ధవళాలు పాడుదురు. కలుపు తీయునప్పుడు, కల్లము చేయునప్పుడు రాటము త్రిప్పునపుడు, మోటకొట్టు నప్పుడు, విసురునప్పుడు దంచునప్పుడు, చాలామంది పాటలు పాడుచుందురు. పనితోపాటు పాటలుండును. అదుచేతనే కాబోలు "పనీ పాటా" అను సామెత మన భాషలో కలదు. స్త్రీల పాటలలో కామేశ్వరీ పాట కొన్ని బ్రాహ్మణ కుటుంబాలలో

కలదు. అదే మల్లమ్మ పాటగా పరిణమించినట్లు కానవస్తున్నది. గుజరాత్ దేశములో గర్భ నృత్యమున్నది. లంబాడీలట్టిదే ఆడుదురు. అదే విధమగు నృత్యాన్ని మన తెనుగువారు తెలంగాణములో బతకమ్మ అనుపేరుతో దేవి నవరాత్రులలో ఆడుచు పాడుచుందురు. దీనినే కర్నూలు జిల్లాలో "బొడ్డెమ్మ" అను పేరుతో వెన్నెల రాత్రులందు స్త్రీలు ఆచరిస్తూ ఉందురు. పురుషులు కోలన్న పదాలను పాడుచు ఆడుచుందురు. వెన్నెల రాత్రులందే ఈ ఆటనాడుదురు. దీనినే కొద్ది భేదముతో కోలాటమని బాలికలచే ఆడింతురు.

అప్పకవి కాలములో కూడా పల్లె పాటలు కొల్లలుగా ఉండెను. అతడు తన ఛందస్సులో ఇట్లు తెలిపెను. "అసంఖ్యా బద్ధములగునవి పాటలు. రచనలు వృత్తములని, జాతులని రెండు తెగలవి కలవు. అందు జాతులనునట్టివి పాటలు. మంజరి, రగడ, కళిక, లాలిపాట, ధవళాలు, సువ్వాలలు అనునవి పాటలు. కన్నడ భాషలో ఒక్క ద్విపదలో ద్విపద, త్రిపద, షట్పద అను భేదాలు చాలా ఉండుటయేగాక వాటిలో గొప్ప కవులు చాలా రచనలు చేసిరి. మన తెనుగులో ద్విపదయే ఆలా పాటలకు మూలము. దానిని మధ్యలో విరిచి తుమ్మెద, వెన్నెల, తందాన మొదలగు ఊత పదాలను వాడుతూ ఇద్దరు వ్యక్తులు పాడుట పరిపాటి. శృంగార గానములను జావళీలందురు. తెనుగులో క్షేత్రయ్య, సారంగపాణి రచించిన జావళీలు ప్రసిద్ధములైనవి.

వైద్యులు కూడా తమ చికిత్సలను పిల్లల పాటలుగా రచించి ప్రచారము చేసిరి. కాని అవి అర్థము లేని తిక్క మాటల జోడింపు అని అందరున్నూ అనుకొనుచుండిరి. బాలబాలికల పాటలలోని కొన్నింటిలో గొప్ప వైద్య, చికిత్సలు కలవని మొట్టమొదట కనిపెట్టిన వారలు శ్రీమాన్ వేదాల తిరుమల రామానుజ స్వామిగారు.

తెనుగు దేశములోని పోతులూరి వీరబ్రహ్మం, యాగంటయ్య, తోటి గజేంద్రుడు, దూదేకుల సిద్దప్ప మొదలగు భక్తులు తమ బోధలన్నింటిని పాటలలోనే రచించి ప్రచారము చేసిరి.

హిందూస్థానములోని ఇతర భాషా సోదరులు మనకంటే ముందుగానే బాగా మేల్కొని యున్నారు. దేవేంద్రసత్యార్థి అను పంజాబీ రసికుడు పల్లె పాటలనుద్ధరించుటకే తన యావజ్జీవితము నర్పించియున్నాడు. అతడు భారతదేశమందలి అన్ని ప్రాంతాలలో

తిరిగి అన్ని భాషలలోని పల్లెపాటలను సమకూర్చుతున్నాడు. రామనరేశ త్రిపాఠీ అనునతడు కవితా కౌముది అను పేరుతో హిందీ పాటలను సమకూర్చి ముద్రించినాడు. పంజాబు గీతాలు, మార్వాడ గీతాలు, కన్నడ గీతాలు ముద్రితమైనవి. తుదకు గోండులను అడవి జాతులవారి గీతాలను గూడా ఎల్విన్ అను మిషనరీ సమకూర్చి ముద్రించినాడు. మన తెలుగువారింకను ఈ విషయములో ఎక్కువ శ్రద్ధ బూనలేదు. స్త్రీల పాటలు అనునవి కొన్ని చాలా ఏండ్ల క్రిందట ముద్రింపబడెను. ఈ మధ్య కొన్ని పిల్లల పాటలు ముద్రితమైనవి. మన తందాన కథను (బుర్రకథలను) పండితులు సంస్కరించి చక్కని పీఠికలతో ముద్రించు ఆలోచన ఇంకా చేయలేదు. హైద్రాబాదు రాష్ట్రములో ఎన్నో చారిత్రక గాథలు తందాన కథలుగా ఇంకా నిలిచియున్నవి. వాటిని ముద్రించే ఆలోచన ఎవరున్నూ చేయుట లేదు. గద్వాల వనపర్తి పాపన్నపేట సంస్థానాల పూర్వరాజుల వీరగాథలు చాలా రమ్యమైనవి కొన్ని కలవు. ఆ సంస్థానం వారికే తమ పూర్వుల గాథలపై అభిమానము లేకపోయెను. వారికభిమానం కలిగితే అవి దిక్కులేని చావు చావకుండ బ్రదికి యుండగలవు. తెలంగాణములో ప్రతి చోటనూ వీర గాథలు కొల్లలుగా గలవు. ప్రతి ఊరిలోనూ ఎన్నో సుందరమగు పాటలు కలవు. ఆ పాటలలో ప్రబంధాలలో దొరకని చక్కని జాను తెనుగు పదాలు కలవు. నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు వాటిని సేకరించి ముద్రించుట భావ్యము. భావ కవులు అభినవ సారస్వతమువారు, నవ్య కవితా కుమారులు ఈ కార్యమునకు పూనుకొనవలెను. పల్లెపాటల నుద్ధరించిన భాషకు కూడా చాలా లాభము కలుగును.

తెనుగు దేశంలోని గుంటూరు బెజవాడ మధ్య ప్రదేశములో చంద్రమ్మ వెంకయ్య పాటలు కలవు. అవి మంచి పాటలే అయినను కొందరు అందు తమ బూతు రచనలు చేర్చి వాని స్వరూపమును మార్చినారు. చంద్రమ్మ వెంకయ్యల గాథలో అనేక విశిష్టతలు కలవు. చంద్రమ్మ కాపు కులములోని పడుచు. వెంకయ్య మాల, ఇద్దరికి పొలాల కాచునప్పుడు ప్రేమ కలిగినది. వారు వివాహమాడదలిచిరి. సంఘము ఓర్వలేకపోయెను. వారు సంఘ బహిష్కరణకు, సంఘ దౌర్జన్యమునకు గురియై తుదకు ఆత్మహత్యలు చేసుకొనిరి. ఇట్టి విషాద గాథలో ఆ యిరువురి భావాలు ఎంతో మనోహరముగా దానిని రచించిన అజ్ఞాత కవి చిత్రించినాడు.

"మిడి మిడి యెండలో
నడిచి వస్తుండావు
జోడు కుట్టి తెచ్చినానే
చంద్రమ్మా -
ఆకు చెప్పులు కుట్టినానే
చంద్రమ్మా" -

"మాలోన్ని పెండ్లాడ్తె
మర్యాద పోతాది
మాట్లాడ కూరకోవే
చంద్రమ్మా" -

"ఏడు కొండల రేడు
వేంకటేశ్వర స్వామి
కడకు పోయీ
మొక్కులడుక్కొని వద్దామా
మీ తల్లితో చెప్పిరావే
చంద్రమ్మా" -

"ఇద్దరము కలిసి
ఏకమొగముంటేను
ఏడు లోకాలు
మన కాడనే ఉంటాయి
ఎక్కడికి వెళ్ళ వద్దే
చంద్రమ్మా -
ఇక్కడనే ఉండిపోదామే
చంద్రమ్మా" -

"గోదావరికి పోయి
గోవిందునికి మొక్కి
కడతేరి పోతానురో
వెంకయ్య -
కడసారి చూపిదేరో
యంకయ్య"

"స్వర్గ లోకములో
చల్లనీ చోటులో
సరసము లాడుదామే
చంద్రమ్మా -
చందమామను చూతమే
చంద్రమ్మా" -

ఇట్టి వెన్ని అజ్ఞాత వాసము చేస్తున్నవో ఆంధ్ర విజ్ఞాన ప్రియులంతా అన్వేషించి వాటి నుద్ధరించవలసి యుండునని మనవి చేస్తున్నా.

జీవిత చరిత్రలు - వాటి రచన

జీవిత చరిత్రలకూ దేశచరిత్రలకూ సన్నిహిత సంబంధం కలదు. మహా పురుషులే దేశ చరిత్రలకు ముఖ్యకారకులు. ఒక్కొక్క మహాపురుషుడు తన శక్తి చేత గొప్ప భూభాగమునే కాక ఖండాలనే మార్చిపోయినాడు. ఏసుక్రీస్తు, మహమ్మదు, బుద్ధుడు గొప్ప మత పరివర్తనము కావించి పోయినట్టివారు. అలెగ్జాండరు, హానిబాల్, నెపోలియన్ చక్రవర్తి, అశోకుడు మరొక వర్గానికి చేరినట్టివారు. వారు శూరులును, సాహసికులునునై యుండిరి, కొలంబసు, కుక్, వాస్కోడిగామా వంటి నావికులు కూడా ప్రపంచముపై తమ ప్రభావము వేసిపోయిరి. కొలంబసు తేరకు తేరగా అమెరికాను స్పెయిను కిచ్చెను. కుక్ అనువాడు ఆస్ట్రేలియాను చూడబోయి అచ్చట ఇంగ్లీషు జండాపాతి ఇది మాది అనెను. వాస్కోడిగామా ఇండియాకు దారితీసే పాశ్చాత్యులకు ఇండియాను అప్పగించుటకు పాటుపడెను. వాట్, స్టీవెన్సన్, గూటెన్ బర్గ్, రైటు సోదరులు మున్నగు వారు చాలా గొప్పవారు. వారు రసాయనాది శాస్త్రాలలో ప్రవీణులై రైళ్ళు, ఇంజనులు, అచ్చుయంత్రాలు, విమానాలు మున్నగునవి కనుగొని ఏషియా, ఆఫ్రికా ఖండాల ఆర్థిక విజయమునకు కారకులైరి.

పై విషయాలను బట్టి మతకర్తలు, సేనానులు, రాజులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు వీరందరూ చారిత్రక పురుషులని విశదమగును. వారిని ఆదర్శముగా తీసుకొని తర్వాతి కాలములో క్రొత్తవారు బయలుదేరి ప్రపంచ కళ్యాణమునకు తోడ్పడుట కవకాశమేర్పడును. జీవిత చరిత్రలు నీతిని బోధించును. మన పూర్వుల మంచి చెడ్డలను తెలుసుకొని మనము వాటివల్ల లాభం పొందగలము.

జీవిత చరిత్రలు వ్రాయుటలో గ్రీకులో ప్రథమంలో క్రీస్తునకు పూర్వమందే క్షణఫ్ అనునతడు సోక్రటీసు చరిత్రను వ్రాసెను. ప్లూటార్ అనునతడు 46 మంది గ్రీసు రోముదేశాల మహాపురుషుల జీవితమును వ్రాసెను. గ్రీకుల తర్వాత జీవిత చరిత్రలు వ్రాయుటలో రోమువారు ప్రసిద్ధులు.

హిందువులలో చరిత్రలే లేకుండెనను అపవాద మున్నందున ఇక జీవిత చరిత్రల కెక్కడ తావున్నది. హిందువులు ఒక విధముగ ప్రపంచములో మొట్టమొదట జీవిత చరిత్రలు వ్రాసినవారు. కాని ఆ మాటను నమ్మకుండునట్లుగా తర్వాత మనవారే చేసి వేసినారు. మన పురాణములు జీవిత చరిత్రలతో నిండియుండెను. రామాయణము శ్రీరాముని జీవిత చరిత్రము కాదా? దానిని చదువని లేక వినని హిందువు లేడు కదా! భాగవతము శ్రీకృష్ణుని జీవిత చరిత్రము, దానిని విననివారు అరుదు. హరిశ్చంద్రుని చరిత్ర, నలచరిత్ర, అజామిళుని చరిత్ర ఇట్టివి వేలకొలది కలవు. అవన్నీ జీవిత చరిత్రలే! కాని హిందువులలో ఒక లక్షణమున్నది. తమకు నచ్చిన వారిని దేవతలుగా చేసిరి. మెచ్చని వారిని రాక్షసులుగా చేసిరి. ఆ చేయుటలోనూ మహిమలతో పూర్తిగా నింపివేసిరి. ఈ కారణాలచేత నిజమైన చరిత్ర మాటుపడి, నమ్మరానిదై పోయెను. అంత ప్రాచీన కాలపు ముచ్చట్లు వదలినా నిన్న మొన్నటి అనగా 200 ఏండ్ల క్రిందటి చరిత్రలు కూడా మనవారట్లే వ్రాసిరి. తుకారాం విమానములో సశరీరుడై పోయెనట. నామదేవుడు బఱ్ఱెచేత వేదాలు చదివించెనట. ఇవన్నీ భక్త విజయములో చూచుకొనవచ్చును. వైష్ణవులను చూచి శైవులు, శైవులను చూచి వైష్ణవులు భక్తుల చరిత్రలను కొల్లలుగా వ్రాసిరి. ఇక మనవారి రెండవలోప మేమనగా జీవిత చరిత్రలను ఉన్న దున్నట్లుగా వ్రాయక ఉత్ప్రేక్షలతో అబద్ధాలతో నింపివేసిరి. విక్రమాంకదేవ చరిత్ర, మహ్మద్ మదమర్ధనం, శంకర విజయము, వేమభూపాల చరిత్ర, హర్షచరిత్ర, సాళువాభ్యుదయము, పృథ్వీరాజ విజయము మున్నగు సంస్కృత జీవిత చరిత్రములు వందలకొలదిగా నున్నవి. అవి కొంతవరకే పనికి వచ్చును.

అజ్ఞానుల వల్ల వ్రాయబడిన జీవిత చరిత్రలు దేశకాలాదులను తెలుపక, అపభ్రంశ రూపాలతో నిండిన జంగము కథలు, పవాడాలు, సుద్దులు దేశమంతట నిండినవి. అవి జీవిత చరిత్రలె కాని బహు లోప భూయిష్టముగానున్నవి.

మన తెనుగులో కొన్ని జీవిత చరిత్రలు కానవచ్చుచున్నవి. కృష్ణరాయ విజయము, నరపతి విజయము, కైఫియత్తులు, ప్రతాప చరిత్రము మున్నగునవీ వర్గములో చేరును. కాని ఇవి వ్రేళ్ళమీది లెక్కలోనివి, ఇవికూడా లోపాలకు గురియైనవి.

యూరపు దేశములో ఆధునిక పద్ధతులపై జీవిత చరిత్రలు మున్నూరు నున్నూరు ఏండ్ల క్రిందటనే రచింపబడుటకు మొదలయ్యెను. ఎనిమిదవ హెన్రీ కాలములో ఇంగ్లండు దేశములో జీవిత చరిత్రలు వ్రాయనారంభించిరి. కాని బాస్వెల్ వ్రాసిన జాన్సన్ జీవితమే ఇంగ్లీషు భాషకూ, జాతికీ జగద్విఖ్యాతిని తెచ్చెను. అదే తర్వాతి వారికి ఒరవడి అయ్యెను. నెల్సన్ జీవితము, స్కాటు జీవితము ప్రఖ్యాతములైనవి. యూరపు ఖండములోని ఫ్రాన్సు, జర్మనీ, రష్యా దేశాలలో జీవిత చరిత్రల రచన బాగా గత శతాబ్దమందు వృద్ధి యయ్యెను. అమెరికాలోను అదే కాలమందు అవి వ్యాప్తికి వచ్చెను.

జీవిత చరిత్రలో ఆత్మకథలు (Auto biographies) చేరినవి. ప్రపంచ మందలి కొందరు మహాపురుషులు తామే తమ జీవిత చరిత్రలను వ్రాసి పెట్టినారు. మహాత్మాగాంధీగారు తమ జీవిత చరిత్రను వ్రాసినది సుప్రసిద్ధము. ప్రపంచ స్వీయచరిత్రలలో గాంధీగారి ఆత్మకథ ఉత్తమ స్థానము వహిస్తున్నది. ఆత్మకథ వ్రాయువారు తమ లోపాలను బయటపెట్టరు గాంధీగారు తనలోని మంచివీ చెడ్డవీ అన్నీ బయటపెట్టారు.

మన తెనుగులో స్వీయచరిత్రను వ్రాసిన వారిలో మొట్టమొదటివారు శ్రీ కందుకూరి వీరేశలింగము గారే. మన తెనుగులో జీవిత చరిత్రలు మొన్న మొన్నటివరకు లేకుండెను. ఈ ముప్ఫై యేండ్ల నుండియే జీవిత చరిత్రలను అందందు వ్రాయుటకు మొదలు పెట్టినారు. మన తెనుగు లోనికి మొట్టమొదట ఆబట్ రచితమగు నెపోలియన్ చరిత్రము, లడ్విగ్ వ్రాసిన చరిత్రములు, ఆరంస్ట్రాంగ్ వ్రాసిన కమాల్‌పాషా ఇబసాదు చరిత్రలు జాన్సన్ జీవిత చరిత్ర, కార్లైల్ వీరుల చరిత్ర మొదలైన ఉత్తమ జీవిత చరిత్రలు పరివర్తనలు కావలెను. తర్వాత ప్రపంచ మహాపురుషులను గూర్చి వ్రాసిన ఉత్తమ చరిత్రల నన్నింటిని అనువదింప జేయవలెను.

పాశ్చాత్యులు మన పూర్వులకు సరియగు న్యాయమును చూపించి యుండలేదు. పాశ్చయర్, యూక్లెడ్, ఆర్కిమిడిస్, గాలిలియో మొదలైన యూరపు పరిశోధకుల చరిత్రలను విపులముగా వ్రాయుదురు. కాని ప్రపంచానికి సంస్కృత భిక్షను పెట్టిన హిందూ ఆర్య మహాపురుషుల పేరులనైనా స్మరించరు. రేఖాగణితము, బీజగణితము (Geometry & Algebra) లెక్కలలోని పూర్ణాంకమును (సున్నాను) దశాంశమును

(Decimal) మొట్టమొదట కనిపెట్టినది హిందువులు. ఆర్యభట్ట, వరాహమిహిర, భాస్కరాచార్య, నాగార్జున, భోజరాజ, శుల్బ, కణాద, ధన్వంతరి, అగస్త్య, కౌండిన్య, భరత, జయసింహాది పరశ్శత మహాపురుషుల పేరు లెక్కడా ఆంగ్ల జీవిత చరిత్రలలో కానరావు. పై వారిలో జ్యోతిర్వేత్తలు, గణితాచార్యులు, రసాయనశాస్త్ర ప్రవర్తకులు, కణ సిద్ధాంత స్థాపకులు (Atomic theory) వలస రాజ్యాలను స్థాపించినవారు, శిల్పాచార్యులు, విమానశాస్త్ర నిర్మాతలు చేరియున్నారు. తెల్లవారు చేయలేదని మనమూరకొనవలెనా? అందుచేతనే మన మింకనూ అధికముగా పరిశోధించి శ్రమించి మన పూర్వ మహామహుల చరిత్రలను మన భాషలందును పరభాషలందును వ్రాసి వ్యాప్తికి తేవలెను. ప్రత్యేకముగా పైన సూచించిన వారిని గూర్చి ఇతరార్య మహాపురుషుల గూర్చి యెవరైనా పరిశోధించి రచించిన బాగుండునని నేను చాలా కాలము నుండి అనుకొనుచుందును. ఆ పుణ్యకాలము రాకమానదు.

జీవిత చరిత్రలను వ్రాయుట సామాన్య విషయము కాదు. జీవిత చరిత్రను కూలికి వ్రాయువారు చాలామంది కలరు. తమ పొట్ట నింపుకొనుటకై శక్తి సంపన్నులను సకలాలంకారములతో వర్ణించి రావణుని రామునిగా, హిరణ్యకశిపుని హిరణ్య గర్భునిగా, పోతురాజును భోజరాజుగా, లుబ్ధాగ్రేసరుని దానకర్ణునిగా చిత్రించి హాస్యాస్పదులగుచున్నారు. అట్టి చరిత్రలు నాలుగుదినాల పాటు కూడా నిలువవు. జాన్సన్ చరిత్ర వ్రాసిన బాస్వెల్‌కు దమ్మిడి లాభము లేకుండెను. అది లోకోత్తర జీవిత చరిత్ర యయ్యెను. జీవిత చరిత్రలను కొని చదువుదనిన జనులు వాటితోపాటు అమృతాంజనం కొనవలెనంటారు. అవి నీరసముగా నుండునని తలతురు. జీవిత చరిత్ర వ్రాయు రచయిత తన గ్రంథాన్ని రమ్యముగా ఆకర్షణీయముగా వినోద హేతువుగా చేయుటకై అబద్ధాలను తన సొంత పైత్యాన్ని తన గ్రంథములో నింపిన అది మదనకామరాజు కథలుగా మారిపోవచ్చును. సత్యమునే చెప్పవలెను. చక్కగానే చెప్పవలెను. ఆ విధముగా చెప్పినవాడే ఘనుడు. రచయిత శైలి ద్వారా చాలా రమ్యతను తన గ్రంథానికి చేకూర్చగలడు. కావున జీవిత చరిత్రలకు శైలి చాలా ముఖ్యమైనదిగా నుండును.

దాక్షిణాత్య లోకోక్తులు

సామెతలలో ఎంతో అర్థము ఇమిడి యుండును. భాషకు ఒక అలంకార ప్రాయము, చరిత్రకు కొంత ఉపకరణము, కవిత్వానికి తోడు నీడ, భావ ప్రకటనకు పుష్టి, పండిత పామరులకు సంగమస్థానము. ఇవి సామెతలలోని విశేషములు. ప్రతి దేశములోను ప్రతి జాతిలోను, ప్రతి భాషలోను సామెతలకు మంచి స్థానమున్నది. ఒక్కొక్క ప్రాంతములో ఒక విధమైన సామెతలు, అవి జనుల భావములను, ఆచారములను వ్యక్తపరచునవై యుండును.

ఇతరుల మాటయేమోకాని తెనుగువారి సామెతలకు ప్రత్యేక స్థానము కలదు. ప్రాయికముగా సామెతలు యతి ప్రాసయుక్తముగానుండును. ప్రాసతో తిట్టరా పాడు ముండాకొడుకా అని ఎవ్వరో అన్నారట. సామెతలు మూడు నాలుగు విధాలుగా నుండును. హాస్యరసయుక్తమయినవి. బూతులతో నిండినవి. లోకానుభవయుక్తమైనవి యిట్లు పలు తెరగులుగా నుండును.

తెనుగులోని సామెతలను ఒకచోట చేర్చి ఒకటి రెండు గ్రంథాలు ప్రకటించి నారు. అయితే అందు దశాంశమైనా కూర్చలేదని చెప్పవచ్చును. ఒక్కొక్క జిల్లాలో ఒక విధమైన సామెతలు కలవు. ఇవన్నింటిని ప్రతి మండలమువారును కూర్చి వివరములతో కూడినవిగా ప్రకటించుచు వచ్చిన కొంత కాలానికి మరెవ్వరైనా అన్నింటినొకచోట కూర్చుటకు వీలుండును.

మన ఆంధ్రులకు అరవలకు పూర్వకాలము నుండి అదెందుకో సరిపడ కున్నట్లున్నది. అరవలు కూడా తెనుగు వారిని గురించి హేళనముగా సామెతలు చెప్పుకొందురు. తెనుగువారును అదే పద్ధతిపై అరవవారిని గురించి చెప్పుకొందురు.

శ్రీనాథ మహాకవికి అరవ సాంబారు రసము రుచించకపోయెను. ఆంధ్రులకు ఇప్పటికిని సాంబారు రసం అంటే సరిపడదు. శ్రీనాథునికి అరవదేశము మంది

కూడా సరిపడినట్లులేదు. "పిళ్ళై" జాతి వారిని వర్ణించినది వింటే ఈ సంగతి అర్థ మౌతుంది, అతని తర్వాత పండిత జగన్నాథ రాయలవారికిని ఇదే విరోధముండినది. ఆయన ప్రౌఢ "మనోరమా కుచమర్దిని"లో ద్రావిడుల దూషణ అచ్చటచ్చట వ్యక్తమగుచున్నది.

దక్షిణ దేశములోని కొన్ని పట్టణాలు, ఆచారాలు ఆంధ్రుల సామెతలలో కెక్కి సాధారణమైపోయినవి. అట్టి సామెత లెన్నియున్నవో కాని నాకు తెలిసిన అయిదారింటిని ఇందు తెలుపుకొంటాను.

అరవ భాష మనవారికి సరిపడినట్లు లేదు, ఎవరైనా మాట్లాడే దానిలో అర్థము కాకుంటే – ఏమిటదీ "అరవ మొత్తుకోళ్ళు" అని ఎగబడతారు. "అరవ అధ్వాన్నము" అనియు మరొక సామెత కలదు. ఎవరైనా బండచాకిరీ చేస్తే దాన్ని "అరవ చాకిరీ" అంటారు.

భిక్షపతి క్షౌరం అంటే అందరికీ తెలిసిన సంగతే. తిరుపతికి పోయే యాత్రికులెక్కువ. మంగళ్ళు తక్కువ. వేంకటేశ్వరునికి వెంట్రుకలంటే చాలా ప్రీతి. ముత్తైదువలు కూడా నున్నగా బోడి కొట్టించుకొని వెంట్రుకలు సమర్పించుకొని వస్తారు.

అయితే మంగళ్ళు క్షౌరానికి పోయిన వారిని వరుసగా కూర్చొనబెట్టి ప్రతివాని నెత్తిన ఒక పట్టె పెట్టి ఆ మనిషి తనవాడని రిజిస్టర్ చేసుకొందురు. ఆ ప్రకారము కాబడ్డ మనిషిని ఇంకొక మంగలివాడు మూడు నాల్గంతల పైకమిత్తునన్నను ముట్టడు. అట్లు ముట్టినా మంగలి కత్తులతో ఘోరయుద్ధము ప్రారంభమైనదన్న మాటే. ఇట్టి పట్టెల క్షౌరానికి మనవారు తిరుపతి క్షౌరం అని ప్రసిద్ధినించినారు.

ఇంకా కాస్త దక్షిణానికి విజయం చేస్తే "చిదంబర రహస్యమును" తెలుసుకొనవచ్చును. చిదంబర క్షేత్రములోని ఒక దేవాలయములో ఒక పర్దా కట్టి యుంటారట. దాని లోపల ఏమిన్ని ఉండదు. అయినా యాత్రికులు అందు దేవుడున్నాడని భావించుకొనవలెనట. ఏమిన్నీ లేని వస్తువును ఉన్నదనడానికి మనవారు చిదంబర రహస్యం అంటారు.

ఇంకా కొంచెము దక్షిణానికి తర్లినామంటే మనకు "పుంగనూరు మనుషులు" కనబడతారు. మనలోని మూర్ఖులను "పుంగనూరు మనిషీ" అని తిట్టుతాము. ఇప్పటికి నీ పుంగనూరు గురుస్థానమొకటి మద్రాసు రాజధానిలోనున్నది. అయితే అచటి

మనుషులు మనవలెనే తెలివితేటలు కలవారే కాని యెవ్వరో మహానుభావులు ఈ సామెతను కల్పించి పోయినారు. పుంగనూరులో నౌకరులను విస్తర్లు ఎత్తివేయరా అంటే యెంతమంది తిన్నారు అని అడుగుతారట. ఫలానివాణ్ణి పిలుచుకొని రారా అంటే అతడు లేకపోతే యేమి చేయాలె అని అడుగుతారట. ఉన్నాడు పోరా అంటే "రాకపోతే మరి" అని అడుగుతారట. ఈ కల్పనలు ముచ్చటగానే ఉన్నవి.

తిరుపతికి సమీపంలో "కంచి" అనే క్షేత్రము కలదు. "నగరేషు కాంచీ నారీషు రంభా" అని ప్రాచీనమునుండి దీనికి ప్రఖ్యాతి. "కంచంత కాపురము" అనే సామెత కలదు. తెనాలి రామకృష్ణుడు తన పాండురంగ మాహత్మ్యములో నిట్లు వర్ణించినాడు.

"కాపు కోడలు కంచంత కాపురంబు
బాలవంటి కులంబు కాడ్వరచి యురికె
మగని నటుబెట్టి రెండవ మగనివెంట
నువిదలకు బుద్ధి పెడతల నుండుగాదె"

అంటే కంచి పట్నమంత పెద్ద కాపురము అన్నమాట. ఇక్కడ మాత్రము మనవారు ఒక్కమారైనా మెచ్చుకొన్నారు.

"ద్రావిడ ప్రాణాయామము" అనే సామెత సాధారణము. ద్రావిడులు ప్రాణాయామము చేయవలెనంటే నేరుగా ముక్కు పట్టుకోకుండా కుడిచేతిని నెత్తి వెనుకనుండి పెనవేసుకొని వచ్చి దానితో ముక్కు పట్టించుకొందురట. ఆ ప్రకారము ఎవ్వరును చేయరు కాని సామెత ఏర్పడింది. అంటే ఎవ్వరైనా సూటిగా చెప్పుటకు మారుగా డొంక తిరుగుడులు సవ్యాపసవ్య ప్రదక్షిణాలు చేసి చెప్పదలచిన ఆ రెండు ముక్కలు యిన్నూరు మాటల వరకు పెంచి పావుగంట కాలహరణము చేసి అంతయైనను ఒక్కొక్క మారు తమ అభిప్రాయాన్ని వినే నెత్తిలో పూర్తిగా యెక్కించలేని సందర్భములో ఈ సామెతను చెప్పుతారు.

ఇంకా దక్షిణానికి యాత్ర చేస్తే మనకు కుంభకోణము ప్రత్యక్షమౌతుంది. "వాడు కుంభకోణము చేసినాడురా" అని మన వారిలో నొక సామెత. అనగా మోసము చేసినాడని అర్థము. ఇది కూడా అన్యాయంగా వ్యాప్తి గావింపబడినట్టి సామెతయే అని చెప్పవలసిందే.

ఇంకా దక్షిణానికి దిగితే శ్రీరంగం అనే పవిత్ర శ్రీవైష్ణవ క్షేత్రం ప్రత్యక్షం అవుతుంది. "శ్రీరంగనీతులు" అనే సామెత తెనుగు వారిలో చాలా ప్రసిద్ధి. అంటే తాము మాత్రము ఆచరింపక ఏమేమో నీతులు బోధించితే అవి శ్రీరంగనీతులు అని మన వారంటారు.

ఇంకా దక్షిణానికి పోతే "ఆడ మళయాళం" లో పడిపోతాము. ఆ ఆడ మళయాళం అనే దేశాన్ని గురించి మన దేశంలో వ్యాపించినన్ని కథలు, కల్లలు మరెచ్చటను లేకుండ వచ్చును. ఈనాడు కూడా పల్లెలలోని జనులు కట్టు కథల నంతా నమ్ముతారు. ఆడ మళయాళంలో అంతా ఆడవాళ్ళేనట. మగవాడు పోతే దక్కడట. అయితే గాలికి పిల్లలు పుట్టుతారట. "మళయాళ భగవతీ" అని మంత్రం వేసినారంటే రాయినో రప్పనో పశువో అయి పోవలసిందేనట. ఇంకా ఇట్టి చిత్ర కథలు కొల్లలుగా మన దేశములో చెప్పుకొంటూ వుంటారు.

మళయాళ మంత్రాలకు ప్రసిద్ధి అయిపోయింది. పూర్వంలో మంత్రగాండ్లు మళయాళం పోనీ పోకపోనీ తమకేమైనా మంత్రాలు వచ్చి వుంటే వాటిని వారు మళయాళంలో నేర్చుకొన్నామని చెప్పుకొనే వారు. అందుచేతనే మంత్రగాండ్లు యిప్పటికినీ మోడీ గారడీ వంటి ఇంద్రజాలాన్ని ప్రదర్శించే దానికి ముందు, "ఛూ, మళయాళ భగవతీ" అని ఆడ మళయాళ శక్తిని తలచుకొంటారు.

ఇంకా ఇట్టి సామెతలు మరెన్ని వున్నవో యేమో.

శబ్దాల ముచ్చట

మా శ్రీపాద శాస్త్రిగారితో మాటల సందర్భమున నా పుస్తకములో వ్రాసికొనిన కొన్ని శబ్దముల చరిత్రను ముచ్చటించి యుంటిని. కాని వాని నింత త్వరగా ప్రకటించదలచి యుండలేదు. మా శాస్త్రిగారు మాత్రము ఇప్పుడే కావలనెనని పట్టుపట్టినారు. సంస్కృత ఫార్సీ భాషలకు పరస్పర సన్నిహిత సంబంధమెట్లు కలదో, ఈ రెంటికినీ కించిద్భేదమెట్లేర్పడెనో, ఎన్నడేర్పడెనో ఇత్యాది విషయముల నొక చిన్న గ్రంథముగా వ్రాయ తలపెట్టి యుంటిని.

అప్పుడు నేను సంగ్రహించి యుంచిన ఫార్సీ శబ్దములను గురించియు వ్రాయదలచి యుంటిని – అదెన్నడో యేమోకాని యిప్పుడు మాత్రము నాకు తోచిన కొన్ని శబ్దముల నిందు ప్రకటించుచున్నాను. నేను వ్రాసిన అభిప్రాయములు సరిగాకపోవచ్చును. విమర్శకులకు మార్గదర్శకముగ నైన నుండవచ్చునను ఊహతో ప్రకటించుచున్నాను.

1. ద్వార – ద్వి+ అర రెండు రెక్కలు కలది. ప్రాచీనమందు ఒంటిరెక్క తలపులకన్న రెండు రెక్కల తలుపులే విశేషమేమో.

2. డప్పు – ఇది ఉత్తర సర్కారులలో విశేషము వాడుకలో కలదు. ఫార్సీలో దఫ్ అని కలదు. తప్పెట అను నర్థములో నుపయోగింతురు.

3. హంవీరుడు – శూరుడను నర్థములో ప్రయుక్తము. తారా శశాంక విజయమందు ప్రయోగించబడినది.

"దండ హంవీర తలగుండు గండ" అని శుకసప్తతిలో (పు. 128) కలదు. "రాజమాన్య హంవీరులు దక్కణీలు" అనియు నొక చాటువు. హంవీరుడు రాజపుత్ర స్థాన చిత్తూరు రాజగు అర్సికుమారుడు. మహావీరుడగుటచే శూరపద పర్యాయ మయ్యెను.

4. దేవానాం ప్రియ – ఇది షష్ఠీ తత్పురుష అలుక్సమాసముగానే మూర్ఖుడను నర్థములో వాడినారు. అమరసింహుడు త్రికాండ శేషములో దీని యర్థము “ఛాగము” అని వ్రాసెను. ఛాగసమానుడు మూర్ఖుడు. మరియు ఛాగము యజ్ఞములందు దేవానాం ప్రియమైనది. నిఘంటుకారులు మూర్ఖునికే యీ పదము అలుక్సమాస స్వరూపమందే వర్తించుననిరి. దీనికి చారిత్రక కారణము కలదు. బౌద్ధులు తమ మతమందు శ్రేష్ఠులైన వారిని “దేవానాం ప్రియులు” అని పిలుచుచుండిరి. ఆశోక చక్రవర్తి బిరుదులలో నిదొక్కటి. హిందువులు బౌద్ధులను హేళనము అవమానము చేయు నుద్దేశముతో నీ యలుక్సమాస మూర్ఖనిర్వచనము చేసి యుందురు.

5. హజారము – దర్బారు అను నర్థములో వాడుదురు. ఫార్సీ హుజూరీ నుండి వచ్చియుండును.

6. హసాదు – “చిత్తము అట్లే” అను నర్థము హాస్రాబ్ అను దానినుండి యేమో?

7. చొక్కా – అంగీ, ఫార్శీలోని “చొగా” నుండియే వచ్చినది. నిస్సందేహము.

8. కాగితము – ఫార్సీ – కాగజ్ నుండి

9. బులాకి – ముక్కుకొనను అలంకారముగా (?) వాడుకొను ఆభరణ విశేషము. ఫార్సీలో “బులాఖ్” ఈ ఆభరణమును ముసల్మానులే తెచ్చి ఈ దేశ స్త్రీల ముక్కుల కెక్కించినారేమో, ఆలోచించుడు.

10. కందిల్ – హైద్రాబాదులో ప్రయుక్తము దీపమని యర్థము. ఇంగ్లీషు క్యాండిల్ (Candle) నుండి వచ్చినదీ వెలుగు.

11. గడ్డినూనె – ఉత్తర సర్కారులలో నున్నదో లేదో కర్నూలులో నిజాం రాష్ట్రంలో కొన్ని భాగములలో కిరోసిన్ నూనెకు పర్యాయపదముగా నున్నది. కిరోసిన్ నుండి గ్యాస్ కూడా వచ్చును. కావున గ్యాసును ముసల్మానులు ‘ఘాస్‌నూనె’నుగా జేసిరి. ఉర్దూలో ఘాస్ (ఘాసశబ్దమే) అనగా గడ్డి కావున కిరోసిన్ గడ్డినూనె అయినది.

12. చీనా గొలుసు – ఇది నంబి సోమయాజి వంటి పదము. ఇంగ్లీషు చైన్ (Chain) అనగా గొలుసు. ఆక్స్ (Ox) ఎద్దు అన్న చదువు పరిణామమే చైన్ గొలుసు తుదకు చైనా గొలుసు , చీనా గొలుసు అయినది. చీనా దేశమున కిప్పుడిప్పుడే గొలుసు సంబంధము కలుగుచున్నది.

13. తంబలి – ఒక శైవజాతి – తాంబల శబ్ద భవమని తలతును. పూర్వము ఒక్కొక్క జాతి ఒక్కొక్క వృత్తి. నంబులకు పూజయే కాక పూలను వర్తనగా తెచ్చియిచ్చుట ("నంబి వాడిచ్చిన గన్నేరు పూవులు" అని శుకసప్తతి కారుడు) అటులే తంబలవారికి గ్రామములో తమలపాకుల నిచ్చుట.

14. యోజన – ఈ శబ్దము ఒక యూర పొడవగును, ఒకచోట చిన్నదగును. కొందరు పది మైళ్ళందురు. కొందరు ఎనిమిది, మరికొందరు ఆరు మైళ్లు యుజ్యంతేతి యోజన. ఎద్దులను బండికి కట్టుట యని యర్థము. అనగా ఎద్దులబండి ఒక దినములో ఎంత దూరము పోవునో అంతదూరము. అది ఐదు మైళ్ళ నుండి పది మైళ్ళు కావచ్చును. బాటలను బట్టి యది నిర్ణయింపదగినది.

15. సెమ్మె – దీపము పెట్టు స్తంభము అని యర్థము. ఫార్సీలో "షమ" అనగా దీపము (దీప స్తంభముకాదు) దాని నుండియె మన సెమ్మె ఏర్పడినది.

16. కాక పక్షము – గిర్జాలు, జుంపాలు. కాకి రెక్కలవలె ఉభయ పార్శ్వములందుండునవి. శ్రీరాములకు కాకపక్ష ముండెనని వాల్మీకి అభిప్రాయము.

17. కవాట – పాణిని కాలములో మన దేశమందు తలుపులు చిన్నవిగా నుండెనేమో. క=తలను, పాటయతీతి=పగుల గొట్టునది కనుక – కవాటమయ్యెను.

18. కీసర – కీస అనికూడ యందురు. జేబు అని యర్థము. ఈ జేబు కూడా అన్యదేశ్యమే. (మన పూర్వలకు జేబులు లేకుండె నన్నమాట. మన మెప్పుడను పరులకై జీవించువారము కాన మనకు జేబులెందుకు?) కీసర్ అని ఫార్సీరూపము నుండి వచ్చినది.

19. దుహిత – బిడ్డ అని యందరకు తెలిసినదే. ఈ శబ్దార్థము రెండు విధములు. ఈ అర్థములో ప్రాచీనుల ఇంటి బిడ్డయొక్క స్థానము విశదమగును. దుహ్ ధాతువు. పితుకుట అను దానినుండి వచ్చినదీ పదము. పూర్వము ఇంటి యాడుపడుచు దినము ఆవులను, బర్రెలను చూచుకొనుచుండెనని యూహ్యము. ద్వేహితా – రెండు కుటుంబములకు – పుట్టినయింటికి మెట్టినయింటికి హితురాలు అగుట కావచ్చును.

20. పునాస – వర్షకాలారంభమున విత్తునట్టి పంటకు అర్థము. పునర్వసు కార్తిలో సజ్జలు, కొర్రలు మున్నగునవి వేయుదురు. ఈ పునర్వసు నుండియె పునాస పదముద్భవించినదని నా యూహ.

21. అక్ష (మాల) -

శ్లో. ఆదిక్షాంతార్ణయోగిత్వా దక్షమాలేతి కీర్తితా

తద్వర్ణ సంఖ్యైర్మణిభి ర్జపమాలాం ప్రకల్పయేత్

- శారదా తిలకము -

22. ఏడుగడ -

క. గురుడును 1. తల్లియు 2. దండ్రియు 3.

బురుషుడు 4. విద్యయును 5. దైవమును 6. దాతయు 7. నా

బొరి నేడు గడయు దానై

హరి నను రక్షించుగాత ననవరతంబున్

- వాసిష్ఠము -

23. హెగ్గడి - ద్వారపాలకుడు, బహు భార్యాయుక్తులగు రాజులు నాటికి నేటికి తమ దేవిడీలవద్ద పురుషుల పహిరాను అంతగా పసందు చేయరు. నపుంసకులను అంతఃపురమువద్ద కావలి పెట్టుచుందురు. ఉర్దూలో హిజ్డా అను పదము యొక్క అపభ్రంశమీ హెగ్గడియై యుండును.

24. చిలువ - చీలినన - వ - నోరు కలది - పాము

25. నలువ - నాల్గు - వ- మోములవాడు. ఇట్లే గట్టివ మున్నగునవి.

26. కింపచ - దరిద్రుడు - ఈ దినమేమి వండుకుందునా అని చేతులు పిసికికొనువాడు.

27. ముత్తైదువ - అయిదు వన్నెలు కలది - మంగళసూత్రము, పసుపు, కుంకుమ, గాజులు, చెవ్వాకు - కడపటిది అరవల సొమ్ము. తెలుగు స్త్రీలకు మట్టియలు - (మెట్టెలు)

28. హురుమంజి - హురుమంజి ముత్యములు. పర్ష్యాదేశపు సంధిని హురుముజ్ సంధి యందురు (Gulf of Hurmuz). పూర్వము మనదేశానికీ సముద్రభాగము నుండి తీసిన ముత్తెములు విశేషముగా నెగుమతి యగుచుండెను.

29. నంగనాచి - ఈ పేరు గలది ఏలేశ్వరోపాధ్యాయుల కూతురనియు నామెనొక కంసాలి తన కులము దాచి వివాహమాడెననియు తదనంతర మామోసమెరిగి యామె యాత్మహత్య చేసుకొనెననియు అప్పటినుండియు "ఎంతటి నంగనాచివే"

అనిన "ఎంతటి సాహసురాలవు" అను సామెత యయ్యెననియు కొందరందురు. హిందీలో నగ్నము (నంగా)గా ఆడునట్టి (నాచ్) స్త్రీల నృత్యమునకు నంగా నాచ్ అందురు. ఈ నృత్యముచేయు స్త్రీ సాహసికురాలు కాదా! అంతటి సిగ్గు విడిచిన దను నర్థము ప్రయుక్తమే కాని ఏలేశ్వరోపాధ్యాయుని కూతురునకు మంచి పేరు దొరకక యంతటి సుందర నామము పెట్టి యుండరు.

30. మోజాలు - బగ్దాదు పాదరక్షలకే యీ పేరుండెను. ఆ దేశము నుండి దిగుమతి యగుచుండెను.

31. దేవర - ద్వితీయో వరః మరది-వితంతువైన వదినెకు నియోగ న్యాయముచే ద్వితీయ వరుడై యుండెను. ఉర్దూ, హిందీ భాషలలో నీ పదమే (దేవర్) అని నేటికిని మరదికి వాడుచున్నారు.

32. దరుబేసి - యోగి. ఫార్సీలో దర్వేష్. ఒక తెనుగు కవి (శృంగార అహల్యా సంక్రందన మేమో?) యీ పదమును ప్రయోగించినాడు.

33. వర్గ - అధ్యాయము, భాగము, ప్రకరణమను నర్థము. ప్రాచీన కాలములో గ్రంథములు ఆకులపై వ్రాయుచుండిరి. ఫార్సీలో బర్గ్ అన ఆకు. (బవయోరభేదః - వర్గ్)

34. సూక్త - (హెూమము చేయునప్పుడుచ్చరించు) మంత్రము. ఫార్సీలో సోక్త్ అన కాల్చుట, వ్రేల్చుట అని యర్థము.

35. పుస్తకము - ఫార్సీలో పొస్తక్ అన చర్మము. బహుశః ప్రాచీనమందు గ్రంథములకు జింక చర్మములు మున్నగునవి అట్టలుగా నుంచుచుండిరో లేక చర్మపు సంచులలో గ్రంథముల భద్రపరచుచుండిరో యని దీనివలన గ్రహింపవచ్చును.

36. ద్విబిస్తా - బిస్తా 80 రతుల తూకపు బంగారు నాణెము. (సూ. ఆపరిమాణ బిస్తా చితకం బల్వేభ్యోనతద్ధితలుకి) రెండు బిస్తలకు కొన్న బానిస స్త్రీ.

37. పంచాశ్వా - అయిదు గుర్రములిచ్చి కొన్నట్టి బానిస స్త్రీ. ఈ రెండు పదములను బట్టి ప్రాచీనార్యులలో బానిసలను కొనుటయు, వ్యాపారమందు బానిసల విలువయు వెల్లడియగుచున్నది.

38. చండాల - సుప్రసిద్ధుడే! ఫార్సీలో నీచుని జందాల్ అనిరి.

39. దేవ అసుర - ఈ పదములకర్థము ఫార్సీలో అపసవ్యముగా నున్నది. దేవ్ అన భూతము లేక రాక్షసి అని, అహూర్ (ఫార్సీలో సకారమునకు హకారముంచుదురు. ఉ॥ సప్త=హప్త. సింధు=హిందు) అనగా ఫార్సీ మతమున మంచి దేవత. ఫార్సీలు, ఆర్యులును మొదట ఏకస్థులుగా నుండి సురాసుర పూజాదులందు భేదాభిప్రాయులై వేరైన నాట నుండి యా పరస్పర విరుద్ధార్థములు ప్రారంభమై యుండును.

❖ ❖ ❖

1935లో ప్రబుద్ధాంధ్రలో నేను "కొన్ని శబ్దముల కథలు" అను విషయముపై చర్చించి యుంటిని. ఇప్పుడు మరికొన్నింటిని గూర్చి నా ఊహలను తెలుపుకొందును. అందు సగము తప్పయినను మిగిలినవి సరియగుచో ఈ చర్చవల్ల నష్టము లేదని అనుకొందును.

1. టక్కు

టక్కులాడు, టక్కరి అను పదాలు టక్కు నుండి వచ్చినవి. నాకు తెలిసినంత వరకు ఈ పదాన్ని ఒకరిద్దరు కవులే పూర్వములో వాడినారు. నాచన సోమన "తిరిపెపు కూడు దెచ్చి" అను పద్యములో "టక్కరి బలుమోపు మోచు నయగాకితనంబడి యుట్టిగట్టినన్" అని ప్రయోగించెను. క్రీ.శ. 17వ వతాబ్ది తర్వాతి కవులీపదాన్ని ఎక్కువగా వాడిరి. ఠగ్ అను హిందీ పదము కలదు. ఠగ్గులు ప్రసిద్ధులే. మన డక్కు నుండి ఠగు అనునది వచ్చెనా? లేక ఈ రెంటికినీ మూల సంస్కృత పదము కలదా?

2. మ్లేచ్ఛ

ఈ పదము బలూచ్ పదము నుండి ఏర్పడినదని మాక్సుమూలర్ అభిప్రాయము. బెలుచిస్తాన్‌లోని వారు ఆర్యావర్తము సరిహద్దులోని వారనార్యులుగా ఉండి అపభ్రంశమును మాట్లాడిన వారని మహర్షి పతంజలి అభిప్రాయము.

3. బఱ్ఱెంకపూలు

బఱ్ఱెంక అను విష వృక్షమొకటి మహబూబ్‌నగరులో కలదు. కాని ఆదిలాబాదు జిల్లాలో పారిజాత పుష్పాలను బఱ్ఱెంక పూలని అందురు.

4. శరభము

మన సంస్కృత కవులు "సింహ శరభ శార్దూలములు" అని చాలా వర్ణించేవారు. శరభం ఎట్టి మృగమో ఎవ్వరున్నూ చూడలేదు. ఈ పదము అసీరియా నుండి వచ్చినట్లు కానవచ్చును. అసీరియాలో cherub అను ఊహా మృగాన్ని భయంకరముగా చిత్రించేవారు. దేవతలు దానిపై స్వారీ చేసినట్లు చిత్రించుచుండిరి చెరుబిం (Cherubmim) అను పదము లాటిన్ లోనికినీ ఎక్కెను. ఆ చెరుబిం పదమే మన శరభం అయినదేమో?

5. ఖుదా

దేవుడు అను ఫార్సీలో అర్థము. ఇది సంస్కృతంలోని స్వధా అను పదము నుండి యేర్పడి యుండును. సకారము ఫార్సీలో ఖకారముగా మారును. స్వసుర ఖుసర్ అయినది.

6. జగడము

హిందీలో ఝగడా ఏది మొదటిది? భారతములో యుద్ధవర్ణనలు నిండుగా ఉండినను జగడము అను పదము కానరాలేదు. హిందీ నుండియే తెనుగులోనికి వచ్చెనేమో?!

7. కుల్లాయి

పొడువైన బట్టటోపీ కర్థము. విజయనగర చక్రవర్తుల కాలములో పలువురు హిందూ ముసల్మానులు మూరెడు పొడవు గలిగి తలక్రిందులుగా ఉంచిన కాగితము పొట్లము వంటి టోపీని ధరించేవారు.

"కుల్లా పెట్టితి కోక జుట్టితి మహాకూర్పాసమున్ దొడిగితిన్" అని శ్రీనాథుడనెను. ఫార్సీలో కులా: అనగా టోపి. ఇది ఫార్సీ వారి నుండి మనవారు తీసుకొన్న ఆచారము.

8. పంతులు

ఈ పదమును ఇప్పుడు నియోగులు తమ బిరుదు పదముగా వాడుకొను చున్నారు. తెనుగు దేశములో చదువు చెప్పే ఉపాధ్యాయుని పంతులు అని అంటారు. ఈ పదము తెనుగు వాఙ్మయములో కానరాదు. ఇది మరాటీ పదమని తోస్తున్నది. పంథ్ అనునది మరాఠీ పదము. మరాఠీ బ్రాహ్మణోద్యోగులు ఈ పదాన్ని తమ

పేరుల తుదిలో నుంచుచునుండిరి. మోరో పంథ్ వంటి విట్టివే, పంథ్ బహువచనము మన పంతులు అయి యుండును. ఇది గోలకొండ నవాబుల కాలములోను పీష్వాల కాలములోను తెనుగు దేశములోనికి వచ్చినట్లున్నది.

9. ఫిరంగి

ఇంగ్లీషులో క్యానన్ అందురు. ఈ పదము ఫ్రెంచివారి నుండి యేర్పడినది. ఫ్రెంచి వారే ఫిరంగీలు, వారు తెచ్చిన మారణయంత్రమే ఫిరంగి. ఈ పదాన్ని క్రీ.శ. 1600 తర్వాత కవులెక్కువగా వాడినారు. అంతకు పూర్వమీ పదము మన వాఙ్మయములో లేదు.

10. గేరి

వాడ, వీధి అని యర్థము. రాయలసీమలో, మహబూబ్‌నగర్ జిల్లాలో వాడుదురు. మాదిగగేరి, బాపనిగేరి, కాపుగేరి అని కన్నడములోని కేరి అనుపదమే గేరి అయినది.

11. కురువ

గొల్లజాతిలోని ఒక జాతి. కన్నడములో కురి అనగా గొర్రె. కురికి సంబంధించిన జాతి కురువగా ఏర్పడియుండును.

12. అడకొత్తు

కన్నడములో అడకె అనగా వక్క, దానిని ఒత్తునది అడకొత్తు.

13. క్రమేలక

ఒంటె ఇంగ్లీషులోని క్యామెల్ అనునది దీనికి దగ్గరి పదము. ఇది సెమిటిక్ భాష నుండి సంస్కృతములోని కెక్కిన పదమని భాషాతత్వ శాస్త్రవేత్తల అభిప్రాయము.

14. మేలా

సంస్కృతములో మసి-సిరా-అనుదానికి వాడుదురట. మేలాంధుక అనగా మసిబుడ్డి (Ink pot) అట. ఇది గ్రీకు భాష నుండి సంస్కృతములోనికి వచ్చినదట.

15. లిపి

ఇది పురాతన ఫార్సీ నుండి సంస్కృతములోని కెక్కెనని భాషాశాస్త్రవాదుల వాదము. పాణిని నాటికిది మన సంస్కృతములో నుండినట్టిది.

16. శేరక

వ్యాఘ్రము - అనునర్థములో సంస్కృతములోని కెక్కెనట. ఫార్సీ షేర్ పదాన్ని సంస్కృతములో శేరక అన్నారట.

17. శిరోబంధనము

రుమాల. ఫార్సీలో సర్‌బంద్ అందురు. అదే ఇంగ్లీషు టరుబన్ అయ్యెను.

18. సమరె హింద్

చింత చెట్టు ఈరాన్‌లో లేనిది - ఫార్సీలు దీనికి హిందూదేశపు (సమర్) పండ్ల చెట్టు అనిరి - అదే ఇంగ్లీషులో టామరండ్ అయ్యెను.

19. సిస్తు

శిష్టము (పరిశిష్టము) నుండి వచ్చియుండును. సేద్యము ఖర్చు కూలి ఇంటి బత్తెముపోగా మిగిలినది. (శిష్టము) రాజుకు చెల్లించుట అను నర్థములో వాడియుందురు.

20. వరహా

మూడున్నర రూపాయి- విలువగల బంగారు నాణెము. విజయనగర రాజుల కాలములో ఆ నాణెములపై వరాహ చిహ్నముండెను. వరాహమే వరహా అయ్యెను. ఆ నాణెమునకు రెండవ ప్రక్కన దేవాలయ చిహ్నముండినందున ఇంగ్లీషువారు దానిని పగోడా అనిరి.

21. తత్తెరేని

మట్టితో చేసిన గుండ్రని కూజా. దీనిని ఉత్తర సర్కారు వారు తాబేటిబుఱ్ఱ అని అందురు. తత్తెరేని పదము కర్నూలు మండలము రాయచూరు పాలమూరు జిల్లాలో వాడుటను ఎరుగుదును. శబ్దరత్నాకరములో తత్తెర అను పదమిచ్చి దానికి సారాబుడ్డి అని యర్థము వ్రాసినారు. వ్యవసాయకులు పొలాలకు వెళ్ళునప్పుడు తాబేటిచిప్ప వంటి యాకారముకల మట్టికూజాలో నీరు తీసుకొనిపోదురు. దానిని తత్తెరేని యందురు.

22. మేజువాణి

ఉత్తర సర్కారులలో భోగము సానుల ఆటకు మేజువాణి యందురు. ఇది ఉర్దూలోని మేజ్‌బానీ అను పదము యొక్క అపభ్రంశరూపము. మేజ్‌బాన్ అనగా విందునిచ్చువాడు. మేజుబానీ అనగా విందు. సాహెబులలో విందులలో పూర్వము నాచ్ ప్రధానముగా నుండెను. అందుచేత మనవారు సానుల ఆటకు వారి పాటకచ్చేరీకి మేజువాణి అని పేరు పెట్టినారు.

23. పోటి

బాలిక అని అర్థము. ఇది అల్పార్థమందు తక్కువ వారి పిల్లలను పిలుచుటకై వాడుదురు. కాని పూర్వము గొప్పవారి కూతుండ్ర కీ పదమును వాడిరి. వేంగీ చాళుక్యులలో మంగిరాజు క్రీ.శ. 701–725 వరకు వేంగీ రాజ్యమును పాలించెను. అతని కూతురు పేరు "పృథివీ పోటి" అని అతని శాసనములో వ్రాసినారు. పోటి శబ్దము ఇప్పుడు తెలంగాణాలో చాలా ప్రాంతాలలో విరివిగా వాడుకలో కలదు. పిల్లవానిని పోఱడు, పోఱగాడు అని యందురు.

24. వంద

నూఱు యని యర్థము. ఈ పదము భారతములో కానరాదని నా నమ్మకం. ఇతర పూర్వ కవులలో, మధ్యకాలపు కవులలోను ఇది కానవచ్చినటుల నాకు తోచదు. మరి యిదెట్లేర్పడెను? ఈ పదము తెలంగాణాలో, రాయలసీమలో జనసామాన్యమందు వాడుకలో లేదు. ఉత్తర సర్కారు వారిని జూచి తక్కిన వారు వందయనుటయే బాగని ప్రయోగించుటకు నేర్చుకొనుచున్నారు. బహుశ బృంద (సమూహము) అను పదము యొక్క తద్భవముగా ఈ వంద అను పదమేర్పడెనేమో?

25. కరడా

ఇప్పుడు బళ్ళలో కాపీలు వ్రాయింతురు. అందుచేత కాపీ వ్రాయుట అని మనము వ్యవహరించుతున్నాము. కాని మనకు కాపీ శబ్దమునకు సరియగు పదము కలదు. అదే కరడా అను పదము. ఈ శబ్దము నిఘంటులలో లేదు. తెలంగాణాలో ఇది విరివిగా ప్రయోగింపబడుతున్నది. అక్షరాలు బాగా కుదురుటకై మంచి అక్షరాలను ఒరవడిగా నుంచుకొని వ్రాయుటకు కరడాలు వ్రాయుట అని యందురు.

26. అరి కంఠము

తల చెవులు మూసుకొనునటుల వస్త్రమును చలినాపుటకు చుట్టుకొనుట కందురు. ఇది నిఘంటులలోలేదు.

27. మాంగో

మామిడి పండు అను నర్థము కల ఇంగ్లీషు పదము. ఇంగ్లండులో మామిడి చెట్లు పండ్లు లేవు. ఈ పదాన్ని మన దేశమునుండి తీసుకొనిపోయి యుందురు. మచిలీ బందరులో మొదట ఇంగ్లీషువారు మొఖాము వేసిననాడు తెనుగువారి నుండి మావికాయ మాగాయ అని దాని పేరు తెలుసుకొని దానినే ఆంగో అని మార్చుకొని యుందురు.

28. దుముదారు

rear guard అని యింగ్లీషులో దానికి సరియగు పదము. సేనకు వెనక భాగమందుండి శత్రువుల నుండి రక్షించుటకై నియుక్తులగు సేనానుల కీ పదమును విజయనగర చక్రవర్తుల కాలములో వాడినారు.

"సకుటుంబముగ వీగి చరమ శైలము చేరు
తుహినంపు దుముదారు దొరయనంగ"

మనుచరిత్ర. ఆ 3 ప. 54

ఇచ్చట దుముదారు అన సేనానాయకుడని అర్థము వ్రాసినారు. సేనకు వెనక దిక్కుననుండు రక్షక సేనాని యనుటయే స్వారస్యము. దుముదారు అనునది దుందార్ అను ఉర్దూ పదము. దుం అనగా తోక దుందార్ అనగా తోక దిక్కుందువాడు అని యర్థము.

29. తాయెతు

దీన్ని గూర్చి అప్పకవి ఒక వ్యుత్పత్తిని చెప్పసాహసించెను. "ఎత్తులనగా దక్షిణ దేశీయమున దండలకు పేరు. దాని జడ్డన తేలబలికిన ఎతులాయెను. తాయి అనగా తల్లి. ఆ తాయి శిశువులకు శరీర రక్షగా కట్టునవి యెత్తులు కనుక తాయెతులు" అని వ్రాసెను. అప్పకవి తనకు పూర్వము ముద్దరాజు రామన తాయెత్తును తాయతు

అని వ్రాసి యుండెనని యాక్షేపించెను. మరియు తనకు పూర్వుడైన కవి తన చంద్రభాను చరిత్రయందిట్లు వ్రాసెనని యుదాహరించెను.

"ఒక యింతి యొరగిన సికమీద ముడి పువ్వు
టెత్తులు దొరయు తాయెతులు చుట్టి"

చంద్రభాను చరిత్రమును వ్రాసిన తరిగొప్పుల మల్లన కవి క్రీ.శ. 1600 ప్రాంతము వాడని ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారు పీఠికలో వ్రాసినారు. తరిగొప్పుల మల్లన ముద్దరాజు రామన కంటే పూర్వకవులెవ్వరును తాయెతు శబ్దమును ప్రయోగించి నటుల కానరాదు. అనగా క్రీ.శ. 1500 తర్వాతనే యీ శబ్దము తెనుగులోనికి ప్రవేశించిన దనవలెను. ప్రవేశించిన దగుటచేత ఇది విదేశీ శబ్దమై యుండవలెను. అప్పకవి భ్రమించినట్లుగా ఇది దక్షిణ దేశీ పదము కాదు. ఎత్తు లేక ఎతు అను పదాలకు దండ (హస్తముపై భాగము) అను నర్థమెందును కానరాదు. నిఘంటువులలో గాని ప్రయోగాలలోగాని ఈ యర్థము కానరాదు.

ఇక ఈ పదమెక్కడిదనగా ఇది అరబీ పదమనవలెను. అరబీలో తావీజ్ అను పదము కలదు. అరబీ నిఘంటువులలో దానికర్థము చేతులకు కట్టుకొనే ఖురాను మంత్ర విషయిక రక్ష అని వ్రాసినారు. తెనుగుదేశముపై గోలకొండ సుల్తానుల పరిపాలనము క్రీ.శ. 1512 నుండి స్థిరపడెను. వారి పరిపాలనములో ఫకీరుల ద్వారా హిందువులు తావీజులను పొంది అవి తమకు సకల పీడానివారక రక్షలుగా నుండునని భ్రమించిరి. తావీజు శబ్దమే తెనుగు నోళ్ళలో నలిగి తుదకు తాయెతు రూపము దాల్చెను. దీని పుట్టుకను సరిగా గుర్తించక తానేమో సరిగా నుచ్చరించినట్లు తలచి మల్లనను ఆధారము చేసుకొని ముద్దరాజు రామన్నను తప్పుపట్టిన అప్పకవి శాసనమును ఎవ్వరును అవుగాదనిన వారు కారు.

నన్నెచోడుఁడు

నన్నెచోడుని కాలము వివాదఁగ్రస్తము. ఆదిమ కాలమునందీకవి ఏలనో వెలుగుజూడని వాడైనాఁడు. ఇరువదియవ శతాబ్దిదనుక నీతని రచనలకు నవియున్నవను సంగతి తెలియరాలేదు.

తత్కవి కాలవిషయమై స్థూలముగా నాలుగు వాదములున్నవి. పలువురు తదనుగుణ భావవ్యక్తీకరణ గావించిరి. అందు, నన్నయకు ప్రాచీనుఁడుగను, నన్నపార్యునకు సమకాలికుఁడుగను, ఆది కవికిని కవి బ్రహ్మకును నడిమి కాలము వాడుగను, ఉభయకవి మిత్రునికి తరువాతి వాడుగను, గన్పట్టి సందేహపుటూయల యందూగుచున్నాడు.

నన్నపార్యునకు సోమయాజికి నడుమ కాలము వాడని పెక్కురభిప్రాయ మగుటం జేసి తద్రచయితనట్లే స్వీకరించుట ఉచితము.

రచనలు – బిరుదులు-- కవితారీతులు

సూర్యవంశ క్షత్రియ, కాశ్యపగోత్ర, చోడబల్లి, హైహయాన్వయాంబర శశిరేఖల యనుంగు పుత్ర, నన్నెచోడ నామాంకిత మహాకవి "టెంకణాదిత్య" – కవిరాజ శిఖామణి" బిరుధేయుద్దై యొప్పెను.

శివభక్తాగ్రగణ్యుండైన యీతని గురువరేణ్యుడు "జంగమ మల్లిఖార్జును"డుగ గుర్తింపబడినాడు.

అదియునుంగాక నాతడే ఇక్కృతికన్య స్వీకర్త. అచ్చటచ్చట ఈశ్వరునకు సద్గురువునకు నాతడభేదము చూపుట వలనఁబరమేశ్వరుడే ఈతని గురువు కానోపునను సందియమించుక బొడసూపక తప్పదు.

'కుమార సంభవము' కళావిలాసమను కవితా కన్నియం సృష్టించిన నన్నెచోడుడు ప్రప్రథమముగా షష్ట్యంతముల బ్రవేశపెట్టెను.

ఉద్భటుని సంస్కృత కృతి దీనికి మూలమని తెలియనగును.

తారకాసురమర్దనుని చరితయందు, సంస్కృతమునలేని "దక్షయజ్ఞ" చరితమును ఈతడు తన కావ్యమున బ్రవేశపెట్టెను. గణపతి జననముసైతమీతని కృతియందు విశేషము.

శ్రీకారముతో బ్రారంభించి (మంగళమహా)శ్రీకారములో ముగించు పద్ధతి గూడ నీతఁడే ప్రవేశపెట్టెను.

"మ' గణము గదియ రగణము
వగవక కృతి మొదట నిలుపు వానికి మరణం
బగునిక్కమంద్రు, మడియఁడే
యగునని యిడి తొల్లి 'టెంకనాదిత్యుడనిన్"

నన్నెచోడుఁడు తత్కారణముగ యుద్ధమున మడిసెనని అభిప్రాయపడుచున్నారు. నన్నెచోడునిది వస్తుకవిత. అనగ వస్తు ప్రధాన కవితయని విన్నకోట పెద్దన వచించెను.

ప్రకృతి పరిశీలనము నందును, వర్ణనానైపుణియందును సిద్ధహస్తుడైన చోడుఁడు తనంతతానే తనది వస్తు కవితయని చెప్పుకొనినాడు.

"నింగిముట్టియున్న జంగమ మల్లయ
వరమునందుఁగనిన వస్తుకవిత
దగిలివారి యంద నెగడింతు రవికి దీ
పముననర్చలిచ్చు పగిదివోలె"

"జఁగమ మల్లికార్జునుని సర్గకవి స్తవనీయ సూక్తియు
క్తింగొనియాడి సత్కవితఁ గానము లేకసురక్తియైన భా
షాంగనఁ దక్కనేలిన మహత్వము లోకమునం బ్రసిద్ధిగా
భంగిగ విస్తరించెదఁ బ్రబంధము సద్రసబంధురంబుగాన్"

ఆశ్వాసాంతమున కందమును వాడుట పరిపాటికాగా నన్నెచోడు 'మాలినిని' వాడినాడు. తదుపరి కవులెల్లరకును ఇందు మార్గదర్శకుడైనాడు. 'వనమయూర' వృత్తమును తృతీయాశ్వాసాంతమున విరచించినాడు. చతుర్థాశ్వాసాంతమున 'వసంత తిలక' వృత్తమును రచించెను. "వసంత తిలకం భాతి సంకరే వీరరౌద్రయోః" అనుటం

జేసి పంచమాశ్వాసమును సంభవింపనున్న కంతుని వీరవిక్రమమును, రుద్రుని రౌద్రమును సూచించెనని నుడువ వచ్చును.

శార్దూల విక్రీడితము

శార్దూల విక్రీడితము జెప్పుటలో తిక్కన ప్రసిద్ధుడని చెప్పుటకుదాహృతమున ఈ పద్యమును సూచింతురు.

'సింగం బాఁకటితో గుహాంతరమునం జేట్పాటుమైనుండి మా
తంగ స్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చునో
జం గాంతార నివాస ఖిన్నమతి నస్మత్సేనపైఁ వీడే వ
చ్చెం గుంతీసుత మధ్యముండు సమర స్థేమాభిరామా కృతిన్"

ఇంతటి నేర్పితనికి నేర్పినవాడు నన్నెచోడుడుగా నోపును.

"భర్గుండంతక వాహినుల్.......... మద్బాణ వర్షంబునన్"
"వీరేకాదశ రుద్రులష్ట వసువుల్
.... సుమహద్విఖ్యాత కార్తీశ్వరా!

శౌర్య వర్ణనతో నిండియున్న పై పద్యములన్నియును అతనెంత జాగరూకతతో తూచి తూచి వ్రాసినాడో తెలియనగును.

ఒక్క శార్దూలమునకే గాక తక్కిన పద్యముల వాడుట యందు కూఁడ నన్నెచోడుఁడు ఔచిత్య పోషణ గావించినాడు.

కందము

కథాగమనమును శీఘ్రతర మొనర్చుటకీ కందము మిక్కిలి యనుకూలము. చోడుఁడు వాడిన పద్యము లనివియే నెక్కుఁడుగ నున్నవి.

"తగుఁదగదని మనమును
వగవగ నొడబడగ వగవ వగవగ బడయున్
దగుదగదని వగవని వగ
వగవగఁ బని గలదె తనకు వగ మఱి జగతిన్"

ఇది సర్వ లఘు కందము. దీని నడక చూచిన పోతరాజు "లక్ష్మినడక" మనకు జ్ఞప్తికి రాక దప్పదు. కనుక నీ విషయమునకు ఆతనికీతఁడు మార్గదర్శకుడైనాడు.

తన చిత్తము వచ్చినట్లు కందమును నడపించినవాడీతఁడు. ఎన్ని పోకలవలంబించిన నన్ని పోకలంబోయినది. దుష్కర ప్రాసముతోఁ బొల్లు మాటలు లేక వచనమువలె సాగిపోయిన కందములీతని కృతియందనేకములు.

"చక్షు మదనేంద్రియములు ము
ముక్షులు మదిగెలుతు రెఱిఁగిమును శ్రోతృత్వ
కుక్షు ర్జిహ్వాఘ్రాణస
పక్షగ వాక్పాణి పాద పాయూపస్థల్"

శ్లేషాభి రామమగు కందము నడచిన తీరు:

"కమలాభి శోభితము హరి
రమణీయము విద్రుమాభి రామము శుకర
మ్యమునై గగనాబ్దులతో
సమమై వనమధ్య జలజషండం బొప్పెన్"

చతుర్విధ కందము

"రెండవ చరణంబునకున్
రెండవ గణమాది గాగ నిర్మించినచో
దండిఁ జతుర్విధ కందము
పాండవ పక్షా! మెలంగు బ్రాజ్ఞుల సభలన్"

నన్నెచోడుని చతుర్విధ కందము

ప్రథమ కందము

"సుజ్ఞాన యోగతత్వ వి
ధిజ్ఞులు భవ బంధనముల ద్రెంచుచు భువిలో
నజ్ఞాన పదముఁ బొందక
ప్రాజ్ఞులు శివుఁగొల్తు రచల భావనఁ దవులన్"

ద్వితీయ కందము

భవ బంధనములఁ దెంచుచు
భువిలోన జ్ఞాన పదముఁ బొందక ప్రాజ్ఞులు
శివుగొల్తు రచల భావనఁ
దవులన్ సుజ్ఞాన యోగతత్వ విధిజ్ఞుల్"

తృతీయ కందము

"అజ్ఞాన పదముఁ బొందక
ప్రాజ్ఞుల్ శివుగొల్తు రచల భావనఁ దవులన్
సుజ్ఞానయోగతత్త్వవి
ధిజ్ఞుల్ భవబంధనములఁ ద్రెంచుచు భువిలో"

చతుర్థ కందము

"శివుగొల్తు రచల భావన
దవులన్ సుజ్ఞాన యోగ తత్వ విధిజ్ఞుల్
భవబంధనములఁ ద్రెంచుచు
భువిలోన జ్ఞాన పదముఁ బొందక ప్రాజ్ఞుల్"

సీసము

కవిరాజు క్రొత్త మార్గమునకుఁ దిప్పి సొగసుగా రచించిన మఱియొక పద్యము సీసము. చోదుని సీసములందు తూఁగు సీసములే మెండు.

"వెలిమిడి నలికంబు చెలుపంగఁ బోవుచోఁ
దెలుపార మై నిండ నలది కొనుచుఁ
బూవులు దుఱుమంగఁ బోవుచో వెలిగొంత
దోపంగ నడ్డంబు దురిమికొనుచు
మోవిలత్తుక బూయఁబోవుచో లాలాట
పట్టిక దిలకంబు వెట్టికొనుచు
కాటుక మెదుచుచు గన్నుల నిడబోయి
పొల్తుక గళమున బూసికొనుచు

సితరుచీం, దుఖండ, శిఖి నేత్ర గరళంబు
లొడల, దలను, నుదుట, మెడను, దాల్చి
పొల్చు శంభు నోర్తు పొలిచూ పఱుదన
కెఱగుచుండ వచ్చె నీశుజూడ"

సీసము చమత్కారముగా నుండుటకు మరియొక కారణము గీత పద్యమద్దానికి జీవము పోయునట్లు మార్చుట. ఈతడు సీస పద్యమును పెక్కుబాటల నడిపించి తరువాతి వారికి మార్గదర్శకుడైనాడు.

తరువోజ

దేశి పద్యముల ఎడ నభిమానము గల్గిన చోడుఁడు తరువోజ, ఉత్సాహ, లయగ్రాహి లయ హారిణ్యాది పద్యములను సందర్భోచితముగ జెప్పినాడు.

చోడుఁడు తరువోజ పద్యమును దక్షునిచే నల్లునిపై నలిగిన తరుణమున - భార్యకు జెప్పు సమయమున జెప్పించినాడు.

రతీ విలాపమును (పంచమాశ్వాసము) గూడ నీ పద్యముననే జెప్పించినాడు.

"కాయజుఁడాయగ్ని గాలెనో నెఱయఁ
గాలంగ నెడ యెద్దిగడు భీతి బాఱి
పోయెనో? ననుఁ బెట్టిపోవునే కడచి?
పోయిన నీ భస్మపుంజ మెక్కడిది"

విరహావస్థ యందు (పార్వతీ) సైత మీతడు పైని చెప్పిన పద్యమును వ్రాసినాడు.

లయగ్రాహి

వీర రసానుమూలమైన ఈ పద్యము నీతడు మనోహరముగ జిత్రించినాడు.

"ముట్టి గజయూధముల బట్టి రద నాగముల
గుట్టి తెగఁ జీరి పలు తట్టములు వెట్టుం
గట్టి దురదాకి పడఁజెట్ట మొగపెట్టుఁ బెద
ముట్టు సనివాలముల బెట్టుకొని వీడున్
బిట్టడరి కేల మెడసుట్టి తెగ నెత్తువడు

నట్టలు శిరంబులును మెట్టలు గొనం బ్రో
పెట్టు జనదట్టు జెడమెట్టు నలిగొట్టుc గని
కట్టలుకc దారక సురారి కరివారన్"

కుమార సంభవములోని వృత్తములకు స్త్రీ పర్వములోని వృత్తము లనుకరణములుగ గన్పట్టును.

స్రగ్ధర - మహాస్రగ్ధరలు

చోడుcడు స్రగ్ధరను రెండు పట్టుల యందే వాడినాడు. (గ్రంథాది మగళా చరణమందును, దక్షాధ్వర విధ్వంసముననను)

మహాస్రగ్ధరను మాత్రము నూట తొంబది పద్యముల, కుమార సంభవమున జెప్పినాడు.

మంగళ మహాశ్రీ

కావ్యాదిని స్రగ్ధరా వృత్తము నన్నెచోడుని ప్రత్యేక మార్గమయినట్లే కావ్యాంతమున మంగళ మహాశ్రీ వృత్తమును రచించుటయు నీకవి ప్రత్యేక మార్గము.

ఈ మంగళ మహాశ్రీ యనునది కాకతీయ శాసనముల కాననగును.

పదపరికరము

'నన్నెచోడుని కవిత్వ మన్యభాషా దూషణగాదేని యుత్తమ'మని పంతులు గారు జెప్పుటకు అతడుపయోగించిన ప్రాంత పదము లాధారముగా స్వీకరింపవచ్చును. చోడుని కవిత్వమునందాంధ్రేతరములైన తమిళ, కన్నడ భాషా పదములుండుట సత్యదూరము కాదు.

జాను తెనుగు

ఇదమిత్థముగా నిర్ణయించుటక సాధ్యమైన ఈ జాను తెనుగు స్వరూపమెట్టిదో జనసామాన్యమునకు సుదూరముననున్నది.

నన్నెచోడుని యనుగాలములో నొకడైన పాల్కురికి సోమనాథుడు జాను తెనుగునిట్లు నిర్వచించినాడు.

"ఉరుతరగద్య పద్యోక్తుల కంటె సరసమై పరగిన జాను తెనుంగు చర్చింపగా సర్వసామాన్యమగుట" (బ.పు)

"పూరిత సంస్కృత భూయిష్ఠ రచన మానుగా సర్వసామాన్యంబుగామి జానుతెనుగు విశేషము ప్రసన్నతకును (పం.ఆ.చ)

తత్కాలమున వ్యావహారికములగు నాంధ్రేతర పదములనే యాతదుపయోగించెనని అంగీకరించుట కాలంబనముగా, ఆతని తరువాతివారు యా పదముల నుపయోగించుట మనము దీసికొనవచ్చును.

శతక వాఙ్మయము

శతకరచనకు బీజములు నాటినవాడు నన్నెచోడుఁడు. దారిద్ర్య విద్రావణాయను మకుటముతో పది పద్యములు వరుసగా నింద్రుఁడు శివుని స్తుతించినట్లు రచించెను.

కుమార సంభవము ప్రథమ ప్రబంధము

ప్రబంధములో నితివృత్తమున వస్త్వైక్యముండవలయును. తదితివృత్తము పురాణమునుండి గ్రహింపబడినదై, శృంగార రస ప్రధానమై, వీరరసము అంగరసము కాగా వర్ణనాబాహుళ్యత నొప్పుచు నుండవలెను.

ప్రబంధ శబ్దమును తొలిసారిగ నుపయోగించిన చోదుని కృతి యందుగల ప్రబంధ లక్షణా పరీక్షణ.

అష్టాదశ వర్ణన:

"వనజలకేళీ రవిశశి
తనయోదయ మంత్రగతిరతి క్షితి పరణాం
బునిధి మధు ఋతు పురో ద్వా
హ నగ విరహ దూత్య వర్ణనాష్టాదశమున్"

వనవిహారము:

"తన్నిన బూచె నెందు గడు దైన్యమ శోకము, బాహుపీడనం
గ్రన్నన బూచె నీకురువకంబును, నెంగిలికల్లు సల్లినన్
మన్నన దప్ప పూచె దొరమాయగ గేసరమేము సూచుడుం
గన్నుల సన్న బూచె దిలకంబని దానికి మెచ్చి రంగనల్"

ఈ పుష్పాపచయవర్ణన మనంతర కవులు తూ.చా. తప్పక వర్ణించిరి.

సూర్యోదయ వర్ణన:

అష్టాదశ వర్ణనలో ఈత డతిమనోహరముగ జిత్రించిన వానిలో నిదియొకటి. శ్లేషాత్మకముగ జెప్పిన ఈ క్రింది పద్యముదాహరణముగ గైకొనవచ్చును.

"రాజరుచివాయ గువలయ రమణ దళి గె
గలయ దమ్ముల మొగములు నెలమి మిగిలె
శీతకరుడైన రాజు పాసిన ధరిత్రి
పందుగాకెందు దాయలు వగతు రెట్లు"

ఇట్లు చంద్రోదయ, తనయోదయ, మంత్రాలోచన, యాత్రా, సురత, యుద్ధ, సముద్ర, మధుపాన, ఋతు, నగ, పుర, పరిణయ, విరహ, దూత్య వర్ణనలు మనోహరముగా జేయబడినవి.

షట్త్రింశదలంకారాలంకృతంబై యొప్పు కావ్యకన్య సృష్టికర్తయు, ప్రథమ ప్రబంధ కర్తయు, షష్ఠ్యంత్య శతక, శ్రీకారాది పద్యములకు మార్గదర్శకుడై మాయని కాంతిని గాంచినప్పటికిని, అటు శివకవుల యొక్కయు, నిటు వైష్ణవ కవుల యొక్కయు ఆదరమును బొందలేమి యాతడు వెలుగు చూడలేదు.

అనేక విషయములం దనేకులకు మార్గదర్శకుడైన ఈ కవిరాజశిఖామణి అనల్ప కల్పనాశక్తితో, అపూర్వ వర్ణనాయుక్తితో, అలతి యలతి అలంకారములతో రమణీయాక్షరముల పొందికతో కథను అందముగ, కర్పూర తాంబూలమువలె మలచి యందించి, సమస్త వస్తు కవీశ్వర నూత్న కావ్య రుచిర రత్న వీధి యెట్లుండవలెనో విశదీకరించి, దశప్రాణంబుల సప్రాణంబై నవరస భావ భరితమైన రచనతో కావ్య కన్యను నిర్మించి చిరస్మరణీయుడైనాడు.

దశకుమార చరిత్రము

సంస్కృత వాఙ్మయమందే దశకుమార చరిత్రము వంటి రమ్యమైన కథలు కలిగిన గ్రంథము లేదనిన నింక తెనుగు విషయము జెప్ప నవరసమే లేదు. తెనుగు నేటివరకు నొక యనుకరణ భాషగానున్నది. నాడు సంస్కృతము దీనికి మార్గదర్శకమైన నేడు ఇంగ్లీషు బంగాలీ భాషలా స్థానము వహించినవి. సంస్కృతమందు హితోపదేశ కథాసరిత్సాగర బృహత్కథా కాదంబరీ కథల వంటి వనేకములు కలవు. కాని యవియు నీ దశకుమార చరిత్రలోని కథలలో నొక్కొక్కటి యొక్క నవలకు మూలాధారము కాదగినది. నేటి నవలా కర్తలిట్టి కథలనే పెంచి సాహస కథలనుగా (Novels of Adventure) వ్రాయుచున్నారు. ఈ కథలలో రాజవాహనుడు పాతాళలోకమునకు బోవుట, ఒకమంత్రి యక్ష స్త్రీని వివాహమాడుట, ఒక బ్రాహ్మణ బ్రువుడు యమలోక మేగి వచ్చుట, నిట్టి యంశములు నాలుగైదు ఆవిశ్వసనీయములైన వానిని వదలిన దక్కిన భాగమంతయు నేటి నవలా కర్తలు సమ్మతించునవే యైయున్నవి.

కథలు వ్రాయు కవులకు ముఖ్యముగా గథా మాత్రము నవిచ్ఛిన్నముగా నడపుట (Narration) దానికనుకూలమగు సులభశైలి యీ రెండును నవసరములు. మన తెనుగు ప్రబంధములలో నూటికి తొంబది తొమ్మిది ప్రబంధములోని కథలు "పిట్టమ్మ కాకమ్మ కథల వంటివి". మన కవులు కథా చమత్కృతిని చాటింపక శైలి చమత్కృతిని బూజించిరి. సంస్కృతమందును కాదంబరి యిట్టి గ్రంథమే. బాణుడు కథలు జెప్పుచు జెప్పుచు మధ్యన నలుబరి యేబది పుటలే సరోవర వర్ణనమునో, యే రాజకుమారోపదేశమునో వర్ణించును. ఈ వర్ణనలును దెగబారెడు సమాసములతో నిండియుండును. చదువు వారికి విసుగు పుట్టుట తుది ఫలితము. మన దశకుమార చరిత్ర మట్లు కాదు. వర్ణనాంశము లిందు తక్కువ. శైలి నాతికఠినము. కథ మనోహరము. స్వాభావికము. ఇది సంస్కృత దశకుమార చరిత్ర సంబంధమగు చర్చ.

ఇక మన తెనుగు దశకుమార చరిత్ర గుఱించి యించుక వ్రాసెదను. కేతన తెలుగులో గథలందొక్క చోట కొంచెము మార్పుచేసెను. రాజవాహనుని ప్రేమకథ యంతయు నొక యుచ్ఛ్వాసమున మూల మందుండ దానినే తెలుగున పుష్పోద్భవుని కథలో కొంతయు, చతుర్థాశ్వాసమందు సోమదత్తుని కథ యందు గొంతయు విభాగించి వ్రాసియున్నాడు. ఈ రెండు పద్ధతులవలన కేతన ప్రతిభను గనుగొనవచ్చును. ఈ కేతన ప్రబంధమును కేవలము (తర్జుమా) భాషాంతరీకరణ ముగా భావింపజనదు. ఇతడు స్వతంత్ర వర్ణనములు వ్రాసి తన భావ వైశాల్యమును జూపించినాడు. దండి యెంత రసికుడో, యంతకన్న రసికుడు మనకేతన. దండి వచనము వ్రాసియు "కవిర్దండీ" యని ప్రఖ్యాతి గాంచెను. కావుననే కేతన "యభినవదండి" యను బిరుద మందభిమానము కలవాడయ్యెను. కేతన మూలమున కెందెందు భిన్నముగా వ్రాసెనో యన్నియు నిందు జూప వీలుండదు. కావున గొన్నింటినే కేతన వర్ణనా సామర్థ్యమును జూపుటకై యుదాహరించెదను. ప్రారంభముననే పుర వర్ణనము భిన్నించినది. దాని వెంటనే రాణియగు వసుమతీదేవి సౌందర్య వర్ణనము విపులముగా మూలమందుండ మన కేతన "వసుమతికి సవతియనందగు వసుమతీదేవీ" యనినాడు. మూలమందలి వర్ణనలో విశేషమేమియు లేదు. కవి సంప్రదాయానుసారముగా పద్మములు మీనములు, పూర్ణకుంభములు మున్నగు వస్తువులు యంగముల కుపమానములుగా గైకొనబడినవి. మగధ మాళవదేశ రాజుల యుద్ధము వర్ణించుచో మన కేతన యిట్లు తన సొంత పద్దెమొకటి కలిపినాడు.

చ. ఆ మగధేశ మాళవ ధరాధిపు
లెక్కటిఁ బోరి రాజిలోఁ
గాముడు శంబరుండు శశిఖండ
ధరుండు గజా సురేంద్రుఁడున్
రాముడు రావణుండు సురరాజ త
నూజుడు సింధునాథుడున్
భీముడు దుస్ససేనుడు నుపేంద్రుఁడు
కంసుడు బోరు నాకృతిన్"

మూలమందు కామ మంజరి యను భోగముది మరీచికి కామతత్త్వమును బోధించునప్పుడిట్లు వర్ణింపబడినది. "బాధితో పిచాల్పాయాప్రతి సమాహితస్త మరపి దక్షషం నిర్వృత్య శ్రేయసే నల్పాయ కల్పతే, తథాహి పితా మహస్య తిలోత్త మాభిలాషః భవానీ పతేర్ముని పత్నీ సహస్రం సందూషణం పద్మనాభస్య షోడశసహస్రాంతః పురవిహారః ప్రజాపతేః స్వదుహితర్యపి ప్రణయ ప్రవృత్తిః శచీపతే రహల్యా జారతాః"

ఈ వర్ణన తెనుగునందు లేదు. దానికి బదులీ పద్యము మూలమందు లేనిది కలదు.

చ. అలరులుఁ బూత లంబరము
లాభరణంబులు దమ్ములంబు నె
చ్చెలులు మృదూపధానములు సెజ్జలుఁ
గేలి గృహంబు లాదిగా
గలుగు పదార్థముల్ నడుపుఁ గామము
దాను మనోహరంబు త
త్ఫల మగు సౌఖ్యసిద్ధిఁ దెలుపన్
యశమే యనుభూతిఁ దక్కఁగన్॥

మూలమందొక జైనుఁడు (క్షపణకుడు) వ్యసనియై యొకచో నుండినట్లు వర్ణింపబడినాడు. ఆదర్శంచ...మస్పష్ట సమాధి మాథిక్షీణ మగ్రగణ్య మానభి రూపాణాం కృపణ వర్ణం కమపిక్షపణకం" అనగా నా క్షపణకుడు దీనుడై మానస పీడా దుర్భలుడై కురూపియై యుండెనని దీని అర్థము. ఈ క్షపణకుని వేషమును వాని వ్యసనమును నెట్లు కేతన చిత్రించినాఁడో చిత్తగింపుడు

సీ. భూరేణు పటలంబు పొదవిన వక్షంబుఁ
గన్నీటఁ దోఁడ్తోడఁగడగు వాని
డాకేలు నెక్కువ దాపిడి తనలోనఁ
తలపోసి తలపోసి యలయువాని
ధరలోన గలుగు నొప్పరి మిండలకు నెల్ల
మొరలు నాఁ జాలిన మూర్తివాని
బరివోవ సూఁచినఁ బలుచనై తల మీద
దూగాడు వెండ్రుక తోకవాని

తే. గూటికుంచెయు వెడచింపి చేటకెలన
దొంతి బుట్టల చిక్కంబు పొంతఁబెట్టి
వగలఁ బొగిలెడువాని నిర్వాణి నొక్క
తరుణ తాపసిఁ గాంచితి ధరణినాథ.

ఇందు మొదటి పంక్తి మాత్రమే మూలమున కనుకూలము. కేతన ప్రతిభా ప్రభావమే.

మూలములో సూర్యోదయ మయ్యెను అని మాత్రమున్నది. గాని యా భాగమునే కేతన పంచమాశ్వాసమున నిట్లు వర్ణించినాడు.

సీ. ప్రాచీన శైలాగ్ర భాగస్థమగు నశో
కంబునఁ జిగురు జొంపంబనంగ
వర్షాధిపతియని వాసవు గొలువ జే
రిన యింద్రగోపక శ్రేణియనగ
నురుతర పూర్వభూధరము నెత్తంబున
బొలుచు గైరిక గండ శిలయనంగ
కాశ్మీర పటమున గావించి సురపతి
విడిచి యాడెడు వాలుబడగ యనగ
తే. నరుణ కిరణుండు దోతెంచె నంబుజాత
నర్మసచివ స్మితా పాదనంబునందు
జతురుడై యుష్ణకరముల జక్రవాక
తాపముడుపుట నాశ్చర్య ధాముడగుచు.

ఒక ధనికుని ఇంట దొంగతనము కాగా పౌరజనులాచోరుని చాకచక్యము నివ్విధముగా వర్ణించిరని మూలమున లేని విశేషమును దెనుగులో కేతన కల్పించి నాడు చూడుడు.

సీ. ఇమ్మాక లిబ్బంగి నింటిలో దిరుగంగ
సరకు సేయక వచ్చుటరిది కాదె... పంచ ఆశ్వా 130 పద్యము.

మూలమందొక లంజ తల్లి రాజుతో తన కులాచారమును గురించి యిట్లను.

నహ్యార్థైర్న్యా యార్జితైరేన పురుషావేశ ముపతిష్టంతి (విటులు అన్యాయార్జితమైన ధనములను వేశ్యకిచ్చి వారిని బొందుదురు అని దీని యర్థము) ఈ వాక్యము నాధారముగా విటుల న్యాయార్జితము లెట్టివి తెత్తురో మనకేతన వర్ణించిన విధమిది.

సీ. కన్నంబు వెట్టి తెక్కలి కొని యంకంబు
పలువురితో నాడి బందివెట్టి
జూదంబునకుఁ జొచ్చి చూఱకాండ్రం గూడి
పరదేశముల కేగి తెరువులడిచి....

....ఆ, 6 ప. 95.

షష్టాశ్వాసమందు అపహార వర్మరాజ కన్యను జూచినప్పుడామె సౌందర్య వర్ణనము మూలమందు విశేషముగా కలదు. మన యాంధ్ర దశకుమార చరిత్ర మందది విడువఁబడినది. అపహార వర్మ రాత్రి రాజగృహము కన్నము వెట్టి సృగాలికయను దానిని వెంబడించుకొని వీధులందు బోవుచుండ దలవరులు వచ్చుటయు వారిని జూచి యితఁడు తప్పించుకొను నుపాయము కానక విధి కృతము తప్పునేయని వారి ఎదుటికిబోయి నేను దొంగను నన్ను పట్టుకొనుడు అని పలికెను. కాని సృగాలిక యిట్లనెను. "అయ్యా! ఇతడు నా కొడుకు. పిచ్చి యెత్తినది. ఇంటిలో బంధించి యుంచ తప్పించుకొని వచ్చి యిట్లు వెఱ్ఱిని మీ యెదుట ప్రకటించుచున్నాడు.

మూలమందింతయ యున్నది. వెఱ్ఱి పట్టినదను విషయమును నాధారము చేసుకొని మనకేతన బహురమ్యముగా హాస్య జనకముగా నీవెఱ్ఱి తనమును వర్ణించిన ఘట్టము ముఖ్యముగా గమనింపదగినది.

సీ. చేసంకు పట్టుచుఁ జిడుపలు వెదకుచు
నొరి గాలదేవుడు నులికి పడుచు
విందులు విందులు విందులంచును బఱ
తెంచి మ్రాకులు కౌగలించి కొనుచు
మునుకుచు వెలుగుతో ముచ్చటలాడుచు
బొరిపొలి గూయుచు బొబ్బలిడుచు
గల మాటలాడుచు మొలపుండ్ల మల్లని
బాడుచు నొడలెల్ల బరికి కొనుచు

తే. నేవమగ ఔొమ్ముపై నిండ ద్రేవు డొలుక
నన్న కుడుములు దినవన్న యనుచు డాసి
గుండ్ర గుడ్లను జూపుచు గునిసి గునిసి
బయలు నవ్వుచు బడుకిళ్ళు వాచి కొనుచు

వ. "అయ్యారె కులదిక్కు మరలి"

తే. నేల జేతులు సమరి మైనిక్కమెల్ల
నఱచి యుంకించి యడువులు గఱచుటయును
వారలద్దిరా! యని వచ్చి నలియబాఱ
దోలికొని వారినిలిపితి సూల వొడచి

వ. "దానికి వారలందరు బెలుచ నవ్వుచు నరిగిన"

మూలమందు ఒక కోమటి నానాదేశములు తిరిగి యొకచోఁ దనకు నచ్చి నట్టి కన్యను జూచెను. ఆ కన్యక లక్షణములు – అనగా – వివాహయోగ్య కన్యాలక్షణము లను దండి విశేషముగా వర్ణించినాడు. కేతన యిది వదిలినాడు. కథా సందర్భమునకు దగినట్లుగా నాయా తావుల కేతన మంచి యుపమానములను సామెతలను జొనిపి నాడు. మూలమందులేని యొందు రెండు చూపెదను.

క. ఆ రమణీ తిలకమునకు
గారవమున శిశిరవిధులు గావించిన బొం
గారెడు నేతికి బయిపై
నీరలికినయట్లవోలె నిష్ఫలమయ్యెన్. ఆ. 3

క. .... ఆడబోయిన తీర్థం
బెదురుగ వచ్చిన క్రియ ఆ. 3

వ. చుంబక శిలాప్రతిమం దగులు నయోరూపంబునంబోలె ముని తన సజ్జ
యరుగుదేరు దరుణి రాజ మందరిమునకుం జని (ఆ. 5)

ఉ. తేనియబద్ద యీగగతి ధీరత గోల్పడి బిట్టు
చొక్కతిన్ (ప్రణయ వర్ణన) (ఆ. 6)

ఆ. ఏను జోరవృత్తి నిచ్చితినేనియు
మేలి వస్తువైన తోలుతిత్తి
దక్కునెట్లు మీకు గుక్కకు డెంకాయ
దక్కదనిన పలుకు నిక్కమయ్యె॥

దండి మహాకవి క్రీ.శ. ఏడవ శతాబ్దమందుండెనని పండితులు నిర్ణయించి నారు. మఱియు కేతన తన గ్రంథమును దిక్కన సోమయాజికంకిత మిచ్చుటఁ జేసి యితడు తిక్కన సమకాలికుడనియు క్రీ.శ. 13వ శతాబ్దమందు జీవించిన వాడనియు పండితులు నిరూపించినారు. ఈ యుభయులకు మధ్య సుమారు 500 సంవత్సరముల యంతరాయమున్నది. దండి యాంధ్రుడో కాడో మనకు తెలియదు. దండి గ్రంథమందు జూదము, కోడిపందెము, సముద్రయానము వర్ణింపబడుటచేత నాతని కాలమున నివి జనులందు వాడుకగా నుండెనని చెప్పవచ్చును. ఈ వర్ణనలు తెనుగులో తర్జుమాయై నందున నివి కేతన కాలమున నాంధ్రదేశమందుండెనో లేదోయని సంశయింపబని లేదు. కేతనకు సుమారు 100–200 సంవత్సరాల తర్వాతివాడగు వల్లభరాయుడు తన క్రీడాభిరామమందు ఓరుగంటి పట్టణములో, జూదము, కోడి పందెములు జరిగినట్లు వర్ణించినాడు. కోడిపందెము మొట్టమొదట మన దేశమందే కనిపెట్టబడినది. అమరసింహుడు క్రీస్తు శకాదిలో నుండినాడు, అతడు నిఘంటువునందు కోడికి పర్యాయపదములనిట్లు వ్రాసినాడు.

"కృక వాకస్తామ్రచూడః కుక్కుటశ్చరణాయుధః" ఇందు కోడికి చరణాయుధః అని చెప్పు మాటను జూచిన – నాతని కాలమందే కోళ్ళ పందెములు జరుగుచుండెనని యూహింపవచ్చును. కోళ్ళ పందెమును గుఱించి యొక శాస్త్రమే యున్నది.

ఆంధ్రదేశమందు పందెగ్రాండు నేటికిని కోళ్ళలో కాకిజాతి డేగజాతి నెమిలి జాతి మున్నగున వున్నవనియు నొక్కొక్క జాతి యొక్కొక్క కాలమందింకొక జాతి కోడిపై జయము పొందుననియు శాస్త్రములో వ్రాసికొని పందెములప్పుడు చూచు కొందురు. దశకుమార చరిత్రయందు ఒక జాతి నారికేళ జాతులు వర్ణింపబడినవి. మూలమందు నారికేళ జాతి ఒకజాతి కోడిని గెలిచెనని మాత్రమున్నది. కాని మన కేతన కోళ్ళ యుద్ధమునే వర్ణించినాడు.

సీ. ఎదిరిన కోడి మున్నెనసి యారెలు మెడ
　　　నెసగాడ నురువడి వ్రేసి వ్రేసి
అది వ్రేయ మదికిన్క నదరి బల్పున బట్టి
　　　కబళించి యందంద కదిమి కదిమి
విశిఖ ముఖంబులు వెనువెంట దగులుచు
　　　నంతంత బోనీక యాగి యాగి
వాగాటులకు వచ్చి వసుమతి నిలువక
　　　యొంటి తన్నున గొసరుడిపియుడిపి

గీ॥ గెలిచె నా మాట దగ నారికేళ జాతి
యగ్గలికనంత బ్రజయెల్ల నార్చుచుండె
జెలగి ఒక జాతి మాత్రోపజీవియైన
బ్రాహ్మణుండు నన్నెంతయు బ్రస్తుతించి.

జూదము ఇరువదియైదు విధములదని దండి వర్ణించినాడు. ఆ జూదమందు అపహారవర్మ పదివేల దీనారముల గెలిచెనట. దీనిచే దండికాలమున దీనారములు నాణెములుగా విశేష ప్రచారమందుండెనని తెలిసెడి. కేతన తన భాషాంతరీకరణమున నెందును దీనారముల పేర్కొనలేదు. దానిచే నితని కాలమందివి లేవని కాదు. ఇతని తర్వాతవాడగు శ్రీనాథుడు.

"దీనారటంకాల తీర్థ మాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాల"

యని చెప్పికొనినాడు.

దండి కథలలో తలవరుల ప్రాముఖ్యము చాల గనబడుచున్నది. నిజాములో బీటు జవానులీ కాలములో చలాయించు నధికారముకన్న జాల హెచ్చుగా నధికారబలము కలవారై యుండిరనవచ్చును. వారు రాత్రికాలమందు కోల దీవటీలతో గస్తీ తిరుగుచు వీధులందు సంచరించు జార చోరులకు గుండె గాలములై ఉండిరి. మన అపహారవర్మ (ఈతని కథయే కథలన్నిటిలో రమ్యము) వీరిచే బలు సంకటముల బడినాడు. వారి నుండి తప్పించికొనుటకై ఒక తూరి పాము కఱచినట్లు నటించినాడు. ఈ తలవరులను మూలమందు రక్షకబలమనియు నాగరక బలమనియు వర్ణించియున్నాడు. మన కేతన వీరిని ఆరెకులు, తలవరులు అని తెనిగించినాడు. అయితే యీ తలవరుల యధికారములు దండి కాలమున నుండెనేమో కాని కేతన కాలమున నాంధ్రదేశమున లేకుండెననజాలము. కేతనకు తర్వాత వాడును క్రీ.శ. 1600 ప్రాంతమున నుండిన కదిరీపతి తన శుకసప్తతిలో తలార్లను ననేక స్థలముల వర్ణించినాడు చూడుడు.

క. చుట్టాలకుఁ దెల్పుదు మది
దొట్టిన కినుకం దలార్లతో జెప్పుదు గూ
పెట్టుదు దొరముందర నను
బట్టకుమని పఱవ నతడు బరువగుభీతిన్.

ఉ. అంత తలారు లాత్మవిభు డచ్చటికిం జనుదేర జార వృ
త్తాంతము దెల్ప బట్టుడని యాతడనం గుడి సొచ్చి దివ్విటీల్
చెంతకు దెచ్చి చూచి....

సీ. చనుజక్కవలుగన్న సన్యాసులైనను
దలవరి వారితోఁ జెలిమిసేయ

కావున కేతనకాలమందును దలవరుల పోలీసుతనము విశేషముగానుండెను. కావుననే

తే. కోలదివియల వెలుగు దిక్కులకు నిగిడి
తొడరి పురివీధి చీకటి దొలగ దోల
బటురయంబున తలవరి బలమురాక
చూచి యొక్కింత చిత్త సంక్షోభ మెసగ.

అని వర్ణించినాడు.

చోరులనేగాక జారులను గూడ బట్టు నధికారము తలవరులకు నుండెనని తెలిపితిమి. ఈ యాచారమును గుఱించి యెన్నటి విషయమో త్రవ్వనేల నిన్న మొన్నటి వఱకు గద్వాల సంస్థానములో గణాచారిగుత్తయని యొకటి రాజు లేర్పాటు చేసియుండిరి. ప్రతి గ్రామము గుత్తను నొకడు తీసుకొని యా మొత్తమును రాజుగారికి చెల్లించును. గుత్త తీసుకొన్న వాడా గ్రామమందెవ్వరైనా వ్యభిచరించినట్లు తలార్లవలన గుర్తెరిగిన వారి నుండి తాను దండుగలు తీసుకొనుచుండెడివాడు. ఈ గుత్తనే గణాచారి గుత్తాయని వ్యవహరించుచుండిరి.

జైన మతము దండి కాలమునందును కేతన కాలములోను బ్రచార మందుండెననియు జైనులు బ్రాహ్మణ దూషకులునై యుండిరని దెలియవచ్చెడి. కేతన జైన వేషమును వర్ణించుటచేత నాతని కాలమందు జైన వేషాచారము లెట్లుండెనో వివరముగా తెలియవచ్చెడి.

దండి కాలమందును కేతన కాలమందును స్త్రీలు సాధారణముగా నెట్టి సొమ్ములు పెట్టుకొనుచుండిరో యీ క్రింది యుదాహరణముల వలన దెలియగలదు.

"ఆహ మపి మణి నూపుర మేఖలా కంకణ కటక తాటంక హార మరాకజ్జల వనితా యోగ్యం మండన జాతం నిపుణత యాతత్ర స్థానేషు నిక్షిప్య" అని దండి వర్ణించినాడు.

సీ. మట్టియ లుజ్జ్వల మణి నూపురంబులు
మొలనూలు వస్త్రముల్ ముత్తియములు
కన్న వడంబులు గట్టి నూళ్ళాను సుద్ద
సరితీగె మినుకులు సంది దండ
నంగుళీయములు హారి కంకణములు
చేకట్టు పాలెలు చెన్ను మెఱుగు
టాకులు సరిపెణ లాలక్తకము పూత
కాటుక తిలకంబు కమ్మపువ్వు
తే. లాదిగా గల మేలిద్రవ్యముల నొప్ప
బసదనము చేసి యుచిత రూపంబు దాల్చి
బాలచంద్రిక బోటినై పజ్జ కరిగి
దారువర్మని లోగిలి దరియ జొచ్చి.

ఈ పద్యమందు పెద్ద అక్షరాలు మూలమున కనుకూలములు. తక్కినవన్నియు కేతన చేర్చినవే. ఇవి బాగుగా గమనింపదగినవి. కేతన కాలమందీ యలంకారములనే ఆంధ్ర స్త్రీలలంకరించుకొనుచుండిరి. భూషణముల పేర్లు విశేషముగా నచ్చ తెనుగు పదములు. ఈ భూషణములు నేటికిని మన యాంధ్ర స్త్రీలు పాటించుచున్నారు.

ఇది యాంధ్ర దశకుమార చరిత్ర మందు నాకు దోచిన విశేషములు. ఈ కవి శైలి విషయము నేను ప్రత్యేకముగా నిరూపించనవసరము లేదు. కేతనయే వ్రాసికొనిన యీ పద్యము నుదాహరించిన జాలును.

ఆ. కవితఁ జెప్పి యుభయ కవి మిత్రు మెప్పింప
నరిది బ్రహ్మకైన నతడు మెచ్చ
బరగ దశకుమార చరితంబు జెప్పిన
ప్రోడ నన్ను వేఱ పొగడనేల.

ఈ కేతన దశకుమార చరిత్రను జూడని నిర్భాగ్యులైన యాంధ్రు లెవ్వరైన నుండిన వారు తప్పక యా గ్రంథమునైన దిలకింతురని గోరుచున్నాను. ఈ దశకుమార చరిత్రమున కుత్తమముగా బీఠికను శ్రీ శేషాద్రి రమణ కవులు వ్రాసియున్నారు. దాని నవశ్యము పాఠకులు చదువుదురని మనవి.

అప్పకవి

ఇటీవల ప్రచురితమైన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము రెండవ భాగము చూచితిని. అప్పకవిని గురించి ఇందు ఇంచుక వ్రాసినారు. అతడు గుంటూరులో వాడని నిరూపించుటకు ముప్పుతిప్పలు పడినారు. స్థానికాభిమానముతో అట్లు వ్రాయుట కారణము కానరాదు కాని నిజాం రాష్ట్రమువారి యభిప్రాయముల గమనింపని వివేకము వారికి చేకూరినది. కందుకూరి వీరేశలింగము పంతులువారు అప్పకవి కృష్ణామండలము వాడని వ్రాసిరి. మరియు శతఘంటము వేంకటశాస్త్రిగారు తమ భారతపీఠికలో నిదే సూచించిరి. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వమువారు ప్రథమ ముద్రణములో అప్పకవి గుంటూరు వాడని వ్రాసి ఇప్పుడును అదేమాట వ్రాసినారు. కాని యిది సరియైనది కాదు. సంపూర్ణంగా తప్పువ్రాతయే. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ ప్రథమ ద్వితీయ ముద్రణములును, నిజాం రాష్ట్ర పత్రికలలో మూడు వ్యాసములును బయలుదేరెను.

దేశబంధు మాసపత్రికలో శుక్ల సంవత్సర జ్యేష్ఠ మాసములో నేను వ్రాసిన వ్యాసము.

బూర్గుల రామకృష్ణారావుగారు గోలకొండ పత్రిక 2వ సంపుటము మొదటి సంచికలో అంగీరస వైశాఖ శు॥లు 2నాడు వ్రాసిన అతివిపులమగు వ్యాసము.

గత సంవత్సరము గోలకొండ సంచికలోని పూర్వకవి భాగములో శ్రీ శేషాద్రి రమణకవులచే సంకలిత వివరణము.

ఇవన్నియు సర్వస్వమువారు చూడకపోవుట తటస్థించినది. ఈ సవరణ వ్యాసమును గూడ చూడకుండిన నాశ్చర్యమేమి?

ఈ వ్యాసమును నేను నిజాం రాష్ట్రాభిమానముతో వ్రాయుటకాదు. యథార్థమును వెల్లడించుటయే దీని యుద్దేశ్యము. అప్పకవి మరియు నిచ్చటివారు

చేయు భాషాసేవను నెరుకపరచుటయు జ్ఞాపకము చేయుటయు ద్వితీయోద్దేశము. అప్పకవి నిజముగా నిజాం రాష్ట్రమువాడు గాడని అతనిని కృష్ణలో వేసినను గోదావరిలో వేసినను మేమేమి చేయగలము?

ఇక ప్రకృత విషయము – అప్పకవి నిజాం రాష్ట్రములోని మహబూబునగరు జిల్లావాడు. పాలమూరను పూర్వనామమునకు నూతన నామకరణమే మహబూబు నగరు. నేను దేశబంధులో వ్రాసిన భాగమిది.

అప్పకవి వ్రాతలగూర్చి చర్చించుటకు పూర్వము వారి నివాసస్థలమును గూర్చి బయలుదేరిన సందిగ్ధములకు తోడుగ నింకొక సందిగ్ధమును జతపరుప నెంచితిని. అతడు గుంటూరు మండలమువాడని యొకరు, కృష్ణకు దక్షిణమున నొక యోజనము దూరమున (నెచ్చటనో) యుండెనని యొకరును వ్రాసిరి. అతడు మహబూబునగరు జిల్లావాడేమోనని నాకనుమానము కలిగినది. ఏలన నతడు తన గ్రంథములో నుదహరించిన స్థల నామములు మహబూబునగరములో గాన వచ్చుచున్నవి.

"కొండూరు" అనునది "కోడూరు" ఏమో! చలిమల్ల యిప్పటి చెలిమిళ్ళయేమో! తంగెడ విషయము యిప్పటి తంగెళ్ళపల్లి యేమో. అభినవచూత గ్రామము అను అచ్చుతెనుగు చేసిన లేమావిళ్ళ యగును. వట్టెము యిప్పటికి వట్టెముగానే యున్నది. ఈ గ్రామములన్నియు మహబూబునగరు జిల్లాలో నున్నవి. శ్రీశైలమునకు సమీపమున నున్నవి. కావున ననుమానముతో సూచించితిని గాని నేనా జిల్లా వాడను ఐనందున స్థలాభిమానముతో గాదని ముందే విన్నవించుకొనుచున్నాను.

ఈ అనుమానమును నిస్సందేహ పరచినది మా మిత్రులును పండితులును యగు శ్రీయుత బూర్గుల రామకృష్ణారావుగారు. వారు గోలకొండ పత్రికలో నిట్లు వ్రాసిరి.

"కాకునూరు గ్రామ మెచ్చటనుండిన దెవ్వరికినీ తెలియనట్లున్నది. కాని పై పద్యము చదివినచో

(బాలుడై కాశికాపట్టణంబునకేగి
బ్రహ్మేంద్రు నొద్ద శాస్త్రములు జదివె॥)

నిజాం రాష్ట్ర వాసులమగు మనకు ఈ కాకునూరు గ్రామము నిశ్చితముగా నిర్ధేశించుటకు వీలుగలదు. చరికొండసీమలో అని వ్రాసియున్నాడు మహబూబునగర్

జిల్లాలో నాగర్ కర్నూలు, కల్వకుర్తి తాలూకాలలో చేరియున్న గ్రామాదులన్నియు దాదాపు నాడు చరికొండ సీమలో చేరియుండినవి. చరికొండ గ్రామము కల్వకుర్తి తాలూకాలో నున్నది. ఈ సీమలో చేరిన కాకునూరు నా జన్మస్థానమగు బూర్గులకు నాలుగు కోసల దూరమున్నది. ఇపుడది గుమార్‌గీర్ అను గోస్వాములకు సర్వాగ్రహారముగా నున్నది. నిడుదవెల్లి బొద్దనేవెల్లి మొదలగు గ్రామాదులందు మాన్యక్షేత్రముల గడించెనని వ్రాసికొనియున్నారు కదా! పై జెప్పిన కాకునూరునకు మిగుల సమీపముననే యొక యామడలోపల పై గ్రామాదులన్నియు నిప్పటికి కలవు. కాకునూరికి రెండు క్రోశములలో నిడుదవెల్లి కలదు. బొద్దినేపల్లియు రెండు క్రోశములలో నున్నది. కల్వకుర్తి తాలూకాలో చేరినది. "నివరళపురి" యను పాఠము సరికాదు." నవదళపురి యని నా ప్రబలమైన యనుమానము. కాకునూరికి రెండు క్రోశములలో తొమ్మిదిరేకుల యను గ్రామము కలదు. ప్రాత ప్రతుల మూలములు మరల పరిశీలింపదగినవి.... "అభినవచూత సద్గ్రామము" విషయమై క్రీ.శ. లక్ష్మణరావుగారును, గిడుగు సీతాపతిగారును పొరపడినారు. ఈ గ్రామమును క్రొత్త మామిడిపల్లె యనిరి. మామిళ్లపల్లి యను గ్రామము లిక్కడను గలవు. అమరాబాదు తాలూకాలో నొక గ్రామము కలదు.... కాకునూరికి క్రోసెడు దూరముననే "లేమామిడి" లేక "లేతమామిడి" యను గ్రామము పురాతన ప్రసిద్ధముగా నున్నది. "వట్టెము" నాగర్‌కర్నూలు తాలూకాలో చేరిన గ్రామము. ఇది రావుగారి వ్యాస సారాంశము. ఆ వ్యాస మతి విపులమై సమగ్ర చర్చగలదై యున్నను స్థల విస్తరణమగునని సూచన మాత్రముతో తృప్తి బొందుచున్నాను. అభిలాషులు దానిని జూడగలరు.

తర్వాత గోలకొండ కవుల సంచికలో పై బూర్గులవారి యభిప్రాయమునే బలపరచుచు శ్రీ శేషాద్రి రమణ కవులు వ్రాసిరి - గత సంవత్సరము కాకునూరు ప్రాంత మిత్రుడొకడు నాతో చెప్పిన విషయములేమన కాకునూరు నిడదవెల్లికి రెండు మైళ్ళ దూరమున నున్నదనియు, తొమ్మిది రేకులకు (రామకృష్ణారావుగారు సరిగా చదివిన నవదళపురి పాఠము నిరవళిపురికాదు) రెండుమైళ్ళ దూరమునను కలదనియు నీ గ్రామములన్నియు తనకు పరిచితములే యనియు తెలిపినారు. మరియు కాకునూరు కల్వకుర్తిలో ఖాల్సా యిలాకా మఖామనియు తెలిపినారు. చరికొండ కాకునూరునకు

ఎనిమిది కోసుల దూరములో నున్నదనినారు. బొద్దినేపల్లి కాకునూరికి ఒక కోసు దూరములో నున్నదనినారు.

కామెపల్లి యెక్కడిదోనని అందరు తికమకలగుచున్నారు. దేవరకొండకు (నల్లగొండలోని తాలూకా గ్రామము నాగర కర్నూలు తాలూకా సరిహద్దులో నుండునది) 20 మైళ్ళ దూరములో నున్నదని పై మిత్రులే చెప్పినారు. గోననాని పల్లె అను గ్రామమునకు 10-15 మైళ్ళ దూరములో నున్నదనియు చెప్పినారు.

ఇదే సందర్భములో తిరుమలభట్టారకుని విషయము సూచించుట అప్రస్తుతము కాదనియు ముందు ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము వారీ వ్యాసమును చూడ తటస్థించిన తప్పుదిద్దుకొనదలచిన తిరుమల భట్టారకు నొద్దనైన సరియైన సమాధానము జెప్పిన అతని వంశీయుడగు అప్పకవికి చేసిన యపచారమునకు "మాఫీ" యగునని తలచి వ్రాయుచున్నాము.

అప్పకవీయములో చతుర్థాశ్వాసములో గణదేవతాఫలశీర్షికలో 68 సంఖ్య గల వచనములో వావిళ్ళవారి 1910 వ సంవత్సరపు ముద్రిత ప్రతిలోని పుటలో నిట్లున్నది. "కాలామృతమునందు శ్రీమద్వేంకట నాయకమ్మని, మదీయాన్వయ ప్రభువుండగు తిరుమల భట్టారకుండును..." అను వాక్యము గమనింపదగినది.

సుప్రసిద్ధ కాలామృత గ్రంథకర్తయు తిరుమల భట్టారకుడు అప్పకవి పూర్వీకుడును, వంశస్థుడును.

తే॥ అందులో కాకునూరి రంగాహ్వయుండు
గనియె నలువురి తనయుల గన్నమాంబ
యందు దిరుమలభట్టు గంగార్యవర్యు
నెలమి బెదసోము జినసోము నిందులోన

అను పద్యములోని తిరుమల భట్టితడోయోమో!

మరియు అప్పకవి వంశస్థుడు శేషయ్య యను పేరుగల యువకుడు మహబూబునగరు జిల్లాలో వట్టెము ప్రాంతములో నున్నాడనియు, తమవద్ద కొంతకాలము చదువుకొనియె ననియు నా మిత్రులును కర్నూలులో పాఠశాల పండితులునగు శ్రీ అనుముల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు నాతో చెప్పినారు.

ఇన్ని కారణములుండినను అప్పకవి గుంటూరు మండలము వాడై యుండెననియే యొండు రెండూహలు చేసి నిర్ణయించుట సరికాదని మనవి చేయుచున్నాను.

ఇక అప్పకవి కావ్య విశేషముల నరయుదము

కల

మన యాంధ్రకవులు చాలా ధన్యులు. వారికి గ్రంథములు వ్రాయబుద్ధి వొడమిన తప్పక వారి కులదైవము వారికి ప్రత్యక్షమై గ్రంథమును వ్రాసి తనకు అంకితమీయ కోరుటయు సంభవించును. కలలో కేవలము కనిపించుటయే కాదు. వీరి దైవము వీరితో చాలాసేపు ముచ్చటించి నన్నయ, భీమన, సారంగధరుల కథయు, తాతన, కేతన రచించిన గ్రంథములు మెచ్చకపోవుటయు మున్నగు ముచ్చటలు గూడ నిందు గలవు. ధన్యోస్మి అని మరునాడే గ్రంథము ప్రారంభించెను మన అప్పకవి.

ప్రబంధ లక్షణము

ప్రబంధ లక్షణమును నిరూపించిన వీరి పద్ధతి ఆంధ్ర భాషకు చాల కష్టము గలిగించినదని నా అభిప్రాయము. ఏలయన, వీరు జూపించిన వర్ణనములన్నియు ప్రతి గ్రంథమందుండిన సామాన్యమై రుచి తగ్గుటయు, కవికి స్వాతంత్ర్యమీయక వర్ణనములందు కూడ దాసునిగా జేయుటయు, కథా సందర్భమునకు సంబంధించక పోయినను బలవంతముగా వర్ణనములను పట్టుకొని వచ్చి కూర్చుటయు, జలవిహార, సురతములను వర్ణించుట చేత గ్రామ్యత్వము కవులకు సిద్ధించుటయే ఈ అప్పకవి గారి మార్గమున నడుచుటవలన కలుగు ఫలితములు. చూడుడు వారి ఆదేశము.

సీ॥ పురమును ఋతుషట్కమును ప్రయాణంబును
 శైలంబు వేటయు సాగరంబు
మౌనీంద్ర పుణ్యాశ్రమంబును మంత్రంబు
 ద్యూతంబు పిదప నద్భుత రణంబు
విజయంబు మద్యపానజ వికారంబును
 వనవిహారంబును వారికేళి
కన్యాంగ సౌందర్య కథనంబు హిమకరా
 భ్యుదయంబు విప్రలంభోదితంబు

పద్మ మిత్రోదయంబును బరిణయంబు
సురతమును దౌహ్వదంబును సుత జననము
ననగ నిరువది రెండు వర్ణనలు గూర్చి
చెప్పవలయు బ్రబంధంబు శ్రీనివాస!

కల్లుద్రావి చెప్పి వికార చేష్టలు కూడ వర్ణించవలయునట. కొడుకు పుట్టని కథ ఉండినను కొడుకును పుట్టించి వర్ణించవలయునేమో! కన్యాంగ సౌందర్య కథనంబు అని చెప్పుటచేత కవులనేకులు పిచ్చి పిచ్చిగా వర్ణించినది అట్లుండ కొందరు చెప్పరాని అంగవర్ణనలు కూడ చేసిరి. చాల కట్టి (వరుస పెట్టి) మధ్యకాలపు కవులందరు "ఉండంగ ఉండంగ ఒక ఊరుండె" అని పురవర్ణనతో కథ ప్రారంభించిరి. కాళిదాసు కుమార సంభవములో 'అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా' అని ప్రారంభము తోడనే హిమాలయ వర్ణన తోడను, మేఘసందేశములో 'కశ్చిత్కాంతా విరహ గురుణా' అని శాపాస్తంగమిత మహిముడై విరహార్తి పొందుచుండిన యక్షుని వర్ణన తోడను, భారవి "శ్రియఃకురూణాం" అనియు ప్రారంభించిన గ్రంథము లెంత మనోహరముగా నున్నవో వేరుగా చెప్పనవసరము లేదు.

సారస్వతౌషధములు

అప్పకవి కొన్ని ఔషధములు తయారుచేసియున్నాడు. మనదేశములో వైద్యము ఒక రహస్య శాస్త్రముగా నుండెడిది. సిద్ధుల వలనను, సన్యాసుల వలనను, యోగుల వలనను, హిమత్పర్వత మూలికల నెరిగిన అనుభవజ్ఞుల వలనను, ఎవరైనను ఒక చిటికలగానీ, ఘటికలోగానీ, చేయనేర్చుకొనిన దాని నతిగోప్యముగా నుంచుకొని ఇతరులకు చెప్పకుండెడివారు. అట్టిచో "సూక్తులు ఘటించు, మందులను కర్షమాత్రంబు భక్షింపగలిగెనేని" – గడియకొక పద్యశతకంబు నుడువ జేయునట్టి మందును, నలువచెలువ 'నాలుకను కాపురంబుండు' నట్లు చేయు దివ్య ఘటికను నెరిగిన అప్పకవి ఏ మాత్రమును దాచక లోకోపకారార్థమై వెల్లడించినందులకు కృతజ్ఞతా బద్ధులుగా నుండవలసినదే. కాని, ఎవరైన నిది నిజమనినమ్మి చూపించిన ప్రకారము మందుల సేవించిరో లేదో తెలియదు. శతఘంటము వారమని బిరుదుల నుంచుకొనిన వారికేమైన నీ రహస్యము తెలియనేమో!

పోతనామాత్యుడు

రేఫ ర కారములు మైత్రిని చేసెనని పోతనామాత్యుని తప్పుపట్టి ఈ అప్పకవి ఆ మహాకవిని ఉదాహరించుటయే మానుకొనెను. కాని, రేఫ ఱ కారమైత్రి చేసిన ఇతర కవులను నెందరినో ఉదాహరించుటలోని మర్మమేమో ఊహింపజాలను. పోతన విషయమయి ఇట్లు సెలవిచ్చిరి.

బమ్మెర పోతరాజకృత భాగవతంబు సలక్షణంబుగా
కిమ్మహినేమిటిం గొదువ యెంతయు నారసి చూడగాను రే
ఫమ్ములు ఱాలునుం గలిసి ప్రాసములైన కతంబునంగదా
యిమ్ముల నాది లాక్షణికులెల్లను మాని రుదాహరింపగన్

అయిన అప్పకవి తర్వాత వచ్చిన కూచిమంచి తిమ్మకవి సార్వభౌముడు తన సర్వలక్షణ సారసంగ్రహములో నిట్లు పోతనగారి నిజమయిన గొప్పదనమును నిరూపించి పుణ్యము కట్టుకొనెను. పోతన ప్రాశస్త్యమును ఇట్లు వర్ణించెను.

అఖిల వేదాంత విద్యారహస్యవిదుండు
    సహజ పాండిత్య విశారదుండు
పటుతర కవితా విభాసిత ప్రతిభుండు
    సకలాంధ్ర లక్షణ చక్రవర్తి
రఘుకులేశు నిదేశ రచిత మహా
    భాగవత పురాణుడు పుణ్యవర్ధ
నుండు..............................

బుధజనహితుండు బమ్మెర పోత సుకవి
ఎన్న రేఫ ఱ కారంబు లెరుగడనుచు
నజ్ఞు లొక కొందరాడుదు రమ్మహాత్ము
కవిత కెందును లోపంబు గలుగదభవ

పోతన భాగవతము కొంత శిథిలముకాగా దానిని పూరించిన కవుల పద్యము లందే ఈ సాంకర్యము కలదు. కాని పోతన కవితలో లేదని పద్యముల ననేకము లాయా కవులవి ఉదాహరించి తిమ్మకవి నిరూపించెను.

సంస్కృతాంధ్ర కవితా పటుత్వముచేత నొప్పి ఈ 300 సంవత్సరముల నుండి వెలసిన కవుల కందరకును భిక్షపెట్టిన అప్పకవిని తప్పుపట్టు నుద్దేశముతో ఈ వ్యాసమును వ్రాయలేదు. అట్టి మహాకవి కీ లోపములు లేకుండిన బాగుగా నుండెడిదనియె నా అభిప్రాయము.

(ఈ వ్యాసం అప్పకవి గురించి వ్రాసిన రెండు వ్యాసాల సంక్షిప్త రూపం)

సుమతి శతకము

కర్త యెవరు?

సుమతి శతకమును వ్రాసిన మహాకవి యెవ్వరో ఇంతవరకెవ్వరును నిశ్చయముగా తెలిపినవారు కారు. ఈ శతకమున కుండినంత ప్రచారము మరే తెలుగు గ్రంథమునకు లేదు. క్రీ.శ. 1910 లో వనపర్తిలో శ్రీ మానవల్లి రామకృష్ణ కవి పాదులు భద్ర భూపాలుని నీతిశాస్త్ర ముక్తావళిని ముద్రించి దానికొక యుత్తమ పీఠికను రచించి అందిట్లు వ్రాసిరి.

"ఇతడే భద్ర భూపాలుడు (బద్దెన) సుమతి శతకమును రచించెనని ప్రథమ పద్యము చూచిన దోచును. కాని యీ పద్యము నాకు లభించిన యైదు ప్రతులలో నొక్క దానిలో మాత్రమే యున్నది. రెండు ప్రతులలో ప్రారంభము లేదు. సుమతి శతకమునకును దీనికిని పాఠభేదము గానవచ్చుచున్నది. జాతీయ వాచకములలో భేదమగుపడును. సుమతి శతకమును రచించినవాడు భీమకవి యను లోక ప్రవాదమేకాక సుమతి శతకము తాళపత్రములలో ప్రథమ పద్యము భీమన పేరుతో నుండ నేను జూచియున్నాడను. ఇతడు వేములవాడ భీమ కవియా? లేక చదలవాడ భీమ కవియా? నృసింహపురాణమును రచించినవాడు దాక్షారామ వేశ్యలను వర్ణించినందున వేములవాడ భీమకవియే యని తోచుచున్నది... కావున సుమతి శతకమెవ్వరు రచించిరో గుర్తెరుగవలయును. నీతులు బద్దెన నీతులు వలెనున్నవి కాని శైలి మాత్రము భేదముగా నున్నది. ఇదియును పైయంశము వలెనే యనిశ్చితము.

నీతిశాస్త్ర ముక్తావళిలో శ్రీ మానవల్లివారు ప్రకటించిన దానిలో మొదటి పద్యమిట్లున్నది.

"శ్రీవిభుడ, గర్వితారి
క్ష్మాపర దళనోపలబ్ధ జయలక్ష్మీ సం
భావితుడ, సుమతి శతకముఁ
గావించిన ప్రౌఢ, గావ్య కమలాసనుడన్"

శ్రీ.మా. రామకృష్ణ కవిగారన్నట్లుగా సుమతిశతకము యొక్కయు నీతి శాస్త్రముక్తావళి యొక్కయు శైలిలో చాలా భేదము కలదు. అందుచేత సుమతి శతకమును ముందు రచించి తర్వాత నీతి శాస్త్ర ముక్తావళిని రచించి యుండిన సుమతి శతకములోని శైలీ సూచక పదజాలము కొంతయైనను రెండవదానిలో పడవలసి యుండవలెను. అట్టి జాడలేవియు గానరావు.

భీమకవి వ్రాసెననుటకు తాళపత్రపద్యము లేవియు శ్రీకవిగారుదహరింప లేదు. మరియు వేములవాడ భీమకవియు చాలా ప్రాచీనుడు. నన్నయ తిక్కనల కాలపు శైలియే వేరు. సుమతిశతకములోని శైలి శ్రీనాథుని యనంతర శైలిగా కానవస్తున్నది. కాళిదాసుని గురించి మనకెంత తెలియునో తుదకు సుమతి శతక కర్తను గురించియు మనకంతే తెలిసినదనవలెను.

కవియెవ్వరో తెలియనప్పుడు కవి కాలమెట్లు తెలియును. అయినను శతకములోని శైలినిబట్టి కొంత యూహింపవచ్చును. భద్ర భూపాలుడు క్రీ.శ. 1150కి పూర్వమందే ఉండిన వాడనియు అతనిని అతని పద్యాలను నీతి సారములో రుద్రదేవుడును సకల నీతి సమ్మతములో మడికి సింగనయు మరికొందరును నుదాహరించిరని ఆ కవిగారు తెలిపినారు. సింగనాదులు సుమతి శతకము నుండి పద్యాలనేల యుదహరింపలేదు. మడికి సింగన తర్వాతిదే ఈ సుమతి శతకమని చెప్పవచ్చును. నీతి శాస్త్రముక్తావళిలో తిక్కనయు నతనికి పూర్వులును వాడిన పదాలెక్కువగా కలవు. కెలసము, పొరచి, ఎత్తికోలు, పురులు, ఒరిమే, కురగట, మున్నగు బహు ప్రాచీన పదములతడు వాడినాడు. అయితే ఈ పదాలను తిక్కన తర్వాతి వారును వాడిరని పరిశోధించి చూపించ వచ్చును. కాని అవి పరిశోధన శ్రమకు లోనైనవే యగును. శతకములో నిట్టి శబ్దాలు కానరావు.

సుమతికి మూలములు

సుమతి శతకకారుడు విశేషముగా సంస్కృతములోని శ్లోకాల నుండి భావములను స్వీకరించెను. అదే పనిగా పరిశోధించు వారికి విశేషముగా మూల శ్లోకములు లభింపగలవు. స్థూలముగా నాకు తెలిసిన కొన్ని మూలములను తెలుపుకొందును.

క. అధరము కదలీ కదలక
మధురములగు బాసలుడిగి మౌనవ్రతుడౌ
నధికార రోగ పూరిత
బధిరాంధక శవము జూడ బాపము సుమతీ

శ్లో. బధిరయతి కర్ణ వివరం
వాచం మూకయతి గాత్రయష్టిం
సంపద్రో గోయ మద్భుతోరాజన్

"ఉపమింప మొదలు తియ్యన
కపటంబెడ నెడను చెరకు కైవడినేవో"

అనునది. హితోపదేశ మందిట్టి భావముగల శ్లోకమును బోలినది.

"చెఱకు తుద వెన్ను బుట్టిన
జెఱకున దీపెల్ల జెరుచు సిద్ధము సుమతీ.

ఇట్టి భావమే తమిళ నీతి కారులు వాడినారు.

"కరంబు (చెఱకు-క-చ- అగును) పూవోల్"

(చెరకు పూవువోలె) అని తమిళ పద్య పంక్తి ఈ రెంటికిని సంస్కృత మూలముండి యుండును.

"తలనుండు విషము ఫణికిని
వెలయంగా తోకనుండు వృశ్చికమునకున్
తలతోక యనక నుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ"

దీనికి సరియగు శ్లోకము

"వృశ్చికస్య విషం పుచ్ఛం మక్షికస్య విషంశిరః
తక్షకస్య విషందంష్ట్రా సర్వాంగం దుర్జనే విషః

"తల దడిపి బాస చేసిన
వెలయాలిని నమ్మరాదు వినరా సుమతీ.

చేమకూర వేంకటపతి సారంగధరలో

"తల తడిపి బాస చేసిన
జలజాక్షులు నమ్మరాదు సారంగధరా

అని వ్రాసెను. ఇందెవ్వరెవ్వరికి ఋణ పడినట్లు? వెంకటపతియే తన చిన్నతనమందు సుమతి శతకము చదివి యుండెనా?

"పర సతుల గోష్ఠి నుండిన
పురుషుడు గాంగేయుడైన భువి నిందపడున్

అన్న భావమునే చేమకూర తన సారంగధరలో

"నిజము భీష్ము నంతటి జితేంద్రియునకైన
నాశపుట్టు మదిని రాశపుట్ట దితరులనగ
నెంత ధనము పట్ల యువతి జనము పట్ల'

అని వ్రాసెను.

"పర నారీ సోదరుడై
పర ధనముల కాశపడక పరులకు హితుడై.

అన్నది

"మాతృ వత్పర దారేషు, పరద్రవ్యేషు లోష్ఠవత్
ఆత్మ వత్సర్వ భూతేషు యః పశ్యతి స పండితః

అన్న దానిని బోలినది.

సిరిదా వచ్చిన వచ్చును
సరిపోల్పగ నారకేళ సలిలము భంగిన్
సిరిదా బోయిన బోవును
కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ.

అనుదానికి సంస్కృతము.

సమాయాతి యథాలక్ష్మీః
నారికేల ఫలాంబువత్
వినిర్యాతి యథాలక్ష్మీః
గజభుక్త కపిత్థవత్.

అయితే ఏనుగు వెలగపండును నమలక అమాంతముగా మ్రింగుటను మరునాడు లద్దితోపాటు ఆ పండులోని గుజ్జును కడుపులో పెట్టుకొని, పండు చిప్ప పగులకుండా లోపల యేమియు లేనట్లుగా చేసి బయట పడవేయుటను ఎవ్వరైనా పరీక్షించినారా? గతానుగతికముగా అందరనగా మనమును ఆ ప్రకారమేనా! క్రీ.శ. 1907లో నిర్ణయసాగర ముద్రాలయము వారు ప్రచురించిన "సమయోచిత పద్యమాలికా" అను సంకలనములో పై శ్లోకమునకు పుట అడుగున "కపిత్థాంతర్గతః కీటోగజ ఇత్యభిధీయతే" అని యుదాహరించినారు. వెలగకాయలో పుట్టి దానిలోపలి భాగమును తిను కీటకము గజము అని దీని యభిప్రాయము. గజమున కీయర్థమే నిఘంటులోను కానరాదు. మరి ఏ నిఘంటు ప్రమాణమో వారును తెలుపలేదు.

"అప్పిచ్చువాడు వైద్యుఁడు
నెప్పుడు నెగ తెగక పారు యేరును ద్విజుఁడుం
జొప్పడిన యూరనుండుము
జొప్పడకున్నట్టి యూర జొరకుము సుమతీ"

అనుదానికి మూలము.

"ఋణదాతాచ వైద్యశ్చ శ్రోత్రియః సుజలానది
యత్రహ్యేతే నవిద్యంతే నతత్ర దివసంవసేత్

కోమలి నిజమున్... ... తెల్లని కాకులును లేవు

అన్నదానికి మూలము.

"ఔదుంబరాణి పుష్పాణి, శ్వేత వర్ణంచ వాయసం
మత్స్యపాదం జలేపశ్యేన్న నారీ హృదయస్థితం
"తన వారు లేనిచోటును
చనవించుక లేనిచోట జగడము చోటన్
అనుమానమైన చోటను
మనుజునకును నిలువఁదగదు మహిలో సుమతీ"

యనుదానికి మూలము.

"యస్మిన్ దేశేన సన్మానో నప్రీతిర్నచ బాంధవా;
నవిద్యా నాస్తిధనికో, నతత్ర దివసం వ్రజేత్"

ఒల్లని సతి నొల్లని పతి
నొల్లని చెలికాని.....

అనుదానికి మూలము.

"దుష్టా భార్య, శఠోమిత్రః
భృత్యోఽహంకార సంయుతః

"పతి కడకు, దన్ను గూర్చిన
సతికడకున్ వేల్పు కడకు, సద్గురు కడకున్.
సుతుకడకు, రిత్తచేతుల
మతి మంతులు చనరు నీతిమార్గము సుమతీ"
(పతి–రాజు)

అనుదానికి మూలము.

"అగ్ని హెూత్రం గృహం క్షేత్రం గర్భిణీ వృద్ధబాలకా
రిక్త హస్తేన నోపేయాత్ రాజానం దైవతంగురుః

"పాలసునకైన యాపద
జాలింబడి తీర్పవలదు సర్వజ్ఞునకున్
తేలగ్ని బడగ బట్టిన
మేలెరుగనె మీటుగాక మేదిని సుమతీ

అనుదానికి మూలచ్ఛాయ.

"ఉపకారేణ నీచానా మపకారోహి జాయతే
పయః పానం భుజంగనాం కేవలం విషవర్ధనం"

"అడవిని తోడ రయక"
అనుదానికి పూర్వపు జాడ
"నైకః ప్రపద్యేతా ధ్వానం"
ఉడుముండదె నూరేండ్లును

అన్నదానికొాక విధమగు ఛాయ.

కాకోపి జీవతి చిరంచ బలించ భుంక్తే

"పనిసేయు నెడల దాసియు
ననుభవమున రంభ, మంత్రి యాలోచనకున్"

అను పద్యమునకు సరియగు శ్లోమిది.

"కార్యేషు మంత్రీ కరణేషు దాసీ
భోజ్యేషు మాతా శయనేషు రంభా
ధర్మేఽను కూలా క్షమయా ధరిత్రీ
భార్యాచ షాడ్గుణ్యవతీహ దుర్లభా"

గడనకల మగని జూచిన
అడుగడుగుకు మడుగులిడుదు రతివలు,

అనునది

"యావద్విత్తోపార్జనశక్తః
తావన్ని జపరి నారోరక్తః"

అన్నదానిని బోలినది.

బలవంతుడ నాకేమని
పలువురితో నిగ్రహించి పలుకుట మేలా?
బలవంతమైన సర్పము
చలి చీమల చేంత జిక్కి చావదె సుమతీ.

అనుదానికి మూలము

"బహుభిర్న విరోద్ధవ్యం దుర్జనైస్స్వజనైరపి
స్ఫురంత మపి నాగేంద్రం భక్షయంతిపిపీలికాః"

పరిశోధించు వారికెన్ని యిట్టివి లభించునో యెమో?

సుమతి నీతి

ప్రాచీన సంస్కృత కవులును నీతి శాస్త్రకారులును తెలిపిన భావములనే సుమతి శతకకారుడును వెల్లడించినాడు. అందుకొన్ని ఈనాటి నీతికోవిదులు మెచ్చనట్టివియు కలవు. "గొల్లని సాహిత్యవిద్య, కోమలి నిజము... లేవు తెలియర సుమతీ" అనుట విచారకరము. ఏమీ! గొల్లవారంతటి మూర్ఖులా? ఇతరుల స్వత్వమేనా సాహిత్యవిద్య! "ఒల్లని సతినొల్లని పతి నొల్లని చెలికాని విడువనొల్లని వాడే గొల్లండు" ప్రాసకై గొల్లడే దొరికినాడే కవికి! కోమలికి నిజము కల్లయట. "లేదు సుమీ సతులవలపు" అని మరొకమారన్నాడు కవి. పురుషులె నిజాన్ని గుత్తగొన్నట్టి వారు కాబోలు! కోమలులే వ్రాసియుండిన వారేమని యుందురు. "మగవారినిలా నమ్మరాదే చెలీ" అని యుందురు కదా! పులియే చిత్తరవు వ్రాసి యుండిన నెట్లుండును? (మానవుడు పులిని జంపి దానిపై కాలుంచినట్లు చిత్రించిన దానిని పులికి జూపగా, పులియే చిత్రించిన మరొక విధముగా నుండునులే అని పులి యన్నదట)" మేకల పాడియే యుత్కృష్టమని వైద్యుల యభిప్రాయము.

"కొక్కోకమెల్ల జదివిన
చిక్కదురా వారకాంత" అన్నాడు.

వాత్స్యాయనుని శాస్త్రమునకు తెనుగు దేశములో ప్రచారము లేదయ్యెను. ఎవడో మళయాళీయుడగు కొక్కోకుడు వ్రాసిన అనుత్తమ గ్రంథానికే ప్రచారమెక్కువయ్యెను. తెనుగులో ఎర్రన కవి యనునతడు క్రీ.శ. 1600 ప్రాంతములో దానిని రచించెను. సుమతికారుడు ఎర్రనకవి కొక్కోకముగా సంస్కృత రతి రహస్యముగా పేర్కొనినది. సంస్కృతములో కవి పేరు కొక్కోకుడు. తెలుగులో కృతి పేరే కొక్కోకముగా ప్రసిద్ధమయ్యెను.

"కరణము కరణము నమ్మిన మరణాంతక మౌను"
"ఒక యూరికి నొక కరణము"
"కరణముల ననుసరింపక, విరసంబున తిన్న తిండి వికటించు సుమీ"
"కరణము సాదై యున్నను లెక్క గొనరు గదరా సుమతీ"
"కరణము వైదికుడైనను మరణాంతక మౌను"

"ధరకాపు కొండెడైనను కరణాలకు బ్రతుకులేదు"

అని ఆరుమారులు కరణాలను స్మరించినాడు సుమతి,

కాని ఆ స్మరణ కరణాలకు ప్రశంసాపాత్రము కాదు. కరణాలొకరి నొకరు నమ్మరనియు, కరణాలు సాధువులెన్నటికి కారనియు, వారు రైతులను భాదించెడి వారనియు, కరణాలు సాధారణముగా నియోగులేననియు, కవి యభిప్రాయము. రాయని భాస్కరుని కాలానికి పూర్వము కమసాలులు కరణాలై యుండిరనియు, భాస్కరుడు వారిని తొలగించి నియోగుల నేర్పాటుచేసెననియు(?) నొక కథకు ప్రచారము కలిగింది. అది నిజమగుచో సుమతి కవి క్రీ.శ. 1600 ప్రాంతము వాడగును.

"వెలయాలు సేయు బాసలు
వెలయగ నగసాలి పొందు వెలమ చెలిమియున్
కలలోన గన్న కలిమియు
విలసితముగ నమ్మరాదు వినరా సుమతీ"

కవికి గొల్లలన్న అసహ్యము. కరణాలన్న కోపము. వైదికుడు మరణాంతకుడు. వెలమలు నమ్మరానివారు. "నమ్మకు మగసాలవాని", నమ్మకు మంగడి వానిని", అనుటకూడ అగసాలి వారు కూడా దుర్మార్గులు. అంగడి వాడన వ్యాపారి. బహుశ కోమటియని కవి దృష్టిలో నుండును. దుష్టరాజులను దొరలను, అధికారులను పలుమారు దూషించెను. కాపుల వృత్తియు నంత మెచ్చు వచ్చినట్లు కానరాదు.

అడిగిన జీతం బియ్యని
మిడి మేలపు దొరను గొలచి మిడుకుట కంటెన్
వడిగల రెండెద్దుల కట్టుక
మడి దున్నుక బ్రతక వచ్చు మహిలో సుమతీ.

అని నికృష్ట పక్షములో మేలు రకముగా తలచెను.

"మేలెంచని మాలిన్యుని
మాలను నగసాల వాని మంగలి హితుగా
నేలిన నరపతి రాజ్యము
నేల గలసి పోవు గాని నెగడదు సుమతీ,

అని చెప్పుటచే మాల, మంగలివారు నీచులైరి. అగసాలిని, వెలుమలను, కరణాలను, మాల, మంగలివారిని నిరసించిన పద్యాలు కవి సొంత భావములై యుండును. కవి యే జాతివాడో పై నిరసనములను బట్టి ఊహించుట మరింత కష్టమైనది.

“కలకంఠ కంఠి కన్నీరొలికిన
సిరి యింట నుండ నొల్లదు సుమతీ.”
“అక్కరకు రాని చుట్టము
మ్రొక్కిన వర మీని వేల్పు...”
“అపకారికి నుపకారము
నెపమెన్నక సేయు వాడె నేర్పరి సుమతీ”
“ఎప్పుడు సంపద గలిగిన
పసిబాలల పొందు వాడు పశువుర సుమతీ”
“బలవంతుడ నాకేమని
పలువురతో నిగ్రహించి పల్కుటమేలా”
“సరసము విరసము కొరకే....

ఇట్టి పద్యాలు ఉత్తమమై శతక వాఙ్మయములో మకుటాయమానమై యొప్పుచున్నవి.

సుమతి శైలి

అన్ని శతకములలోను సుమతిశతక శైలి విలక్షణమైనది. ఇతనికి అనుప్రాసము లపై ప్రీతి యెక్కుడు. సులభముగా పద్యములను జ్ఞాపక ముంచుకొను విధమున వ్రాసినాడు. వేమన పద్యములైనను, సుమతి పద్యాలైనను తెలియని విద్యావంతులు తెలుగు వారిలో అరుదు. (ఈ కాలము తెనుగుతో డిగ్రీలు పొందిన వారిలో కొందరికివి రాకపోవచ్చును కాని జన సామాన్యములో సుమతికిని వేమనకును బాగా ఆదరము కలదు.)

ఇక ఈ కవి వాడిన పదాలను కొన్నింటిని విచారింతము. “ఎద్దుల కట్టుక”, “మడి దున్నుక” అని కవి ప్రయోగించినాడు. ఇవి భారత కవులలోను, వారి కాలపు కవులలోను ఉండిన ప్రయోగాలు కావని వైయాకరణుల అభిప్రాయము. అట్లగుటచేత ఎఱ్ఱాపగ్రడ శ్రీనాథుల తర్వాతి వాడని చెప్పవచ్చును.

"గుడి మనియము సేయరాదు" అని ముద్రిత ప్రతులలో కలదు. మణియము శబ్ద రత్నాకరము (శ.ర)లో లేదు. మణివము, మణిగము అను పదాలిచ్చినాడు. కాని వాటికి ప్రమాణములు తెలుపలేదు. మన్నెము, మన్యము, మాన్యము అను శబ్దాల కీమణియము సమానముగ నున్నందున ఇదియే సరియగు రూపమేమో? అధరము కదలీ కదలక అని కొన్ని ప్రతులలో కలదు. కొన్నిటిలో కదలియు కదలక అని ముద్రించినారు. ఏది సరి? "ప్రాకొన్న నూతి యుదకము, అనుచో ప్రాకొన్న అనగా ప్రాతబడి వాడుక లేకయున్న అని ఒకరి వ్యాఖ్య. ప్రాకు–కొను= ప్రాకొను పాచిపట్టు అని శ.ర.లో అర్థమిచ్చి దానికీ పంక్తినే యుదహరించినారు.

"వాదుకు దెచ్చునదె కీడు" అనుటలో వాదునకు అనుటకు మారుగా వాదుకు అని కవి ప్రయోగించినది గమనింపదగినది. "సర్పంబు పడగనీడను" ప్పకు నుర్పకు ప్రాస కలిపి ముద్రించినారు. కాని సర్పము తద్భవములో సప్పమగును. ఆ రూపమియ్యవచ్చును. శ.ర.ములో సప్పము అను పదమిచ్చి ఇదే పంక్తి నుదహ రించినారు.

ఈ కవి రేఫశకట రేఫల ప్రాసలను పాటించినాడు. కవి ప్రాచీనుడు కాదని తెలుపుటకిది ముఖ్యాధారము. శ్రీనాథునికి పూర్వమువారు (ప్రమాదోధీమతా మపి అనునది కాక) రేఫద్వయ సాంకర్యము చేసినవారు కారు. కరణము, మఱినమ్మక అనుచోటను పరునాత్మ మఱుమాట అనుచోటను, పరుల కష్టము ఎఱిగియు అనుచోటను, పరులకు, పిఱికికి అనుచోటను ఇతడు ప్రాసలందు రేఫద్వయ మైత్రి ఘటించినాడు. "పేరణము లేని లేమయ" అనుచో పేరణమునకు శ.ర.లో అంగీ యనియు వ్యాఖ్యాతలు రవికయనియు వ్రాసినారు. పేరణము ఎక్కువగా ఒక నాట్య భంగిమమునకే ప్రాచీనులు వాడినారు. నాట్యమెరుగని స్త్రీ అనియు, చెప్పవచ్చును. "వీరణములు లేని పెండ్లి" అనుచో, వీరణములకు, చర్మవాద్య విశేషమని శ.ర.లో వాద్యములు అని వ్యాఖ్యాతలును వ్రాసిరి. చర్మవాద్య విశేషమననెట్టిది. ఈనాడును కొందరు గొల్లవారు తమ యిండ్లలోని వివాహములందు ఒక పెద్ద డోలు వాయింతురు. ఆ డోలు మంగలివారు వాయించు డోలుకు నాల్గంతలయినను ఉండును. దానిని గొల్లవారు "వీరన్న డోలు" అందురు. ఎందుకాపేరు పెట్టినారనిన, వీరభద్రుని సేవలో వాయించినది కాన వీరన్నడోలైనదందురు. సాధారణముగా గొల్లలు వైష్ణవులే. కావున

ఆ యర్థము సరికాదు. వీరణడోలు (వీరణము అను పేరుగల డోలు) అను పదమే వారి నోళ్ళలో నలిగి వీరన్నడోలు అయినది. అంతే!

"జగడము చోట" అనుచో జగడ శబ్దము ఝకటము అను సంస్కృత శబ్ద భవము. భారత కవులీ జగడ శబ్దమును అంత పెద్ద కలహాల గ్రంథములో వాడినట్లు నాకు గోచరింపలేదు. ఇదియు శ్రీనాథాంతర పదమనవలెను. (ఝకట శబ్దము నొక తాయన్న కవియే ఒక చోటనే వాడెను).

"తలమాసిన ఒలుమాసిన" అనుచో, ఒలు అనగా ఒడలు (శరీరము అని అర్థము చెప్పుకొనవలసి యుండును). ఈ శబ్దము నిఘంటులలో లేదు. సుమతి శతకాన్ని ఉదాహరించిన శ. ర. లో ఒలు శబ్దము లేదు. ఇది ప్రాస భీతిచే సన్నగిల్లిన శబ్దమా లేక అట్టి ప్రయోగము వ్యవహారమందున్నదా. ఒడలు శబ్దము ఉత్తర సర్కారులోనే ఎక్కువగా వ్యవహారమునను్నది. రాయలసీమ, తెలంగాణములలో పై, పయి, పెయి అని ఎక్కువగా వాడుదురు. ఈ పదాలు మై, మెయి అను భారత కవుల పదాల గ్రామ్య రూపాలే కాని అన్యము కావు. కాని సర్కారులలో ఒడలు, ఒళ్ళు కాక ఒలు అను రూపము కూడ కలదేమో తెలియదు.

"చీరే శృంగార మండ్రు స్త్రీలకు సుమతీ" అనుటలో చీర అనగా స్త్రీలు కట్టుకొను కోక అని యర్థము కదా. ఈ పదము కూడ కవి యొక్క మధ్య కాలమును క్రీ.శ. 1500-1600 ప్రాంతమును సూచించును. భారత కవులును, ప్రాచీన కవులును, చీరను స్త్రీ వస్త్ర విశిష్టార్థమున కాక, వస్త్ర సామాన్యార్థమునకే వాడిరి. "తలఁజీర సుట్టియును" అని తిక్కన వ్రాసెను. (ఆను 3-177)

"సంగరమున పారిపోకు సరసుడవైనన్" అనునది కొన్ని ముద్రణములలో సరసుడవైతే అని యున్నది.

"చీటికి ప్రాణంబు వ్రాలు" అనుచో చీటి యనగా పత్ర ఖండమని శ.ర. లోను, జాబు, రసీదు అని వ్యాఖ్యానములలోను కలదు. చీటి పదము తెనుగు పదమేనా? అని సందేహము! హిందూస్థానీలో చిట్టీ అను పదము నుండి వచ్చెనేమో అని యూహింతును.

"పిరికికి దళవాయితనము పెట్టకు" అనుదానిలో దళవాయితనము అనగా సేనా నాయకత్వమని అర్థము. ఈ పదము కూడ భారత కవులది కానట్లు తలతును.

"మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!!" అను పంక్తి ఒక ముద్రణలో "మనుజాధి పుడతడు గొల్వ మహిలో సుమతీ" అని కలదు. "కాపు కొండెడయిన" అనుచో కొండీడు అనుటకు కవికొండెడు అని ప్రయోగించెను.

"శుభముల నొందని చదువును" అను పద్యములో మూడవ పంక్తి "అభిలాష లేని కూటమి" అని కలదు. నేను చూచిన ఒక ప్రతిలో "గుభగుభలు" లేని కూటమి అని కలదు. (గుబగుబలని) కలదు కాని ప్రాసకై గుభగుభలు అని వ్రాస్తున్నాను).

"కడు బలవంతుడైనను" అను పద్యములో తుది గీటులో "పడుపుగ సంగడికి దానె పంపుట సుమతీ" అని కలదు. కాని ఒక ప్రతిలో "బడువగ సంగడికీ..." అని కలదు. బడువ అనగా నీచుడు అను నర్థములో వ్యావహారమందు కలదు.

"తలదడివి బాస చేసిన" అని సుమతి, "తల దడిపి బాస జేసిన" అని సారంగధర ఏదిసరి?

"తాననుభవింప నర్థము" తాను అనుభవింపని యర్థము అనుటకు తప్పు ప్రయోగము. ఇదియు కవియొక్క అర్వాచీనత్వమునకు నిదర్శనము కాదగును.

"నీరే ప్రాణాధారము" అను పద్యములో "నీరే" అను దానికి సరిపోవునట్లు– నోరే, నారే, చీరే, అని యొక ప్రతిలో ముద్రించినారు. కాని తక్కువ వాటిలో నారియె, చీరయె అని ముద్రించినారు ఏవి కవి ప్రయోగాలో?

"పరసతుల గోష్ఠి నుండిన" అను పద్యములో మూడవ పంక్తి "గరిత సుశీలయె యైనను" అని యొక ప్రతిలోను 'పరసతి సుశీలయైనను" అని ఒక ప్రతిలోను కలదు. "పరునాత్మ దలచు సతివిడు" మఱుమాటలు పలుకు సుతుల మన్నింపకుమీ" అని ముద్రణ. ఒక ప్రతిలో "బరునాత్మ దలచు" అని కలదు. మరియు పద్యమిట్లుండెనా? పరునాత్మ తలచుసతి: విడుమర మాటలు పలుకు సుతుల మన్నింపకుమీ"

"మది నొకనివలసి పద్యములో "మానక తిరుగన్ అది చిలుక పిల్లి పట్టిన" అని కలదు. ఇది కవి హృదయము కానట్లున్నది. పద్యపునడక, అల్లిక, ఎట్లెట్లో ఉన్నది.

"సిరి దా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్"

అని కొన్ని ప్రతులలో ముద్రించి రలప్రాసము నుంచినారు. ఒక ప్రతిలో

"సిరి దా వచ్చిన వచ్చును
సరిపోల్పగ నారికేళ సలిలము భంగిన్"

అని కలదు. ఇది మంచి పాఠము కాదా?

ఈ విధముగా ఈ చిన్న శతకములో ఇన్ని పాఠభేదాలుండుట దీని ప్రచారాధిక్యమునే సూచించును. కావున పూర్వ తాళపత్ర ప్రతులను సేకరించి సరియగు పాఠములను నిర్ణయించుట అవసరమని అంటున్నాను. ఇంకను కొన్ని ప్రధానములగు పాఠభేదములను విషయగురుత్వశంకతో వదలినాను.

70 ఏండ్ల వృద్ధుడొకడు తన బాల్యములోని ఈ నీతిపద్యములు అచ్చులో లేదని విచారించి నాకిట్లు చదివి వినిపించెను.

"ఘన మెరుగనట్టి కోడలు,
వినయము లేనట్టి సుతుడు, వెరవని యనుజుం
డనుకూలగాని భార్యయు
మనుజున కిది మందులేని మరణము సుమతీ"

ఒక ప్రతిలోని క్రింది యధిక పాఠము కలదు.

"వలరసము సతికి బుట్టక
బలిమిని దమకించి విటుడు పైకొనుటెల్లన్
మలయజము సానమీదను
జలముంచక తీసినట్టి చందము సుమతీ"

అయితే యీ పద్యము ఎర్రన కొక్కోక కళాశాస్త్ర మందిట్లున్నదని చెప్పిరి.

"వలరసము సతికి బుట్టక
బలిమిని దమకించి విటుడు పై కొనుటెల్లన్
జలముంచక సానపయిన్
మలయజమును తీయబూను మాదిరికాదె"

ఒక పూర్వ లక్షణ గ్రంథములో ఈ క్రింది పద్యమునుదాహరించినారు.

కాదన్న వాడె కరణము।
వాదడచినవాడె। మేటి వసుధేశుకడన్।
లేదన్నవాడె చనవరి।
గాథలు పెక్కాడు వాడే కావ్యుడు సుమతీ॥

వేమన పద్యాలలో పలువురు తమ పైత్యాన్ని పద్యాన్నిగా మార్చి దూర్చినట్లు, సుమతిలోను స్వమతిని అతికించిన వారు కూడ యుండిరేమో?

ఇంత దూరము చేసిన చర్చనుబట్టి సుమతి శతకకారుడు క్రీ.శ. 1500–1600ప్రాంతము వాడని అభిప్రాయపడుదును.

ఈ శతకమునకు పీఠికను వ్రాసి చక్కని పాఠములను నిర్ణయించి పాఠాంతరము లనిచ్చి అవసరమగు పదముల విశేషార్థములను వ్రాసి, మూల సంస్కృత శ్లోకాలను వెదకిచూపి ఆకర్షణీయముగా ముద్రించుట అత్యంతావశ్యకమని నిరూపించుట కీవ్యాసలేశము పనికివచ్చుగాక.

ఎఱ్ఱాప్రెగ్గడ

సారస్వత పరిస్థితులు

కేవలము మతాభిమానముతో మత ప్రచారమునకై కావ్య రచన చేయు నాచారము తగ్గిపోయి కావ్య కళాదృష్టి తోడను సారస్వత స్పర్థతోడను కావ్య నిర్మాణము చేయు స్థితి ఎఱ్ఱన కవి కాలమునాటికి క్రమముగా వచ్చినది. కావుననే శివభక్తిచేత శంభుదాసుడైనను, కవిత్వ రచనా విధానము చేత ప్రబంధ పరమేశ్వరుడైన ఎఱ్ఱాప్రెగ్గడ నృసింహ పురాణమును రచించి యహోబల నృసింహస్వామికి అంకితమిచ్చెను.

ఎఱ్ఱాప్రెగ్గడ నియోగి బ్రాహ్మణుడు. శ్రీవత్స గోత్రుడు, ఆపస్తంబ సూత్రుడు. ఈ మహాకవిని గన్న తల్లిదండ్రులు–పోతాంబ సూరనలు. శంకర స్వామి పితామహుడు. గురువు.

కవికాలము: ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణమును, హరివంశమును ప్రోలయ వేమారెడ్డి కంకితము చేసెను. ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ. 1324–53 వఱకు రాజ్యము చేసెను. కావున ఆ రాజాస్థానమునున్న ఈ కవి కూడ నీ కాలముననే యుండెననుట స్పష్టము.

1. **హరివంశము:** ఇది భారతమున కనుబంధ గ్రంథము. ఎఱ్ఱాప్రెగ్గడ సంస్కృత హరివంశము నాంధ్రీకరించుటలో భారతాంధ్రీకరణ పద్ధతినే యనుసరించి సాధ్యమైనంతవరకు విషయములను సంగ్రహించి మూలకథాంశముల రచించెను. కాని యితడు మూలమందలి హంసడిభకోపాఖ్యానమును వజ్రనాభ వధఘట్టమును వదలి వేసినాడు. ఎఱ్ఱన ముఖ్యముగా ఔచిత్యము పాటించి మూలమును వదలక రసపోషణము చేయుచు తన రచనా పాటవముచే మూలమునకు గూడ మెఱుగు పెట్టినట్లున్నది. ఉషాపరిణయమున నీతడు వర్ణించిన నూతన వధూవరుల ముగ్ధ శృంగార ప్రణయ భావములు – చిత్రరేఖ పాత్రపోషణములిట్టివి. శ్రీకృష్ణుని శైశవ

క్రీడోత్సవము, యశోదా దేవకీదేవుల మాతృభావము స్వభావసిద్ధముగా చిత్రింపబడి పోతనార్యుని భాగవత రచనకు వరవడియైనది.

ఉదా:

ఎక్కడి కేనియు బోయెద
మీ కష్టపు పాటలు పడగ నేమోర్వము నీ
చొక్కపు కొడుకును నీవును
నొక్కతలము నొక్కయూరి నుండుడు నెమ్మిన్ (హరి)

దీనికి సరియగు పోతన పద్యమిది.

ఓయమ్మ నీ కుమారుడు
మా యిండ్లను పాలు పెఱుగు మననీడమ్మా
పోయెద మెక్కడికైనను
మాయన్నల సురభులాన మంజుల వాణీ – (భాగ)

ఈ విధముగా యెఱ్ఱన రచన మలతి యలతి తెలుగు పదముల బింకముతో నొప్పుచున్నది. ఎఱ్ఱన హరివంశమునందు పోతన భాగవతమునందును గూడ సత్యభామా యుద్ధము – రుక్మిణీ పరిణయము – కాళీయ మర్ధనము, కృష్ణలీలలు, వామనావతారము మొదలైన సమాన ఘట్టములు గలవు. ఇందు పోతనకంటె ఎఱ్ఱన రచన మేలుబంతియైనది. అట్లయ్యును ఎఱ్ఱన రచనమును పోతన కవిత మించి పోయెననియే చెప్పవలయును.

2. **నృసింహ పురాణము:** ఇది యష్టాదశ పురాణములలో నొకటి కాదు. ఇందలి కథ బ్రహ్మాండాది పురాణాంతర్గతమైనది. భాగవతమున కూడ నీ కథ గలదు. కవి కొంత కల్పించెను. విష్ణుపురాణమున నృసింహావతార కథ గలదు. అందు నృసింహుడేల హిరణ్యకశిపుని జంపెనో చెప్పబడలేదు. దాని యందు నృసింహుడు స్తంభము బ్రద్దలు చేసుకొని వచ్చుటయు లేదు. సంస్కృత నృసింహ పురాణమునకు దీనికి పోలికయే లేదు. ఇందలి వర్ణనలు కవి స్వకపోల కల్పితములై ప్రబంధములందు వలె ఋతు–చంద్రోదయాది వర్ణనలతో ప్రధాన కథకు భంగము కల్గింపక కథా సౌష్టవముతో చేయబడినవి.

ఈ కథకు సనక సనందాదుల శాపము బీజమును, హిరణ్య కశిపుని వధ కార్యమునై యున్నది. హిరణ్య కశిపుని పాత్ర పోషణము విష్ణు సాయుజ్యము పొందువానిగా జిత్రింపబడక యహంభావ పూరితుడైన విష్ణుద్వేషిగా పరిణమించెను. నిధన సమయమందు కూడ హిరణ్యకశిపుడు జయుడను భావము పాఠకులకు జ్ఞప్తి కలుగదు.

ప్రబంధ కాలమునకు చెందక పోయినను ఆంధ్ర భాష యందు కుమార సంభవము తర్వాత పురాణ కథను ప్రబంధమువలె ప్రౌఢముగా రచంచిన వాడగుటచే ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడను బిరుదు దగి యున్నది. నృసింహ పురాణమందలి కథ ప్రహ్లాద చరిత్ర. కావున యిందు కూడ పోతన రచనమునకు సాదృశ్యము కలదు. రసాతిశయమున పోతనది పై చేయియైనను ఔచిత్య పోషణమున నెఱ్ఱన మేటి యయ్యెను. భారత భాగవతాది పురాణములవలె నృసింహ పురాణము సంస్కృతము నుండి యాంధ్రీకరింపబడినది కాదు. ఇందలి కథ ఎఱ్ఱనామాత్యుడు బ్రహ్మాండాద్యనేక పురాణముల నుండి గ్రహించి ఔచిత్య పోషణ కొఱకు యొక ప్రబంధముగా మార్చినాడు. కావ్యమున ఔచిత్యము ప్రాణప్రదము కాన భాగవత కథ నుండి కవి చేసిన మార్పులను గమనింపవలసియున్నది.

ఔచిత్యములు: శ్రీ విష్ణుద్వార పాలకులైన జయ విజయులు – సనక సనందనాదుల నడ్డగించ నామహర్షులు వారిని అసురయోని జనింపుడని శపించిరి. పిమ్మట విష్ణువు అచటికి వచ్చి వారిననతి కాలములో తన యంతికము చేరునట్లను గ్రహించుటకును వేడుట మూలకథ. జయవిజయులకు వైకుంఠ మొసగు అధికారము విష్ణువునకుండగా ఆ మహర్షుల యాచింపనేల? ఈ సంఘటన సర్వాంతర్యామికి తెలియకుండ జరుగు టెట్లు? అల్ప దోషమునకే యింత ఘోర శాపమా? ఈ అనౌచిత్యముల పరిహరించుటకై ఎఱ్ఱన సనక సనందాదులతో విష్ణువు జయ విజయులొనర్చిన దోషము తనదేననియు– అనతి కాలములో ద్వార పాలకులు తనలో నైక్యమగుదురనియు ఈ సంఘటనలన్నియు తన మాయా బలముచే వారి శ్రేయస్సుకై కల్పింబడినవని" మార్చి మూల కథకు ఔచిత్యము గూర్చినాడు.

2. హిరణ్యకశిపుడు తన సోదరుని జంపినందులకై హరిని తదనుచరులగు దేవతలను ద్వేషించి దేవలోకముపై దండెత్తిపోయినట్లుగా భాగవతమున కలదు.

ఇందు వ్యక్తిగతమగు కలహము ప్రతిపాదింపబడినది. ముఖ్యముగా నీతడు పోరాడినది తన యహంకారమువలననే. దానికొక బంధు వినాశనము అను సాధారణ కారణము కంటె ఎఱ్ఱన మఱియొక ఉచిత కారణమూహించెను. దేవతలు రాక్షసులు సవతుల సంతానము కాన నందులో రాక్షస మాతయగు దితి కశ్యప ప్రజాపతికి జ్యేష్ఠ భార్య యగుటచే త్రిలోక రాజ్యమునకు దైత్యులకెక్కువ యధికారముండెననియు నా హక్కును సాధించుకొనుటకై హిరణ్యకశిపుడు స్వర్గముపై దండెత్తెననియు యీ కవి కల్పన.

3. భాగవతమందలి హిరణ్యకశిపుడు చేసిన బ్రహ్మ స్తుతి అతని యసురత్వమునకు విరుద్ధముగా వేదాంతమయమైయున్నది. దీని నెఱ్ఱన ఔచిత్యముగోరి "సముచితార్థ మధుర బహువిధ స్తోత్ర సమ్మర్ధ రచనమున నతడిట్లని విన్నవించె"నని మాత్రము రచించెను.

4. హిరణ్యకశిపుడు తపము చేయుచుండగా అతని భార్య గర్భిణియగు లీలావతిని దేవేంద్రుడు చెఱపట్టెనను ఘోర విషయమును లీలావతి శత సంవత్సర గర్భ వృత్తాంతమును హిరణ్యకశిపుని శత దివ్య సంవత్సర లోపమును భాగవతమున కలవు. ఔచిత్య పోషణ కొఱకు ఎఱ్ఱన మహాకవి నృసింహ పురాణమున వీనిని పరిహరించెను.

5. హరి నృసింహ రూపమున నొక స్తంభమున నావిర్భవించుటకు గల కారణముగా నెఱ్ఱనచే నృసింహ పురాణమున నొక చక్కని సందర్భము గూర్పబడినది. నృసింహావతార సన్నివేశము హిరణ్యకశిపుని "సమంచిత కాంచన రత్న ఖచిత మహా స్తంభ శత సంఖ్యాతమగు సభా మండపమున" జరిగినట్లు వర్ణింపబడినది. అందుచే నా సభయందలి ఒకానొక స్తంభమునందు హరిని జూపుమని హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని నడుగుటయు నంత హరి దాని నుండి యుద్భవించుటయు సక్రమముగా పరిణమించినది.

ఈ విధముగా నెఱ్ఱన మూలమునకు ఔచిత్యముచేత మెఱుగుపెట్టినాడనియే భావింపవలె.

పోతనపై యెఱ్ఱన ప్రభావము: ఎఱ్ఱన యొక్క రచన పోతనామాత్యునకు అనేక విధముల మార్గదర్శకమైనదనుటలో సందేహము లేదు. ఎఱ్ఱన వ్యాకరణ ఛందో౽లంకార లక్షణయుక్తముగా వ్రాసినాడు. పోతనామాత్యునకు ఎఱ్ఱన కున్నంత

పాండిత్యము లేకపోయినను పోతన కవిత్వమున గల మృదు మధుర రచన మాత్రము శ్రీఎఱ్ఱన కబ్బలేదనిన విమర్శకు లంగీకరింతురని యనుకొందును. అవాఙ్మానస గోచరమగు నొక విధమైన విష్ణు భక్త్యామృత రసము పోతనార్యుని కవిత్వములో ననపాయముగా వచ్చి భక్తి రసాబ్ధిలో నోలలాడించును. ఎఱ్ఱనార్యుని పోతనామాత్యు డనుకరించిన పద్యములనేకము గలవు.

1. కలడు మేదిని యందు గలడుదకంబుల
 గలడు వాయువు నందు గలడు వహ్ని - (నృసిం)
2. కలడంభోధి గలండు గాలిగల దాకాశంబునన్ గుంభినిం గలదగ్నిన్...
3. ఇందు గల డందు లేడని... (భాగ)

అనుకరించిన పద్యములో మెఱుగుబెట్టి పైగా మించి మంచి పద్యము వ్రాసినాడు.

"వాసుదేవుని పాదవనరుహంబుల భక్తి
 తగదను తండ్రియు దండ్రిగాడు (నృసింహ)
"శౌరి పదాంబుజ స్మృతి రసంబున దేలెడు నా మనంబు....
"........ అంబుజోదర దివ్య పాదారవింద...(భాగ)

ఈ రసవత్ఖండ సృష్టికి పై పద్యము మూలమనుటకు సందేహమేమియును లేదు.

అరణ్య పర్వ పూరణము: ఎఱ్ఱనమీద ఏ మాత్రము గౌరవ భావము లేని కొందరు విమర్శకులు భారతారణ్య పర్వశేషమును పూరించలేదనియు, నన్నయ భారతమున మూడు పర్వములను పూర్తిగా వ్రాసినాడనియు - అక్కడక్కడ క్రిమిదష్టమైన అక్షరములను ఎఱ్ఱన సర్దెనను వాదములు చేసిరి.

అరణ్య పర్వాంతమున -
.... ఎఱ్ఱనార్యుండు సకల లోకైక విదితుడు -
....

కం. ధీర విచారుడు తత్కవి
 తా రీతియు కొంతదోప దద్రచనయకా
 నారణ్య పర్వశేషము
 పూరించె కర్ణపుట పేయముగాన్ - "

అని యుండుటచే నేడాంధ్ర లోకము ఎఱ్ఱనామాత్యుడు అరణ్య పర్వశేషమును పూరించెనని నమ్ముచున్నది. మరియు

ఉ. శారదరాత్రు లుజ్జ్వల లసత్తరతారక హార పంక్తులం
జారుతరంబులయ్యె, వికసన్నవకైరవ గంధ బంధురో
దార సమీర సౌరభము దాల్చి సుధాంశు వికీర్యమాణక
ర్పూర పరాగ పాండు రుచి పూరము లంబర పూరితంబులై"

అరణ్య పర్వములోనిది నన్నయ చివరి పద్యముగా – మరి ఈ క్రింది పద్యము నుండి ఎఱ్ఱన కవిత్వము.

చ. "స్ఫుర దరుణాంశు రాగరుచి బొంపిరి వోయి, నిరస్తనీరదా
వరణములై దళత్కమల వైభవ జృంభణముల్లసిల్ల ను
ద్ధుతర హంస సారస మధువ్రత నిస్వనముల్ సెలంగగా
కరము వెలింగె వాసర ముఖంబులు శారద వేళ జూడగన్"

దీనిని బట్టి అరణ్య పర్వమున గల మొత్తము 2,900 గద్య పద్యములందు నన్నయ 1300లును, ఎఱ్ఱన 1600లును రచించెగాన సగముకంటె నధికముగ ఎఱ్ఱనయే రచించె ననుట స్పష్టము.

రామాయణము: ఎఱ్ఱన రామాయణ మిప్పుడెచ్చటను కానరాదు. దీని నుండి కొన్ని పద్యములను కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణ సార సంగ్రహమున నుదాహరించెను. ఒక సంకలన గ్రంథములో గూర్పబడిన యెఱ్ఱాప్రెగ్గడ రామాయణములోని కొన్ని పద్యములను వేటూరి ప్రభాకరశాస్త్రి గారు సేకరించినారు.

ఆంధ్ర వాఙ్మయమున యెఱ్ఱనకు గల స్థానము

ఆంధ్రమున కవిత్రయము వారి ప్రయోగములు ప్రామాణికములనియు తద్భిన్నములగు కావ్యములు కావని లాక్షణికులు తలంతురు. వీరు కావ్య రచనకు మార్గదర్శకులనియు గురువు లనియు కూడ నంగీకరించి తర్వాతి కవులు వీరిని కావ్యారంభముల స్తుతింపజొచ్చిరి. నన్నయ వాగనుశాసనుడుగను, తిక్కనకవి బ్రహ్మగాన నీతడు ప్రబంధ పరమేశ్వరుడనబడి రాబోవు ప్రబంధ యుగమునకు మార్గదర్శకుడయ్యెను. అరణ్య పర్వమును పూరించుటయేగాక భారతానుబంధ గ్రంథమగు హరివంశమును గూడ రచించి భారతమును పరిపూర్ణముగా రచించిన వాడని ఖ్యాతి పొందెను.

నిజానికి భారతారణ్యపర్వ పూరణలో నొక పెద్ద సంకటము గలదు. నన్నయది సంస్కృత భూయిష్టశైలి. తిక్కన శైలి దేశీయ పదమయము. అరణ్య పర్వ పూరణ మీ రెంటికిని వంతెనవలె నుండవలెను. లేనిచో అతుకుల బొంత వలె తయారగును. ఎఱ్ఱన కుభయ భాషలయందు కావ్య రచనా సామర్థ్యముండుటచే నీయసిధారా వ్రతమును బహు చాకచక్యముతో నిర్వహించి యాంధ్ర సారస్వతలోకము మెప్పును, కృతజ్ఞతను బడసిన వాడయ్యెను. అందుచే నీతనికి నన్నయ, తిక్కనలతో సమాన గౌరవ ప్రతిపత్తులు దక్కినవి. ఇదియే ఎఱ్ఱనకాంధ్ర వాఙ్మయ మందలి గల స్థానము.

ఆంధ్రీకరణ విధానము: నన్నయ భట్టు మార్గముననే కథా ప్రధానముగ మూలము ననుసరించవలసినచో వర్ణనలు కొన్ని కలిపియు, కొన్ని విడిచియు కొన్ని మార్చియు స్వతంత్రముగా రచించెను.

కవిత్వ శైలి: నన్నయ వలె నతి సంస్కృతముగాక, తిక్కన వలె నతి దేశీయముగాక రెండును సమపాళ్ళు గల్గి ఈతని కవితాశైలి రసవత్తరమై కావ్యమై యుచిత గుణాలంకార శోభితమై హృదయ రంజకముగానున్నది. నన్నయ తిక్కనలవలె స్త్రీవర్ణనలనతి సభ్యముగాజేసెను.

ఉ. నీలపయోద మండలము నిచ్చల లీల వెలుంగ జేయుచుం
గ్రాలెడు వ్రాలు గ్రొమ్మెఱుగుకైవడి దద్వనభూమి యంతయున్
లలిత దేహకాంతి పటలంబుల జేసి వెలుంగ జేయు న
బ్బాల వినీలకుంతల విభాసిని జూచి సవిస్మయాత్ముడై"

తర్వాతి కవులపై నెఱ్ఱన ప్రభావము

ఈతడు నన్నయ తిక్కనల కవితలోగల మేలును గ్రహించి – తన ప్రతిభచే తన కవితకు కొంత నూతన మార్గము దీసి రాబోవు ప్రబంధ కవులకు మార్గదర్శకుడైనాడు ఈతని కవితా చాయల పోతన భాగవతము నెంతవరకు గల్గెనో సమాన ఘట్టముల పరికించి చూచితిమి. నృసింహ పురాణములో క్షీర సముద్ర– వైకుంఠ– విష్ణు– వసంత– పానగోష్ఠి మొదలగు వర్ణనములు కొంత దీర్ఘములై కథకు అడ్డుతగిలి చమత్కార కల్పనలతో నలంకార భూయిష్టముగ రచియింపబడి ప్రబంధ కవుల యష్టాదశ వర్ణనాలకు దారి చూపినది.

శ్రీనాథుడు కాశీఖండములో –

"పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ
సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు"

అని చెప్పుకొనెను.

దేవేంద్రుడు తనకు విష్ణ్వాదుల బలముగలదని పొంగుచున్నాడని హిరణ్యకశిపుడు పల్కినపుడు ఎఱ్ఱన నృసింహ పురాణములో ఈ క్రింది పద్యము వ్రాసెను.

"హరి తనకుంగలండని పురాంతకుడాము రవైరిసేత లె
ప్పరుసున మాన్పడల్లనుని పద్మభవుండుమనాత్మలోన ని
ర్జరులకు మేలు గోరునని సంయమికోటి తలంపుల న్నిజ
స్ఫురణమయావహించునని పొంగుచు నుండు మహేంద్రుడెప్పుడున్"

నంది తిమ్మన పారిజాతాపహరణములో సత్యభామా గర్వమును గూర్చి నారదునిచే పల్కించిన పద్యమున ఎఱ్ఱన పైపద్య రచనానుకరణము గోచరించును.

"చక్కని దాననంచు నెల జవ్వనినంచు జగంబులోన బే
రెక్కిన దాననంచు బతియెంతయు నాకనురక్తుడంచు దా"

ఎఱ్ఱన నృసింహ పురాణములో వన విహారము చేయు స్త్రీ వర్ణనల పద్యమునకు మెఱుగుపెట్టి యనంతామాత్యుడు భోజరాజీయమున నిట్లనుకరించెను.

"మునికాళ్ళ మోపి నిక్కిన పదచ్ఛవి నేల
యును పల్లవించిన యొప్పుమెఱయ
వలులేది నతనాభి బలసి యొక్కింత సా
గిన మధ్య యెంతయు ఘనతయు.

....

నొయ్యడాకేల దవ్వుల నున్న తీగ
దివిచిన నఖ దీప్తులంతంత వీటుకొనగ
లీపపెఱకేల నచ్చరలేమ యోర్తు
గోసె బువ్వులు ప్రమద వికాసమెసగ" (నృ.పు)

"తరుణీ రత్నము పువ్వు తీగె నొకచేతన్వంచి పాదాగ్రమున్
ధరణిన్ మోపి యొకింత నిక్కిత నుమధ్యంబొప్ప గక్ష ద్వయ
స్ఫురణంబార కుచంబులుబ్బి నయనంబుల్విచ్చి లీలన్ముఖాం
బురుహంబెత్తి యొకర్తు గోసెనెలమిన్ బుష్పంబులత్తోటలోన్– (భోజరా)

"సత్రబంధమహేశ్వరు శంభుదాసు – నధికతర యుక్తి నాదరించి" అని కాశీఖండములో శ్రీనాథుడే ఆదరించెను గదా!

ద్విపద రామాయణము

కవిత్వ విషయము

"ద్విపద కావ్యంబు, ముదిలంజ దిడ్డి కంత" యన్నియు సమమని వేణు గోపాలుఁడు పడఁదిట్టిన వాక్యము గొందఱి సమ్మతమున సమంజసమై యుండును. కాని యీ రామాయణము వంటి కావ్యములఁజదివిన తర్వాత నిట్టి యభిప్రాయము తప్పని తోచక పోదు. ద్విపద కావ్యములన్నింటిలో ద్విపద రామాయణము, గౌరన హరిశ్చంద్రయు శ్రేష్టములైనవి. పాల్కురికి సోమనాథుని బసవపురాణము గూడ వీనికిఁదీసిపోయినది కాదు. భారతమును ప్రథమమున నాంధ్రీకరించిన కీర్తి నన్నయ భట్టుది. రామాయణమును మొదట తెనిగించినది కోన బుద్ధుఁడు. భాగవతము బమ్మెర పోతన ఖ్యాతి నిల్పినది. కోన బుద్ధుని పిమ్మట భాస్కరుడు, మొల్ల, రఘునాథ రాయులును వేర్వేరు గ్రంథముల వ్రాసిరి. పిమ్మట కాణాదము పెద్దన గద్వాలయందు రామాయణమును వ్రాసెను. అతని గ్రంథ ముత్కృష్టమైనదయ్యును గద్వాల రాజుగారిచేఁ గొందఱి పండితులకే బహుమతిగా నివ్వబడుటచే నా గ్రంథము కన్యాకుమారి నాసిక యందలి సర్పమణి వోలె రాజాగారి భాండాగారమందే ప్రకాశించుచున్నది. పెద్దన తర్వాత గోపీనాథము వేంకటకవియు, నిటీవల శ్రీ వావిలి కొలను సుబ్బారావుగారును దీనిని నాంధ్రీకరించిరి.

కోన బుద్ధుని శైలి నాతికఠినమై లలిత పద గుంభితమై, యుచిత స్థలముల వర్ణనములు కలదై, పండితులకును బామరులకును నాదరణీయమై యున్నది. ఇతని గ్రంథము సగము కన్న నెక్కుడుసంస్కృత పదములు గలిగి యున్నను, క్లిష్ట దీర్ఘ సమాసములతో నిండినది కాదు. అప్పకవిగారి మహాప్రబంధ లక్షణములన్నియు నిందులేవు. అయోధ్యాపురము గ్రంథాంతమందు శ్రీరాముడు సీతకు విమానమందా యా స్థలముల జూపుచో గొద్దిగా వర్ణింపబడియున్నది. కుమార సంభవములో

నన్నెచోడుఁడు జగదీశ్వరుని రహఃక్రీడను హేయముగా వర్ణించెను. ఈ కవి గ్రంథ మందెచ్చటను నాజోలికే పోయినవాఁడు కాడు. ఇక్కవి వర్ణనములందు మూలమునే యనుసరించినందున చిత్ర విచిత్ర గల్పనల మాట యెత్తుకొనలేదు. విశ్వామిత్రు నాశ్రయంబున రాత్రి వర్ణనము చాలా రమణీయముగానున్నది.

"చలియింపకున్నవి సకల వృక్షములు
మెలఁగవు వన భూమి మృగ సమూహములు
నెఱి విహంగములు నీడముల్ చేరి,
మఱచియున్నవి తను మంజుల ధ్వనులు,
దీఁటుగ చీకటి దెసలు నాకసము,
కాటుక బూసిన కరణి నున్నదియు
నీలాంబరంబున నిండు ముత్తెములు
గీలించి బ్రహ్మాండ గేహ గోళమున
గడునొప్పగా మేలుకట్లెత్తినట్ల
యుడు గణంబులతోడ నున్నది నింగి (పు-35)

సీత యౌవనమునొందు విషయమును వేరుకవు లలంకారశాస్త్రము నంతయు బోధించి యుందురు కాని ఈ కవి:

"ఇంతయై, యంతయై యెలజవ్వనమున
వింతయై, యీ యింతి వెలయుట జూచి"

యంతటితో విడిచెను, రామలక్ష్మణాదుల భార్యల నలువురి కన్యకల నిట్లు వర్ణించెను.

శారద పూర్ణిమా చంద్రుని కళలో
చారు వాసంత వాసన పుష్పలతలో
సాన దీరిన మంచి జాతిరత్నములో
శ్రీ నిండఁబట్టి నార్చి కుందనంపుఁ
గమ్మలో కఱిఁబులు గడిగిన ముత్తి
యమ్ములో నెఱతావి నలరు గంధంపుఁ
గొమ్మలోయన బెండ్లికూఁతులొఁప్పారి; (పు. 75)

రని వర్ణించు భాగము కాళిదాసుని "అనాఘ్రాతం పుష్పం" అను శ్లోకమును జ్ఞప్తికిఁదెచ్చును. జీవనస్థితికినై చేనుదున్ను త్రిజటాఖ్య విపు డెందాక రాయి రువ్వునో యందాకయుండు గోవులనిచ్చెదనిన రాముఁడు పల్కగా నతఁడు, కరమున పాషాణ కలితుఁడై.

అఱచి ధోవతి మొల నంట బిగించి,
కురుచైన శిఖముడి గొని యొడుఁ గఱచి,
నరముల బ్రాణముల్ నరినంటఁబట్టి;
బిరబిర తన ముష్టి బెట్టుగాఁ ద్రిప్పి,
యురమున జందెము నుఱ్ఱూతలూగ
సరయువు దాట విచ్చలవిడి నేసె; (పు. 108)

అరణ్యకాండమందు హేమంతము

దిశలెల్లఁ జలికి భీతిలి వెలిపట్టు,
ముసుకు పెట్టిన యట్లు ముంచెహిమంబు;
వెఱపున వణఁకెడు విరహిణులనగఁ,
దెఱగొప్పఁ గదలు పూఁదీఁగె వీక్షింపు (పు. 153)

ఈ వర్ణన మందలి ప్రతి పఙ్క్తిని జదివి యానందింపవలయును. అచ్చతెనుగు పదముల యల్లిక యందంద కాననగును. చుప్పనాతి తనకొడుకు తుంటలై పడియుండుటం జూచి మునులపై కెగసిన గతిని చిత్తగింపుఁడు.

తలను మోపెడు జడల్ ధరియించి బూది,
యలఁది జన్నంబున నందఱుఁగూడి
తొలఁగక మేకపోతుల మెడల్ విఱచి,
పొలుపార నుడికించి పొట్టలనిండ,
నెట్టన నమలి యెండిన కళాసములు,
గట్టి యేమియు నెఱుంగనియట్ల యుండి,
క్రొవ్వి నాశిశువును గుమతులై పట్టి
యెవ్విధి జంపితిరి? (పు. 157)

బజారి జంతు లిటునే కదా యుండవలయును! అనుప్రాసము లీకవి కిష్టము వచ్చినవి. విభషణుఁడు శ్రీరాములను,

నిత్య సత్యత్రాణ, నిత్యకళ్యాణ
నిత్య జగత్త్రాణ నిత్యగీర్వాణ. (పు. 301)

యని స్తుతించెను. ఇంద్రజిత్తు భార్య సులోచన యిదే యంత్యప్రాసములతో

రవి కులాంబుధి సోమ, రామాభిరామ,
ప్రవిమల గుణధామ, పరరాజ భీమ,
జలద సన్నిభ గాత్ర, సారస నేత్ర,
విలసిత చారిత్ర, వితత పవిత్ర. (పు. 471)

యనియు నుతించెను. ఈ పద్ధతిని బమ్మెర పోతనరా జనేక స్థలముల ననుసరించెను.

మహా పురాణమగుటచే నీ ప్రబంధ మందతిశయోక్తులుత్ప్రేక్ష లక్కడక్కడ ముఖ్యముగా యుద్ధకాండ యందుఁ జేర్పబడి యున్నవి. శ్రీరాములు సముద్రునిపై బ్రహ్మాస్త్రము ప్రయోగించినపుడు.

బ్రహ్మయు నింద్రుండు భ్రమఁ గానరైరి,
బ్రహ్మాండ మెల్లను బగిలి నట్లయ్యె:
భువనంబు లెల్లను బొగిలి నట్లయ్యె. (పు. 309)

ఇత్యాదులు, కుంభకర్ణుఁడు యుద్ధభూమికి వచ్చినపుడు సహిత మిదే యవస్థ మనము సాధారణముగా 'పైల్వానుల కుస్తీ' చూచునపుడు కరతాళ ధ్వనులు చేయుదుము. ఇది రామ రావణయుద్ధము. దేవతలు విమానములందుఁ గూర్చుని కనుఱెప్ప వేయక చూచుచున్నారు. ప్రతి రాక్షసవీరుడు గూలినపుడు నరులపై వానరులపై పుష్పవర్షమును గురిపించుచున్నారు.

"ట్రాయి" యుద్ధమందు దేవతలు గూడ పోరాడుచుండిరి. ఇక్కడ మన దేవతలు చూపరులే. కాని యుభయలోకములకును "రాయిటరు" అయిన నారదుఁడు మాత్ర మొకతూరి రామదర్శనమునకై వచ్చెను. రెండవ తూరి యింద్రుడు తన విమానమును బంపెను. ఇమ్మహాకవి యనేక స్థలముల కథాసందర్భములను బ్రకృతి భావములను గలిపి వర్ణించినదీ క్రింది పంక్తుల వలన దెలియును.

దారుణ స్ఫుట రోష దైత్య గర్వాంధ
కారంబుతో నంధకారంబు విఱిసె
నతి మీఱి వానరానన సరోజాత
ములతో సరోజాతములు వికసించె; (పు. 510)

ఈ పద్ధతినే గౌరన తన హరిశ్చంద్ర యందనుసరించెను.

విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతో,
జెలఁగు సారసగణ సేవ్యమై, పుణ్య
సలిలమై, యుత్ఫుల్ల జలజమై మిగుల
ఫేనమై, నిత్య గంభీరమై, చారు
మీనమై, యతి పుణ్య మిళితమై, యమరు
గంగా తటంబున ఘన లతా సంఘ
సంగతంబగు సమ స్థలమున నిలిచి, (పు. 35)

మాధ్యాహ్నికంబు లొనర్చిన ఘట్టమున నితని శైలి గంగా ప్రవాహమువలెనే "నిత్య గంభీరమై" యున్నది.

ఇట్టి యుత్కృష్ట గ్రంథమందుఁ గొన్ని ఛందో వ్యాకరణ దోషములు గాన వచ్చుచున్నవి. అవన్నియు నటులుండ నే నిందు రే ఫ ద్వయమైత్రి విషయమును, క్త్వార్థ కే కార సంధిని గుఱించియుఁ జర్చించెదను. అప్పకవి రే ఫములను ఱాలను "క్రమ మెఱుఁగక రెండునుం గుకవి గూర్చు కృతిన్" అని రేఫద్వయ మైత్రిఁ వారికి శాప మిచ్చెను. మఱియు భాగవతమున 'రేఫమ్ములు ఱాలునుం గలిసి ప్రాసములైన కతంబునం గదా! యిమ్ముల నాది లాక్షణికులెల్లను మాని రుదాహరింపఁగన్" అనియు వ్రాసిరి. ఈ ద్విపద రామాయణమునఁ బెక్కు తావుల రేఫద్వయ మైత్రి యున్నను నీ గ్రంథమును లాక్షణీకులంగీకరించి యున్నారు. ఒక కోన బుద్ధుడే కాడు, గౌరన, పిన వీఱన, కూచిమంచి తిమ్మకవి, మున్నగు వార నేకు లీమైత్రిని బాటించి యున్నారు. వీరిని గూడ లాక్షిణికు లుదహరించినారు. కాని బమ్మెర పోతన మాత్రమే తర్వాతి వారికి వెఱ బొమ్మయై యున్నాడు. సమాన ధ్వనిగల "లళ" లకు మైత్రి కలదు గాని యట్టి రఱలకు లేకుండుట యే నియమము? ధ్వని భేదము కలగిన "పుంపులకును" ముకారమునకును ఋకా రేకారములకును, మైత్రి కలదు కాని "ర ఱ" లకు లేదట.

ఈ కవి తిక్కన సోమయాజికిఁ బూర్వుడు. ఇట్టి కవుల ప్రయోగము వలన అప్ప కవికిఁ పూర్వమే రేఫద్వయ మైత్రి దుష్టముగా నుండినది కాదనియుఁ దానిం బాటించిన వారు కుకవులు కారనియు విదితమగును. ఏమి చిత్రమో మైత్రి కూడదని గట్టిగాఁ బల్కిన యప్ప కవియే 'రఱ' లను యతి ప్రాస స్థలమున నుపయోగించినాడు. దీనివలన నతఁడు తమాషా సూత్రము వ్రాసెనని తెలియును.

క్త్వార్థ కేకారముపై సంధి యీ కవి కొన్నిచోట్లఁజేసినాడు. జైమినీ భారతమం దంతటను నీ సంధి కనఁబడును. నన్నయ సహితము "అందిమ్ము" అని ప్రయోగించి నాడు. ఇట్టి యభ్యాసమున కేవో కొన్ని ప్రబల కారణములుండును. "కొను"నకు "కా" దేశము సహిత మీ గ్రంథమందు సాధారణముగాఁ గలదు. తర్వాతి కవులును వ్రాసి యున్నారు. యతి భంగములున్న స్థలములు కథా భాగమందు సందర్భరహి తార్థముల నిచ్చుటచే లేఖకుల దోషములని తోచెడి.

ఇట్టి దోషములున్న నీ గ్రంథ ప్రశస్తి యావంతయైనను దగ్గినది కాదు. కాని గ్రంథ కర్తృత్వ సందేహమను లోపమొక్కటి యందఱను బాధించుచున్నది. సంస్కృతాంధ్ర భాషా చరిత్రములు మన పూర్వులు వ్రాయనందున నిట్టి లోపములు గలిగెను. ఈ విషయముల నింకను విశేషముగాఁ బ్రజ్ఞావంతు లందఱును శోధించి యథార్థముల బయలు పఱతురు గాక యని నా విజ్ఞాపన.

కర్తృత్వ విషయము

"తోరణాల చొక్క దొంగ కుక్క" యని కొన్ని సంవత్సరములకు బూర్వము చంద్రికా పరిణయకర్త కొల్లాపురము మాధవరాయలు కారనియుఁ దద్గ్రంథకర్త యాస్థానకవియై యుండిన తోరణాల చొక్కయ్య యను నాతఁడే యనియు మహా పండితులు కొందఱుభయపక్షముల విమర్శనలు సేయసాగిరి. ఆంధ్ర భాషయందిట్టి చొక్క యలెందఱో యూహలచేఁ గల్పింపఁబడుచున్నారు. వల్లభరాయల క్రీడాభి రామమును శ్రీనాథుఁడు వ్రాసెనని యందురు. కృష్ణదేవరాయల యాముక్తమాల్యదను పెద్దన వ్రాసెనందురు. భారతమును నన్నయ సహితము వ్రాయలేదందురు. నందితిమ్మన రామరాజభూషణునికి "ముక్కు" అమ్ముకొనెనట! ఇవన్నియు నెంత సత్యములో తెలిసినవి కావు. కాని చిత్రకవి సింగరార్యుఁడు మాత్రము బిల్హణీయమును

వ్రాసెనని మనకిప్పుడాశ్వాసాంత పద్యమందలి రహస్యము వలన నిశ్చయముగాఁ దెలిసినది.

ప్రకృతము రంగనాథ రామాయణమను సుప్రసిద్ధమైన ద్విపద కావ్యమును రంగనాథుఁడను కవి వ్రాసెనని ఇంతవఱకును గొందఱి పండితుల యభిప్రాయమై యున్నది.

ఇటీవల రెడ్లు జాత్యభిమానముచేఁ గాఁబోలు! నీ గ్రంథము కోన బుద్ధారెడ్డిదే యని తీర్మానించికొనినారట. ఇట్టి తఱి గ్రంథకర్తృత్వ నిశ్చయ స్థితి గనుఁగొనుట యావశ్యకము. ఈ కార్యమునకుఁ బూనుకొనుట యందు శ్రీ జనమంచి శేషాద్రి శర్మగారి వంటి మహాపండితుల యభిప్రాయముల విమర్శింపవలయునను భీతి యొకప్రక్క, జాతి పక్షపాతముచే సత్యమును గనుఁగొనఁ జాలనేమో యను శంక యొక ప్రక్క నన్ను బాధించుచున్నవి. అయినను నా తోఁచిన రీతి నిందు విశదీకరించెదను.

1. రంగనాథుడు 'రామాయణమును దెనిఁగించినట్లు గ్రంథమున నెచ్చటను జెప్పుకొనలేదు.' కాని కోన బుద్ధ భూపాలుఁడు గ్రంథమంతటను దన పేరే తగిలించినాడు.

2. అయితే గ్రంథ నామములు కవులనుబట్టి పెట్టఁబడుచుండును. ఇది రంగనాథుని పక్షమునఁ బ్రబలమైన యాధారము. ఆంధ్రమందు మొల్ల రామాయణము, గోపీనాథ రామాయణము మున్నగు గ్రంథములే కాక, ఇతర భాషలందు కంబ రామాయణము, తులసీదాసు రామాయణము అని జగద్విఖ్యాతములై యున్నవి. అయితే మన రంగనాథ రామాయణము రంగనాథుని దేయని చెప్పుట కన్ని విధముల యాధారములు లేవు. బుద్ధభూపాలుఁడు తన తండ్రియగు విఠ్ఠలనాథుని పేర నీ కావ్యమును రచించెనని గ్రంథమువలనఁ దెలియును. ఆంధ్ర మందు నెవరి పేరిట గ్రంథము నంకితము సేయుదురో వారిపేరిట గ్రంథనామ ముండినటుల నరసభూపాలీయము, మల్లభూపాలీయమును సాక్ష్యమిచ్చుచున్నవి. అట్టిచో నిది విఠ్ఠల రామాయణమని యుండిన సందేహమే యుండదు కదా. 'రంగనాథ' యని యేల పేర్కొనఁబడి యున్నది? దీనికి శ్రీ వంగూరి సుబ్బారావు గారిచ్చిన సమాధానము సరియై యుండునా? విఠ్ఠల దేవుఁడు హిందూ లోకమునఁ పాండురంగ

విఠ్ఠలుఁడనియు, విఠ్ఠలరంగనాథుఁడనియు సుప్రసిద్ధుడు ఈ బుద్ధ భూపాలుని తండ్రి విఠ్ఠలనాథ యని గ్రంథమందుఁ జెప్పఁబడినాడు. కావున నీ విఠ్ఠలునే రంగనాథునిగాఁ బేర్కొనియుందురా యని సందేహము కలుగుచున్నది.

3. కోనబుద్ధుఁ డాశ్వాసాంతములందుఁదాను భాషాధీశ విభుడఁనియు, వినుత కావ్యగమ విమల మానసుఁడనియు, పాలితాచారుఁడనియు, అపారధీశరధి యనియు నింకయు నేనేమొ, యాత్మస్తుతిని జేసికొనినాడు.

"విద్వత్కవులాత్మస్తుతిని జేసికొనువారు కారు" అని శ్రీ శేషాద్రి శర్మగారు సెలవిచ్చిరి. కాని వారే, కోలాచల మల్లినాథ సూరి, కాళిదాసు, నన్నయ భట్టు, అల్లసాని పెద్దన మున్నగు వారాత్మ స్తుతులఁచెప్పుకొనినారని సూచించిరి. మహారాజుల నాశ్రయించి నిర్గర్వులై యుండిన బ్రాహ్మణోత్తములే తమ బిరుదుల కంచు ఢక్కలపై మ్రోయించినపుడు, "రాజ సర్వజ్ఞుండు రాజ సింహుడు" అయిన విఠలనాథుని పుత్రుఁడు, సర్వజ్ఞుఁడనఘుండు, చతురవర్తకుఁడు, సర్వపురాణ విచార తత్పరుఁడని" విభుధులచే స్తుతిగన్నవాఁడు, బుద్ధ భూపాలుఁడు, పరిపాలనా స్థానమందుండి యాత్మ స్తుతిని జేసికొనుట యందే చిత్రము కలదు?

4. నిశ్చయముగా గోన బుద్ధుడే వ్రాసి యుండిన గ్రంథమందుఁ 'దన తండ్రి విఠల ధరణీశు బేర' యనుటకు మారుగాఁ 'దమ తండ్రి" యను పరులు వ్రాసినట్లేల వ్రాసెను. అని నాలవ యాక్షేపణ. సాధారణముగా నా తండ్రి యనుటకు మారుగా మా తండ్రియని చెప్పికొనుట, పెద్దలయందు గౌరవాతిశయము, తనయణకుఁవ, లోకాచారమునునై యున్నది. ఇంతియే కాక బుద్ధభూపాలుఁ డొకఁడే కాడు విఠ్ఠల సుతుఁడు. విఠ్ఠల నాథుఁడు "సుతులు" రాజులు, బహుశ్రుతులును గొల్వం " గొలువున దీపించెనని గ్రంథారంభముననే యున్నది. మఱియు, నాతతకృతిపేర, నతి పుణ్యపేర, "మా తండ్రివిఠ్ఠలక్ష్మానాథుపేర" శ్రీరామ చరిత మొప్పఁజెప్పెదనని బుద్ధరాజు వ్రాసియున్నాడు.

5. రంగనాథుఁడు బుద్ధుని యాస్థాన కవి యైనందులకు భాస్కరుని కథ యొకటి ప్రబల నిదర్శనమని చెప్పుదురు. రంగనాథుఁడును, భాస్కరుడును వేర్వేరు రామాయణములు వ్రాసి, యొకే తూరి రాజుగారి దగ్గఱకు వచ్చిన రంగనాథుని గ్రంథమును గుడిచేతను, భాస్కరుని రామాయణము నెడమచేతను గ్రహించిన

భాస్కరుఁడు కుపితుఁడై రాజుగారి గుఱ్ఱపు రౌతునకు, సాహిణిమారునికిఁ దన గ్రంథ మంకితముగా నిచ్చెనట. ఇట్టి కథ నిజమై యుండినఁగదా మనము నమ్మవలసినది. దీనిని నమ్మినచోఁ దెనాలిరామలింగని కథలన్నింటి నేల నమ్మరాదు? కృష్ణరాయల యాస్థానమందష్టదిగ్గజముల రీతిఁ గవులుండిరను గాథలను గూడ నమ్మవచ్చును. కాని చరిత్ర యిట్టివి నబద్ధములని బోధించుచున్నది "కథకు గాళ్ళు లేవు"

6. రంగనాథుడు రామాయణము వ్రాసిన యనంతరము ఉత్తర రామాయణ మును గూడ వ్రాసి బుద్ధరాజు కుమారులైన కాచవిభుడు, విఠ్ఠలుడు, రచించినట్లు ప్రకటించెనని కొందఱి దీర్ఘాలోచన. ఇవి యూహలలోని స్వప్నము. రంగనాథుఁడొక్క చౌర్యము చేసినదే కాక రెండవ దానికిఁ గూడ యంగీకరించెనా? మొదటి గ్రంథమందుఁదన విషయము బహిరంగముగాఁగాక పోయిన యేదో ఒక గూఢవిధమునైన సుంతయైనను దెలుపుకొనని వాఁడైనను, నీ రెండవ గ్రంథ మందైన దెలుపు కొనినాడా?

మొదటి గ్రంథము నొక్కని పేరనే రచించెనట. కాని రెండవ దాని నిద్దఱి పేరట ప్రకటించిన నెక్కువ లాభమని చేసెనా? బుద్ధభూపాలుని కుమారులు వంశపరంపరగాఁ బండితులై, రామాయణమును వ్రాయుటచే ప్రథమ రామాయణ మును బుద్ధ రాజేయని విన్నవించిన సాహసమా?

ఆంధ్ర మందలి యిట్టి ప్రథమ రామాయణమునకు గర్తయై బలవంతముగా వచ్చి కూర్చుని రంగనాథుఁడెవరు? ఏ కులము? ఏ దేశము? ఏ కాలము వాడు ఇంటి పేరేమి? వంశమెయ్యది? అతఁడింకేమైన ప్రబంధముల వ్రాసెనా? ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చు వారెవరు? ఇతర కావ్యముల కర్తృత్వ మెవ్వరి కారోపింపబడినడో యట్టి కవుల స్థితిగతులు కొంచమైనను మనకుఁ దెలిసియున్నవి. కాని యీ రంగనాథుని పేరు మాత్రమే చాటఁబడుచున్నది. స్వవిషయము నేమియు వ్రాసికొనకపోవుటచే నతఁడంతటి నిష్కామకర్ముడా? ధనలోభముచే సత్యము నడఁచువాడు కర్మఫల త్యాగియైయుండునా? చిత్రకవి సింగరార్యునివలె నెదో యొక రీతి నితఁడు తన సంగతిని సూచించి యున్నాడాయని యతిసూక్ష్మముగా గ్రంథమంతటను వెదకితిని. ఎచ్చటను గనఁబడలేదు. శ్రీరామచంద్రుడు యుద్ధమందు మూర్ఛనొందినపుడు లక్ష్మణుఁడు విలపించుచు,

అర్థంబె విద్యయు, నర్థంబె నేర్పు;
పాయక మంగళ పాఠకానీక
గాయక కులములు గలవారిఁ బొగడు;
లేమియె సకల మాలిన్యంబు దలప;

అను వాక్యములందు రంగనాథుఁడు దన దారిద్ర్యమును నిందించుకొనె నాయని సంశయించితిని. కుంభకర్ణుఁడు, రావణుఁనకు రాజనీతిఁ జెప్పుచు.

పతి దేశకాల విభాగంబు లెఱిఁగి,
చతురజనద్రవ్య సంపద గలిగి;
కార్యంబు మీఁదగు కార్యమూహించి,
కార్య విఘ్న ప్రతీకారంబు సేసి,
ఫలసిద్ధి గైకొని బహు రాజ్యభోగ,
ముల నిత్యుడై యుర్వి మోదింపవలయు;

నను వాక్యముల రాజ్యభారము వహించు గోనబుద్ధుని యభిప్రాయమై యుండదా యనియు నూహించితిని. కాని యీ రెండుదాహరణములు అసమంజసములని నిశ్చయించితిని. పై యంశములన్నింటిని బట్టి చూడఁ గోన బుద్ధుఁడే దీనిని రచించి యుండనోపునని నాయల్ప విషయామతికిఁ దోచుచున్నది. అయిన నీ యంశములను బ్రబల పఱచుట కుత్తర రామాయణమందేమైన యాధారములు దొఱకునో చూడవలయును. విఠ్ఠలాదుల చరిత్రములను, మున్నగు విషయములను సహితము శోధింపవలయును. రంగనాథుడే దీనిని రచించెనని నిస్సందేహాధారములు మనకు లభించినచోఁ గోనబుద్ధుని ద్రోసి వేయవలయును. రంగనాథుని గురించిన విశేషములేమియు లేని యీ పక్షమున గ్రంథకర్త గోన బుద్ధ భూపాలుడే యని చెప్పనొప్పు.

గౌరన హరిశ్చంద్ర

ఉత్తమ ద్విపద కావ్యములలో నిదియొకటి. మొదట గౌరన కవి దేశకాలములను గుఱించి తెలుసుకొందము. గౌరన నిజాం రాష్ట్ర కవి, తన హరిశ్చంద్రలో స్వవిషయ మిట్లు వ్రాసికొనినాడు.

సింగన మాధవ క్షితి పాలమణికి
మంగళ మూర్తికి మంత్రియై జగతిఁ
బొగడొందు పెద్దన పోతరాజునకు
దగిన తమ్ముడు యశోధనుడెల్లమంత్రి
చెట్ట బట్టంగ నోచిన భాగ్యవతికిఁ
జుట్టాల సురభికి సుందరీ మణికి
ఘనుడు వల్లభ మంత్రి గంగాంబ కోరి
కనిన పోచాంబకు గారాబుసుతుఁడ
భూతనాయక పాద పూజాభిరతుడ
గౌతమ గోత్రుండ గౌరనాహ్వయుడ.

గ్రంథాంతమందు

"మతి మంతు డయ్యలమంత్రి పుంగవుని
సుతుడు గౌరన మంత్రి సుకవి శేఖరుఁడు."

అని వ్రాసికొన్నాడు. వల్లభ మంత్రికే అయ్యలమంత్రి పర్యాయ పదమేమో! పై నుదహరించిన సింగయ అను రాజు రేచర్ల భూపాలుడు. అతని కుమారుడే మాధవ రాయలు. ఇతడు నల్లగొండ జిల్లాలోని రాచకొండను రాజధానిగా చేసికొని పాలించిన వెలమరాజు. అతడు క్రీ.శ. 1500 ప్రాంతములోని వాడు కావున మన గౌరనయు ఆ కాలమువాడే.

ఈ విషయమునకు అంతగా సంబంధించకుండినను భైరవ కవి గుఱించి కూడ రెండు మాటలు వ్రాయుదును. ఈ భైరవుడు శ్రీరంగమహత్త్యమును రచించెను. ఇతడు గౌరనకుమారుడే. తన శ్రీరంగ మాహాత్మ్యములో నిట్లు వ్రాసికొనినాడు.

"కృత విద్యాఖురళీ పరిశ్రమ కళాకేళీ విలాసున్ జన
స్తుత చారిత్రుని గౌతమాన్వయ పవిత్రున్ గౌరనా మాత్య స
త్సుతు గల్యాణ కవిత్వ లక్షణ సమర్థున్ సూక్తి ముక్తా ఫలా
తత కాంతి స్ఫుట చంద్రికోల్లసిత విద్వత్భైరవున్ భైరవున్"

గౌరన ద్విపద హరిశ్చంద్రనే కాక నవనాథ చరిత్రమను ద్విపద కావ్యమును, సంస్కృతములో లక్షణ దీపిక యను గ్రంథమును రచించెను. నవనాథ చరిత్రము గత సంవత్సరమే ముద్రితమయ్యెను.

గౌరన కవి ఉభయ భాషలలో మంచి ప్రావీణ్యము కలవాడు.

"సరస సాహిత్య లక్షణ విచక్షుణుడ"

అన ఆదిలోనే తెలుపుకొనినాడు. హరిశ్చంద్ర గ్రంథాంత మందును ఇట్లు వ్రాసికొనినాడు.

"భ్రమరా ప్రసాద సంప్రాప్త కవిత్వ
సుమహీత సామ్రాజ్య సుఖ పరాయణుడు
చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి
ప్రతివాది మదగజ పంచాననుండు"

అనియు వర్ణించుకొనినాడు.

మధ్యకాల కవులలో ద్విపద కావ్యముపై కొంత అసహ్యము గలిగినట్లు కనబడుచున్నది. కాని నిజమైన తెనుగుదనము ద్విపదలలోనే ఇమిడియున్నది. ద్విపదలనెన్నియో విధములుగా గానము జేయుదురు. స్త్రీల పాటలు, తందాన కథలు, దశరా పద్యాలు, పల్లెటూరి పాటలు, కోలన్న పాటలు మున్నగునవన్నియు ద్విపద భేదములే. ద్విపద కావ్యాలలో పేరెన్నిక గన్నవారు తాళ్ళపాక చిన్నన్నయును (తిరు వేంగళనాథుడు) పాల్కురికి సోమనాథ కవియు, గోన బుద్ధుడును మన గౌరవనీయునై యున్నారు.

ద్విపద గాన యుక్తముగా ఆయా రసములకు తగినట్లుగా రాగములను మార్చి పాడుకొనదగినట్టిది. అప్పుడే దాని రమ్యత వ్యక్తమగును. అట్లు గానము చేయజాలని వారికి కూడ ఈ గౌరవ కవిత చదువుటకును వినుటకును మనోహరముగ నుండును. అనేక సందర్భములలో సంస్కృత దీర్ఘ సమాసములను అందముగా నిమిడ్చి యున్నాడు.

"మందార మంజరీ మంజుమరంద
నందదిందిందిర నందనా రామ
కమనీయ వికసిత కనకార వింద
కమిలినీ తట లతాగార లతాంత
రచిత శయ్యాతల రతిరయ గళిత
కచభర మరపుర గణికా కపోల
కలిత ఘర్మోదక కణగణ మిళిత
మలయ సమీర కోమల కంపిత్రాగ
మహిత చిత్రధ్వజమాలా సహస్ర
సహిత చింతామణీ సౌధ పాళికల"

ఇట్టి సమాసములు చాల గలవు.

కాని ఇది యొక విశేషము కాదు. తెనుగు నుడికారముపై ఈ కవికి మంచి ప్రావీణ్యము కలదు. సహజ వర్ణనలకే ఎక్కువప్రాముఖ్యము నిచ్చినాడు. అపూర్వ వర్ణనలను గావించినాడు. ఆ వర్ణనలు ఆనందదాయకములు. అచ్చ తెనుగులో దిట్టమగు శక్తి చూపినాడు. ఇవియే యీతని కవితలోని విశిష్టతలు. ఈ యంశములనే నిరూపించుకొన్ని వర్ణనలు మాత్రమే యుదహరింతును.

రాత్రి వర్ణనము

"భవచండ తాండవ భ్రమణ వేగమున
దివి నుండి పడిన యందియయును బోలె
గిరణ జాలంబుల కెంపు సొంపెసగ
అరుణ బింబము పశ్చిమాంబుధి గ్రుంకె"

వేటకాండ్రు

"చోఱమీసములు, జుంజుఱుగొప్పు బిరుసు
వాఱెడు మేనులు, బరడు బిక్కలును,
చేవవిండ్లును, నెఱ్ఱ సెరల కన్నులును
జేవురు బొట్లును జిల్లకోలలును
మొలనీలి కాసెలు, మోటొత్తులును
దలముళ్ళు బదనిక దండకడెంబు
గలిగి భయంకర కాలకింకరుల
పొలువున గర్జించు పొలవర్లు....

కాలకౌశికుడు

"తోలు నస్తులు జిక్కి తూగాడు మేను
పేలు రాలెడు సిగ, పెడతల గణితి
పిల్లి కన్నులు, గురుపీచు మీసములు,
నుల్లి గడ్డంబు, నత్యుగ్ర దృష్టియును,
దళమైన పట్టె వర్ధనములు, వ్రేళ్ళ
నులిచిన దర్భలు, నుదిటిపై బొరుసు,
నొఱగు నోరును వెలికుఱికిన పండ్లు,
అఱువు ధోవతియును, పంచాంగంబు, ముష్టి
బరగిన కరతిత్తి, పత్రాల సంచి,
మొరగిన గొడుగును, నుసిరాలు కోల.

వీరబాహుడు హరిశ్చంద్రుని దూరుట

"ధనరాశి యచ్చోట దరలక యిత్తు
ఒక విచారము మాకు నొదవె – ఈరాజు
సుకవాసి, పనిపంద, చూపు గుజ్జంబు
మామిడి క్రింది సోమరి మేదకుండు
బూమె తుంటరి, యెనుపోతుపై వాన
మొండరి, చల్ల చప్పుడు, గోడ చేర్పు

చండి పోతను నట్టి జూడ నున్నాడు
చెప్పిన పని జాగు చేసిన వేళ
ముప్పిరిగొను కోపమున మొఱవెట్ట.
దుడ్డున వీపు కంతులు కట్టి మోది
జడ్డు వాసిన, గొల్వు జాలు నా కనుచు
దక్కిపోయిన, వెంట దగుల నా వశమే
ఉక్కున బెనచినట్లున్నాడు వీడు
గొలుసు తప్పిన యట్టి కోతి చందమున
కల ధన మీవు రొక్కము కొని పోదు".

పై రెంటిలో హాస్య రసము కూడ వ్యక్తమగుచున్నది. ఈ కవి సామెతలను విరివిగా వాడినాడు. అందుకొన్నింటి నుదహరింతును.

"ఈ రత్న భూషాదులేటికి మాకు
నీరు వట్టారునే నెయి ద్రావి కొనిన"
"అందని ఫలముల కఱ్ఱులు సాపి"
నిప్పును చెదలంట నేర్చునే"
"పులిమెడ గొఱియ దెంపున గట్టినట్లు"
"తీపారుచక్కెర దిన్నయా నోర
వేపాకు మేసిన విధమున..."
"పల్లెత్తి యెలుకల బట్ట నోపినను
పిల్లి శాస్త్రమెమంటి పిల్లియే చాలు"

పూర్వ ప్రబంధములందు విశేషముగా రోకటి పాటగా వర్ణించబడిన అష్టాదశ వర్ణనల పద్ధతి యిందు లేనేలేదు. పచ్చి శృంగారము మచ్చునకైన కానరాదు. ఆపాదమస్తక వర్ణనలు, విరహతాపాలు చిలుకలతో మొదలు పెట్టి చంద్రలోక పర్యంతము కావించినట్టి ఉపాలంభనలు, శ్లేషలు, యమకాలు, నానార్థాలు ఇట్టి ఘోరాలేమియు నీ కవిత్వములో లేవు. పాఠకులు రక్షింపబడినారు. పైగా ఏ వర్ణనమును చదివినను అందు నవ్యత, శ్రావ్యత వ్యక్తమై పాఠకులకు ఆనందము కలుగుచుండును. ప్రాచీనాంధ్ర సారస్వతములో నా కత్యంత ప్రియమైన గ్రంథములలో నిదొక్కటి.

చేమకూర వేంకటపతి

సారంగధర చరిత్ర

చేమకూర వేంకటకవి కవితా[ప్రాశస్త్యమును గురించి మన యాధునిక పండితరాయలిచ్చిన ఈ క్రింది యభి[ప్రాయము చాలా సమంజసముగానున్నది. ఈ చేమకూర వేంకటకవి చక్కర మడిలో అమృతము పాటించి పెంచినదిగాని మట్టిలో నీరు పాటించి పెంచినది కాదు. ఇందు పూ మొగ్గలు వోలె తామే విడుశ్లేషలును, [ద్రాక్షా పాకంబున నోరూర రసమొల్కు రచనలును సదాచారాభిమానముంబురి కొల్పు ధర్మ్య నిబంధన నైపుణియు, విసిగింపని వర్ణనలును, బరువులు నెరువులుంగాని కబ్బంపు, దొడవులును, ఈ [ప్రబంధమును భారతీ భాండాగారమందు కడునుచ్ఛ స్థానమందు నెలకొల్పుచున్నది.

మొట్టమొదట శ్రీయుత కట్టమంచి రామలింగారెడ్డిగారు ఆంధ్ర [ప్రబంధములోని తత్త్వములను విమర్శించిరి. [ప్రతి [ప్రబంధమందును నొక విధమగు కథా పద్ధతియుండునని చూపించిరి. మన చేమకూర సారంగధరలో నట్టి పద్ధతి కానరాదు. ఇందలిదియే వేరుగా నున్నది. కావున పద్ధతియే వేరు. ఇందలి కథానాయకుల పాత్ర పోషణమును గుఱించి చర్చించుటకు బూర్వము యొక యంశమును విశదపఱుప వలెను. కీ.శే. ధర్మవరము కృష్ణమాచార్యులీ సారంగధరనే యాధారము చేసుకొని తమ నాటకమును రచించిరి. అందు చిత్రాంగి రాజరాజ నరేంద్రుని చిన్న భార్యగా నిరూపింపబడినది. కాని చేమకూర కవి యిట్లు చిత్రింపలేదు. చిత్రాంగి రాజనరేంద్రుని యుంపుడు కత్తియగానే యితడు వర్ణించి యున్నాడు. [ప్రారంభముననే యిట్లు వర్ణించినాడు.

క. కలరా యిల రాయనికిం
గుల సతి రత్నాంగి; భోగకుటిల శిరోజా
తిలకము చిత్రాంగియు; నన
నెల జవ్వను లిరువు రంబుజేందు నిభాస్యల్.

ఈ "భోగ కుటిల శిరోజా తిలక" మను చిత్రాంగికిని "కులసతి" యగు రత్నాంగికిని చాలా భేదమున్నదని "అంబుజేందు నిభాస్యల్" అను పదముననే సూచించియున్నాడు. అంబుజమునకును, చంద్రునికిని (ఇందు) సరిపడదని కవులెన్నడో నిర్ణయించి యుండిరి. సుబుద్ధి యను మంత్రి కుమారుడు సారంగధరునితో చిత్రాంగివలనిభయము సూచించుచు "వార కాంతల కెందైన వావి కలదె?" అని పలికెను. అంతయేల చిత్రాంగియే సారంగధరుడు తనను "తల్లీ" యని మాటిమాటికి సంబోధించుట నోర్వక

శా. ఆ నీలాలక లేఁతనవ్వ్వాలయ నిట్లన్
గ్రమ్మఱన్ నిన్ జగం
బౌనౌ మేలన నీవె తెల్పుకొన
నేలా నీ గుణంబుల్, సతీ
సూనుగ్రామణి వౌదు నీ హృదయ
మిచ్ఛోగంటి నే దేవతం
గానే నీ పిన తల్లిగాను,
విభు భోగ స్త్రీని భావింపగన్.

అని తెలుపుకొనినది. అంతటితో పోలేదు వీరి వాదము.

సారం – "నంగడమున కెల్ల సొడ్డు" అనిన

చిత్రాం– "కాదటు, నేనల చిన్నవాడ నేర్పడితి' అని పలికినది.

ఇక ప్రకృతమునకు గడంగెదను. సారంగధరుడు రత్నాంగి కుమారుడు. ఇతడు బహు తపః ఫలితముగా రాజనరేంద్రునికిఁ గలిగెను. బాల్యముననే శాస్త్రములందు, శస్త్రములందును మంచి పాండిత్యమును గడించెను. అంతియేకాదు, గుణములందు ప్రహ్లాదుని వంటివాడే!

క. మాడెత్తు మాట యెవ్వరి
నాడడు, సత్యంబు వీడనాడడు ఖలులం
గూడడు, పరకామినులం
జూడడు, సారంగధరుఁడు సుతమాత్రుండే;

ఈ సారంగధరుడు తిన్నగా యవ్వనుడయ్యెను. తండ్రి యీతనికి "మంజువాణి" యను భూర్జర దేశపుఁ గన్యను దెచ్చి పెండ్లి చేసెను. ఈ వివాహమును గూర్చి, మంజువాణిం గూర్చి మూడే పద్యములున్నవి. ఈ పద్యము లీ గ్రంథమందు లేకుండిన మేలుగా నుండెడిది. ఏలన నీ మంజువాణి మఱల గ్రంథమందెచ్చటను గానుపింపదు. సారంగధరుడు కాళ్ళు చేతుల కోతచే గాయపడినప్పుడు గాని తదనంతరముగాని యీమె జాడయేలేదు. కవి పూర్తిగా నీమెను మఱచియే పోయెనో లేక చిత్రాంగిని కథా నాయికనుగా జేయనెంచి నందున నీమెను మూలకుఁ ద్రోసి వేసెనో! ఎటులైనను నీమెకథ నింతటితో వదలుదము.

రాజరాజు వేటకై దండకారణ్యమునకుఁ బోవునప్పుడు కాని, సారంగధరుని బాల్యమందుగాని యెచ్చటను తత్పూర్వము చిత్రాంగి ప్రస్తావనయే లేదు. సారంగధరుడు రాజు వేట కరిగిన యనంతరము ఉబుసుపోవక పావురాల పందెమునకై నగరు బయటకేతెంచి వినోదంబులందుండగా నతని పావురము చిత్రాంగి మేడపై వ్రాలెను. ఆ సందర్భముననే చిత్రాంగి యొక్క ప్రథమ దర్శనము పాఠకులకును గలుగుచున్నది. వ్రాలిన పిట్టను జేతబట్టి చిత్రాంగి...."ఇంక దీనిచే; గలుగు నిజంబుగా దనకుగాంక్షలు దీఱ సుఖంబు చెందఁగన్." అని చింతింపఁదొడంగె.

చిత్రాంగి రాజుచే నెప్పుడు పరిగ్రహింపఁబడెనో, యాయమ యెప్పటినుండి సారంగధరునిపై మనసు గలిగియుండెనో యింతవరకు కవి తెలుపలేదు. కాని సారంగధరుడు పావురమునకై వచ్చినప్పుడతనితో చిత్రాంగి తన మనసులో రగులుచుండినట్టి ప్రేమను యిట్లు వెల్లడించెను.

ఉ. నీ సుగుణత్వమున్, జెలువు, నేర్పును,
నెచ్చెలు లెల్ల జెప్పగా
వీసరవోని మోహమున వీ
నుల విందుగ విందు నవ్వరే

ఖాసుమ కాండ! నేడు పొడగంటిని!
గన్నుల పండువయ్యె, నేఁ
జేసిన భాగ్యమెవ్వరును జేయర
యారె! ఫలించెఁ గోరికల్.

అంతియకాదు! ఆమెకా గామిని హల్లకబాణుని "దర్శన మాత్ర చేతనే" తొల్లి మనంబులో గలుగు తుందుడు కెల్లను బాసె...."

క. "నను జూడరాడదేమో
యనినిను దూరుకొనుచుందు ననయము; నాపై
నెనరు గలందుకు గుఱుతిదె
కనిపించెను; మనము వేడుకలు కనఁగల్గెన్."

అనియు సారంగధరునితోఁ జెప్పినది.

ఆంధ్ర ప్రబంధములందొకటి రెండు చోటులనే యిట్టి కథా సందర్భములు చిత్రింపఁబడినవి. మనుచరిత్ర మందు ప్రవరుని వరూధిని ప్రేమించి, ప్రార్థించినను ఫలము గానక పోవుటయు, సారంగధరలో చిత్రాంగి సారంగధరుని ప్రేమించి విఫలమనోరథ యగుటయు నీ రెండు స్థలములందే యిట్టి ఘట్టములుండినట్లు తోచుచున్నది. అచ్చటికన్న నిచ్చట విశేషము. అచ్చట వరూధిని నిరాశ పరవశురాలై కృశించెను. ఇచ్చట చిత్రాంగి పగచాటెను. ఈయమ చమత్కారముగా తన మనస్సును సారంగధరునికి బ్రకటింపజూచెను. కావుననే రవి శశిరశ్మికిన్ జొరగరాని భయానకమైన" తన మేడలో.

ఉ. ఏఁకడఁ జూచినన్ రతులకేఁ
కటి దీరఁగ వ్రాసినట్టి కొ
క్కోక కళారహస్యములు
గోప్యములౌ చవుసీతి బంధముల్
నాకపురీ విలాస కలనా
గణికామణి కాముకాది నా
నాకృతులున్ విచిత్రగతు
లచ్చట నచ్చపలాక్షి చూపుచున్.

సారంగధరునికి తన మనంబు వెలిబుచ్చ నెంచెను. కాని సారంగధరుని మనసు ఎఱుగకపోయెను. చిత్రాంగి మఱొక విధమాచరింపదొడఁగెను.

"ఓయి నెఱజాణ, తలకొన
జేయుము విరులివె జవాది చెయిబట్టుము
వాలాయమెద జేర్చు కలపము
కో............." యని పలికెను.

ఇందు నర్మోక్తిగా తనను, "తలకొన జేయుము, చేయి బట్టుము, యెద జేర్చుము" అనియు పలికెను. కాని సారంగధరుడు గ్రహించకపోయెను. చిత్రాంగి యింక తాళలేదు. సముఖంబున నేటికి రాయబారముల్."

మ. అని యూహించుచు లజ్జబో
విడిచి యేకాంతంబుగా నల్దెస
ల్గనుచున్ బైట తొలంగ, నీ
వివదలన్, గామాంధకారంబు నె
మ్మనమున్ గప్పిన, గన్నుగా
నకపుడా మత్తేభ గంభీర గా
మిని యత్యంత నిరంకుశో
ద్ధతిని బల్మిన్ బట్టగా జూచినన్.

ఇంతవఱకు వచ్చినప్పుడు సారంగధరుడు గడగడ వడకుచు "తల్లీ తడవాయెను వచ్చి; పోయెదను నేను" అనెను.

ఇప్పుడు చిత్రాంగి బలవంతమునకు తోడుగా బతిమాలుకొనజొచ్చెను. కాని సారంగధరుడు తనకుఁ దెలిసిన నీతులన్నియు బోధింపఁ దొడఁగెను. ఎవరి పాట వారికే! చిత్రాంగి కివన్నియు బోధపడవు.

ఉ. ఎన్నడు నేర్చినాడవుర!
యీ మటు మాయపు మాటలీవు; నా
కిన్ని దలంప నేమిటికి?
నిప్పుడు దోసము పెద్దచేసి యా
దున్న వయాళి కాని గడు
దొడ్డగఁ జెప్పి: భయంబుసూపి చ

క్కన్నను దుద్దువెట్టి, యుఱు
కంగc దలంచెదు; మాను మీవగల్.
"మొనసి యూరకే రతిరంగమునకు రాని
సుద్దులివి యేల చాలింపు? సుగుణివౌదు!"

అని యనినది. అయితే సారంగధరునికీ నీతులు నచ్చిన నీమెయు దనకు దగిన నీతులు నేర్చినట్టిది. శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు, చంద్రుడు వీరందరు వ్యభిచారులు కారా? యని ప్రశ్నించి.

"వారి కంటెను హెచ్చైన వాడవౌర!
నీకు గల బుద్ధి వారికి లేకపోయె
నీవు నాటికి లేకపోయితివిగాక;
చేరివారల యోజలు చెఱుపలేవె?

అక్కడికిని సారంగధరుడు ఱాయి వలె కరగకపోయెను "ఆడుది యుసురుమన్న కొఱగాదు సుమీ" అని బెదిరింపమొదలిడెను. బుజ్జగింపులకు, ప్రార్థనలకు, బలవంతమునకు లొంగని వాడిప్పుడీ బెదరింపులకు వెఱచునా? సారంగధరుని వస్త్రము చేబట్టుకొని పెనుగులాడ, నతడు వస్త్రము నామె చేతనే వదలి వెడలిపోయెను.

"అంత చిత్రాంగి మదన బాణాగ్ని వేగి
హస్తగతమైన సొమ్ము పోనాడుకొన్న
కరణి బరితాపమొందిc యే సరణినైనc
జెఱతు సారంగధరునింక సిద్ధమనుచు"

రాజు రాకకై వేచి యుండును.

రాజు అరణ్యములో జిత్రాంగిని తలచికొని "అక్కటయేమి సేయుదు... చక్కని ముద్దుగుమ్మ! నా చక్కెర బొమ్మ! జూడ కిటు సైపగcజాల వియోగ వేదనన్" అని విరహతాప మెందుచున్నాడు. "చక్కెర బొమ్మ!" ఇట్టి తియ్యటి మాటను ఆంధ్ర వాఙ్మయ మందెవ్వరును బ్రయోగింపలేదు! ఇట్లు చిత్రాంగీ లతాంcగి దిదృక్షా సదృక్షాతి జాగరూక రూక్షాక్షుండై" విరహ వ్యథ నోర్వక వెంటనే యింటి కేతెంచి యామెను దుఃఖితగా నెఱిcగి పరి పరివిధములc బ్రార్థించియుc బ్రత్యుత్తరముగానక యిట్లు వెఱ్ఱియై ప్రలాపించెను.

శా. ఏమే! పల్కవు మోహనాంగి,
యిటు లేలే యల్క చిత్రాంగి ని
న్నే మంటిం గలకంఠి, నావలన
దప్పేమే యొయారీ, యయో
నా మీదన్ దయ లేదటే చెలి,
నను న్మన్నింపవే కోమలీ
నీ మాటల్ జవదాఁట కుందుఁ
గదనే నీరేజ పత్రేక్షణా.

ఇట్లు నమ్రుడైన పతిని మఱింతఁ బ్రేరేపించి తిన్నగా సారంగధరుఁడు బలిమిపై గవిసెనని చిత్రాంగి వర్ణించి, వర్ణించి రాజు తలకెక్కునట్లుగా నిక్కువముగా నగపడు నట్లుగా నిరూపించెను. అంతియగాదు తటాలున రాజుచేత ఖడ్గము నొఱనుండి లాగి తన గొంతుకపైన బెట్టి యాత్మహత్య చేసుకొనఁబోవునట్లు నటించెను. రాజు మాటలు విని, సారంగధరుని పట్టు పుట్టము చూచి, చిత్రాంగి యొక్క పరితాపమును జూచి భరింపలేకపోయెను. కొడుకు మీది ప్రేమ యంతయు మఱచెను. నేరము విచారించుటకు సభను బిలిపించెను. (నిరంకుశాధికారులవలె కాక యీ కామాంధుడు యింతయైన చేయుట విశేషమే).

అంత సభ్యులును నుభయ పక్షముల విచారించి సారంగధరుని నేరస్థునిగా నెంచి విజ్ఞానేశ్వరుమును జూచి కాళ్ళు సేతులు కోయుటయే దీనికిఁ దగిన శిక్షయని విధించిరి. (రాజనరేంద్రుని కాలములో విజ్ఞానేశ్వరమే ముఖ్యమగు న్యాయ గ్రంథముగా నుండెనేమో) రత్నాంగి యీ సంగతి విని చాలా శోకించెను. చిత్రాంగితోఁ గొంత వాదులాడెను. రాజు కఠినుడై యేమాత్రమును క్షమింపడు. రత్నాంగి తన కొడుకు నుండి యథార్థము తెలిసికొని కుమారుడు నిర్దోషుడైనను నిట్టి యాపదలకు లోనయ్యెనని పరితాపము పొందెను. సారంగధరుడన్యాయముగా శిక్షితుఁడైనను కించిత్తు కూడ రాజునుగాని, చిత్రాంగిని గానీ దూరడు. మీదు మిక్కిలి తల్లితో నిట్లు విన్నవించుకొనెను.

చ. అడలకువమ్మ నీవు, కలనైనను
రాజును దూరకమ్మయే
యెడల సపత్నితో జెలిమి
యించుక తప్పకు మమ్మ నాదు సం

గడిc జరియించు నాదు చెలి
కాంద్రను నావలె జూడవమ్మ యిం
పడరగ నన్నిక నృఅవవమ్మ
విచారము మాని మానినీ.

సారంగధరుcడు తాను కాళ్ళు సేతులు గోలుపోయి యత్యంతము బాధపడి విలపించు నపుడైనను చిత్రాంగినిగాని, తండ్రినిగాని యొకతూరియైనను దూరడు.

చిత్రాంగి యిట్లు కాదు. ఆయమ్మ శీలమును సచివులు సంశయించి యదార్థము దెలుపుమని యడుగ.

"తొయ్యలి యూcచక యాcచక
పయ్యెద గొంగును బటాన బయలుగcజేసెన్"

తుదకాకాశవాణి యడవిలో బల్కిన పల్కులను తలారులు రాజుతో విన్నవింప, రాజామెను నిజము చెప్పుమని బెదరించి యడగ, నించుకయైననుc జలియించక యా గట్టవాయి యిట్లని పలికె.

చ. తెలిసితి హా! యిదంతయును
దేవర పట్టపుదేవి కైతవం
బలసుతు పాడిcదప్పినను
నాజ్ఞ యొనర్పగ లంచమిచ్చి వే
పిలిచి తలార్లచేత నని
పించిన దిట్టుల నీకు వాళ ము
ల్తెలియక వెఱ్ఱి రాజ! యిది
లెస్స నిజంబని నమ్మినాడవే!

చిత్రాంగి తుదకు నిందితయై గోతిలో త్రోయబడియె. సారంగధరుడొక సిద్ధుని యౌషధ క్రియచే "గుణము" పొంది సర్వసంగ పరిత్యాగియైన సన్యాసి యయ్యెను.

ఇది చిత్రాంగీ సారంగధరుల మానసిక తత్త్వభేదము. మొదటినుండియు నొకరిది కేవల యాది భౌతిక బుద్ధిగను, మఱియొకరిది యాధ్యాత్మికముగను నిరూపింపబడినది. వీరి కథ చరిత్ర యందెచ్చటను లేదని స్పష్టముగా జెప్పవచ్చును. అట్టి తఱి యిది కేవలము చేమకూర వాని కల్పన తప్ప యింకొక్కరిది కాదు. ఇతcడే

యీ కథను మొదట వ్రాసినవాడు. ఎలకూచి బాలసరస్వతియు అప్పకవియు తర్వాత విన్నారు. మఱియు కూచిమంచి తిమ్మకవి పూర్తిగా మన చేమకూర వేంకట కవిని దన ద్విపద కావ్యములో ననుకరించియున్నాడు. బాణాల శంభుదాసు కూడ తర్వాతివాడు. తన ద్విపద సారంగధరలో

"భువిలోన సారంగ భూవరు చరిత
కవితా మహత్త్వంబుగల చేమకూర
అప్పన్న చెప్పిన యా ప్రకారమున
జెప్పితి బాణాల శంభుదాసుడను"

జెప్పి వాక్రుచ్చినాడు. చేమకూర వేంకటపతిని చేమకూర వేంకటప్పయని కూడ పిలుచుచుండినట్లే చేమకూర అప్పన్న అను పదము నుండి వెల్లడియగును. ఆధునిక కాలములో కీ.శే. ధర్మవరము కృష్ణమాచార్యులీ కథను విషాదాంతముతో ముగించుట తప్ప తక్కిన యంశములలో – శైలిలో గూడ– నీ చేమకూర కవినే యనుకరించెను.

"ఈ వేంకటకవి శూద్రుఁడనియు తంజావూరి రఘునాథ నృపుని సభలో క్రీ.శ. 1630 సం.ల యప్పుడు విలసిల్లుచుండెననియు చరిత్ర శోధనల వలన నెఱుక పడుచున్నది". అని వేంకటరాయశాస్త్రి గారు వ్రాసిరి. ఏ చరిత్ర శోధన వలన నీతడు శూద్రుఁడని వెల్లడియయ్యెనో తెలుపలేదు. వేంకట కవి యాశ్వాసాంతమందు తనను "లక్ష్మణామాత్య తనూభవ"యని సంబోధించుకొనినాడు. అమాత్య శబ్దముచే నీతడు నియోగిగా నుండనోపు అని అనుమానము.

ఈ కవి యాంధ్ర వాఙ్మయ క్షీణకాలములో నుండినవాడు. పౌరాణికుల కాలము దాటియుండెను. తర్జుమాలు తక్కువయ్యెను. మహాసామ్రాజ్యములంతరించి యుండెను. మహమ్మదీయ పరిపాలనము సంపూర్ణ వికాసమందుండెను. చిన్న చిన్న రాజులు విశేషముగా భోగైకలాలసులై యుండిరి. ప్రబంధములే విశేషముగా రచింపబడుచుండెను. అవియు శృంగార ప్రధానముగా నుండెను. వాని శైలి విశేషముగా శబ్దాలంకారములతో నుండెను. భావవిలసనము తక్కువ. శబ్దాడంబర మెక్కువ. అట్టి కాలమందు జీవించిన మనకవియు నాకాలపు సాంప్రదాయమువలలో గొంతవఱకు జిక్కియుండెను. శృంగారమును నితరులతోఁ బాటిగా నిందు ప్రధానముగా నుంచుకొని వ్రాసెను.

కాని వారివలె పిచ్చిగా వ్రాయలేదు. "విజయవిలాస" మందుకొంచెము కళ్ళెమును జాఱవిడిచెను. గాని, "సారంగధర"లో మాత్రము నిగ్రహించి యుండెను. ఇందు పురవర్ణనయే లేదు. రాజనరేంద్రుడాంధ్రుడేనో కాదో? ఇతడు 'మాళవపతి' అడవిలో చిత్రాంగిని దలcచుకొని.

అక్కట నేమి సేయుదు ర
యంబున నిప్పుడె బోదు నంటినా
మిక్కిలి దూర దేశము, స
మీపమే? మాళవభూమి మండలం
బెక్కడ? దండకావనమి
దెక్కడ"

అని విలపించినాడు.

కావున నితని ముఖ్యపట్టణము రాజమహేంద్రవరము అని నిశ్చయింపలేము. కావున నీ కథ కేవలం కల్పితమగునేమో. సారంగధరలో నితర కవుల రీతి సంభోగ వర్ణన శ్రవణము నుండి పాఠకులను రక్షించినాడు. ఇందు నాయికా వర్ణన మితర కవులు చేసినట్లు తల మొదలుగ పద నఖ పర్యంతముగా వర్ణింపబడలేదు. చిత్రాంగి యొక్క వర్ణన రాజరాజు ప్రార్థించినప్పుడు, చిత్రాంగి సారంగధరుcడు దన నిట్లిట్లు వర్ణించి గవిసెనని చెప్పునప్పుడును సందర్భానుసారముగ గనుపించును గాని నా వర్ణను బట్టి యీమె యిట్టిదైయుండి యుండునని భావింప శక్యము కాదు. అటుగాక సారంగధరుcడు చక్కగా చిత్రింపబడియున్నాడు. ఇతడు మోహనా కౌలుడు, చక్కని ముక్కుగలవాడు, నగుమోము కలవాడు ఎగుభుజాలవాడు ఇంతియగాదు.

ఉ. తీరుగ మల్చివేసిన గతిన్ తొడలున్నవి; ఱొమ్ములోని వి
స్తారము చెప్పరాదు బలుదల్పు, నదల్పును బాలుగాఱు నౌ
రౌర, మొగమ్ము చక్కదన మన్ని యటుండనిమ్ము వీని యొ
య్యారమె లక్ష సేయు నహహాయనుచున్ దలయూచు సారెకున్,
ఇది చిత్రాంగికి దోచిన రూపము.

ఇక రత్నాంగికి వర్ణన బొత్తిగా లేనేలేదు. సారంగధరుని భార్య నొకే పద్యమున వర్ణించి కవియామెను బ్రక్కకుc ద్రోసి పుచ్చెను. ఇక రాజనరేంద్రుడెట్టివాడో, వృద్ధుడో, కాడో, యేజాడయుc దెలియదు.

ఇక మన కవి శైలి యెట్టిదో కనుగొందము. ఇతని శైలి మృదు మధురమై పటుత్వముతో గూడినట్టిది. పద్యముల నడక ధారాళముగా జదువుట కింపుగా నున్నది. కవియే దేశమువాడో మనకుఁదెలియదు. తంజావూరి వాఁడనుటకు వీలులేదు. ఒక్కొక్క మండలమున నొక విధముగ భాషయుండును. కవి యెట్టివాడైనను దన మండలములోని పదములఁదప్పక ప్రయోగించుట ప్రతివానికి సహజము. ఈ కవి వాడిన కొన్ని పదములు గమనింపఁదగినవి. తటకాపడి తట్టుకపడి – (గ్రామ్యము) కస్తి (కష్టము) యెదవడు (భయపడు) జుణుగు (నుసులు) కమతీలు (కమతగాండ్రు జీతగాండ్రు) కువాళము (కువ్వాడము గ్రామ్యము) బెదరించు (భయపెట్టు) ఎలుగుగొడ్లు (ఎలుగుబంట్లు) మున్నగు నీ పదములు విశేషముగా కర్నూలు, కడప మండలములలో నేటికిని సామాన్యంగా వాడుకలో నున్నవి. గావున నీ కవియు నీ మండలముల వాడై జీవనార్థము తంజావూరు రాజు నాశ్రయించి యుండి యుండునని యూహించు చున్నాను.

ఇక్కవి భావములు చాల సుందరమైనవి. సారంగధరలో గొన్ని యుపమానము లెవ్వరును బ్రయోగింపనట్టివై యున్నవి. రెండుదహరించెద.

"ఉమ్మెత్త పూవంటి యొఱపైన కుచ్చెళ్ల చెఱగు మట్టెలమీద చిందుదొక్క"

"మంగలంబునం బెటిలిన పేలగింజవలె మిక్కిలి పుత్ర వియోగ బాధ నట్టిటుపడి"

పావురము నాకసమున నెగురవైచి యది వియత్తలమందు విహరించుట నిట్లు వర్ణించి యున్నాడు.

సౌధ కేతన పటాంచల వాతదూత ని
        ర్గత గాంగ డిండీర ఖండమనగ
సితమౌని పూర్వాసిత భూపునద్ది దృ
        క్షాగ తేంద్రాగ లతాంత మనగ
నవహార సంఘట్టనగ్రస్త పతయాళు
        గగన లక్ష్మీమౌక్తికం బనంగ
మధ్యందినానంత మణిలూన మందేహ
        సంత్యక్త బిరుదైక శంఖమనఁగ

గీ. పంకరుహ సంభవ కళత్ర పత్త్రపుత్ర
సురకుల ధురీణ కంఖాణ కరి కృపాణ
రమ్య ధావల్య జైత్ర పారావతంబు
రాఁ దొడఁగెఁ జుక్క దెగిపడ్డ క్రమముదోప

ఇది యీ కవి వతంసుని సంస్కృత భాషా ప్రవీణతయు జాటుచున్నది.

ఇక్కవికి శ్లేషలు యమకాలంకారములు, అను ప్రాసలు చాలా యిష్టముండినట్లు తోచుచున్నది. రమ్యముగా వర్ణించుచు వర్ణించుచు నేదైన నొక పదము నాధారము చేసికొని దాని ధ్వనియందే మగ్నుఁడై తప్పుడు దారిని బోఁదొడగును. శబ్దాలంకారము లితని కిష్టమని చూపుట కొక్క యుదాహరణమిచ్చెదను.

ఆ. ఔర! వీని మోహనాకార రేఖ వే
మాఱు మారు హరికుమారు మారు
వెలిదమ్మితొగల వీని కందోయి తీరు
రేపు మాపు బాపు రేపు మాపు

ఈ గ్రంథ మందు ముఖ్యముగా జూడఁదగిన వర్ణనలో - రాజనరేంద్రుని సంతానచింత, సారంగధరుని బాల్యము, పావురములాట, చిత్రాంగీ రత్నాంగీ సంవాదము మున్నగునవి.

ఈ చరిత్రమునకు నాయికా నాయకులగు చిత్రాంగీ సారంగధరుల గుణ శీలముల పోషణౌచిత్యము కొనియాడ దగినట్టిది. ముఖ్యముగా సాత్విక శక్తిచే, పవిత్ర జీవితముచే, సత్యనిష్టచే నెల్లర మనంబులు రంజిల్లునట్లుగా సారంగధర పాత్రమును సృష్టించిన చేమకూర వేకంటకవి యొక్క కవిత్వ మహత్త్వము వే విధముల శ్లాఘ్యమైనది.

అనర్ఘ రాఘవము

శ్రీ శేషాద్రి రమణ కవులు అనర్ఘ రాఘవమను తెనుగు ప్రబంధమును అష్టభాష గోపాలరాయల మేనల్లుడును ప్రాగటూరు దొరయు, సుమారు 200 ఏండ్ల నాడుండిన వాడుననగు తిమ్మారెడ్డి యను తిమ్మభూపాలుడు ఆంధ్రీకరించిన పద్య కావ్యమని వ్రాసినారు. మరియు నా గ్రంథమిటీవల కర్నూలులో నచ్చైనదని యొక మిత్రుడు నాకా ప్రతి జూపించెను. ఆ గ్రంథమందు గ్రంథ ముఖపత్రమే ముద్రించలేదు, ఇది సహేతుకమో యేమో కాని ప్రత్యాశ్వాసాంతమందు తిమ్మభూపాల ప్రణీతమని పెద్ద గద్యమును బ్రకటించినారు.

అట్టిచో నీ కవి నిజముగా నీ గ్రంథము రచించెనా? లేక వేరొక భాగస్వామి కలడా, ఆ భాగస్వామియే దీనిని పూర్తిగా రచించెనా? లేక యిద్దరును కలిసి రచించిరా? యను ప్రశ్నలు నాలో బయలుదేరెను. పాపమా భాగస్వామి యెంత నిష్కామ కర్మియేమో! తిమ్మారెడ్డి ఈ యనర్ఘ రాఘవమందేమి సాక్ష్యము స్వయముగా నిచ్చుచున్నాడో చూడుడు.

మ. కమనీయ స్థితి జెంగటన్ ధవళ శంఖస్ఫూర్తి రాణింప దీ
ప్తమరీచిన్ బవడంపు గెంపు బవలున్ బంజుల్ వెలుగొందని
స్సమ సారస్వత నిర్మలామృత ఝురీ జాగ్రత్త రంగాబ్ధి పే
ర మహా సత్కవి తేజరిల్లె విబుధ ప్రస్తూయమానోద్ధతిన్

(యీ పద్యములో "జాగ్రత్తరంగాబ్ధి" అనుటకు జాగ్రత్కవి రంగాబ్ధి అని సరిపోవునని ముందు చూపెదను)

చ. అతనికి బౌత్రుడై యసదృశాఖిల విద్యల బ్రౌఢిగన్న యా
యతమతి కృష్ణ సత్కవి సహాయ కవిత్వమునన్ సమాజసం
తత భజనాదరుండనగు నాకు నశేష విశేష వైదుషీ
ప్రతిభకర స్థలామలక భాస్వరమై తనరారు టబ్రమే.

ఈ పద్యమును జదివిన బోధ్యమగునదేమన – పేరయ్య అను గొప్ప పండితుడుండెనట. అతని మనుమడు కృష్ణ కవి అనేవారు. వీరి సహాయముండిన తరువాత "నేను కవిత్వము వ్రాసేదొక విచిత్రమా" అని తిమ్మారెడ్డి చెప్పుకొనినాడు.

ఇప్పుడింత వరకు తెలిసిన సారాంశమున కృష్ణకవియను నతడు ఈ కవిత్వములో భాగస్వామియనియు, యతినిదే పై చేయిగా నుండినట్లున్ను తిమ్మారెడ్డి అక్కడక్కడ కామాలు, వత్తులు, గుళ్ళు, కొమ్ములు, సవరించి యుండవచ్చును అని విశదమగుచున్నది.

కాని యిదికూడ నిజముకాదేమో నా మిత్రుని యొక్కనివద్ద తాళపత్రములో నిట్లుండుట జూచి వ్రాసికొంటిని

మ. "అవనిన్ రంగసముద్ర కృష్ణకవి చంద్రాపాదితానర్ఘరా
ఘవ కావ్యంబనురక్తి తోడుతను శ్రీకానాల కృష్ణ ప్రధా
ననరాగ్రేసరుచేత వ్రాయబడి యెన్నన్ సత్కవిశ్రేణికిన్
జవమై వన్నియకెక్కు నిద్ధరణి నాచంద్రార్క సంస్థాయియై"

గద్య – "ఉప్పల లక్ష్మీ నృసింహాచార్యులవారి కుమారుడు రామానుజా చార్యులవారు బిజ్జల చిన్నమ్మ దేశాయిగారికి అనర్ఘరాఘవము వ్రాసిన పుస్తకము" అని గ్రంథాంతమందు తాటాకుపై గంటముతోనే వ్రాసిన భాగము కలదు. ఈ పద్య గద్యములవలన తేలునదియేమన అనర్ఘ రాఘవమును రంగసముద్రము కృష్ణకవియే వ్రాసినాడని అట్టి గ్రంథమును కానాల కృష్ణప్ప తాటాకులపై వేరు ప్రతి వ్రాసి యిచ్చెనని పద్యములవలన తెలియును.

గద్యమువలన తెలియున దేమగా ఆ తర్వాత తిమ్మారెడ్డి మనుమరాలో యేమో బిజ్జుల చిన్నమ్మ దేశాయికి ఉప్పలరామానుజాచార్యులు పూర్వప్రతి శిథిలంబైనందున నేమో వేరు ప్రతి వ్రాసి యిచ్చినాడు. నకల్నవీసులకు అఖ్ఖల్ లేనట్లు యీ రెండవవారు గ్రంథాంతమందలి కానాల కృష్ణప్ప వ్రాసిన యగత్యపు బద్యమునుగూడ నకలుచేసినాడు. తర్వాత తిమ్మారెడ్డి వంశములో కవులు లేనందున (తిమ్మారెడ్డి కవియైతే గద యుండునది) వారును నీ దాళపత్రప్రతిని నందరికి చూపుకొనినట్లున్నది. దాని కారణమిప్పుడే తెల్పుదును.

మొదలు "జాగ్రత్కవిరంగాబ్ధి" యని యుండవలె నంటినికదా. ఎందుకన కానాలవారి పద్యములో రంగసముద్రము కృష్ణ కవియని పేర్కొనబడినది. కావున "రంగాబ్ధి" కప్పుడన్వయము సరిపోవును. లేకుండిన తరంగాబ్ధి అనిన నిరర్థక మగును.

ఇంతవరకు నిశ్చయమగునదేమన రంగసముద్రము కృష్ణకవి యను వారే యీ గ్రంథమును పూర్తిగా వ్రాసెననియు తిమ్మారెడ్డి బహుశా అతని పోషకపు దొరయై యుండెననియు, తర్వాత మందః కవియశఃప్రార్థీ అన్నట్లు తిమ్మారెడ్డియపర పండిత పెద్ద కృష్ణప్పవలె కృష్ణకవిని లోబరుచుకొని, తన పేరెక్కించు కొనెననియు, అక్కడికి కవి తన శ్రమ వ్యర్థమగునేయని ఆశ్వాసాదిలోనొక పద్యము సగము సగమర్థ మిచ్చునది, అపరచిత్రకవి సింగనార్యునివలె వ్రాసెననియు కానాలవారు ఇంచుమించు సమకాలికులో లేక తర్వాత తరము వారో యగుటచే తన పెద్దలవలన నిజమెరిగినందునను తానున్ను కాస్తా కూస్తా కవి యగుటచేత తాను నకలుచేసిన తరువాత తాళ్ళపాక వారి కవిత్వము కొంత నా పైత్యం కొంత అన్నట్లు తన పద్యమొకటి మెల్లగా నిరికించి కవికుపకారము చేసెననియు నూహింప వీలుకలదు.

ఇంతేకాదు. ఈ తాళపత్ర సంపుటి 20-30 ఏండ్లనాడు పెద్ద పెద్ద పండితుల చేతులలో బడి బడి తుదకు అపర దుర్వాసులను ఖ్యాతిగాంచిన ఆలంపూరీ శ్రీప్రౌఢ సరస్వతీ కుమార స్వాములవారి చేత బడినది. ఆ యతులును నీ గ్రంథమును జూచి హేతుగర్భితమగు నీ పద్యముల తాళపత్రముల తుది స్వహస్తముతో మసితో వ్రాసినవి నా మిత్రుడు చూపగా వ్రాసికొనిన పద్యములివిగో జూడుడు.

శా. ఈ గ్రంథంబు ప్రశస్తమైనది యటంచే నెంచి చూడంగనెం
తేగ్రాహ్యేతర దుష్ప్రయోగములు సంధి ప్రక్రియాదోషణ!
వ్యగ్రాలేఖక సంగతంబులిట నాహో పెక్కులై తోచెధీ!
ప్రాగ్యుల్ దిద్దగలారటంచు శ్రమయింప న్మానితిన్ నే సుడీ

ఉ. ఏమి వచింతు నక్కట ధనేచ్ఛను దుచ్ఛనృశంస సన్నిభో
ద్దామవదాన్య మాన్యుల వృధానుతిసేయుచు నిట్లు సత్కవి
గ్రామణులే చెలంగిరిలఁ గ్రచ్ఛర కేవల రామునిన్ మదిం
గ్రామిత చిత్తవృత్తి పొసగన్ భజియించిన మోక్షమబ్బుదే

– శ్రీ.కు.

శుభ కృత్కార్తిక కృ 5లు

అని శ్రీ శాస్త్రులవారి వ్రాలు కలదు

దీనివలన శ్రీ కుమార శాస్త్రిగారును గ్రంథ కర్తృత్వమును సంశయించి రెండవ పద్యములో ధనేచ్ఛచే కవి యిట్టి తుచ్ఛ కార్యము చేసెనే కేవల రామభజన గావించిన మోక్షమబ్బి యుండునుగదా అని సూచించినారు.

ఇన్ని ప్రమాణములు మనకు దొరుకుచుండ పాపమా రంగసముద్ర కృష్ణ కవి పేరును మాపి తిమ్మారెడ్డిని పొగడుట పొసగనేరదు. ఇంకా ఈ కృష్ణకవి యెవరను విషయము నాకు తెలియదు. పరిశోధకులు తెలిసిన తెలుపుదురు కాక.

వేదము వేంకటరాయ శాస్త్రిగారు

వేదము వేంకటరాయ శాస్త్రిగారు దివంగతులైరను వార్త విని చాలా ఖేద మొందని యాంధ్రుఁడుండఁడు. శ్రీ శాస్త్రిగారి కీర్తి యక్షరాస్యులగు సకలాంధ్రు లందఱిలో వ్యాపించినందునఁ గించిజ్ఞుడను గూడ కాని నేను వారిని గురించి వ్రాయుట హాస్యాస్పదమే ఐనను వారి పరిచయము నాకు ఁగొంత యుండి నందున వారి పాండిత్యమును నే నెల్లప్పుడు స్తుతించు స్వభావము కలవాఁడనైనందున వారి యందు నా కపారమగు భక్తి యుండినందున వారి విషయమై రెండు మాటలు వ్రాయ సాహసించినందులకు పాఠకులు మన్నింతురు గాక!

శాస్త్రులవారికి "పండితరాయ" యను బిరుదము చాల సార్థకమని నా మతము. ఏలన వీరిని బోలు పండితులు వింధ్యకు దక్షిణమున లేరనియే నేను విశ్వసించువాడఁను. వీరి వైదుష్యము వీరు వ్రాసిన సంస్కృతాంధ్ర గ్రంథముల వ్యాఖ్యానములే చాటుచున్నవి. శృంగార నైషధ గ్రంథ వ్యాఖ్యానమందుఁ బలు తావుల తమ గురువులగు సీతారామాచార్యులనే తప్పుబట్టి వారిచే రచితమగు "శబ్ద రత్నాకరము" లోని యర్థము లనేకములు దప్పు అని నిరూపించిరి. మఱియు నాముక్త మాల్యదలోని పద్యము లనేకములు పూర్వ వ్యాఖ్యాతలు సరిగా మనసునకు రాక తప్పని నిర్ణయించియుండ శాస్త్రులవారు తమ వ్యాఖ్యాన మందవి సరియని నిరూపించి, సవరించి చూపించిన పాండితీ మహిమ కడుంగడు శ్లాఘ్యాపాత్రము.

వీరు కేవల వ్యాఖ్యాన కర్తలే గాక విమర్శక శిఖామణులునునై యుండిరి. సుమారు 15 సంవత్సరముల క్రిందట గ్రామ్యవాదము బయలుదేరెను. ఆ వాదమునకు కొక్కొండ వెంకటరత్నము పండితులు వంటివారు సీస పద్యమునకు వెండి బంగారు పద్యములను విశ్వామిత్ర సృష్టి నొకదానిని కల్పించి సహాయపడిరి. ఆ సందర్భమున

శాస్త్రులవారు గ్రామ్యాదేశ నిరసనమును నొక లఘు పుస్తకమును వ్రాసి తీవ్రముగా ఖండించిరి. మఱియు వేంకట రత్నము పంతులు సామాన్యులు కారు మహామహోపాధ్యాయ బిరుదాంకితులు. అప్పటికి మన శాస్త్రుల వారికేబిరుదమును లేదు. మహోపాధ్యాయులగు వెంకటరత్నము పంతులుగారు వ్రాసిన ఆంధ్రీకృత "ప్రసన్న రాఘవ నాటకము"పై శాస్త్రులవారొక విమర్శనము వ్రాసిరి. నాటకముకన్న రెండంతలు హెచ్చుగా విమర్శన యున్నది. ఆ గ్రంథమందు పంతులుగారి గ్రంథమును ఖండ ఖండములుగా చించి చెండాడి భీభత్సముగా విమర్శించి పంతుల వారికి తలవంపులగునట్లును, పాండిత్యము సంపాదించుకొనువారికి మార్గదర్శిగా నుండునట్లును నా విమర్శనమును ప్రకటించిరి. కాని యీ గ్రంథము పునర్ముద్రణము గాక బహుకాల మయ్యెను.

శాస్త్రుల వారుపన్యాసములలో మంచి ధోరణి కలవారు. వీరి యుపన్యాసమే యననేల, వీరి సంభాషణ మెల్లకాలములందును హాస్య రసపూరితమై యుండెడిది. వీరుపన్యసించునప్పుడు సభ్యులను దన హాస్య కథనముచే నవ్వింతురు. కాని తాము మాత్రము నవ్వుట లేదు. ఆంగ్ల పండితులు హాస్యమెన్నియో విధముల నుండునని నిరూపించుచు నీ విధమగు హాస్యము చాల ప్రశంసనీయమైనదని వ్రాసియున్నారు. స్విఫ్ట్ ఆడిసన్ మున్నగు పండితులిట్టి హాస్యమునే చిప్పిలఁ జేయుచుండెడివారట!

శాస్త్రులవారాధునికులగు కవుల ననేకుల మెచ్చకుండెడివాడు. వారు స్వభావముచే మొగమాటము లేనివారు. అనేకులు వారి దగ్గఱకు వచ్చి తమ నూతన కల్పనా విశేషములతోఁ గూడిన గ్రంథములకుఁ దొలి పలుకుల వ్రాయుమని ప్రార్థించెడివారట. కాని శాస్త్రులవారు వారి గ్రంథములను మెచ్చక వారి యెదుటనే తీవ్రముగా విమర్శింప వారు శాస్త్రులవారి పునర్దర్శనమునకుఁ బోవు వారు కారట. నిరంతరము రాత్రిం బవళ్ళును మృతించువఱకు కృషి చేసి విద్యార్థివలెఁ జదువుచు సంస్కృతాంధ్ర గ్రంథముల నించుమించు నన్నింటిని జదుపుటయే కాక యనేకులకుఁ దొఱకని గ్రంథములను గూడ శోధించి సంస్కృతాంధ్ర భాషలందు నిరుపమాన పాండిత్యమును గడించిన శాస్త్రులవారి కితర పండితులు మెచ్చఁదగినవారు గాకుండుటలో నాశ్చర్యమేమి? శాస్త్రులవారి యీ యభిప్రాయము కేవల సంభాషణ యందేకాక వీరి గ్రంథములందు బ్రకటితమైయున్నది.

శృంగార నైషధ వ్యాఖ్యానమును వ్రాసినప్పుడు దాని నిట్లు సెలవిచ్చి యున్నారు.

ఉ. వ్రాసితి మున్ ప్రతాప కథ
పండిత మానుల గుండె నీరుగా
వ్రాసితి వెన్క నయ్యుష వివాహము
సిద్ధ సుధా ప్రవాహమున్
వేసర కిప్డు నైషధము విప్పి నిధుల్
నెఱ చూఱ లిచ్చితివ్
జేసెద నింక తత్పరత సేవను చూడి కుడుత్త దేవికిన్.

వీరు వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకమందు మూడు స్థలములందు వీరు తమ గొప్పతనమును జాటుకొని యున్నారు. నాటక ప్రస్తావనలో నిట్లు వ్రాసికొనిరి.

ఉ. అంకెకు దార్చె నే రసికు
నంగల భారతి ప్రౌఢనీతి నా
కింకరి నాంధ్ర ద్రావిడియుఁ
గేరుచు దైవియుఁ గూడి రెవ్వరిన్
జంకు కళంకు లేని కవి చంద్రుడు
తోషిత కోధరేంద్రుఁడా
వేంకటరాయశాస్త్రి కృతి వెంగలి
మూక కెఱుఁగ శక్యమే

శాస్త్రులవారి రచనలన్నింటిలోఁ గవిత్వమందేమి, హాస్యోచిత సంభాషణ ముననేమి, కథాచమత్కారమందేమి, ప్రతాపరుద్రీయ నాటకము శ్రేష్ఠమని నాకు దోచినది. వీరి రచనములందేకాక యాంధ్ర నాటకములందిది యద్వితీయ మన వచ్చును. ఈ కథయందంతటను నాంధ్రదేశముపై శాస్త్రులవారికెట్టి గాఢాభిమాన మున్నదో వెల్లడియగుచున్నది. పేరిగాడు ప్రతాపరుద్రుడై కవిగోష్ఠిలో నుండి కవిత్వమును గుఱించి కొంత ముచ్చటించును. కవి పేరిగాని నాశీర్వదించునప్పుడు శ్లేషాతిశయోక్తులతో లావులావుమాటలతో సంబోధింపవాని కవి రుచింపక యిట్లనును. యిదేం కయిత్తం యిది సీత్ కయిత్తమంటె యీలాగా! ప్రతి మనిషికీ తెలియాలి. సాకలోడికి మంగలోడికి తెలియాలి అని యనగా కవి.

"సరి! యిక ధౌర్త్యము చేసెదను" అని యిట్లు పేరిగాని దీవించును.

క. సలవ మడతలకి మలనే
యెలి బూడిద సౌదుసున్న మెల్లల మలేనీ
కలునీలమలె, మడేల,
యెలిగేనీయ సమునేల కెలికోకౌరా.

పేరిగాడు: "తెఱచిన నోరు మూయక తలయూచి యూచి
విని – నవ్వా నవ్వా భలే భలే బాపనయ్యా.
అచ్చరనచ్చులు.. కయీస్సిరుడా యిలాం
టి కయిత్తం యింకెవరైనా శెప్పగల్తురా"

"కయీస్సర్లా శెప్పవయ్యా యిలాంటి కయిత్తం శెప్పేవోళ్ళు యింక మీదయినా వుంటారా, వుండరా?" అని ప్రశ్నింప భావగర్భితమైన యీ క్రింది ప్రశ్నోత్తరముల గమనింపుడు.

కవి : ఇట్టి కవులింక పుట్టఁగలరు.

పేరి : "యప్పుడు! యక్కడ? నాకిట్టాంటి కవులే గావాల యివరంగా శెప్పు"

కవి : ఇంక ఆఱు నూరేండ్లకు వేరు దొరతనములో కొన్ని తావుల మీబోటి రసజ్ఞులే బహుళమగుదురు. వారికై మీబోటి రసికులే కవనములు సేయుదురు. మీవలనే వారుభయులు చదువుకున్న వారికన్న తామే మేలనిఁ తలచువారే.

పేరి : అయ్యా–కయిస్సరయ్యా–మేము సదువుకున్నోళ్ళ కంటె మెచ్చని మా కులం గుట్టు నీకేలాగ తెల్సిందయ్యా?

కవి : వరప్రసాదము మఱి ప్రకృతము. ఆ కవులు మీకుఁదగిన కవనము చేయుదురు. అది అతి నీరసముగా నుండును. అందులకా రసజ్ఞులు, ఇందులకు మీరెట్లో అట్లే. ఆనంద సాగరములో మునిగి ఊపిరి తిరగక ఉక్కిరి బిక్కిరియై డొంక తప్పిడింక కొట్టుదురు.

ఈ సంభాషణములోని విశేషమేమన నీ ప్రతాపుని కథ 610 సంవత్సరముల క్రిందట జరిగినది. కావున ఇంక యాఱు నూరేండ్ల కనుటలో నేటి కాలము సూచింపబడినది. మఱియు వేరు దొరతనములో ననగా నిప్పటి యాంగ్లేయ

దొరతనములోనని అర్థము. మీబోటి రసజ్ఞులే యన చాకలి పేరిగాని వంటి వారట! కవిత్వము చేయువారును చాకలి వానివంటి వారేయట. మరి యీ కవిత్వము అతి నీరసమట. యిట్టి దానికే నేటి రసజ్ఞులు యానందమందు మునిగి డొంక తప్పి డింక కొట్టుదురట. నేటి కాలపు గ్రామ్యవాదులను గొంచెము చదివి మరింత వ్రాయు వారిని మనసులో నుంచుకొని పై అభిప్రాయమును శాస్త్రులవారు పేరిగాని నోటను చెకుముకి నోటను బలికించుచున్నారు.

ఈ ప్రతాపరుద్రీయ నాటకమందు యుగంధరుఁడు వెఱ్ఱివానివలె ఢిల్లీ వీధులందు దిరిగి తన పిచ్చిని బ్రదర్శించునపుడా కుహనోన్మత్త మహామహునిచేనిట్లు పలికించుచున్నారు మన శాస్త్రులవారు. – వెఱ్ఱి – నా ప్రతిభముందర ఇతరుల నీతి ప్రయోగ మేపాటిదో వర్ణించెద – లోగుట్టెఱుంగని వారు కవులను దూషించితినని తలంతురుగాక – ప్రకాశముగా – పూర్వ జన్మములో నేను కవీశ్వరుణ్ణి. అప్పుడు నా కవిత్వాన్ని నేనే వర్ణించినాడ – పాడండి–

"మొద్దు మొద్దూల కవుల
బొద్దు బుఱ్ఱల మీద
గుద్దునా ముద్దు పాట"
"జబ్బు జబ్బూ కవుల
గబ్బు పాటల మీద
దెబ్బన లిబ్బి పాట"
"పుచ్చు పుచ్చూ కవుల
చచ్చు పాటల మీద
చిచ్చు నా మెచ్చుపాట"

ఈ ప్రకారముగా నింకను చాలమట్టుకు ఆ వెఱ్ఱివానిచేఁ బాడించినాడు. ఇందుఁగూడ శ్రీ శాస్త్రులవారు తమ ప్రతిభను నితర కవులకన్న మిన్నగా లెక్కించినట్లు ధ్వని వచ్చుచున్నది.

శాస్త్రులవారు రచించిన అమర శతక వ్యాఖ్యయు భర్తృహరి శతకవ్యాఖ్యయుఁ జూచినందున వారుదాహరించిన గ్రంథాలెన్నియో యనేకులెన్నడును విననట్టివి కలవు. శృంగారమును నిరూపించుతావుల ననేక కామశాస్త్రముల నుదాహరించియున్నారు.

నీతుల నుదాహరించుచో యనేక నీతి గ్రంథముల సూచించియున్నారు. అటులే "శృంగార నైషధము"ను, ఆముక్తమాల్యదను వివరించునప్పుడనేక ప్రమాణ గ్రంథముల నుదాహరించియున్నారు.

శ్రీ శాస్త్రుల వారికి ప్రతాపరుద్రీయముపై యభిమానము మెండు. వారు కర్నూలులో నొక వారము దినములుండిరి. అప్పుడు నన్ను జూచినపుడెల్లను నిట్లను వారు. "నిన్ను జూచినపుడెల్లను నా ప్రతాపరుద్రుడు జ్ఞాపకము వచ్చును" అని. శాస్త్రుల వారితో నొక తూరి వారు వ్రాసిన ప్రతాపరుద్రీయ విషయమై ముచ్చటించుచు యందలి ముసల్మాన్ పాత్రములను మాట్లాడించుచో వారి "తురక", "తెనుఁగు"ను గుఱించి విచారించితిని. శాస్త్రులవారికేమైన ఉర్దూ కూడఁ తెలియునేమోయని తలంచియుంటిని. దానికి వారు తమ కుర్దూ యేమియుఁ దెలియదనియు, నది కేవలమూహాజనితమే యనియు సెలవిచ్చిరి. బోయవారు పాడిన పాటలు తమ దేశమందేమైన బ్రచారమందున్నవాయని యడిగితిని. తమ దేశమందు బోయలు తెడ్డులేయునపుడు చాల బూతుపాటలు పాడుదురనియుఁ వానిని సంస్కరించి మంచి పాటలు పాడుటకుఁ జాల వీలు కలదని చూపుటకై యిట్లు వ్రాసితినని చెప్పిరి.

శాస్త్రులవారు వ్రాసిన వ్యాఖ్యానములన్నింటిలో వారికి 'ఆముక్తమాల్యద'పై యభిమానము మెండు. ఆముక్తమాల్యద'ను శ్రీకృష్ణదేవరాయలు వ్రాయలేదనియు నది పెద్దన్నయే వ్రాసెనని జెప్పు జనవాక్యముపై వారి యభిప్రాయమేమని శాస్త్రులవారి నడుగ వారిట్లనిరి. "రాజులు తాము వ్రాసిన కృతులను దమ యాస్థాన కవులను సరిఁజూడ నియోగించుట వింత కాదు. కావున శ్రీకృష్ణ దేవరాయలు చేసినారు. పెద్దన్న దానిని చూసినారు" అని రెండే మాటలలో జవాబు చెప్పిరి. "ఆముక్త మాల్యద" వ్యాఖ్యను ముద్రించుటకై సహాయము కావలెనని శాస్త్రులవారు గద్వాల రాజుల నాశ్రయించదలచి కర్నూలొక పర్యాయము వచ్చియుండిరి. కర్నూలులో నొక సభ చేసి యందు, నాముక్తమాల్యదను గుఱించి యుపన్యసించి యుండిరి. అచ్చట చందా కూడఁ గొంతప్రోగయ్యెను. పిమ్మట వారు గద్వాల కేగిరి. అచ్చట కీ.శే. గద్వాల ప్రభువులుంగారు వారిని నలుబది దినములుండనిచ్చి నాలుగు వందల రూప్యములిచ్చి పంపిరి. శాస్త్రులవారు కర్నూలునకుఁ దిరుగా వచ్చి గద్వాల విశేషములును దమ సహజ హాస్యంపు ధోరణిలోఁ జెప్పుచుండిరి. ఆ యంశ మిప్పు డప్రస్తుతమని సూచించితిని గాని వివరింపలేదు. శాస్త్రుల వారు గద్వాల కేగిన తర్వాత వారి

హితులలో నొకరు కీ.శే. వనపర్తి ప్రభులగు రాజాకృష్ణదేవరావు గారితో 'నాముక్త మాల్యద' వ్యాఖ్యానమును బ్రశంసించి కృష్ణదేవరాయలు ప్రపంచమందు వెలయించ వలెను" అని చెప్పువారు చమత్కారమునకు సంతసించి దాని ముద్రణమున కగు వ్యయమును 4000 రూపాయల నిచ్చునట్లొప్పుకొనిరి కాని శాస్త్రులవారు కర్నూలుకు 400 రూపాయలతో వచ్చువఱకు శ్రీకృష్ణదేవరాయలు దివంగతులైరి. ఇది నా యెఱిగిన యంశముగానే వ్రాసితిని. శాస్త్రులవారు పూదూరు ద్రావిడులు. వారి యింటిలో వారి తల్లితో వారు అరవములో మాట్లాడుటను నేను వినినాడను. ఇట్లు ద్రావిడులైనను వీరాంధ్ర భాషకుఁ జేసిన సేవ యద్వితీయము. వీరి వలన నింకను ననేక కార్యములు కావలసియుండెను. ఒక మారు నేను మద్రాసులో కళాశాల విద్యార్థిగా నుండినప్పుడు శ్రీ శాస్త్రుల వారిని దర్శించుకొని యుంటిని. అప్పుడు సంభాషణములో శాస్త్రుల వారు తమకేమియు నవకాశములేదనియు దాము ఆంధ్ర వ్యాకరణము నొకదానిని సమగ్రముగా వ్రాయఁబూనినాననియు సెలవిచ్చియుండిరి. కాని మన దౌర్భాగ్య ఫలితముగా వీరిచే నా పని కాకపోయెను. ఇంకోమారు వారిని గలిసి యుండినప్పుడు వారు సూర్యరాయాంధ్ర నిఘంటువునకై పడిన శ్రమను వర్ణించి తుదకది కొందఱి యసహనమున వ్యర్థమగుటయుఁ దానా పనిని వదలుకొనవలసి వచ్చుటయుఁ జెప్పి చింతించిరి. నిశ్చయముగా వారిచే నా నిఘంటువు కాదగినట్టిది. ఆంగ్ల వాఙ్మయము నకు జాన్‌సన్ ఎట్టివాడో మన యాంధ్రమునకు వీరట్టి వారనుటలో నేమియు సందేహము లేదు. డిక్షనరీ జాన్‌సన్ అని యతఁడెట్లు పేరొందెనో యటులే వీరిని గూడ నిఘంటు శాస్త్రిగారినిగా భావి పండిత సంతతి ప్రశంసించి యుండును.

మన వాఙ్మయమందుఁ బ్రాచీన మహాకవుల జీవితములన్నియుఁ దెనాలి రామకృష్ణుని కథల వంటివై పోయినవి. ఆధునికుల చరిత్రములు గూడ వ్రాయబడలేదు. మన శాస్త్రులవారి జీవిత చరిత్రములు గూడఁ బ్రకటించుట చాలామంచిది. ఆధునికులలో గణనకెక్కిన సర్వ పండితుల చేతను సంపూజ్యులై సర్వతంత్ర మహా మహోపాధ్యాయ, పండితరాయ, ఇత్యాది బిరుదములనేకము సంపాదించి కవులకును, సగము పండితులకు, భయంకరుడై నిర్దుష్టమైన కవిత్వమును వ్రాసి పండిత సభలందెల్లెడలను నగ్రపూజ నొందిన శ్రీవేదము వేంకటరాయశాస్త్రిగారి కీర్తి యాచంద్ర తార్కమై వెలయుగాత. వారియాత్మకు శాంతి కలుగుగాక! ఆంధ్ర లోకము వారి ప్రతిభకు దగినట్టుగా వారిని గౌరవింతురు గాక!

❖ ❖ ❖

రెండవ భాగం

ప్రాచీనార్యులు - వర్ణ వ్యవస్థ

హిందూమతము వ్యాపకమతము (Proseletysing religion) కాదని నేటి హిందువుల యాచార వ్యవహారముల గమనించువారు చెప్పుచున్నారు. ఇది హిందూమత క్షైణ్యచిహ్నముగాని వేరుకాదు. ప్రాచీనార్యులలో నిట్టి సంకుచిత భావము లంతగా లేకుండెననియే భావింపవలయును. ప్రపంచముయొక్క సర్వభాగములందు సముద్ర వ్యాపారము చేసిన కాలమందుగాని, దూరదేశములందు విశాల భారతిని (Greater India) నెలకొల్పిననాడు గాని ప్రాచ్య ప్రతీచ్య దేశములందు మతబోధలు చేసి హిందూ బౌద్ధమతములలోనికిఁ దద్దేశీయుల బరివర్తనము (Conversion) చేసిననాడుగాని ప్రాచీనార్యులలో నేటిరీతి జాతి వైషమ్యము, హ్రస్వదృష్టి, హృదయ దౌర్బల్యము, సాంఘిక పతనము లేకుండెను.

హిందూమతమందు జేరిన స్త్రీ శూద్రులు వేదమునే వినగూడదు, చదువగూడదు అను కుత్సిత తర్కము లీ మధ్యకాలముననే బయలుదేరెనుగాని, ప్రాచీన కాలమందు లేకుండెను. క్రీ.శ. 1907 వ సంవత్సరమున జర్మన్ పండితుడగు హ్యూగోవింక్లర్ కనిపెట్టిన బేగాజ్ కే (Beghaz keui) అను శాసనమందు కపడోషియా దేశమందు అనార్యజాతులగు హిట్ టైవారును, మిటన్నీ జాతివారును సంధి కుదుర్చుకొనినప్పుడు మిత్ర, వరుణ, ఇంద్రాది దేవతలను సాక్షులుగా గోరికొనిరనియు, నీ రెండు జాతుల రాజులు బాంధవ్యమును గుదిర్చికొని వివాహముల జేసికొను కాలమును 'నాసత్యుల' (అశ్వినుల) ను మంత్రపూర్వకముగా నాహ్వానించిరనియు నున్నది. ఎక్కడ కపడోసియా? మఱియెక్కడ నార్యావర్తము? ఈ శాసనములోని విషయములు క్రీస్తుకు బూర్వము 1400 సంవత్సరము నాడు జరిగెను. అంతటి ప్రాచీనకాలమందే వేదమత మెట్లు ప్రచారము చేయబడెనో యూహించవచ్చును.

బౌద్ధమత ప్రచారము నానా దిగంతము లందెట్లు ప్రచారము గావింపబడెనో చరిత్రజ్ఞులకు విదితమే. బౌద్ధులయొక్క ప్రాచీన గ్రంథములగు "జాతకముల"లో హిందూ వర్ణవ్యవస్థను గుఱించిన విషయములనేకములు కలవు. రిస్‌డేవిడ్సు పండితుడు తన (Budhist India) గ్రంథమున నిట్లు వ్రాసియున్నాడు. ఈ క్రింది యుదాహరణముల వలన నా కాలమున జాతులలో సమ్మేళనము ధారాళముగా జరిగెనని విశదమగు చున్నది.

1. ఒక క్షత్రియుడు క్రమముగా కుమ్మరివాని దగ్గఱ, మేదరవాని దగ్గఱ పుష్పలావిక దగ్గఱ, బానిసీని దగ్గఱ పనులను నేర్చుకొనెను. కాని వానికి కులము తప్పుపెట్టిన వారెవ్వరును లేరు (జాతకము 2,5,290)

2. ఒకరాజు రాజ్యము వదలి బేరియయ్యెను (జాత. 2,87)

3. ఒక బాపడు వ్యాపారము చేయుచుండెను (జాత. 4, 15)

4. బ్రాహ్మణులు వేటకాండ్రు (బోయలు)గా, పసుల కాపరులు (గొల్లలు)గా నుండిరి (జాత. 2,200)

5. ఒక క్షత్రియుడు వదలిపెట్టిన భార్యను బ్రాహ్మణుడొక్కడు పెండ్లి యాడెను. (జాత. 5,280)

పై యంశముల వంటి వనేకములు వందలకొలదిగా జాతకములందు పరిశోధించువారికి గోచరించును. ఆ కాలమున మొదటి తరగతిలో క్షత్రియులను, రెండవ తరగతిలో బ్రాహ్మణులను, జైన, బౌద్ధులుంచినట్లు తెలియుచున్నది. జాతకములలో బ్రాహ్మణులు హీనజాతి (హీనజక్కోపాళి) వారుగా ననేక స్థలములందు సంబోధింపబడియున్నారు. జైన గ్రంథములలో క్షత్రియులే యగ్రజాతి వారనియు వ్రాసినట్లు రిన్‌డేవిడ్ పండితుడు సెలవిచ్చి యున్నాడు. ఈ సందర్భమున ప్రాచీనార్యులతో కలసిమెలసియుండి కొంతకాలమునకు భిన్నాభిప్రాయులై వేరుపడి ప్రకృతము పర్షియా దేశమును జేరిన జరత్వష్ట మతమువారగు పార్సీల భాషలోని కొన్ని పదముల విమర్శనము గమనింపదగియున్నది.

ఆధునిక ఉర్దూ పండితులగు ఆజాద్‌గారు తమ సఖున్ దానె ఫారిస్ అను గ్రంథమున 66 వ పుటలో నిట్లు వ్రాసియున్నారు :

ఆర్య : విచిత్రమేమనగా పర్షియా దేశపు ప్రాచీన గ్రంథములలో ఆర్యన్ లేక ఈరాన్ పదమునకు జ్ఞాని, పెద్దమనుష్యుడు మఱియు తెలివిగలవాడు అను నర్థములు చేసియున్నారు.

జందాల్ : ఫార్సీలో పనికిమాలిన వారి గుంపునకు, నీచునకు, మరియు త్రాగుబోతునకు అర్థము చేసియున్నారు. సంస్కృతములో నీచుని "చండాల" యని పిలుతురు. ఈ జనులు మొదట కల్లు గీయుచుండిరి. పందుల మేపుచుండిరి మఱియు సర్వ విధములగు నీచకార్యములు చేయుచుండిరి.

హిందువు లితర మతస్థులను తమ మతములోనికి దీసికొనవచ్చునా యను ప్రశ్న నేడు చాల చర్చింపబడుచున్నది. ఆనాడీ ప్రశ్నయే లేకుండెను. ఇతర మతస్థులనేకులు హిందువులై యుండిరి. కపడోషియాలోని జాతులు వేదకాలపు దేవతల బూజించుచుండిరని నివేదించియుంటిని. ఆ జాతులను నార్యులు మ్లేచ్ఛులని వ్యవహరింతురు. అది తప్పు. సుమారు 2300 సంవత్సరముల క్రిందట నుండిన పతంజలి మహర్షి తమ పాణినీయ మహాభాష్యములో పశ్పశాహ్నికములో వ్యాకరణమును జదువుట వలని ప్రయోజనములలో నొకటిగా "మ్లేచ్ఛో నాపభాషితవై" యని యుదహరించి యున్నారు. అనగా మ్లేచ్ఛులవలె మాట్లాడకుండుటకై వ్యాకరణము చదువవలెను అని భావము. అనగా మ్లేచ్ఛులు సంస్కృతము కన్న వేరగు భాషను వ్యవహరించుచుండిరనియు, నయ్యది యపభ్రంశముగా నుండెననియు, నట్టి భాషను మాట్లాడు జాతులు మ్లేచ్ఛులుగా బరిగణింపబడుచుండిరనియు నీ జాతులు కూడా హిందూమతమును స్వీకరించి యుండిరనియు విశదమగును.

అలెగ్జాండరు కాలములో గ్రీకు దేశమునకు ఆర్యావర్తమునకు నుండిన సంబంధము అలెగ్జాండర్ చక్రవర్తి మన దేశముపై దండెత్తి వచ్చిపోయిన తర్వాత నింకను విశేషమయ్యెను. చంద్రగుప్తుడు (క్రీ.పూ. 330-298) దనపై దాడి వచ్చిన గ్రీకు సేనానియగు సెల్యూకస్ నికేటర్ అనువానిని యుద్ధమందోడించి వానినుండి జెడ్రోషియా, ఏరియా, అరకోసియా మున్నగు రాష్ట్రములను లాగికొనెను. క్రీ.పూ. 300వ సంవత్సరమున నీ గ్రీకు దేశీయుడగు సెల్యూకస్ బిడ్డను బెండ్లియాడెను. ఒక హిందూ చక్రవర్తి యొక యవన స్త్రీని పెండ్లియాడిన నాక్షేపించినవారే లేరు.

కాళిదాసు తన శకుంతలా నాటకములో నొక రంగమందు దుష్యంతుడు యవనస్త్రీలచే పరివృతుడై కణ్వాశ్రమమున వేటాడినట్లు నిరూపించినాడు.

విదూషకుడు : "ఏషఖలు బాణాసన హస్తాభి ర్యవపుష్పమాలాధారణీభి ర్యవనీభిః పరివృత ఇతేవాగచ్ఛతి వయస్యః!" దీనివలన కాళిదాసు కాలములో రాజులు యవనస్త్రీలను దమ నగరులందుంచి యుండిరని యూహింప వచ్చును. యవన పదమును అయోనియన్ దేశీయులకు (Greek) సంస్కృతములో వాడియున్నారు.

కీ॥శే॥ ఆచార్య భండార్కర్‌గారు 1911లో నిట్లు వ్రాసియుండిరి. "చిత్రమేమన విదేశీయులు హిందూమతమును స్వీకరించినదే కాక కొందరు హిందూనామములను గూడబెట్టికొనిరి. ఇండో పార్థియన్ శాఖకు మూలపురుషుడగు గొండఫేరిన్ తన నాణెములపై యొకప్రక్క త్రిశూలధారియైన శివుని విగ్రహమును జెక్కించి యుండెను. ఇదే ప్రకారము వేమ కాడ్ఫిసీన్ అనువాని నాణెములపై శైవ విగ్రహములున్నవి. కానిష్క, హువిష్క, వాసుదేశ, అనువారు పైవాని వంశీయులు. వీరు సిథియన్ జాతివారైనను హిందూనామములు ధరించిరి. మఱియు సోఫిటీస్ అను గ్రీసు దేశీయుడు తన పేరును సౌభూతియని మార్చుకొనెను.

కాంబోడియా దేశమును నాదేశీయులు పునావ్ అని యందురు. దీనినే సంస్కృతమున కాంభోజియని వ్యవహరించిరి. క్రీ.శ. ప్రథమ శతాబ్దములో హూన్‌టైన్ అను బ్రాహ్మణుడీ దేశస్థులను హిందూమతములోనికి పరివర్తనము చేసెను. ఈ హూన్‌టైన్ అనువాడే 'కౌండిన్యుడు' అని పండితులు నిశ్చయించినారు. కాంబోడియా దేశములో నీ ప్రకారమొక గాథ కలదు : అచ్చట నొకరాణి 'యేలియో' అనుచున్నది రాజ్యము చేయుచుండెననియు, దానిని జయించి కౌండిన్యుడు పెండ్లియాడెననియు తర్వాతి రాజులు వీరి సంతతియే యనియు నీ గాథ చెప్పుచున్నది.

కుషనులు, హూణులు అను తెగలు మ్లేచ్ఛ తెగలై యుండెను. క్రీ.శ. 399-414 కాలములో పలు తెగలు హిందూమతములో చేరిపోయెను. కుషన్‌జాతికి జేరిన కనిష్కరాజు సంస్కృత వాఙ్మయ ప్రియులకు బాగుగాఁ దెలియ దగినవాడు. జగద్విఖ్యాతుడగు చరక పండితుఁడు (వైద్య గ్రంథకర్త) ను, కాత్యాయని పుత్రుడును, నితని శిష్యుడగు అశ్వఘోషుడును నీ రాజును ఆశ్రయించి యుండిరి.

కచయను దేశమును పాలించిన రాణి కుమారయానుడను హిందూ యువకుని ప్రేమించి పెండ్లియాడెను. వీరికి కుమారజీవుడు అను కొడుకు జనించెను. ఈ బాలుని వాని దల్లిదండ్రులు కాశ్మీర దేశమందు జదివించిరి. వీడు క్రీ.శ. 413 సంవత్సరములో మరణించెను.

తిబ్బెట్టు దేశము (త్రివిష్టపము) ను క్రీ.శ. 630 నుండి 698 వరకు పాలించిన గంపోయను రాజు నేపాల దేశపు రాజు బిడ్డను, చీనా దేశపు కన్యను, నిద్దఱను బెండ్లియాడెను; కాని, హిందూరాజగు నేపాళరాజు నిక్కడ వెలిబెట్టిన వారు లేరు.

సముద్ర ప్రయాణము హిందువులు చేయకూడదను కొన్ని తప్పుడు శాస్త్రములు కలవు. కాని, ప్రాచీన కాలము నుండి మొగలురాజుల ప్రభుత్వము వరకు – తుదకు గత శతాబ్దాది వరకు హిందువులు సముద్ర వ్యాపారము చేసినట్లు వేనవేలు నిదర్శనములు కలవు. ఆ దివ్య కాలమంతరించినతోడనే స్వాతంత్ర్యము, దేశ సంపద, ఆత్మగౌరవము అన్నియు నశించెను. కథాసరిత్సాగర మందలి కథలనేకములు సముద్ర సాహసములను సూచించుచున్నవి. మఱియు ఈజిప్టు దేశపు శవముల (Mummies) ను బట్టలతో కప్పినది భారతదేశము. గ్రీకు దేశముతో 3 వేల యేండ్ల క్రిందట వ్యాపారము చేసినదియు, ఇటలీ దేశ సంపదను జూరగొనినదియు, జావా, బలి, బోర్నియో, చీనా దేశములతో సంబంధములు చేసినదియు నీ భారతదేశమే. చీనా దేశములో బౌద్ధమత వ్యాప్తిచేయుట కనేక పండితు లాదేశమున బోధించి వచ్చిరి. క్రీ.శ. 67లో మతంగ, ధర్మరక్ష అనువారు చీనాలో ప్రచారము చేసిరి. జావా మున్నగు ద్వీపములలో హిందూ దేవాలయములు, భారతము వంటి హిందూ పురాణములు నేటికిని హిందువుల ప్రాచీనౌన్నత్య నిదర్శకములుగా వెలయుచున్నవి. క్రీస్తునకు పూర్వము 150 సంవత్సరముల నాడు అనగా (2100 ఏండ్ల క్రిందట) ఒక యవన (గ్రీసు) రాజు వైష్ణవమత మవలంబించెనని ప్రసిద్ధమైన బాస్నగల్ శాసనము ప్రపంచమునకు నేటికిని చాటుచున్నది. మఱియు మిళింద పంథ (Questions of Minondar) యను గ్రంథములో బౌద్ధ బోధాలున్నవని పండితుల యభిప్రాయము.

సూత్ర కాలము హిందూమతముయొక్క క్షీణదశను సూచించు కాలము. ఈ కాలమందే యెవరికి దోచినట్లు వారు శాసింప మొదలిడిరి. ఈ కాలమందే అనులోమ

ప్రతిలోమ వివాహములు నిరూపింపబడి సవర్ణ వివాహములు, సవర్ణ భోజనములు విశదీకరింపబడెను. ఈ కాలమందే శూద్రులను, స్త్రీలను, అస్పృశ్యులను కఠినముగా నన్యాయముగా జూడ మొదలిడిరి. అయినను నచ్చటనచ్చట కొన్ని సూత్రములలో వర్ణభేదము లంతగా బాటింపకుండిన విషయములు గొన్ని గోచరించుచున్నవి. ఒక యుదాహరణమును జూపెద : ఆపస్తంబ సూత్ర గ్రంథములో ప్రశ్న 2., పటలము 2, ఖండము 3, సూత్రము 4,5,6,7,8,9 జదివినచో నందు శూద్రులచే వండబడిన యన్నమును పై మూడు జాతులవారు భుజించుచుండిరని తెలియగలదు.

శంఖ లిఖిత స్మృతియందు హిందువులను మ్లేచ్ఛాది జాతులు బలవంతముగా తమ తమ మతములో చేర్చుకొని నట్టైన వారిని మరల ప్రాయశ్చిత్తముతో హిందువులనుగా జేయవచ్చునని ప్రమాణములున్నవి. మతాంతరములో జేరిన వారిని మొన్న మొన్నటివఱకు గూడా హిందువులు పునఃస్వీకారము చేయుచుండిరి. "క్రీ.శ. 1756లో బసాలత్ జంగ్ అను నతడు ఆదోని నవాబుగా నుండెను. ఇతనికి పత్తికొండ పటేలు పట్వారీలగు సోమిరెడ్డి, పంగనామాల చిన్న తిమ్మన్న యనువారు పన్నులు చెల్లించజాలకపోయినందున వారిని బసాలతు జంగ్ బాధింపగా నందు చిన్న తిమ్మన్న తన భార్యను, పిల్లలను జమానతుగా నవాబు దగ్గర నుంచి పోయెను. వీరికి బసాలతు జంగ్ బలవంతముగా భోజనము తినిపించెను. పూనా పేష్వా యగు శ్రీనాథయను నతడీవార్త విని తక్షణమే ఈ కరణము యొక్క భార్యను పిల్లలను నవాబు వశము నుండి వదలించెను. అందు వానప్పయను బాలుని మాత్రము బసాలతుజంగ్ భార్య తన దగ్గరనే యుంచికొనెను. మిగతావారిని ప్రాయశ్చిత్తముతో బ్రాహ్మణులు స్వీకరించిరి" (కర్నూలు జిల్లా మాన్యువల్)

పై కొన్ని యంశముల వలన ప్రాచీనార్యులలో వర్ణ వ్యవస్థ నేడుండినంతటి కఠినముగా లేకుండెనని చెప్పవచ్చును. హిందువులు మరల తమ పూర్వౌన్నత్యమును నభిలషించిరేని జాతి మత వైషమ్యముల వదలి విశాలహృదయులై మతాంతర వ్యాప్తిని గావింపబడవలసియుండును. కాలమెంత తీవ్రముగా మారునో హిందువులు కూడ నంత తీవ్రముగా మారవలెను. తుర్కీ, ఆఫ్ఘనిస్థాన్, చీనా, ఈజిప్టుల చరిత్ర నించుక విమర్శించి చూచుకొనవలయును.

ఆంధ్రులు - కులవ్యవస్థ

కాపు పదమునకు నిశ్చయమైన అర్థము. ఆంధ్రదేశమున గోదావరి జిల్లాలో కొద్దిగా, తక్కిన జిల్లాలలోను, ఆంధ్ర సరిహద్దు కర్ణాటక మండలములందు విశేషముగా ఒక తెగవారు తమ పేరుతో రెడ్డి పదమును చివరకు చేర్చుకొందురు. వీరినే సకల జనులు రెడ్డి తెగ వారని లేక రెడ్డి కులము వారని పరిగణించిన సంగతి అందరికి విశదమే.

శ్రీయుత మల్లంపల్లి సోమశేఖరశర్మగారు "రెడ్డి తెగ పూర్వోత్తర"మను శీర్షిక కింద చాలావరకు ఇట్టి పదమును విమర్శించి, రెడ్డి రాణి పత్రికలలో ప్రకటించిరి. అది అటులుండనిండు. మనమిప్పుడు 'రెడ్డి' పదమును విమర్శింపక పూర్వము 'కాపు పదము ఆంధ్రమా? లేక కర్ణాటకమా? అని విమర్శింపవలసి యున్నది.

రెడ్డి తెగవారు కర్ణాటక ప్రదేశమునందున్నప్పటికిని వీరి ప్రధాన శాఖలు మాత్రము 'నాడు' భేదముతో ఏర్పడియున్నవి. నాడు భేదాచారము కేవలం ఆంధ్ర దేశముననే కలిగినది. కర్ణాటకములో ఏ తెగవారికిని 'నాడు' భేదము కలుగలేదు. ఆంధ్రదేశమున నివసించు బ్రాహ్మలవలె రెడ్డి వారు గూడ ఒకనాడుతో మరియొక నాడువారు భోజనము దప్ప వివాహ సంబంధములు చేయరు. ఆంధ్రదేశమున నివసించు రెడ్లకు కర్ణాటక దేశమున నివసించు రెడ్లకు అంతశ్శాఖ నామములొకటే. కనుక కర్ణాటక ప్రదేశమున నుండు రెడ్లు ఆంధ్రదేశమునుండి అచ్చటికి వలస బోయిన వారాయని మన మూహింపవలసి వచ్చుచున్నది కాబట్టి మనము కర్ణాటక భాషలో ఇట్టి పదమును విమర్శించుటకు యెంత మాత్రము అవకాశము లేదు. కాని ఆంధ్ర, కర్ణాటకములకు భాషవలననేమి, రాజ్యాంగమువలననేమి ఒక విధమైన పురాతన సంబంధమున్నదని చరిత్రకారులు చెప్పుచున్నారు. ఇంతవరకు ఏ దేశము పూర్వము,

ఎవరి తర్వాతది? ఆంధ్రము బోయి కర్ణాటకమాయెనా? లేక కర్ణాటకము మారి ఆంధ్రమాయెనా? ఇవి స్పష్టము కాలేదు. ఇది యొక ప్రత్యేక విషయము. ఇందు చర్చించుట అవసరము. కాబట్టి మన విషయమునకు దిగుదాము.

రెడ్డి పదమును ప్రస్తుతము కర్ణాటక భాషగా పరిగణించక కేవలము ఆంధ్రమునందే వెదకవలసి యున్నందున దేశభాషలో ప్రతి శబ్దమునకు హేతు సంబంధమును బట్టి ధాతువ్యుత్పత్తి సంస్కృతమువలె లేదుగదా? కేవలము దేశీయ పదములు వాడుకపై ఆధారపడియున్నవి కాని సంస్కృత పదములు మారి మన ఆంధ్ర భాషయందు విశేష పదములు, తద్భవములు, తత్సమములు, దేశీయ పర్యాయపదములు గానవచ్చుటయే గాక, ప్రాకృతము తదితర దేశీయ పదములు గూడ కొంతవరకు రూప వైఖరి మారి ఇందులో వాడబడుచున్నవి. గనుక దేశభాషలో నీ పదములను కేవలము వాడటముపై నాధారపడక కొంతవరకు మూల స్థానము వెదకి, నిజార్థమేదని విమర్శించుటకు అవకాశము గలుగజేసినది.

కాపు పదమును విమర్శనకు దెచ్చినప్పుడు మొదలు మనము ఆంధ్ర భాషా నిఘంటువులయందు వెదకవలసి యుండును. తరువాత నిఘంటుకారులు సరియైన అర్థము వ్రాసినారా? లేదా? యని నిర్ణయించి వారు పొరపాటు బడిన యెడల నిజార్థమేదని కనుగొనవలసి ఉన్నది. శబ్ద రత్నాకరము మొదలగు ఆంధ్ర నిఘంటువుల యందు రెడ్డి పదమునకు "కాపువాని బట్టపునామ"మని వ్రాసియున్నది. ఇందులో యేమి విశేషములేదు గనుక 'కాపు' పదమును అట్టి నిఘంటువులయందు చూచుట అత్యవసరము. 'కాపు', 'కాఁపు' రెండు విధముల పదములు వేరు వేరు అర్థములతో నిఘంటువునందు కానబడుచున్నవి. ద్వివిధ పదములు ఉచ్చారణము నందు చెవులకు ఒకే మాదిరిగా వినబడినవి కాని వ్రాతయందు అర్థ సందర్భమును బట్టి అర్ధానుస్వార సహిత మొక 'కాఁపు' పదము అర్ధానుస్వర రహితముగా మరియొక 'కాపు' పదము వ్రాయబడుచున్నది. పై ద్వివిధ పదములకు నిఘంటువులయందు అర్థములు ఈ ప్రకారముగా వ్రాసియున్నవి.

1. కాఁపు = కాఁపురము, గృహస్థుఁడు, పంట పెట్టువాఁడు, శూద్రుఁడు
2. కాపు = కాయలు కాచుట, బాధలు తొలగించి రక్షించుట

మొదటి పదము జాతి వాచకము. రెండవ పదమునందు క్రియాసూచితము.

మొదటి జాతివాచక పదమును విమర్శింపక పూర్వము రెండవ పదతత్త్వమును మొదలు విమర్శించుదము.

ఏ భాషయందైనను ప్రతి పదము నానార్థములతో విరాజిల్లుచున్నప్పటికిని అన్ని అర్థములయందు భావైక్యత సంబంధము కొద్దిగనైన ఉండి తీరవలయును. లేనిచో నానార్థములు ఒక పదజనితమైనవని తోపవు. కావలెననియో లేక భ్రమ ప్రమాదవశముననో సందర్భములేని యర్థము మరియొక పదము నుండి తీసి ఇట్టి పదమునకు తగిలించినారని భిన్న భావముగల అర్థమునందు సందేహించవలసి యున్నది. కాబట్టి అర్థానుస్వార రహితమైన 'కాపు' పదమునకు ఆపదలను తొలగించి రక్షించుటకు, కాయలు గాచుటకు అనగా ఉత్పత్తికి ఎంతవరకు సంబంధమో చదువరులు ఊహించగలరు. మూలపదమునందు ఏకవచనము నుండి దాని అర్థమును బహువచనముగ (కాయలు) చూపించుట రెండవ పొరపాటు. పూర్వకవులు 'కాపు' పదమును కాయలు కాచుటయందు ఉపయోగించలేదు. కోమలమైన చిగురు మొగ్గలను వెలుపలికి రాకడయందు ఉపయోగించినారు. ఎందుకనగా కాయలు లోపలి నుండి వెలుపలికి రావు. చెట్టు నుండి తొలుదొలుత కాతకు పూర్వము వచ్చెడివి. చిగురు మొగ్గలు ముకుళిత రూపమున బయల్పడును. ఇట్టి సమయముననే కాపు పద ప్రయోగమును పూర్వ కవులు జేసిరి చూడుడు:

ఉ. పల్లవ పుష్పసంపదలఁ బంచి వసంతుఁడు కాపురాకకైఁ
యెల్ల వనంబు సంకటములే దఁగఁదా రొడికంబు మీఱన
ట్లల్లన క్రోలి క్రోలి మలయానిలుఁ దండుఁబురాణ పత్రముల్
దుల్లఁగజేసె సత్క్రియఁబటుత్వము కాముఁడు పిచ్చలింపగన్

ఈ పద్యము తిక్కన సోమయాజి రచించిన 'విజయసేన' మను గ్రంథము లోనిది. గ్రంథము అముద్రితము కాబట్టి నిఘంటుకారుడు 'కాపు' పదమునకు ఉదాహరణముగా ఈ పద్యము లభించనందున చూపలేదు కాబోలు. మన దేశీయులు సామాన్యముగా చెట్టు కాపు గాచినది అనుటవలన దీనిని ఉదాహరణముగా చూపవచ్చునని నేను దలచుచున్నాను.

కవి తిక్కన గూడ నెల్లూరు ప్రాంతమువారు కాబట్టి వారు వారి దేశస్థుల వాడుక ప్రకారము కాపు గాచుటకు బదులు కాపురాకకై యని సవరించిరేమో!

అసలు ఈ పదమునకు ఉత్పత్తి ఎక్కడిదని వెదకినచో ప్రాకృత, హిందీ భవముగా దోచుచున్నది. ప్రాకృత, హిందీ పదములను ఆంధ్రమునందు కలిసినప్పుడు వాటి ఉచ్చారణ మధ్యాంధ్ర మండలముల వారివి ప్రమాణములు గాజాలవు. ప్రాకృత భాష నుచ్చరించు దేశమునకు సరిహద్దులోనున్న ఆంధ్ర మండలములే ప్రమాణములు. ఉదాహరణముగా

మధ్యాంధ్ర దేశమున వాడబడు హిందీ భవ పదములు, సరిహద్దు ఆంధ్రదేశమునందు వాడబడు హిందీ భవ పదములు కొన్ని ఇచ్చట జూపుచున్నాను.

	మధ్యాంధ్ర	=	సరిహద్దు ఆంధ్ర
1.	కొట్టు, ధాన్యము కొట్టు	=	కోఠా, ధాన్యము కోఠా.
2.	మొకాసాదారుఁడు	=	ముక్తాదారుఁడు
3.	ఫిర్కా	=	ఇలాకా.
4.	కౌలుకత్తు	=	కౌలుకబూల్యతు
5.	ముద్దాయి (నేరస్థుడు)	=	ముద్దాయి (నేరము మోపువాడు)
6.	కాపుగాచుట	=	కాయలుగాచుట, కోపులు వచ్చుట, మొగ్గలు పుట్టుట, చెట్టు అంకురించుట, చిగుర్చుట

హిందీ, ప్రాకృత సరిహద్దు ఆంధ్ర మండలములు మా నైజాము ఇలాక గాబట్టి ఇచ్చోట పై వాక్యములు హిందీ భాషకు సంబంధించినవి సరియైన ఉచ్చారణతో పలికెదరు గావున ఇచ్చట కోపులంటే తెలిసికొందురుకాని కాపు అను పదము యిక్కడి వారికి అంతగా బోధపడదు. సాధారణముగా జాతి వాచక మనుకొందురు. 'కోపు' అను పదము ఏ తెలుగు నిఘంటువునందైన వ్రాసియున్నదాయని పలు నిఘంటువులను చూచితిని. దేనియందును ఈ పదము వ్రాయలేదు గాని 'శ్రీలక్ష్మీనారాయణము' అను ఆంధ్ర నిఘంటువునందు

కోపులు = నతి (నమస్కారము, కేలుమొగుపు) చూ. ఎరఁగుడు, ఎరఁగుడు= కయిచూపులు, కేకిసలు, కేలుమొగుపు, కోపులు, గిడిగిళ్ళు, గుంజిళ్ళు, గొబ్బిళ్ళు, చాగిలింత, చిన్నిదము, చిన్నిపువ్వులు, చిన్నిపూరేకులు, చెమోడ్పు, జోహారు, తొంగలిపాట్లు, దండము, మొక్కు పిడికిలింత, మొగుపు, మొడుపు, సలాము.

ఎరcగుడు, కోపులు అను పదములకు నికట సంబంధమున్నది. ఏలనన ఉత్పత్తికి పూర్వము వస్తువు తిరోభావము, అపరిచితము. ఉత్పత్తి అనంతరము పరిచయము, ప్రకటన. ఇదే పదమునకు ఫార్సీ భాషయందు ఉత్పత్తిని గురించి "పైదాహెూనా" అనగా ప్రకటమగుట, కనుపించుట లేక పుట్టుట అని తాత్పర్యము. చిన్ని పువురేకులు, చెముడ్పు, మొగ్గలు, మొక్కు దండము మొదలైనపదములుగూడ ఆకృతిని బట్టి ముకుళిత భావమును సూచించుచున్నవి. వీటియందే గాక కోపమును గురించి ఆకృతిని బట్టి సామ్యమున్నదని అన్వయించవచ్చు. ఇంతవరకు విమర్శించ నందున నిఘంటువునందు కాపు పదమునకు అర్థము చెట్టుకు మొగ్గరాకడ కాదు. కాయలు గాచుట అసలే కాదు. కేవలము భ్రమవలన ఇట్టి అర్థము కల్పింపబడినది. అసలు హిందీ 'కోపు'లు మారి మధ్యాంధ్ర రాష్ట్రమునందు 'కాపు' పదము వ్యవహరింప బడుచున్నది. కావున సవరణీయమని నిశ్చయము తోచినది. కొందరు ఇచ్చుట కాయుటకు బదులు కాపు రూపాంతరమని నిశ్చయించవచ్చును. ఏలయనగా మోయు- మోపు, ఇదే మాదిరి. కాని అన్నిటియందు ఈ ఉదాహరణము సరియైనదని తోచలేదు. ఉదా: చేయు- చేపు కాదు, చేత. ఇట్లు కొన్ని వికల్పములు.

కాయకు రూపాంతరము కాతగాని కాపు గాదు. ఉదా: కాత-కాయు, కోత-కోయు మొదలైనవి.

అయితే కాయలు గాచుట అను అర్థమునకు 'కాపు' పదము ఉండవలసినప్పుడు దాని రెండవ అర్థము ఆపదలు తొలగించి రక్షించుట అని యుండదగినది. కాని మనము అర్ధానుస్వార సహితమైన 'కాcపు' పదమునకు సంబంధము లేకుండా దీనిని విడదీయుట అసమంజసము. ఎందుకనగా ప్రస్తుతము లోకుల భావమునందు కాcపువాడు అనగా పైరుబెట్టి పొలములను కాపాడువారు గాబట్టి వీరికి ఆ నామము వచ్చినదని తలచెదరు.

ఇదే మాదిరి భారతీయ జాతులకు యావత్తు ఏదో యొక క్రియ సంబంధమైన వృత్తితో నామము లేర్పాటు లయినవి. కాబట్టి పంట కాcపులు అనుటతో పంటను కాపాడువారని భావము గదా! ఈ భావమును లోకులు ఏల యనుకొనెదరో ప్రమాణము లేనిది ఒప్ప వీలులేదని చదువరులు సంశయింపనక్కరలేదు. ఒక ఆధునికకవి, వసంత ఋతువును వర్ణించు పద్యమునందు కాcపు పదమును కాపాడుటయందే ఉపయోగించినాడు:

సీ. చెవులకుఁ జల్లగఁ జెలగి కోయిల కూసె,
సందడి పెండ్లి బాజాలు మ్రోసె
కన్నె వేపయు దొగర్గున్న సమర్తాడె,
చలివేంద్ర దాపున సంతగూడె,
కమ్మ మావిడి తోట కాఁపుల పని హెచ్చెఁ,
బిల్లగాలులు మురిపించి వచ్చె,
గొడుగులు జోళ్ళెంద జిడిముడిఁ జల్లార్చెఁ
దాటిముంజలు కడుదప్పి దీర్చె.

గీ. కారడవి వెల్గె! పడవషికారు గల్గె
సందెలింపాయె కౌగిళ్ళు సడలిపోయె
ప్రొద్దులేపారె మాపులు పొట్టివారె
ఆమని మొదలు పెట్టె బల్ హాయిపుట్టె

ఈ పద్యమునందు "కాఁపుల పని హెచ్చె" అనగా మామిడి చెట్టు కాయలు నష్టముగాకుండా కాపాడే కాపుల పని హెచ్చినదని తాత్పర్యము. కాబట్టి రక్షణార్థము గల కాఁపు పదస్థానము అర్థానుస్వారసహిత జాతివాచకమై కాఁపు పదమునందు వర్తించుచున్నది. ఈ పద్యము కాపు పదమును గురించి జనసామాన్యాభిప్రాయమును రుజువు పరచుచున్నది.

ఈ వాదమువలన అర్థానుస్వార రహిత "కాపు" పదోత్పత్తి అరసున్న యుక్తమైన 'కాఁపు' నుండి కలిగినదనటకు సందేహమెంత మాత్రమును లేదు. ఇక అర్థానుస్వార సహిత పదమునకు నిఘంటువునందు వ్రాసిన అర్థబాహుళ్యముపై ఒక దృష్టి వేయవలసియున్నది:

కాఁపునకు=1. కాఁపురము. 2. గృహస్థుఁడు. 3. పంటలు పండించువాఁడు, అనగా (పంటస్వామి) 4. శూద్రుఁడు, అని ఉన్న ఈ నాలుగు అర్థములను పక్షాభిమానము విడచి చూచినచో పై మూడు విధముల అర్థములకు కొంతవరకు సంబంధము కలుగఁజేయవచ్చును కాని శూద్రుడు అను అర్థము జేయుట అసందర్భము, అసమంజసము, శాస్త్ర విరుద్ధము అని నొక్కి చెప్పవచ్చును.

వేపారి బ్రాహ్మలను మహారాష్ట్ర దేశమునందు గృహస్థులందురు. వారు శూద్రులేనా? అష్టాదశ వర్ణముల వారు గృహస్థులేకదా వారందరు శూద్రులేనా? గృహస్థుడు(సంసారి) అనగా స్వతంత్ర జీవనము జేయుచు నలువురిని పోషించువాడు గదా!

శూద్రుని గురించి అమరకోశ గురుబాల ప్రబోధమునందు ఏమి వ్రాసి యున్నదో చూడుడు:

"శోచంతి ఖిద్యంత ఇతి శూద్రాః శుచశోకే. క్లేశపడువారు
అవరః అధమః వర్ణోయేషాంతే అవర వర్ణాః"

అధమమైన వర్ణముగలవారు. వృషం ధర్మంలునస్తీతి వృషలాః, లూఞ్ ఛేదనే. ధర్మమునుఁ జెఱచువారు". అతిథి ఆభ్యాగత సత్కారములు జేయు గృహస్థులు ధర్మములను జెరుచువారు, క్లేశపడువారు కాజాలరు.

త్రేతాగ్నులయందు గార్హపత్యమైన అగ్ని మిక్కిలి శ్రేష్ఠమైనది. దీనితోనే దక్షిణాహవనీయాగ్నులు సంస్కరింపబడును. "గృహపతినా ఇతరాగ్నిభ్యాం పూర్వం సంస్కృతోగ్నిః గార్హపత్యః" గృహస్థునిచే ఇతరాగ్నులకంటె పూర్వము సంస్కరింపబడిన అగ్ని గార్హపత్యము.

అయితే మనము ఇచ్చట గృహస్థుడు సంస్కరించిన అగ్నిని శూద్రుడు సంస్కరించిన అగ్నియని ఆంధ్ర నిఘంటువు ప్రకారము అనవచ్చునా?

శూద్రుడు జేయు పనుల ననుసరించి ఆయా పేరుగల శూద్రజాతి భేదములు అమరసింహ నిఘంటువు 'శూద్ర వర్గము' నందున్నవి చూడుడు. అందులో కృషీవలుని శూద్రుడనియనలేదు. కాని "దేవేన జీవతీతి దేవాజీవః జీవ ప్రాణధారణే. దేవతలచేత బ్రతుకువాఁడు. దేవాన్ లాతి పూజార్థమితి దేవలః లా ఆదానే. పూజించు నిమిత్తమై దేవరను స్వీకరించువాఁడు. ఈ 2 కూడ దేవరను బూజించువాని పేళ్ళు" అని శూద్రవర్గములోనున్నది. కషీవలుడు తప్ప ఇతర వృత్తుల వారెందరో శూద్రవర్గములో నున్నారు.

"కరణ శబ్దము శూద్ర స్త్రీకిని, వైశ్యునకుఁ బుట్టిన వాని పేరు. కరోతి లేఖన కర్మేతి కరణః లేఖన కర్మను జేయువానిపేరు" అని యున్నది.

వృత్తుల ననుసరించి శూద్రజాతి భేదములు అమరసింహ నిఘంటువు నందున్నవి. ఇట్లు కొంత చూపితిని. కొన్ని వృత్తులను నీచములో వేయుట నా యభిప్రాయము కాదు. వాటిని శూద్ర వృత్తిలోఁ జేర్చుట దేశీయ శిల్పమును భగ్నముఁ జేయుట దప్ప మరేమియును కాదు. ఏది యెట్లున్నను మన ఆంధ్ర నిఘంటువునందు 'కాఁపు' పదమును వ్రాసిన కృషీవలుఁడు అమర నిఘంటువు నందు యే జాతిలో జేర్చబడినవాడో అరయవలసియున్నది.

అమర నిఘంటువునందు వైశ్యజాతికి చెందిన వృత్తుల వివరములు ఈ విధముగా దెలిపినారు:

"ఆజీవో జీవికా వార్తావృత్తిర్వర్తన జీవనే.

స్త్రీయాం కృషిః పాశుపాల్యం వాణిజ్యం చేతివృత్తయః

స. వ్యా. టీ. కర్షణం కృషిః కృషవిలేఖనే. దున్నుట. 1. పశూన్ గోమహిష్యాదీన్ పాలయతీతి పశుపాలః తస్యకర్మపాశుపాల్యం. గోమహిష్యాది పశువులను బాలించువాఁడు పశుపాలుఁడు. వాని క్రియ పాశుపాల్యము. 2. వణిజః కర్మ వాణిజ్యం. వణిజుని యొక్క పని వాణిజ్యము. 3. ప్రత్యేకముగా వైశ్యులజీవనోపాయములపేళు ళ్ళ. ఇంకను "క్షేత్రాజీవః కర్షకశ్చ కృషకశ్చ కృషీవలః" ఇట్లున్నది. అమరనిఘంటువునందే వైశ్యులది కృషి, గోపాలాది వృత్తియని వ్రాసియున్నది, కాని ఇతర ప్రమాణములు లేవని చదువరులు గ్రహించవలదు. భగవద్గీతోపనిషత్తు ఉపదేశించిన మార్గము ఇది:

కృషి గౌరక్ష్య వాణిజ్యం వైశ్యకర్మ స్వభావజం.

పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజం

– భగవద్గీత. అ. 18–44

ఈ ప్రమాణమువలన కృషి, గోపాలవృత్తి వైశ్యులదిగాని, శూద్రులది గాదని తేటతెల్లమగుచున్నది. ఇన్ని ప్రబల ప్రమాణములుండగా ఆంధ్ర నిఘంటుకారుఁడు కృషీవలుని శూద్రుడనుట ఎంత హాస్యాస్పదమో చదువరులే యూహించగలరు. శబ్ద ప్రమాణములే గాకుండ ప్రస్తుత కృషీవలులుగానున్న కాపులు, రెడ్లు, యెన్నడును బ్రాహ్మణాది వర్ణములవద్ద అంటుపనికి లేక మల్లెలు మోసి జీవించునటుల కనబడరుగదా! సేవజేయుచు, పరుల కష్టార్జితమునకు ఆశపడి, స్తుతి పాఠకుఁడై ఒకానొకడు ఉండెనేని అటువంటి గర్భదరిద్రుఁడు వివాహము గానక మరణము

నొందును. వానితో అట్టి జీవనము అంత మొందగలదు. వాని చర్య జాతి మొత్తముపై చెప్పుట తప్పు. ఇట్టి భిన్న స్వభావములు గలవారు అన్ని తెగలయందు గానఁబడు చున్నారు. కృషీవలులు శూద్రులు గారని సంస్కృత ఉద్గ్రంథముల ప్రమాణములేగాక పాశ్చాత్యేతిహాసకారులుగూడ భారతదేశము యొక్క నాగరికతను, అనాగరికతను గురించి చర్చించినప్పుడు వారు భారత చరిత్రయందు వ్రాసిన సిద్ధాంతవాక్యములివి:

"ఆదిమవాసులైన ఇండియన్‌లకు గృహ నిర్మాణము, నాగరికత మానవులవలె కాపురము చేయు నేర్పులేకుండెనని, వారు తిను ఆహారము అపక్వమాంసాదులని, వారు క్రూరులని, అడవులందు మృగప్రాయులవలె విచ్చలవిడిగా సంచరించువారని, జాతి నీతివృత్తి ఏమియెరుగరని, వ్యవసాయము అసలే తెలియదని తెలియుచున్నది. ఇట్టి స్థితియందు వీరుండగా ఆర్యులు ఇతర దేశమునుండి ఇండియాకు వలసవచ్చి ఇక్కడి భూములను ఆక్రమించి తమ విద్య యొక్క నేర్పువలన వ్యవసాయముఁజేయుచు, అరణ్యవాసులతో జేయించుచు, వారిని తమ పశుపాలాది వివిధ పనులపై భృత్యులుగా నియమించిరి. తమపై తిరుగబడిన వారిని దండించిరి. ఆర్యులకు అనుకూలముగా ఉండుచు, ఆర్యులు నిర్మించిన గ్రామాదులలో గృహములు కట్టి నివసించి వారి సేవఁ జేయుచు జీవనము సలిపిన వారు శూద్రులనబడిరి. తక్కినవారు తమ పూర్వ క్రూర అభ్యాసములను మార్చక అరణ్యములందు సంచరించుచు నీతిబాహ్యమైన పనులు చేయువారు రాక్షసులని దస్యులని పిలువబడిరి. వారే ఇప్పుడు మహారణ్యములందు భిల్లులు, కోయలు, చెంచులు, ఎరుకలు, యానాదులుగా చూపబడుచున్నారు. ఆర్యులు ఆరంభ స్థితియందు పల్లెటూళ్ళు, గ్రామములు నిర్మించి ఉత్తరోత్తర క్రమేణ నగరములు, నగర రాజ్యములు నిర్మించి, తాము రాజులై తమ భృత్యులకు క్రమక్రమేణ సైనికాది శిక్షలను ఇచ్చి గొప్ప ఆర్య సర్దార్ల చేతి క్రింద చిన్న చిన్న నాయకత్వములో బంట్లనుగా నియమించిరి. అప్పటి ఈ బంట్లే అమర నిఘంటువు నందు క్షత్తులని పేరు వహించిరిగాబోలు. వారిలో ఎక్కువ భూములను ఆక్రమించి బహు గ్రామములను నిర్మించి తాము (ఆర్యులు) రాజులని, సర్దార్లని పేరుపొందిన వారు "క్షత్రి"యులనబడిరి. ఇందులోనుండి వేదవేదాంగ విశారదులై మహావిద్వాంసులై, పండితులై, రాజనీతి నిపుణులై, రాజులకు ధర్మాధర్మ బోధకులై వర్ధిల్లిన వారు బ్రాహ్మణులైరి. ఈ పాశ్చాత్యుల ఐతిహాసిక సిద్ధాంతమువలన కూడ

ఆంధ్ర నిఘంటుకారుడు వ్రాసిన "శూద్ర" పదము కృషీవలునకు జెందదని, కృషీవలులు శూద్రులు గారని వారు క్షత్రియ, బ్రాహ్మణజాతులకు మాతృస్థానమని నొక్కి చెప్పవచ్చునుగదా!

విదేశీయుల చరిత్రమును గమనించకున్నను, మన సంస్కృత నిఘంటువులు, భగవద్గీతాది ఉద్గ్రంథముల వాక్యములననుసరించి నిర్ణయించినను కృషీవలులు అనగా వైశ్యులని, కాపువారు అనగా కాపాడువారని అని తీరవలసినదేగదా!

కాఁపు కర్షక సంబంధము

కాపు పదమునకు కాపాడుటయని, కృషీవలుఁడు వైశ్యుడని నిరూపింపనైనందున పంటలు బెట్టి కాపాడువాఁడు గాబట్టి కాఁపు నామము వచ్చినదాయని చదువరులకు నిశ్చయము గలుగవచ్చును.

కాఁపు అన్నంతమాత్రమున పంటబెట్టువాఁడని తలపరాదు. అయితే దేనిని గాపాడుటవలన ఈ నామము వీరికి వచ్చినది? గీర్వాణ భాషయందు ఈ పదమునకు సమానము మరియొకటి పర్యాయపదముగా జాతి నామము ఏదైయున్నది? వీరి ముఖ్యవృత్తి ఏది? ఈ ప్రశ్నలకు సమాధానము క్రింద వివరించి యున్నాను. కాఁపు జాతియందు ప్రధానశాఖలనుఁ జూచినచో దేనిని కాపాడువారో స్పష్టము కాగలదు.

మన ఆంధ్రదేశమునందు బహురాజకము అయిన తరువాత ప్రతిరాజుకు స్వాధీనమైన సీమలు ఏదో హేతువునుబట్టి ఆంధ్రదేశ ఉపనామములుగా యేర్పాటైనవి. అవి ఏవన: పాకనాడు, కమ్మనాడు, పంటనాడు, పోకనాడు, రేనాడు, పల్లెనాడు, వేఁగినాడు, మొటాడినాడు, గోననాడు (గోనసీమ). వెల్నాడు ఇదే ప్రకారము ఆంధ్రదేశ విభజన ననుసరించి మన కాఁపు తెగలు గూడ ఆ నామములతో వ్యవహరింపబడుచున్నవి.

ఉదా: పాకనాటి కాఁపులు, కమ్మనాటి కాఁపులు (కమ్మవారు) పంటకాఁపులు పోకనాటి కాఁపులు, పల్లెనాటి కాఁపులు, వెల్నాటి కాఁపులు, గోనకాఁపులు, రేనాటి కాఁపులు, మొటాటికాఁపులు. ఇందులో పంటాన్వయులను నాడు లేకుండ అనుచున్నారు. వారివలె మోటాడివాండ్లనుగూడ. పంటదేశము నెల్లూరు మండలమని ప్రసిద్ధి. అక్కడి కాఁపులను నాడుతో కలుపక అనుటవలన వారిని పంట పైరును బెట్టి కాపాడువారని అనరాదు. ఇప్పటి ఆరువేల నియోగులు ఆరు వేలనాటి

నియోగులమని యనుకొనలేదా? గ్రామసంఖ్యను బట్టి గూడ "నాడు" యేర్పడుచుండెడిది. "పాకనాడిరువది యొక్కవేయి" (కుమార సంభవము 1-53)

అనవేమారెడ్డి మొదలైన రాఁజులు పంటాన్వయులు. వారి మొదటి రాజధాని అద్దంకిగదా! ఆ గ్రామము నేటివరకు కందుకూరి తాలూకాలో నెల్లూరు మండలము నందున్నది. మొటాటివారు గూడ మట్టెవాడాన్వయులని ఒక పురాతన పద్యము వలన తెలియుచున్నది.

నైజాము ఇలాకా కమ్మముమెట్టు గ్రామమునుండి కృష్ణానదివరకు ఉండు దేశము కమ్మ రాష్ట్రమని లేక కర్మ రాష్ట్రమని తెలియుచున్నది. ప్రస్తుతం నైజాము ఇలాకాలోనుండు ఆంధ్ర మండలములు మొటాటినాడని నా యభిప్రాయము, ఎందుచేననగా ఇచ్చోటనే ఈ శాఖవారు విశేషముగా గ్రామాధికారము, జమీందారి, దేశముఖి మొదలగు అధికారములు గలిగినవారైయున్నారు. పై ప్రధానశాఖలు దేశముపై అధికారము వహించి అట్టి దేశమును తమ పాలనలో యుంచినవారని ప్రబల నిదర్శనమున్నది.

పంటనాడునందు పంటవారే విశేషముగా భూస్వాములై గ్రామాధికారులై యున్నారు. కమ్మనాడు నందు కమ్మ మహాశయులే విశేషము. ఇట్లే పాకనాడు దేశము పాకనాడుశాఖవారితో నిండియున్నది. ఈ పాకనాడు సీమ నెల్లూరుకు పశ్చిమవైపున యున్నదని చరిత్రకారులు చూపిన విషయమే. ఇట్టి సీమనే ఆదికవి పుంగవుఁడైన నన్నెచోడుడు కుమార సంభవమను ప్రబంధమునందు తన తండ్రి చోడబల్లి ఇరువది యొక్క వేల గ్రామములతోయున్న పాకనాటి సీమను పరిపాలించెనని వ్రాసినాడు.

చం. "అరి నరపాల మౌళిదళి తాంఘ్రి యుగుండయి పాకనాటియం
దిరువది యొక్క వేయిటి కధీశుఁడు నాజను చోడబల్లికిం
జిరతరకీర్తి కగ్ర మహిషీతిలకంబన హైహయాన్వయాం
బర శశిరేఖయైన గుణభాసినిశ్రీసతికిం దనూజుఁడన్"

(కుమార సంభవము 1-53)

పై సిద్ధాంతమునను సరించి రెడ్లలో అన్ని ప్రధాన శాఖలు ఒకానొక దేశమునకు సంబంధించియున్నవి కాని వేగినాటియందు రెడ్లు లేరు. ఆ సీమ పేరుగల శాఖ గూడ రెడ్లలో కనబడదు. ఆ దేశపు రెడ్లు తమ జాతి నామమును మార్చి మరియొక

పేరు ధరించి యుండవచ్చునని నా యూహ. భావి పరిశోధకులు సత్యమును వెల్లడి చేయగలరు. నాడు పదము లేకుండ కొందరు మన ఆంధ్ర దేశమునందు కాపులని చెప్పుకొనెదరు. వారివి మాత్రము నాడు పేరు గలవారి ఉపశాఖలుగాని ప్రధానశాఖలు గావు. మరికొందరు ఇతర కులమువారు తాము కాపులమని చెప్పుకొనెదరు. వారు యెంతమాత్రమును వీరితో సంబంధించరు. వీరి స్వభావము వేరు. వారి స్వభావము వేరు. వారికి కులనామము వేరున్నప్పటికి మీరేకులములవారని యడిగినచో వారి నిజకులముల చెప్పక కాపులమని చెప్పుట సంభవించుచున్నది. కాని యే కాపులమని యడిగిన యెడల ఈ రహస్యము బయటపడగలదు. కృత్రిమ కాపులు వ్యవసాయముజేయు కాపులమని యనియెదరు ఇంతేకాని పాకనాడు, పల్నాడు, పంటనాడు, వగైరా అనియనరు.

మరికొందరు సేద్యముఁ జేయువారము అనక ఏ వస్తువులను కాపాడుదురో ఆ వస్తువు పేరుతో కాపులమని చెప్పెదరు. ఉదా: గొల్లలు మొదలు కాపులమని చెప్పి తరువాత ఏ కాపులని యడిగినప్పుడు గోవులను కాపాడుటచేత గోపకులము లేక గోవులను కాపాడే గొల్ల కాపులమని చెప్పెదరు. ఇదే ప్రకారము తోటలను కాపాడేవారు తోట కాపులమని బలిజె కాపులమని లేక మాలీలమని చెప్పెదరు.

దేశమునకు సంబంధించిన పేరుగల కాపువారు దేశమును గాపాడువారని యనుటకు సందేహమేమియు లేదు. అమరకోశము మొ॥ సంస్కృత నిఘంటువుల యందు దేశ సంబంధమైన కాపు పదమునకు బదులు క్షత్రియుడని యున్నది. దీని వ్యాఖ్యానము : క్షతాత్రాయతే క్షత్రః, తస్యాపత్యం క్షత్రియః క్షతాత్‌కు అర్థము నాశనము, ఛిద్రములు, గాయములు, వీటినుండి త్రాయతే = కాపాడువాడు, క్షత్రుడనంబడును. అట్టి క్షత్రియుని మొగబిడ్డడు క్షత్రియుఁడు (క్షత్రస్య అపత్యంపుమాన్ క్షత్రియః). ఇచ్చట నాశనము, ఛిద్రములు, గాయములు ఎవరికి గలిగినయెడల గాపాడువాడు? దేశమునకు లేక దేశీయులకు అపాయము గలుగకుండ కాపాడుట యని భావము.

నేనిదివరకే పాశ్చాత్య సిద్ధాంత ప్రకారము ఆర్యులు ఇండియాకు ఉత్తర భాగమునుండి వచ్చిన వారని, వారు వచ్చిన తరువాతనే భరత ఖండమునందు గ్రామములు, పురములు, నగరములు, నగర రాజములు నిర్మింపబడినవని, వారికి ముఖ్య వృత్తి కృషి యని చెప్పియుంటిని. అయితే దీనివలన తెలియుసంగతి: ఆర్యులు

పూర్వమునుండి దక్షిణాపథము వచ్చుట అలవాటు. ఉత్తర భూమి ఎల్లప్పుడు బస్తీగా ఉండడము ఆ దేశము జనులతో క్రిక్కిరిసినపుడు కొందరు దక్షిణ అరణ్యభూములకు వచ్చి అందు నివాసమేర్పరచుకొని అచ్చటి అరణ్యవాసులను భృత్యులుగా జేసికొని గ్రామములు నిర్మించుట మొదలైన సంగతులు తెలియవచ్చినవి. కాబట్టి మన ఆంధ్రదేశమును ప్రవేశించినప్పుడు ఇచ్చటి ఆదిమవాసులైనవారు వారిని కాపులని పిలిచిరి. వారిని కాపులని పిలుచుటకు ఒక హేతువున్నది. వీరు తొలుదొల్త ఆంధ్రభూమికి ఉత్తర భాగమునందున్న కాంపిల్య నగరమునుండి వచ్చినందుకు వారి పూర్వదేశమే జాతి నామమైనది. కనుక ఉచ్ఛారణయందు బిందు రహితమై ఈ పదము వ్యవహరించునప్పటికిని వ్రాతయందు పూర్ణ బిందువునకు బదులు అర్ధానుస్వారము వ్రాయబడుచున్నది.

ఆదిమవాసులు పశువులవలె సృష్టి నిర్మిత వస్తువులను అనుభవించుట దప్ప స్వపురుషార్థము వలన గృహములను నిర్మించుట, భూమివలన లాభముబొందుట, పశువులను పాలించి వాటితో పని తీసికొనుట ఎరుగరు. కనుక వారి అనాగరిక భాష యందు కాపు లేక కాపాడు అను పదమే అవసరము లేకుండెను. ఉత్తర భాగమునుండి కాపుల పేరుతో కొందరు నాగరిక జనులు వచ్చినప్పుడు వారి నేర్పు వలన ఈ భావము గల పదము దేశభాషయందు సృష్టించవలసి వచ్చినది. కాపులు జేయు పని కాపాడుట కాబట్టి ఈ పదము బిందు రహితమై కాపు అనుపదము ఆంధ్ర భాష యందు ఏర్పడినదని తలచుచున్నాను.

దేశనామము జాతినామ మగునా? అని చదువరులు సంశయించనక్కరలేదు. కొన్ని వందల సంవత్సరముల క్రిందట వచ్చిన బొందిలివారిని పూర్భియాలని మనము జాతినామముగా వాడుచున్నాము. అసలు బొందిలివారు బుందేల్‌ఖండ్ నుండి వచ్చినవారు, పూర్భియాలు పూర్వ దిశ నుండి వచ్చినవారు కాబట్టి వారిని పూర్భియాలని పిలిచెదరు. వారు గూడ తాము బొందిలివారమని, పూర్భియాలమని చెప్పుచున్నారు. అసలు వారి దేశమునందు వారి కులనామము యిది గాదు. ఇదే మాదిరి పార్సీలను పార్సీ దేశము నుండి వచ్చుటవలన వారి కులనామము పార్సీలని వ్యవహరింపబడినది. కాపులు కాంపిల్య నగరమునుండి వచ్చినవారని నేను నూతనముగా సృష్టించినది గాదు. ఇదివరకు శ్రీయుత చిలుకూరు వీరభద్రరావు పంతులవారు ఆంధ్రుల చరిత్ర

మూడవ భాగమునందు సహేతుకముగా వ్రాసిరి. సంశయము గలవారు అందులో చూడగలరు.

కీ.శే. కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులవారు 'చాళుక్యులు దాక్షిణాత్యులే' యను శీర్షిక క్రింద వ్రాసిన వ్యాసమునందు "చాళుక్య కదంబ రాష్ట్రకూటాది రాజ వంశములు దాక్షిణాత్యులవే యని, కల్యాణపుర మేలిన చాళుక్య రాజపుత్రుల వంశమునుండి అన్హిల్‌వాడ పట్టణపు రాజవృక్షముపై నంటునాటనైనది. రాజపుత్రస్థానమందలి సోలంకీలు, గుజరాతు సోలంకల నుండి యుద్భవించినవారని, ఇంక రాజపుత్ర స్థానమందు నివసించు చిన్న చిన్న సంస్థానాధిపతులు యావత్తు దాక్షిణాత్యులే యని వీరికందరికి మొదట వాతాపి (బాదామి) అను పట్టణము రాజధాని యని వీరి మూలము, క్రింద వ్రాయు విధమున, అయిదు శాఖలుగా పరిణమించిందని వ్రాసిరి:

1. మూలము బాదామి రాజధాని. ఈ పట్టణము కర్ణాటక దేశమునందున్నది. వీరి రాజ్యము క్రీ.శ. 550 మొదలు 750 వరకు.

2. రెండవ వంశము చాళుక్యులను పేరుతో వెలిసినది. వీరి రాజధాని రాజమహేంద్రవరము. ఈ పట్టణము ఆంధ్రదేశ వేగినాడులో నున్నది. క్రీ.శ. 610 మొదలు 1100 వరకు రాజ్యమేలిరి. వీరినే తూర్పు చాళుక్యులనెదరు.

3. మూడవ వంశమువారికి కన్నడ దేశమందలి కళ్యాణపట్టణము రాజధాని. రమారమి 980 మొదలు 1200 వరకు రాజ్యము చేసిరి. వీరినే పశ్చిమ చాళుక్యులందురు.

4. నాల్గవ శాఖయు, ఐదవ శాఖయు గుజరాతు దేశము నేలిన చాళుక్యులు, నాల్గవ వంశమువారు క్రీ.శ. 600 మొదలు 750 వరకు.

5. అయిదవ శాఖవారు సోళంకులు అనుపేరట "అన్హిల్‌వాడ" పట్టణము రాజధానిగా 940 మొదలు 1143 వరకు దొరతనము జేసిరి. వీరి వంశీయులే రాజపుత్ర స్థానమునందును, బుందేల్ ఖండ్‌నందును, చిన్న చిన్న సంస్థానములను సంపాదించుకొనిరి. కన్నడ దేశమునందు గూడ తరువాతి కాలముననుఈ చాళుక్యులు చిన్న చిన్న జమిందార్లుగా నున్నట్లు గానబడుచున్నది. మధ్య హిందూ స్థానమునందు "రీవీ" యని యొక రాజపుత్ర సంస్థానము కలదు. అచ్చటివారు సోళంకులలోని బఘేళ్ అను శాఖవారు. గుజరాతునుండి వచ్చిన వారే." పై వ్యాసము

శ్రీ పంతులవారు అనేక ఆంగ్ల ఐతిహాసికుల ప్రమాణములతో వ్రాసి దేశీయులకు అపూర్వ సంగతులను తెలిపిన వారైరి.

నే నిదివరకు కాఁపులనువారు "కాంపిల్య" అను దేశమునుండి దక్షిణాపథులై మన ఆంధ్రదేశమునకు వచ్చి ఇక్కడ బస్తీలు నిర్మించి రాజ్యస్థాపనము చేసినవారని వ్రాసినది. పై పంతులవారి సిద్ధాంతము వలన దక్షిణమునుండి ఉత్తరము బోయి రాజవంశము వారు రాజ్యస్థాపనము జేసినారని తెలిపినందుకు బాధకమని చదువరులకు తెలియగలదు.

నా అభిప్రాయమునకు శ్రీపంతులవారి వ్యాసము ఎంతమాత్రము బాధకము గాజాలదు. వారు క్రీ.శ. 550 మొదలు 1143 వరకు బాదామి వంశపు చాళుక్యులు ఉత్తర దేశమునకు బ్రాకి అచ్చట రాజధాని నియమించినారని వ్రాసినందుకు ఆశ్చర్యమేమియు లేదు. క్రీ.శ. 500 కంటె పూర్వము ఉత్తరదేశము నుండి వచ్చినవారే, మొదలు కర్ణాటక దేశముననుండు బాదామి పట్టణమును నిర్మించి రాజధానిగా ఏర్పాటుఁ జేసినవారు తరువాత వారి శాఖలవారే ఆంధ్రమున చోడ, చాళుక్యుల పేరుతో రాజమహేంద్రవరము మొదలైన రాజ్యములు స్థాపించినవారు. మొదట దక్షిణాపథము వచ్చినవారు ఉత్తరదేశము అరాజికము అయిన తరువాత వారు తిరిగిపోవుట కభ్యంతరమేమియులేదు. ఆథవా ఇక్కడి రాజ్యాధికారము వలన ప్రబలి అక్కడి రాఁజులను ఓడించి ఆక్రమించుటకు వెళ్ళినారనినను సందేహమేమియులేదు.

శ్రీ పంతులువారు ఇదే వ్యాసమునందు చాళుక్య పదవిమర్శనము జేయుచు చాళుక్య పదము తరువాత సంస్కరింపబడినదని మొదలు ఈ పదము సల్కి, చాలుక్య, తరువాత చల్క్య, పిమ్మట చలిక్య రూపమై ఏడవ శతాబ్ధము వరకు చలుక్యయ తదనంతరము చాళుక్య, దీని రూపాంతరమే చాళుక్య తొమ్మిదవ శతాబ్ధమువరకు నిలిచిపోయినదని అనేక శాసనముల వలన సమగ్రముగా సప్రమాణముగా తెలిపిన సంగతి ఎంతమాత్రము సంశయాస్పదముగాదు. వీరి కులమును గురించి పేరును గురించి శ్రీ పంతులుగారు సల్కిపదమునకు ఇన్ని మార్పులు యెందుకు గలిగినవని ఆలోచించుచు తుదకు వారు నిశ్చయించి వ్రాసిన అంశములు కొన్ని పరిశీలించదగినవి.

చాళుక్యుల యుత్పత్తి గాథలు దక్షిణమునందు ఒక విధముగా ఉత్తరమునందు మరియొక విధముగాఁ జెప్పుచున్నారు. వీరు రాజ్యము స్థాపించిన తరువాత

"సల్కి" పదము సంస్కృత పదము గానందుకు గౌరవము లేనందున పండితులచే ఇష్టము వచ్చినట్లు సంస్కృత పదము వలె మార్పించిరి. ఈ ఉత్పత్తికి తగినట్లు గాథలు గూడా ఎవరికిష్టము వచ్చినట్లు వారు కల్పించిరి. వీరి రాజ్యమునందు ఆస్థానపండితులు "రాజానుమతోధర్మః" అను లోకోక్తి ప్రకారము సూర్యవంశపు క్షత్రియులు, చంద్రవంశపు క్షత్రియులనుట కారంభించిరి. కాని, అసలు వీరు అనగా చోడ, చాళుక్యులు, కాఁపు (శూద్ర) కులజులని రెండు ప్రబల ప్రమాణములిచ్చి వ్రాసినారు. ఆ ప్రమాణములివి:

1. బిల్హణుఁడు విక్రమాంక దేవచరిత్రమునందు వారి వంశాభివృద్ధిని గురించి వ్రాయుచు:

శ్లో॥ క్రమేణా తస్మాదుదియాయ
వంశః శౌరేః పదా ద్గాంగ ఇవ ప్రవాహః

ఈ శ్లోకమునందు బిల్హణుడు స్పష్టముగాఁ దెలియకుండ, ధ్వనిమూలకముగా దోచునట్లు ఈ జాతివారు విష్ణుపాదమునందు పుట్టిన గంగాప్రవాహము వలె (పాదోద్భవులు, గంగ శూద్రులు) క్రమముగా కథానాయకుని వలన వృద్ధిఁ జెందుదురని నుడివినాడట. ఇక్కడ గంగను పోల్చుటవలన వీరు శూద్రులని తాత్పర్యము.

2. అరవమునందు దివాకరమ్ అను పేరుగల కోశముగలదు. ఇది తొమ్మిది, ఎనిమిది శతాబ్ద ప్రాంతపుది. దీనియందు 'చళిక్యవెందర్'; వేళఖుల అరసర్' అనగా చాళుక్యరాజుఁలు, కాఁపుఁ శూద్ర కులమువారుగా వ్రాసియున్నదని మొదలునొక్క జాతివారేకాని దేశభేదములనుబట్టి పేర్లు మారుట సంభవించినదని వ్రాసిరి.

పై అప్రతిహత ప్రమాణములు హేతువులగుటచేత చాలుక్య, రాష్ట్రకూట, హొయసళ, చోళ, పాండ్య చేరాదులందరిని పూర్వ పండితులు కాఁపువారని చెప్పినందున శ్రీయుత పంతులవారు తమ వ్యాసములో చూపి తమ అభిప్రాయము నిచ్చినందుకు, నేను వారితో సర్వదా ఏకీభవించుచున్నాను. కాని శ్రీ పంతులవారు పూర్వపండితులవలె తరువాత తాము క్షత్రియులమని చెప్పుకొనసాగిరి, వారి ప్రోత్సాహముచేత ఆస్థాన పండితులు వారిని శూద్రజాతి వారనక సూర్యవంశమని, ఇక్ష్వాకుల వంశమని, చంద్రవంశమని వారి సంతోషార్థము వ్రాసి ఒకానొక సమయమునందు యథార్థము స్పష్టముగా దెలియకుండ ధ్వనిమూలకముగా దోచునట్లు వీరి శూద్రత్వమును దెలిపినారని, ఈ భేదవ్రాతలకు కారకులు రాజులేయని వ్రాసిన దానితో నేనేకీభవించను.

శ్రీ పంతులవారికి పై విధమైన నిశ్చయము నాలుగు కారణములవలన కలిగినది :

1. కాఁపు కులమువారే రాజులైనందున.

2. కాఁపు పదము తెలుగు నిఘంటువులయందు శూద్రవాచకమైనందున

3. ఒక వంశమునే కవులు, పండితులు, ఒకసారి క్షత్రియులని, మరియొకసారి చతుర్థాన్వయులని వ్రాసినందున.

4. 'ఇక్ష్వాకూణా మయం వంశస్య్ మిత్రాంతో భవిష్యతి. 'కలియుగమునందు క్షత్రియ వంశము నశించినదని ప్రమాణము పురాణాదులయందున్నందున.

ఈ విషయములు నే నిక్కడ విపులముగా చర్చించదలుచుకొనలేదు. ఇకముందు సక్రమముగా ఈ భేదమునకు కారకులెవరని చూపదలచినాను. కాని సమాజములో బ్రాహ్మణ, కోమటి, గొల్ల, కమ్మరి, కుమ్మరి, సాలె, చాకలి, మంగలి, మాల, మాదిగ ఇట్లు అనేక జాతులున్నను శూద్రజాతిగా పేర్కొనబడినవారిలో ఒక కాఁపుజాతివారే రమారమి రెండువేల సంవత్సరముల నుండి ప్రబలి అవిక్రమ పరాక్రమవంతులై సామంత, స్వతంత్ర, సమ్రాట్ స్థాయి రాజులైనారా? అయితే ఎందుకు? అని చదువరులు గమనించదగిన విషయములు.

కాఁపుల ముఖ్యవృత్తి వ్యవసాయము. ఇది అందరికీ తెలిసిన విషయమే. కాని, వ్యవసాయ వృత్తి భేదములు రెండు విధములుగా నున్నవని పండితులు పరిగణించి చూపలేదు.

భూమిపై స్వామిత్వము బొంది అనగా భూస్వామియై తాను వ్యవసాయము స్వయముగా జేయక రెండోవారికి కౌలుకిచ్చి చేయించునది. ఇదొక విధమైన వ్యవసాయ జీవనము. ఇక రెండవది: తాము భూమిపై స్వామిత్వము బొందక యితర భూస్వాముల వద్ద కౌలుకు తీసుకొని సేజ్యము చేయునది. మొదటి విధమైన వ్యవసాయాధార జీవనమునందు మన ఆంధ్రదేశమున యిదివరకు చెప్పిన ప్రధాన కాఁపు శాఖకుఁ జెందిన రెడ్డి తెగవారిలో అనేకులు భూమిపై స్వామిత్వము బొందియున్నారన్నది నిర్వివాదాంశము గదా!

భూమిపై స్వామిత్వముబొందిన జాతిని గురించి అమరకోశము (క్రీ.శ. ప్రథమ శతాబ్ది), తదితర పూర్వ గ్రంథములు ఏమి వ్రాసియున్నవో తెలుసుకొనవచ్చును గదా!

ప్రతి జాతికిని వృద్ధి క్షీణము లున్నవి గదా – మొదలు కూలిజేసే వారిని గురించి విచారింతము. వీరు నిత్యము రెండణాలు సంపాదించినప్పుడు బీదవారనియు, తర్వాత నిత్యము రూపాయ రెండు రూపాయలు సంపాదించినప్పుడు తమ వృత్తియంద దత్యున్నత దశ బొందుచున్నవారని యనెదరు. వైశ్యులలో నంగడియందు వెల్లుల్లిపాయ లమ్మువా రతిహీనదశవారు (బీదకోమట్లు), సువర్ణాది లోహములను, వజ్ర వైడూర్యాది రత్నముల నమ్మువారిని గొప్ప సాహుకార్లని యనెదరు.

రెడ్లలో నొకటి రెండెకరముల నేల గలవారిని బీదకాఁపులని యందురు. వీరే స్వయముగా హలపాణులగుదురు. 50 ఎకరముల నేలగలవారు నలుగురు జీతగాంఢ్రను బెట్టుకొని యిర్వదిపసులతో వ్యవసాయము సేయుదురు. వీరు కాఁపులలో గొప్ప. 100 ఎకరముల నేల యుండుటతోడనే యొక గ్రామాధికారియై యొక లెక్క వ్రాయువాడు (గుమాస్త) గలిగి, దాసదాసీ బృందములతో నుండి రెడ్డి యనిపించు కొనును. ఇంక భూవైశాల్యమైన కొలది జమీందారు (దేశముఖు), మండలాధిపతిరాజు, రారాజు వరకు వృద్ధి బొంది గోవృషభాది జంతువులకు బదులు క్రమక్రమేణ గజ తురగాది జంతువులేగాక ఆవిరి యంత్రములు మోటార్లు మొదలైనవి గలుగును. యోగ్యత కొలది సిరి, సిరినుండి పదవి; పూర్వమార్గము ననుసరించి మారుట, అన్ని జాతులందున్నది. ఆశీర్వచన పనస వల్లించిన వారు సామాన్య విప్రులు గదా! పరాయతమువరకు వల్లించినవా రవధానులు. మహా భాష్యాది వ్యాకరణ శాస్త్రములను పఠించినవారు పండితులు. తర్కమీమాంసాది శాస్త్రములయందుత్తీర్ణులైన వారు శాస్త్రులు. వాఙ్మయమునందు కృతి తత్త్వమును జూపించువారు కవులు. సూరులని పించుకొని నటులే కాఁపులే రెడ్లు, జమీందారులు రాజులు, రారాజు లగుటఁ సహజము. ప్రతిజాతి యత్యున్నత దశయందున్నను నీచదశయందున్నను; ఆయాజాతి సహజ స్వభావము యాజాతికి జెందినవారిలో 3 పాళ్ళ జనులందు గోచరించును. శుచి, శీలము, ఉచ్చారణస్ఫుటత్వము సాధారణ విప్రులు మొదలుకొని పండితులైన బ్రాహ్మణోత్తముల వరకుండును. వైశ్యులలో బీదకోమటి మొదలుకొని గొప్ప సాహుకార్ల వరకు యుక్తి యొకే తీరుండును. రెడ్డి సంబంధమైన బీదకాఁపులందు కూడా అతిథి సత్కారాది యౌదార్య సద్గుణము లుండితీరును. అనేక జాతులకు వేరు వేరు నామములున్నను వ్యవసాయము సేయు వారెందరో తాము కాపులమని చెప్పుకొను

చున్నారు. కాని వీరు పిల్లికి బిచ్చము పెట్టరు. భట్టు, బట్టు పదము లొక్కపోలికయున్నను స్వభావము నందెంత యంతరమో యంతయేయని దలంచవలయును. కాఁపువారి నామాంతరము గృహస్థుడు (గృహపతి). ఇందుచేతనే వీరిని సంసార్లని యనుట గలదు. అయితే యితర జాతులవారు గృహస్థులు గారా? దారా పుత్రాదులు గల వారందరు గృహపరులే! సంసార్లే; కుటుంబీకులే. కానివీరికి ప్రత్యేకించి మన యాంధ్రదేశమున సంసారి (గృహస్థుడు) యని యనుట యెందులకో? రాణి యనగా భార్యయని సామాన్యర్థమిచ్చును. కాని ప్రత్యేకించి రాజు భార్యను రాణియనుట సహజము గదా! అట్లే యేదో యొక విశేషమునుబట్టి సంసారి (గృహస్థుడు) వీరి కుల నామమైనది. 'సత్త్రీ గృహపతి స్సమౌ, సత్రం సదదాదానమస్యాస్తీతి" సత్రమనగా సదాదానము. అది గలిగినవాడు గృహస్యపతిః గృహపతిః గృహమునకు ప్రభువు. సదాదానము సేయువాడు క్షత్రియ వర్గులో గృహస్థుని జెప్పుటకు క్షత్రియులే గృహస్థులని యమరసింహుని అభిప్రాయము. ఎందుకనగా రాజులకు దేశమే గృహము, ప్రజలే వీరి పుత్రులు కావున రాజునకు పర్యాయపదము గృహస్థుడనుట సార్థకముగా నున్నది. ఈ జాతివారెన్ని సుగుణ సంపదలు గలిగి యున్నను విద్యా విహీనత వలన కాలక్రమేణ తమ పదవులనుండి తొలఁగుటయే గాక తమ యథార్థకుల నామముల గూడ మరిచిపోయిరి. సంసారియను పదమునకు తొల్లిఁటి యాంధ్రరాజులు విశేషముగా తమ శాసనములయందు "కుటుంబిణ" అను పర్యాయపదములో వ్రాయించినారు. అమరకోశ శిలాశాసనాది యాధారములేగాక నింకకొన్ని యుదాహరణము లిచ్చుచున్నాను - గుజరాత్ ప్రాంతపు చిన్న చిన్న సంస్థానాధిపతులు తాము క్షత్రియుల మని జెప్పుటయేగాక గరాసియోలమని కూడ చెప్పుదురు. గరాసియా పదము గృహస్థ అపభ్రంశము. ఆంధ్రమున గృహస్థునికి గేస్తుయని చెప్పినట్లుగా నున్నది. శ్రీశుకుడు నిమిరాజ వంశమునుఁ జెప్పుచు "వీరు మైథిలురగు రాజులని జెప్పంబడుదురు. యోగీశ్వర ప్రసాదంబున గృహస్థులై యుండియు, బంధ నిర్ముక్తులై యాత్మజ్ఞానంబు గలిగి నిరంతర బ్రహ్మానుసంధానంబు సేయుచు నుందుదురని" నుడివెను. (చూ. భాగవతము. స్కంధము 9 భవిష్యద్రాజేతిహాసము) గృహస్థ (గృహపతి) ని గురించి యమరసింహుడు క్షత్రియపరముగా జూపెను. ఆంధ్ర శబ్ద రత్నాకర నిఘంటుకర్త బ్రాహ్మణపరముగా జూపుచున్నాడు. ఉచితానుచితముల చర్చ పాఠక మహాశయులకే విడుచుచున్నాను.

ఇంతకుముందు "కాఁపు" అనగా కాపాడుట యని వ్రాసి యుంటిని. కాపాడుట పంటల పశువులనే గాదు. కాఁపుల ప్రధాన శాఖలు దేశమునకు సంబంధించి యున్నందున వీరు దేశమునుఁ గాపాడువారని దలంచవలయును. కాఁపు క్షత్రియ పర్యాయ పదమనియు, సంసారి, గృహస్థునికి పర్యాయపద మనియు వ్రాసియుంటిని. ఇకముందు వీరి బట్టపు నామమైన "రెడ్డి" పదతత్త్వమును విమర్శించదలిచినాను:

ఆంధ్ర నిఘంటువులందు "రెడ్డి" యను పదమునకు కాఁపు వారి బట్టపు పేరని యొక మలకవేసి శూద్రుని బిరుదని చూపిరి. శూద్రుడు గృహస్థుడనుట యెంత పూర్వ శాస్త్ర సమ్మతమో వారికి "రెడ్డి" పట్టపు నామమమని యనుట నంతే హాస్యాస్పదము. శూద్రు డస్వతంత్రుడనియు, మూఢుడనియు మహాశయులకు విదితమే. ఏ విద్య నెరుంగని వాఁడు పట్టపు నామము ధరించి యుండునని జెప్పుట యెంత సమంజసము?

రెడ్డి యనుట తోడనే యావజ్జనులకుఁ గ్రామాధికారి యని స్ఫురించును. కావున నిఘంటుకారుడు రెడ్డి పదమునకుఁ గ్రామాధికారి బట్టపు నామమని వ్రాసినచో యోగ్యముగా నుండును గదా! రెడ్డి నామము జాతి వాచకము కాగా గ్రామాధికారి యే జాతివాడైనను ఈ బిరుదును బూనవచ్చునని జెప్పుట కొంత సమంజసమే. రెడ్డి జాతి గ్రామాధికారము వహించుట స్వజాతి ధర్మము. ఇతరులా పదవిపై వచ్చినను తన జాతి నామము మరి యొకటి జెప్పుట సహజము. ఇదియును గాక కొన్ని ప్రాంతములందు మా గ్రామము రెడ్డిగారు సాహెబుగారని నుడువుటాచారమైనది। నేనిటుల వ్రాయుటచే చదువరులకు సంశయము గలుగవచ్చును. కాని హిందూ జాతి యందు రాజులు క్షత్రియులని యావజ్జనులకు విశదమే. అయితే ఇతర జాతివా రీపదవిని గ్రహించినప్పుడు వారినికూడ రాజనుట సహజము. మరియు క్షత్రియులు రాజ్యమేలకున్నను వారిని క్షత్రియ జాతి వారని జెప్పుటాచారమే. ఇదే మాదిరి వైదిక బ్రాహ్మణులు ఉపదేశము (బోధ) సేయక పంటపని లేక బేరము, కొలువు సేయుట మొదలగు పనులు జేసినను వీరిని గురువులనియు, ఆచార్యులనియు పిలుచుచున్నారు. మరియు నియోగి బ్రాహ్మణులను సచివ, అమాత్య, మంత్రి లేక పతులు అనుటలేదా?

వైశ్యుడు బేరము జేసినను చేయక పోయినను శ్రేష్ఠి (శెట్టి) లేక మహాజనుడని నుడువుచున్నారు. వీరల నీలాగున బిలుచుటయు నితరులా పనిచేసినను పిలువకపోవు

టెందుచేత? ఇతర జాతులవారికది సనాతన వృత్తి గానందున వారు తాత్కాలిక పదవికి సంబంధించిన నామము వహించినను, కులవిమర్శనము నందు యథార్థనామము జెప్పక తప్పదు. ఇతర జాతివారు గ్రామాధికారులైనను రెడ్డిజాతి వారా పదవిపై లేకయున్నను సనాతన సంస్కారమునుబట్టి కులవృత్తి ననుసరించి రెడ్డియను బట్టపు నామము కలిగినది. అనగా రెడ్డిగారనుటయందు గ్రామాధికరాముగల జాతివారని యభిప్రాయము.

గ్రామాధికారిని రెడ్డిగారనుటయేగాక పటేలు అని కూడా పిలుచుచున్నారు. ఈ పద మన్యదేశీయమే. కాని మహమ్మదీయ చక్రవర్తుల కాలము నుండి భరత ఖండమంతట వ్యవహరింపబడుచున్నది. పటేలు= గ్రామము యొక్క సర్దార్ లేక చౌదరి యని ఉర్దూ నిఘంటువు లందున్నది. చౌదరి = గ్రామముయొక్క పెత్తనగాడైన కాఁపు అని యాంధ్ర నిఘంటువు లందున్నది. పటేలుకు క్షత్రియత్వ మెటుల జెల్లునని మీ కనుమానము గలుగవచ్చును. "స్థాయికోధికృతో గ్రామే" (అమరకోశము, క్షత్రియవర్గు) = ఒక గ్రామమున కధికారియైనవాడు స్థాయుకుడు. ఎక్కువ భూములు సంపాదించి, మిక్కిలి డబ్బు గడించి, పెక్కు గ్రామాములపై నధికారము జూపు వారిని దేశాయి, దేశముఖి, జమాన్‌దారు అని పిలుచుచున్నారు. పై రెండు పదముల యర్థము స్పష్టమే. ఇక 'జమాన్‌దారు'కు ఉర్దూ నిఘంటువులందు పర్యాయపదములు కిసాన్, జాట్, అని వ్రాయబడి యున్నది. కిసాన్, కృషిక శబ్దము యొక్క తద్భవము. "జాట్" అను పదమున కర్థము ప్రసిద్ధి కెక్కిన వ్యవసాయకులని వ్రాయబడియున్నది. వ్యవసాయకులే కాఁపులు. 'కాఁపు' పదము శూద్రునికి జెల్లునని యాంధ్ర నిఘంటువుల త్రోవను ద్రొక్కకుడు. అది పొరపాటు. మన కావ్యములందొక పృథివీపతి గుణగణములు వర్ణించుచు తక్కిన రాజులంద రతనికి "అరిగాఁపు"లైరి యని జెప్పబడియున్నది. అరి– కప్పము, కాపులు–రక్షకులు, అనగా చక్రవర్తికి కప్పము కట్టు సామంతరాజులని యర్థము. "అరిగాఁపు" కప్పముఁ గట్టువాఁడు అని యాంధ్ర నిఘంటువులందున్నది. ఏ విధముగా విచారించినను "కాఁపు" పదమునకు రక్షకుడనియు ఈ రక్షకత్వము క్షత్రియులే వహింతురనియు, క్షత్రియ పర్యాయ పదము రాట్, దీని తద్భవము తేడు, దీనికి వికృతి రెడ్డి వీని పర్యాయ పదములు దొర, భూపతి (జమీన్‌దారు) దేశాయి, దేశముఖ్, ప్రభువు(పటేలు), చౌదరి (పెద్దకాఁపు) మొదలగునవి వాడుకలో నున్నవి

– ఈ వ్యవహార నామములే గాక పాలునీరు ఏర్పాటు జేసిన పక్షిని హంసయని గుర్తించినటుల వీరి గుణకర్మ స్వభావములుఁ గూడ వీరి క్షత్రియత్వమును స్థిరపరచుచున్నవి. "శూద్రోబ్రాహ్మణ తామేతి, బ్రాహ్మణశ్చైతి శూద్రతాం, క్షత్రియాజ్జాతమేవంతు విద్యాద్వైశ్యాత్తథైవచ" శూద్రకులమందు బుట్టినను బ్రాహ్మణ క్షత్రియ వైశ్య గుణకర్మ స్వభావములు గలవారు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులే యగుదురు. అటులనే బ్రాహ్మణ క్షత్రియ వైశ్య జాతులందు బుట్టినవారుకూడ శూద్రగుణ కర్మ స్వభావములు గలవారు శూద్రులే యగుదురు. ఇటులనే ఆయా జాతుల గుణకర్మ స్వభావములను బట్టి గ్రహించవలయునని మహాభారత అరణ్యపర్వములో నహుష ప్రశ్నలందు మరియు శుక్రనీతియందు ఇంకననేక గ్రంథములలో సప్రమాణముగా సహేతుకముగా వ్రాయఁబడి యున్నది. కావున కాఁపుల, రెడ్ల గుణకర్మ స్వభావములను బట్టి కూడా వారు క్షత్రియులని జెప్పవచ్చును. అవి యేవన? "ప్రజానాం రక్షణం దాన, నిత్యాధ్యయన మేవచ, విషయేష్వ ప్రసక్తిశ్చ క్షత్రియశ్య సమాసతః" ప్రజాపోషణము ఇతరుల మేలును గూర్చి దానము, వేదశాస్త్రములం జదువుట, జితేంద్రియత్వము గలిగి యుండుట, క్షత్రియధర్మములు. మరియు "శౌర్యం తేజోధృతిర్దాక్ష్యం యుద్ధేచాప్య పలాయనం, దాన మీశ్వర భావశ్చ క్షాత్రం కర్మస్వభావజం"

శౌర్యము దాన శీలముఁ బ్రసాదము నాత్మజయంబుఁ దేజమున్
ధైర్యము దేవభక్తియును ధర్మము నర్థముగామమున్ బుధా
చార్య ముకుంద సేవలును సత్కృతియున్ బరితోషణంబు స్వ
దీర్యము రక్షణంబుఁ బృథివీవర శేశకర రాజచిహ్నముల్.

వర్ణాంతర వివాహాలు

వర్ణాంతర వివాహాలు పూర్వం చాలా లేకుండెను. ఇప్పుడు గూడా అవసరం లేదని శ్రీ నందిగామ దత్తాత్రేయ రావుగారు గోలకొండ పత్రికలో వ్రాసినారు. చాలా లేకుండెను అనుటచేత కొద్దిగా పూర్వంలోనూ ఉండెననిన్నీ ఇప్పుడున్న "చాలా" వరకు పోక కొద్దిగా చేయవచ్చుననిన్నీ వారి వాదాన్ని అర్థము చేసుకొనవలెనో యేమో? అయినా వారు చూపించిన కారణాలు తృప్తికరముగా లేవు.

"వజ్ర సూచికోపనిషత్తు" అను చిన్న ఉపనిషత్తు వావిళ్ళవారు తెనుగర్థముతో ముద్రించినారు – దాని వెల 2 అణాలు మాత్రమే. దాని నింతవరకు చదువనివారు తప్పకుండా చదువవలెనని కోరుతున్నాను. అందీ చర్చకు బ్రాహ్మణత్వానికేది ప్రధానం?

"కోవా బ్రాహ్మణోనామ
కిం జీవః కిందేహః? కింజాతిః?
కిం జ్ఞానం? కింకర్మ? కిం ధార్మిక?"

అని ప్రశ్న వేసుకొని ఇవన్నియు ప్రధానం కావు అని చెప్పుచు ఇట్లు సెలవిచ్చినారు.

"తర్హి జాతిర్బ్రాహ్మణ ఇతిచేత్, తన్న;
తత్ర జాత్యంతరేష్వనేక జాతి సంభవాత్
మహర్షయో బహవస్సంతి, ఋష్య
శృంగోమృగ్యాః, కౌశికః కుశాత్,
జాబూకో జంబుకాత్, వాల్మీకో వల్మీకాత్
వ్యాసః కైవర్తక న్యాయాం, శ శ

పృష్ఠాత్ గౌతమః వసిష్ఠ ఊర్వశ్యా, అగ
స్త్యః కలశేజాత ఇతిశ్రుతత్వాత్, ఏతే
షాం జాత్యా వినాస్యశ్రీ జ్ఞాన ప్రతిపాదితా
ఋషయో బహువస్సంతి తస్మాన్న
జాతిర్బ్రాహ్మణ ఇతి.

వర్ణము బ్రాహ్మణుడనిన యెడల అదికాదు. ఒక వర్ణములోనే అనేక వర్ణాలు కలిగెను. ఋష్యశృంగుడు లేడికి, కౌశికుడు దర్భకు, జాంబూకుడు నక్కకు, వాల్మీకుడు పుట్టకు, వ్యాసుడు బెస్తకన్యకకు, గౌతముడు కుందేటికి, వసిష్ఠుడు ఊర్వశియను బోగము దానికి, అగస్త్యుడు కుండకు పుట్టిరి.

పై ప్రమాణాన్ని బట్టి మహర్షులు జంతువులకు, కుండలకు, గడ్డికి, పుట్టలకు కన్యలకు, వేశ్యలకు, బెస్తలకు పుట్టినట్లు స్పష్టమగుచున్నది. ఈ వజ్ర సూచికోపనిషత్తును మొదట ముద్రించిన పళ్ళె చెంచల రావుగారు ఈ యుపనిష దంతమందు తమ పక్షాన ఈ విధముగా వ్రాసినారు.

పై జెప్పబడిన వచనముల కనుగుణముగా బ్రాహ్మణేతరులు సైతము బ్రాహ్మణులైనట్లు భాగవతములో నీ క్రింది ప్రమాణములు కలవు.

10–12	శ్లోకాలు	5	స స్కంధం	4		అధ్యాయం	
17,21,22	॥	9	॥	2		॥	
11	॥	9	॥	17		॥	
1	॥	9	॥	20		॥	
21,32,33	॥	9	॥	21		॥	

ఈ ప్రమాణాలను బట్టి శూద్రులు బ్రాహ్మణులైనట్లు తెలియవచ్చును.

అట్లయితే శూద్రులెప్పుడు బ్రాహ్మణులైనారో, అట్లు బ్రాహ్మణులైనవారు బ్రాహ్మణ స్త్రీలను వివాహమాడి బ్రాహ్మణ వంశములకు కర్తలెప్పుడైనారో ఆ యాచారాన్నే వర్ణాంతర వివాహమంటారా లేదా? పాండు ధృతరాష్ట్రులు నియోగముచే పుట్టినారని నియోగము వివాహము కాదనియు రావుగారు సెలవిచ్చినారు. వివాహము కాదు నిజమే కావున అది వ్యభిచారమే యగును. వ్యభిచారము వలన పుట్టిన వారికి గౌరవ మర్యాదలు కలుగునా? అట్టివారి సంతానము పొందినది పెండ్లి కాకముందే

ఒకణ్ని కన్నది. దీనికి సమాధానమేమంటే వ్యభిచారము చేసినవారు దేవతలట! ఈ కాలములో కూడా వ్యభిచారం చేసే వారంతా దేవతలని మనము సమాధాన పడవచ్చునా? హిడింబి రాక్షసియే కాని వాస్తవముగా క్షత్రియ జాతి స్త్రీయే! అని రావుగారనుచున్నారు. రావణుడు రాక్షసుడే కాని నిజంగా ఆయన బ్రాహ్మణుడే. అందుచేత లంకలోని రాక్షసులంతా బ్రాహ్మలే. రాముడు బ్రాహ్మల జంపెను అని తర్కించితే యెట్లుంటుంది – వేద కాలములో నూటికి 99 పాళ్ళు సవర్ణ వివాహము లేనట – మిగతా ఒకపాలు ఏమైంది.

చారిత్రక నిదర్శనములోనికి రావుగారు పోనియ్యరు. ఎందుకంటే చరిత్రలు విదేశీయులచే వ్రాయబడినవట. "కావున నమ్మదగినవి కావు" అట. "ఒకవేళ నమ్మినను పౌరాణిక వర్గము వారికి సనాతనులకంతగా ప్రమాణములు కావు" అని రావుగారు కొట్టి పారవేసినారు. పురాణాలు నమ్మదగినవి కావు. అవి ప్రమాణాలు కావు అని ప్రాచీన భారతీయ తార్కికులన్నారు. ఆచార్యత్రయము వారు తమ తమ భాష్యాలలో పురాణాలకు కనిష్ఠ స్థానమిచ్చినారు. పురాణాలు పరస్పర విరుద్ధమైనవి. ఒకే పురాణములో వివిధ స్థలములలో ఒక విషయమును గురించి పరస్పర విరుద్ధాంశము లను వర్ణించినారు. పురాణాలు ఎల్లప్పటికినీ పెరుగుతూ వచ్చినవి. 8000 శ్లోకాల భారతము 1 లక్ష శ్లోకాల గ్రంథముగా పెరిగెను. రావుగారు ఉదాహరించిన స్కాంద పురాణము ఇప్పటికిని పెరుగుచూ ఉండే గ్రంథము. అట్టి పురాణాలను వారు నమ్ముతారట. చరిత్రను వారు నమ్మరట. విదేశీయులు వ్రాసిన చరిత్రలు అబద్ధమైతే స్వదేశీయులు వ్రాసిన చరిత్రలనైనా రావుగారొప్పుకొందురా? స్వదేశీయులు విదేశీయు లను అనుకరించినారు కావున వారిని కూడా ఒప్పుకోము అంటారా? రావుగారు శాసనాలనైనా ఒప్పుకుంటారా? అవికూడా అబద్ధం అంటారా? సర్వం కల్లా సాగరం కల్లా అంటే ఇక దత్తాత్రేయరావుగారికే దిగ్విజయ పత్రమిచ్చి ఆడియేన్ దాసు అని సెలవు పుచ్చుకుంటాము.

వేద కాలంలో కులాలు లేకుండెను. అట్లంటే వాదవివాద మేర్పడుతుందని నాకు తెలిసిన యంశమే. పురుష సూక్తం కులాల సూక్తం కాదా అని ప్రతి పక్షులన గలరు. ఆ సూక్తం ఋగ్వేదాంత్య భాగమందేయున్నది. అదియు ఋగ్వేదమును విభాగించి సంహితగా దిద్ది తీర్చిన వెనుక చాలాకాలం తర్వాత చేర్చబడినదని పాశ్చాత్య

పరిశోధకులంతా ఏక వాక్యంగా నిర్ణయించినారు. పాశ్చాత్యులు మాకు ప్రమాణభూతులు కారను వాదమును శ్రీ దత్తాత్రేయరావుగారు ఇదివరకే లేవదీసినారు – అగుగాక – వేద కాలములో పుట్టుకచేత కుల నిర్ణయమైనట్లు కానరాదు – ఆ మాటనే భగవద్గీతలోను "గుణ కర్మ విభాగశః" అని చెప్పినారు. దానికి కూడా అపార్థం చేసిన సనాతనులున్నారు. పోనిండు, ఇక మూల చర్చ నందుకొనుచున్నాను.

కౌరు రహం, తతో భిషగు, పల ప్రక్షిణీనా,
నానాధియో వసూ యవో నుగా,
ఇవతస్థి మేంద్రాయోం దోపరిస్రవ

– ఋగ్వేదం – 9–112 –3

అంటే – నేను సూక్తాలు రచించేవాణ్ణి, నా తండ్రి వైద్యంచేసి బ్రదుకుతాడు, నా తల్లి విసురుతూ జీవించుతుంది. వివిధ వృత్తులలో మేము బ్రతుకుతాము – ఆవులు గడ్డికై నానా క్షేత్రాలలో సంచరించునట్లుగా జీవించుతాము. కావున ఓ సోమా! మాకు సంపద ఇచ్చుటకై నిన్ను ప్రార్థించుతాము. ఇంద్రా నీవున్నూ సహాయపడుము.

ఇందు వివిధ వృత్తులవారు ఒకే యింట భేదము లేకుండా జీవించినట్లు కనబడుతుంది. ఈ వృత్తులనే తర్వాతి సూత్రకాలంలో కులాలని నిర్ణయించినారు. క్షత్రియుడు బ్రాహ్మణుని యజ్ఞములో పాల్గొని భుజించిన అతని రెండవ లేక మూడవ సంతతి బ్రాహ్మణులలో చేరుతుంది (ఐతరేయ బ్రాహ్మణం 7, 29)

ఇదే ఐ. బ్రాహ్మణంలో 2,19లో ఒక చిన్న ముచ్చట యిట్లున్నది. ఐలూషునికి కవషుడు అనే కొడుకుండెను. అతడు బ్రాహ్మణుల యజ్ఞానికిపోతే "ఒరేయ్ నీవు దాసీ పుత్రుడవు, జూదగాడవు, మాతో కూర్చునే దానికి నీకు అధికారం లేదు" అని వెళ్ళగొట్టినారు. కాని కవషుడికి దేవతలంతా పరిచయమై ఉండటంచేత వారు అతన్ని ఋషిగాచేసి వేసిరి.

ఛాందోగ్యోపనిషత్తు 6,4 లో ఒక రమ్యమైన కథ యిట్లున్నది –

జబాల అను స్త్రీ యొక్క కుమారుడు గురుకులములో చదువుకొనుటకై బయలుదేరుచు "అమ్మా! గురువులవారు నీ తండ్రి యెవరు, నీ గోత్రమేమి" అని అడిగితే యేమి చెప్పుదును అని తల్లిని అడుగగా తల్లి యిట్లన్నది; "నాయనా, నేను చిన్నతనంలో చాలామంది యిండ్లలో దాసీపని చేసినాను. అట్టి సమయంలో ఎందరో

నన్ను పొందినారు. వారిలో నీవెవరికి పుట్టినావో యేమో. కావున నీ పేరు సత్యకామ జబాల అనిమాత్రం చెప్పి, ఉన్నంత సంగతి గురువులతో తెలుపుకొనుము." సత్యకాముడు గురువుతో అట్లే చెప్పుకొన్నాడు – గురువిట్లన్నాడు. "నీవు సత్యమే చెప్పినావు. నీవు బ్రాహ్మణ బీజానికే పుట్టినావు. కావున నీవు బ్రాహ్మణుడవే" అని నిర్ణయించి చదువు చెప్పినాడు. ఈ కథ యింకా చాలావరకున్నది. అదంతా యిప్పుడవసరం లేదు. దీనివల్ల తెలిపేదేమనగా వ్యభిచార సంజాతుడుగూడా ఏ దాసీపుత్రుడో ఏ సేవకులవాడో కాకుండా బ్రాహ్మణుడే అయినాడు.

ఉత యత్పతియో దశ
స్త్రియాః పూర్వే అబ్రాహ్మణాః
బ్రహ్మచేద్దస్తమగ్రహిత్
బ్రహ్మ చేద్ధస్తమగ్రహిత్
స ఏవపతి రేకధా

– అథర్వవేదం, 4, 17,8

అనగా;

ఒక స్త్రీకి పదిమంది అబ్రాహ్మణులైన భర్తలు ఏర్పడిపోయినప్పటికిన్ని తుదిలో ఆమెను ఒక బ్రాహ్మణుడు పెండ్లి చేసుకొన్నట్లయితే అతడే ఆమె భర్త.

దీనివలన స్త్రీకి 11 మంది భర్తలను చేసుకొను అధికారం ఉన్నదన్నమాట. 11వ భర్త బ్రాహ్మణుడైతే ఆమె బ్రాహ్మణి అయిపోతుంది కదా!

ఇక మనువుగా రేమంటారో చూడండి

యాదృగ్గుణేన భర్త్రా స్త్రీ
సంయుజ్యేత యథావిధి
తాదృగ్గుణా సాభవతి
సముద్రేణేవ నిమ్నగా

నదిలోని నీరు ఎట్టిదైనను సముద్రములో పడిన తర్వాత దానిలో కలిసి పోయినట్లు స్త్రీలు తాము వివాహమాడిన వారిలో కలిసిపోతున్నారు (ఎట్లనగా)

అక్షమాలా వసిష్ఠేన సంయుక్తాధమ యోనిజా
సారంగీ మందపాలేన జగమాభ్యర్హణీయతామ్

వసిష్ఠునిచే వివాహము చేసికొనబడిన అధమయోనిలో పుట్టిన అక్షమాలము, మందపాలుడను వానికి వివాహితయైన సారంగి యను (అధమ యోనిజయగు) స్త్రీయు భర్తల మూలాన పూజ్యులైరి.

అక్షమాల (లేక అరుంధతి) శూద్ర స్త్రీ కాదు. అధమజాతి వనిత (చండాల స్త్రీ). ఆమె బ్రాహ్మణింటిపిల్లయే కాని ఎవ్వరో చండాలుడు పెంచినాడు అని వాదించకుండా అచ్చట ఆమె అధమయోనిజగా స్పష్టీకరింపబడినది. మందపాల ఋషి సారంగి అను దాన్ని పెండ్లాడిన కథ యేపురాణమందున్నదో యేమో నాకు తెలియదు. వీరిద్దరే కాదు. ఇంకా ఇట్టి వర్ణాంతర వివాహాలను చేసుకొన్నవారు చాలామంది యుండిరి.

ఏతాశ్చానాశ్చలోకేస్మిన్
అపకృష్ట ప్రసూతయః
ఉత్కర్షం యోషితః ప్రాప్తాః
స్వైస్వైర్భర్తృగుణై శ్శుభైః

ఇంకా చాలామంది నికృష్ట జాతి స్త్రీలు గొప్పవారిని పెండ్లాడి తమ భర్తల శుభగుణాల మూలాన తామును ఉత్కర్షను పొందినారు (మనుస్మృతి అధ్యాయం 22,23, 24 శ్లోకాలు)

పూర్వకాలంలో భారతదేశమందు కొందరు రాజులు చాలా దుర్మార్గులుగా నుండిరి. వారి కాలములో వర్ణాంతర వివాహములు, స్త్రీలకు స్వేచ్ఛా భోగము వివాహ నియమ రహితత్వము (రష్యాలో Nationalisation of women ఉన్నదని కొందరు వ్రాసినట్లుగా) ఉండెను. వేనుడు చాలా చెడ్డరాజు. అతని కాలములో ఒకని భార్యను మరియొక్కడు స్వేచ్ఛగా పొందుచుండెను. అది తప్పు కాదని ఆ రాజు శాసించి యుండెను.

అయం ద్విజైర్హి విద్వద్భిః
పశుధర్మో విగర్హితః

అది పశుధర్మమని పెద్దలు గర్హించిరి. కాని

మనుష్యాణామపి ప్రోక్తో
వేనే రాజ్యం ప్రశాసతి (మను. 966)

ఈ పశుధర్మాన్ని మనుష్యులు కూడా పాలించండి అని వేనమహారాజులుంగారు బారాఖూన్ మాఫీగా సెలవు పెట్టిరి.

గౌతమ ధర్మసూత్రాలు (అవి సూత్రాలు అగుటచేత) చాలా ప్రాచీనములని పరిశోధకులు నిర్ణయించినారు. అందు ఎత్తుకుంటూనే మూడవ సూత్రము ఇట్లన్నది.

దృష్టోధర్మ వ్యతిక్రమః
సాహసంచ మహతాం.

పెద్దలు ధర్మ విరుద్ధంగా ఆచరించినారు. అది సాహసమే అన్నారు. దానికి వ్యాఖ్య వ్రాసిన హరదత్తాచార్యులిట్లు వ్రాసినారు.

కతక భరద్వాజౌ వ్యత్యస్య
భార్యే జగ్మతుః వసిష్ఠ
శ్చండాలీం అక్షమాలాం

కతకుడు, భరద్వాజుడు ఒకనాడు ఇట్లు ముచ్చటించుకొన్నారట. “ఏమోయ్, నీ భార్యపై నాకు మోజు, నా భార్య నిన్ను చూస్తే నీమీద విరుచుకొని పడుతుంది. ఎదుకీ దొంగబ్రదుకు సుఖంగా పెండ్లాలను మార్చుకొందామా? సరే అంటే సరే అనుకొన్నారు. భార్యలను వెంటనే అదిలీ బదిలీ చేసుకొన్నారు. ఇది యీ చర్చకు అప్రస్తుతము లెండి – మరి ప్రస్తుతమేమంటే శ్రీరావుగారు వసిష్ఠుని భార్య చండాల స్త్రీ కాదన్నారు. ఇచ్చట ‘చండాలీం అక్షమాలాం’ అని మనుస్మృతి ప్రమాణాన్ని విప్పి స్పష్టం చేసినారు. స్మృతి ప్రమాణాలు రావుగారికి గ్రాహ్యములా? స్మృతులను గూడా పాశ్చాత్యులే వ్రాసినారా? లేక స్మృతులలో ఇట్టివన్నీ ప్రక్షిప్తమంటారా? వారికంటే ముందుగా నేనే ఈ తీర్మానాన్ని లేవదీస్తాను. ఆమాట అంటారేమో మొదలు వినుకొన్న తర్వాత దానికి సమాధానమిచ్చుకోవలసి యుంటుంది.

వర్ణాంతర వివాహాలు ప్రకృతి ధర్మంలో గాఢంగా చేరినట్టివి. ప్రేమకు వేదాలు, శాస్త్రాలు, పురాణాలు గిరాణాలు అడ్డము రానేరవు. అందుచేత అనంతకాలములో ఈ విపులమైన పృథివిలో ఎందరేమి శాసించినను వాటిని లెక్కపెట్టకుండా నూర్లుకాదు వేలుకాదు లక్షలుకాదు కోట్లకొలది జనులు వర్ణాంతర వివాహాలు చేసుకొనుచు వచ్చిరి. చేసుకొనుచుందురు. ఎవరేమన్నా చేసికొని తీరుదురు. ఈ అవస్థను చూచియే శాస్త్రకారులు ఒక సిద్ధాంతాన్ని లేవదీసిరి. అది అనులోమ ప్రతిలోమ వివాహపద్ధతి.

నెత్తి నున్నగా గొరిగిన తర్వాత జుట్టునుండి నొసటి వరకు ఎదురుగా చేయి నిమిరిన కరుకుగా తగులును. అది ప్రతిలోమ పద్ధతి. అంటే పై జాతి పురుషులు క్రిందిజాతి స్త్రీలను పెండ్లాడితే అంతగా తప్పులేదట.

కాని క్రిందిజాతి పురుషులు పైజాతి స్త్రీలను వివాహమాడితే అది తప్పట. అందులోను శూద్రపురుషుడు బ్రాహ్మణ స్త్రీని వివాహమాడితే ఇంకేముంది కొంపమునిగింది. వారికి పుట్టినవాడే చండాల సోదరుడు. మన అస్పృశ్యుల తల్లులంతా బ్రాహ్మణస్త్రీలు!! శాస్త్రకారుల పక్షపాతం చూడండి. పై జాతులు ఇతర జాతుల స్త్రీలపై చేయి వేయవచ్చునట, తమ జాతి స్త్రీలను మాత్రం ముట్టితే ఘోరమగు పాపమట! దీనికి, అమెరికాలోని తెల్లవారు నీగ్రోలను "లించింగ్" చేసిన దానికి ఏమి భేదము?

గౌతముడు అనులోమాన్ని గురించి యిట్లన్నాడు

వర్ణాంతరగమన ముత్కర్షా
పకర్షాభ్యాం, సప్తమే
పంచమే వేత్యాచారః

........................1, 4, 19

అనులోమ వివాహిత స్త్రీ సంతానం అట్లే ఏడు లేక అయిదు తరాలు జరిగిన తర్వాత పతి కులంలో ఆ సంతానం చేరిపోతుంది.

సృష్ట్యంతర జాతానాంచ 1, 4, 19

మను గౌతమాది ధర్మ శాస్త్రాలలో క్షేత్రము ప్రధానమా బీజం ప్రధానమా అని చర్చచేసి ఒకని భార్యయందు పరుడు వీర్యముంచిన ఆ సంతానం క్షేత్రపతికే చెందునని నిర్ణయించినారు.

భారతములోని ఉద్దాలక శ్వేతకేతూపాఖ్యానం చాలామందికి తెలుసును కదా! అతని కాలములోని సాంఘిక స్థితి యెట్టిదో అందు స్పష్టంగానే నిరూపించినారు. ఇంకను ఇట్టి అంశాలు వెదికేకొలది బావి త్రవ్వితే బేతాళాలు బయటికి వచ్చినట్లు కావలసినన్నీ బయటపడగలవు.

చారిత్రకముగా వర్ణాంతర వివాహాలు ఎట్లు జరుగుచు వచ్చెనో తెలిపి యీ చర్చను ముగించుదును.

బుద్ధుని కాలమునుండి నేటివరకు తక్కువ వర్ణాలవారు పెద్ద వర్ణాలుగా మారిపోవడం, పెద్ద వర్ణాలవారు తక్కువ వర్ణాలుగా మారిపోవడం జరుగుచు వచ్చుచున్నది. నేటివరకును జరుగుచున్నదని అర్థవంతముగానే వ్రాసినాను.

ఏ జాతి వారినైతే 50 ఏండ్లనాడు రెడ్లు మున్నగువారు తాకజాలకుండిరో అట్టి జాతి ఈనాడు బ్రాహ్మణులతో బాంధవ్యము చేయుచున్నది. అది ఈ నిజాం రాష్ట్రములోనే తెలంగాణాలోనే ఉన్నది. బౌద్ధులు, జైనులు హిందువులైరి. ముసల్మానులు వచ్చిన తరువాత ముసల్మానులైన హిందువులు మరల హిందువులైరి. ఇదంతయు వర్ణాంతరముల సంబంధ చర్చయేయగును. మతాంతరులను తమ మతములోనికి చేర్చుకొని వారిని తనలో లీనము చేసుకొన్న హిందూమతములో వర్ణాంతరములు కూడవని ఈనాడు చర్చించు శుద్ధ పూర్వాచార ఛాందసత్వము నేమనవలెను.

ముసల్మానులు హిందువులైరని అంటిని కదా. అంతేకాదు ముసల్మానుల స్త్రీలను హిందువులు పెండ్లాడిరి. ఎట్లనగా :

1. అల్లావుద్దీను బిడ్డలు ద్వార సముద్ర రాజైన బల్లాళ రాజును మోహించి పెండ్లాడిరి. (Hist. and Discri. of N.S. Domin. Vol. 1-P.50)

2. సబ్బ అను రాజపుత్రరాజు సలీం బిడ్డను పెండ్లాడెను (టాడ్ రాజస్థాన్)

3. బాజీరావు పేష్వా మస్తాన్ని అను ముస్లిం సుందరిని పెండ్లాడెను.

4. నింబాల్కరు అను మరాఠీ సేనాని బీజాపూరు సుల్తాను బిడ్డను పెండ్లాడెను. తర్వాత ఇతడు శివాజీ బిడ్డనే పెండ్లాడెను. (3–4 విషయాలకు చూ. కింకేడు వార్నిక్ష – మరాట చరిత్ర)

5. జస్వంతసింహుడు షాజహాన్ చక్రవర్తి బిడ్డను పెండ్లాడెను (టాల్బాయి, వీలర్)

ఇట్టి యంశాలను యింకను కావలసినన్ని చూపించవచ్చును.

కాశ్మీర రాజైన చక్రవర్మ అనువాడు చండాల స్త్రీని పొందెను (కల్హణ రాజ తరంగిణి 5–354)

"పూర్వము వైశ్యులకును, శూద్రులకును భేదము లేకుండెను. ఉభయ జాతులును నియమరహితముగా వివాహమాడుచుండిరి. వైశ్యులు కాని శూద్రులు

కాని వేదాలు చర్చించితే వారి నాలుకలు కోయుచుండిరని ఆల్బెరూని వ్రాసెను" (అల్టెకర్ - రాష్ట్ర కూటులు)

"బాణుడను సంస్కృత మహాకవి యొక్క తండ్రి ఒక శూద్రస్త్రీని పెండ్లాడెను.

అనేకమంది గ్రీకులు హిందువులై హిందువులలో కలిసిపోయిరి.

అదే విధముగా అనార్యులై కషాణహూ, సికమెచ్చ సహళర బర్బరాది జాతులవారు హిందువులైరి. హూణజాతి రాజులైన కనిష్క హువిష్కరాజులు సూర్యవంశ క్షత్రియులైరి. (వివరాలకు ఇండియన్ ఆంటిక్వారీ 1911లో డా॥ భండార్కరు గారు వ్రాసిన హిందువులలో విజాతీయులు అను వ్యాసము చూడుడు)

టిబెటు రాజైన గంపరాజు నేపాళ రాజకుమారిని పెండ్లాడెను. క్రీస్తు శకాదిలో కౌండిన్యుడు బ్రాహ్మణుడు కాంభోజ (కాంబోడియా) దేశమునకు రాజయ్యెను. కాంబోడియా రాణిని కౌండిన్యుడు పెండ్లాడెను. (వివరాలకు (Greater India) గ్రంథాలను చూడుడు)

ఒక క్షత్రియుడు కుమ్మరి దానిని, మేదర దానిని, పుష్పలావికను, వంటల దానిని పెండ్లాడెను.

ఒక బ్రాహ్మణుడు క్షత్రియుడు వదలిపెట్టిన భార్యను వివాహమాడెను. (చూ. రిస్‌డేవిడ్ బు. డిస్టిల్ ఇండియా)

"వివాహములోని నిషేధాలన్నింటిని బ్రాహ్మణులు స్వార్థపరత చేతనే నిర్మించి పెట్టిరి" (నెస్‌ఫీల్డ్)

ఆర్యులు ఆటవికుల పిల్ల వివాహమాడిరి. (రిస్లీ)

"ఆటవికులలో చాలామంది బ్రాహ్మణులును, క్షత్రియులును అయిపోయిరి." (రిస్లీ) యు.పి.లోని సనాలాఖీ బ్రాహ్మణులు ఉదంబరులు, తలాజియాలు, పుస్కరణ బ్రామ్మలు, నిజమైన బ్రాహ్మణులు కారు. తక్కువ జాతులనుండి బ్రాహ్మణులలో చేరిపోయినారు. (షిరిగ్ మిందూ కాస్టు పు.32 మరియు బరోడా సిన్సస్ రిపోర్టు 1931) అదే విధముగా చిత్పాసన బ్రాహ్మణులు, నాగార్ బ్రాహ్మలు విదేశమునుండి వచ్చిన జనులు. (భండార్కరు ఇండియన్ ఆంటిక్యారి 1911)

ప్రతాపగడీతో కుంద బ్రాహ్మణులలో నొక తెగగలదు. రాజామానిక చందు సవాలక్ష బ్రాహ్మణులకు విందు చేస్తానని మ్రొక్కుకొని యుండెను. అందరు

బ్రాహ్మణులతనికి లభింపక పోయిరి. అప్పుడు అహీరు (గొల్ల) కూర్మి, భట్టు మున్నగు శూద్ర జాతివారిని బ్రాహ్మణులుగా జేసివేసెను. నేటికినీ వారికిని ఇతర బ్రాహ్మణులకు భేదం లేకుండా సంబంధ బాంధవ్యాలు జరుగుచున్నవి. (ఔదుగజెటియర్ 1–305) తిరుగు రాయకులు, పాఠకులు, ఫ్రాండే పర్వారాలు, సవాలాఖీలు, వీరంతా శూద్రులనుండి ఏర్పడ్డ బ్రాహ్మణులు కాని తమ లోపం దాగిపోవుటకు గాను వారు తమ పేరుల తుదిలో దూబే, ఉపాధ్యాయ, తివారీ, మిశ్ర, దీక్షిత, పాండే, అశ్వథి, పాఠక్ అను లావు లావు పదాలు వ్రాసుకొంటారు ("N.W.P. VI-351-2)

నిన్న మొన్నటిమాట చూడండి. 100 ఏండ్ల క్రిందట రాజా భగవంతరాయి అను అశోక్తరు రాజా, ఉప్పుచేయు టానిమా జాతివారిని బ్రాహ్మణులనుగా జేసివేసెను. (N.W.P.-VIII)

దక్షిణములో కూర్గులోని తౌ అను బ్రాహ్మణులు చేపలు పట్టువారి నుండి వచ్చినవారు. (వివరాలకు శరశ్చంద్ర రాయిగారు వ్రాసిన వ్యాసం 1943 లోని (Hindu Superiority) అను దానిలో చూడుడు)

క్రీ.శ. 12వ శతాబ్దములో బెంగాలు రాజైన బళ్ళాల సేనుడు కైవర్తులు అను బెస్తవారికి ఉత్తమ కులమునిచ్చెను. క్రీ.శ. 17వ శతాబ్దములో జైసల్మెరు రాజగు అమరసింగు మహారాజుగారు తురకలైన భట్టే రాజపుత్రులందరినీ శుద్ధిచేసి హిందువులను చేసివేసెను. (Hindu Superiority)

మలబారు ప్రాంతములో పరశురాముడు శైవర్తాదులను బ్రాహ్మణులనుగా జేసెను (సహ్యాద్రి ఖండము)

తెనుగు దేశములో బెస్తవారు మున్నగు క్షుద్రజాతుల వారినుండి నియోగి బ్రాహ్మణులు కొందరు ఏర్పడిరి. (రాజరాజ నరేంద్ర సంచిక – చిలుకూరి వీరభద్రరావుగారి వ్యాసం)

ఈ విధముగా హిందువులలో ప్రతి శాఖలోను కులాల మార్పులు జరుగుచు వచ్చెను. తత్ఫలితంగా వర్ణాంతర వివాహాలు ప్రబలుతూ వచ్చెను. చరిత్ర పరిశోధనలు చేయువారికి అడుగడుగు కిట్టి విషయాలు గోచరించుచునే యున్నవి.

హిందూ ధర్మశాస్త్రమందు స్త్రీల స్థానము

ప్రాచీనము నుండియు హిందూ స్త్రీ చరిత్రయే హిందూ సంఘ చరిత్రయై యున్నది. స్త్రీ హక్కులు, బాధ్యతలెట్లెట్లు మారుచు వచ్చెనో అట్లట్లు సంఘముకూడా మారుచు వచ్చెను. హిందువుల "ధర్మ శాస్త్రము"లో స్త్రీకి సంబంధించని విషయములు లేనే లేవనవచ్చును. వివాహము, విభాగము, వారసత్వము,స్త్రీ ధనము, దత్తత, మున్నగు విషయములలో స్త్రీ స్థానమెట్టిదో గుర్తించవలెను.

పూర్వము వేదకాలమందు, స్మృతికాలమందు, తర్వాత నిబంధనకారుల కాలమందు అటు తర్వాత ముసల్మాను ప్రభువుల కాలమందు, మరియు నేడు బ్రిటిషు వారి సామ్రాజ్యములో స్త్రీ స్థానమెట్లుండుచు వచ్చెనో ఆ చరిత్ర యంతయు మనకిప్పుడవసరము లేదు. వేదకాలములో స్త్రీకి సంపూర్ణ స్వాతంత్ర్య ముండెననియు స్మృతి కాలములో స్త్రీ స్వాతంత్ర్యము సన్నగిల్లెననియు ముసల్మానుల కాలములో నిబంధనకారులు తమ కిష్టమువచ్చినట్లు శాసించిరనియు మనము గ్రహింపవచ్చును. బ్రిటిషు కోర్టులు మనదేశములో నెలకొనిన తర్వాత స్త్రీ హక్కులలో గల్గిన మార్పులే యిచ్చట చర్చనీయాంశములు.

ధర్మ శాస్త్రములు

హిందువులకు వర్తించు ధర్మశాస్త్రములలో బ్రిటిషు కోర్టులొప్పుకొనిన వానిలో ముఖ్యమైనవి, మనుస్మృతి, యాజ్ఞ వల్క్యస్మృతి. మనుస్మృతి శ్లోక మొక్కటి అన్నిటికి మూలాధారము.

శ్లో॥ "శృతి స్మృతి స్సదాచారః స్వస్వ
చ ప్రియ మాత్మనః

ఈ శ్లోక ప్రకారము "సదాచారము" ప్రధాన సూత్రమైనది. ఏ జిల్లాలో విశేష జనులచే నెట్టి పద్ధతి (రివాజు) యాదరింపబడునో అదియే సదాచారము దానిని కోర్టు వారొప్పుకొందురు. ఒకమారు సిద్ధించిన ఆచారము ఎన్ని శాస్త్రములకు విరుద్ధమైనను త్రిప్పబడజాలదు. "వచన శతేనాపివస్తు నాన్యథా కరణే శక్తిః" అను ప్రాచీన సిద్ధాంతమును బ్రిటిషు కోర్టు లొప్పుకొనినవి. అనగా ఒకమారు ఒక విషయము ఆచార సిద్ధమయ్యెనా దానికి విరుద్ధముగా నూరు శాస్త్రాధారములున్నను అంగీకరింపబడవు. ఈ సిద్ధాంతరీత్యా బిడ్డ కొడుకుల దత్తును, ఇల్లటమును అంగీకృతమయ్యెను. కావున బ్రిటిషు కోర్టులలో ఈ 40–50 ఏండ్ల నుండి కావింపబడిన హిందూశాస్త్ర సంబంధమగు తీర్మానములు సక్రమమైనవా యను సంశయము బాధింపక మానదు. ఇక స్త్రీ సమస్యను గురించి విచారింతుము.

మనువు స్త్రీ విషయములో చాలా అన్యాయము చేసినాడు. అయినను యాజ్ఞవల్క్యస్మృతిలో కొంత న్యాయము చూపింపబడెను. అదియు కాలము మారుకొలది జనుల కుపకరింపక పోయెను. అప్పుడు విజ్ఞానేశ్వరుడు అను మహాత్ముడు యాజ్ఞవల్క్య స్మృతిపై "మితాక్షర" వ్యాఖ్యానము వ్రాసి పుణ్యము కట్టుకొనెను. మన అదృష్టమువలన ఈ మితాక్షర న్యాయమే బ్రిటిషు కోర్టులలో వర్తించుచున్నది. విజ్ఞానేశ్వరుడు స్మృతిలోని మూల సూత్రమును ఆధారముగా నిమిత్త మాత్రముగా చేసికొని, దానిపై తన కాలములో నుండిన ఆచారములను, లేదా న్యాయముగా నుండవలసిన పద్ధతులను, విశదపరచి పెంచి వ్యాఖ్యానము చేసెను. మొత్తము హిందూ స్థానములో నిప్పుడు రెండు శాఖలేర్పడినవి. బెంగాలులో దాయ భాగమనియు తక్కిన దేశములో మితాక్షర అనియు, ధర్మ శాస్త్రము వర్తించుచున్నది. దాయ భాగముతో మనకిప్పుడవసరము లేదు. ఒక ముఖ్య సూత్రము మాత్రము గమనింపవచ్చును. దాయ భాగము ప్రకారము యజమాని చచ్చిన తర్వాత వారసుల కాతని యాస్తిపై హక్కు ఉత్పత్తి యగును; మితాక్షరములో యజమానికి కొడుకు పుట్టిన వెంటనే ఆ పుట్టిన వానికి ఆస్తిలో హక్కేర్పడును. ఇక మితాక్షర ప్రకారము బ్రిటిషు కోర్టులెట్లు స్త్రీల హక్కులను గురించి నిర్ణయించెనో విచారింతుము.

విభాగము

విభాగములో నించుమించు స్త్రీకి హక్కే లేదనవచ్చును. అవిభక్త కుటుంబము లోని స్త్రీకి ఎట్టి హక్కులును లేవనవచ్చును. ఒక సమిష్టి కుటుంబము విభజించు

కొనినప్పుడు, తల్లిదండ్రులు జీవించి యుండినచో వారిద్దరికిని పుత్రులతో సమానమగు భాగము దొరుకును. తల్లిదండ్రులనుటచే భర్తయున్నందున భార్యకు ప్రత్యేక భాగము లేదు. తండ్రి చనిపోయి తల్లి మాత్రమే జీవించియుండినచో నామెకు ఒక యంశ మీయవలెనని యాజ్ఞవల్క్యుడు సెలవిచ్చినాడు.

"పితూరూర్ధ్వం విభజితాం
మాతాప్యంశం సమం హరేత్"

కాని యీ భాగముపై ఆమెకు సంపూర్ణాధికారము లేదు. ఆమె దాని నిష్టము వచ్చినట్లు వ్యయము చేయజాలదు.

మరియు పెండ్లికాని బిడ్డకును, చెల్లెలికిని విభాగ సమయములో పురుషుని భాగములో నాల్గవ భాగము విధింపబడినది. కాని వివాహితలైన భగినీదుహితల కేమియు భాగములేదని మితాక్షరమందే శాసింపబడినది. అదే విధముగా నిరుడు బ్రిటిషిండియాలో తీర్పులు చేయబడినవి. కాని ఆచారములో నిట్లు వర్తించుట కనబడదు. పెండ్లికాని చెల్లెండ్రకు, బిడ్డలకు వివాహము చేయు బాధ్యత మాత్రమే యితర భాగస్థులపై యున్నది.

ఒక యజమాని పురుష సంతతి లేక చనిపోయినట్లైన, యతని భాగము మొదలు భార్యకును, తర్వాత బిడ్డకును, చెందునని యాజ్ఞ వల్క్యస్మృతి చెప్పుచున్నది. కాని బిడ్డల విషయమై మితాక్షరములో కొన్ని సూక్ష్మ భేదములు కల్పించినారు. పెండ్లియైన బిడ్డలకు మారుగా పెండ్లికాని బిడ్డలకే భాగమియ్యవలెననియు బిడ్డలందరికిని పెండ్లియైనట్లైన ధనికుల యింటికీయబడిన బిడ్డలకు మారుగా బీదల యింటికీయబడిన బిడ్డలకే యియ్యవలెననియు నిర్ణయించినారు.

స్త్రీ ధనము

స్త్రీ ధనమును 7–8 విధములుగా విభజించినారు.

1. పితృ మాతృ పతి భ్రాతృదత్తము

2. ఆధ్యగ్ని – పెండ్లివేళ మామ మున్నగు వారిచ్చినది.

3. ఆధివేధనికము – భర్త రెండవ భార్యను చేసికొనినప్పుడు మొదటి భార్య కోదార్పుగా నిచ్చుకొనిన ధనము. యాజ్ఞవల్క్యుడు పైవి శాసించుచు "ఆద్యం"

ఇత్యాదులు అన్నాడు. ఇంతమాత్రమాధారము విజ్ఞానేశ్వరునికి దొరికిన చాలును; "ఆద్యం" లో యివన్నియు చేరినవన్నాడు -

1. ఆధ్యావాహనికం - అత్తగారింటికి వధువును తీసికొని పోవునప్పుడిచ్చు ధనము.

2. ప్రీతిదత్తం - బంధువులచేత, భర్తచేత ప్రీతితో నప్పుడిచ్చునది.

3. పాదవందనికం - పెండ్లిలో పెద్దలకు నమస్కారము చేసినప్పుడిచ్చినది.

4. సౌదాయికం - కన్యకనైనను, వివాహితకైనను, ప్రతి యింటిలోగాని, తండ్రి యింటిలో గాని యియ్యబడినది.

ఇవన్నియు ఎన్ని కలిగినను చిల్లర బాబతువే ఇట్టి స్త్రీ ధనము పైనను కొన్ని సమయములలో భర్తకధికారమిచ్చినారు.

దత్త స్వీకారము

ప్రాచీనములో 72 విధముల పుత్రులను శాస్త్రకారులంగీకరించిరి. ఇప్పుడు ప్రధానులు ఔరసుడు, దత్తుడు, పుత్రీపుత్రకుడు దౌహిత్ర బాధ్యతలో వచ్చును. కృత్రిముడనువాడు మాళవదేశములో మాత్రమే. ధ్యాముష్యాయనుని ప్రశంస అరుదుగా వచ్చును తక్కిన కానీన, గూఢోత్పన్న, పౌనర్భవః కుండగోళకాదు లిప్పుడు లేరు.

సంతానంలేని వితంతువునకు దత్తస్వీకార విషయముతో నొక్కొక్క రాష్ట్రములో నొక్కొక్క విధముగు తీర్పును బ్రిటిషు హైకోర్టులు చెప్పియున్నవి. వశిష్ఠ స్మృతిలో పత్యాజ్ఞలేనిది భార్యకు దత్తస్వీకారాధికారము లేదనియున్నది. కాని మిథిలలో వితంతువున కేవిధముగా గూడ దత్త స్వీకారాధికారము లేదు, చనిపోయినపుడు భర్త ఆజ్ఞ యిచ్చినను వితంతువున కధికారములేదట - కాశియందును, వంగదేశమందును భర్త ఆజ్ఞ యుండినచో అధికారము కలుగును. మద్రాసులో భర్తగాని, అతడు లేనిచో సపిండులుగాని యంగీకరింపవలెను. బొంబాయిలో భర్త తన జీవితకాలమందు ప్రత్యేకముగా నిషేధించిననే తప్ప వితంతువునకు అధికార మిచ్చినారు.

పూర్వము స్త్రీలను దత్తు తీసుకొనుచుండిరని పురాణ ప్రమాణములు కలవు. నంద పండితుడు తన "దత్తక మీమాంసము"లో రోమపాదుడు 'శాంత' అను బాలికను దత్తుగా తీసికొనెననియు, వధ్రీమతి యనువాడు 'హిరణ హస్త' యను బాలికను

దత్తుగా స్వీకరించె ననియు రామాయణాది పురాణ ప్రమాణములనిచ్చి విపులముగా నీ విషయమును సమర్థించినాడు. దత్తు విషయములో నీ గ్రంథము ముఖ్య ప్రమాణము. కాని, బ్రిటిషు కోర్టులలో నిప్పుడు స్త్రీలను దత్తుగా నంగీకరించుటలేదు.

వ్యవహారములు

స్త్రీలు చేయు వ్యవహారములు (కంట్రాక్టులు –మొఅహిదాలు) సాధారణముగా చెల్లవు. కారణమేమన "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అని మనువు శాసించి యుండలేదా? యాజ్ఞవల్క్యుడు భార్యకు, బిడ్డలకు వారసత్వపు హక్కులిచ్చినను, అట్టి వారసత్వము వలన వచ్చిన ధనముపై స్త్రీలకు సంపూర్ణాధికారము లేనట్లుగా వారు స్థిరాస్థులను ట్రాన్స్ఫర్ చేయజాలనట్లుగను, అట్టి వ్యవహారములు చెల్లనేరనట్లుగను హైకోర్టులు తీర్మానించెను. ఒక బొంబాయి రాష్ట్రములో మాత్రమే స్త్రీ వ్యవహారముల సాధుత్వము నంగీకరించెను.

కొన్ని చిల్లర సందర్భములలో స్త్రీ తనకు సంక్రమించిన ఆస్తిలో చాలా కొద్ది అంశమును మాత్రమే అమ్మవచ్చునని తుదకంగీకరింపబడినది. ఆ యంగీకరణము కూడ తల తోక లేని పద్ధతిగా నున్నది. గయకు తీర్థ యాత్రకైపోయిన దాని నంగీకరింతురట! కాని కాశీ యేమి పాపము చేసినదో; కాశీకి పోయిన ఖర్చుల నంగీకరింపరట! చెరువులు, సత్రములు కట్టించుట అంగీకరింపరట!

ప్రత్యేక శాసనములు

బ్రిటిషిండియాలో స్త్రీల సంబంధమగు కొన్ని ప్రత్యేక శాసనములు కావింప బడినవి. అవి మాత్రము విశేషముగా స్త్రీలకు సహాయపడిన వనవచ్చును.

క్రీ.శ. 1856లో వితంతూద్వాహ శాసనము కావించిరి. దాని ద్వారా యువతులైన వితంతువులు తమ యిష్టముతో వివాహము చేసుకొని అట్టి వైవాహిక ధర్మముచే సంతానము కనినచో, ఆ సంతానమునకు తల్లిదండ్రుల యాస్తిపై అధికారముండునని శాసింపబడెను. యిది చాలా న్యాయబద్ధమైన శాసనము. యిట్టి శాసనము పుట్టిన సుమారు 80 ఏండ్ల తర్వాత కూడ నిజాము రాష్ట్రములో నిట్టి శాసనము కావించుటకు ఆటంకములు కలుగుచున్నవి!

ఈ శాసనాత్పుర్వమే క్రీ.శ. 1829లో సహగమన నిషేధ శాసనము గావింపబడెను. దానివలన బలవంతముగా భార్యలను భర్తలు చితులపై కట్టి కాల్చునట్టి ఘోరమును, నమానుషమును నగు ఆచారము ఆపి వేయబడెను.

క్రీ.శ. 1850లో మత స్వాతంత్ర్య శాసనము (Caste Disabilities Removal Act) కావింపబడెను. ఇది మాత్రము హిందువులకు చాల నష్టదాయకమే! ఇది క్రైస్తవులకు చాలా లాభదాయక మయ్యెను. హిందూ భర్త క్రైస్తవుడైన, వాడు భార్యను వదలి యింకొకతెను వివాహము చేసికొనవచ్చును, లేకున్నచో భార్యకూడ క్రైస్తవ మత స్వీకార మొందవలెను. ధర్మశాస్త్ర ప్రకారము మత భ్రష్టుడు పతితుడు. పతితునికి ఆస్తిలో భాగము లేదు. కాని యీ మత స్వాతంత్ర్య శాసనము ప్రాత శాసనమును ఖండించివైచి వానికి ఆస్తిలో భాగమిప్పించెను. అట్టి పతితుడు హిందువులకు చచ్చిన వానితో సమానుడు. ఒక వితంతువున కొకే కొడుకుండి వాడు క్రైస్తవుడైనచో వాడామెకుత్తరోత్తర కర్మాదులకు చచ్చినవాడే! అట్టిచో ఆమె యింకొకని దత్తు తీసుకొన వచ్చునా! కూడదని తీర్పులయ్యెను.

ఇటీవలనే, బాల్య వివాహ నిరోధక శాసనము గావింపబడినది. ఇది లాభకారియే; కాని మన రాష్ట్రములో కూడ నిట్టి శాసనము లేనందున బ్రిటిషిండియాలో పై శాసన ధిక్కారుల కిది శరణ్యమైన పుణ్యభూమియై పోయినది.

వైవాహిక శాసనములు

బ్రిటిషిండియాలో కూడ సివిల్ మ్యారేజ్ శాసనము లేదుకాని బరోడా రాజ్యములో 1908లోను, ఇందూరు రాజ్యములో 1916లోను, కొల్లాపూరులోను, మరికొన్ని యితర దేశీయ సంస్థానములలోను సివిల్ మ్యారేజ్ శాసనములు గావించిరి; అనగా వివిధ మతములకు చేరిన స్త్రీ పురుషులు వివాహము చేసికొనుట కంగీకరింప బడినది. బ్రిటిషిండియలో నిట్టి శాసనము లేకున్నను 1832లో స్పెషల్ మ్యారేజ్ శాసనము (హిందూ, బౌద్ధ సిక్కు, జైనుల కొరకు) గావింపబడెను. తద్వారా వివిధ మతముల స్త్రీ పురుషుల వివాహము కొన్ని నియమములతో నంగీకరింపబడెను.

మన రాష్ట్రములో నీరెంటిలో నొక శాసనమైనను లేదు. పూర్వము అష్టవిధ వివాహములను శాస్త్రకారులంగీకరించిరి. ఇప్పుడు బ్రిటిషిండియాలోనేమి రెండు విధముల వివాహములే యంగీకరింపబడినవి.

వివాహితయైన హిందూ స్త్రీ సాధారణముగా యజమానుని చరాస్థివలె చూడబడినను బాధకము లేనిస్థితి యేర్పడినది. ఎట్టి కారణము లేకయే, భర్త భార్యను వదలి వేయవచ్చును. లేక భర్త యెందరినైనా వివాహమాడవచ్చును. అట్టి

సందర్భములలో భార్యకు విడాకులు పొందు (Divorce) అధికారము లేదు. రెండవ వివాహము చేసుకొనకుండ భర్తను నిరోధించు (injunction) అధికారమును లేదు. ఏమైనను భరణార్థము దావాచేసి, కోర్టువారనుగ్రహించి డిక్రీ యిచ్చిన తృణమునకో పణమునకో మాత్రము ఆమె యధికారి. ఆమెకు రెండవ వివాహమున కధికారము లేదు, మరి భర్త ఆస్తిలో భాగమడుగుట కధికారము లేదు.

కాని భార్య నకారణముగానైనను, నిష్కారణముగానైనను భర్తతో నుండుట కంగీకరింపని యెడల భర్తకు (Restitution of conjugal rights) ఆమెను పూర్తిగా స్వాధీన పెట్టుకొనుట కధికారము కలదు. మొదలు మొదలు బ్రిటిషు కోర్టులో భార్యను స్వాధీనము చేయు డిక్రీనిచ్చి, దాని తామీలులో భార్యను పట్టి (arrest) భర్తకిప్పుంచుచుండిరి. ఒక బొంబాయి కేసులో (44 బొంబాయి 932) నీ విషయమున న్యాయాధిపతి తీవ్రముగా ఖండించెను. క్రమేణా కోర్టు వారది మొరటుపని యని కాఠిన్యము తగ్గించుచు వచ్చిరి. తుదకు 1923 సం॥ 26వ శాసనము ప్రకారము అరెస్టు పద్ధతి తీసివేయబడెను.

సూచనలు

ఇంతవరకే విషయ బాహుళ్యమైనది. పై యంశములను గమనించి చూచిన ఈ కాలములో పూర్వపు ఋషుల స్థానమును హైకోర్టు జడ్జీలు, ప్రీవీ కౌన్సిలు మెంబర్లు వహించినారు.

"శృత యశ్చభిన్నాః ఋషయశ్చభిన్నాః
నైకోమ నిర్యస్యమతం విభిన్నం"

అన్న రీతిగా కోర్టు ఋషులలో గూడ భిన్నాభిప్రాయము లేర్పడినవి. మొత్తముపై హిందువులకు ప్రాచీనకాలములో (అనగా రెండు మూడువేల యేండ్ల నాడు) మనువు మున్నగు ఋషులు వ్రాసిన శాస్త్రములనే హిందువులకు అంటగట్టి తీరుదుమన్న పట్టుదల వీరికి మెండుగా కనబడుచున్నది. ఇంగ్లీషు వారికి "ఈక్విటీ" అను "లా" కలదు. అట్టి దానినైనను క్లిష్టమగు కేసులలో వర్తింప జేయవలసి యుండెను.

మన రాష్ట్రములో కావలసిన హిందూశాస్త్ర మం ఏలి మార్పులనిక సూచింతును.

1. బ్రిటిషిండియాలో 1930 సంవత్సరములో వారసత్వపు సిల్సిలాలో తండ్రి తండ్రికి పూర్వము కొడుకు బిడ్డ, బిడ్డ బిడ్డ, సోదరి, ఆమె కుమారులు క్రమక్రమముగా వారసులగునట్లు శాసించిరి. అది మనకు లేకపోయినది.

2. వితంతువునకు వారసత్వ రీత్యా సంక్రమించిన ఆస్తిపై ఆమెకు సంపూర్ణాధికారము లేదు (Limited estate). ఈ యన్యాయమును తొలగించుటకై శాసనము కావలెను.

3. అనులోమ వివాహములు శాస్త్ర సమ్మతములు, ప్రతిలోమ వివాహములు అట్లు కావని నిర్ణయించిరి. ఈ శాసనములు చేసినవారు పూర్వములో చాల సంఘ దౌర్జన్యము చేసినవారు.

ఉత్తమ జాతులవారు తమకన్న తక్కువ జాతి స్త్రీలను పొందవచ్చునట కాని తమ స్త్రీలను తక్కువ జాతి పురుషులు పొందకూడదట. కామములో కూడా (ఇతర విషయములందువలె) వారు శాశ్వతపు గుత్తా తీసికొనిరి; ఇప్పుడు ప్రతిలోమ వివాహములు అందందు జరుగుచున్నవి. అవి సక్రమమైనవే (Valid) అని నిర్ణయము కావలెను.

4. పిచ్చివాడును, మెదడులేని వాడు (Idiot, Lunatic) చేసుకొనిన వివాహములు చెల్లునట! ఇట్లు బ్రిటిషిండియాలో తీర్పులయ్యెను. శాస్త్రప్రకారము వివాహములో కన్యను "దానము" చేయుదురు. ఈ దానమును వరుడు "ప్రతి గృహీత"గా గ్రహించవలెను. పిచ్చివాడు, మెదడు లేనివా డీపని చేయగలరా! మనువుకూడ,

"ఉన్మత్తం పతితం క్లీబమ
బీజం పాప రోగిణం
సత్యాగోస్తి దిషంత్యాశ్చ
నచదయాస వర్తనం"

ఉన్మత్త నపుంసకాది భర్తల ద్వేషించిన స్త్రీలను ఇంటినుండి వెళ్ళకూడదనినాడు. అట్టి స్త్రీల వివాహము దాన గ్రహణ లోపముచేతను, నపుంసకునికి సంభోగమున కవసరమగుట చేతను రద్దు కావింపదగినవిగా నిర్ణయింపబడవలెను.

5. హిందూ స్త్రీకి కొన్ని సందర్భములలో విడాకులు (Divorce) అవసరమగుచున్నది. భర్తయొక్క అమానుష కృత్యముల చేతగాని, మరియెట్టి యితర హింసాదుల చేతగాని ఆమెకు అవసరమగుచున్నది. కాని చిల్లర జాతులనుబడు వారిలో నొప్పుకొనిన విడాకుల పద్ధతిని పై వర్ణ స్త్రీల కంగీకరించుట లేదు.

ఎట్లన

(అ) నపుంసకుని భార్య యేమి చేయవలెను. రెండవ వివాహము, లేదా వ్యభిచారము, లేదా ఆమరణ బ్రహ్మచర్యము. ఇవియే ఆమెకు శరణ్యము

(ఆ) భర్త మతాంతరుడైనప్పుడు మాత్రము ఆమెకు రెండవ వివాహమును కోర్టులు అంగీకరించినవి.

(ఇ) పూర్వము వియోగముండెడిది. ఇప్పటికి అది ఒరిస్సాలో మాత్రము ఆచారముగా నున్నది. కాని దానిని కోర్టు వారంగీకరించారు. కాని దానిని కుష్ఠ రోగాదులచే బాధపడునట్టి భర్తలయొక్క భార్యలకు విడాకుల అధికారముండవలెను.

(ఈ) ఒక స్త్రీని బలవంతముగాగాని, మోసముచే గాని (force or fraud) వివాహమాడిన ఆ వివాహము చెల్లదని కోర్టులు నిర్ణయించినవి. కాని సంఘ మొప్పుకొనకపోయెను. ఇది సంఘము యొక్క దౌర్జన్య నిదర్శనము.

(ఉ) సగోత్ర స్త్రీనిగాని, వరుసగాని స్త్రీనిగాని (Prohibited degree) వివాహమాడిన ఆ వివాహము చెల్లదట. చెల్లనప్పుడు పురుషుడు రెండవ వివాహ మాడవచ్చునట, కాని భార్య అట్లే యుండవలెనట. భార్య భరణార్థమునకే యధికారియట. ఇది చాలా అన్యాయము. ఇట్టి ఒక బెంగాలు కేసులో న్యాయాధికారిట్లు సెలవిచ్చిరి. ఆ స్త్రీ ప్రతివాదితో వ్యభిచారిణిగా నుండవచ్చును. డైవర్సు (విడాకులు) లేనందున విడాకులు పొందగోరు స్త్రీలకు ఒక మార్గము మాత్రము దొరకుచున్నది. ఆ స్త్రీ హిందూమతమును వదలి ముసల్మాను లేక క్రైస్తవ స్త్రీయైన ఆమెకు రెండవ మతము ప్రకరాము వేరు భర్తను వివాహమాడుట కవకాశమున్నది. ఒక కేసులో నొక హిందూ స్త్రీ ముసల్మానై రెండవ వివాహమాడినా ఆమెకు హిందూమతమింక వర్తింపనందున ఆమె చేసిన దానిలో తప్పులేదని నిర్ణయించిరి. మరియు మన రాష్ట్రములో సివిల్ మ్యారేజి శాసనముగాని, స్పెషల్ మ్యారేజి శాసనముగాని లేనందున హిందువులు సికిందరాబాదులో 21 దినములు నివాసము చేసి పెండ్లి చేసికొని వచ్చిన మన రాష్ట్రములో కూడ అవి చెల్లును. (వివాహము అంతర్జాతీయ శాసనము (international law) లో చేరినది, కాని ఏ దేశమందే పద్ధతులున్నవో ఆ పద్ధతులు లేకున్నను చెల్లవలసి యుండును.)

కావున మన రాష్ట్రములో సివిల్ మ్యారేజి శాసనము చేసిన తప్పు కాజాలదు. ఇట్టి యవకతవక లెన్నియేని మన నేటి 'హిందూలా"లో ఏర్పడుచున్నవి. హిందూ సంఘమువారు ఇట్టి సమస్యలపై శాంతబుద్ధితో, సమబుద్ధితో దూరదృష్టితో, ఆధునిక పరిస్థితులను దృష్టి పథమున నుంచుకొని ఆలోచించి ఆందోళనము చేసి, మార్పులు గావించి, తమ సంఘమునను, తమ స్త్రీలను వారి గౌరవమును తమ గౌరవమును సంరక్షించుకొందురని యుద్బోధించుచున్నాను.

ఆయుర్వేదము

"ధర్మార్థకామ మోక్షాణాం
ఆరోగ్యం మూలకారణం"
"సర్వమన్యత్పరిత్యజ్య శరీరమనుపాలయేత్"

ఆర్యులారా!

నన్నీ మహాసభకు అధ్యక్షునిగా ఎన్నుకొనినందులకు కృతజ్ఞుడను. నేను వైద్యుడను కానని మొదలే మనని చేసుకొనుచున్నాను. అయితే వైద్య మహాసభ కధ్యక్షుడనగుట కేమికారణమని విచారింపవచ్చును. అది నాకు మాత్రము తెలియదు. ఆహ్వాన సంఘము వారేకగ్రీవముగా తీర్మానించి నన్ను అంగీకరించుటకై ప్రోద్బలము చేసినది మాత్రమే నాకు తెలియును. ఏది యెట్లున్నను నేను ఆయుర్వేదమం దత్యంతాభిమానము కలవాడ నగుటచేతను చారిత్రక విమర్శనమందు ఒక విద్యార్థి నగుటచేతను, ప్రపంచమందంతటను అత్యంత ప్రాచీనమైనదియును, ఉత్కృష్టమైనది యును, రాజులకే కాక బీదలకును సులభముగా లభ్యమైనదియును నేటి ప్రపంచములో నుండునట్టి యూనానీ, అలోపతిక్ వంటి వైద్యముల కన్నింటికిని మాతృస్థాన మైనట్టిదియునగు ఆయుర్వేద వైద్యమును గురించి నాకును కొంత కొంతయైనను మాట్లాడుటకు స్వత్వము కలదని తలచుచున్నాను.

పాశ్చాత్యులకు అందు ముఖ్యముగా - ఇంగ్లీషు వారికి గ్రీకులు (యవనులు) అనిన చాలా అభిమానము. గ్రీకులే యావద్యూరపు ఖండమునకు జ్ఞానభిక్ష పెట్టిన వారని వారి యభిప్రాయము. కాని యీ గ్రీకులకు మొదలు జ్ఞానభిక్ష పెట్టిన హిందూస్థానపు హిందూ బౌద్ధులనెవ్వరును స్మరింపరు. గ్రీకుల రేఖా గణితమునకు మూలము హిందూ శాస్త్రములే! అదే విధముగా గ్రీసుదేశమందు బౌద్ధులచే మత

ప్రచారము బాగుగా గావింపబడెను. గ్రీసుదేశములో క్రీస్తునకు 450 సంవత్సరముల పూర్వమందుండిన హిపోక్రటీసు అనునతడు "వైద్యపితామహుడు" (Father of medicine) గా పరిగణింపబడెను. ఈ హిప్పాక్రటీసు స్వయముగా భారతదేశమునకు వచ్చి ఆయుర్వేదవైద్యము నభ్యసించి తిరుగా తన దేశమునకు వెళ్ళి వైద్యమందు మహా ప్రసిద్ధుడయ్యెను. అలెగ్జాండరు క్రీ.పూ. 330సం. ప్రాంతములో హిందూస్థానముపై దండెత్తి వచ్చినపుడు హిందువుల నాగరికతను వారి యద్వితీయ శాస్త్ర ప్రతిభనుగాంచి దిగ్భ్రమ జెందెను. అతడు తన గుడారములలో హిందూ వైద్యులనే గ్రీకు వైద్యుల చేతగానట్టి జాడ్యముల చికిత్సలకై నియోగించెను.

ఈజిప్టు దేశము (మిశ్రదేశము) లో ఇమోతెవప్ (Imothep) అను నతడత్యంత ప్రాచీన కాలములో (God of Healing) వైద్యనాథుడుగా ప్రఖ్యాతుడయ్యెను. ఇతడును ఆయుర్వేదమును అభ్యసించినందునే యట్టి ఖ్యాతిని గాంచగలిగెను.

హిందువులకు అత్యంతముగా బాకీపడిన జాతులలో ముఖ్యమైనట్టిది అరబ్బీ జాతి. అరబ్బీ స్థానములో ఇస్లాం మతము వ్యాప్తినొందిన తర్వాత అరబ్బులందు జ్ఞాన దృష్టి యతిశయించెను. అట్టి పిపాసులను జ్ఞాన దాన ధారలందు నోలలాడించినది భారతీయార్యులు. అరబ్బులు హిందువులనుండి గణిత శాస్త్రములను, జ్యోతిశ్శాస్త్రమును నేర్చుకొనుటయే గాక ఆయుర్వేద వైద్యమును పూర్తిగా నేర్చుకొనినట్లు అరబ్బులచేతనే వ్రాయబడిన చారిత్రకాధారములు కలవు. కితాబుల్ హెఫిరిస్త్ అను గ్రంథమును నదీం అను మౌల్వీ క్రీ.శ. 950 లో వ్రాసెను. అందు అరబ్బీ భాషలోనికి హిందూ వైద్యశాస్త్రములు మన్సూర్ ఖలీఫా కాలమునుండి మామూన్ ఖలీఫా కాలము వరకును (750-850 క్రీ.శ.) అనువదింపబడెనని వ్రాసినారు. మరియు క్రీ.శ. 1300 ప్రాంతములో నుండిన హాజీఖలీఫా అను పండితుడును అరబ్బులు హిందువులవద్ద వైద్యశాస్త్రముల నభ్యసించిరని అంగీకరించియున్నాడు. ఈ అరబ్బుల ద్వారానే యూరోపు ఖండమంతటను ఆయుర్వేదౌషధ పద్ధతులు విశేషముగా వ్యాపించిపోయెను. ఖలీఫా హారూరుల్ రషీద్ అరేబియన్ నైట్సు కథలకు కారకుడని మాత్రము జగత్తులో ప్రసిద్ధిగాంచెను. కాని యతడే ఆయుర్వేద వ్యాప్తికిని ముఖ్యకారకుడని ప్రపంచ మంతగా నెరుగదు. ఈ ఖలీఫాకు ఒకతతడవ గొప్ప జాడ్యము సంభవింప తన యాస్థానపు

హాకీములచే కుదిరింపరానిది కాగా "మంఖుడు" అను హిందువు అతనికి చికిత్సచేసి బాగుచేయగలిగెను. అటుతర్వాత ఈ మంఖుడు రాజ వైద్యశాలకు (Royal Hospital) ప్రధానాధికారిగా నేర్పాటు చేయబడెను. ఈ మంఖుడే సుశ్రుతమును అరబీభాషలోనికి పరివర్తనము చేసెను. ఇతనివంటి పండితులెందరో ప్రీతి పూర్వకముగా ఖలీఫాలచే ఆహ్వానింపబడి వారి యాస్థానమందు గౌరవింపబడుచుండిరి. వాగ్భటము క్రీ.శ 8 వ శతాబ్దములో అరబీలోనికి అనువదింపబడెను.

ఈనాడు భారతీయులు తమ విద్యాభ్యాసము ముగిసిన తర్వాత అధిక జ్ఞానార్జనార్థమై ఇంగ్లాండు దేశమున కెట్లేగుదురో ప్రాచీనకాలములో అరేబియా నుండి, బాగ్దాదునుండి, గ్రీసునుండి, పర్ష్యానుండి, చీనానుండి, కాంబోడియా నుండి, జావా (యవ), బోర్నియో, సుమిత్రా ద్వీపములనుండి విద్యార్థులును, పండితులును భారతభూమిలో కొంతకాలము నివసించి జ్ఞానార్జనము చేసుకొని వెళ్ళుచుండిరి. విజయనగర సామ్రాజ్య కాలములో ఆంధ్రులు వైద్యశాస్త్రమును అపారముగా వృద్ధిపరచియుండిరి. అట్టి యాంధ్రులవద్ద వైద్య విద్యాభ్యాసము చేయుటకై అరబ్బులనేకులు వచ్చియుండినది సులేమాన్ అను అరబ్బు వర్తకుడు కన్నులార చూచి వ్రాసియున్నాడు.

మహమ్మద్ ఘజనీ 17 మారులు హిందూస్థానముపై దండెత్తి వచ్చి ఎదుటపడిన వారిని చంపి, దొరికినదంతయు దోచుకొని పోయినవార్త చరిత్రలో వ్రాసిరి కాని అతడు హిందూ శిల్పులను, పండితులను, వైద్యులను బలవంతముగా పట్టుకొని తన వెంట తీసుకొనిపోయి తన దేశములో నిలిపిన విషయము చరిత్రల కెక్కకపోయెను.

చీనా దేశమునుండి మనదేశమునకు వచ్చిన హ్యూన్‌సాంగ్ మున్నగు యాత్రికుల పేరులు సుప్రసిద్ధమే కాని వారివలెనే చీనాకు దక్షిణాపథమందలి కాంచీనగరమునుండి క్రీ.శ. 648 లో వెళ్ళిన నారాయణస్వామి అను బౌద్ధ వైద్యుని పేరెవ్వరునుఎరుగరు. అతడు తన మాతృదేశమునకు వచ్చి మరల రెండవమారు చీనాకు క్రీ.శ. 657 లో వెళ్ళెనని ఇటీవలనే గంగూలీగారు పరిశోధించి వ్రాసిరి. ఇదేవిధముగా క్రీ.శ. 665లో "లోకాదిత్యుడు" అను వైద్యుడు చీనాకు వెళ్ళెను. ఈ యిరువురును దీర్ఘాయుష్యమును నిచ్చు నౌషధములను కనిపెట్టుటకై చీనాకు వెళ్ళినట్లు తెలిసెడి పై యిరువురును ఆంధ్రులేనో యేమో!

క్రీస్తు శకారంభమందుండిన సుప్రసిద్ధుడగు నాగార్జునుడు ఆంధ్రబౌద్ధుడు. అతడు యావద్భారతమందు అద్వితీయుడని ప్రతీతిగాంచిన పండిత ప్రకాండుడు. మంత్రశాస్త్రములో అతనిదే పేరు. వైద్యములో నతడు ప్రచండుడని భారతదేశమందే కాక చీనాదేశమందును కీర్తి వ్యాపించి పోయెను. చీనావారతని వైద్య గ్రంథములను తమ భాషలోనికి (క్రీ.శ. 589, 618లో) తర్జుమా చేసుకొనిరి. నాగ, అర్జున, అను పదములకు సమానార్థములనిచ్చు లూంగ్‌షూ (అనగా ఏనుగు వృక్షము) అను పదముచే నీతని సంభోధించిరి. తాంత్రికుల రసవాదమునుగూడ చీనావారు "చిపో" (శివ) ప్రోక్తమగు వైద్యము" అనుపేరుతో గ్రహించిరి.

ఇట్లు పడమట యవన (గ్రీసు) ద్వీపము వరకును తూర్పున యవ (జావా) ద్వీపము వరకును ఉత్తరమున చీనా సామ్రాజ్యము వరకును ఆయుర్వేద వైద్యము తన చల్లని చంద్రికల వ్యాపింపజేసి తమోనాశనమును గావించి ప్రపంచ కల్యాణమున కత్యంతముగా తోడ్పడెను.

ఆయుర్వేదమేనాడు సృష్టిచెందెను? అను ప్రశ్నకు సమాధానమిచ్చుట కష్టము. ఏలన ఋగ్వేదమందే ఆయుర్వేద వైద్య ప్రశంసలు కలవు. అశ్వినీ దేవతలు నానావిధ చికిత్సలు చేయుచుండినట్లు వర్ణనలు వేదములందు గలవు. మరియు ఆయుర్వేదము ఋగ్వేదముయొక్క యుపాంగముగా పరిగణింపబడి యున్నది. ఎందరో ఋషులు వైద్యాభివృద్ధికి తోడ్పడి పరిశోధనలు చేసి నూతన చికిత్సను వ్యాప్తిలోనికి తెచ్చిరి. తర్వాత ధన్వంతరియనువారు దేవదానవుల యమృత మథనమందు అమృత కలశ హస్తుడై పాలసముద్రమం దుద్భవించెనని భాగవత పురాణము చెప్పుచున్నది. ఈ ధన్వంతరి ఆయుర్వేదమునకు ప్రధానులలో నొకరని మాత్రము చారిత్రకులును అంగీకరింతురు. కాని వీరి కాలమును నిర్ణయించుట కష్టము. కొందరి చరిత్రకారుల యభిప్రాయమున సుశ్రుతుడు ఈ ధన్వంతరికి శిష్యుడు. ఆయుర్వేదములో ధన్వంతరికి పిమ్మట చరకునికిని, సుశ్రుతునికిని అగ్రస్థానము నిచ్చియున్నారు. ఆయుర్వేదములో ప్రత్యేకాభిమానముతో పరిశోధనలు చేసినట్టి కెప్టన్ జాన్‌సన్ సెయింట్ అను పండితుడు చరక సుశ్రుతులను గూర్చి యిట్లు సెలవిచ్చెను.

"బహుశా వీరు క్రీస్తుకు పూర్వమే 2000 ఏండ్లనాటి (B.C.) వారేమో! వీరి యనంతరము యెన్నియో శతాబ్దముల తర్వాత నుండిన యూరపు ఖండ వైద్యులు

జాడ్య చికిత్సలకు మంత్రతంత్ర ప్రయోగములను చేసి మూర్ఖ విశ్వాసములకు లోనై యుండగా ఈ చరక సుశ్రుతులు తమ తమ గ్రంథములలో అట్టి వాని కేమియు తావీయక యుత్తమ పరిజ్ఞానముతో కూడిన వైద్యమును ప్రపంచమున కర్పించిరి"

"The knowledge they displayed in their works is amazingly orthodox in view of modern research and was singualarly free from the superstition and magic, two heresies which characterised the writings of the European so called physicians many centuries after-wards".

మరికొందరి యభిప్రాయమున చరకుడు క్రీ.పూ. 600 ఏండ్లనాడును, సుశ్రుతుడు క్రీ.శ. 100 ఏండ్లనాడును నుండిరని నిర్ణయింపబడినది. వీరిరువురు పాంచాల (పంజాబు) వాసులనియు చారిత్రకులు నిర్ణయించినారు. వీరి తర్వాత ప్రసిద్ధిగన్న వారిలో సింధు ప్రాంతీయుడైన వాగ్భటుడును (క్రీ.శ. 700) రాజపుత్రస్థానీయుడగు శార్ఙ్గధరుడును (క్రీ.శ. 1350) విజయనగర సామ్రాజ్యమందుండిన విష్ణుదేవుడును (క్రీ.శ. 1350) ముఖ్యముగా పేర్కొనతగినవారు.

అశోక చక్రవర్తి కాలమునకు పూర్వమే (క్రీ.పూర్వము మూడు శతాబ్దములకు ముందే) భారతదేశములో మనుష్యులకేకాక జంతువులకు సహితము వైద్యాలయము లుండెను. ప్రపంచములో మొట్టమొదట ప్రజోపయోగార్థమై ఉచిత వైద్యాలయములు భారతదేశమందే హిందువులచేతనే స్థాపింపబడెను. ఏనాడు హిందూస్థానములో పశువులకును వైద్యాలయములుండెనో ఆనాడు యూరోపులోని రోము, గ్రీసు దేశములుతప్ప తక్కిన దేశములం దంతటను జనులు అర్ధనగ్నులై, మొరటువారై, పశుప్రాయులై, సంచరించుచుండిరి. యూరోపు దేశములో మొట్టమొదటి ఆసుపత్రి (Hospital) క్రీస్తుశకము నాల్గవ శతాబ్దమందు కాన్‌స్టంటైన్ పోపుకాలములో స్థాపింపబడెను.

శస్త్రచికిత్సను (Surgery) మనవారు శల్యతంత్రమనిరి! దీనిని కనిపెట్టినది మొట్టమొదటివారు హిందువులే. సుశ్రుతుడు గొప్ప శల్యతంత్రవేత్త. మన వైద్యములో 127 చికిత్సా శస్త్రములను బేర్కొనియున్నారు. క్రీస్తు శకారంభమువరకే శల్యశాస్త్రము పరిణతి నొందియుండెను. భారత యుద్ధమునాటికే యాశల్యతంత్రము సుప్రతిష్ఠితమై యుండెననిన తప్పుకానేరదు. కాని బ్రాహ్మణులలో వర్ణాశ్రమాచారములు

ముదిరినప్పటినుండియు బౌద్ధుల యహింసా సిద్ధాంతము వ్యాపించిపోయిన నాటినుండియు నీ శల్యతంత్రము మూలబడిపోయెను.

పాదరసమును ఔషధముగా సేవించుటను మొట్టమొదట కనిపెట్టినది హిందువులే. పాదరసమును ఇతర లోహములను కడుపులోనికి మందుగానిచ్చు హిందువుల పద్ధతులను అరబ్బులుచూచి అబ్బురపడిరి.

త్రిఫలములను గ్రీకులు అమాంతముగా త్రిపర (Tryphara Parva) అను పేరుతో తమ వైద్యములోని కెక్కించికొనిరి.

హిందూ రసాయనశాస్త్రమును క్రీ.శ. 800 ప్రాంతమందుండిన అరబ్బీయుడగు గెబిర్ అనువాడు బాగుగా సాధించెను. హిందువుల సజ్జక్షారమును లేక సజ్జమితిని (Carbonate of soda) సజిమన్‌విత్రి అని పేరిడెను.

క్రీ.శ. 1374 లో వ్రాయబడిన మదనపాల నిఘంటులో సత్తును (zinc) ఒక ప్రత్యేక లోహముగా పేర్కొనియున్నారు. ఈ గ్రంథము వ్రాసిన 200 ఏండ్ల తర్వాత పుట్టిన పారాసెల్సస్ (paracelsus) అను యూరోపియన్ ఈ లోహమును మొట్టమొదట కనిపెట్టెనని పాశ్చాత్యులు పొగడజొచ్చిరి.

ఇట్లు ఇంచుమించు 4000 ఏండ్లనుండి ఆయుర్వేదవైద్యము ప్రపంచమందు – అందు ముఖ్యముగా – భారతదేశమందు చెల్లివచ్చుచుండగా ఈనాడు దీనికి విదేశములందు కాక స్వదేశములోను నిరాదరణ మధికమైయున్నది. ఏమి చిత్రమోయేమో జాతి మత దేశ కాలభేదము లెరుగని "అమ్మలగన్న యమ్మ" యగు ఆయుర్వేద వైద్యము ఈనాటి మతభేదవాదుల (communal) గురికి లోనైయున్నది. బ్రిటిషిండియాలో యునానీ, ఆయుర్వేదములు రెండును సమానముగా నిరాదరణమునకు పాత్రములై యుండగా నిజాం రాష్ట్రములో ఆయుర్వేదము మాత్రమే సంపూర్ణ నిరాదరణమునకు లోనై యున్నది. ఈ సంవత్సరమే ప్రభుత్వమువారు తమ అంచనాపట్టికలో ఆయుర్వేదానికి 35000 రూపాయలు మాత్రము ప్రత్యేకించినారు. పాశ్చాత్య వైద్యముపై సాలీనా సుమారు 40 లక్షలు వ్యయము చేయుచున్నారు. యునానీ వైద్యముపై అపారముగా వ్యయము చేయుచున్నారు. ప్రతి తాలూకాలో యునాని వైద్యాలయములు స్థాపించి హకీముల నేర్పాటుచేసినారు. కాని

ఆయుర్వేద వైద్యమో! అది అనాథయైపోయినది. కావున యీ 35000 రూకలు మాత్రము ఏ పాటిసాయము చేయగలవు. ఇది కన్నీటి తుడ్పుగానున్నది.

యూరోపు ఖండములో నిన్న మొన్నటివరకు అనగా 19వ శతాబ్దారంభము వరకు వైద్యము వట్టి మొరటు పద్ధతిపై నుండెను. పెట్టి గ్రూ (pettigrew) అనునతడు క్రీ.శ. 1844లో తాను వ్రాసిన గ్రంథములో నిట్లు వ్రాసినాడు.

"In Europe so late as the 15th and 16th centuries diseases were regarded as punishment of God and the intervention of Priests was requisitioned instead of a doctor"

క్రీ.శ. 15, 16 శతాబ్దములలో సహితము యూరోపులో జాడ్యములు ఆధి దైవికములని భావింపబడుచుండెను. తచ్చికిత్సలకై వైద్యుల బిలుచుటకు మారుగా పూజారులను బిలుచుచుండిరి.

అట్టి యూరోపులో ఒక నూరు సంవత్సరములలోపలనే గావింపబడిన వైద్యాభివృద్ధి అద్వితీయము, అనిర్వచనీయము. వైద్యమొక ముఖ్యశాస్త్రముగా (Science) పరిగణింపబడి, క్రొత్త క్రొత్త పరిశోధనలను పాశ్చాత్యులు ప్రతిదినమును చేయుచున్నారు. ఇప్పుడు మన మీ శ్రద్ధను వారినుండియే గుణపాఠముగా గ్రహించవలసియున్నది.

కావుననే నీ సందర్భమున ఆయుర్వేదవైద్యులతో నాకు తోచిన కొన్ని సలహాలను మనవి చేసుకొనుచున్నాను. అందు తమదృష్టిలో మంచివని భావించిన వానినే గ్రహింతురుగాక.

1. మధ్యకాలములో ఆయుర్వేదమునకు క్షీణదశ ప్రాప్తించెను. ఓషధీ పరిశ్రమలు తగ్గిపోయెను. నూతన పరిశోధనలు చేయువారలు లేరైరి. ఇందుకు తోడుగా జోతిశ్శాస్త్రము, భూతవైద్యము, మంత్రశాస్త్రము బయలుదేరెను. జాడ్యములకు మందులే ప్రధానముగాని నక్షత్రములు వక్రించుట, మంత్రోచ్చాటనము చేయుట పూర్తిగా అప్రధానములని గ్రహించవలెను. ఆధునికుల కందలి విశ్వాసములు పోయినవి. కావున వైద్యులు చికిత్సనే ప్రధానముగా నెంచవలెను.

2. పాశ్చాత్యులు మన ఔషధములను విశేషముగా తమ వైద్యములోనికి తీసికొనినారు. అదే విధముగా మనమును పాశ్చాత్య వైద్యములోనే కాక యునానీ

వైద్యములోను, ఏయే విషయములు విశిష్టత నొందినవో వానిని తప్పకుండ గ్రహించవలెను. పాశ్చాత్య వైద్యములో శస్త్రచికిత్స అపారముగా వృద్ధినొందినది. ఆయుర్వేద వైద్యులు తమ శస్త్ర వైద్యములో లేని విషయములను పాశ్చాత్యుల వద్ద నేర్చుకొనవలెను. ప్రభుత్వానుమతిని బొంది శవములపై శస్త్రవిద్య నభ్యసించవలెను. ఆయుర్వేద పాఠశాలలు పాశ్చాత్య యునానీ వైద్యములలోని ముఖ్య విషయములను పాఠ్య ప్రణాళికలో చేర్పించవలెను.

3. అరబ్బు లేప్రకారముగా మన వైద్య గ్రంథములను తర్జుమా చేసికొనిరో అదే విధముగా ఆయుర్వేద వైద్యములోనికి అలోపతిక్, యునానీ వైద్యములలోని యుత్తమ విషయములనన్నింటిని పరివర్తనము చేసికొనవలెను. సంస్కృతములోనుండు ఉత్తమ వైద్య గ్రంథములను దేశభాషలలో ననువదింపజేయవలెను. మరియు పరస్పర భిన్నముగానుండు చికిత్సలలో నేది సత్యమో యేది అప్రతిష్ఠయో నిర్ణయించి వ్యాఖ్యానములు వ్రాయవలెను.

4. అనేకులు కొన్ని కొన్ని ప్రత్యేక చికిత్సల నెరిగియున్నారు. కాని వారవి పరమ గోప్యములుగా నుంచుకొని యెవరికిని జెప్పక తామును నష్టపడుచున్నారు. దేశమునకు నష్టము కలిగించుచున్నారు. సర్వోపయోగార్థము వైద్య సంఘమువారు అట్టి చిట్కాలను బయలు పరచుచుండవలెను.

5. వైద్యము రానివారును సంగీతము రానివారును లేరని యొక సామెత. మన దేశములో పల్లెలలో నేటికిని ఆయుర్వేద వైద్యమందు జనులకున్నంత యభిమానము విశ్వాసము యితర వైద్యములపైనలేదు. అట్లుండినను అనేకులు ఆయుర్వేద వైద్యులు సరియైన వైద్య జ్ఞానమును సంపాదించుకొనక పల్లెలలో తప్పుడు చికిత్సలు చేయుచు జనులకు నష్టము కలిగించుచున్నారు. తత్ఫలితముగా వాదమందు లేకున్నను వాది దౌర్బల్యముచేత ఆయుర్వేద వైద్యము నిందలకు పాలైనది. పూర్వమందును ఇట్టి అడ్డాదిడ్డి వైద్యులను (Quacks) గురించియే సంస్కృత వాఙ్మయములో అనేక చాటూక్తులు బయలుదేరెను.

"వైద్యోహం వైద్య రాజోహం సర్వవ్యాధి సమన్వితః
యంయం స్పృశామి హస్తేన క్షణార్థం ననజీవతి"
"చితాం ప్రజ్వలితాం దృష్ట్వావైద్యోవిస్మయ మాగతః
నాహం గతో నమే భ్రాతా కస్యేదం హస్తలాఘవం"

"వైద్యః క్రూరోయమః క్రూరోవైద్యః క్రూరో యమాదపి
యమోహరత్య సేనేవ వైద్యస్తు సవసేనసూ"

కావున అనుభవములేనట్టియు శాస్త్ర పరిజ్ఞానము లేనట్టి ఉదరంభరులగు మోటు వైద్యులు ఇక మీదట నాటు వైద్యము చేయకుండినట్లుగా వైద్య సంఘమువారు ఆలోచనలు చేసి మార్గము లరయవలెను.

6. అనాదృతమైన వైద్యమునుద్ధరించుటలో మన వైద్యులపై అత్యంతమగు భారము కలదు. ఈ భారము నిర్వహించుకొనుటకు వివిధ వైద్య సంఘములలో ఐకమత్యత చాలా అవసరము. ఈర్ష్య, అసూయ, ద్వేషములు ప్రబలిన ఆయుర్వేద వైద్యమునకు నష్టమగుటయే కాక వైద్యులును చాలా నష్టములకు గురియగుదురు.

బ్రిటిషిండియాలో ఆయుర్వేద వైద్యులు పట్టుదలతో శ్రద్ధతో కృషి చేసి ఆయుర్వేదాభివృద్ధికి తోడ్పడుచున్నారు. నిజాం రాష్ట్రమందలి ఆయుర్వేద వైద్యులిప్పుడు మేల్కొనుచున్నందుకు సంతోషము. వీరియుద్యమము దినదినాభివృద్ధినొంది లోకకల్యాణమున కుపయోగపడు గాక అని పరమేశ్వరుని ప్రార్థింతును.

నిజాం రాష్ట్ర ప్రథమాంధ్ర ఆయుర్వేద మహాసభ (నిజామాబాద్)లోని అధ్యక్షోపన్యాసం.

గుర్రము

తెనుగుకవులు కొందరు సామ్రాణితేజీ లేక సాంబ్రాణితేజి అని గుర్రానికి పర్యాయపదముగా వాడినారు. ఇది శ్రీనాథుని కాలమునుండి మన సారస్వతములో కానవస్తున్నది. అంతకుపూర్వపు కవుల రచనలలో లేనట్లు నాకు జ్ఞాపకం. తిక్కన ఎక్కడా ఈ పదాన్ని వాడినటుల నాకు తెలియదు. క్రీ.శ. 1450 ప్రాంతము వాడగు గౌరన "రవణించి దాటు సాంబ్రాణితేజీలు" అని గ్రంథాదిలోనే వర్ణించినాడు. ఈ సామ్రాణి పదమెక్కడిది? ఇదియు ఈరాన్, తుర్కీ, గుజ్జరి (గుజరాత్) సింధు వంటి అశ్వోత్పత్తి స్థానమైయుండునని యూహించినాను. ఈరాన్, (పర్షియా) దేశము గుర్రాలకు చాలా ప్రసిద్ధి కలదై యుండెనని తెలుపనయినది. ఆ దేశమందే "సమరాన్" అనునొక ప్రదేశము కలదు. అది యిరాన్‌లోని దగుటచే విజయనగర సామ్రాజ్య కాలములో ఆ సమరానునుండి విశేషముగా గుర్రములు దిగుమతియై యుండును. సమరాన్ సంబంధ హయములగుటచే వాటికి సామ్రాణీలను పేరు వచ్చెను. సామ్రాణీతేజీలు అనుటచే తేజీ పదమును గూడ తెలుసుకోవలెను. తేజ్‌గా వేగముగా పోవునవి తేజీలై యుండుననవచ్చును. "తాజీ" అనుపదము అరబీలో కలదు. ఉత్తమాశ్వమును అరబీలో తాజీ గుర్రమందురు. సాదీ గుల్‌స్తాన్ చదివినవారికి "అస్పెతాజీ గర్‌జయీఫ్ బువద్" అనే పద్యము స్ఫురణకు రాగలదు. "అస్పెతాజీ" అన అశ్వోత్తమము అని యర్థము, కావున తాజీ పదము మనలో తేజీ యయ్యెనేమో!

నా వద్ద "ఫరస్‌నామా" అను అముద్రిత లిఖిత ఫార్సీ ప్రాచీన గ్రంథమున్నది. దాని పీఠికలో ఇట్లు వ్రాసినారు. "సుల్తానుమహమూదు గజనీకాలానికే సంస్కృతాశ్వ శాస్త్రము ప్రసిద్ధి నొందినది. హుమాయూన్ చిత్తోడును ధ్వంసించి నప్పుడందు కొన్ని పెట్టెల పుస్తకాలు "మాలెగనీమత్" లూటీగా దొరికెను. అందు సంస్కృతాశ్వశాస్త్ర

మొకటియుండెను. అది చాలా యుత్తమ గ్రంథము. దానినే యిప్పుడు షాజహాను చక్రవర్తి కొరకు భాషాంతరీకరిస్తున్నాను". ఈ పార్సీ గ్రంథానికి పీఠిక చాలా విపులముగా కలదు. అందు గుఱ్ఱము జంతుజాతిలో ఉత్తమమనియు, "గాజీ"లకు గుఱ్ఱమే ఉత్తమ వాహనమనియు, రాజులకు గుఱ్ఱాలే జయమునిచ్చుననియు, అవి లేని రాజు నాశనమగుననియు, గుఱ్ఱాలు కచ్ఛి (గుజరాతువద్ద) దేశమందును, అరబ్, ఈరాక్, తుర్కీ దేశాలలోను లభించుననియు, ఇంకా చాలా చాలా విషయాలు వ్రాసినాడు. ముసల్మానులు గుఱ్ఱము యొక్క ప్రాముఖ్యమును బాగా యెరిగినందుననే హిందువులను జయింప గలిగిరను నాభావమా గ్రంథము చూచిన తర్వాత స్థిరపడినది. ఈ గ్రంథాన్ని పూర్తిగా తెనుగులో తర్జుమా చేసి మంచి పీఠికతో ప్రచురించిన చాలా యోగ్యముగా నుండును. ఆ విధముగా చేయించు దాతలు దొరకుదురా? ఈ గ్రంథాన్ని గురించి ప్రత్యేక వ్యాసమవసరమగును. కాని సూచించి విడిచినాను.

ఆంధ్ర మహాభారతములోని ఆదిపర్వాష్టమాశ్వాసములో "చిత్రలలిత గతి నొప్పు నేనూరుగాడిదలను, సింధుబాహ్లీక కాంభోజ, పారసీక జాతమైన తురగ శతసహస్రము" అన్నారు. సంస్కృత మూలములో ఒక బాహ్లికమే కలదు. తక్కిన పదాలన్నీ నన్నయ సృష్టియే. వారి కాలములోని గుఱ్ఱాల దిగుమతులను వారు సూచించినారనుకోవచ్చు. ఈ యుదాహృతపంక్తి బహువిశిష్టత కలది. భారతమును సంస్కరించిన పెద్దలు తాళ్ళపాక వారి కవిత్వం కొంత, నాపైత్యం కొంత అన్నట్లు తమకిష్టము వచ్చినట్లు దిద్ది అపచారము చేసినారు. ఈ యుదాహృత పంక్తిలో గాడిదలు అన్న పదము అంటరానిదగుట చేత అర్జునుని పెండ్లిలో గాడిదలను కానుకలిచ్చినట్లుగా చెప్పితే తప్పగునని గాడిదలను "గాడీలు"గా మార్చి అచ్చువేసిరి. సంస్కృత మూలములో గాడిదలకు "అశ్వతరి" కంచరగాడిద అను పదం వాడిరి. అది మన సనాతన భారత సంస్కర్తలకు కొద్దిగా మేలు రకమగు మాట కదా! "ఏనూరు" అను పదమును గూడ గమనించండి. నూరు అనే మాట మోటని ఉత్తర సర్కారీ సోదరులు తెచ్చిపెట్టిన "వంద" అనే ప్రాచీనులు వాడని మాటను పలువురు మంచి పదమనుకొని అదేపనిగా వాడుతారు. నాకు తెలిసినంతవరకు మహాభారతములో ఎచ్చటనూ "వంద" అను పదము వాడలేదు. ఇతర ప్రాచీన కవులును వాడినట్లు కానరాదు.

ఇంత వ్రాసినను గుఱ్ఱము అనే పదమెట్లేర్పడెనో తెలిసినది కాదు. అశ్వశాలకు తబేలాకు పేరులు యిట్టివి కలవు.

"సాహిణమన, బాగాయన, వాహాగారంబునకును వర్తిలుపేళ్ళి" గుఱ్ఱపు సాలెలలకు (సాహిణములకు) అధికారి సాహిణి. పూర్వము కొందరు రెడ్డి ముఖ్యులు సాహిణులై యుండిరి. ఆంధ్రులలో రెడ్లు, తర్వాత విజయనగర రాజులు గుఱ్ఱాల సైన్యమును దిట్టముగా నిలిపినట్టివారు.

"జక్కి, మావు, గుఱ్ఱము, తేజి, యెక్కిరింత తత్తడి, రవాలు, నడగడు, కత్తలాని తురికి, బాబా యనగనొప్పు తురగమునకు" అని సాంబ నిఘంటులో తెలిపినారు.

ఇందు జక్కియను పదమును గూర్చి విచారింతము. జక్కి మోర వేలుపు అనగా గుఱ్ఱపు మూతి వేలుపు. అనగా కిన్నరుడు. గుఱ్ఱము మూతివారు ప్రపంచ సృష్టిలో లేరు. అయితే గుఱ్ఱాలెక్కువగా నుండు దేశము వారని యర్థము చేసుకోవచ్చును. జక్కులను యక్షులనియు అందురు. జక్కులు (యక్షులు) కిన్నరులు వేరే కాని ఉభయులును ఈరాను కుత్తర ప్రాంతాల వారనుకొందును. పూర్వము అక్షస్ నదికి జక్సార్టీస్ అనియు పేరుండెను. జక్సాశబ్దమునకు కూడా యక్ష శబ్ద సామీప్యము కలదు. యక్షులు ఆ ప్రాంతీయులై యుందురు. గుఱ్ఱాలున్నూ ఆ ప్రాంతమందే హెచ్చు. అందుచే జక్కిశబ్దమేర్పడి యుండును.

గుఱ్ఱాలను గురించి ఇంగ్లీషులో చాలా గ్రంథాలు వ్రాసినారు. గుఱ్ఱపు జాతులు, వాటి పెంపకము, వాటి శిక్షణము, వాటి నడకలు, మున్నగు వాటిని గురించి పటములతో సహా బహుగ్రంథాలు వ్రాసి ప్రకటించినారు. గుఱ్ఱాల రోగాలను గురించి వాటి చికిత్సలను గూర్చియు చాలా వ్రాసినారు. కాని మనలో అట్టి గ్రంథాలు కానరావు. తెనుగులో రెండు అశ్వశాస్త్రాలను పద్యకావ్యాలుగా వ్రాసినారు. మనవారు చరిత్రలనే వాటిని శకునాలను గణితములను, సాముద్రికమును, జ్యోతిషమును, శిల్పమును, వైద్యమును, రత్న పరీక్షలను – అన్నింటిని – పద్యాలలో వ్రాసినటులే అశ్వశాస్త్రాన్ని కూడా పద్యాలలో వ్రాసినారు. ఈ రెంటిలో ఒకటి మనుమంచిబట్టు అనునతనిచే ఇంచుమించు 400 ఏండ్ల క్రిందట వ్రాయబడినది. అదియునసమగ్రమైనది. కర్నూలు జిల్లా వాడు దాన్ని రచించెను. వీటిలో గుఱ్ఱము సుళ్ళు, లక్షణాలు విశేషముగా

వర్ణింపబడినవి. వాటివలన కలిగే లాభము కానరాదు. గుఱ్ఱాలకు రోగాలు వస్తే నాటు వైద్యులు తమకు తోచిన మందిత్తురు. పూర్వము తెనుగుదేశములో గుఱ్ఱాలపై సరుకులు మోపి రవాణా చేస్తూ వుండిరి.

పాశ్చాత్య యూరోపు దేశములోను, అమెరికాలోను, ఆస్ట్రేలియాలోను గుఱ్ఱాలతో సేద్యము చేయుదురు. ఉత్తర అమెరికాలోని ఉత్తర భాగాన ప్రసిద్ధియైన గుఱ్ఱాలు కలవు. పశుల కాపరులు వాటిపై గంతలు కూడా వేయక కళ్ళెము మాత్రమే తగిలించి సవారి చేయుదురు. అవి చాలా పెద్ద గుఱ్ఱాలు. పైగా అడవి గుఱ్ఱాలవలె సాధనకు రాక వెనుక రెండు కాళ్ళపై నేటుగా ముందరి కాళ్ళెత్తి నిలబడుటయో లేక నాలుగు కాళ్ళెత్తి పైకెగురుటయో, నేలపై పొరలుటయో, ఎన్నెన్నియో, దుడుకులు చేసి సవారికి లొంగనివై యుండినను ఆ కాపరులు వాటి వీపులపై ఉడుములవలె కరుచుకొని యుండి వాటిని సాధించి సవారీ చేయుదురు. ఆ కాపరులను ఇంగ్లీషులో కౌబాయిస్ అందురు. ఆస్ట్రేలియా ఖండములోని గుఱ్ఱాలు సామాన్యమైనవి కావు. అవి చాలాపెద్దవి. బలిష్ఠమైనవి, చాలా వెల గలవి. ఇంగ్లీషువారును, ఫ్రెంచి జర్మనులును, రష్యావారును తమ యుద్ధావసరాలకై గుఱ్ఱాలపై కోట్ల కొలది ధనమును వ్యయము చేస్తూ వుందురు. విమానములు, మోటారులు, ట్యాంకులు వచ్చినను గుఱ్ఱాల ప్రాముఖ్యము తగ్గలేదు.

గుఱ్ఱముల యుద్ధ ప్రాముఖ్యమును గురించి ఫిర్దౌసీ షాహ్నామాలో చాలా వర్ణనలు కలవు. జగత్ప్రసిద్ధి గాంచిన రుస్తుం మహావీరుని గుఱ్ఱము పేరు 'రఖ్'. ఆ గుఱ్ఱము పెద్దపులులతో కలబడి వాటిని చంపెడిదని షాహ్నాములో వర్ణించినారు. ఫిర్దౌసీ కాలములో ముసల్మానుల విజృంభణము ముల్లోకములలో అనగా ఏషియా, యూరోపు, ఆఫ్రికా ఖండములలో విస్తరించుతూ వుండెను. వారి ధాటి పెద్ద తుఫాను వంటిది. వారి జయము పరాజితులకు భూకంపము వంటిది. వారి మత సంస్కృతి ఇతర సంస్కృతులనెల్లను తుడిచివేస్తూ వేలాతిక్రమణముతో ప్రవహించెను. అట్టి కాలానికి వీరులగాథ అవసరమై యుండెను. ఆ యవసరములో ఫిర్దౌసీ పైకి వచ్చెను. షాహ్నామా రచించెను. రాజులు దానిని పురాణముగా పఠింపజేసిరి. సాధారణులు ఖహ్వాఖానాలలో (చా కాఫీ క్లబ్బుల వంటి వాటిలో) పాడించి వింటూ వుండిరి. ఆ కథలలో ఘోటీధాటీ వర్ణన పరిపాటి విశేషముగా నుండెడిది. అట్టి వాతావరణమందు పెరిగి, అట్టి వీరావేశము నెక్కించుకొని, అట్టి రుస్తుం, ఆదర్శాలతో గుఱ్ఱాలపై మన

దేశమందు ముసల్మానులు విజయాలు పొందిరంటే దానికింత వెనుకరంగము (Background) ఉన్నదన్నమాట.

భారతీయ చారిత్రక రంగమున 'నభూతో నభవిష్యతి" అనిపించుకొన్న అసాధారణ మహాపురుషుడగు చాణక్యుడు (కౌటిల్యుడు - కుటల దేశస్థుడు) తన అర్థశాస్త్రమందు అశ్వాధ్యక్ష ప్రకరణమందు సూత్రపద్ధతిలో అనేక విషయాలను సూక్ష్మముగా తెలిపియున్నాడు. అభిలాషులా ప్రకరణాన్ని చదువుకొనవలసిందే. అయినను దాని నుండి కొన్ని విశేషాలను మాత్రమిందుదాహరింతును.

"అశ్వాధ్యక్షుడు గుర్రాల తరములను ఏర్పాటు చేయవలెను. 1. ప్రణ్యాగారిక ములు (అమ్మదగినవి) 2. క్రయోపాగతములు (కొనబడినట్టివి) 3. ఆహవలబ్ధములు (యుద్ధములో పట్టుకొనబడినవి) 4. ఆజాతములు (దేశమందు పుట్టినవి) 5. సాహాయ్య కాగతములు (ఇతర మండలాల నుండి యుద్ధావసర సహాయానికై తీసుకొని రాబడినవి) 6. పణస్థితములు (గిరవుగా నుంచబడినవి) 7. యావత్కాలికములు (తాత్కాలికముగా లాయములలో నుంచబడినవి).

ఉత్తమాశ్వముల ముఖముల పొడవు 32 అంగుళాలు, గుర్రము పొడవు - ముఖమంత అయిదంతలుండవలెను.

ఉత్తమాశ్వములకు ఈ క్రింది విధముగా తిండిపెట్టవలెను. 2 ద్రోణాల దాణ బియ్యము కాని, గోధుమలు కాని, ప్రియంగువుకాని, ముద్గమాషము లుడికించి కాని పెట్టవలెను.

ఒక ప్రస్థము నూనె, 5 పలముల ఉప్పు, 50 పలముల మాంసము, 1 ఆఢకము రసము, 2 ఆఢకముల పెరుగు, 5 ఫలముల క్షారము (రుచికిగాను) 1 ప్రస్థము లేక రెండు ప్రస్థముల పాలు ఇయ్యవలెను మరియు 1 ప్రస్థము నూనెతో అనుపానము (ఎనిమా) చేయవలెను. 1 కుడుంబము నూనెను ముక్కుపై రుద్ధవలెను. 100 పలముల నట్టుగడ్డిని, 2000 పలముల తృణమును మేతపెట్టవలెను.

"కాంభోజ, సింధు, ఆరట్టవనాయు, దేశజములగునవి ఉత్తమాశ్వములు. బాహ్లిక, పాపేయ, సౌవీర, తైతల దేశజములు మధ్యజాతివి. తక్కినవన్నియు అవరములు (సాధారణములు).

"గుర్రాలను యుద్ధాలకే శిక్షణము చేయవలెను. వల్గన, నీచైర్గత, లంఘన, ధోరణ (Gallop) నారోష్ట్ర (Response to signals) ఇవి గుర్రపు నడకలు. ఒక్కొక్క నడకలో ఔపవేణుక వర్ధమానక, యమక, ఆలీఢప్లుతాది బహువిధముల రీతులు కలవు.

అశ్వ చికిత్సకులు ప్రత్యేకముగా గుర్రాలను విచారించుకొంటూ వుండవలెను.

"గుర్రాలకీ క్రింది నౌకరులు అవసరమైయున్నారు.

1. సూత్ర గ్రాహకుడు – గుర్రాలను పట్టుకొని నడిపించుకొని పోవువారు సైసులు.
2. యావసికుడు – యవసము (గడ్డి) తెచ్చి మేత పెట్టువాడు
3. విధాపాచకుడు – గుగ్గిళ్ళు ఉడికించి పెట్టువాడు.
4. స్థానపాలకుడు – గుర్రపుశాలెల కావలిగాయువాడు.
5. కేశకారుడు – గుర్రాల వెంట్రుకలు కత్తిరించువాడు.
6. అవ్వబంధకుడు – గుర్రాల కట్టివేయువాడు.
7. జాంగలికుడు – విష చికిత్సలు చేయువాడు.

ఉత్తమ మధ్యమాశ్వాలు లభించు దేశాలను గురించి యిదివరకే తెలిపినాను. అయినను ఇందు కొన్ని కొత్త పదాలున్నవి. వాటిని గురించి తెలుసుకొందము. అరట్ట – ఆరట్ట – దేవము పంజాబులోని మండలము. ఆ రాష్ట్రకశబ్దభవము. మహాభారత యుద్ధ కాలములో అందలి జనులు దోపిడికాండ్రని ప్రసిద్ధిగాంచిరి. సౌవీరము గుజరాతు దేశములోనిది. పాపేయ, తైతల, దేశాలెచ్చటివో నాకు తెలియదు. ప్రాచీన భారతీయ భౌగోళిక నిఘంటులను వ్రాసినవారును వాటిని పేర్కొనలేదు. కావున ఈ రెండును భారతేతర ప్రాంతాలై యుండును. తైతల అనునది తార్తరీదేశ మనుకొందును. పాంపేయ అయి యుండునా? చాణక్యుని కాలానికే అది రూపుమాసెను. దాని ప్రసిద్ధి విని అతడుదాహరించియుండునా? లేక పంపా (తుంగభద్రా) తీరభూములే పాంపేయమయి యుండునా? వింధ్యకు దక్షిణమున మంచి గుర్రాలుండినట్లు కానరాదు. నేటికిని అదే లోపమును కానవస్తున్నది.

తక్కిన దేశాలను గూర్చి యిదివరకే చర్చించినాను.

చాణక్యుని అశ్వాధ్యక్ష ప్రకరణములో తెలుసుకోదగిన విషయాలు చాలా కలవు. అర్థశాస్త్రమందలి యుద్ధరంగ ప్రకరణములో (పుస్తకము 10వ ప్రకరణము 4. గుర్రముల వినియోగమును గూర్చి యిట్లు తెలిపినారు".

యుద్ధ రంగస్థలమును, విడిదిని, అడవులను శోధించుట, ప్రధాన స్థలములాక్రమించుట, అనగా నీటిపట్లు, ఘాటులు మున్నగునవి పట్టుకొనుట, వెనుక వచ్చు సేనకు రక్షణ యిచ్చుట, సైనిక వ్యవస్థను సరిచూచుట, సైనిక కక్షలను రక్షించుట, శత్రువులపై మొదటిధాటి సాగించుట, శత్రు సైన్యమును చెదరగొట్టుట, కోశమును, రాజపురుషులను రక్షించుట, శత్రువుల వెనుకభాగముపై బడుట, తరుముట, వెన్నంటుట, వ్యూహరచన, ఇత్యాదులు ఆశ్విక దళములు చేయవలసిన కార్యములు".

ఈ వ్యాసమందు సూచన మాత్రగా తెలిపిన విషయాలు, తెలుపని విషయాలు అన్నియు సమగ్రముగా వ్రాయవలెనంటే భారత గ్రంతమంత కాదా మరి? అట్టి గ్రంథము రచింపదలిచినవారికిది ప్రోత్సాహహేతువైయుండునని వ్రాసినాను.

తాంబూల సేవనము

తాంబూలమును సేవించు ఆచారము బహుశా ఒక్క హిందూస్థానమందే కలదేమో. ఈ యాచారమెప్పుడేర్పడెనో సరిగా చెప్పజాలము.

ఆదిత్య సోదయం, తాత.

"తాంబూలం, భారతీకథా, ఇష్టా భార్యా, సుమిత్రాంచ అపూర్వాసు దినే దినే"

భారత కథ, సూర్యోదయము, ఇష్ట భార్య, మంచి స్నేహితుడు, తాంబూలము ఇవన్నియు ప్రతిదినము క్రొత్తగనే రమణీయముగనే ఉండును అని పంచతంత్రములో వర్ణించినారు.

అమరసింహుడు బహుశా క్రీస్తుశకము 300 ప్రాంతములందుడినవాడు. అతడు నామలింగానుశాసనములో వనౌషధి వర్గలో తమలపాకుల కీ విధముగ పర్యాయపదములిచ్చెను. "తాంబూల వల్లీ తాంబూలీ నాగవల్ల్యపి" తాంబూలమునకు నాగవల్లి అను పదమొక్కటే అతడిచ్చెను. నాగలోకమునుండి అది మనకు లభించి నందున నాగవల్లి అయినదని అమరవ్యాఖ్యాత లింగాభట్టు చమత్కరించెను. కాని నాగుబాము పడగవలెనుండు ఆకులు కల తీగ యగుటచే నాగవల్లి యయ్యెనన వచ్చును.

ఘోంటాపగ, క్రముక, గువాక, ఖప్పర, ఉద్వేగ అనుపదములు పోకకు పర్యాయ పదములని అమరుడు తెలిపెను. అందు పూగక్రముకములే ప్రచారమందున్నది. పూగ అనగా 'పునీతి ముఖమితి పూగః" ముఖమును పవిత్రము చేయునది కాన పూగమయ్యెను అని లింగాభట్టు విచిత్రముగా సమర్థించెను. తెనుగులో పూగ అనునదే పోఁక. ఈ శబ్దములో అరసున్న కలదు. కాన పూర్వము దీనిని పొంక అనిరి. పోకనాడు, పూగనాడు అను నాడు కలదు. అచ్చట ఇవి విశేషముగా పండినందున

పూగము పోక అయ్యేనేమో అని నా యనుమానము. ఘొంట అను పదమే తెనుగులో "గొంటు" అయి యుండును. గొంటు పోక అనియు కొరకరాని గొంటు అనియు తెనుగు వారందురు. గట్టిపోక గొంటు పోకయే అయి యుండును.

తాంబూలములోని యంగాంగములను మొదలు విచారింతుము. తాంబూలము, తమలము, తమ్ములము, నాగవల్లి అనునవి తమలపాకును తెలుపును. తమ్మ పడిగ అనగా తాంబూల రసమును ఉమియుటకై ఉపయోగించు పాత్ర. కావున తమ్మ అని తమ్ములమున కుపయోగించిరనవలెను. రెడ్డి వెలమరాజులు పరస్పరము తలలకోసి తలపుర్రెలను తమ్మపడిగలుగా ఉపయోగించిన ధీరులు! హైదరాబాదులో వాటికి థూక్దాన్ ఉగల్ దానులందురు. సంపన్నుల యిండ్లలో అవియుండును. పూర్వము రాజులవద్ద తాంబూలపుతిత్తులను ఉంచుకొనియుండు సేవకులును సేవకురాండ్రును ఉండినందుననె అడపకత్తె అడపకాడు అను పదములు మన వాఙ్మయములో కానవస్తున్నవి. అడపము అనగా వక్కలాకుల తిత్తి. వక్కలను కత్తిరించుట కొక సాధనము కలదు. దానిని అడకొత్తు, పోకొత్తు అందురు. అడకొత్తు అనగా ఆడకాయఁ ఒత్తు అనుపదముల చేరిక అని శబ్దరత్నాకరమందు వ్రాసిరి. కాని అడకాయ అనుపదమును వ్రాయలేదు. కన్నడంలో అడికి అనగా వక్క. దానిని ఒత్తు నది అడకొత్తు. ఒక కాలములో తెనుగువారు పోకలను అడక అని పిలుచుచుండిరని ఊహింపవచ్చును. అడకాయ అనునది తప్పని కన్నడ పదములబట్టి చెప్పవచ్చును. అడకత్తును సంస్కృతములో "శంకుల" అనినట్లు శబ్దరత్నాకరములో కానవస్తున్నది. కాని అమరుడేపదము నిచ్చినట్లు కానరాదు. వక్క అను పదము వ్రక్క నుండి తునక అను నర్థములో నేర్పడెనో యేమో? ఉడుకబెట్టిన పోకచెక్క అని దానికి నిఘంట్వర్థము వ్రాసినారు. మనదేశములో ఉడుకబెట్టిన వక్కలను ఉడుకబెట్టని వక్కలను తినువారు కలరు. ఆంధ్రులు, కర్ణాటకులు, తమిళులు ఉడుకబెట్టిన వక్కలనే వాడుదురు. మళయాళీల దేశమందే వక్కలు సమృద్ధి. వారును ఇతర హిందూస్థానము జనులును విశేషముగా పచ్చిపోకలనే వాడుదురు. పోకలను బాగాలు అనియు అందురు. ఈ పదము ఒరంగల్ జిల్లాలో ఎక్కువ ప్రచారములో కలదు. "బాగములు" అను శబ్దమే భాగాలు. భాగములు అను శబ్దభావమే తునక అను నర్థములో వక్కవలె ఇది యేర్పడెనేమో అని నా అనుమానము. "కట్టెడు తెల్లనాకులను కప్పుర భాగాలు నిచ్చి

నిచ్చుటన్" అని తారా శశాంకమందును, "కర్పూరంబు తోడి బాగాలీరాదో యాకు మడిచి యీరాదొ చెలీ" అని కళాపూర్ణోదయమందును వాడిరి. "మంచి మేలైనది దిగు కొమ్మంచు కప్పురంబు సగపాలు నింపి వీడెంబొసంగి" అనియు "బాగా లొసంగె" అనియు చేమకూర వ్రాసిన ప్రయోగాలు కలవు, విడెము, వీడియము, వీద్యము అను పదములు తాంబూలమునకు వాడిరి. దీనినె "బీకా" అని హిందీలో వాడిరి. "బీడా ఎత్తుట" అను హిందీ నుడికారములో గొప్ప యర్థము కలదు. ఎవరైన సాహస కార్యము చేయదలచిన రాజు ఇచ్చిన విడెమును తీసుకొనుచుండిరి. అనగా ఆ కార్యమును ప్రాణములర్పించి యైనను సాధించి తీరుదునని బీడా ఎత్తువాడు శపథము చేయుట అగుచుండెను. సంస్కృతమున విడెమును వీటి అనిరి.

ప్రియ దూతిక తెచ్చి యిచ్చు కప్పుర విడెము కావలెనని అల్లసాని పెద్దన కోరెను. మన కవులు సాధారణముగా తాంబూలములో కర్పూరమును చేర్చి సేవించుచు వర్ణించినది గమనింపవలెను. నేడు అది మృగ్యమైపోయినది. తాంబూలమును గురించి సంస్కృతములో కొన్ని చాటూక్తులు కలవు. తెనుగులోను కొన్ని కలవు. మాసరకిది యొకటి కనుడు. "తాంబూలం ముఖ్యరోగ"

తాంబూలమును వేసుకొనువారు తాంబూలము తిత్తులో లేక పెట్టెలో లేక కరండములో లేక కరంకము లేక జాలవల్లికలో ఉంచుకొనుచుండిరి. కరంక పదమును బాణుడు కాదంబరిలో ప్రయోగించెను. తెనుగులో కరండమని ప్రయోగించిరి. ఆ పెట్టెలపైన సన్నని తీగె పనులుండెడివి. అందుచేత వాటిని జాలవల్లికలనిరి. జాలవల్లికల తోడ బాగాలు, తెల్లనాకులు కైరవళ్ళు నెదుట పెట్టెను" అని సారంగు తమ్మయ్య వ్రాసెను. కైరవడి అనగా కాచులో పాలు మొగలిపూల రసము వేసి నూరి గోలీలుగా చేయుట అని యర్థము. "కప్పురపు వీడియంబును కైరవళ్ళు కొసగె" అని శృంగార మల్హణ చరిత్రలో వర్ణింపబడినది. తాంబూలపు పెట్టెలు నానా విధములైనవి. ఇత్తడి, రాగి, కంచు, వెండి, బంగారు లోహములతో సిద్ధము చేయుచుండిరి. నెమలివలె, బాతువలె, రాగిరేకువలె, గుండ్రముగను, తీగెల పనులతోను, వివిధ సుందర రూపముల తోను పెట్టెలను సిద్ధము చేయుచుండిరి. పెట్టెలలో అర్రలు చాలా ఉండెడివి. అందు వేర్వేరుగా వక్కలు, లవంగాలు, జాజికాయ, జాపత్రి, ఏలకులు, కర్పూరము, సున్నము, కస్తూరి, కుంకుమపువ్వు, కైరవళ్ళు, కాచు, సొంటి, తమలపాకులు, కొబ్బెరిపొడి,

అడకొత్తు మున్నగునవి ఉండెడివి. సంపన్నులు వక్కలకు, లవంగాలకు వెండి, బంగారు రేకులను ఒత్తి వాడుకొనుచుండిరి. తాంబూలము పైనను వెండి, బంగారు రేకులొత్తి సేవించుచుండిరి.

"ఖండిత పూగీ నాగర
ఖండంబుల ఘన శశాంక ఖండంబులచే
హిండితమగు తాంబూలము"

అని కృష్ణదేవరాయలు ఆముక్త మాల్యదలో (5–93) వర్ణించెను.

"మృగమద సౌరభ విభవ
ద్వి గుణిత ఘనసార సాంద్రవీటీ గంధ
స్థగితే తర పరిమళమె"

అని అల్లసాని పెద్దన (2–24) వర్ణించెను.

విజయనగర చక్రవర్తుల కాలములో సంపన్నులు సేవించిన తాంబూలమును పైన వర్ణించినారనుట స్పష్టమే. తాంబూలములో కొందరు తురిమిన కొబ్బరి పొడిని, గసాలను, సోంపులను వాడుదురు.

చాళుక్య సోమేశ్వరుడు అను రాజు క్రీ.శ. 1050 ప్రాంతమువాడు. అతడు సంస్కృతములో "అభిలషితార్థ చింతామణి" అను గ్రంథమును రచించెను. "అందు తాంబూల భోగంబు" అను విషయమును గురించి (ప్రకరణము 3, అధ్యాయము 4 లో)22 శ్లోకములు వ్రాసెను. అతని కాలమందు రాజుల తాంబూలము లేవిధముగా ఉండెనో తెలిసికొనుటకీ భాగము చాలా సహాయపడుచున్నది. అందలి విషయాలిట్లున్నవి–

"రాజు స్నానము చేసి బయటకు వచ్చి "తాంబూలాధికారి"ని పిలిచి తాంబూలమును చేయును. మేఘవర్తి పురమందును, ఈశ్వర పురమందును, కారటీ పురమందును కాసిన వక్కలను పాకము చేయించవలెను. పాటలమువలె కొద్ది ఎరుపును కాషాయ మధుకమును అగునట్లుడికించి ఆరబెట్టవలెను. మామిడి ఫలముల తొడిమల నుండి వెడలు రసములోను గంధము పొడి, కర్పూరముతోను కలిపి నీటిలోన వాటిని నానబెట్టవలెను. అట్టి పచ్చిపోకల పైన సన్నని పొరను చెక్కి వేడి ముక్కలుగా చేసి నీడలో ఆరబెట్టవలెను. తమలపాకులలో శ్రేష్ఠమైనవి కర్పూరవల్లి, నాగవల్లి అను

తీగలపై పెరుగునట్టివి. ఒక సంవత్సరము కన్న నెక్కువగా పెరిగిన తీగలపై తమల పాకులను తీసుకొనవలెను. ఆకులపై నదీ జలమును చల్లవలెను. అవి పెద్దవిగాను తెల్లవిగను ఉండవలెను. వాటి కొనలను గిల్లివేయవలెను. అవి 52 ఆకులై యుండవలెను. శైలోదకముతోను, శిలాపాకముతోను కూడిన ముత్తెపు భస్మమును సున్నముగా వాడవలెను. కర్పూరమెట్టిదనగా – మలయాచలమందు పుట్టినదగును. మామిడివాసన కలదిగను, ఈశావాసమను పేరు కలదిగను శ్రేష్టమైనదిగ నుండవలెను. తాంబూలములో పై వక్కలను, కర్పూరమును కాక, కస్తూరి చూర్ణమును, గంధ చూర్ణమును సమ భాగములుగా కలిపి వాడుకొనవలెను. మరియు నీ క్రిందివి కూడ చేర్చవలెనట.

"కస్తూరీ శశితక్కోలం జాతీఫల సుచూర్ణకం
ఖదిరక్వాథ చూర్ణంతు కస్తూరీ క్షోదమిశ్రితం
శ్రీ ఖండ కల్క సంయుక్తం కర్పూర రజసమన్వితం
మేళయిత్వా సమ్యక్భాగైః గుళికా కల్పితా శుభా॥"

కస్తూరి, తక్కొలము, జాజి, ఖదిరల్వాధము, శశి, కర్పూరము గంధము ఇవన్నియును సమభాగాలుగా కలిపి నూరి గోలీలు చేసి వాటిని తాంబూలములో వాడవలెను. పై వాటిలో శశి అననేమో తెలియదు. ఖదిర మన ముదుగు తామర చంద్ర అని నిఘంట్వర్థము. ఇవేమో సరిగా తెలియనందున మూలము నుదాహరించి నాను. ఇంకా కొన్ని తాంబూల పరిష్కారములను సోమేశ్వరుడు వర్ణించినాడు. అందు ఖదిరసారముతో కాషామ్ల చూర్ణము జంజీర బీమిపూరము యొక్క కళికలు చేరినవి. ఇవియు నిట్టివో యేమో?

హిందూస్థానమందు తాంబూల సేవనము ఇట్లూహింపనైనది. బహుశ ఈ ఆచారము ఇండోనేషియాలోను, మలయాలోను కలదేమో? ఈరాన్, అరేబియా, వంటి ఉత్తర దేశాలలో ఈ ఆచారము లేదు. విజయనగర చక్రవర్తుల కాలములో ఈరాని రాయబారియగు అబ్దుర్రజాక్ ఇట్లు వ్రాసి యుండెను. "ఈ దేశములో తాంబూలమును విశేషముగా వేసుకొందురు. అది ఉత్తేజకరమైనది. బహుశా దీని ఉత్తేజకశక్తివలనేమో చక్రవర్తి తన (700) ఏడు నూర్ల భార్యలతో ఉంపుడు గత్తెలతో భోగింపగలుగుచున్నాడు".

శుభాశుభ కార్యాలలో తాంబూలములను వాడుదురు. వ్రతములలో మూర్తి పూజలలో తాంబూలములను వాడుదురు. ఈ సందర్భములో కొన్ని ఆచారములు స్థిరపడినవి. శుభకార్యములలో తాంబూలముగాచేసి ఇవ్వరాదు. శ్రాద్ధాదులలో విడిగా ఉన్న తమలపాకులనుంచెదరు. తమలపాకుల తొడిమలను, ఈనెలను, తోకలను తీసివేసి తాంబూలము చేయుట పలువురి పరిపాటి. దానికిని కొన్ని శాస్త్రాలు బయలుదేరినవి. తొడిమ రోగము కలిగించుననియు, అటులే ఈనెల తోకలు మంచివి కావనియు అందురు. విఘ్నేశ్వర పూజలతో ప్రారంభమగు వ్రతాలన్నింటిలో వినాయకునికిని, దేవతలకును తాంబూలము లిత్తురు. తాంబూలములతో పాటు దక్షిణ కూడ ఉండవలెను. వీడ్కోలు చేయునప్పుడు ఏమి లేకున్నను తాంబూలమైనను ఇయ్యకుండిన భారతీయులలో మర్యాద లోపమని భావింతురు. ఆధునిక పాశ్చాత్య వైద్యులు ఆకులు చెడ్డవి, వక్కలు మరీ చెడ్డవి, సున్నము చెడ్డది, మొత్తముపై తాంబూలమే చెడ్డదని అనినారు. కాని, వారిలో శ్రీవారు కొందరు నష్టము లేదన్నారు. వారేమన్నను భారతీయులు తాంబూలమును వదలుకొనిరి. సున్నము ఉత్తమమైనదిగా ఉండవలెను. రాజులు, రాణీలు నేటికిని ముత్యముల, పగడాల భస్మమును సున్నముగా వాడుదురు. పచ్చ పోకలు వేసుకొనువారు కాచును తప్పక వాడుదురు దానిని పాలతో ఉడికించు వారును కలరు. దానిలో మొగలిపూరసమును చేర్చి గోలీలుగా చేసి వాడువారును కలరు. పచ్చ కర్పూరమును వాడువారు కొందరు. పసుపువన్నెతో నుండు తమలపాకులను అందరును చాలా శ్రేష్ఠమని భావింతురు. శ్రీనాథుని కాలపు క్రీడాభిరామములో నిట్లు కలదు.

"వీడిదె తెల్లనాకులను వీడెము సేయుచు వీథివచ్చుచు
న్నాడు, మదించి తిండితినినాడు చుమీ। ...."

ఉత్తమ హిందూస్థానము వారు డిల్లీ ప్రాంతములందు పెరుగు తెల్లని చిన్న తమల పాకులను చాలా ప్రీతితో కోరుదురు. రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలో "కారపాకులు" అను కొద్దిగా కారముకల పెద్ద తమల పాకులను తిందురు. తమిళులు లేత ఆకుపచ్చని ఆకులెన్నైనను మేకలవలె నములుచుందురు. మళయాళములో మరల పెద్ద కారపాకులను అప్పుడు చెట్టుపై నుండి త్రెంచిన పీచుతో నుండు పచ్చని పోకలను ఘాటైన వెన్నవంటి మెత్తని తెల్లని సున్నమును వాడుదురు. ఆ యాకులు

కర్నూలు ప్రాంతాలలో తాంబూలము ధర ఇప్పుడు ఒక అణా. అందు సాక్రీన్ చేర్చి అమ్ముదురు. ఆ ప్రాంతమందలి కొత్తగా ప్రబలిన రుచి. హైదరాబాదులో పచ్చి పోకల బీడాలే దొరకును. ఇదివరలో ఒక పైసాకొక బీడా యిచ్చుచుండిరి. ఇప్పుడు కనిష్ఠపు బీడా అర్థాణా కొకటి. రెండణాలును, నాలుగణాలును, అర్ధ రూపాయికిని, రూపాయికిని ఒకే ఒక బీడా కూడా హైదరాబాదులో కట్టి యిచ్చువారున్నారు. వాటిని కొని సేవించువారును కలరు.

పోకలును కలిసిన తాంబూలపు రసమును మ్రింగిన వెంటనే ఒళ్ళంతయు మంటలెత్తును.

మనదేశములో నంతటను మళయాళమందే పోకచెట్లు సమృద్ధిగానుండును. తర్వాత తమిళనాడులో కొంతవరకు లభించును. జాజికాయలు, జాపత్రి నీలగిరిలో లభించును. కాని ఏలకులు, లవంగాలు, జాజి, జాపత్రి, వక్కలు మున్నగు సుగంధ ద్రవ్యములు ఇండోనేషియా దీవులలో అతి సమృద్ధిగా లభించును. అందుచేతనే ఆ దీవులు పాశ్చాత్యులు సుగంధ దీవులు (Spice Islands) అని పేరు పెట్టిరి. గత ప్రపంచ యుద్ధ కాలమం దక్కడినుండి పై వస్తువులు దిగుమతి మనకు ఆగిపోగా వాటి ధర విపరీతముగా పెరిగిపోయెను.

పొగాకు మనదేశములో క్రీ.శ. 1550 నుండి మొదలై దేశమంతటను వ్యాపించెను. అటు తర్వాత ఇంచుమించు 200 ఏండ్ల నుండి పొగాకును తాంబూలములో పలువురు వాడుటను మొదలుపెట్టిరి. పొగాకు తినిన నోరు దుర్వాసన కలిగియుండును. కాని పండ్లకు జబ్బులను రాకుండా పొగాకు రసము సహాయపడును. అదియే పొగాకును తమలపాకులతో పాటు వాడుటకు ముఖ్య కారణమైనది. ముసల్మాను నవాబులు సర్కారులు అమీరులు దీనికి సువాసన కలుగుటకై పన్నీరు సుగంధ ద్రవ్యములు కలిపి పొగాకును నానబెట్టి పాకము చేసి జర్దా అనియు, ఖమాం అనియు, ఎన్నియో పేరులు పెట్టి సిద్ధము చేయించుచుందురు. తెనుగు దేశమందంత టను జనులు విశేషముగా పొగాకు పుల్లలనే తాంబూలముతో పాటు నోటవేసుకొని నమిలి రసమును ఉమ్మి వేయుచుందురు. పొగాకు పంటి నొప్పిని హరించునని 200 ఏండ్లనాడే కనుగొనిరి. ఒకచాటువులో నిట్లు వర్ణించినారు.

"దంత లూటీ ఘోర దంతి హర్యక్షంబు
కుష్టరోగాభీల కులిశధార...."

గండ్లూరి నరసింహ కవి కర్నూలు మండలమువాడు. క్రీ.శ. 1800 ప్రాంతము వాడు. అతడు తన భాషీయ దండకములో నిట్లు వ్రాసెను.

"ఇంగ, గొల్లేశీమొస్తుంది, నోట్లోకి కొంచెం పొగా
కుల్లగిల్పెట్టి......... పోరా; పోగాకుల్లకే యాడ
కొట్టించుంకొంటావురా, యటంచున్ విశదంబుగా
గూడె పున్ దాసం.............. గుంపు గూడాడగా"

చూచి వాటిని తమ దేశాలలో వ్యాపింపజేసిరి. ఫ్రాన్సు ద్రాక్షకు, స్పెయిన్ అంజూరుకు, బాస్రాత ఖర్జూరమునకును, బటేవియా బత్తాయికి, దక్షిణ అమెరికా సపోటాకు ఆది జన్మస్థానములు. అటులే మామిడి హిందూస్థానములోనే పుట్టిపెరిగినట్టిది. మన దేశములో దీని యునికి 4000 ఏండ్లనుండి కానవస్తున్నది. కాళిదాసాదుల కావ్యాలలో హితోపదేశాది కథల పుస్తకాలలో ఆమ్ర రసాల వర్ణనలు కానవస్తున్నవి. ఇది అమరుల (దేవతల) ఫలమని వర్ణించినారు. అందుచేత అమరులని కాన ఆమ్రమయ్యెనో యేమో! రసము కలది కానరసాలమయ్యెను. రసచ్యుతి కలది కాన చూతమయ్యెను. ప్రేమకు సహకారి కాన సహకార మనబరగెను. హిందూస్థానమందును దక్కన్ ప్రాంతమందే ఇది మొదట యుండెనని పలువురి యభిప్రాయము.

మామిడిచెట్టునకు ఎర్రనేలలు, ఇసుకనేలలు, ఉష్ణవాతావరణము, మొదటి నాలుగేండ్లవరకైనను తగినంత నీరు కావలెను. ఎప్పటికి నీరాగినచోట పెరగదు. ఎప్పటికిని చలిగల ప్రదేశాలలో ఎదగదు. కావున తెలంగాణము, అట్టి వాతావరణము కల ప్రాంతాలు వాని కనువగు స్థానములు.

ఇంగ్లండు చాలా చలి ప్రదేశమగుటచేత అచ్చట దీనిని నాటినను పెరుగదు. విక్టోరియా రాణి కాలములో రాజబంధు వొకడు ఇండియానుండి ఎర్రటి మన్ను బండ్లకొలది తెప్పించి తన భూమి మన్ను తీసివేసి యీ మన్నును నింపి మామిడి నాటెను. దానికి చలి తగులకుండ విద్యుద్దీపమును తగినంత సప్లయి చేయించెను. ఆరేండ్లకు పెరిగి ఆరుకాయలు కాసెనట. వాటిని విక్టోరియా రాణికి కానుకగా నియ్య కోసెనట. తర్వాత చెట్టెండిపోయెనట. ఇంతకు పూర్వము ఓడలలో మన మామిడిని ఇంగ్లండు, అమెరికా వంటి దూరదేశాలకు తీసుకొని పోజాలకుండిరి. దారిలోనే అవి మురిగిపోవు చుండెను. ఇప్పుడు విమానాలలో రెండు మూడు దినాలలో రిఫ్రిజిరేటర్లలలో భద్రపరచి తీసుకొనిపోవుచున్నారు. అమెరికాలో మామిడిని పెంచజూచుచున్నారు. కాని యింకను అది యా దేశమునకు సరిపడలేదు.

బాగ్దాదులో ఖలీఫాలు రాజ్యము చేయుకాలములో దీని నచ్చటికి తెప్పించుకొనెడి వారు. అరబులు తమ గ్రంథాలలో ముఖ్యముగా యునానీ గ్రంథాలలో దీనిని గురించి వ్రాసారు. అబుల్ ఫజల్ హిందూ అనునతడు మిఫ్తాహుల్ తిబ్ అను వైద్య గ్రంథములో దీనిని చర్చించెను. హరూనుల్ రషీద్ కాలములో నతని వైద్య రాజులైన కసక,

మామిడిపండు

"మామిడి పండును గురించి కూడ చెప్పవలసినది వినవలసినది ఏమైన కలదా?" అని పలువురనుకొనవచ్చును. అవును, దానిని గురించి చాలా తెలుసుకొను విషయములు కలవు. దాని పుట్టుపూర్వోత్తరములు, దాని చరిత్ర, దాని జాతి విభేదాలు, దాని వ్యాప్తి, మున్నగు విషయములు తెలుసుకొన దగినవై యున్నవి.

మొట్టమొదట గమనింపదగిన దేమన - మామిడిపండు ఫలజాతిలో చక్రవర్తియన్న విషయము. అంత తీపి, అంత సౌలభ్యము మరే పండుకును కానరావు.

సంస్కృతములో మామిడిపండుకు చాలా పేర్లున్నవి. అమరసింహుడిచ్చిన పేరులేవనగా - ఆమ్రము, చూతము, రసాలము, సహకారము. ఈ నాలుగే సంస్కృతమున నుండు పేరులు. హిందీ, ఉర్దూ భాషలలో అమ్రశబ్ద తద్భవమగు ఆమ్ అను పదమొక్కటే ప్రచారమందున్నది. దక్షిణదేశ ముఖ్యభాషలగు తమిళ కర్ణాటాంధ్ర భాషలలో మాంగాయి యనియు, మావికాయ మాగాయ యనియు మామిడి యనియు పిలువబడును. ఫ్రెంచి, పోర్చుగీసు, ఇంగ్లీషువారు దక్షిణములోని రేవులలో నిల్చిపోయినప్పుడు మన మాగాయనే తమ భాషలోనికి తీసికొనిరి. పోర్చుగీసువారు మాంగే అనిరి. ఇంగ్లీషు వారు మాంగో అనిరి. కారణమేమనగా మామిడి యూరపు దేశాలలో నెందును పెరుగదు. అదే విధంగా ఈరాన్, అరేబియా, ఈజిప్టు దేశాలలోను ఈ పండు లేదు. అందుచేత వారును ఈ పండుకు కొత్త పేర్లు పెట్టిరి. అరబ్బులు అంబజ్ అనిరి. అది ఆమ్రశబ్దపు అపభ్రంశమే. ఈజిప్టువారు దానిని మంజా అనిరి. అది మాంగాయ నుండి యేర్పడినది.

ఒక్కొక్క దేశములో ఒక్కొక్క పండు ఆదిలో ప్రఖ్యాతి వహించి యుండెను. ఒక దేశమువారు మరొక దేశమునకు వ్యాపారార్థము వెళ్ళినప్పుడు విశిష్ట ఫలములను

ఇవికాక మరికొన్ని పేరులు గమనింపదగినవి. లంగడా, మాల్దా, సరౌలీ, సఫిదా, కీషభోగ్, ఫిబ్రీ, ఖబ్రీ, బేనిషాన్, మల్గోబ, తోతాపరి, నీలం, అనునవి కొన్ని. అందు హైదరాబదులో బేనిషాన్, మల్గోబా, తోతాపరీ, నీలం, ఎక్కువగా నున్నవి. అందు మొదటి రెండు శ్రేష్ఠమైనవి. తోతాపరీ చిలుక ముక్కువలె నుండుటచేత ఆ పేరు వచ్చినది. దీనిలోను, నీలంలోను పండు పక్వముకాగా పండు నుండి పురుగు వెలువడును. మామిడి పండ్ల కాలము ముగిసిన తర్వాత వర్షకాలములో తోతాపరీ, నీలం అమ్మకమగును. బొంబాయివారు ఆల్ఫన్ శ్రేష్ఠమైన దందురు.

ఒక రకపు మామిడి సంవత్సరమునకు రెండు మారులు కాయును. దానిని బారామసీ యందురు. దాని విశిష్టత రెండు మారులు కాయుటలోనే కాని తీపిలో లేదు.

హిందూస్థానములో బొంబాయి, బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశము, కర్ణాటకము, ఆంధ్రము మైసూరు ప్రాంతాలలో మామిడిపండ్లు సమృద్ధిగా లభించును. బీదరు జిల్లాలోని కోహీరు చాలా ప్రసిద్ధికన్నది. అదే మామిడికి మొదట పుట్టినిల్లు అని ఒకరన్నారు. బహుకాలమునుండి రాయచూరు జిల్లాలోని ఆలంపూరు, కర్నూలు జిల్లాలోని బనగనపల్లి మామిడిపండ్లకు బహు ప్రసిద్ధికన్న స్థలములు.

హైదరాబాదు ముషీరాబాదీ అనునవియు ప్రసిద్ధి కల్గినవి. అల్ఫన్ ఫఖ్రుస్సమర్ అన్నవి కూడా వ్యాప్తికన్నవి. హైదరాబాదులో ఇద్దరు నవాబులు 70 ఏండ్ల క్రిందట వారి మామిడి తోటలలోనే మునిగి తేలి వాటిలో శోధనలు చేసి వృద్ధికి తెచ్చిరి. వారిద్దరు ముసల్మానులు. ఒకరు నవాబ్ ముఖర్రబ్‌జంగ్ అనువారు. రెండవవారు ఆజమలీఖాన్ అనువారు. మొదటివారి తోటలలో సర్దార్ బాగ్, ఖుదాదాద్‌బాగ్ అను హైదరాబాదు నగరములోని తోటలు ప్రసిద్ధికన్నవి. అజమలీ కనిపెట్టినదేమో ఆజమస్సమర్ అన్నది. ఆ చెట్టు ఖుదాదాద్‌బాగ్‌లో సమృద్ధి. కాని ఆ పండ్లను నవాబెవ్వరికి ఇయ్యక కాపు పట్టగానే చెట్లపై అరబ్బుల పహిరా నెక్కించెడివాడు. ఆ పండ్ల రుచి అట్టిది.

ఆజమలీ తోటపండ్లను విక్టోరియారాణికి, ఏడవ ఎడ్వర్డు రాజుకు, ఆఫ్ఘనిస్థాన్ అమీరగు అబ్దుల్ రహమానుకు పంపుచుండిరి. అంతేకాదు. అజమల గొప్ప ఆమ్రఫలదాత. తను మెచ్చిన ఒక స్నేహితుని కొకనాడు 18 గంపలలో పండ్లను పంపెనట.

మరియు మసక అను హిందూ వైద్యులు బగ్దాదులో మామిడి పండును గురించి దాని లాభములను గురించి ప్రచారము చేసిరి.

ఇండియాలో ముసల్మానులు స్థిరపడిన తర్వాత వారి కన్నిటికంటె మామిడి పండు మజా దొరికెను. వారు దానిని ప్రేమించిన వారైరి. వారు వాటి అంట్లలో పరిశ్రమ పరిశోధనలు చేసి మేలైన రకముల నుత్పత్తి చేసిరి. విరివిగా తోటలను పెంచిరి. మహమ్మద్ బీన్ తుగ్లఖ్‌ను చరిత్రకారులు పిచ్చి రాజనిరి. అతనికి పట్టిన పిచ్చులలో మామిడి పిచ్చికూడా యొకటి. అమీర్ ఖుస్రూ అను సుప్రసిద్ధ విద్వాంసుడు మామిడిపండ్లు పండ్లలోనెల్ల శ్రేష్ఠమైనవని వ్రాసెను. బాబరు చక్రవర్తికి మనదేశం సరిపోలేదు. తన డైరీలో ఇట్లు వ్రాసి యుండెను. "ఈ దేశము అసహ్యామైనది. ఈ దేశం మనుష్య లసహ్యామైనవారు. వారి మొగాలు మరీ అసహ్యామైనవి." అంతా అసహ్యాం అసహ్యాం అని తిరస్కరించిన బాబరు మామిడిపండు పేరు చెప్పితే నోరు చప్పరించేవాడు. అక్బరు చక్రవర్తి చాలా ఆమ్ర వనములు వేయించెను. అందు దర్భంగా తోటలో ఒక లక్షకు మించిన మామిడి వనములను పెంచెను.

పోర్చుగీసువారు, ఫ్రెంచివారు కూడా మామిడి అంట్లలో పరిశ్రమ చేసి కొత్త రకముల పండ్ల నుత్పత్తి చేసిరి. ఇప్పుడు గోవాలో పెయరీ అను మామిడి వారి అంట్ల నుండి ఏర్పడినవే. ఫ్రెంచివారి యంట్లనుండి అల్ఫన్సో ఏర్పడెను. తమ రాజుపేరు వాటికిచ్చిరని యందురు. దానిని జన సామాన్యము అల్ఫన్ అందురు. అవి బొంబాయిలో అందును ముఖ్యముగా రత్నగిరి జిల్లాలోను విశేష వ్యాప్తి కలవి.

మామిడి పండ్లలో 500 రకముల పండ్లున్నవి. అందు 122 రకములు హైద్రాబాదు రాజ్యములో లభించును. మంచి జాతి పండ్లకు పేరులు కలవు. ఆ పేరులను బట్టి కూడా కొంత వాటి చరిత్ర తెలుసుకొనగలుగుచున్నాము. "సూరెబెహిష్త్" అని ఫార్సీ వారనిరి. అనగా స్వర్గములోని ఫలమని యర్థము. మనవారు అమరుల ఫలమన్న దానికిని దీనికిని దగ్గరి పోలిక కానవస్తున్నది. తైమూరీ అను ఫలము తైమూర్ లంగ్‌కు పసందైనదిగా కానవస్తున్నది. జహంగీరు అనుననది జహంగీరు చక్రవర్తి ఎక్కువగా పసందు చేసినాడని సూచించును. రాయలసీమ "రెడ్డి పసంద్" అన్నది కలదు. మరియు "నవాబ్ పసంద్" అనునదియు కలదు. బనగాన్ పల్లె నవాబో, హైద్రాబాదు నవాబో, ఏ నవాబు దానిని పసందు చేసెనో యేమో? దిల్ పసంద్ అన్నది ప్రతివాని మనసుకు మెచ్చువచ్చినదన్నమాట.

లభిస్తున్నవి. మామిడిపండ్లలో ఏ,బి అను విటమినులున్న వనియు అంచేత అవి చాలా బలకరమైనవనియు వైద్యుల యభిప్రాయము.

పూర్వమొకమారు పర్యానుండి యొక సర్దారు హిందూస్థానమునకు వచ్చి మామిడిపండ్ల రుచిచూసి తనదేశము పోయెను. ఈరానీ పాదుషా ఏమి విశేషాలని యడుగగా మామిడి రుచిని వర్ణించెను. ఆ రుచి యెట్లుందనగా తేనె తెప్పించి ఒకని పెద్ద గడ్డమునకు పూసి దానిని నాకిన కొంత కొంత మామిడి రుచి యర్థమగునని తెలిపెనట.

ఈజిప్టులో మామిడిని అమ్మన్‌రా అనియు నందురు. రా యన ఆ దేశభాషలో రవి యని యర్థము. రా దేవునికి ఆసిరాస్ అను దేవాధిదేవునికి తగువు కలిగెనట. తుదకు వారికి సమాధానమును మరొక దేవత కుదిరించెనట. అప్పుడు దేవాధి దేవుని సంతోషపెట్టుటకు రా దేభుడు హిందూస్థానమునుండి మామిడిపండు కొనిపోయి సమర్పించుకొనెనట. అప్పటినుండి దానిని అమ్మన్‌రా అనిరి. యథార్థ మేమన సంస్కృత ఆమ్ర శబ్దమే ఈజిప్టు వారినోట నలిగి అమ్మన్‌రా అయ్యెను.

మామిడిపండును గురించి ఫలశాస్త్ర చర్చ, వృక్షశాస్త్ర చర్చ, వైద్య చర్చ ఇంకా చాలా కలదు. ఇప్పటికిది చాలును.

పై విషయాలను విన్న తర్వాత మన మామిడిపండు ఫలచక్రవర్తి అనుట కెవ్వరైన సందేహింతురా? సందేహించినవారు మామిడి పండు రుచి యెరుగరన్నమాట.

❖ ❖ ❖

మామిడిపండ్లలో చిన్న నిమ్మకాయ అంతటివి, చిన్న గుమ్మడికాయ అంతటివి కూడా లభించును. ఒక్కొక్క పెద్దపండు 2 పక్కా శేర్లు తూగును. కాని అట్టి వరుదు. పలు విధములుగు రంగుల పండ్లును లభించును. ఎఱ్ఱనివి, ఆకుపచ్చనివి, పసుపు వన్నెవి, తెల్లనివి, ఊదారంగువి లభించును. మామిడి చెక్క, ఆకు, పూత, కాయలు, పండ్లు అన్నియు సువాసన కలవి. ఆ వాసనలు భిన్న భిన్నముగా నుండును. సువాసన కలిగి సులభముగా లభించునవి కావున హిందువులు పండుగ దినాలలో శుభ కార్యాలలో మామిడాకులతో ఇండ్ల నలంకరించుకొందురు.

మామిడిలో రెండు ముఖ్యమగు జాతులు కలవు. ఒకటి పీచు కలిగి రసముకలది. రెండవది పీచులేక కండ కలిగినట్టిది. రసముపండ్లు కూడా కొన్ని చాలా రుచి కలవి.

మామిడిని అనేక విధములుగా ఆహారముగా నుపయోగింతురు. కాయలను ఊరగాయలుగా వాడుదురు. మరియు పప్పులో చారులో నుడికించి వాడుదురు. కూరలలో వేసి ఉడికింతురు. వరుగుచేసి అవి లభించని కాలములలో పై విధముగా వాడుకొందురు. పక్వమైన పీచులేని వాటిని మురబ్బా జెల్లీగా చేయుదురు. ఔషధ ముగా వాడుదురు. మామిడి చెక్క రసమును వంధ్యలకు త్రాపుదురు. శ్రీకరణి అనుపేర మామిడి పండు రసముతో కలిపి సిద్ధముచేయు దానిని శ్రీకరణి యందురు. రసాలు దధ్నం అని రత్నావళియను సంస్కృత నాటకములో వర్ణించినారు. మనదేశములో మామిడిపండ్లు ఎక్కువైనపుడు సగము వరకు మురిగిపోవును. బీదవారు వాటిని తిని రోగముల పాలగుదురు. ఎక్కువగా నుండిన ఫలములను మురబ్బాలుగా చేసిన దేశసంపద వృద్ధియగును. ప్రభుత్వము వారీవిధానము విరివిగా ప్రచారము చేయవలెను.

హైదరాబాదు రాజ్యములో 1948 లో 18 లక్షల మణుగుల మామిడి పండ్లు తినియుందురని ప్రభుత్వమువారు లెక్కవేసి యుండిరి. ప్రతి సంవత్సరము 50 వేల మణుగుల వరకు బయటినుండి దిగుమతి చేసుకొందురు. హైదరాబాదు రాజ్యములో 23910 ఎకరాలలో మామిడి తోటలున్నవి. అందు 17 లక్షలు విత్తనం చెట్లున్నాయి. 90000 అంటుమామిడి యనియు అంచనా వేసినారు. అన్ని జిల్లాలపైకి ఔరంగాబాద్‌లో ఎక్కువ పండ్లును, నల్లగొండలో అన్నిటికన్న తక్కువ పండ్లును

"హిందువుల దేశంలో ఉన్ని చెట్లు కాస్తవట ఆ చెట్లలో పెద్దపెద్ద పిందెలు పుట్టుతావట. ఆ పిందెలలో నుండి చిన్న చిన్న తెల్లని మేకపిల్లలు పుట్టి, పెరిగి ఊడి పడతావట. ఆ మేకల ఉన్నితో యీ నూలు బట్టలు నేస్తారట!!"

నూలు బట్టలు ప్రపంచములో కనిపెట్టింది మొట్టమొటి వారు హిందువులని చెప్పితిని కదా! ఏ దుర్ముహూర్తాన వారిది కనిపెట్టినారోయేమో దాని మూలకంగా వారు బానిసలైపోయిరి. ఈ బట్టల వ్యాపారానికని విదేశాల నుండి అరబ్బులు, పోర్చుగీసువారు, పరాసులు, ఇంగ్లీషువారు, పారసీకులు ఎందరెందరో విదేశీయులీ దేశానికి వచ్చి, హిందువుల నానావిధాల బాధపెట్టి వారిని గులాములనుగా చేసుకొనిరి. పైగా పైగా యీ దేశములోనికి యేటేట విదేశాలనుండి 70-80 కోట్ల రూపాయల విలువకల బట్టలను విదేశాలవారు - ముఖ్యంగా ఇంగ్లీషువారు ఎగుమతి చేస్తూ దేశాన్ని దరిద్రంలో ముంచివేసినారు.

ఏనాడు నూలు బట్టల నాగరికత ప్రబలెనో ఆనాడే చాకలి జాతి ఒకటి యేర్పడెను. పూర్వకాలంలో అందరు బత్తలుగా తిరిగేవారు. ఆ దివ్యకాలంలో చాకలివాని పుట్టుపూర్వోత్తరాలే లేకుండ వుండెను. చాకలి జాతి ఏర్పడిన తర్వాత వారివల్ల ప్రపంచానికి చాలా నష్టం కలిగింది.

చాకలి జాతి చరిత్ర వ్రాయాలంటే అదొక పెద్ద గ్రంథమే అవుతుంది. నేనొకమారు చాకలి, మంగలి చరిత్ర వ్రాద్దామా అని గొప్ప గొప్ప గ్రంథాలు పరిశోధించి నోట్సు వ్రాసి పెట్టుకొని వుంటిని, కాని కొంత కాలానికి అభిప్రాయం మార్చుకొని ఉపసంహరించుకొంటిని. నాది కొంచెం ఉల్టా ఖోప్రా అవడం చేత ఒకటనుకొని ఒకటి చేస్తుంటానులెండి!

ఒక్కొక్క దేశములో ఒక్కొక్క తరహాగా వుంటారు చాకలివాండ్లు. కాని మనదేశం చాకలి వాండ్లదే ప్రపంచములో పై చెయ్యి అని చెప్పాలె. ఎందుకంటే ఏ దేశములోనైనా (ఒక్క మనదేశం తప్పితే) బట్టలతో రాళ్ళను బగులగొట్టే శక్తిసామర్థ్యాలు కల చాకళ్ళను మీరు చూసినారా చెప్పండి మరి.

ఇంగ్లాండు దేశంలో దుడ్డు పొగరుచేత సన్‌లైటు సోపు - గిన్‌లైటు సోపు బట్టలకు వాడుతారు. మనదేశములో దుడ్డు దుగ్గాని ఖర్చులేకుండా బట్టలను తెల్లగా చేసే ఉపాయం పూర్వకాలంలోనే అనగా నారదమహర్షి కాలంలోనే కనిపెట్టినారు.

బట్టల పస

"వస్త్రేణ వపుషా వాచా
విద్యాయా వినయేనచ
ఏతౌః పంచవకారైః వినా
నరో నాప్నోతి గౌరవం"

అన్నారు పెద్దలు. గౌరవం కావాలంటే మొట్టమొదట బట్టలు (డ్రెస్సు) బాగా ఉండాలి. అందుకే "స్త్రీ పసందు లేకున్నా చీర పసందుగుంది" అంటారు యువకులు. ప్రపంచములో బట్టపోషాకు చరిత్ర యీనాటిదా, మరి ఎన్నో వేనవేల యేండ్ల క్రిందటినుండి యీ విషయం వస్తూ వున్నది. అతి ప్రాచీన కాలంలో జనులు - అనగా మన ఆదిపురుషులు - ఆది స్త్రీలు - బట్టలు లేకుండా తిరిగేవారు. ఈ విషయాన్నే బైబిలులో "ఆదము-అవ్వ" కథలో ముద్దుగా యిమిడించివేసినారు.

ఈనాడు ఇంతమంది భావకవులు మన రాష్ట్రంలో కూడా తలెత్తుతున్నారు. కదా! వారిలో ఒకరైన మన అవ్వ తాతలైన ఆదాము-అవ్వ కథను పాడకపోయిరి కదా! ఈ ఆదిమ పురుషుల కథ బహు రమ్యమైనది. పాపం తిక్క పెద్దమనుషులు బరిబత్తుల ఇచ్ఛా విహారం చేసినారు. ఏమిన్నీ సిగ్గు అనేది వాండ్లెరుగరు. ఏడన్ (నందనవనం) తోటలో చేతుల్లో చేతులు పెనవేసుకొని తిరిగినారు.

ఆ కాలంపోయెను. తర్వాత స్త్రీ పురుషులకు సిగ్గు ఏర్పడెను. ఆకులు, ఈకెలు, తోళ్ళు నడుము చుట్టూ కట్టుకోబట్టిరి.

ఇంకా కొంతకాలానికి ఉన్ని బట్టలు నేయబట్టినారు. ఇట్లా వుండగా హిందూ స్థానములో హిందువులే మొట్టమొదట ప్రత్తిని కనిపెట్టినారు. ప్రత్తి పండించి దాని నుండి దారం తీసి వడికి, నేసి విదేశాలకు ఆ తెల్లని, సన్నని బట్టల ఎగుమతి చేయగా ఆ దేశాలవారు నోర్లు తెరచికొని బట్టలచూచి, ఎంత అడిగితే అంత ధనము యిచ్చినారు. వారా బట్టలు చూచి యిట్లు అనుకొన్నారు.

"చాకివానితోడ జగడాలు పడలేక
సిరి గలాడు పట్టు చీర గట్టె
శివుడు తోలు గప్పె సీ! యని మదిరోసి
భైరవుండు చీర పారవైచె"

చాలామంది పెద్ద పెద్ద వేదాంతులు, త్రిమూర్తులలో విష్ణు వెందుకు పట్టుపీతాంబరం కట్టుతాడు. శంకరుడు ఏనుగుతోలెందుకు కట్టుకున్నాడు. భైరవుడు సిగ్గూ శరము లేక దిస్సమొలతో ఎందుకు తిరుగులాడుతాడు అనే విషయాన్ని చర్చించి చర్చించి యెక్కడికీ నిర్ణయించలేకపోయిరి. యిప్పుడర్థమైందా వానిలోని నిజమైన తత్త్వం.

చాకలివాండ్లు ఇంకా చాలా చాలా అన్యాయాలు చేస్తారు. వారెప్పుడూ బట్టలు కొననే కొనరు. మంచి మంచి దొరలవి దొరసానులవి బట్టలు తమ కంటికి నచ్చినవి కట్టుకొని తిరుగుతుంటారు. పైగా బీదవాండ్లకు పెండ్లి పేరంటాలకని కిరాయికు మంచి మంచి బట్టలిస్తారు. ఇంతేకాదు, పల్లెలలో పెద్ద పెద్దవాండ్ల ఇండ్లలో శుభకార్యాలైతే ఊరేగింపులప్పుడు వారు నడుచుటకుగాను ఊరివారి చీరలు బాటలలో పరుస్తారు. పాపము! ఎందరివో సుందరాంగుల కోమల శరీరాల నలంకరించే చీరెల మోటువారి కాళ్ళ చెప్పుల క్రింద త్రొక్కబడుతూ ఉండును.

బట్టలు కట్టేవాండ్లకు ఒక్క చాకలివాండ్లతోనే కాదు అవస్థ. వారికంటే యెక్కువ నష్టము చేసి కొంపలు తీసేవాడు దర్జీవాడు. పూర్వకాలంలో మన దేశంలో దర్జీల కంతగా పనిలేకుండేది. కాని ఇంగ్లీషువారు వచ్చిన తర్వాత దర్జీల పంట బంగారు పంట అయింది. వారి విగ్రహాలను చేసి దర్జీలు పూజించుకుంటే తప్పులేదంటాను.

మనదేశంవారు ఇంగ్లీషు వారి వలెనే కోటు సూటు వేస్తే గౌరవం దొరుకుతుందని సూట్లు వేయబట్టిరి, ఆ సూట్లను కుట్టుటకై విపరీతమైన కూలీ యియ్యవలసి వస్తుంది. సికింద్రాబాదులో ఉండే ఇంగ్లీషు కంపెనీలో పోలీసు డ్రెస్సు ఒక్క సూటు కుట్టించుకుంటే 3000–4000 రూపాయీల కూలీ మాత్రమే అవుతుందట. ఇక మామూలీ సూట్లకు 15 నుండి 50 రూపాయల వరకు కూలీ తీసుకొనే దర్జీలు వున్నారు. కూలీతో మాత్రమే గ్రహచారం పోదు. బట్ట కొలతలలో కొంత కొట్టివేస్తారు. అస్తరు గిస్తరు పేరు చెప్పి కొంత కొట్టివేస్తారు. యిట్లా ఎన్ని విధాలనో క్షౌరం కావలసివస్తుంటుంది.

ఏమిటంటే ఒక పెద్ద కాగులో నీళ్ళుపోసి దానిలో కొంత చౌడు, కొంత పేడ వేసి కలిపి మైల బట్టలు అందులో వేసి క్రింద నిప్పు అంటించి, బాగా ఉడికించుతారు. ఇది నిజము కాదనుకొనే పట్టణవాసులు పల్లెలలోని చాకళ్ళను విచారించితే తెలుస్తుంది.

నారదుడంటే జ్ఞాపకం వచ్చింది. అసలు నారదుడెవరనుకున్నారో! ఆయన చాకలిదానికి పుట్టిన రహస్యం చాలా మందికి తెలియనే తెలియదు. చాకలి కులంలో పుట్టినందు వల్లనేమో ఆ నారదునికి కొట్లాటలు పెట్టే దాంట్లో మంచి ప్రవీణత కలిగింది. ఇంత గొప్పవాడు తమ కులంలో పుట్టినగాని చాకలివాండ్లు ఆయనను తలచుకోనే తలుచుకోరు.

చాకళ్ళు బండలకు వేసి బట్టలు ఝాడించి కొట్టడం త్వరగానే బట్టలు చినిగిపోవడం మరల క్రొత్తవి తెచ్చుకోవడం, క్రొత్తవాటిని కూడా ఉడికించే అప్పుడు కొంత కాల్చడం, లేకుంటే ఇస్త్రీ చేసే అప్పుడు మాడ్చడం లేకపోతే ఒకరి బట్టలొకరికి మార్చి యియ్యడం, లేకపోతే 16 మూరల చీరను 8 మూరలుగా మార్చుకొని తేవడం ఇట్లాంటి ఘోరాలు చాలా చేస్తూ ఉంటారు.

అయినా చాకలి వాండ్ల కిచ్చిన మర్యాద మరే జాతికిని కూడా హిందువులియ్యలేదన్నమాటే. ఎట్లంటే చదువుకొన్నాళ్ళకంటే చాకలోండ్లే మేలని ఎన్నడో పూర్వకాలంలోనే నిర్ణయం చేసిపెట్టినారు. ఇంతేకాకుండా వారే నిజమైన దాతలట. తీసుకుపోయిన బట్టల అట్లే మాయం చేస్తూ ఉంటే లోకంలో మళ్ళీ జనులు నగ్నులు కావలసిందే కదా! అందుచేతనే పూర్వమొక పెద్దమనిషి ఒక వూరికిపోయి ఆ వూరి పెద్దమనిషితో ఇట్లా సంభాషించినాడట.

"కో దాతా?"

"రజకో దదాతి వసనాన్ ప్రాతర్గృహీత్వానిశి"

"అయ్యా యీ వూర్లో దాత యెవ్వడు" అంటే "చాకలోడే దాత!" అతని పుణ్యమా అన్నట్లు పొద్దున్నే బట్టలు తీసుకొని లెక్క తప్పకుండా రాత్రికంతా ముట్టచెప్పుతాడండీ స్వామీ! అన్నాడట ఆ వూరి పెద్దమనిషి.

అయినా యీ చాకలివాండ్లు పెట్టే ముప్పుతిప్పలకు భయపడిన త్రిమూర్తుల గతి యెట్లయిందనగా –

వేమన యోగి కూడ నగ్నతత్త్వాన్ని బోధించినవారే. వారేమన్నారనగా

“తల్లి గర్భమందు తా బుట్టినప్పుడు
మొదలు బట్టలేదు తుదిని లేదు
నడుమ బట్టగట్ట నగుబాటు కాదొకొ
విశ్వదాభిరామ వినరవేమ”

ప్రపంచంలో పురుషుల్లోను, స్త్రీలల్లోను తరహాలు తరహాలుగా వస్త్రాలంకారాలు చేసుకుంటారు. అందరికంటె మితవాదులైనవారు నీగ్రోలు. ఆఫ్రికాలోని సిద్దీలు స్త్రీలుగాని, పురుషులుగాని నిన్న మొన్నటివరకు నగ్నంగానే తిరిగేవారు. కాని పాశ్చాత్యులాదేశంలో కూడ మన దేశంలోవలె ప్రవేశించిన తర్వాత వారికి బట్టలు కట్టే నాగరికతను నేర్పబట్టినారు. మొట్టమొదట డేవిడ్ లింగ్‌స్టన్ అనేవాడు ఆఫ్రికాకు పోగా అచ్చట సిద్దీలు అతని బట్టలు చూచి ఆశ్చర్యపడి బట్టలలోపలి శరీరం ఎట్లుంటుందో అని బట్టలన్నీ విడిపించి పరీక్ష చేసినారట: పాశ్చాత్యులెంత నాగరికత నేర్పినా యిప్పటికి ఆ దేశంలో నగ్నత్వం పూర్తిగా పోలేదు. ఆదిమనివాసు లేదేశంలో ఉన్నా సరే – ఇండియాలో గోండులు, నీలగిరి ఆటవికులు – ఆస్ట్రేలియా అడవివారు, ఆఫ్రికా సిద్దీలు దక్షిణ అమెరికా రెడ్డిండియనులు, – మున్నగువారంతా భ్రమలేనివారు. నాగరికత హెచ్చేకొలది బట్టలపైన ప్రీతి యెక్కువౌతుంటుంది.

హిందువులు ధోవతి, ముసల్మానులు లాగులు, పాశ్చాత్యులు సూట్లు, జపాను, చీనావారు లుంగీలు – ఈ ప్రకారంగా నానా దేశాలలో నానా విధాలుగా బట్టలు కట్టుకుంటారు. ఇవన్నింటిలో యేది శ్రేష్ఠమని నిర్ణయించేదే కష్టము. అయినా గువ్వల చెన్నడు అనే ఆంధ్రకవి పూర్వమిట్లు తన నిశ్చితాభిప్రాయమును ప్రకటించి వుండెను.

“అంగీలు పచ్చడంబులు
సంగతిగాశాలు జోళ్లు సరిగంచుల మేల్
రంగుల దుప్పటులన్నియు
గొంగడి సరిపోలవన్న గువ్వలచెన్నా”

ఇప్పుడిప్పుడు పాశ్చాత్య దేశాలలో మళ్ళీ బుద్ధితెచ్చుకున్న కొందరు స్త్రీ పురుషుల నగ్న సంఘాలను స్థాపించి చాకలివాండ్ల నోట్లో దర్జీవాండ్ల నోట్లో దుమ్ము కొట్టినారు. నగ్న సంఘములో చేరిన తర్వాత బట్టల గౌరవం తగ్గేదానికి మారుగా హెచ్చుతుందని నా అభిప్రాయం. ఇప్పుడు మనదేశంలో వుండే వారంతా భోగంవారంత నగ్నంగా తిరిగితే వాళ్ళలో నూటికి 90 మంది గుట్టంతా బయటపడి వారి జీవనాధారమే ఆగిపోతుంది. మరియు మగవాళ్ళలో లావైనవాళ్ళు, పొట్టలు పడినవాళ్ళు, వికారాకారములు గల అవయవాలు కలవాళ్ళు వీరి గుట్టంతా బయటపడుతుంది. బట్టలు తీసివేస్తే, ఇంకో విషయం. మనదేశంలో బట్టలను గురించి కలహాలు కలుగుతూ వుంటవి. అదేమిటంటే ప్రపంచములో యెక్కడ లేని తమాషా మన హిందూస్థానంలో వుంది. యూరోపులో అమెరికాలో ఫలాని దేశమువాడు అని ఒక మనిషిని బట్టలు చూచి గుర్తించలేము. కాని మన హిందూస్థానంలో మన వేషాలే మనల పట్టించుతవి.

సాహెబులకు ఎర్రఝెండా వంటి టోపి, హిందువులకు ధోవతి చూస్తూనే చెప్పవచ్చును. విభూతి లింగాన్ని చూచి జంగమని, నామాలను చూచి వైష్ణవులనీ, జందెము పింజకట్టు చూచి బ్రాహ్మడనీ, చంకలో సంచి చూచి మంగలనీ యీ ప్రకారముగా యించుమించు అందరినీ గుర్తించవచ్చును. అదేవిధంగా స్త్రీలలో బెంగాలీని, పార్సీని, గుజరాతీని, అరవస్త్రీని, ఘూర్కాను మరాటీలను, ఆంధ్రులను ఎవరినైనా సరే చీరకట్టును చూచే గుర్తించవచ్చును.

అయితే యీ యిబ్బందుల కంతా ఒకటే మందు ఏమనగా నగ్నత్వము అని అంటిని కదా. దీనిని కనిపెట్టినది పాశ్చాత్యులే అని అనుకోవడం తప్పు. 2500 ఏండ్ల క్రిందటనే మన దేశములో జైనులు మొట్టమొదట నగ్న సిద్ధాంతమును కనిపెట్టినందులకు వారి గొప్పతనాన్ని ఎంత పొగడినా చాలదు. బట్ట విడిచేసి తిరగే పురుషుడు త్రిలోకీ విజయుడు అని చెప్పవలసినదే. ఎందుకంటే

"లజ్జామేకాం పరిత్యజ్య
త్రిలోకీ విజయీభవేత్"

అన్నారు శాస్త్రజ్ఞులు. మగవాని కథే యిట్లుంటే స్త్రీలను గురించి యింక చెప్పేదేముంది. కాని హిందువులెంత దుర్మార్గులో యేమో జైన సిద్ధాంతాన్ని నాశనం చేసి అందరికీ బట్టలు కట్టించి తుదకు కర్మ పరిపాకం చేత తామున్ను బానిసలై పోయిరి.

నంబూద్రీలలో "సాధన" యను నొక పంచాయతీ సభ కలదు. అందు నంబూద్రీ స్త్రీ యెవ్వతెయయిన వ్యభిచరించినటుల వ్యక్తమయిన నామెనీ "సాదన" యందు విచారించి యామెను, యాయమతో వ్యభిచరించిన వారిని బహిష్కరించెదరట! అట్టి సందర్భములందు వెలియయిన జాతులలో చాక్యారు జాతి యొకటి యని కొందఱి మతము. ఈ చాక్యార్లేది ప్రదర్శించినను "శకుంతలా నాటకము" జోలికిఁ బోరఁట! దానికి కారణమిట్లు చెప్పుదరు. ఏదోయొక్క సందర్భమున యొక పాత్ర రెండు ప్రక్కల యొకేమారు చూడ తటస్థించగా దాని నభినయింపఁబోయి యంధుఁడయ్యెనఁట!

వీరు ప్రదర్శించు నాటకములు, కథలు సంస్కృతమందే యుండును. వారు మళయాళములో వ్యాఖ్యానముచేసి సభాసదుల రంజింపజేయుదురు. అనేక సందర్భములందు వీరు తాము రచించిన శ్లోకములను జదివి వాని యర్థమును దినములకొలది విపులముగాఁ జెప్పుచుందురట. ఆ శ్లోకముల వీరెవ్వరికిని జెప్పరట. కాని కుతూహలులు కొందరా సమయములందు దొఱకినన్ని వ్రాసుకొని యుంచుదురు. నాకుఁ గొన్ని యొక మిత్రుఁడీ క్రింది వానిని వ్రాసియిచ్చెను.

పరుశురామునికిని, శ్రీరామునికిని జరిగిన వాదమును దెల్పు నీ క్రింది శ్లోకము.

శ్లో॥ రేరే రాజకులాధమ – ప్రకటింత బ్రాహ్మణస్సైరిద్ధ
నవ్వేకాం రజీచరీం త్వమధీత్ – మాతానమే తాటకీ
నక్షత్రా పృథీవీమయా ననుకృతా – కోహంభవాన్ సత్యవాక్
ఇత్థం భార్గవ రోష పోషణవరః తస్థౌ రఘూణాంపతి॥

పరుశురాముడు రామునితో "ఓరీ రాజకులాధమాయని పలుక రాముడు నీ యస్త్రములను జూచినంతటనే నీ బ్రాహణ్యము గుఱ్ఱయ్యెను. అనగా నీవెంత యుత్తముడవో తెలిసెను అని పల్కెను. అంత పరుశురాముడు, నీవేకదా నిస్సహాయయైన యాడుదానిని జంపినది. అనగా రాముడు అయితే తాటకి నా తల్లి కాదు లెమ్ము, అని గూఢముగా నాక్షేపించెను. మరల పరుశురాముడు "నేనెవ్వరు తెలియునా? ప్రపంచములోని క్షత్రియులందఱిని నాశన మొందించినవాడనని గర్వముతోఁ బలుక రాముడు అయితే నేనెవ్వడను, నీ సత్యమెట్టిదని 'పల్కెనట"!

చాక్యార్లు

మలబారులో చాక్యార్లు అను బ్రాహ్మణ జాతి యొకటి కలదు. ఈ జాత్యుత్పత్తి విషయము యనేకులనేక విధముల వ్రాసియున్నారు. నాగమయ్య తన మాన్యూలులో వీరు శ్లాఘ్య వాక్కుకారులగుటచే నా పదమే యపభ్రంశమున 'చాక్యార్లు' అయ్యెనని వ్రాసియున్నాడు. ఈ జాతి మొదలు నంబూద్రీ బ్రాహ్మణులలో జేరినదయి కొన్ని యాచార లోపములచే నేటి కాలమున నించుక హీనముగాఁ జూడఁబడుచున్నది.

ఈ చాక్యార్లు మన యాంధ్రమున భాగవతుల రీతి కథా కాలక్షేపము చేయువారై నాటక ప్రదర్శనములచే లోకుల రంజింపఁజేయువారే కాక, హాస్యమునకు నిధులయి పాండిత్య ప్రకర్షచే కవులయి గౌరవముతో భావింపబడుచున్నారు. వీరి నాటకమును "చాక్యారుకూతు" అని చెప్పెదరు. వీరి ప్రదర్శనము కొన్ని సమయములందనేక దినములవఱకు జరుగుచుండును. వీరి ప్రదర్శనమును థర్స్టన్ ఇట్లు వర్ణించినాడు. ముఖ్య పాత్రయైనవాడు ముక్కాలి పీటపై కూర్చునియుండును. జలతారంచులు కల యొక పెద్ద తలపాగను చుట్టియుండును. రంగులయంబుగల పెద్ద వస్త్రము నొకదానిని నడుము చుట్టును మడతలు మడతలుపడ చుట్టియుండును. అతని వెనుక నొక నంబియారు స్త్రీ నిలిచి యుండును. చాక్యార్లు సభ్యుల నవ్వించుచుండినను నిశ్చలముగా గూర్చొనినట్టి యొక ప్రదర్శకుఁడొక మూలనుండును. ఇతఁడెప్పుడైన నించుక నవ్వినట్లయిన చాక్యారు తన కథను చాలించును. ఒక తూరి చాక్యార్లు మహాభారత మందు దుర్యోధనుఁడొక పల్లియ సయితము పాండవులకివ్వననుట ప్రదర్శించుచుండ పాండవ పక్షపాతియైన యొక సభ్యుడు మైమఱచి సభారంగమునకురికి, ఓరి. పాప మాపాండవులింతగా దీనులయి వేడుచుండ యొక యంగుళపు భూమియైన నొసఁగననెదవా, యని దుర్యోధన పాత్ర ధారిని చావమొత్తెనట! అప్పటినుండియు చాక్యార్లు కూతును గృహములలో ప్రదర్శింపక దేవాలయములందే ప్రదర్శింప వలయునని శాసించిరట.

కౌసల్యా తనయుని యందు సుమిత్రాత్మజునికెంత భక్తి యున్నదో యంత భక్తి యొకే తల్లికి జనించిన నాయందు నీకు లేకపోయెను గదా యనియు, నా మాటలకు నీవు కోపించిన తూష్ణింభావమైన వహింపక (సద్యః) తక్షణమే రాఘవుని పక్షమున జేరుటచే నీ యందు ధర్మచింత కాక ద్రోహ చింతయే యున్నదనియు రావణుడు విషాదముతోఁ పలుకుచున్నాడు.

ఇట్టి శ్లోకము లనేకములున్నను నాకు లభ్యములైన వివియే. తక్కినవాని నింకను ప్రయత్నించుచున్నాను.

ఈ చాక్యార్లు హాస్యరస ప్రధానులు. వారికి రాజానుగ్రహము మెండు. ఒక మారు దామోదరన్ అనువాడు మహోదర వ్యాధితో జిక్కి ప్రదర్శించుటను మానగా నచ్చటి రాజు వీనిని జూచి "ఓయి దామోదరన్ నీ స్థితి నాకు వ్యసనము గలిగించెను. అని పలికిన వెంటనే యితడు, స్వామీ! నన్నింక దామోదరన్ అని పిలువకుడు. మహోదరన్ అని సంభోదింపుడు" అని పలికెనఁట.

మళయాళములోని పూజారులను శాంతి విప్రులనెదరు. ఒక చాక్యారుతో శాంతి విప్రుడొకనాడు చాలాసేపు మాట్లాడి శాంతికి (పూజకు) వేళయైనది పోవలయును అని చెప్ప ఓయి మీ శాంతి యెట్టిదో నాకు దెలియును అని యిట్లాశువుగా శ్లోక మొకటి రచించెనట.

శ్లో॥ శాంతి ద్విజః ప్రకురుతే బహు దీప శాంతీం
పక్వాజ్య పాయస గుళైర్జఠరాగ్ని శాంతీం!
తత్రత్య బాల వనితా మదనాగ్ని శాంతీం
కాలక్రమేణా పరమేశ్వర శక్తి శాంతీం!

దీపార్చనలకై యిచ్చిన నూనెను భక్తులు తరలినంతటనే దీపములు నార్పి బుద్ధితో నూనె నింటికి తీసుకొని పోవుటచేతను స్వామి కర్పించిన పాయసాన్నములతో తమ పొట్టలనింపుటచేతను, తిన్నగా దేవుని శక్తిని సహితము పోగొట్టువారని చెప్పెనట! ఈ శ్లోకమువంటిదొకటి ఆంధ్రదేశములో ఈ విధముగా ప్రచారమందున్నది.

పూర్వ జన్మని చోరత్వాత్
జారత్వా దిహజన్మని
అరిత్వాద్దేవ పూజాయాం
పూజారి రితి కథ్యతే॥

శ్లో॥ రామాయ ప్రతిపక్ష కక్ష శిఖనేదాస్వామి వామైథిలీమ్
యుద్ధే రాఘవ సాయకైర్విహతస్సర్గం గమిష్యామి వా
నీతిజ్ఞే!! కథయస్వ, దేవి! కథమౌ పక్షో గృహీతస్త్వయా
సుశ్రావ్యం ప్రియ మస్మదీయ మభవ న్మాత్రావశేషం బలం

ఇంద్రజిత్తు చనిపోయిన తర్వాత రావణుడు భీతిచే తన భార్యను కర్తవ్యమును విచారించు విషయమును వర్ణించుచున్నది పై శ్లోకము. దానికి మండోదరి ఈ క్రింది శ్లోకమున ప్రత్యుత్తర మొసంగుచున్నది.

శ్లో॥ దృష్ట్వాదైన్యం భగిన్యాః సునయ! ఖరవదం మాతులస్యాపినాశం
సాలానాంభంజనం తత్కపివరనిధనం తచ్చ సుగ్రీవ సఖ్యం
కర్మాణ్యుద్యాన హర్తుః జలనిధి నియమం యోన జాతస్తదానీం
సోయం నష్టే కులేస్మిన్ కథమితర్జాయతే తేవివేకరిః

ఈ శ్లోక మందు వాలిపేరు చెప్పక తత్కపివర యని చెప్పుటచే రావణునికి భీతి కలిగించుట, అట్టి వానినే చంపినవాడు గాన రాముని శక్తి చూపించుట విశేషము. అదే రీతి హనుమంతుని "ఉద్యాన హర్త" యని సంబోధించినది. ఇట్లందరును చచ్చియుండ యిప్పుడా నీకు వివేకము వచ్చినది అని రావణుని భార్య యాక్షేపించెనట!

తుదకు రావణుఁడు యుద్ధము జేయు సమయమున యతడు దశముఖుడు కాన కవి చమత్కారముగా నవరసములకు మారుగా దశరసములు రావణుని యందుఁ గనబడెనని క్రింది శ్లోకమందు వర్ణించి యున్నాడు.

శ్లో॥ నాశ్చర్యం రామభద్రే సచటుభట ముఖే సవ్యథం దేవతూర్యే;
నాశం యుద్ధే న కోపం కపిషు సవినయం లక్ష్మిణే సాశ్రుపూర్యాం
సాసూయం భాతృ కృత్యే, సభయ మనిలజే సత్ర పంచాత్మ వృత్తా
ఇత్యేవం వక్త్ర చక్రం రజనిచు పతే ర్భిన్నభావం బభూవ

రావణుడు యుద్ధము సేయు సమయమున తమ్ముడగు విభీషణుని జూచి యసూయతో (సాసూయం) నిట్లు పలికెను.

శ్లో॥ సత్యం నామ వయం విభీషణ పరిత్యాజ్య వవస్థాంగతః!
త్వంచాస్మ ద్వచనాపరాధకుపిత స్సవ్యశ్శితో రాఘవం
ఏ తత్వా మనుశోచతే దశముఖో దృష్ట్వా కయోద్వీక్షసే
కౌసల్యాతనయానువృత్తి జటిలం మిత్రం సుమిత్రాత్మజం॥

మూన్నాళ్ళ ముచ్చటతో చచ్చేదానికి కూడా చరిత్ర కావలెనా అని నిస్పృహులై చరిత్రలు వ్రాసిపెట్టిన పాపాన పోలేదనియు తెల్లవారు బాగా ప్రచారము చేసిరి. కాని అది పూర్తిగా అంగీకరింప దగినది కాదు. ఋగ్వేదము కంటే ప్రాచీనమగు గ్రంథము ప్రపంచమందు లేదని వారంగీకరించినారు. అంతటి ప్రాచీన గ్రంథములో ఒక అక్షరము హెచ్చుగాక తచ్చుగాక నేటి వరకు రక్షించుకొని వచ్చిన వారికి చరిత్రాభిమానము లేదనగలమా? మన పురాణాలన్నియు మన చరిత్రలే కాక మనకు పశ్చిమముగా ఉత్తరముగా నుండిన తార్తరీ, తుఖార, ఈరా, కాస్పియ సముద్ర తీర దేశాలు, బాబిలోనియా, ఆసిరియా, ఫ్రిజియా వంటి దేశాల చరిత్రలు కూడ అందుండెను. ఆదికాలములో అనగా 2500 ఏండ్లకు పూర్వము ఏర్పడిన పురాణాలలో సరియగు చరిత్ర లుండెనని ఊహించుటకు కావలసినన్ని నిదర్శనముల కలవు. కాని క్రీస్తు శకాద్యనంతరము పురాణాలలో హస్త క్షేపము చేయుచూ వచ్చిన వారికి ప్రాచీనుల భౌగోళిక చారిత్రక పరిజ్ఞానము శూన్యమగుటచేత సప్తసముద్రములను, సప్త ద్వీపాలను పిచ్చిగా వర్ణించి రాక్షస కిన్నర పిశాచాసురాదులను సృష్టించిరి. ఈ వర్గాలవారందరు మన కుత్తరమున పశ్చిమమున నుండు దేశాలలోని ప్రాచీన జనులేయనియు, సప్త సముద్రాలన్నియు అచ్చటి నదులన్నియు, సప్త ఖండాలున్నూ అచ్చటి దేశాలనియు బాగా నిరూపించుట కే సందేహమునూ లేదు. పురాణాలపై చేతులు వేసినవారు మనకు గొప్ప అపకారమును చేసిపోయిరి. మనలో విద్యా ప్రయత్నమునకు తక్షశిల, నలందా, అమరావతి, కాశ్మీరము, కాశి, మధురాది విద్యాపీఠముల దివ్య చరిత్రయే సహస్రవిధముల చాటుతుంది. ఒక్క తక్షశిలలోనే 10వేల విద్యార్థులు, చీనీ, ఈరాన్ ప్రాంతాలనుండి వచ్చిన వారును ఉండిరనియు, 200మంది ఆచార్యులుండిరనియు, శత సహస్ర గ్రంథముల భాండాగారము (రత్నగంజ) యుండెననియు, ముస్లిముల మొదటి ధాటిలోనే అవన్నీ అగ్గి పాలయ్యెననియు, ముస్లిములు ఆక్రమించిన ప్రతి ప్రాంతములో గ్రంథములను దగ్ధము చేసిరనియు తెలిసికొనిన మన అమూల్య సంపద ఎంత నాశనమయ్యెనో తెలుసుకొనవచ్చును. ప్రపంచ వాఙ్మయములో మొదటి కథ మనది; మొదటి వ్యాకరణము మనది. ఈ విధముగా లెక్కించి వివరించుచూ పోయిన గ్రంథము చాలాపెరిగిపోవును. మన పూర్వులు చరిత్రలు వ్రాసినవారు కారనుట ఉత్ప్రేక్షాతిశయాలంకారములలో చేర్చదగిన మాటలు.

మన కవసరమగు చరిత్రలు

సృష్టి యంతయు చరిత్రాత్మకమే. దాని నిజమైన చరిత్ర ఆ సృష్టికర్తకే యెరుక. సృష్టిలో మానవుడొక్కడే చరిత్ర వ్రాయగలవాడు. కాని వానికి తన చరిత్రయే తెలియదు. మానవ చరిత్ర మనకు 6000 సంవత్సరములకంటె ఎక్కువగా తెలియదు. అంతకు పూర్వముదంతయు ఊహలతో నిండినది. చరిత్రను సైన్సుతో లంకె పెట్టి ఈ కాలమందనేక పరిశోధనలు చేస్తున్నారు. తత్ఫలితముగా మన కనేకాద్భుత విషయాలు తెలియవస్తూ యున్నవి.

చరిత్ర యొక్క నిరూపణమును నిరుక్తమును ఉద్దేశమును గూర్చి పలువురు పలు విధములగు అభిప్రాయములను 2500 సంవత్సరాల నుండి యిస్తూ వచ్చినారు. ప్రాచీన గ్రీకు వేదాంతియగు డయొనీషియస్ "నిరూపణములతో బోధించు తత్త్వశాస్త్రము చరిత్ర" అని చెప్పెను! ఒక శతాబ్దమునకు పూర్వమందుండిన డాక్టర్ ఆర్నాల్డు ఇట్లనెను. "సభ్య మానవుని ఆంతరంగిక జీవితమును సన్నిహితముగా స్పృశించి వాని సాంఘిక రాజకీయ సాంప్రదాయక నిర్మాణముల నిమ్నోన్నతముల నిరూపించుటే దాని ముఖ్యోద్దేశము".

నాగరిక మానవ చరిత్రయే సరియగు చరిత్ర యను భావము పూర్వ కాలముదై పోయినది. ఆటవికుల చరిత్రయే యీనాడు మానవుని అతి ప్రాచీన చరిత్ర కుపకరిస్తున్నది.

మన పూర్వులలో చరిత్రలు

ఇతరుల సంగతికంటే ముందుగా మన సంగతినే తెలుసుకొందము. హిందువులు చరిత్రలు వ్రాయు నలవాటు లేనివారు. బ్రహ్మ సత్యం జగన్మిథ్యా అనియు, సర్వాం క్షణక్షణిక మేవ అను జైన బౌద్ధ నినాదాలను హిందువులు స్వీకరించి, ఈ

ఆంగ్ల చరిత్రకారులు

మనకు ఇంగ్లీషు జాతితో లంకె కుదిరిన తర్వాత నష్టాలున్నూ లాభాలున్నూ ఇంచుమించు సమభాగాలుగా సంక్రమించినవి. లాభాలలో చారిత్రక దృష్టి గాఢమై ఆధునికమై విజ్ఞానప్రదమైన దొకటి. ముసల్మాను ప్రభువుల మూలాన నాశనమై దగ్ధమై దిబ్బలై పూడిపోయిన మన కళలను ఇంగ్లీషువారు పైకి దీసిరి. మన వేదాలను, స్మృతులను, పురాణాలను, కావ్యాలను, ఇంగ్లీషులో చక్కని చారిత్రక పీఠికలతో ముద్రించిరి. ఈ కార్యమందు ఇంగ్లీషువారు మాత్రమే తోడ్పడినారనుట కాదు. ఫ్రెంచి, జర్మన్, రష్యన్, అమెరికన్ వంటి జాతుల వారున్నూ గొప్ప పరిశోధనలు చేసిరి. మనకు వారి పరిశ్రమ యంతయు ఇంగ్లీషు భాష నుండియే లభ్యమైనందున ఆంగ్ల భాషోపకారమును మనము విస్మరింపజాలము. చరిత్రకుపయోగకరమగు శాసనములను; తాళపత్రాది గ్రంథములను, ప్రాచీన శిల్పములను ఉద్ధరించి రక్షించి పరిశోధించి మనకందించిన కీర్తి ఇంగ్లీషు వారికి చెందును. అయితే ఒక దిక్కు ఇట్టి ప్రయత్నాలు జరిగినను మరొక దిక్కు ఇంగ్లీషు ప్రభుత్వము పరిపాలక దృష్టితో తమ సంస్కృతికి ప్రాధాన్యమిచ్చి భారతీయుల కొంచెపుదనమును చూపించి చరిత్రలు వ్రాసి విద్యార్థులచే చదివించిరి. కొందరు మిషనరీలు మత దృష్టితో గ్రంథాలు వ్రాసి మనల నవమానించిరి. మరికొందరు తెలిసియో తెలియకయో మన పూర్వ చరిత్రకు ప్రాధాన్యమియ్యకపోయిరి. మన కళాశాలలో గ్రీసు, రోము చరిత్రలు చదివించిరి. కాని, మనకు సంబంధించిన ఈజిప్టు, చీనా, ఆసియా, ఖాల్డియా, పర్షియా, బర్మా, మలయా, ఇండోనేషియా, ఇండోచీనా చరిత్రలో నేవియు చెప్పింపలేదు. ఇంగ్లీషువారు వ్రాసిన చరిత్రలలోను వారి విజ్ఞానకోశాలలలోను మనలోని గొప్పవారిని గురించి ముచ్చట్లు కానరావు. లోకోత్తర చిత్రలేఖనములలో అజంతా పేరే లేదు. లోకోత్తర శిలా శిల్పములలో మన ఎల్లోరాను స్మరించుట అరుదు. యూక్లిడ్ సూత్రాలనే పేర్కొందురు కాని మన శుల్బ సూత్రాల నడుగరు. మన వరాహమిహిరుడు, లీలావతీకర్తయగు భాస్కరాచార్యుడు వారికి కానరాలేదు. బీజ గణితమును మనము కనిపెట్టితే 'ఆల్‌జీబ్రా'ను అరబ్బులే కనిపెట్టిరని ప్రచారము చేసిరి. 300 ఏండ్ల క్రిందట వెనిసులో గ్యాలిలయో అను మహామేధావి పుట్టి సూర్యుని చుట్టే భూమి గిర్రున

ఇతర ప్రాచీన చారిత్రక దేశాలు

పూర్వకాలములో అసీరియా (అషుర) దేశము చాలా గొప్ప సభ్యతగలది. అచ్చటివారు పచ్చియిటికలపై వ్రాసి వాటిని కాల్చి గ్రంథములుగా వాడుకొనిరి. హట్టి, ఖస్సీ, జాతులవారును ప్రాచీన నాగరిక జాతులవారు. బాబిలోనియాయు అట్టిదే. ఫినీషియా జాతివారు మధ్యధరా సముద్రమందును, హిందూ మహాసాగర దేశాలయందును విరివిగా వ్యాపారమును చేసినవారు. వ్యాపారముతో పాటు వివిధ దేశ సంస్కృతుల వ్యాపింపజేసినవారు. ఈజిప్టు (మిశ్ర) దేశముయొక్క చరిత్ర 6000 ఏండ్లనుండి లభిస్తున్నది. ఫినీషియనుల ద్వారా హిందూదేశమునకు ఈజిప్టువారి ఆచారములు విశ్వాసములు శిల్పములు కొన్ని దిగుమతి యయ్యెనని కొందరి పాశ్చాత్య పరిశోధకుల అభిప్రాయము. ఫ్రిజియా దేశమువారు 2500 ఏండ్ల క్రిందట తాము భృగుజాతి వారమని చెప్పుకొనిరి. మన పౌరాణిక భార్గవులు ఫ్రిజియావారా లేక మనవారే అచ్చటికి వలసపోయి, రాజ్యస్థాపకులైన వారా? పరిశోధనీయమగు విషయము. గ్రీకు దేశము (యవన) క్రీస్తు శకానికి బహుపూర్వమే 500 ఏండ్లపాటు సర్వకళలందు పురోగామియై ప్రపంచానికి అందు ముఖ్యముగా యూరోపు ఖండానికి జ్ఞానభిక్ష పెట్టెను. తర్వాత రోము సామ్రాజ్యము 500 ఏండ్లపాటు జగజ్జేగీయమానముగా వెలిగెను. యూరోపు ఖండ జనులందరును యవన రోమక మానసపుత్రులు. ఈరానువారు మన రక్తసంబంధులై ఉండిరి. నిజముగా ఈరానే ఆర్యుల ఆదిదేశము. నేటి అబుర్ బాయబౌ జరథుస్త్రుని కాలమందు "ఆర్యబీజ" నామముతో ప్రసిద్ధిగాంచెను. "ఈరాన్‌లోని భాగమునే ప్రాచీనమందు "ఆర్యాణము" అనిరి. వారిలోను చరిత్రలు బాగా వెలసియుండెను. అరబ్బులు ఇస్లాం మతాన్ని పుచ్చుకొన్న ఆదికాలములో మతోద్రేకముతో యూరోపు ఆఫ్రికా ఏషియా ఖండాలలోని భాగాలను జయించిరి. వారు కొంత నాశనము చేస్తూ పోయినను వారు గొప్ప నాగరికత కలిగియుండిన జాతి యనియు వారే వైద్యాన్ని అంకబీజ రేఖాది గణితములను వృద్ధి చేసిరనియు ఇట్టివెన్నో వారి సృష్టియే యనియు 19వ శతాబ్ద్యంతమువరకు తెల్లవారు ప్రచారముచేసి తుదకు ఈ శతాబ్దములో అరబ్బులు వ్యాపారస్థులే యనియు తమ సరకులతోపాటు హిందువుల సంస్కృతిని తీసుకొనిపోయి యూరోపులో దిగుమతి చేసినవారే యనియు ఆ పాశ్చాత్యులే గుర్తించిరి. ఎట్లైన అరబ్బులు కూడా మంచి చరిత్రకారులేయని పేరు పొందిరి.

చరిత్రల దృక్పథము

ప్రపంచ చరిత్రలో సాధారణముగా యుద్ధాలే యెక్కువ ప్రాముఖ్యము వహించినవి.. ఆది కాలములో హుణులు, ఆర్యులు, తార్తారులు, శకులు, మున్నగు వర్గాల వారు జనసంఖ్య హెచ్చుటచే నలుదిక్కుల వ్యాపించిరి. అట్టి వ్యాప్తిలో ఆదిమవాసులకును దాడి చేసిన వారికిని సంఘర్షణలు జరిగెను. తుదకుభయులును సమాధానపడి మరికొంత కాలానికి దాడి వచ్చిన గుంపులతో యుద్ధములు సాగించిరి. ఆర్యులు హిందూస్థానములో బహు ప్రాచీన కాలమందు ప్రవేశించిరనవచ్చును. వారు వచ్చిన తర్వాత వారికిని ఇతరులకును అనేక శతాబ్దముల వరకు సంఘర్షణలు జరిగినట్లున్నది. అందుచేతనే వేదాలలో విశేషముగా శత్రువులను నాశనము చేయుటకై ఇంద్రాదిదేవతలను ప్రార్థించిరి. వారికి అసురులతో, దస్యులతో, దానవులతో, శకులతో, యక్షులతో, రాక్షసులతో యుద్ధాలు జరిగెను. అసురులు అషర్ (అసీరియా) దేశము వారైనను లేక అహుర పూజకులయిన ఈరానీ వారైనను అయి యుందురు. పూర్వము ఈరాను కుత్తరమందు దహ్యదేశముండెను. అచ్చటి వారినే దహ్యులనిరి. ప్రాచీనమందే దస్యజాతి ఈరాను జాతిలో లీనమై తన ప్రత్యేకత కోల్పోయెను. యక్షులు ఆక్సస్ ప్రాంతీయులో, లేక యచీ అను జాతివారో అయి యుందురు. అరక్షస్ నదీ ప్రాంతము వారే రాక్షసులై యుందురు. డాన్ నదీ ప్రాంతీయులు దానవులు. దైత్యక నది కాస్పియన్ (క్షీరవాన్ క్షీర) సముద్రములోనికి ప్రవహించును. తత్ప్రాంతీయులే దైత్యులు. పురాణాలు పెంచిన వారికి భౌగోళిక జ్ఞానము లేక చిత్ర విచిత్ర కల్పనలు చేసిరి. ఋగ్వేద కాలములో దాశరాజు యుద్ధము ప్రసిద్ధమైనది. పదిమంది రాజులు కలిసి ఆర్యావర్తముపై దాడిచేయుట, వసిష్ఠుడు ఆర్యుల పక్షమందు, విశ్వామిత్రుడు పరదేశీయుల పక్షమందుండుట అందుకాననగును. ఋగ్వేద పరిశీలనమువల్ల ఇట్టివెన్నియో వెల్లడియగును. అట్టిలా అను హూణుడు క్రీస్తు శక పంచమ శతాబ్దమందు మంగోలియా నుండి హంగరీ వరకు రక్త ప్రవాహాలతో మానవ సంహారము చేస్తూ పోయెను. ఇట్టి దాడులు ఆది కాలమందుండెను. తర్వాత మత యుద్ధాలు వచ్చెను. అందు క్రైస్తవులు, ముసల్మానులు ప్రధాన పాత్ర వహించిరి. అటు తర్వాత వ్యాపార యుద్ధాలు మొదలయ్యెను.

తిరుగుతుందయ్యా అని అనగానే అతన్ని బట్టి బైబిల్ బోధల నబద్ధ మందువా నీ తల కాచుకో అని పీడించి క్షమాపణ పత్రికను క్రైస్తవాచార్యులు వ్రాయించుకొనిరి. గ్యాలిలియో నక్షత్రశాస్త్ర మందద్భుత పరిశోధకుడని కీర్తించుతున్నారు కదా అతనికంటె 1200 ఏండ్లకు ముందు క్రీ.శ. 476లో నుండిన మన ఆర్యభటుడు సూర్య సిద్ధాంత గ్రంథము ద్వారా గ్యాలిలయో చూపించిన విషయాన్నే కాక ఇంకా ఇతరాంశములను భూమికి సూర్యునికి భూమికి చంద్రునికి ఉండు అంతరాయమును ఈనాడు టెలిస్కోపు యంత్రాలతో చూచి గుణించిన పాశ్చాత్యుల లెక్కలకు ఇంచుమించు సరిపోవునట్లుగా ఆనాడే తెలిపియుండెనుకదా? అతని పేరెంద్రైనా ఉదాహరింతురా? అతడు ప్రసిద్ధుడు కాడు. ఆనాడే అతని కీర్తి రోము వరకు వ్యాపించెను. అరబ్బు లతణ్ణి అర్జబహార్ అని తమ అస్తవ్యస్తపు బాసలో పేర్కొనిరి. రోమకులు అరబ్బుల నుండి ఆ పేరును గ్రహించి అర్దుబారియస్ అనిరి. పాశ్చాత్యులకు ఈసఫ్ కలదు కాని గుణాఢ్యుడు కాని విష్ణుగుప్తుడు కాని కానరాలేదు. కాక్, లివింగ్‌స్టన్ ప్రభృతుల చరిత్రలు వ్రాసిరి కాని కాంబోడియాను పాలించిన మన కౌండిన్యుడు కాని చీనాలో 30 ఏండ్లుండి అచ్చటనే చనిపోయిన కుమార జీవుడు కాని, అపర బుద్ధుడుగా ప్రఖ్యాతుడైన ఆర్య నాగార్జునుడు కాని వారికి జ్ఞాపకము రాలేదు. హార్వీ అను ఆంగ్లేయుడు క్రీ.శ. 17వ శతాబ్దములో శరీరమందు రక్తము ప్రవహిస్తూ వుండును అను విషయము కనిపెట్టితే అతని యాయుపజ్ఞాఫలితమే ఆధునిక పాశ్చాత్య వైద్యానికి మూలకందమని శ్లాఘించిరి. కాని అతనికంటే 1800 ఏండ్లకు ముందు మన హారీతుడు, సుశ్రుతుని కన్న ముందుండినవాడు పాండురోగ నిరూపణములో ధమనులలో అన్ని రసములు రక్తమై ప్రవహిస్తూ వుండునని వ్రాసెను. భావ ప్రకాశమను వైద్య గ్రంథము హార్వీకన్న 100 ఏండ్లు ముందు వెలిసెను. అందుకూడా హార్వీ కనిపెట్టిన విషయాన్నే తెలిపినారు. హారీతుడు ఆత్రేయ పునర్వసు శిష్యుడు, చరకాదుల సతీర్థ్యుడు, హారీత సంహితను రచించినవాడు. పాశ్చుయర్ క్రిమి సిద్ధాంతమును కనిపెట్టెను. హారునల్ రషీద్ ఖలీఫా కాలములో బాగ్దాదులో నివసించి, ఖలీఫా రాజ్యమునకు వైద్యాధికారియై మన వైద్య గ్రంథములను అరబీ లోనికి పరివర్తనము చేసిన మంఖుని మనమే మరచినాము. ఇట్టి వనంతముగా కలవు. ఈ పరిశోధనలు చేసి ప్రపంచానికి తెలుపుకొనుట మన విధి.

కూడా తెలియదు. విక్రమార్కులు కల్పిత పురుషుడో కాడో చెప్పజాలము. మన భక్తులలో 200-300 ఏండ్ల క్రిందట వారికినీ వైకుంఠము నుండి విమానాలు వచ్చి వారిని సశరీరముగా తీసుకొని పోయెనని మనవారు వ్రాసిరి. మహాపురుషుల చరిత్రలకు మనవారును ఉత్తమ స్థానమిచ్చిరి.

యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః సయత్ప్రమాణం కురుతే లోకస్త దనువర్తతే (భగవద్గీత 3-21)

అని భగవద్గీతయే బోధించెను. కాని మనలో నిజమైన జీవిత చరిత్రలు లేవనియే యొప్పుకోవలెను.

ఈ శతాబ్దిలో మరల దృక్పథము మారినది. ప్రతి దేశ చరిత్రలో ఆ దేశ సాంస్కృతిక సాంఘిక చరిత్రకు ప్రాధాన్యమియ్యవలెనన్న భావముతో చరిత్రలు వ్రాస్తున్నారు. ఇదే సరియగు విధానము.

మానవ చరిత్ర

ఇంచుమించు 100 ఏండ్ల క్రిందట డార్విన్ "పరిణామ"(Evolution) సిద్ధాంతమును లేవదీసెను. ఆనాటి నుంచి చరిత్ర నూతన మార్గములందు ప్రవేశించెను. క్రీ.శ. 1891లో వెస్టన్ మారన్ అను నతడు "మానవ వివాహ చరిత్ర" అను మహోద్గ్రంథమును వ్రాసెను. మానవుడు స్వాభావికముగ ఏకపత్నీ వ్రతుడేయని క్రైస్తవ బోధకనుకూలముగ అతి చతురతతో తన గ్రంథమున రచింపగ 30 ఏండ్లపాటు అదే మానవ చరిత్ర బైబిల్ అయిపోయెను. 1920 ప్రాంతములో రాబర్టు బ్రిఫీల్ట్ అను పండితుడు "తల్లులు" (The Mothers) అను గ్రంథాన్ని రచించి వెస్టర్ మారన్ సిద్ధాంతాలనన్నింటిని ధ్వంసము చేసి ప్రపంచమంతటను ఆదికాలములో వివాహ నియమములు లేవనియు పశువృత్తియే మానవ వృత్తిగా నుండెననియు గట్టిగా నిరూపించెను. యిప్పుడాతని గ్రంథమే ప్రపంచమంతటను చెలామణి పొందినది. ఈ సిద్ధాంతమునే "తల్లి హక్కు" (Mother Right) అను పేరుతో ఒక జర్మన్ పండితులు స్థిరపరిచెను. ఆది కాలములో ఒక గుంపువారు యింకొక గుంపు పిల్లలను స్వీకరించేవారనియు, అట్టి స్త్రీలను గుంపు వారందరును కూడుచుండిరనియు నేటికిని ఆటవికులలో ఈ పద్ధతి కలదనియు నిరూపితమైనది. అట్టి గుంపును "టోటెమ్ గుంపులనిరి". మన హిందువులలో గోత్రములనున విట్టివైయుండును. ఆదికాలమందు

బహు కళత్రత్వము బహుభర్తృత్వము వుండెను. స్త్రీలు అందరి స్వత్వమన్నట్లుగానే స్థిరచరాస్తులన్నియు ఒక్కొక్క వర్గపు సమిష్టి స్వత్వముగా నుండెను. ఆదిలో జనులు తల్లుల నెరిగిన వారేగాని ఏ పురుషునికి జన్మించినది వారికి తెలియదు. అందుచేత తల్లికే ప్రాధాన్యముండెను. వివాహ నిబంధన లేర్పడిన తరువాతనే తండ్రికి ప్రాధాన్యము వచ్చినది. ఆదిమ పురుషునికాలాన్ని శిలాయుగమనిరి. యిది యుక్తయూహగాదు. వేల వేల సంవత్సరాల క్రిందటి పూడికలను త్రవ్వగ అందు మానవాస్థులతోపాటు రాతి గొడ్డండ్లు, రాతిమొనలుగల బల్లెముల వంటివి లభించినవి, తరువాత రాగి, యిత్తడి, యినుము, కనుగొనిరని శాస్త్ర నిపుణులు నిరూపించినారు. ఆదిలో మానవుడు పండ్లు, గడ్డలు, పచ్చి మాంసము తినెనందురు. అగ్నిని తరువాత కనిపెట్టిరి. కట్టెల రాపిడిచే, రాళ్ళ రాపిడిచే అగ్గిపుట్టుట గమనించి ఆదికాలమువారును వాటి రాపిడిచే అగ్గి పుట్టించిరి. గ్రీకు వారు పుమిథీయస్ అనువాడు మొదట అగ్నిని దేవలోకమునుండి అపహరించి తెచ్చి మానవులకియ్యగ దేవతలతనిని బంధించి బాధించిరనునొక కథను వ్రాసినారు. ఇది ఆదికాలపు అగ్ని సముత్పాదన కథనమె అని పుమిదియన్ అనగా పుమదనము అను పదమే నిరూపిస్తున్నది. పాశ్చాత్యులు సైన్సు ద్వారా మానవ ప్రాచీన చరిత్రను కనుగొంటున్నారు. ప్రపంచములో ప్రతి ఖండమందును మిగిలిన ఆటవికుల ఆచార వ్యవహార విశ్వాసాలను సమగ్రముగా పరిశీలించి మన ఆదిమ పురుషుల కాలపు స్థితులనూహిస్తున్నారు. మన దేశమందును గోండు, కోయ, సవర, చెంచు, తోడ, భీల్, నాగ, సంథాల్ వంటి ఆటవికులు కొల్లలుగా గలరు. కాని వారిని గురించి పరిశోధనలు చేసిన భారతీయులు వ్రేళ్ళ మీది లెక్కలోపలివారె. ఆంధ్రులకు సంబంధించిన చెంచు, గోండు, కోయలు మనము ఏమియు తెలుసుకొన్న వారము కాము. యూరోపు, అమెరికా చారిత్రక పరిశోధకులు ఆది మానవ చరిత్రకై ఆంత్రాపాలజి, జియాలజీ, సెక్సాలజీ వంటి శాస్త్రాలను ఆధారము చేసుకొని తమ పరిశోధనలు సాగిస్తున్నారు. కాని వారి దృష్టి మన వేదములపై మనగృహ్యా సూత్రములపై మన బ్రాహ్మణములపై, మన పురాణాలపై ప్రసరించుట లేదు. వారింతవరకు నిర్ణయించిన సిద్ధాంతములన్నియు పై వాఙ్మయములందు లభిస్తూనే యున్నవి. మనకు ప్రాచీనాచారములపై పట్టుదల మెండు. నేటికిని శుభాశుభ కార్యాలలోని మన ఆచారములు ఋగ్వేద కాలమువై యున్నవి. యజ్ఞాలలో నేటికిని

కట్టెలను మధించి అగ్నిని పుట్టింతురు. నేటికిని మట్టి పాత్రలే శుభాశుభ కార్యాల కవసరము. 'మృణ్మయం దేవపాత్రం' యని అన్నారు. నేటికిని ఒడికిన దారమే పవిత్రము, ఉన్ని దారమే కొన్నింటికి కావలెను. ఇట్టి వెన్నియో వేదముల నుండి విశదమగును. ప్రాచీన కాలములో బహు దేశములలోను, ఆటవికులలోను, చీనా అరలు లౌర్తరీ వంటి దేశాలలోను మనుష్య భక్షణ ముండెనని పలువురు నిరూపించిరి. మన ఐతరేయ బ్రాహ్మణములో నరమేధ యజ్ఞము శునశ్శేపుని కథ ఈ సందర్భములో గమనింపదగినది. మన దేశములో నేటికిని పల్లెలో చెకుముకి రాయితో "అగ్నికొట్టీ" వాడు కొందురు. ఆది కాలములో అగ్నికే సర్వ ప్రాధాన్యముండెను. "అగ్ని మీళే పురోహితం" అని ఋగ్వేదము ప్రారంభమగుచున్నది. మన ప్రాచీన భాగదేయులకు జరదుష్ట్ర మతానుయాయులకు అగ్నియే ప్రధాన దేవత. మన పురాణాలలో అనేక ప్రాచీన తమ చరిత్రలు అణిగియున్నవి. మహాభారతములోని అనేకాంశములు ఆది కాలపు సాంఘిక స్థితిని వెలువరిస్తున్నవి. ఆది పర్వమందలి శ్వేతకేతు కథ కుంతీ నియోగం. ఆ సందర్భమందు పాండు రాజన్న మాటలు పూర్వమందలి సాంఘిక స్థితిని తెలుపును. స్త్రీలు అనాహృతలై స్వేచ్ఛా చారిణులై యుండిరి. 'అయం ధర్మ సనాతనః' అని పాండు రాజనెను. మమత అను నామె, ఉతత్య బృహస్పతి అను సోదరులకు ఏకభార్యగా నుండెను. ద్రౌపది పంచపాండవుల భార్య. నేటికిని టిబెట్టులోను, మలబారులోను, బహుభర్తృత్వము (Polyandry) అందందు నిలిచినది. యయాతి కూతురు వరుసగ హర్యశ్వ దివోదాస ఉశీనర, విశ్వామిత్రులకు సంసారము చేసి పిల్లలగనెను. శాస్త్రకారుల అష్టవిధ వివాహాలు ద్వాదశౌరస పుత్రులు ప్రాచీనాచారాలను స్పష్టీకరించెను. పూర్వము కతక భరద్వాజులు తమ తమ భార్యలను మార్చుకొనిరని "దృష్టం ధర్మ వ్యతిక్రమం సహసంచ మహీతాం" అనియు గౌతమ ధర్మ సూత్రములందు తెలిపినారు. ఛాందోగ్యములోని జాబాలి కథ సుప్రసిద్ధమే కదా! ఇట్టి వన్నియు ప్రాచీన మానవ చరిత్రకు చాలా సహాయపడును. చారిత్రికులు మన వేదశాస్త్రపురాణాలన్నీ దృష్టితో పరిశోధించి మన ప్రాచీన చరిత్రకు తోడ్పడవలసి యుండును.

మానవ చరిత్ర నిర్మాతలు మన భూమి 200 కోట్ల యేండ్ల ముందు ఏర్పడి యుండునందురు. మనలో మహాసంకల్పమొకటి కలదు. అది దాక్షిణాత్యులచేతను

క్రీ.శ. 6వ శతాబ్ది తర్వాతను అల్లబడినదని దానిలోని విషయములే పట్టించును. అయినను అందలి భూ సృష్టి కాలనిర్ణయము గమనింపదగినది–

"ప్రవర్తమాన స్వాద్య బ్రాహ్మణః ప్రథమ పరార్థే
పంచాశ దృత్సరేష్య తీతేషు ద్వితేయ పరార్థే.....
శ్వేత వరాహ కల్పే........... వైవస్వత మన్వంతరే........
కలియుగే ప్రథమ పాదే........ శాలివాహన శకే........."

అని చెప్పుట వాడుక. దాన్ని గుణించిన గణకులు సృష్ట్యాది ఇంచుమించు 192 కోట్ల యేండ్లని చెప్పుదురు. పాశ్చాత్యులు సైన్సు అంచెనాలతో చెప్పెదు దానికి మన మహాసంకల్పానికంతగా భేదము కానరాదు. ఇట్లు 200 కోట్ల యేండ్ల నుండి ఏర్పడెనను మనుష్యుడెప్పుడేర్పడెనన్నది తేలలేదు. కొన్ని ఏండ్ల క్రిందట జావా ద్వీపములో భూగర్భ మందొక మనిషి ఆస్థిపంజరము లభించెను. దాన్ని పరిశీలించిన నిపుణులు జావాలో ఆ మనిషి 8 లక్షల యేండ్లకు ముందుండెననిరి. మరికొంత కాలానికి ఇంచుమించు 15 యేండ్ల క్రిందట చీనాలోని పేకింగ్ నగర ప్రాంత మందొక మనిషి కపాలము భూగర్భ పాతాళమందు లభించెను. దాన్ని పరిశీలించిన నిపుణులు, ఈ పుర్రెగల మనిషి 10 లక్షల యేండ్లకు ముందుండెనని నిశ్చయించిరి. అంతకన్న ప్రాచీనమునకు పరిశోధకులు వెళ్లజాలిన వారు కారు. క్రీస్తునకు పూర్వము 4000 ఏండ్ల క్రిందట భూసృష్టి జరిగెనన్న బైబిలులోని మోటుమాట అపాస్తమైనది. మానవుని యునికి లక్షల ఏండ్ల ముందులో యున్నది. ఒక శతాబ్దము నుండి మానవుని ఆది జన్మస్థానము 'మధ్య ఆసియా' అని తేలినది. ఇంతవరకు పేకింగ్ పుర్రె ఆధారముతో ఆ వాదము స్థిరపడినది. చరిత్రల దృక్పథములో ఈ విధముగా అద్భుతమగు మార్పులు జరుగుతున్నవని మన చారిత్రకులందఱును గమనింపవలసి యున్నది.

ఎలిఫెంటా గుహాలు

ఇప్పటి కాలమునఁ బాశ్చాత్య పండితుల కేది యత్యంతాశ్చర్యము కలిగించుచున్నదో కాలాతీతము చేతను, క్రూర హస్తములచేతను నేదినాశనముకాగా మిగిలిన యా శేషమును జూడ ప్రపంచము యొక్క నాలుగు దిక్కుల నుండి జనులు వచ్చుచున్నారో, యట్టి శిల్పరాజములు మన హిందూస్థానమందుగాక మఱెచ్చట కలవు? పూర్వము మన యార్యులలో శిల్పులకిచ్చిన గౌరవము బ్రాహ్మణులకుఁ గూడ నియ్యలేదు. శిల్పకారుని నత్యంత పూజ్యునిగా భావించుచుండిరి. వాస్తు శాస్త్రములు సంస్కృత భాషయందనేకములు బహుపురాతన కాలమందే లిఖింపబడెను. దేవతల యొక్కయు, మనుష్యుల యొక్కయు, స్త్రీలయొక్కయు, తిర్యగ్జాతులయొక్కయు వివిధ రూపము లేయేవిధములనుండ వలయునో మయవాస్తువు వంటి గ్రంథములందు విరివిగా చర్చింపఁబడెను. మహారాజుల నాది నుండియు శిల్పకారుల మన దేశమందు విశేషముగా సన్మానించుచుండిరి. వారి నివాస గృహముల నిర్మించుట యందేమి, వారి కోటలఁ గట్టుటయందేమి, దేవాలయముల స్థాపించుటయందేమి, రాజులు నిరంతర మీ శిల్పులకే యావత్కార్యముల విడుచుచుండిరి. పూర్వపు శిల్పులు తాము చేయుచుండిన పనులందుఁ బూర్ణముగాఁ దమమనస్సు లయింపు జేయుచుండిరని చెప్పుట యతిశయోక్తి కాదు. ఆ కాలపు గట్టడములును, ఆ కాలము నుండి వచ్చిన లోక ప్రతీతియు దీనికి ప్రబల సాక్ష్యములు. అనంతశయన మందలి పద్మనాభస్వామి దేవాలయమును గట్టునపుడొక శిల్పి తన కార్యమందత్యంతముగా నిమగ్నుడై తన ప్రక్కన రాజుగారుండినదియు గుర్తింపక యతడు తనచేతి క్రింది మనుష్యుఁడే యని తలచి యొక సాధనము నందిమ్మని యాజ్ఞాపించెనఁట. రాజుగారు తన గాంభీర్యము చెడెననిగాని తన గొప్పతనమునకు లోటు కలిగెనని గాని విచారింపక– తాను విశాల హృదయుఁడగుటచే జంకు కొంకు లేక వెంటనే కోరిన వస్తువును దెచ్చి యిచ్చెనఁట.

ఇచ్చునపుడు చేతిని జూచి రాజును జూచి శిల్పిభీతుడై తన యపరాధమేమియు లేదని రాజతనితో చెప్పినను వినక యా తప్పుకై తన చేతిని కోసుకొని ప్రాయశ్చిత్తము పెట్టుకొనెనట. ఇట్టి యంశములు వెదకు వారి కనేకములు గోచరించును.

పూర్వపు వైభవము, పూర్వపు శిల్పనైపుణి యార్యుల స్వాతంత్ర్యము తోడనే యంతరించెను. పూర్వపు గోటలను దేవాలయములను ఋషిసంతతి వారనుపించు కొనిన మనమిప్పుడును చూచిన యాకట్టడములు మనుష్యులు కట్టిరా లేక యక్షగరుడ కిన్నరాదుల వంటి మనుష్యాతీతులైన వారెవరైన కట్టిరాయను భ్రాంతిని బుట్టించు చున్నవి. పూర్వపు శిల్పముల ప్రకారము కట్టు వారింకను దక్షిణ హిందూస్థానమున నున్నారని భారతదేశమునకంతయు వంద్యులైన ఇ.బి.హెవెల్ దొరగారు నుడువు చున్నారు. కాని యీ శిల్పు లనుదినము క్షీణించుచున్నారు. దానికి కారణము మనమే. మనలో పూర్వపు గట్టడములలోని సౌందర్యమును జూచి మెచ్చుకొను శక్తి క్షీణించినది. అప్పటి విధానములు మనకు రుచించవు. మన దేశ భాషలందెట్లు మనమితరుల జూచి వారి ననుకరించుచున్నామో, యిట్టి శాస్త్రములందును మనకితరులే గురువులు. 'క్రొత్తదొక వింత, ప్రాతదొక రోత'యను సామెత నేడు మన యందొక రీతి విచిత్రముగా నొప్పియున్నది. నవనాగరికులని తలంచుకొను వారికి బూర్వపు శిల్పములు రుచింపవు. ఇప్పటి మహారాజులుగాని, నవాబులుగాని పూర్వపు హిందూ బౌద్ధ శిల్పములనుగాని, మొగల్ రాజపుత్ర శిల్పములగాని కోరక గాథిక్, శాక్జన్ మున్నగు నానాశిల్పముల యొక్క సమ్మేళనముచే సంకరములైన పద్ధతిపై తమ బంగ్లాలను గట్టించుకొనుచున్నారు. పాశ్చాత్యులు మన వేషములే, మన భాషలే, మన పూర్వ శాస్త్రములే మేలైనవని శ్లాఘించుటయే కాక నాచరించుచునుండగా, మనము పాశ్చాత్యులవే మంచివని వాదించుట విచిత్రము. "పడమటి" గాలి విశేషముగా వీవ దొడంగినది.

ఎలిఫెంటా ద్వీపము

బొంబాయి నుండి సముద్రములో నోడపై ఏడు మైళ్ళు ప్రయాణము చేసిన ఎలిఫెంటా ద్వీపమును చేరవచ్చును. ఈ ద్వీపము 4 మైళ్ళ చుట్టుకొలత కలది. దీనిలో నొకగట్టు 1½ మైలు పొడవును, 500 అడుగుల ఎత్తును గలదైయున్నది. ఈ ద్వీపములో జనులు నివసించుచున్నారు. వరి మున్నగు కొన్ని పంటల బండించు

చున్నారు. ఈ ద్వీపమును మున్ను గిరిపురి (పర్వతముపైన నుండుపురి) యని వ్యవహరించుచుండిరి. దీనికి ఎలిఫెంటా యని పోర్చుగీసు వారు పేరిడిరి. ఏలనన నీ ద్వీపమందొక రాతియేనుగు 13 అడుగులు పొడవును 7 $^{1}/_{4}$ అడుగుల యెత్తును గలది యుండెను. ఈ యేనుగు కొంతకాలమునకు శిథిలమయ్యెను. దానిని 1864 సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వం వారు బొంబాయికిఁ దెచ్చి విరిగిన భాగముల నతికించి విక్టోరియా తోటలో నుంచిరి. ఇప్పటికిని నిది యా తోటలోనే యున్నది.

ఈ ద్వీపములో క్రీ.శ. 3వ శతాబ్దమున బౌద్ధ స్థూపములు కట్టినట్లు గొన్ని శిథిలముల నుండి యూహింపఁబడుచున్నది. మఱియు నందలి గుహలు క్రీ.శ. 8వ శతాబ్దమందు నిర్మింపబడినట్లూహింపబడుచున్నవి. ఈ గుహల విషయమై యితర హిందూ క్షేత్రమువలె స్థానికులు వివిధగాథలను జెప్పుచుందురు. కొందరు వీనిని పాండు పుత్రులు కట్టిరనియు, కొందరు బాణాసురుని కూతురగు ఉషాకన్య నిర్మించె ననియు చెప్పుదురు. కాని చరిత్ర వేరుగా బోధించుచున్నది.

ఈ ద్వీపము మౌర్య రాజుల యొక్క రాజధానిగాఁ గొంతకాలమువరకుండె. పిమ్మట ఇది చాళుక్యులచేత, రాష్ట్ర కూటులచేతను, యాదవులచేతను పరిపాలించ బడెను. క్రీ.శ. 15వ శతాబ్దమందిది మొగలుల పాలనములోనికి వచ్చెను. తురకలు సాధారణముగా విగ్రహ నాశకులని పాశ్చాత్య చరిత్రకారులు వ్రాయుచుందురు. కాని యీ ద్వీప విషయములో నిందలకుఁబాలైన ముసల్మానులవలన నేయపకారమును జరుగలేదు. క్రీ.శ. 1534వ సంవత్సరంలో నీ ద్వీపము పోర్చుగీసు (బుడతకీచులు) వారి స్వాధీనమయ్యెను. సుమారు 200 సంవత్సరాల వరకీ గుహలీదుష్టుల స్వాధీనమందుండెను. వీరిచే నివి నాశనము చేయబడెను. పోర్చుగీసు లీ విశాల మంటపములలో దమ పశువులను మేపుకొనుచుండిరి. ఈ సిపాయీ లిచటి ప్రతిధ్వనులను బరీక్షింప నెంచి తమ ఫిరంగులతో నీ యాలయమును గాల్చిరి. కాన ననేక విగ్రహములును, స్తంభములును గూలిపోయెను. ఈ బుడుతకీచులకు విగ్రహము లసహ్యముగా నుండెను. కావున వారు ప్రత్యేకముగా శ్రమించి యీ విగ్రహములను తుపాకులతోడను ఫిరంగులతోడను పగులగొట్టిరి. హిందువుల శిల్పకళకును, నీ పరంగీ జాతి ఫిరంగుల శిల్పకళకును నెంతటి ఘోర తారతమ్య మున్నదో కనుఁడు.

మన దొరలగు నింగ్లీషు వారి హస్తగతమైన తర్వాత కూడ 1865 నుండి 1868 వరకు నీ గుహల వినాశన కార్యమందు నింగ్లీషు వారు పోర్చుగీసుల పోటీకి నిలిచిన వారైరి. అనేక సంవత్సరములిది బ్రిటిష్ వారి సైన్య విశ్రామ స్థలముగా నుండెను. సర్వలలిత కళలకు విరోధులైన సైనికులు నాశనము చేయుటకుఁగాను యింకేమి చేయు సమర్థులు. తుదకు 1909 వ సంవత్సరము నుండి యీ గుహలను బ్రిటిష్ ప్రభుత్వము వారు సంరక్షింపబూనుకొనిరి.

గుహాశిల్పము

హిందూస్థానములో క్రీ.పూ. 300 సంవత్సరాల నుండి (అనేగా నేటికి 220 సంవత్సరాల క్రితము) పర్వతములలో, గుట్టలలో పెద్ద సురంగములు చేసి వానిని చైత్యములుగను, విహారములుగను, దేవాలయములుగను, హిందూ బౌద్ధులుపయోగించి నట్లు ఫర్గూసన్‌గారు వ్రాసియున్నారు. "గుహా శిల్ప నిర్మాణములో బౌద్ధులే నిస్సంశయముగా మొదటివారు" అని ఫర్గూసన్ గారు సెలవిచ్చినారు. పిమ్మట జైనులు, హిందువులు (సాధారణముగా క్రీ.శ. 6వ శతాబ్దము నుండి) గుహా శిల్పములకు గడంగిరి. ఉత్తర హిందూస్థానములోని బారబన్ గుహలును, ఒరిస్సాలోని కారక్ గుహలును, నిజాము రాష్ట్రములోని ఎల్లోరా, అజంతా గుహలును, మహారాష్ట్ర దేశములోకార్లా, జోగేశ్వరి, ఎలిఫెంటా గుహలును సుప్రసిద్ధములైనవైయున్నవి.

ఎలిఫెంటా గుహలు

ఈ గుహలు క్రీ.శ. 8వ శతాబ్దమందు నిర్మింపబడెనని యింతవరకే నివేదించి యుంటివి. ఇందు శైవ సాంప్రదాయపు గాథలే చిత్రింపబడినవి. ఇచ్చట ప్రధానమైనవి మూడు గుహలు. ఇయ్యవి దూరము నుండి చూచినట్లయిన మూడు గొప్ప సురంగముల వలె గనబడును.

ఈ గుహలలో ప్రధానమైనది మధ్యన నుండు గుహయే. ఇది 133 అడుగుల పొడవును, 130 అడుగుల వెడల్పును - ఇంచుమించు చౌకముగా నున్నది.

అందు 10 మాత్రమే మంచి స్థితిలో నున్నవి. ఇందు 26 స్తంభములున్నవి. ఈ గుహను 17 అడుగుల లోతుగా రాతినుండి తొలిచినప్పుడా రాతిలోనే నీ స్తంభములను వదలి యున్నారు. వీనిని నేర్పుతో నేర్పాటు చేసియున్నారు. ప్రేక్షకుడు

గుహయెదుట నిలిచినంతనే తనయెదుట దూరమందు(133 అడుగులు) త్రిమూర్తి విగ్రహము కనబడును. ఉభయ పార్శ్వములందు నందేడేడు స్తంభముల వరుసయున్నది. మధ్యగుహ ముఖమున నిలిచినంతనే నీయుభయ పార్శ్వముల స్తంభముల మధ్య త్రిమూర్తి విగ్రహము ప్రేక్షకుని కగపడును.

విగ్రహములు

ఇప్పటి శిల్పకారులనేకులు తమ పూర్వులు విద్యలన్నింటిని మరచి యడ్డాదిడ్డి యిండ్లను గట్టు విధానము మాత్రము తమ జీవనార్థముగా నుంచుకొని పూర్వ శిల్ప వైభవమును గుఱించి ముచ్చటించిన నా కాలము వారొక పసరును దెచ్చి శిలలపై రుద్దిన శిలలన్నియు మైనము వలె నగుచుండెననియు నప్పుడు తాము కోరినట్టి రూపములఁ దీర్చుచుండిరనియుఁ జెప్పుదురు. నేటికిని కంచి మున్నగు ప్రదేశములందు జరుగుచున్న శిల్ప నిర్మాణముల జూచువారికీ విషయమబద్ధమని తోపకపోదు. అయినను నీ ఎలిఫెంటా గుహలలోని యత్యంతోన్నత విగ్రహములను దిలకించు నతనికిఁ బైకథలు నిజమేమోయను భ్రమజనించును. ప్రప్రథమున మనకు గోచరించు నీ త్రిమూర్తి విగ్రహము సగము మాత్రమే (bust) చెక్కబడియున్నది. ఇది సుమారు 14 అడుగుల యెత్తున్నది. ఈ విగ్రహమందుండు మధ్య శిరస్సు బ్రహ్మ, వానికి కుడిప్రక్క విష్ణు శిరస్సును, నెడమ ప్రక్క రుద్రశిరస్సును నున్నవి. ఈ త్రిమూర్తి విగ్రహము యొక్క శిరస్సులు కిరీటముల చేతను, కంఠములనేక హారములచేతను, కర్ణములు కుండలముల చేతను నలంకరింపబడియున్నవి. ఇందలి మూడు వదనములు మూడు విధములగు కళలచే నొప్పారు చున్నవి.

అర్ధనారీశ్వర

త్రిమూర్తి విగ్రహము ప్రక్కకెడమ ప్రక్క అర్ధనారీశ్వర విగ్రహమున్నది. ఈ విగ్రహమున కిరుపార్శ్వములందు బ్రహ్మ, విష్ణు, కుబేరేంద్రాది దేవతలున్నారు. ఈ విగ్రహములోని ఎడమ భాగము స్త్రీ భాగమని చూపరులకు వెంటనే స్ఫురించును. ఈ భాగమందలి యొక స్తనమును, కర్ణభూషణములును, సన్నని మధ్య భాగమును, నెత్తైన పిఱుఁదును, నతి సుందరముగా శిల్పకారుని సామర్థ్యమును వెలిబుచ్చుచున్నవి. ఈ విశేషములు విగ్రహముల యొక్క కుడిభాగమున చూడుదు.

పార్వతీ పరిణయము

త్రిమూర్తికి దక్షిణ భాగమందించుక దూరముగా పార్వతీ పరమేశ్వరుల వివాహ ఘట్టము నిరూపింపబడి యున్నది. ఇందు నీశ్వరుని కుడి ప్రక్కన బార్వతి నమ్ర వదనయై యున్నది. ఆమె వెనుక కన్యాదాతలగు మేనకా హిమవంతులున్నారు. మేనక వెనుక చంద్రుడు అమృత కుంభమును బట్టుకొని నిలిచి యున్నాడు. ఈశ్వరుని పాదముల దగ్గఱ పురోహితుడగు బ్రహ్మయున్నాడు. పై భాగమందు బెండ్లికి జుట్టములుగా బ్రేక్షకులుగా వచ్చిన దేవతలున్నారు. ఇందు ముఖ్య పాత్రములైన పార్వతీ పరమేశ్వరుల విగ్రహములతి సుందరముగా వినయ గాంభీర్య గుణయుక్తముగా నున్నవి. కాని బుడుతకీచులిచట మన శిల్ప నైపుణ్యమును మాపి తమ శతఘ్నికా శిల్పాధిక్యమును శాశ్వతముగా జాటి యుండుటచేఁ బ్రేక్షకులకు జాల విషాదము సంఘటించుచున్నది. (వివాహ కాలములందు నాశ్వలాయన శాఖీయులలో భార్య పురుషుని కుడి ప్రక్క నుండును. తర్వాతి కాలములందు నాశ్వలాయనులలో నాపస్తంబీయులందువలె భార్య భర్త కెడమ ప్రక్కనే యుండును. ఈ పటమందు భార్య భర్తకు గుడిప్రక్కనున్నది.

ద్వార పాలకులు

త్రిమూర్తి విగ్రహమునకు సుమారు 90 అడుగుల దూరమున గుహయందే యొక గుడి నిర్మించి యున్నారు. అందొక లింగమున్నది. ఆ గుడి నాలుగు ప్రక్కలలో నిద్దఱిద్దరు ద్వారపాలకులున్నారు. ఈ ద్వార పాలక విగ్రహములొక్కొక్కటి రమారమి 19 అడుగుల యెత్తున్నవి. ఇంత యెత్తుండినను విగ్రహముల యొక్క యవయవముల పరిమితి (Proportion) చెడకుండయున్నది. ఇందలి విగ్రహములలో సాధారణంగా ద్వార పాలకులకుండునని భావింపబడు గర్వ క్రౌర్యాది చిహ్నము లేమియు లేవు. ముఖములపై సౌకుమార్యము, మార్దవము విశేషముగాఁ గనపడుచున్నవి. ఇందలి విగ్రహములు కూడ నితర విగ్రహములవలెఁబ్రయత్న పూర్వకముగా పోర్చుగీసు దుండగీలచే రూపుమాయింపబడినవి.

గంగావతరణము

ఈ విగ్రహములో నీశ్వరుడు పార్వతి ప్రక్కకును, పార్వతి ఈశ్వరుని ప్రక్కకును వ్రాలియున్నారు. చుట్టును దేవతలున్నారు. ఈ ఘట్టము కూడ జాలశిథిలమైపోయినది.

ఈ గుహలో శివలీలా కథలింకను ననేకములు నిరూపింపబడినవి. సతీదేవి యొక్క నిర్యాణానంతర మీశ్వరుడు యోగియై తపస్సు చేసినదియు, పార్వతీదేవి నాహ్లాదింపఁ దాండవమాడుటయు, రుద్రావతారియై దక్షాధ్వర ధ్వంస మొనరించుటయు, ప్రణయ ప్రకోపముచేఁ బార్వతీపరమేశ్వరులు కలహించుకొనుటయు రావణుడఖిల జగద్రావణుండైన పిమ్మట తన చేతుల తీటవోఁ గైలాసగిరి నెత్తుటయు నఖిల ప్రపంచ నేతయైన హైమవతీ నాథుడు లీలగా నాతని గర్వ నిర్వాపణ మొనర్చుటయునగు నీ శైవ సాంప్రదాయపు గాథలిందుఁ జెక్కబడియున్నవి.

ఇంతవఱకు నివేదింపబడిన విషయములన్నియు మధ్యదియుఁ బెద్దదియునగు గుహా సంబంధములు. ఈ గుహకిరు పార్శ్వములందును రెండు గుహలున్నవి. పెద్ద గుహకును వీనికిని మార్గములున్నవి. ఈ రెంటను బేర్కొనదగిన వస్తువులు లేవు. కుడి ప్రక్కన నుండు గుహలో నొక చిన్న పుష్కరిణి కలదు. అందు నిరంతరము పానయోగ్యమగు జలముండును. ఎడమ ప్రక్కన నుండు గుహ యొక్క ముంగలి భాగమున నొక యంగణమున్నది. దాని యెదుట శివాలయమున్నది.

ఈ రెండు గుహలు గాక వీనికి తూర్పు దిక్కున నాలుగు గుహలున్నవి. ఇందు కొంత శిథిలములును గొంత పరిపూర్తికానివియు నున్నవి.

సముద్ర పరివృత ద్వీపమందుండటచేత నేమి మౌర్య, రాష్ట్ర కూటాది హిందూ రాజ్య పరిపాలన స్థానముగా నుండినవగుటచేతనేమి, సుందరతర విగ్రహములచే బ్రాచీనార్య శిల్ప కళావైదుష్య ప్రకటనము చేతనేమి, తుదకు బుడతకీచులవలని దుండగములచేతనేమి యీ గిరిపుర గుహలు చారిత్రకములై, యానందదాయకములై దర్శన యోగ్యములైయున్నవి.

ఈ గుహలందొక కాలమున నజంటాలోవలెఁ గొంతవఱకు చిత్రములు గూడ లిఖించి యుండిరని చెప్పుదురు. కాని యవి యిప్పుడు కానరావు.

ఈ గుహలను గుఱించి 1539 క్రీ.శ. నాటికే డాంజోడీకాస్ట్రోయను నతడివి మనుష్య మాత్రులు నిర్మించినవేయై యుండిన నింత సుందరంగా నుండుటెట్లు సాధ్యమని శంకించెను. ఇంచుమించాకాలము వాడేయగు లిఁషోటెఁవీనిని హిందువుల యౌన్నత్య సూచకములుగా భావించెను.

తెలంగాణ చరిత్రము

హైదరాబాదు రాష్ట్రములో తెలంగాణమనియు, మరాట్వాడా యనియు రెండు ముఖ్య భాగములున్నవి. తెలంగాణములో తెనుగు మాట్లాడువారు యెక్కువ. మరాట్వాడీలో మహారాష్ట్రులును కర్ణాటకులును చేరియున్నారు. ఇప్పుడు తెలంగాణాలో 9 జిల్లాలు క్రిందివి కలవు.

1. మహబూబునగరం 2. అత్రాఫుబల్దా 3. నల్లగొండ 4. కరీంనగరు, 5. మెదకు, 6. వరంగల్, 7. బాగాత్, 8. ఆదిలాబాదు, 9. నిజామాబాదు. ఇవి గాక రాయచూరు జిల్లాలోని అలంపూరు, గద్వాల, రాయచూరు తాలూకాలున్నూ మరి యిట్టి వందందును తెనుగు తాలుకాలైయున్నవి. హైదరాబాదు రాష్ట్ర వైశాల్యములోసగము వరకు తెలంగాణా వైశాల్యమున్నది. అనగా ఇంచుమించు 40 వేల చదరపు మైళ్ళు మరియు జనసంఖ్య 80 లక్షల వరకున్నది. అనగా రాష్ట్ర మందు సగము సంఖ్య ఆంధ్రులదైయున్నది. ప్రధాన నగరమగు హైదరాబాదు తెనుగు సీమయే. అది తెలంగాణాలో చేరినట్టిదే.

తెలంగాణమను పేరు ఈ జిల్లాలకెప్పుడు వచ్చినదోయేమో సరియగు ఆధారములు కానవచ్చుటలేదు. కాకతీయుల అనంతరము గోలకొండ రాజ్యస్థాపన కాలములో ఈ పేరు ఏర్పడినట్లూహింపదగును. తెనుగువారి నుండి యీ పదమేర్పడినదనుట స్పష్టము. తెలుంగు ఆణెము అని పద విభాగము. ఆణెము అనగా దేశము. "ఆణెమందనగ దేశాహ్వయంబు" అని ఆంధ్ర భాషార్ణవ నిఘంటులో వ్రాసియుండిరి. కాని వ్యవహారములో తెలంగాణము తప్ప వేరే ఆణెము తెనుగు దేశములో మనకు కానవచ్చుటలేదు.

తెనుగు బ్రాహ్మణులలో తెలగాణ్యులు అను శాఖ వారు కలరు. వారు సంపూర్ణముగా తెలంగాణ బ్రాహ్మణులే. తెనుగు దేశములో బ్రాహ్మణులలో పాకనాటివారు, వెలనాటివారు, నందవరీకులు గోలకొండ వ్యాపారులు, ములికినాటి వారు అను బహు శాఖ లేర్పడెను. గోలకొండ వ్యాపారులు గోలకొండ రాజ్య కాలములో ఏర్పడిన నియోగి శాఖవారు, నందవరీకులు కర్నూలు జిల్లాలోని నందవరము నుండి ఏర్పడినవారు. పాకనాటివారు కృష్ణా జిల్లావారు, ములికినాటి వారు మహబూబ్‌నగరము జిల్లా వారు. ఒక గోలకొండ వ్యాపారి శాఖ తప్పితే తక్కిన శాఖలు ఇంచుమించు కాకతీయుల రాజ్యకాలములో ఏర్పడినట్లు కానవచ్చుచున్నది. ఈ లెక్క ప్రకారము తెలగాణ్యులనుమాటప్పుడే ఏర్పడియుండవలెను. ఇవన్నీ యూహలే. చారిత్రికాధారాలు నాకు కానరాలేదు.

కీ.శే. చిల్లరిగె శ్రీనివాసరావుగారు తమ ఆంధ్రప్రదేశ్ చరిత్రములో ఇట్లు వ్రాసినారు. “అరవలును, కన్నడీలును, మళయాళులును మనలను తెలుగులు అనియే పిలుచుచున్నారు. బర్మాలోని వారును తైలింగులే, తెలుగు పేరనే తెలంగాణా మున్నగు రాష్ట్రములు ప్రాచీన కాలమునుండియు చరిత్రకెక్కినవి.

బర్మాలో తైలింగులు అనువారున్నారు. వారు ప్రాచీన మందలి మన తెలుగువారే - వారు వంగ దేశమును జయించి బర్మాను ఆక్రమించుకొని అందు నిలిచిపోయిరి - బర్మా తైలింగులను గూర్చి హర్వీ (Harvey) అను చరిత్రకారుడిట్లు వ్రాసెను.

"Indeed the Tailanga is Probobly derived from Telingana, a region on the Madras East whence so many of them Came".

మద్రాసు తీరమందలి తెలంగాణము నుండి బర్మాకు వచ్చిన తెలుగువారే బర్మాలో తైలింగులైరి అను అతని అభిప్రాయమును శ్రీనివాసరావు గారుదాహరించిరి.

ఈ తెలంగాణా చరిత్రము మనకు శాతవాహనుల కాలము నుండియు లభించుచున్నది. క్రీస్తు శకంలో శాతవాహనులు ప్రతిష్ఠాపురమును (పైఠన్) రాజధానిగా చేసుకొని తమ రాజ్యములో ఇప్పటి తెలంగాణమును; రాయలసీమను చేర్చుకొని పాలించిరి. వారి కాలములో మన తెలంగాణమునకు ముళకసీమ లేక మూలక దేశము అను వ్యవహారముండెను. శాలివాహనుల శాసనములో తమ దేశములో ముళక దేశముండినట్లు వ్రాసినారు. నేటికిని మహబూబ్‌నగరు జిల్లాను “ములకసీమ”

అని అలంపూరు, గద్వాల వారనుచున్నారు. ఆంధ్రకులు, మౌళికులు, అశ్మకులు, భోగర్ధనులు, కుంతలులు దక్షిణాంధ్ర మందలి జాతులని మార్కండేయ పురాణంలో వ్రాసినారు. అందలి మౌళికులే ఈ మళక సీమవారు.

దక్షిణ దేశములో తెలంగాణముండినట్లును అందలి వారిని తెలింగులు అని వ్యవహరించినట్లును "అథపార్శ్వే తలంగాశ్చా" అని వాయు పురాణములో నున్నదని బిమలా చరణలాగారు (Tribes in Ancient India) ప్రాచీన భారతదేశమందలి జాతులు అను గ్రంథములో వ్రాసిరి.

ఇదే తెలంగాణలో ఆంధ్రుల నగరాలలో కొన్ని నగరాలుండినట్లును ప్లినీ గ్రీకు చరిత్రకారుడు ప్రాచీనమందు వ్రాసినట్టి ఒక ఆంధ్ర నగరము క్రీస్తు శక ప్రథమ ద్వితీయ శతాబ్దులందు హైదరాబాదు నగరమునకు 40 మైళ్ళ దూరములోని కొండాపుర గ్రామము వద్ద వెలిసి యుండినట్లును రెండేండ్లనాడు ప్రభుత్వము వారు త్రవ్వించిన ప్రాచీనపు దిబ్బల నుండి వెల్లడి అయ్యెను. మరియు ఆ దిబ్బలలో ప్రాచీనాంధ్ర రాజుల సీసపు నాణెములు కొల్లలుగా లభించెను. కొన్ని నెలల క్రిందటనే నల్లగొండ వద్ద మరొక ప్రాచీనాంధ్ర నగరము బయటపడినది.

మార్కండేయ పురాణములో మూచికులు అను ఒక జాతి వర్ణింపబడినది. అది మూసీనదీ తీరాలలోను చుట్టుపట్టులలోను వెలసియుండి మూసిక జాతియై యుండునని రాయే చౌదరిగారు ఊహించినారు. మూసీ ఇంచుమించు 150 మైళ్ళ పొడవున వికారాబాదు నుండి హైదరాబాదు నగరం మీదుగా ప్రవహించునట్టి తెలంగాణంలోని ఒక యుపనది. మార్కండేయ వాయు పురాణములలోని చర్చలు వ్యాస ప్రోక్తములనియు, యుగాంతర విషయాలనియు, అతి ప్రాచీనములనియు భ్రమ పడరాదు. క్రీస్తు శకము దశమ శతాబ్దము వరకు కూడా యీ పురాణాలను కల్పించి పెంచుతూ వచ్చిరని యెరుగవలెను.

శాతవాహనుల సామ్రాజ్యము క్రీ.శ. మూడవ శతాబ్దిలో క్షీణించుచు వచ్చెను. అటు తర్వాత తెలంగాణ చరిత్ర సరిగా లభించుట లేదు. ఉత్తర దేశమందు హర్షుడు రాజ్యము చేసిన కాలములో దక్షిణమున వాతాపిని రాజధానిగా చేసుకొని పులకేశి రాజ్యము చేసెను. అతని యధీనములో తెలంగాణ ముండెను. అతడు చాలా ప్రబలుడగు దక్కన్ మహారాజు. అతని వద్దకు ఈరాన్ రాయబారులు వచ్చిరి. అతని

తర్వాత పులకేశి రాజులు ఈ ప్రాంతాన్ని రాజ్యము చేసిరి. చాళుక్యులు తర్వాత ప్రభువులైరి. వారికిని పల్లవులకును కొంతకాలము యుద్ధములు జరిగెను. పల్లవులే జయించిరి. మరికొంత కాలానికి పశ్చిమ చాళుక్యులొక దిక్కు, చోళులొక దిక్కు విజృంభించిరి. తెలంగాణా ప్రాంతాన్ని పశ్చిమ చాళుక్యులే విశేష కాలముగా రాజ్యము చేసిరి. తెలంగాణ మంతటను చాళుక్యులు కట్టించిన శైవాలయములు కలవు. అందు వారి కన్నడ శాసనాలు కొల్లలుగా కనబడుచున్నవి.

చాళుక్యుల బలము క్షీణించిన తర్వాత కాకతీయులు విజృంభించిరి. కాకతీయుల కాలము నుండి మనకు తెలంగాణ చరిత్రము సమగ్రముగాను, విపులముగాను లభించుచున్నది. కాకతీయ రాజులు తెలంగాణాలోని ఓరుగల్లు నగరమును రాజధానిగా చేసుకొని ఇతర ప్రాంతాలను గూడ జయించి గొప్ప సామ్రాజ్యము స్థాపించి క్రీ.శ. 1350 వరకు రాజ్యము చేసిరి. వారి శాసనములు తెలంగాణ మంతటను లభించుచున్నవి. అవన్నియు తెనుగులోనే వ్రాయబడినవి. కొన్ని సంస్కృతమందును కలవు. కాకతీయుల చరిత్రను వివరించుట కిది సమయము కాదు – ఢిల్లీ రాజులకును, కాకతీయులకును పలుమార్లు యుద్ధాలు జరిగెను. తుదకు రెడ్డి వెలమలయొక్క ద్వేషాల వల్లను ఆంధ్రులలోని పరస్పర కలహాలవల్లను, జైన శైవ మత సంఘర్షణములందు జైనుల రాజ్య ద్రోహము వల్లను, కుల విద్వేషాల వల్లను కాకతీయ సామ్రాజ్యము విధ్వస్థమయ్యెను.

వారి యనంతరము దక్కన్‌లో బహమనీ రాజ్యమేర్పడెను. బహమనీ సుల్తానులకు తెలంగాణ లోబడియుండెను. కాని ఒక నూరు సంవత్సరాలకే బహామనీ రాజ్యము అయిదు తునకలైపోయెను. అందొక శకలము గోలకొండ రాజ్యము. అది పూర్తిగా తెనుగు రాజ్యమై యుండెను. తెలంగాణాలోనే గోలకొండ కోట, కుతుబ్‌షాహీల ముఖ్యస్థానముండెను. తెలంగాణములో కుతుబ్‌షాహీల సరిహద్దు ఖిల్లాలుండెను. కుతుబ్‌షాహీల రాజ్యము క్రీ.శ. 1518 నుండి క్రీ.శ. 1687 వరకుండెను. ఆ 170 ఏండ్ల కాలములో గోలకొండ సుల్తానులు తెనుగువారికి ఉద్యోగాలు యిచ్చి తెనుగు సనదులిచ్చి, తెనుగుభాషను ప్రోత్సహించి, తెనుగు సేనానులను; తెనుగు సిపాయిలను ఏర్పాటు చేసి, రాజ్యమును తెలుగు రాజులవలె పాలించిరి. మత పక్షపాతము తప్పనిదైనను సమకాలీనులైన ఇతరుల వలె వారు దురాగ్రహమును ప్రదర్శించి యుండలేదు.

కుతుబ్‌షాహీల యనంతరము ఆసఫ్ జాహి ప్రభువులు ఈ తెలంగాణమునకు ప్రభువులైరి. ఇంచుమించు 280 ఏండ్ల నుండి ఆసఫ్‌జాహీ వంశమువారు తెలంగాణాతోపాటు మరాట్వాడాను పరిపాలించుచు వచ్చినారు.

ఈ విధముగా మనకు 2000 ఏండ్ల నుండి తెలంగాణ చరిత్రము కొద్దిగనో గొప్పగనో లభించుచున్నది. ఇప్పుడు పరిపాలనా సౌకర్యము కొరకై తెలంగాణము మరాట్వాడా నుండి విభిన్న మొనర్చబడినది. కాని ప్రాచీన మందట్టి విభిన్నత కాని, ప్రత్యేకత కాని ఈ తెలంగాణమని కాని లేకుండెనని యెరుగవలెను. వివిధ రాజులు, సుల్తానులు తెలంగాణాముతో పాటు ఇతర ప్రాంతాలను కూడా జయించి రాజ్యము చేయుచుండిరి. ఇప్పుడు హైదరాబాదు రాష్ట్రములో ఆసఫ్ జాహీ ప్రభువుల పరిపాలన క్రింద తెలంగాణాకు విశిష్టత ఏర్పడినందున ఈ భాగములోని చరిత్రను తెలంగాణ వాసులు యెరిగియుండు టవసరమని తెల్పనైనది.

హైదరాబాదు రాష్ట్రములోని చారిత్రక స్థలములు

హైదరాబాదు రాష్ట్రములో అనేక రాజ్యాలు సామ్రాజ్యాలు ఏర్పడి అంతరించెను. అనేక మతాలిందే విజృంభించెను. అందుచేత చారిత్రకులకు ఇది ముఖ్యస్థానమని చెప్పవచ్చును. ప్రాచీన రాజులు కట్టిన కోటలు వారి రాజ్య చిహ్నములు గాను, రాజులు ధనిక భక్తులు కట్టించిన పూజాలయములు మత చిహ్నములుగాను, నేటికిని ఈ రాష్ట్రమందు ప్రతి తాలూకాలో కూడ చూచి ఆనందింపవచ్చును. చారిత్రకులకు నెత్తినొప్పిని, ఆయాసమును, పరిశోధన పటిమను, కల్పించునట్టి తామ్రశిలా శాసనములు వందలు కాదు కదా వేలకొలది లభించుచున్నవి. అముద్రిత తాళపత్ర గ్రంథములు కూడా వందల కొలదిగా, వేలకొలదిగా లభించినవి. ఇంకను లభించు చున్నవి. ప్రాచీన నాణెములు పలుతావుల జనులకు దొరకుచుండును.

ఈ రాష్ట్రములోనే ఆంధ్ర శాతవాహనులు, యాదవులు, చాళుక్యులు, రాష్ట్ర కూటులు, కాకతీయులు, పంచ సుల్తానులలో ముగ్గురు సుల్తానులు తమ రాజధానులను స్థాపించుకొని రాజ్యము చేసిరి. ఈ రాష్ట్రమందలి భాగములను బయటి ప్రాంతముల నుండి ఆంధ్రులు, మహారాష్ట్రులు, ఓఢ్రులు, రెడ్లు రాజ్యము చేసిరి. ఈ రాష్ట్రములోనే జైన, బైద్ధ, వీరశైవ, శ్రీవైష్ణవ మతములకు సంబంధించిన ప్రసిద్ధాలయములు కలవు. సిక్కులకు కూడా నాందేడు పవిత్రమైనది. గుల్బర్గా, గోలకొండ, సుల్తానులీ రాష్ట్రములోనే పరిపాలనము చేసియుండిన వారగుట చేత చాలా మసీదులు దర్గాలు నిర్మాణమయ్యెను. ఆసఫ్ జాహి వంశ ప్రభువుల కాలములో పై నిర్మాణములను కాపాడుటయేగాక కొత్త నిర్మాణములను కూడా కావించిరి.

హైదరాబాదు రాష్ట్రములోని పాత దిబ్బలను త్రవ్వించినచో మరికొన్ని చారిత్రక విశేషములు లభ్యమగును. ఇటీవలనే హైదరాబాదునకు40 మైళ్ళ దూరములో నున్న కొండాపురము అను స్థలము వద్ద కొన్ని ప్రాచీన ఆంధ్ర నాణెములు లభించెను. వాటి ఆధారముచే అచ్చట త్రవ్వించగా 1800 సంవత్సరాల క్రిందటి ఆంధ్ర నగర మొకటి బయటపడెను. ఈ రాష్ట్రములోని రాయచూరు జిల్లాలోని మస్కీ వద్ద అశోక చక్రవర్తి శాసనములు లభించినవి. అవి 2200 ఏండ్లకు పూర్వము నాటివి. రాష్ట్రములోని అతి ప్రాచీన చారిత్రక చిహ్నములలో ఇది ముఖ్యమైనదని చెప్పవచ్చును. అటు ఉత్తర దిశయందుండు ఔరంగాబాదు జిల్లా చాలా ముఖ్యమైన చారిత్రక మండలమై యున్నది. ప్రాచీనకాలమందు దేవగిరి రాజ్యమిందే యుండెను. అంతకన్న ప్రాచీనములో శాలివాహన రాజులు ప్రతిష్ఠానపురమును (నేటి పైఠాన్) రాజధానిగా చేసుకొని ఇప్పుడు ఆంధ్ర మహారాష్ట్ర కర్ణాటకలనబడు భాగాలను ఏకచ్ఛత్రాధిపత్యముగా పరిపాలించిరి. ఔరంగాబాదుకు 12 మైళ్ళ దూరములో హిందూస్థానమందలి అగ్రశ్రేణిలోచేరిన కోటలలలో నొకటగు దేవగిరి (దౌలతాబాదు) జిల్లా యున్నది. అచ్చటనే ఔరంగజేబు యొక్కయు, అసఫ్ జాహి యొక్కయు గోరీలున్నవి. అచ్చటకి 2 మైళ్ళ దూరములో జగద్విఖ్యాతమైన ఎల్లోరా గుహలున్నవి. మూడు మైళ్ళ పొడవున గట్టులలోనే గుహలను తొలచి ఆలయములను విహారములను నిర్మించినారు. అందు జైన, బౌద్ధ హిందూ శిల్పములున్నవి. క్రీస్తు శక పూర్వము 200 ఏండ్ల నాటినుండి క్రీస్తు తర్వాత 900 ఏండ్ల వరకు ఈ గుహలు నిర్మాణమై యుండెను. అందలి శిల్పాలు అద్వితీయమైనవి. ఆ శిల్పాలలో కైలాసం అను పేరుతో నున్న శిల్పరాజము నిజముగా భూలోక శిల్పములలో కైలాసము వంటిది. ఔరంగాబాదులో బీబీకా మక్బరా అనునది తాజమహల్ యొక్క నఖల్. అదే నగరములో పూర్వులు చుట్టునుండు గట్లనుండి భూమిలో కాలువలు నిర్మించి నగరమంతటను నిరంతరము ఊట గొట్టముల ద్వారా నీరు సప్లయి యగునట్లు చేసినది నేటికిని అనుభవములోనున్నది. ఔరంగాబాదునకు 60 మైళ్ళ దూరములో అజంతా గుహలున్నవి. అవి రాతిలో కవితను ప్రదర్శించు తావులు. గట్లును వాటిపై నుండు చెట్లును ఆ గట్ల నుండి నిరంతరము ప్రవహించు దివ్య ప్రవాహమున్నూ అరసికుని రసికునిగా క్షణమాత్రమున జేసివేయును. ఇంచుమించు 2000 ఏండ్ల కిందట అచ్చటి గుహలలోని గోడలపైన

గచ్చువేసి వాటిపై రంగులతో చిత్రించిన చిత్రాలను నేల నాలుగు చెరగుల వారును అదేపనిగా వచ్చి చూచి ముగ్ధులైపోవుచున్నారు. కామధేను వంటి మహాత్ములను గన్న ఔరంగబాదు జిల్లా పవిత్రమైనది.

ఔరంగాబాదు తర్వాత ప్రసిద్ధమైనట్టిది ఒరంగల్ జిల్లా. అది ఆంధ్రులకు ప్రాముఖ్యమైనట్టిది. అందు కాకతీయ రాజుల కోటలు గలవు. వారిచేతను వారి సామంత దండ నాయకులచేతను నిర్మింపబడిన జైన దేవాలయములచ్చట సర్వ వైభవమును ప్రకటించుచున్నవి. ఓరుగంటికి 40 మైళ్ళ దూరములో రామప్ప గుళ్ళును పాఖాల చెరువును అవశ్య దర్శనీయములై యున్నవి. రామప్పగుళ్ళ గోపురములకు వినియోగించిన ఇటికలు చాలా పెద్దవైనను అవి నీటిపై తేలియాడుటను నేటి ఇంజనీరులు చూచి ఆశ్చర్యపడుచున్నారు. రామప్ప గుళ్ళలోని నల్లరాతి విగ్రహాలను పూర్వమెవ్వడో ఒక తాలూక్దారు మోహించి యుండెనను కథను విన్నచో వాటి శిల్ప సౌందర్యమెట్టిదో ఊహించుకొనవచ్చును. రామదాసు భక్తిని చాటిన భద్రాచల క్షేత్ర మీ జిల్లాలోనిదే.

ఒరంగల్ తర్వాత చరిత్ర పరికరాలకు ప్రసిద్ధమైనది నల్లగొండ జిల్లా. నల్లగొండ పట్టణానికి 4 మైళ్ళ దూరములోనే పానగల్లు కలదు. అందలి 1000 ఏండ్ల నాటి దేవాలయము శిథిలమైపోయినను మిగిలిన శకలములు కూడ తమ శోచనీయ స్థితిని కరుణరసయుక్తముగా మనకు తెలుపుచున్నవి. సూర్యాపేటకు 12 మైళ్ళ దూరములోని పిల్లలమర్రి వెలమదొరల చరిత్రకును, సుందర దేవాలయ శిల్పమునకు ప్రసిద్ధి. నల్లగొండ జిల్లాలో దేవరకొండ రాచకొండ అను పెద్ద దుర్గాలు కలవు. అవి వెలమరాజుల రాజధానులు. వాటిలోనిప్పుడు నీటు ఏమిన్నీ లేకున్నను వైరుల పోటును మాత్రము అవి బాగుగా ప్రదర్శించుచున్నవి. ఇదే జిల్లాలోని భువనగిరి దుర్గము కాకతీయుల నాటిదైనను చూచుట కందమైన దైనను ఎక్కువ చరిత్రను కాంచనట్టిది. దానికి కొన్ని మైళ్ళ దూరములో కొలనుపాక కలదు. అది సుప్రసిద్ధ జైన క్షేత్రము.

ప్రాముఖ్యతలో నాల్గవ స్థానము వహించునది రాయచూరు జిల్లా. అందలి గోనబుద్ధారెడ్డి కోట దక్కను సుల్తానులకును విజయనగర చక్రవర్తులకును నిరంతరము యుద్ధాలు చేయించినట్టిది. ఇదే జిల్లాలోని కొప్పలుకు 15 మైళ్ళ దూరములోని ఇటుగీలో చక్కని శిల్పములతో కూడిన ప్రాచీన దేవాలయములున్నవి. ఆలంపూరులోని

నవబ్రహ్మ దేవాలయాలు ఇంచుమించు 2000 ఏండ్ల నాటివి. రాష్ట్ర శిల్పములలోని దేవాలయాల శిల్పము విశిష్టతతో కూడినట్టిది. ఈ రాయచూరులోనిదే గద్వాల సంస్థానం. ఇది 800 ఏండ్ల చరిత్ర కలిగిన సంస్థానం. దీనికి గొప్ప మట్టి కోట గలదు. కాని అది రాతి కోటలను మించినట్టిది. అందలి ఫిరంగీల వంటివి రాష్ట్రములోను రెండును ఉన్నవో లేవో అనిపించును.

అయిదవ స్థానము మహబూబు నగరం జిల్లాకు చెందును. అందు వనపర్తి, కొల్లాపుర సంస్థానములు వాటిలోని కోటలకు పేర్కొనదగినవి. కొల్లాపుర సంస్థానములోని జటప్రోలు దేవాలయము ప్రాచీనమైనది. దాని శిల్పము ఇతరోత్కృష్ట శిల్పముల కేమాత్రమున్నూ తీసిపోదు. ఇదే సంస్థానములో కృష్ణా తీరమందు మల్లేశ్వరము సోమేశ్వరము అను 1200 ఏండ్ల నాటి వీరశైవ క్షేత్రాలు కలవు. నది కవతలి యొడ్డుననేశైవ క్షేత్ర రాజ్యమైన సంగమేశ్వరము కలదు. నాగరుకర్నూలు తాలూకాలోని పానగల్లు కోట ఇంచుమించు 800 ఏండ్ల నాటిది. అచ్చంపేటలోని ఉమామహేశ్వరం అమరాబాదులోని మన్ననూరు మంచి శైవక్షేత్రములు. ఆత్మకూరు సంస్థానములోని కురుమూర్తి శైలము రెండవ వెంకటాచలమని ప్రతీతి.

హైదరాబాదు నగరము దాని పరిసరములు అడుగడుగునకు చరిత్రతో కూడినట్టినవి. సమీపమందలి గోలకొండ దుర్గము, నగరము చుట్టునుండు చెరువులు, చారుమినారు, మక్కామసీదు వంటి విఖ్యాత స్థలములు ఇట్టివెన్నియో స్మరింపదగినవి కలవు.

బీదరుకోట ఈ రాష్ట్రములోని ఖిల్లాలో గణతకెక్కినది. అచటి గావాన్ విద్యాలయము సుప్రసిద్ధమైనది. బీదరు పాదుషాల గోరీ భవనములు చూడదగినవి. బిదరు సమీపములోనే నరసింహాలయము ఒక విచిత్రమగు స్థలము. ఒక ఫర్లాంగు వరకు గుట్టలో గుహామార్గ మేర్పడినది. అందు నడుము లోతువరకెల్లప్పుడును నీరు ప్రవహించుచుండెను. అట్టి గుహలో ఆ దేవాలయమున్నది. గుల్బార్గాలోని మసీదులు చాలా గొప్పవై అందమైనవై ప్రసిద్ధి నొందినవి. అందలి కోట, గోరీలు చూడదగినవి. ఆ జిల్లాలోని కళ్యాణి పూర్వమందు వీరశైవ కేంద్రమై యుండెను. అదే జిల్లాలోని మాన్యఖేటము (ఇప్పటి మలిఖేడు) రాష్ట్ర కూటుల రాజధాని. వాతాపి గణపతి అని ప్రసిద్ధి నొందిన దేవుడు ఇప్పటి బాదామిలో వెలసినాడు.

కరీంనగరములోని ఎల్లందు కోట, మహబూబ్ నగర జిల్లాలోని కోయిలకొండ కోట వంటివి రాష్ట్రములో అనేక స్థలములందు కానవచ్చుచున్నవి. అజ్ఞాత వాసములో నున్న శిల్పము లెన్నియో కలవు. రాజ్యాలతోపాటు ఆలయాలెన్ని భూగర్భమందు అణగిపోయెనో యేమో. వీలైనంతవరకు ప్రభుత్వ దృష్టికి వచ్చిన ప్రాచీన స్థలముల నన్నింటిని కాపాడుటకై ఏటేట కొన్ని లక్షలను మ.ఘ.వ. నిజాం ప్రభుత్వం వారు ఉదారతతో వ్యయము చేసి ధన్యవాదములకు పాత్రులైనారు. గద్వాలలోని పూడూరులో జైన శాసనాలున్నవి. ఇట్టి వెన్నియో వందల కొలది స్థలములున్నవి. సుప్రసిద్ధములైన వానినే ఇప్పుడు పేర్కొనియున్నాను.

ఈ రాష్ట్రములో పశ్చిమ చాళుక్యుల యొక్కయు, కాకతీయుల యొక్కయు శాసనములే యెందు చూచినను కానవచ్చుచున్నవి. అనేక స్థలములందు నాణెములు నేటికిని దొరుకుచున్నవి. అముద్రిత గ్రంథాలు దొరుకుచున్నవి. ఈ రాష్ట్ర మింకను చారిత్రిక పరిశోధకులకు గనియై యున్నది. ఉపయోగించుకొనువారే పరిశోధింపదగిన వారై యున్నారు.

హైదరాబాదు నగర ప్రాచీన స్థలాలు

హుసేన్‌సాగరు

హైదరాబాదుకును సికింద్రాబాదుకును మధ్య ఉన్న హుసేను సాగరు చెరువును గురించి లోకులు ఒక వినోదమగు కథ చెప్పుకుంటారు. అదేమన మీర్ ఆలం మంత్రిగా ఉండే కాలములో ఈ చెరువును కట్టించెనట. కాని తన పేరుతో ప్రచార మందుండుటకు మారుగా దానిని జనులు హుసేనుసాగరు అనిరట. ఎందుకంటే హుసేను సాబ్ అను "మేస్త్రీ" చెరువు కట్టిన కూలీలలకు దినమూ సాయంత్రము కూలీలు బట్వాడా చేయుచూ ఉండెనట. అప్పుడు మీరు ఆలం వేరే ఒక చెరువు నిర్మాణాన్ని ఏర్పాటుచేసి తానే కూలీ యిచ్చుచు వచ్చెనట. అందుచేత వేరే మీరాలం చెరువు ఏర్పడెనట. ఇదంతా పుక్కింటి పురాణం. నిజమేమంటే ఇబ్రహీం ఖుతుబుషా 957 హిజరీలో గోల్కొండ నవాబయ్యెను. అతడు రైతు లోకాన్ని ఉద్ధరించి రాజ్యాదాయం ఎక్కువ చేసే నిమిత్తం చాలా చెరువులు కట్టించెను. ఇప్పటి ఇబ్రహిం పటం చెరువు మరియు కంకూరు బుద్వేలిలోను అతడే చెరువులు కట్టించెను. హుసేను సాగరు చెరువు కూడా అతడే కట్టించెను. దానికి రెండు లక్షల హూన్నులు ఖర్చయ్యెను. ఆ చెరువు నిర్మాణాన్ని హుసేనుషా అను నొక వలీ విచారించు కొనుచుండెను. అందుచేత అతని పేర ఈ చెరువు ప్రసిద్ధికి వచ్చెను.

పాతవారధి

నగరములోని మూసీనదిపై కట్టబడిన పాత వారధి యొక్క నిర్మాణము రసికత్వముతో కూడినదై యున్నది. ఇబ్రహీం ఖుతుబ్‌షా కుమారుడైన మహమ్మదుఖులీ అనువాడు "భాగమతి" అను భోగముదాని నుంచుకొని యుండెను. ఇప్పుడు చార్‌మినారుండు ప్రాంతాన "చచ్లం" అనుగ్రామం ఉండెను. అచ్చుట ఆ బోగముది

ఉండెను. దాని యింటికి యువరాజు వచ్చి పోవుచుండెడి వాడు. ఒకనాడు తన అలవాటు ప్రకారము గోలకొండ ఖిల్లానుండి బయలుదేరి దాని యింటికి పోవువాడై మూసీనది వరకు వచ్చెను. వర్షాకాలమగుటచేత నది అప్పుడే నిండి పారుచుండెను. ప్రేమ శక్తి బలవత్తరమైనది. ప్రవాహాన్ని జయించునట్టిది. యువరాజు గుర్రాన్ని ప్రవాహములోనికి దింపి ఇవతలి నుండి అవతలికీ దించి భాగమతి యిల్లు చేరుకున్నాడు. ఈ వార్త చారులు పాదుషాకు తెలిపినారు. తక్షణమే మూసీపై వారధి కట్టవలెనని ఆజ్ఞాపించినాడు. మరొక వర్షర్తువు వచ్చే లోపల అది సిద్ధమయిపోయెను. దానికి రెండు లక్షల (బంగారు హున్నులు నాణెములు వ్యయమయ్యెను). ఈ వారధి 881 హీజ్రిలో కట్టబడెను. దీనినే ఇప్పటికిని పురానాపుల్ అని వ్యవహరింతురు.

మౌలాలీ ఉరుసు

హైదరాబాదులో ఏటేట మౌలాలీ గుట్టపై ఒక గొప్ప ఉరుసు జరుగును. దానికి గాను స్థానికముగా రెండు దినాలు కచ్చేరీలకు సెలవు కూడా ఇయ్యబడును. ముసల్మానులే కాక హిందువులును వేలకొలది ఆ గుట్టకు పోయి ఫాలుహోరు చదివించి మొక్కులు చెల్లించికొని వత్తురు. బీదలేకాక మ.ఘ.వ. నిజాం ప్రభువుగారును మౌలాలీ సేవచేసుకొని వత్తురు.ఈ మౌలాలీ గురించి జనులు నానా కథలు అల్లుకొని చెప్పుకొందురు. నిజమైన సంగతి ఇట్లున్నది.

ఇదే ఇబ్రహీం కుతుబుషా కాలములో గోలకొండకు సమీపములో నుండు నొక గుట్టపై ఒక దేవాలయముండెను. ఒకనాడు వెన్నెలరాత్రిలో పాదుషా గోలకొండ పై భాగమందలి "బాలా హిసార్" అను సౌధముపై ఆనందముతో అటునిటు ప్రచారు చేయుచు ఉండెను. అట్టి సమయములో అతనికి ఉత్తరపు దిక్కున ఒక పెద్ద వెలుతురు కానవచ్చెను. ఆ సమయములో రాయారావు అను పేరుగల బ్రాహ్మణుడు పాదుషా వెనుక నిలిచి యుండెను. ఆ వెలుతురేమిటి? అని రాయరావును పాదుషా విచారించెను.

"సర్కార్ ఆ గుట్టపై మౌలాలీ అనే ఫకీరు యొక్క జండా యున్నది. అందుచేత షియ్యాలు అచ్చట అఖండదీపములు పెట్టినారు" అని చెప్పినాడు. "అట్లయితే మనము కూడా రేపు గురువారము నాడు పోయి దర్శనము చేసుకొని వత్తుము" అని పాదుషా సెలవిచ్చినాడు. బ్రాహ్మణుడు, యజమాని సంతోష పడుటకై ఏదో ఒక తప్పుడు కూత కూసి యుండెను. పరిహాసవిజల్పితము తుదకు పరమార్థముగా గ్రహించబడెను.

తనమాట దక్కించుకొనవలెను. లేకున్న తన తలకూడ పోవచ్చును. మరునాడే ఆ గుట్టకు పోయి గుడిలోని హిందూ దేవత విగ్రహాన్ని ఎత్తి పారవేయించి మసీదువలె మార్పించి ఒక జెండా పాతించి దానిచుట్టును ఒక ఆకుపచ్చని బట్ట కట్టించి అంతయు సర్వసిద్ధము చేయించినాడు – గురువారము రానే వచ్చెను. అనాడు హజరత్ ఆలీగారి 13వ రజల్ దినము. కావున గుట్ట వద్ద పాదుషా బీదలకు అన్నదానము బాగుగా చేయించినాడు. ఈ విధంగా అది ఏర్పడెను. ఆనాటి నుండియు మౌలాలీఉరుసు అనుపేర సుప్రసిద్ధముగా అదే స్థలములో జరుగుచున్నది, కారణం తెలియకున్నా హిందువులును అచ్చట సేవ చేసుకొని పోవుచుండుటయు ఒక విశేషము.

భాగ్యనగరము

మన ఆంధ్రులు చాలామంది హైదరాబాదును "భాగ్యనగర" మని కూడా ఇప్పటికి వ్యవహరించుచున్నారు. బహుశ చాలామందికి దాని కారణము తెలియక పోవచ్చును. 988 హిజ్రీలో ఇబ్రహీం ఖుతుబుషా చనిపోయెను. అతని కుమారుడు – భాగమతి అను బోగము దాన్ని ఉంచుకున్న మహమ్మదుఖులీ ఖుతుబుషా అనువాడు రాజయ్యెను. భాగమతికి తానున్న చోటనే నగరము నిర్మించవలెనని కోరిక పుట్టెను. మహా సౌందర్యవతి, పాదుషాగారు చేపట్టిన యువతి, బోగముది. కోరికలు వృథా పోవు. పాదుషాగా రిట్లాజ్ఞాపించినారు. "గోలకొండ ఇరుకటంగా ఉంది. మా దర్జాకు తగినట్టుగా లేదు. అమీర్లకు ఇబ్బందిగా వుంది. నదికి అవతలి భాగంలో నగర నిర్మాణం చేయవలసింది. నాలుగు బాటలు నాలుగు వీధులుండవలెను. నాలుగు కమానులు నాలుగు దిక్కులు కట్టవలెను. 14000 దుకాణాలుండవలెను. 12000 మొహల్లాలు (వాడలు) ఉండవలెను" అని ఆజ్ఞాపించెను. నగరము సిద్ధమయ్యెను. రెండు కోట్లకన్న యెక్కువగా రూపాయీల వ్యయమయ్యెను.

చార్‌కమాను

పై విధముగా సిద్ధమైన నాలుగు బజారులలోని నాలుగు కమానులనే ఇప్పటికిని చార్‌కమాన్ అని వ్యవహరించుచున్నారు. ఇందలి ఉత్తర దిక్కున కమాను వద్ద ఒక వైద్యాలయమును నిర్మించిరి. పశ్చిమ దిశలో హుజూరు వారి భవనాలు నిర్మించిరి. ఈ నాలుగు కమానుల మధ్య విశాల స్థలమును నందలి ఒక "హౌజును" కట్టిరి.

అందు నీరు విడచి రమ్య దృశ్యముగా నేర్పాటుచేసిరి. తర్వాతి కాలములో అందు నీరు విడుచుట లేనందున దానికి "సూఖా హౌస్" అనుపేరు వచ్చి ఇప్పటికిని అదే పేరుతో వ్యవహరింపబడుచున్నది.

ఆషర్ ఖానా

వీటి సమీపంలోని జామె మస్జిద్ కట్టిరి. దీని నిర్మాణానికి 2 లక్షల రూపాయలు ఖర్చుయ్యెను. నదీ తీరమున నదీ మహలునున్ను నబీ బాగునున్ను కట్టిరి. 1003 హిజ్రీలో 60 వేలు పెట్టి "ఇమాంబాడా" ను కట్టిరి. దానినే యిప్పుడు బాదుషాహి ఆషుర్ఖానా అని యందురు. దాని సమీపంలోనే మోతీ మసీదును కట్టించిరి.

చార్‌మినార్

మొత్తానికి ఈ భాగ్య నగరాన్ని మక్కా క్షేత్రమువలె నిర్మించవలెనని పాదుషాకు కోరిక జనించి యుండెను. అందుచేతనే యీ విధముగా నూతన నగరములో కమానులు, హౌజు, వీధులు, మసీదు, బంగ్లాలు నిర్మించెను. అచ్చట మక్కా క్షేత్రములో హజరత్ ఇమాంగారి రోజా ఉన్నది. దానికి ప్రత్యామ్నాయముగా ఇచ్చట చార్‌మీనార్ కట్టించెను. దాని నిర్మాణానికి ఇంచుమించు రెండు లక్షల బంగారు హొన్నులు ఖర్చుయ్యెను. ఈ చార్‌మినార్ 1000 హిజ్రీలో నిర్మింపబడెను.

నగర వ్యాప్తి

యథా పాషా తథా ప్రజా. పాషాను జూచి అమీర్లు కూడా పెద్ద పెద్ద బంగ్లాలు, తోటలు, బాటలు కట్టించి వేయించిరి. నూతన నగరమునకు ఇవి వ్యాప్తి నొందుచుపోయెను. అందుచేత రఖోడా, ఇబ్రహీంపట్నం, బోనగిరి, పటాన్‌చెరువునకు అమీర్లు బంగ్లాలు తోటలు నిర్మించిరి. ఇట్లు నూతనముగా నిర్మాణమై చార్‌కమానుల మధ్యనున్న నగరానికి భాగమతి జ్ఞాపకార్థము "భాగ్యనరగము" అను నామకరణము కావింపబడెను. ఈ నగరములో పట్టీలు ఏటేట నాలుగు లక్షల హొన్నులవరకు వసూలు కావచ్చెను. ఈ పన్నుల నుండియే బీదలకు అన్నదానమునకై 12 వేల హొన్నులకు 60 హొన్నులు లంగరు ఖర్చుకును, తక్కిన మొత్తము మౌల్వీలకును పంచిపెట్టబడుచుండెను. గోలకొండ పాదుషాలు షియ్యా మతస్థులు. అట్లున్నను ఈ పాదుషా ఎవరైతే హజరత్ పైగంబర్ మహమ్మద్ రసూలుగారి ముగ్గురు

అనుయాయులను (తబర్రాపాడి) నిందింతురో వారి నాలుకలను కోయింతునని ఆజ్ఞ యిచ్చెను.

అయితే యీ ఆజ్ఞను తనకే మనసుకు వచ్చి చేయలేదు. అప్పుడు ఢిల్లీలో చక్రవర్తియైన జహంగీరు ఇచ్చటి షియ్యాల ఆచారాలను విని వెంటనే తబర్రాను మాన్పింతువా లేదా అని బెదిరించెను. అందుచేత తబర్రా నిలిచిపోయెను. జహంగీరు కోపశాంతికై మంచిమంచి నజరానాలు కూడా పంపబడెను.

మక్కామసీదు

భాగమతీ ప్రియుడు చనిపోయెను. అతని కుమారుడు సుల్తాన్ మహమ్మదు కుతుబుషా రాజయ్యెను. అతడు తన కాలములో చారుమీనారు సమీపంలో మక్కా మసీదును కట్టించెను. దీని శంఖుస్థాపన కథ చాలా రమ్యముగా నున్నది. 1027 హిజిరిలో రాష్ట్రములోని మౌల్వీలను, ఫకీర్లను, అరబి పండితులను పిలిపించి వారి సమక్షములో నిట్లు సెలవిచ్చెను. “మీలో ఎవరైతే ఎన్నడుగాని తప్పకుండా దినమూ అయిదు మారులు నమాజు చేసినారో అట్టివారు దీని శంఖుస్థాపన చేయవలసినది” అందరూ ఒకరి మొగము ఒకరు చూచుకొనుచున్నారు. అప్పుడు పాదుషా తానే శంఖుస్థాపనకై మొదటి రాతిని పాదుకొలిపినాడు. అంటే ఆయన నమాజు తప్పని మతాభిమాని అని తేలిపోయింది. ఆయన కాలములో ఈ మసీదుకు గాను 30వేల హొన్నులు వ్యయము జేసినాడు. పని చాలా తిన్నగా సాగుతూ వచ్చింది. ఆయన కాలములో అది పూర్తికాలేదు. తర్వాత అబుల్‌హసన్ తానాషా కాలములో కూడ నిర్మాణము జరుగుతూ వచ్చెను. అప్పటికిని పై కప్పు పూర్తి అయ్యేనే కాని దానిపై మీనారులు ప్రారంభమే కాలేదు. తర్వాత అతనికి పతనము కలిగెను. ఆలంగీరు పాదుషా గోలకొండ రాజ్యాన్ని వశపరచుకొనెను. అతడును ఇంత గొప్ప మసీదుకు మీనారులు మున్నగునవి కట్టించుట సాధ్యము కాదని అక్కడికక్కడే పూర్తి చేయించి ముగించెను. ఇట్లు 1027 హిజరీలో మొదలైన యీ మక్కామసీదు 1104 హిజరీలో పూర్తయయ్యెను. అనగా ఇంచుమించు ఒక శతాబ్దము పట్టెను. ఇప్పటికిని హైదరాబాదు రాష్ట్రములో మక్కా మసీదును మించిన మసీదు లేనేలేదు.

లింగంపల్లి బాగ్

సుల్తాన్ మహమ్మదు ఖుతుబ్షా వచ్చెను. అతని కుమారుడు అబ్దుల్లా ఖుతుబుషా అనువాడు రాజ్యానికి వచ్చెను. అతడు రంగీలా రాజు. విలాసపురుషుడు, స్త్రీలోలుడు, విషయాసక్తుడు. అందుచేతనే అతడు తన వాహ్యాళి విహారాలకుగాను లింగంపల్లిలో పెద్ద ఉద్యాన వనము పెంచెను. దానినే యిప్పటికిని 'బాగ్‌లింగంపల్లి' అని అందురు.

గోషామహల్

అతడే తన వినోదాలకు తాను నిర్మించిన నట్టితో తృప్తి పడక "గోషా మహల్" కట్టించెను. అచ్చట ఒక పెద్ద హౌజు కట్టించెను. దాని చిహ్నలిప్పటికిని గోషామహల్‌లో కలవు. దాని చుట్టునూ ఒక వేయి పెద్ద గదులు కట్టించెను. ఈ పాదుషా చీనా దేశము నుండి చిత్రకారులను పిలిపించి షాహీ ఆఘుర్ఖానాలో రంగుల చిత్రాలు వ్రాయించెను. ఇతడు తన కాలములో ఒక ఆజ్ఞను తన రాజ్యములో కావించెను. 'పీర్ల పండుగ' కాలములో ఒక రాజ్యమందెచ్చటను దేవిడీలలో నగారాలు మ్రోయించ కూడదనిన్నీ, తమలపాకులు, మాంసము ఎవ్వరునూ తినకూడదనిన్నీ అమీరుకానీ, ఫకీరుకానీ ఆనందాల నన్నింటిని కట్టిపెట్టవలెననిన్నీ హిందువులకును, ముసల్మానులకును ఈ యాజ్ఞ వర్తించుననిన్నీ ఫర్మానాను ఇచ్చెను.

లంగర్

మొహర్రం (పీర్ల) పండుగలో 20 ఏండ్ల క్రిందటివరకు అయిదవ దినమునాడు హైదరాబాదు నగరములో "లంగర్" అను ఉత్సవము ప్రచండ వైభవముతో జరుగుచుండెను. దీని ఉత్పత్తి క్రమము రమ్యముగా నున్నది. సుల్తాన్ అబ్దుల్లా ఖుతుబ్‌షా ఒకనాడు ఏనుగుపై ఎక్కి వాహ్యాళి వెళ్ళుచుండెను. అంతలో ఏనుగుకు మదమెక్కెను. అది చుట్టుపట్టు వారిని చెదరగొట్టి ఒకే పరుగున అడవిమార్గము పట్టెను. ఈ వార్త సుల్తాను తల్లియైన హయాతు బక్షీ భేగంకు తెలియగానే ఆమె ఏడ్చుచూ కూర్చుని తుదకు 'హజరత్ ఇమాం హుసేను'ని తలచుకొని నాకొడుకు క్షేమముగా తిరిగి వచ్చినట్టయితే బంగారు గొలుసును సిద్ధము చేయించి నాకొడుకు నడుముకు చుట్టి 'లంగర్'కు వెళ్ళి తను తర్వాత దానిని ఫకీర్లకు పంచిపెట్టుదును అని మ్రొక్కుకొనెను. దైవము ఆమె ప్రార్థనను వినెనో ఏమో అన్నట్లుగానే ఏనుగు పట్టుబడెను.

పాదుషా క్షేమముగా దేవిడీకి వచ్చి చేరెను. అదే క్షణమందు రాత్రియనక, పగలనక కంసాలులను పిలిపించి, బేగంగారు 12 మణుగుల బంగారు గొలుసును సిద్ధము చేయించి, పాదుషా నడుముకు చుట్టి జూలూసు జెళ్ళించి హుసేనీ ఆలం వద్దకు పంపెను. అప్పటినుండియు ఈ లంగరు ఏటేట చేయుట పరిపాటి అయ్యెను.

మీరాలం చెరువు

హైద్రాబాదు నగరంలో హుసేన్ సాగరు తర్వాత (ఉస్మాన్‌సాగరుకట్టక పూర్వము వరకు) మీరాలం చెరువు చాలా ప్రసిద్ధి నొందినట్టిది.

నవాబ్ సికందర్ జా (ఆసఫ్‌జాహీ వంశపు నవాబు) 1187 హిజరీలో హైద్రాబాదు రాజ్యానికి వచ్చెను. 1219 హిజరీలో మీరాలం అతని మంత్రి యయ్యెను. అతడు నాలుగేండ్లు మంత్రిత్వము నిర్వహించి మరణించెను. అతని కాలములోనే అతని పేరిట మీరాలం చెరువు కట్టబడెను. దానికిగాను మూడులక్షల రూపాయలు ఖర్చుపెట్టెను. మూసీనదీ తీరములో బారాదరీ తోటకూడా అతడే వేయించెను. మీరాలం మండి (దీనినే పామరులు 'మిరియాల మండి' అని అందురు) అనునదియు వీరే ఏర్పాటు చేయించిరి. ఇప్పటికిని అచ్చట కూరగాయలు అమ్మబడుచుండును.

చాదర్‌ఘాట్ వారధి

1246 హిజరీలో నవాబు నాసిరుద్దౌల కాలములో చాదర్‌ఘాట్ వారధి కట్టబడెను. దానికై సుమారు 50వేల రూపాయల వ్యయమయ్యెను.

మూసీనది క్రీ.శ. 1912 లో గట్లు తెగి పారి నగరములో గొప్ప నష్టము కలిగించినది. యిప్పటికాలము వారి కందరికిని తెలియును. పూర్వము 1246 హిజరీలో అనగా 113 ఏండ్లక్రిందట ఒక మారిట్లే మూసీనది ప్రవహించి యుండెను. అప్పుడు పురాన్‌పుల్ కొంత భాగము ఎగిరిపోయెను. ఘాసిమియా బజారున్ను, సిద్ది అంబరు బజారున్ను, దీని పరిసర ప్రదేశాలును నదిలోని నీటిచే మునిగిపోయి చాలా నష్టమయ్యెను.

ఈ విధముగా హైద్రాబాదు నగరములో ప్రసిద్ధమైన స్థలము లేర్పడుచూ వచ్చెను.

గొల్లకొండయే గోలకొండ

ఇది గోలకొండకు సంబంధించిన శాసనము. గోలకొండకు సమీపములో రోజా అను గ్రామములో ఉన్న ఒక గొల్లవద్ద అతని పూర్వికుల కిచ్చిన సనదుకలదు. ఆ సనదు పార్సీలోను తెనుగులోను ఉన్నది. రెండును ఒకే సమయములో గోలకొండ బాదుషాచేత వ్రాయించి యియ్యబడినవి. భాషను ఉన్నదున్నట్లుగా ఉంచినాము. ఈ సనదులోని కొన్ని విశేషాలను మరొకమారు విశదపరుతుము. ఇది గోలకొండ చరిత్రకు చాలా అనుకూలించునని నా అభిప్రాయము.

ఖిలే మానుగల్ ఉర్ఫెగోలుకొండ మహమ్మదునగరు సూబేపరు కుంద బున్యాదుపర్గణే హవేలి బాగానరం మసూరువుదరే దనుగరు కొండయ్య సాకీన్ గోలకొండ రేపల్లెవాడ వలదు కొంద్య, బినుకొండయ్య, ఇబ్బను కొండయ్య పరుమానియ బజానానే కారుకూనాసె వకానుగొయాసె వదేశ మఖానే వదేశ పాండ్యానే వపటేలియాసెవ, కులకర్ణియాసె వరాయాసె, సుల్తాన్ అబ్దుల్లా బాదుషాకు తుపుషాగారు. 1086 సంవత్సరములు క్రిందట ఖిల్లా కట్టుటకు ప్రయత్నం చేస్తే కుదరనందున బాదుషాతనము రుషతైన సయ్యదు షాముస్తఫా సాహెబు కాదరీ సాకీన్ ఔరంగాబాదు హోలు మొకాం గుల్బర్గాగారితో బాదుషాచేసే బయాన్ ఏమనగా మా పెద్దలైన పెద్ద మూలకు కుతుబుషా బాదుషాగారు 964 సం॥రముల క్రిందట (భాగానగరము) దాబానగరము అనుపేరు పెట్టి ఖిల్లా కట్టడమునకు ప్రయత్నము చేస్తే కుదురలేదు. సీసకమ్మగుట్టల మీద కిలా కట్టడమునకు పులుగంపోస్తే అది కుదురలేదు. ఈ ఖిల్లా కుదురలేదు. ఇప్పుడు మనము పులుగంపోసినా కుదురలేదని ఆలోచనచేస్తే ఆ మరుషతు బాదుషాతో చేసిన బయాన్ ఏమనగా (1) వరంగల్ ప్రతాపరుద్ర మహారాజుగారికి దనుగరు కొండయ్య చాలా కరామతును చూయించి

బోనగిరి ఖిల్లా కూడా వరంగల్ ఖిల్లా కూడా ఈ దనుగురు కొండయ్య పరంపర తయారుచేయించినట్లుగ మన దగ్గర కొండయ్య – సనదులు వున్నవి కదా! అందును గురించి అదే పరంపర ఆంఖిల్లా గోత్రం సూర్యవంశగురు బసవేశ్వరుని శిష్యుడైన ఈ కొండయ్యను పిలిపించి నేను విచారింతునని చెప్పి కొండయ్యను నాగజిత్రి రేపల్లె వాడనుంచి పిలిపించుకొని వందనాది క్రియలచే పూజించి మేము ఖిల్లా కట్టటమునకు పులుగంపోసి ప్రయత్నం చేస్తే కుదురలేదు. ఎందునిమిత్తార్థం? పూర్వము మీ పరంపర వారు భోనగిరి ఖిల్లా వరంగల్ ఖిల్లా కట్టివున్నారు మీరు అదే సంతతి కాబట్టి ఇదీ కూడా మీవల్లనే కావలెను గాని ఇఘ ఎవరినుంచి కాదని అడిగి చాలా మనవి చేసినందున కొండయ్య సమ్మతించి అక్కడ వీరు అడుగక మునుపే తాను చేసియుంచిన యావత్తు కరామతు బయానుచేసి దౌలతు చూయించి సాదుగోకుల్‌దాసుభావిలో బంగారి పుతులీ అయివున్న రామతు చెప్పి ఆ స్థళ మహత్తు అంత చూపించి ఇదే కొండయ్య పేరు తోటి 1087 సం॥రములకు సరి అయిన ఖరనామ సంవత్సర భాద్రపద శు॥ 5 శుక్రవారము 13 పదమూడు ఘడియల రాత్రికి పులగం పోసినాడు తర్వాత ఖిల్లా యావత్తు తయారు చేయించినాడు. ఈ కొండయ్య చూపించిన దౌలతు తోటి ఖిల్లా తయ్యారు అయివున్నది. ఖిల్లా తయ్యారు అయిన పిమ్మట సుల్తాను అబ్దుల్లా కుతుబుసాగారు బాదుషా తమ మురుషదుతో బయాన్ చేసినది ఏమనగా (2) ఈ దనుగురు కొండయ్య దేవ కల్యాణమునుండి వచ్చి మన స్థళమందు రేపల్లెవాడ కట్టుక నాగజిత్ర తోడుకొని మగ్రిమాత యల్లమ్మను నిలబెట్టుకొని మల్లన్న మఠము కట్టుకొని యాదవ పీఠము సమేతముగా ఇంత మహత్తు జరుపుతూ వున్నాడు, మనకు తెలియలేదు, మనము పిలిపించి విచారించితే బహుకరామతు చూపించి బావిలో బంగారు పుతిలీని దౌలతు చూపించినాడు. వీరు లక్ష్మీప్రసన్నులు కనుక మన కోరికలు ఈడేర్చి మనల కృతార్థులు చేసినాడు. వీరితోనే మన గద్దినిలిచియున్నది. కనుక ఈ కొండయ్యకు ఏమి కావలెనో ఏమి అడుగుతాడో విచారించమని చెప్పిన సయ్యదుషా ముస్తఫా మురుషదు కాదరీగారు కొండయ్యతో చేసిన మారుజా ఏమనగా! (3, ఏ – కొండయ్య బాదుషాగారు ఏమి కావలెనో ఏమి అడుగుతాడో మిమ్ముల విచారించమని అన్నాడు కనుక మీరు పెద్దలు కనుక నీకు ఏమి కోరిక వుంటే ఆ కోరిక అడుగమని

విచారించగా మరుషతుతో కొండయ్య చేసె మారుజా ఇదికదా! పన్నెండు గొల్ల కులాలకు రెండు కురుమ కులాలకు నేను గురువును యాదవ పీఠానికి అధికారివలె మానుగలుగు ఎప్పటికి గోలకొండ అనే పేరువుంచేది. గొల్లకొండ అని అనవలసినది. మా పరంపర రాబడిన 1465 సంవత్సరముల నుండి జరుగుకుంటు వచ్చిన వరంగల్ ప్రతాపరుద్ర మహారాజు ఇచ్చిన సనదు చూచుక అదే మతాబకు మొహరు దస్తకతుతో మాకు సనదు ఇచ్చేది. ఇదికాక గొల్లవాండ్లకు కురుమవాండ్లకు కూనిచేయకూడదు. అగరు కూని చేసినట్టు ఆవుతె గద్దికి హతకు వస్తాది. అదే తక్షణం లక్ష్మి వెళ్ళిపోతుంది. ఇదిగాక కిలాలోపట యున్న యల్లమ్మ ఒకటికిలా బయటయున్న మల్లన్న మఠము, ఇవి యావత్తు వున్నంత దూరము దోషావరు జమీను ఇవి మావిగా వుండె అట్టి హుకుం ఇవ్వవలసినది. ఆదిగాక ప్రతాపరుద్ర మహారాజు ఇచ్చిన 1465 బిరుదావళి మర్తబా కితాబు ఏమనగా మా యాదవ పీఠము వెంట యాదవులున్ను యెలిగొలచి మహమ్మదీయులున్ను స్వామి కార్య దురంధరులున్ను దేవబ్రాహ్మన భయభక్తి పరులున్న పదునూట సహెూదర రాజులున్న బిరుదు అంబారి చెంద్రా యుధము మకర తోరణాలు పగటి దివిటీలు నెమిలి పించాలు భుజకీర్తులు, కిరీటము, భూచక్రగొడుగు, అప్తాగిరి పాలీక నగుబోతు, నగారాధముకా నిషానీ, హనుమంతు నిషాని, ఏనుగుమీద ధముకా ఒంటెమీద ధముకా రణభేరి సింహమూతి కడియాలు మకర కుండనాలు సింహతలాట అంబారి మహిమా రుతబా గరుడ పడిగెలున్న హనుమంత చక్రములున్న అల్లా పద్మములున్నూ శంఖాలున్నూ వీరణమ్ములున్నూ శ్రీరామ కొణితలున్నూ సమస్థ రాగాలున్నూ బసువ చెక్రపు గొడుగులున్నూ చుట్టు వీటెలున్నూ జంగపు గొడుగులున్నూ శ్రీరామ కాని యాదవ పీఠము నిర్ణయంబైన తారీకు 5002 అక్షయ సంవత్సర సృష్ట్యాది శతాబ్దం 1955 మరియు 5002 రాజాధిరాజ ప్రతాపరుద్ర మహారాజు యాభై యారు రాజ్యములకు ఇచ్చిన సనదు ముతాబికు మరిమాత రేపల్లెవాడ మసీదువ మల్లన్న మఠం దీనిక్రింద వూదుగుల్వ చిరాగువ, మరమ్మతు హమేషా దుచావరుజమాను సఫీలు బయటము, గూమవరము, మర్లగడ్డ మక్తా 305 బిగాలు రామస్వామి గుట్టవద్ది మక్తా 325 బిగాలు తోకపుట్టి చరాయపట్టి, వజాతర్లు మల్లన్న జాతర్లు వబీర్ప జాతరు వగొల్లల కురుమల దగ్గర రుసూంసాలు బసాలు రుసూం

జారీచేసినందున సనదుము తాబికువ కొండయ్య అరజుముతాబికు సర్కారు పర్మానుముతాబికు జరుపవలసినది. ఈ సనదు యందున్న దానిలో సర్కారికి ఏమి హక్కు లేదు. ఈ కార్యం సరుహర్ మాకు సర్కారు సదామద్దతు ఇచ్చి హమేశా ఊదుగుల్ చిరాఖు మమ్మత్తు చేయించవలసినది. పుత్ర పౌత్ర పారంపర్యాయం హరిచంద్ర హరుకంగ వారి ఆలు ఆవులాదు సూర్యచంద్రులు ఉన్నంత పర్యంతము ఏ బాదుషా గద్దె ఏలినా సుఖంగా రాజ్యములో జరిపించవలసినది. సమస్త రాగాలున్నూ శ్రీరామ కాలనులున్నూ పడిగనాదములున్నూ యడమ కుడి శంఖములున్నూ ఏకముఖరుద్రాక్షయున్నూ శంఖుచామరాలున్నూ బసువశంఖు బిరుదులున్నూ సంగడి తోరణాలున్నూ ఛాయ ఛాయ గొల్లెండ్లూన్నూ నవవన్నె గొల్లెండ్లూన్నూ బల్లానదట్టీలున్నూ పట్టుదట్టీలున్నూ పట్టు హారాలున్నూ గంటల పద్యాలమున్నూ తరుట వీరణంబులున్నూ అశ్వము మొగ గుర్రములున్నూ వివమము.... మరుమలతోటి ద్వాదేశమున్నూ భారత భాగవతము...యావత్తు బిరుదావళి ప్రతాపరుద్రుడు ఇచ్చిన ముతాబికు మీరు హకుం ఇచ్చి దౌరా మీద రవాణా చేస్తూ వుండవలసినది. గోలకొండ గద్ది ఏ బాదుషా ఏలినప్పటికైన మా సిలసిలా వాండ్లతో ఆశీర్వచనములు సాలు సాలుకు తీసుకొను చుండవలెను. ఏ బాదుషా అయిన తప్పినట్టు అయితే గద్దికి హతకు రాగలదు, తురకలేగాని, తెలుగలేకాని, సాలుసాలుకు ఆశీర్వచనములు తీసుకుంటూ పుత్ర పౌత్రాభివృద్ధిగా హరిచంద్రార్కముగా సూర్యచంద్రాదులు వున్నంత పర్యంతరము సుఖముగా రాజ్యమేలుచుండవలసినది. బాదుషా గొడుగు తిరిగిన పరియంతరము మా పరంపర వాండ్లను సురుబరాయి చేసి దౌరామీద హరియేకు పరుగణాకు రవాణా చేసేది. ఏ గ్రామమే కాని ఏ సర్కారే గాని ఎక్కీసు సర్కారు అనగా ఇరవై ఒకటి సర్కారు ముమాలకె సర్కారి ఆలి మాసిలసిలా వారికి హమేషా మద్దతు ఇచ్చుకుంటూ వుండవలసిసది. అట్లు మద్దతు వుండనట్టు అవుతె మా సంతతి వాండ్లు ఏమన్నప్పటికైనా హతకు కాగలదు. మా సంతతి వాండ్లు కన్నీరు నించితే ఇచ్చుటినుంచి లక్ష్మి కన్నీరు నించుకొని వెళ్ళిపోవును. గద్ది పరరాజుల పాలుగాగలదు ఇదిగాక మా యాదవ కులములో ఒకచోరి మొకద్దుమాకు మినహ తతిమ్మ మొకద్దుమా ఏదైనా మేము విచారణ చేసి ఫైసలా చేసుకోగలము కాని సర్కారువారు విచారించుటమునకు

బిల్‌కూలు అక్కరలేదు. ఇదిగాక ఈ గోలకొండ గద్దికింద ఎన్ని రాజ్యములుంటే అన్ని రాజ్యములలో యున్న మల్లన్న జాతరాలు, బీరప్ప జాతర, మల్లన్న మ్యాళ్లాలు, బీరప్ప మ్యాళ్ళ్యాలు, చౌడమ్మ మ్యాళ్ళ్యాలు, తెల్లచెరల మ్యాళ్లాలు, కొమ్మోణి మ్యాళ్లాలు, తగరజోగోని మ్యాళము కుల్లు యాభైయారు రాజ్యాలలో వుండె పన్నెండు గొల్లకులాలు రెండు కురుమ కులాలు సాలుసాలుకు మాకు రుసుం కట్టె అట్టు మీరుసనదు మొహరుదస్కతుచేసి ఇవ్వమని కొండయ్య విచారించి సయ్యదు షా ముస్తపా సాహెబు కాదరీగారు సమ్మతించి ఈ కొండయ్య చేసిన యావత్తు మారూజాను సుల్తాను అబ్దుల్లా బాదుషాకు చెప్పితే వారు సమ్మతించి ముందు ప్రతాపరుద్రుడు ఇవ్వబడిన సనదు యాభై ఆరు రాజ్యములకు వుండె కనుక తమచే సూబెదకన్‌కు సుల్తాను అబుదుల్లాబాదు బాదుషా ఇచ్చే హుకుం మాచే సూబేదక్కన్ వాండ్లు వుండె కుల్లు యావత్తు మఠాలలో వసూలు చేసుకొనేది. పన్నెండు గొల్లకులాలు రెండు కురుమ కులాలదగ్గర ఇల్లు వకటికి ఒక్క రూపాయి భత్యంమ్యాకలువున్న వాండ్లతావున ఒక్క మ్యాకభత్యం తీసుకునేది. గొర్లు వున్న వాండ్ల తన ఒక్క గొర్రె భత్యం తీసుకొనవలసినది. మొగ్గాలు వున్న వాండ్ల వద్ద ఒక్క రూపాయి భత్యం తీసుకొనేది. చీర్ల వాండ్ల మేళమువద్ద అయిదురూపాయల భత్యం తీసుకునేది. మల్లన్న మఠాలలో మల్లన్న మ్యాళ్ళాల్లలో మఠం వక్కింటికి మ్యాళ్ళం వాళ్ళ వద్ద అయిదు రూపాయల భత్యం తీసుకోవలసినది. మందుచ్చోని మ్యాశ్యం వద్ద అయిదు రూపాయలు తీసుకునేది. కొమ్మువాండ్ల మ్యాళ్యం వద్ద అయిదురూపాయల భత్యం తీసుకొనేది. దక్షిణ కాశి కొలను ప్యాకలో కాటకోటయ్యను వుంచి మఠములో అయిదు రూపాయలు భత్యం తీసుకొనేది. సిద్దేశ్వర సిద్దయ్యను వుంచిన మఠములో అయిదు రూపాయల భత్యం తీసుకొనేది. ఈ రెండు దక్షిణ కాశి కొలను ప్యాకలో గొల్లకురుమ వాండ్ల మఠాలు చౌడమ్మ మ్యాళ్ళం వాండ్ల వద్ద అయిదు రూపాయల భత్యం తీసుకోవలసినది. కుల్లు యాభై ఆరు రాజ్యములలో వుండె జాతరుల హక్కు రుసుం సదరు యాదవ పీఠానికి రుసుం కట్టవలెను. మా ఇక్తి దారిప్రకారం శిక్షించి భూదాన గోదాన సమేతముగా తీసుకొనేది. ఇందుకు సర్కారు వారు మద్దతు ఇచ్చి దౌరామీదా హాజరువుండి వసూలుచేసి ఇవ్వవలసినది. ఇది సుల్తాను అబ్దుల్లా బాదుషా కుతుబుషా సమ్మతమున వ్రాసి ఇచ్చిన మొహరు

దస్తకతు సనదు, పర్మాను. ప్రతాపరుద్ర మహారాజుగారు ఇచ్చిన సనదుమీద దస్కతులు చేసిన పీఠముల తపిసీల పేర్లు :

పీఠములు

1. శృంగేరి పీఠము, 2. పుష్పగిరి పీఠము, 3. విరూపాక్ష పీఠము, 4. కనకమ్మ పీఠము, 5. మాధవాచార్యుల పీఠము, 6. విపోదివారి పీఠము, 7. కనుపర్తి వారి పీఠము, 8. వీరభోజన పీఠము, 9. రామానుజ పీఠము, 10. అయ్యాళం పీఠము, 11. ఈరమాతిగరాయుని పీఠము, సాకిన్ హస్తినాపురము.

పన్నెండు గొల్ల కులాలు

1. యెర్రగొల్ల, 2. ముష్టిగొల్ల, 3. కరిణిగొల్ల, 4. పాకనాటిగొల్ల, 5. పూజగొల్ల, 6. మొదటీట గొల్ల, 7. నల్లసదనపు గొల్ల, 8. గుజరాతి గొల్ల, 9. గంపగొల్ల, 10. పెయ్యగొల్ల, 11. వెయ్యగొల్ల, 12. సిద్ధ గొల్ల.

కురుమ కులాలు

1. పత్తి కంకణము, 2. ఉన్ని కంకణము

ఇట్లు, విధేయుడు యాదవ దాసుడు దస్తూరి సింగభూపాల్‌రావు సారాచెర్లగారు, అని వున్నది.

9-1-41 నాటి గోలకొండ పత్రికలో గొల్లకొండయే గోలకొండ అయ్యెనని నిరూపించు సనదును ప్రకటించి యుంటిని. అందలి విశేషాలను తెలుపుటకు ముందు ఆ సనదులోని కొన్ని పదాలకర్థములు వ్రాయుదును. హైద్రాబాదు రాష్ట్రములో ఉర్దూ తెలిసిన తెనుగువారి కందలి చాలా పదాలర్థమగును. ఉర్దు తెలియని వారికొరకు కొన్ని పదాల అర్థమును వ్రాయుదును.

ఈ సనదు ఇప్పుడు ముద్దము మల్లయ్య అను గొల్లవద్ద ఉన్నది. పూర్వము ఈ మల్లయ్య ఇంటిపేరు కొండవాళ్ళు అనియుండెను. అనగా కొండయ్య ఇంటివారు అని యర్థము. ఇతని గోత్రము పేరు అంకిళ్ళ గోత్రము. దీనినే సనదులో ఆంఖిల్లా గోత్రము అని వ్రాసినారు. ఇతని నివాసస్థలము గోలకొండ ఖిల్లాకు అరకోసు దూరములో ఉన్న “దర్గ” అను గ్రామము. ఇతని పూర్వీకుడే సనదు పొందిన కొండయ్య. అతనిని దనుగరు కొండయ్య అన్నారు. దనగరు అనగా గొల్ల (దధికార తద్భవము)

బిను లేక బిన్ లేక ఇబ్బను లేక ఇబన్ అను పదాలు అరబీపదాలు, కుమారుడు అని అర్థమిచ్చునవి.

ఇక సనదులోని పదాల వివరణమును తెలుపుదును. గోలకొండకు పూర్వము పేరు మానుగల్ కోట అని యుండెననీ మొట్టమొదటి వాక్యమే స్పష్టము చేయుచున్నది. ఈ పేరు చరిత్రకారు లెవ్వరు పేర్కొనలేదు. ఈ సనదులోనే మనకు మొదటి పర్యాయము కనబడుచున్నది. భాగా నగరము లేక భాగ్య నగరము ఇప్పటి హైదరాబాదే. రేపల్లె వాడ గోలకొండ కోట ప్రక్క భాగముననే పడమటి దిక్కున ఉన్నది. ఇప్పుడది పాడుపడినది. ఈ సనదులో చూపించబడిన మల్లన్న మఠము, మసీదు, మఱ్ఱిమాత నాగఝురి ఈ రేపల్లె వాడలో ఉన్నవి. సనదులో 1086 సంవత్సరము క్రిందట అనిన్ని 964 సంపత్సరాల క్రిందట అనిన్ని వ్రాసినారు, అనగా అవి హిజ్రీ తేదీలు, 1086 హిజ్రీలోను, 964 హిజ్రీలోను అవి జరిగెనన అర్థము. ఫార్సి సనదులో సీసకమ్మల గుట్టవద్ద కోట కట్టుటకు 1027 హిజ్రీలో ప్రారంభించిరి అని వ్రాసినారు.

సీసకమ్మ గుట్టలు గోలకొండకు ఉత్తర దిశలో ఇప్పటి హకీంపేట అను గ్రామము వద్ద ఉన్నవి. వాటిపైన గూడ కోట కట్టదలచిరి. కాని అచ్చట అది కుదరలేదు. ఔరంగజేబు గోలకొండను ముట్టడించినపుడు ఈ సీసకమ్మల గుట్ట వద్దనే డేరాలు వేసి విడిది చేసెను.

ఈ సనదును ఇచ్చినవాడు సుల్తాన్ అబ్దుల్లా కుతుబుషా. ఇతని గురువునే మరుషతు అని పేర్కొన్నారు. పెద్ద మూలకు కుతుబుషాగారు అనగా ఇబ్రహీం పూర్వికుడగు 964 హిజ్రీలో గల గోలకొండ రాజ్యమును పాలించిన కుతుబుషా యని అర్థము. అతని కాలములో గోలకొండ కోట కట్టబడెను. అది బాగా కుదరలేదు. దానినింకను దృఢపరుపదలచిరి, అందులకీ కొండయ్య సహాయపడినాడు.

"పులగం పోయుట" అనగా కోటలకు పునాది వేసినప్పుడు అన్నమును మేకలను బలిగా యిత్తురు దానినే పులగం పోయుట అని యందురు.

నాగఝురి

ఇది గోలకొండకు పశ్చిమ దిశన నుండు గుట్టలలో ఉన్నది కోటకు అర్థమైలులోనే ఉంది. ఇది నాగఝురి. సుమారు 50 అడుగుల ఎత్తు రెండు గట్లున్నవి.

వాటి సమీపములో భూమిలో 3 అడుగుల లోతున గుంత కలదు. అందు సదా ఊట వచ్చుచుండును. ఎండాకాలములో కూడా ఒకే విధముగా నీరు వచ్చుచుండును. ఇప్పటికిని ఆ గట్లలో పశువుల మేపుకొని పశువులకు ఈ నాగఝురి వద్దనే నీరు త్రాపుతారు.

సాధుగోకుల్ దాసు బావి

ఇది గోలకొండ కోటలోనే కలదు. దీని కథ రమ్యముగా ఉన్నది ముందు విమర్శలో వ్రాయుదును.

బంగారు పుతులీ

బంగారు బొమ్మ ఈ బొమ్మ కథపై గోకుల్ దాసుతో సంబంధించినది.

మత్రిమాత ఎల్లమ్మ

ఇది నాగఝురి వద్దనే 100 అడుగుల దూరాన కలదు. ఒక పెద్ద గుండునకు పట్టెలు వేసి దానిని పూజింతురు. దాని నిప్పటికిని అచ్చటి హిందువులు పూజింతురు. ఏటేట ఉత్సవము చేయుదురు. మానుగల్లును గోలకొండ అని పిలువవలెనని ఇందు కొండయ్య కోరెను. అదే అపభ్రంశమై గోలకొండ అయినది. గొల్లవాండ్లలో 12 శాఖలును వారికన్న కొంచెము తక్కువగా చూడబడు కురుమవారితో 2 శాఖలును కలవు. వాటి పేరులు ఈ సనదులో కలవు. ఇప్పటికిని ఈ శాఖలు కలవు.

ఎల్లమ్మ :

ఈ దేవత ఖిల్లా లోపల కలదని ఈ సనదులో కలదు. ఇప్పటికిని కలదు. కట్టకడపటి భాగమగు బాలాహిసారును ఎక్కు ఆవరణము ప్రక్కన ఉన్నది. ఈ ఎల్లమ్మ గుడివద్దనే ఒక ఫిరంగి కలదు. ఇప్పటికిని గోలకొండలోని హిందువులు ఈ ఎల్లమ్మకు ఏటేట కొలుపులు చేయుదురు.

మల్లన్న మఠము

నాగఝురికి పోవు మార్గములో దానికి ఫర్లాంగు దూరములో ఒక చిన్న ప్రాత మసీదుకలదు. దానికి సమీపములో ఒక చిన్న సమాధి కలదు. దానిపై మూడు అడుగుల చౌకము 6 అడుగుల ఎత్తును పైన చిన్న గుంబదువంటి కలదియును

శిథిలావస్థలోను నున్న గది కలదు. అదే మల్లన్న మఠము. దానినిప్పుడు గుర్తు పట్టువారు లేకున్నారు. దానిని గుర్తుపట్టుటకు పరిశోధన చేయవలసి వచ్చెను.

దోషావరు జమీను

జమీను అనగా భూమి దోషావరు, లేక దోచావరు అనునది ఒక కొలత రెండు గొర్తల వైశాల్యము కలదిగా ఉండెను. ఇది పార్శీ పదముగా కనిపించుచున్నది. అందున ఇప్పుడు మిలిటిరీకిగాను బునాదులు తీసి బంగ్లాలు కట్టుచున్నారు. ఆ భాగమంతయు దోషావరు జమీనే – అది కొండయ్య కిచ్చిన ఇనాము భూమి. దాని వారసుడు యీ సనదుకల మల్లన్నయే. యితని అజ్ఞానముచేత దారిద్ర్యముచేత ఈ జమీను సర్కారుకు చెందిపోయి నదనుకొనవలెను.

సనదుపొందిన కొండయ్య ఎట్టి గొలకాదు, వెట్టిగొల్ల, అతడంతటి సహాయకారియుండిన అబ్దుల్లా ఖుతుబుషా అంతటివాడు ప్రసన్నుడై ఉండిన ఆ పాదుషా వద్ద ఒక సంస్థానమును కోరి యుండరాదా? దానికి బదులుగా తిక్క బిరుదులు, గొర్రెలు, రూపాయలు, కట్నములు కోరుకున్నాడు ఆ బిరుదుల పట్టిక యిందు కలదు.

ఆప్తాగిరి

పార్శీలో ఆఫ్తాబ్‌గీరి అనగా ఎండను ఆపు ఛత్రి.

పాలీక : పల్లకి

నగుబోతు : నౌబత్ – నగారా జాతి దముకా – ఢంకా

అల్లా పద్మములు : ఇస్లాం మత చిహ్నాముగా అల్లా పదములు చేసుకొని కొలుచుట గొల్లలలో కొందరికి వాడుకగా ఉండినట్లున్నది.

రామకొణితలు : కొణితలనగా సొమ్ములు. శ్రీరామ విగ్రహానికి పెట్టిన సొమ్ములు. ఇప్పుడవి జనగామ తాలూకాలో కొమరవెల్లి గ్రామములోని శ్రీరాముని విగ్రహముపై ఉన్నవందురు.

సింహమూతికడియాలు : మణికట్లకు పెట్టుకొను సింహమూతిగల బంగారు కడియాలు.

గరుడ పడిగెలు : పట్టుదారాలతో అల్లిన పట్టీ – నాల్గువ్రేళ్ల వెడల్పుదిగి ఉండును. దానిని నడుమున బిగింతురు. శివమువచ్చువారే దీనిని కట్టుకొందురు.

శ్రీరామకొని : శ్రీరాములవారి కాలమునుండి మొదలుకొని అని అర్థము.

వూదుగుల్ చిరాగు : వూదు అనగా అగరు ధూపము. గుల్ అనగా పూలు, చిరాగు అనగా దీపము.

బీరప్ప జాతర : బీరప్ప లేక వీరప్ప అను దేవత. గొల్లలకు ముఖ్యదేత. ఆ దేవత కొలువులో సుమారు 4 అడుగుల యెత్తుగల పెద్ద డోలును వాయింతురు – ఇప్పటికి దానిని వీరప్పడోలు అని యందురు.

హరిచంద్రహరుకం : ఆ చంద్రతారార్కం అనుమాట

ఆలు అవులాదు : అరబ్బీ పదమే – పుత్ర పౌత్రపరంపర అని అర్థము.

రామకొలనులు : అగ్ని గుండము ముందు మల్లన్న మఠముపెట్టి ఒళ్ళు నిండినవారు అగ్ని గుండములో దుముకుదురు – ఆ గుండమునే రామకొలను అని యందురు.

గంటల వద్యాలము : చిరుగంటలుకల వడ్డాణము, నడుము పట్టి.

గొర్లు వున్న వాండ్ల తన : తన అనగా తావున వద్ద అని అర్థము.

అశ్వము మొగము గుఱ్రము : అశ్వము మగ గుఱ్రము అని చదువుకొనవలెను – మగ గుఱ్రమని యెందుకన్నారనగా గొల్లవారు పెంటిగుఱ్రాన్ని యిప్పటికిన్ని ఎక్కరు – పెంటి గుఱ్రమెక్కితే వారికి కులం తప్పు – అయితే వారికి వివాహాలలో గుఱ్రముపై మెరిమెన చేయు హక్కులేదు.

మ్యాళ్ళము : మేళము – భజంత్రీతోటి ఉత్సవము.

సాదుగోకుల్ దాసు బావి : కొండయ్య బాను చేసియుంచిన యావత్తు కరామతు బమాను చేసి దౌలతు చూయించి సాధు గోకుల్‌దాసు బావిలో బంగారి పుతిలీ అయి ఉన్న కరామతు చెప్పి ఆ స్థల మహత్తు అంతా చూపించెనని సనదులో కలదు. దీని కథ ఏమనగా!

గోలకొండ కోట కట్టిన కాలములో తత్పరిసర ప్రాంతాలలోని చిన్న చిన్న

గట్లలో సాధుగోకుల్ దాసు అనువాడు నివాసము చేసియుండెను. అదే ప్రాంతాలలో కొండయ్య మేకలమేపుతూ గోకుల్‌దాసునకు దినమున్నూ మేకలపాలనిచ్చునూ వచ్చెను. కొంతకాలమిట్లు ఉభయులకు మైత్రి కుదిరినది. ఒకనాడు సాధువు ఒక పెద్ద ఇనుపకాగు పెట్టి, దానిలో నూనెపోసి సలసల కాచుచూ ఉండినాడు. కొండయ్య చెంబులో పాలు తెచ్చి సాధువుకిచ్చినాడు. సాధువు వాటిని త్రాగి "అరే కొండయ్య నీకు ప్రత్యుపకారం చేయవలెనని బుద్ధి పుట్టింది. ఇట్లురా, ఈ కాగు చుట్టును ప్రదక్షిణము మూడు మారులు చెయ్యి" అన్నాడు. అమాయకుడగు కొండయ్య అట్లే చేసినాడు. మూడవ ప్రదక్షణం చేయుచుండగా సాధువు కొండయ్యను అమాంతముగా ఎత్తి కాగులో వేయబోయినాడు. కాని కొండయ్య సాధువుకంటే బలాఢ్యుడగుటచేత పట్టు తప్పించుకొని ప్రక్కకు దుమికినాడు ఇదేనా నీ ప్రత్యుపకారం అని మహత్తరమైన కోపంతో సాధువునే తటాలున ఎత్తి కాగులో పారవేసినాడు. అంతలోనే ఆశ్చర్యమగు పరిణామము సంభవించెను. సాధువు మాయమయ్యెను. అతని స్థానములో ఆ కాగుచున్న నూనెలో ఒక పెద్ద బంగారు విగ్రహము కనబడెను. కొండయ్య భయపడి ఆ విగ్రహాన్ని సమీపమందు గల ఒక భావిలో పారవేసిపోయెను. ఆ బావినే ఇప్పటికిని గోకుల్‌దాసు బావి అని యందురు. ఆ విగ్రహమునే తర్వాత కొండయ్య ఇబ్రహీం కుతుబుషాకిచ్చెను. ఆ విగ్రహములోని విశేషమేమనగా దినము ఒక అంగముగ చేధించితే మరునాటి వరకు మరల ఆ యంగము యథాప్రకారముగ పెరుగుచుండెనట. అట్టి అక్షయ విగ్రహము నుండి వచ్చిన బంగారుతో కోట కట్టించబడెనట. ఇది బంగారు (పుతిలీ) బొమ్మ కరామతు (మహత్తు) యొక్క కథ.

ఈ కథ నిజమో కాదో మనము చెప్పజాలము. ఇట్టి కథయే కొండవీటి కైఫియత్తులో కలదు. దాని నిందు ఉదాహరించుచున్నాను.

"అనిపోతయ వేమారెడ్డిగారు ప్రభుత్వమునకు వచ్చిన సమయమందు ఒక గొల్లవాడు మేకలు గాసే నిమిత్తము బొల్లమూరు వేంకటేశ్వరస్వామి వారు వున్న కొండకు పోయి మేకల మేపుతూ వుండి వుండగా ఒక సిద్ధపురుషుడు కామ్యార్థియై వేంకటేశ్వర ఆలయంవద్ద తపస్సు చేసుకుంటూ వుండగా యీ గొల్లవాడు ఆయన యోగక్షేమము అడిగినాడు "నాకు నిత్యమూన్నూ క్షీరములు ఇవ్వవలెను" అని సాధువు అడిగినాడు. సన్యాసి ఒకనాడు గొల్లవాన్ని చూచి నీవు నిత్యమున్నూ ఎక్కడెక్కడవుంటే

చెట్ల ఆకులు, మేకలు మేపుతుంటావు గదా, ఏ వృక్షాన్ని అయినా మేకలు మేయగానే తిరిగి వెంటనే ఆకు పుట్టునట్టు దృశ్యమైతే నాకు చెప్పమన్నాడు. ఆ గొల్లవాడు కొన్ని దినములు శోధన చేయగా దృష్టమైనందున సన్నాసికి చెప్పగా ఒక దినశుద్ధి చూచి ఆ చెట్టును తగుల బెట్టించి వృక్షము దగ్ధమయ్యే సమయములో గోపకుని చెయ్యిబట్టి ప్రదక్షణచేస్తూ వానిని యేమరించి మంటలో పడదొయ్య బోతే వాడు పుష్టి కలిగినవాడు కనుక గొల్లలోబడక బహు దినాల నుంచి నా మేక పాలు తాగి నాకు ఉపకారం చేస్తానని నమ్మించి నన్ను అగ్నిలో వేసి చంపజూచినావా అని సన్యాసిని బట్టి జ్వాలలోపడదోసి తన ఇంటికి వచ్చి మరునాడు తిరిగి మేకలు తోలుకొని ఆ స్థలానికి వెళ్ళి చూచేవరకు బంగారు ప్రతిమయై మనుష్య ప్రమాణపు, విగ్రహముగా నిలిచియున్నందున గొల్లవాడు పూర్వ వైషమ్యముచేత తన గొడ్డలి తీసుకొని ఆ విగ్రహము యొక్క హస్తమును చేధించేవరకు యథా ప్రకారం హస్తమావిర్భవించె. వాడు ఆశ్చర్యపడి వాడు బంగారం తీసుకొని సెట్టికిచ్చి తనకు కావలసిన పొగాకు తమలపాకులు యీ వరస ప్రవర్తిస్తుండగా ఆ కోమటి ధనికుడైనందున, ఈ సంగతి చారుల వల్ల అనపోతయరెడ్డిగారు విని వైశ్యుని పిలిపించి దండించి అడిగి నంతలో వున్న స్థితి మనవి చేసెను. గొల్లవాని ద్వార సువర్ణ ప్రతిమను తీసుకొని దానిద్వారా రాజ్యవిస్తీర్ణము చేసెను. తదనంతరము కొమరగిరి వేమారెడ్డి ప్రభుత్వమునకు వచ్చి ధర్మకర్తనుడయ్యెను. ఈ దినములో వరుస చెడి సువర్ణ విగ్రహమున్ను మాయం అయినది"

మరి ఈ కొండవీటి "కరామతు"లో ఎంత సత్యమున్నదో, కొండవీటి కరామతు కైఫీయతు ప్రమాణము. "ఘోకుల్‌దాసు పుతిలీ"కి ఈ గోలకొండ నసదే ప్రమాణం. అటైతే యీ సనదు కూడా అబద్ధపు సనదుగా ఉండవచ్చును. ఇదియు కల్పన యేమో అను సంశయములు కలుగపోవు.

సనదుయొక్క ప్రామాణ్యత

ఈ సనదు పుట్టినది నిజమైనదిగా కనబడుచున్నది. ఏలనన తెనుగులో సనదును మొదలు వ్రాయించి తర్వాత దానినే ఫార్సీలో వ్రాయించినారు. అయితే ఈ రెండును కల్పనలుగా ఉండగూడదా యనిన తర్వాతి కాలంలో సనదులో కనబరచిన హక్కులు కొండయ్య వంశమువారికి వర్తించుచు వచ్చినట్టు దాఖలాలు నేటి వరకు

కలవు. పైగా ఆసఫ్‌జాహి వంశపు నిజామైన నిజాముద్దౌలా సనదు ఒకటి కొండయ్య వంశము వారి వద్ద కలదు. అది 1249 హిజ్రిలో ఇయ్యబడినట్టిది. అనగా సరిగా 111 ఏండ్ల క్రిందటిది : అప్పుడు మహారాజ చందూలాల్ మంత్రిగా ఉండెను. ఆ సనదులో ఇట్లు వ్రాసినారు.

"గోలకొండ ఖిల్లావద్ద దోషావర్ జమీనున్న కోటలోని యెల్లమ్మయున్నూ, కోటబయటి రేపల్లెవాడలోని మఱిమాత నాగర్భురి మల్లన్న మఠము' యాదవ పీఠము యొక్క అధికారమును పూర్వము ప్రభువులు అనగా ఖుతుబుషామీలు దస్గర్ కిష్టయ్య పూర్వికులకు ఇచ్చినారు. కనుక మొత్తం రాష్ట్రములో జాతరులు, సంతలు మున్నగునవి జరిగినప్పుడు దస్గర్ కిష్టయ్యకు 12 గొల్లకులాలపైనను యాజమాన్యము కలదనియు, కిష్టయ్య పోయిన తావునందెల్లను సర్కారి అధికారులు అతనికి అతని హక్కులను వసూలు చేసుకొనుటలో సాయపడవలెను. పైగా గోమారం మర్లగూడెంలో 300 భోగాల మక్తాయున్నూ రామస్వామి గుట్టవద్ద 325 భోగా భూమియున్నూ అతనిదే అయియున్నది."

పైనదేకాక వీరివద్ద మరియొక సనదు కలదు. అదికూడ 1071 హిజ్రీలో అబ్దుల్లా ఖుతుబ్‌షాచేత కొండయ్య పేర ఇయ్యబడినది. అందులోను కొండయ్య కిచ్చిన హక్కులు పాలింపబడునని వివరింపబడియున్నది.

ఇంకొక సనదు కూడా ఈ వంశము వారి వద్ద కలదు. అది ముఖ్తారుల్ మల్కుసర్ సలారుజంగు మొహరుతో 1273 హీజ్రీలో ఇయ్యబడినది అందలి ముఖ్య విశేషాలేమనగా సనదు కొండ బాలయ్యపేరట ఇయ్యబడినది (ఇతడు కొండయ్య వంశమువాడు) "పూర్వసుల్తానులనగా సుల్తాను అబ్దుల్లా ఖుతుబుషా యొక్కయు నిజామలీఖాన్ యొక్కయు సనదును బట్టియు రాజాచందూలాలు యొక్క ఫహిమాయిషను బట్టియు ఈ బాలయ్య కరేలీ, అయినూరు, మేలారం, అయ్యారం, మలీగావూ, ఖండబా మున్నగు స్థలాలలో జరుగు జాతరలలో ఏయే హక్కులు వీరికి కలవో అవన్నియు అనుభవించుటకు అధికారము కలిగియున్నాడు.

దీనివలన తెలియునదేమనగా! అబ్దుల్లా ఖుతుబ్‌షా ఇచ్చిన సనదు నవాబు నిజామలీఖానున్నూ, చందులాల్ మంత్రియున్నూ, సర్ సాలార్ జంగు మంత్రియున్నూ నమ్మినారు. సత్యమని నిర్ణయించినారు. తామున్నూ సనదుల నిచ్చినారు.

ఇతర సనదులలో కొన్ని గ్రామాల పేరులు కలవు. అందు గోమవరం అనునది మెదకు తాలూకాలో ఉన్నది. మర్లగడ్డ అనునది గోమవరంలోని పొలము పేరు. రామస్వామి గట్టు అనునది గోమవరం వద్ద నుండు గట్టు. అచ్చట రామస్వామి దేవాలయం కలదు. కొమరవెల్లి గ్రామము జనగామ తాలూకాలో ఉన్న, ఐనూరు, మేలారం, అయారం మాలెగాం వద్దనున్నవి.

మరికొన్ని పదాలు

కొండయ్య సనదులో 'తగరుజోగోడు' అను పదము కలదు. తగరుజోగు వారు అనునదొక జాతిపేరు. దమరువంటి ఢక్కిని వాయించు ఈ జాతివారు బిచ్చమెత్తుతుదురు.

కాట కోటయ్య : 12 గొల్ల, 2 కురువ మతాలకు పెద్ద అయిన బలిజ కీ పేరు.

మందుబ్బోడు : బిచ్చముతో బ్రతుకుజాతి. వీరు మంటిచేతను, పేడచేతను, చేసిన 200 వరకు సంఖ్యగల బొమ్మలను ఒక పెద్ద పెట్టెలో పెట్టుకొని వత్తురు. వీరు గొల్లల వద్దనే వారి కులగోత్రాలు చెప్పుకొనుచు బిచ్చమెత్తుదురు.

సనదు ఇచ్చిన అబ్దుల్లా ఖుతుబుషా అబుల్ హసన్ తానీషా కన్నముందు వాడు. అతడు క్రీ.శ. 1626 నుండి 1672 వరకు గోలకొండ రాజ్యమును పాలించెను. ఈ కొండయ్య సనదు పుట్టిన కాలం 1071 హిజ్రీకి అనగా 289 ఏండ్లక్రిందట, ఈ లెక్క చొప్పున ఈ సనదు క్రీ.శ. 1652 లో ఇయ్యబడినది.

ఇవి యీ కొండయ్య సనదులోని విశేషాలు.

పంచేశ్వరము

హైదరాబాదు రాష్ట్రములో చూడదగిన హిందూ క్షేత్రాలు చాలా కలవు. మత సాంప్రదాయిక దృష్టితో చూడదగిన వానిని గురించి యిప్పుడు వ్రాయుట లేదు. చారిత్రక దృష్టితోను శిల్పి దృష్టితోను చూడదగినవాని ప్రశంసయే చేయుచున్నాను. అట్టివానిలో "పంచేశ్వరము" అను క్షేత్ర పంచకము చేరినది. దానిలో ఒక విశిష్టత కలదు. అది నిజాము బ్రిటిషు సంధి క్షేత్రమున్నూ అయియున్నది. కృష్ణానది రెండు తీరాలలో ఆ క్షేత్రాలు వెలసియున్నవి. "గంగకిద్దరి మేలద్దరి కీడునుంగలదే" అన్నట్లుగా ఉన్నవి. కృష్ణకిటు కొల్లాపురము సంస్థానమున్నది. అటు దక్షిణమున కర్నూలు జిల్లాలో నందికొట్కూరు తాలూకాయున్నది. కొల్లాపుర సంస్థానమందలి కృష్ణా తీరములో పంచేశ్వరములోని మల్లేశ్వరము అను శైవ క్షేత్రమున్నది. సోమేశ్వరము నాగరుకర్నూలు తాలూకాలోని దైనను మల్లేశ్వరము ప్రక్కననే కలదు. ఆ రెంటికెదుటి దిక్కున చూపుమేరలోనే కృష్ణ కావలి యొడ్డున సిద్ధేశ్వరము, సంగమేశ్వరము, కపిలేశ్వరము అను మరి మూడు శైవ క్షేత్రాలున్నవి. ఆ యైదింటిని పంచేశ్వరమందురు. అవి యుండు స్థానమందు నది కిరు ప్రక్కలలో ఎత్తయిన గట్లు కలవు. కృష్ణను ఎండ కాలములో దాటుట కష్టము. వాన కాలములో దాటుట సుఖము. ఎందుకనగా ఎండకాలములో తొడల లోతు నీళ్ళుండును. అడుగున జానెడు మూరెడు గుండ్లు నిండుగా పరిచి నట్లుగా నుండును. కాలుపెట్టగానే జారుట సంభవించును. ఒడుపు తప్పినచో ప్రవాహములో పడుదురు. ఈదుటకును వీలులేదు, కొన్ని గుండ్లు మోకాళ్లతో డీకొనును. ఇట్టి గ్రహచారమునకు బద్ధులై అవతలి క్షేత్రాలను చూచి రావలసియుండును. వానకాలములో నిండు ప్రవాహముండుటచే అరిగిలి లేక పుట్టి అను వానిపై సుఖముగా దాటవచ్చును. నదీ ప్రవాహ మహాధ్వానము, అయిదు

క్షేత్రాలు, వాటి నాశ్రయించిన గ్రామాలు, దేవాలయ శిఖరాలు, చుట్టునుండు గట్లు, వాటిపై నుండు చెట్లు ఇవన్నియు ఒక చక్కని దృశ్యమును కలిగించి మరుపురాని స్మృతిగా మనస్సులో నిలిచిపోవును.

ఇదే స్థలమందు నిజాం ఇంగ్లీషు ప్రభుత్వాలు చేతులు కలిపి నది కడ్డముగా ఆనకట్టవేసి కాలువలను తీయుటకై సంకల్పించినారు. పది పదిహేను ఏండ్లనాడే ప్లానులన్నీ సిద్ధముచేసి యుంచినారు. యుద్ధానంతరము చేయుచున్న కార్యాలలో ఇచ్చటి ఆనకట్ట యొకటియై యున్నది. ఈ పంచేశ్వరములోని ఒక క్షేత్రమగు సోమేశ్వరమును సోమశిల అనియు అందురు. అచ్చట హైద్రాబాదు వారి సుంకము ఠాణా యొకటి కలదు. సోమశిల మల్లేశ్వరానికి ఒక మైలు దూరములో కలదు. మల్లేశ్వరము కొల్లాపురము వారిది. సోమేశ్వరము నాగర కర్నూలు తాలూకా లోనిది ఈ రెండును కొల్లాపురానికి 7 మైళ్ళ దూరములోను కొల్లాపుర సంస్థానములోని దగు పెంట్లవెల్లికి 6 మైళ్ళ దూరములోను కలవు. బాటలు మాత్రము చాలా అధ్వాన్నముగా ఉన్నవి. ఆ ప్రాచీన క్షేత్రాలకు పెంట్లవెల్లి నుండి పోవుదారినైనను బాగు చేయించుట సంస్థానం వారికి తప్పని ధర్మమని తలంతును.

ఇక క్షేత్ర విశేషాలను గూర్చి వ్రాయుదును. వనపర్తి రోడ్డు స్టేషనులో దిగవలెను. అక్కడినుండి కొల్లాపురం పోవు బస్సులో వెళ్ళి పెంట్లవెల్లి స్టేజిలో దిగవలెను. అక్కడ బాడుగ బండ్లు దొరుకును. అక్కడి నుండి 6 మైళ్ళ దూరాన నున్న మల్లేశ్వరములో ప్రధాన దేవాలయమ యేటి గట్టుననే కలదు. దానిలో మూడు శాసనాలున్నవి. ఒక శాసనముపై తైర్థికులు చెట్నీ నూరుకొంటూ వచ్చినందున అది ముప్పాతిక అరిగిపోయినది. తక్కిన రెండున్నూ అరిగినవి. మట్టితో నిండినవి కానవచ్చు లిపి స్వరూపాన్ని బట్టి అవి చాళుక్యుల శాసనాలని స్పష్టమగును. ఇంతవరకీ శాసనాల ప్రతులును తీసి ప్రకటించినట్లు కానరాలేదు. అతివృష్టి కాలములందు కృష్ణవేణమ్మ కూడా ఈ దేవాలయావరణము లోనికి వచ్చి శివుని పలుకరించి పోవును. ఆమె ఆగమన ఫలితముగా దేవాలయము ఒక గజము లోతు వుండుటచే నిండినది. అందందు పగళ్ళు మొదలై ఆలయ భాగాలు పడిపోవుచున్నవి. కొన్ని ఆవరణ విగ్రహాలు సుందరముగా నున్నవి. దేవాలయమునకు కొద్ది దూరమందే రెండు చిన్న గుళ్ళమిట్టపై నున్నవి. అందొక దానిలో శేషశాయి కలదు. శివక్షేత్రములో వీరెట్లు ప్రవేశము కల్పించు

కొని తిష్ఠ వేసిరనిన తర్వాతి వారెవ్వరో లింగస్థానములో శ్రీవారిని ప్రతిష్ఠించి నారనుట యొప్పును. విగ్రహము పెద్దది. చాలా సుందరమైనది. సన్నపని చూపరుల నాకర్షించును. ఒకటి రెండు అంగాలను మెప్పులేని వారెవ్వరో చెక్కివేసినారు. ఈ దేవాలయమును సంస్థానమువారు కాపాడవలెను. శాసనాల ప్రతులను ఆర్షశాఖవారు తీయించవలెను. తైర్థికులకు చెట్నీ రోళ్ళను సమకూర్చి శాసనాలను కాపాడవలెను. పూడికను కూడ తీయించవలెను.

మల్లేశ్వరము నుండి సోమేశ్వరము పోవలెను. బండినాట్లకున్నూ అంగభంగాలకున్నూ భయపడకుంటే బండ్లలో పోవలెను. లేకున్న నడకయే రమ్యము. సోమేశ్వరములో ఏటిగట్టున 200 ఏండ్ల నాటి మసీదు కలదు. అందొక గోరీ కలదు. దానిపై ఒక ఫార్సీ లిపి శాసనం కలదు. పాముల పిల్లలవలె అక్షరాలను పెనవేసి వ్రాసినారు. వాటిని మల్లాలే చదువగలరు. ఏటి యొడ్డుననే ఊరున్నది. ఇండ్ల వెనుక భాగములో పెద్ద ప్రాచీన దేవాలయమున్నది. దానిలో నుగ్గు లెండించుకొందురు. ఈ కాలానికంత మాత్రమైనా ఉపయోగ పడుచున్నది. మరికొంత కాలానికట్లు పనికిరాదు. దేవాలయములో శిల్పాలేవియు లేవు. లోపలి కప్పులో దశావతారాల సుందర విగ్రహాలు చూడదగినవి. ఒకచోట ఒక స్తంభముపై శాసన భాగమున్నది. అది అచ్చటిదికాదు. శిథిల భాగానికి పోటీ పెట్టి ఒక శాసనాన్ని స్తంభముగా చేసి అచ్చట నిలిపినారు. అది కాకతీయుల నాటి శాసనమని జ్ఞాపకమున్నది.

ఏటిలోనికి దిగుచోట ఠాణా ముందరి మెట్టువద్ద కొన్ని దేవాలయ స్తంభాలు అందందు పూడగా మిగిలినవి కానవచ్చుచున్నవి. అందొక దానిపై నాగర లిపి శాసనమున్నది. ఆ స్థలములోని శాసనాలను కూడా ఎవ్వరునూ సేకరించి ప్రచురించలేదు. సోమేశ్వరమువద్ద ఎండాకాలములో నదిని దాటవలెను. వానకాలములో మల్లేశ్వరమువద్ద దాటవలెను. నదిని దాటిన వెంటనే అచ్చటి గట్టుపై సిద్దేశ్వరము కలదు. అచట ఒక ప్రాచీన దేవాలయ మున్నది. కాని అందేదియు చూడదగిన శిల్పము లేదు.

సిద్ధేశ్వరమునుండి రెండు మైళ్ళు నడచి వెళ్ళిన సంగమేశ్వరము వచ్చును. మధ్యన చిన్నగట్టు తగులును. అందొక గుహకలదు. ఇప్పుడు విశాలమగు రెండు గదులందు కానవచ్చును. లోపల గదిలో చీకటితో నిండిన పెద్ద గుహాబిలము కలదు.

అది యెంతో దూరము వరకున్నదని స్థానికులేమేమో చెప్పుదురు. కొన్ని యేండ్ల కిందట ఒక సాధువు అచ్చట బహుకాలము నివసించెను. అతనికి భక్తులు ప్రబలిరి. వారందరున్నూ సిద్దేశ్వరమునకును, సంగమేశ్వరమునకును మధ్య నుండే నదీ మార్గములు చాల ప్రమాదకరముగా నుండుటచే అచ్చట నొక గోడను కట్టించినారు.

సంగమేశ్వరము ఈ పంచేశ్వరములలో తలమానికము. అది సప్తనదీ సంగమము. తుంగభద్రము దాని పంచోపనదులున్నూ ఆలంపూరు వద్ద కృష్ణలో కలియును. అందుచే దానిని చిన్న సంగమందురు. ఆ పంచ నదీ ప్రవాహము కృష్ణలో కలియును. ఈ సంగమేశ్వరమువద్ద భవనాశి అనుపెద్దవాగు (ఆ నది ఉపనదంతటిది కాకున్నను నది యందురు) కృష్ణలో కలియును. ఇట్లు ఆ స్థానము సప్త నదీ సంగమ మగుటచేత దానిని పెద్ద సంగమని యందురు.

బ్రిటిషిలాకావారు ఆ దేవాలయము మంచి స్థితిలో నుంతురని తలచితిని కాని దాని నేమాత్రమున్నూ విచారించక చాలా అన్యాయము చేసినందునను అచ్చటి శిల్పము ఉత్తమశ్రేణిలో చేరినదై నందున దానిని శైథిల్యమునుండి ఏమాత్రమున్నూ రక్షింపక పోయినందునను చాలా విచారము కలిగినది. అచ్చట అయిదు శాసనాలు కలవు. ఒక శాసనమును దేవాలయపు బయటి భాగములో అరుగుపై కూర్చునుటకై అమర్చినారు. అది చాళుక్యుల కన్నడ శాసనము. ఇంచుమించు 900ఏండ్లనాటిది. ఆ శాసనము కూడ సంపూర్ణముగా లేదు. కట్టడానికి వాడినందున కావలసినంత వరకుంచి మిగతా దానిని పగులగొట్టి పారవేసినట్లున్నది. దేవాలయమందు ఒక చిన్న శాసనమున్నది. అదియు చాళుక్యులదే. దేవాలయము వెనుక దిక్కు ఒక యిసుక రాశిపై శాసనము కలదు. దానిపై సున్నము చుక్కలు నిండుగా గలవు. అవి కడిగినను పోవు. ఆ శాసనమును చదువుటకు వీలు లేదు. దేవాలయములో రెండుస్తంభాలపై రెండు శాసనాలు కలవు. అవి 1050 ప్రాంతము శాలివాహన శక కాలపు శాసనాలు. బ్రాహ్మణులకు భూదానాలు గ్రహణ కాలములో ధనికులెవ్వరో చేసిన ముచ్చట అందు కలదు. అవి 400 ఏండ్ల నాటివి. దైవ భక్తులు దేవాలయము ముందు భాగాన్ని విస్తరించి కట్టించుచున్నారు. పాత కట్టడమునకు కొత్త కట్టడమునకు పోతరాజుకు, భోజరాజుకును ఉండు అంతరాయమున్నది. నదీ తీరములోనున్న దేవాలయమునకు 200 గజాల దూరములో గ్రామమున్నది. గ్రామములో ఒక దేవాలయమున్నది.

దాని చుట్టును ఏమిన్నీ సందు లేకుండా గుడిసెలు, ఇండ్లు పెరిగిపోయినవి. ఆ దేవాలయ సౌందర్యమును చూచిన చూపుతోనే, ఆ యిండ్లను చూచిన 'స్వర్గ నరకా' లెట్టివో యూహించుకొనవచ్చును. ఆ దేవాలయాన్ని 'రథము' యని అందురు. దేవతలు రథాల్ని నిర్మించి అందే వదలిపోయిరని స్థానిక జ్ఞానులందురు. అది దివ్య శిల్పమనియైనా వారు గ్రహించినారు కదా! అది శివాలయము తప్ప మరేదియు కాదు. దేవాలయము గోడల చుట్టును అడుగడుగునకు శిల్పములే. ఆ శిల్పాలను గ్రామము వారు మెచ్చుకొనునట్లు లేదు. చేపల బుట్టలు, వలలు, జల్లలు, గంపలు తుదకు కట్టెల మోపులు సుందర విగ్రహాములుండు గోడలోని పెద్ద గూళ్ళలో నింపినారు. దేవాలయానికి చక్కని ఆకర్షణీయమగు శిలా గోపురము కలదు. ఆ గోపురము నిండుగా విగ్రహాలను చెక్కినారు. అవన్నియు అతి రమణీయములు. దేవాలయ ప్రధాన ద్వారమందు కొన్ని విగ్రహాలు విరుగగొట్టబడినవి. సంగమేశ్వరములోని "రథము"ను చూచి ఆనందించవలెను. దాని సౌందర్యాన్ని యెట్లు వర్ణించవలెనో తెలియదు. మద్రాసు ప్రభుత్వం వారీ దేవాలయమునకు ఆవరణము కల్పించి చుట్టు నుండు యిండ్లను, వాములను, పశువుల కొట్టాలను తీసివేయించి రథాన్ని మంచి స్థితిలో నుంచవలసిన బాధ్యత తమపై కలదని యెరుగవలెను.

సంగేమేశ్వరము నుండి అరకోసు దూరములో కపిలేశ్వరము నదీ తీరమున కలదు. అందుకూడ ప్రాచీన దేవాలయాలు కలవు. కాని ప్రశంసింపదగిన శిల్పాలందు కానరావు ప్రకృతి రామణీయమునకు సందుర శిల్పముల జోడించి ఆ రెంటిలో మతాన్ని ముడిపెట్టి జనుల విశ్వాసాలను బంధించివేసిన వీర శైవులు గట్టి దిట్టలని ఈ పంచేశ్వరము చాటుచున్నది. ఇప్పుడు శివరాత్రి కాలమందు శైవభక్తులు కైలాస తృష్ణచే ఈ పంచేశ్వరమును సేవించుచున్నారే కాని ప్రాచీనుల కళాసృష్టిని వారు గమనించిన వారు కారు – గమనించినచో వారు శాసనాలపై చెట్నీల నూరి కళాస్వాదము చేసియుండరు. పైగా శివరాత్రి కాలములో ప్రాకార విగ్రహాలపై సున్నము ఎర్రమన్ను కొట్టి తమ కళోపాసనను వ్యక్తపరచుచున్నారు. పంచేశ్వరము ప్రాచీనముది. ఇచ్చటి దృశ్యము మరుపురానట్టిది. ఇప్పుడు శోచనీయ స్థితిలో నున్నట్టిది.

పానగల్లు కోట

నాగరకర్నూలు తాలూకాలో పానగల్లు కోట కలదు. అది చాలా ప్రాచీనమై అనేక విధాలా ప్రాముఖ్యమును వహించినట్టిది. ఆ కోటలో సంస్కృతాంధ్ర పార్సీ శాసనాలున్నవి. అది ఇంచుమించు 4 సామ్రాజ్యాల వశమగుతూ వచ్చినట్టిది.

దానిలోని శాసనములను ఇంతవరకెవ్వరును ప్రకటించలేదు. లక్ష్మణరాయ పరిశోధక మండలివారు తెలంగాణా శాసనాలలో ముద్రించలేదు. వారు ముద్రించక యుంచిన వాటిలో అవేమైనా సేకరింపబడినవో లేదో తెలియదు.

హైదరాబాదు రాష్ట్రములో పానగల్లు పేరు కలవి రెండున్నవి. ఒకటి యీ నాగరు కర్నూలు తాలూకాలోనిది. రెండవది నల్లగొండ పట్టణానికి 3 మైళ్ళ దూరములోనుండు నట్టిది. పాఠకులీరెంటిని వేరుగా గ్రహించియుండవలెను. రెండును ప్రసిద్ధ స్థలాలు. నాగరకర్నూలు పానగల్లు కోటలకు ప్రసిద్ధి. నల్లగొండ పానగల్లు ప్రాచీన చాళుక్య దేవాలయాలకు ప్రసిద్ధి. బాలనాగమ్మ కథ జరిగిన నల్లగొండ పానుగంటిలో మాయలఫక్కీరు గోరీ కలదు. నాగరకర్నూలు పానగల్లు వారును మాయలఫక్కీరు అక్కడివాడే అని వాదింతురు. కాని విశ్వాసార్హము కాదు. నాగరకర్నూలు పానగల్లును గూర్చి యింతవరకెవ్వరున్నూ వ్రాయనందునను వ్రాసినట్లు కానరానందునను యిందు కొంత వివరణ చేయుచున్నాను.

ఈ కోట చిన్న చిన్న గట్ల మీద కలదు. రెండు గట్లను కలిపి పూర్వమందు కోట గట్టినారు. గట్లపై శిఖరములందిప్పటికిని కొన్ని బురుజులను గోడలును సుదూరము కానవచ్చుచున్నవి. శ్రీరంగాపురమునకును; వనపర్తికిని; ఈ పానగల్లు 8 మైళ్ళ దూరములోనున్నది. పూర్వము అనగా ఏడెనిమిది నూర్ల ఏండ్లకు పూర్వము కోట లోపలనే గ్రామము యుండిన జాడలున్నవి. ఇప్పుడు కోటలలో ఒక యిల్లు

కూడా లేదు. కోట క్రింద యూరు వృద్ధియై ఇంచుమించు అయిదారు నూర్ల యిండ్లున్నవి. ఇప్పుడు కోటలో కొన్ని యెకరాల భూమి సేద్యమగుచున్నది. ఈ గట్టు నాశ్రయించియే గ్రామము కలదు. కోటకు ముందు భాగము చాలా యెత్తు కలదు. కాని దాని వెనుక భాగములో కోట మీదికి బండ్లు బాగా పోవు దారి కలదు. వ్యవసాయదారులు కూడా దారినే యుపయోగించుదురు.

కోటకు మొత్తం 52 బురుజులుండెనందురు. మూడు అంతర్దుర్గాలు నిర్మించి వాటి చుట్టును కందకములు త్రవ్వి నీరు నించి యుండినట్లు కానవచ్చుచున్నది. ఇప్పుడు పానగల్లు గ్రామములో ఒక నాకా యున్నది. అక్కడ ఒక పోలీసు అమీనున్నాడు. కోట కావలికి ఇద్దరు ముగ్గురు కావలి వారు నియమితులైనారు. వారు విశేషముగా రాత్రులందు కోటలో పండుకొందురని యందురు. ఇక కోట నెవరు నిర్మించిరి? దాని చరిత్రయేమి? అను విషయము విచారణీయమగును. దానిని సరిగా తెలుపుటకు వీలు లేకున్నది. వీలైనంత వరకు ఊహించి తెలుపవచ్చును.

ఈ కోట చరిత్ర కాధారములు దానిలో నుండు శాసనములే. కోటకు పై భాగములో ఒక శాసనము బయటి గుండుపై నున్నది. అది సరిగా చదువుటకు వీలు లేదు. అక్షరాలు మాసిపోయినవి. దాని ప్రక్కననే ప్రవేశద్వారము (గవిని వాకిలి) కలదు. ఆ ద్వారములో కుడి ప్రక్కన అరుగులో నుండు పెద్ద ఇసుక రాతిపై నొక శాసనమున్నది. బయటి శాసనానికిని దీనికిన భేదము కానరాదు. రెండును సంస్కృత శాసనాలు. ఈ శాసనమును చదువవచ్చును కాని దాని వద్దనే కావలి కాయువారు నిరంతరము సెగడును (నిప్పు కొరవి) మండించుచుండుటచే శాసనము పొగచూరి నిలువున సగము పగిలినది. అచ్చట మంట చేయుకుండుటకై అధికారులు వెంటనే ఆజ్ఞ యిచ్చి శాసనమును కడిగించి శుభ్రముగా నుంచునట్లు చేయవలెను. ఆ శాసనములో తుది భాగమందు ఇమ్మడి బుక్కరాయలు అను అక్షరాలు కనిపించుచున్నవి. అందుచేత అది విజయనగర రాజుల కాలము నాటిదని ఊహింపవీలగుచున్నది. కోట లోపల పెద్ద బయలున్నది. అందొక చోట ఆరు స్తంభాలు వాటిపై అడ్డ దూలాలు నిలచినవి. వాటి ముందు కొంత దూరములో రెండు స్తంభాలు కలవు. వాటిపై బుద్ధుని విగ్రహము రెండు ప్రక్కల కడపరాయి కలదు. ఆ స్తంభాలను లంజ ఉయ్యల అని యందురు. కారణమేనమగా పూర్వమొక రాజు యొక్క లంజ ఆ

స్తంభాలను ఉయ్యెలకై నిర్మింపజేసి యుండెనని జనులందురు. అది అబద్ధము. అది దేవాలయ శిథిల శకలము. అది బౌద్ధ దేవాలయమై యుండును. లేదా జైన దేవాలయమై యుండును; అనగా అది కాకతీయుల ఆది కాలములో ఇంచుమించు క్రీ.శ. 1200 ప్రాంతమున కట్టబడినదై యుండును. ఆ కోటలో దేవాలయ శిథిలముపై నుండు ఆ విగ్రహమొక్కటే అన్నిటికన్న ప్రాచీనమైనదిగా కనబడుతున్నది. కోటలో మరొక భాగమందు ఒక మసీదు కలదు. దాని వీపుననే కొన్ని దేవాలయ స్తంభాలు తమ పూర్వ కథను అవ్యక్తముగా చెప్పుటకై అట్లే నిలిచినవి. ఒక స్తంభముపై శాసనమున్నది. రామేశ్వర స్వామి దేవాలయము పేరు అందు కనపడుచున్నది. కాలమును తెలుపు భాగము చెడిపోయినది. మసీదు లోనికి పోయిన అందు కూడా దేవాలయ చిహ్నములు కానవచ్చును. అందు స్తంభాలపై గచ్చు వేసినారు. ఒక స్తంభము గచ్చు కొంత రాలిపోయినది. పోయిన తావున నాగరలిపిలో ఒక శాసన పంక్తి కనిపించుచున్నది. అదొక్కటే చాలును. రామేశ్వరాలయమును మసీదుగా మార్చినట్లు నిరూపించుటకు.

రెండు కుతుబ్షాహీ కాలపు శాసనాలున్నవి. కొత్తబావి అను పూడిన బావి వద్ద ఒక ఫార్సీ శాసనము అబ్దుల్లా ఖుతుబుషాహీది కలదు. (అతడు 1626 నుండి క్రీ.శ. 1632 వరకు రాజ్యము చేసెను) దాని యెదుటనే తెనుగులో అబ్దుల్లా ఖుతుబుషా శాసనమే కలదు. కోట యొక్క ఉన్నతోన్నత శిఖరమందు ఒక శాసనము సగము ఫార్సీ సగము తెనుగులో కలదు. అది మహమ్మద్ ఖులీకుతుబుషా కాలములో (1550, 1590) ఖిరాత్ ఖాను అనువాడు "బాలా హిసారు"ను కట్టించినట్లు దానిలో వ్రాసినారు కాలము శాలివాహన శకము 1475 అని యుండినట్లు నాకు జ్ఞాపకము. ఈ రెండు శాసనాలను బట్టి ఈ కోట విజయనగరము వారి నుండి వారి పతనానంతరము గోలకొండ కుతుబుషాహీలు వశపరచుకుని దానినొక ముఖ్య దుర్గముగా కాపాడినట్లు విశదమగును.

ఈ పానుగల్లు కోటపై రెండు బావులున్నవి. ఒక దానిని రామగుండమందురు. అది చాలా పెద్దది అందు తియ్యని నీరు కలదు. నీటిలోతు 150 అడుగులకు పైగా కలదనియు ఎవ్వడో ఒక తాలూక్దారు లోతును పరీక్షింపజేసి యుండెననియు స్థానికులందురు. ఆ బావి గట్టుపై ఒక రాతిపై రాముని పాదాలు చెక్కినారు. అది

యిటీవల వారి పని తనమనుట స్పష్టము. రెండవ బావిని సీత గుండ మందురు. అది రామగుండము కన్న పై భాగములో కలదు. మూడు గుండ్ల సందున గజములోతు మూడు గజాలు పొడవు కలిగిన గుంతలో తియ్యని నీరు కలదు. ఈ రెండు గుండాలను గూర్చి కొన్ని చిత్రములు చెప్పుదురు. రోగులైన వారు కొన్ని దినాలు ఆ నీటిని త్రాగితే బాగుపడుదురట, వరిచేలకు రోగము తగిలితే ఈ రెండు గుండాల నీటిని చెంచెడో కడవెడో మడితో తీసుకొనిపోయి మోటనీరు లేక చెరువునీరు పొలములపై పారుచోట గ్రుమ్మరించి, పొలానికి నీరు కట్టితే ఆ పూటనే రోగము కుదిరి పోవునని జనులు నమ్ముచున్నారు. ఆ ప్రకారము చేసి లాభము పొందినామని అంటున్నారు. అది నిజమైతే సైన్సు వేత్తలచే ఆ నీటిలోని రసాయన పదార్థాలను ప్రభుత్వము వారు పరీక్షింపజేసి ప్రజలకు యథార్థమును తెలియజేయుదురు గాక!

ఈ పానగల్లు కోట హైదరాబాదు కోటల్లో ప్రాచీనమైన కోటగా కనబడుచున్నది. ఆసఫజాహి ప్రభువులలో రెండవ వారగు నిజామలీఖాన్ ఈ కోటలో కొన్ని యేండ్లుండెనని దబ్దబెనిజాం అను గ్రంథములో వ్రాసినారు. మహారాష్ట్రుల యొత్తిడి నుండి వనపర్తి, గద్వాల, ఆత్మకూరు సంస్థానాల రెడ్డి ప్రభువులు వారిని రక్షించినట్లు జన ప్రవాదము బలీయముగా నున్నది. ఈ కోట పైనుండి చుట్టు మూడామడవరకు కనబడుచుండును. చక్కని దృశ్యములు దాని నుండి కానవచ్చును. మన పురాతత్వ శాఖ వారు ఈ కోటలోని శాసనాలను ఒక ప్రత్యేక సంపుటముగా ప్రకటించవలెను. స్థల చరిత్రను కూడా వ్రాయించవలెను.

మావూరు

కృష్ణాపత్రికలో "మా వూరు" అని కొందరు తమ తమ గ్రామాల ఘనతను గురించి వ్రాస్తూ ఉండినది చదివినప్పుడంతా మా వూరును గురించి కూడా ఎందుకు వ్రాయగూడదు అని పలుమారు అనుకొని తుదకీనాడు కృతనిశ్చయుడనై తదేక దీక్షతో వ్రాయనే వ్రాసినాను. ఇందలి విషయాలను అపహాస్యానికై వ్రాసినానని కాని అబద్ధాలతో నింపినానని కాని ఎవ్వరున్నూ భావింపరాదు. పదారణాలూ, 12 మాసాలూ సత్యమని నమ్మండి. ఇక మా వూరు చరిత్ర వినండి.

మా వూరు పేరు ఇటిక్యాలపాడు. ఇది రాయచూరు జిల్లాలో ఆలంపూరు తాలూకాలో ఉన్నది. బ్రిటిష్ సరిహద్దగు కర్నూలు పట్టణానికి 10 మైళ్ళ దూరములో ఉన్నది. పూర్వము అలంపూరు దేవాలయమునకు కావలసిన ఇటుక మా గ్రామము పొలాలలోనే సిద్ధము చేసి తీసుకొనిపోయి యుండిరట. అందుచేత 250 ఏండ్ల క్రిందట ఈ గ్రామాన్ని నిర్మించుకొన్న పిచ్చి పుల్లయ్యలు వెర్రివెంగళప్పలు దీనికి ఇటికెలపాడు అని పేరు పెట్టిరట. సుమతి శతకములోఒక పద్యమిట్లున్నది.

క॥ అప్పిచ్చువాడు వైద్యుడు
నెప్పుడు నెడ తెగక పారు నేరును ద్విజుడున్
జొప్పడిన నూర నుండుము
చొప్పడకున్నట్టి యూరు జొరకుర సుమతీ॥

మా వూరును మొదట కట్టిన బేఖూబ్ మదర్సాబులు పై సుమతి పద్యాన్ని అయినా చదువుకొన్నవారు కారు. నేటికిని మా వూరులో అప్పిచ్చేవారు అరుదు. వైద్యుడుపోయిన నెలవరకు లేకుండెను. కాని యిప్పుడు తెలుగు చిన్నయ్య రోగాలను మంత్రించి, జలగం రమణయ్య మందిచ్చి బాగైనవనిపిస్తున్నారు. రమణయ్య చేతి

వైద్యము సకలార్తి నివారక మగుటచేత అతని పేరులోని మొదటి రెండక్షరాలను తారుమారుచేసి అంటూ ఉంటారు. మా యూరులో పారే నీరు లేదు. కాని మూడుమైళ్ళ దూరాన ఆ నీరు దొరుకును. మాకు 10 మైళ్ళ దూరములో ఇటికేల అనే గ్రామమున్నది. పొరపాటు పడకుండుటకై యా గ్రామాన్ని ఆకుచోట ఇటికేల అంటారు. మా గ్రామాన్ని నీళ్ళు లేని యిటికేల పాడు అంటారు. కారణమేమనగా మా గ్రామములో ఎంత ప్రయత్నము చేసినా ఊటబావి పడనే లేదు. తుదకు 150 ఏండ్ల క్రిందట గ్రామానికి రెండు ఫర్లాంగుల దూరములో ప్రక్క గ్రామమగు జల్లాపురంలోని ఇట్టేలవారు అనే కోమట్లు తదేక దీక్షతో పాతాళం చూచేవరకు వదలకుండా త్రవ్వించగా అచ్చటవారికి పాతాళగంగాదేవి ఉగ్రరూపములో విసుగుతో ప్రత్యక్షమయ్యెను. అట్టి బావికి లెక్కపెట్టగా 120 మెట్లు కలవు. నీరు చాలా ఉప్పుగా నుండును. నీటిని బాగా కాచి ఆవిరిగా ఎగిరిపోవునటుల జేస్తే చక్కని తెల్లని ఉప్పు దొరకును. ఉప్పు సత్యాగ్రహం చేసేవారు మా బావి నీటిని కాస్తే శిక్షించేవారు లేరు. మా సర్కారు వారితో 40 ఏండ్ల నుండి లబలబ మొత్తుకొనగా రెండేండ్ల క్రిందట కాస్త వినిపించుకొని ఒక బోరింగు మిషను తెచ్చి 80 అడుగుల లోతు కొట్టితే అచ్చట అర్ధగజం లోతుగల ఉప్పునీరు దొరికెను. ఇంకా లోతుగా కొట్టవలెనయ్యా అంటే వచ్చినవారు మాకు ఎక్కువ లోతు కొట్టే హుకుం లేదు అని 4 నెలల వరకు తమకు వెళ్ళి రమ్మను హుకుం వచ్చేవరకు ఈగల జనాభాను వ్రాసుకొని వెళ్ళిపోయిరి. వారు వెళ్ళిన వారం దినాలలో ఊరి పిల్లలు రాళ్లు వేసి ఆ కాస్త బోరింగును మూసివేసిరి. మా గ్రామములో 400 హరిజనులు కలరు. వారికి బావిలేదు. పై జాతుల వారిని బావివద్ద ఎంతో ప్రాధేయపడగా హరిజనులకు తిరిపెముగా కాస్త నీరు పోస్తున్నారు.

మాయూరిలో ఎవరి పప్పు కూడా ఉడకదు. అందుచేత ఊరి బయట ఒక పెద్ద గుంతను గ్రామస్థులే చందాలు వేసుకొని సగటున ఏటేటా 500 రూపాయల వరకు వ్యయం చేసి అందు వాననీ రాపుకొందురు. ఆ మురికి నీరే పప్పునకు, త్రాగుటకు, బట్టలుతుకుటకును, స్నానాదులకు. అంట్లు కడుగుటకు వాడుకొందురు మా ఉప్పు నీటిని త్రాగినవారికి ఒక్కసారికానేకాదు రెంటి నుండి పది వరకు ప్రతివానికి నారి పుండ్లు ఏటేటా అవుతూ వుండును. ఎవరో కొందరు మాత్రమే అగస్త్యులవలె నారి పుండ్లను బయటికి రానీయకుండా లోననే జీర్ణోభవ అని మంత్రించుకొనేవారు.

మా యూరిలోనికి యెంతటి మహామహులైనా సరే, ఎంతటి అసూర్యం పశ్యలైన, అంతఃపుర కాంతామణులైనా సరే ఊరివాకిలి వద్ద బండిదిగి ఊరులోనికి పోవలసినదే. కారణమేమన మా గ్రామమంతా బంకరేగడి భూమిలో కలదు. వీథులలో చేలల్లో వాన వస్తే మోకాటివరకు దిగబడును. అందుచేత ఊరి వీథులను నాలుగు అడుగుల వెడల్పుతో కట్టి బండలను పరిచినారు. అట్టి యిరుకు వీథులలో బండ్లు పోజాలవు. వానవస్తే బండల మధ్యన గుంతలలో మురికినీరు కొన్ని దినాల వరకు ఆగియుండును. అందు దోమలు గ్రుడ్లు పెట్టి పిల్లలను లేపును. ఇండ్లకు వెనుక భాగాలు లేవు కాని యిండ్లముందే యింటి వారి పిల్లలంతా మలమూత్ర విసర్జన చేస్తూ ఉందురు. ప్రతి వీధిలో కొన్ని పెంటలుండును. ఊరు చుట్టూ కల్లాలుండుటచేత తూర్పుపట్టితే నుసి ఊరంతా నిండుకొనియుండును.

మా ఊరిని పిండారీల కాలములో కట్టినారు. అందుచేత ఊరికి నాలుగు బురుజులు నాలుగు ప్రాకారాలు కలవు. మాదిగవాడవారు ఆ దిక్కున నున్న బాటలోనే స్త్రీ శిశు పురుషులంతా రాత్రి అనక పగలనక లఘు గురుశంకలను తీర్చుకొను చుండటచే ఊరివారా దిక్కు నడుచుట అరుదు. కాని సర్కారీ అధికారులు వేరే గ్రామాలకు పోవువారు మునులవలె ముక్కుపట్టుకొనియైన ఆమాంతంగా గ్రామాన్ని దాటవలసి వస్తున్నది.

ఇన్ని కారణాలచేత మా వూరిలో 365 దినాలు కూడా ఏకధాటిగా ఈగలు ఒక్కొక్క యింటిలో లక్షల కొలదిగా ఉండును. గట్టిగా విసరినా పోవు. అన్నములోపడి చచ్చును. నీటి స్థాలీలలోపడి చచ్చును. తేనీరు నోటివరకు పొయ్యే లోపలనే రెండైనా అందుపడును. అనగా 'ప్రథమ కబళే మక్షికాపాతః' అన్న గీర్వాణ భాణకము మా ఊరిలోనే ప్రారంభమైనదన్నమాట. మా వూరికి పెద్ద మనుషులు కూడా వస్తారు. మా వూరిలో పెద్ద మనుషులు కూడా పుట్టినారు కాబట్టి గత సంవత్సరము శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు దయచేసి ఒక దినముండి "ఈ ఊరిలో ఈగలు కూడా మంటలెత్తేటట్లు కరుస్తవే" అని అంతటి గొప్పవారు కూడా జడిసిపోయిరి.

మా యూరి ఇండ్లన్నీ పలకరాతి కట్టడములే. గోడలకు గచ్చుకాని, మన్ను కాని మెత్తరు. అందుచేత చలికాలములో నీలగిరిలో ఉన్నట్లు ఎండ కాలములో సహారా ఎడారిలో ఉన్నట్లు ఉండును. ఉప్పునీటి చౌట నేలలో చెట్లు కూడా వృద్ధి

కావు కాని అందందు తుమ్మచెట్లు మాత్రం పాంథులకు ఆశ్రయమిచ్చి పుణ్యము కట్టుకొని తమ లోక కంటకత్వనిందను బాపుకొనును. ఎండాకాలము రాత్రులందు రాళ్ళ గోడలలోని తాపమునకు తట్టుకొనలేక వీధులలో తేళ్ళు బ్లాకు మార్కెటులోని బేరగాండ్ల వలె వాహ్యాళి చేయును. లంచాలుతినే అధికారులవలె ఊరకుండెవారిని తమ జోలికి రానివారిని ఆ తేళ్లు బాధించవు. కాని తమను త్రొక్కి అపచారము చేసిన వారిపై కొండెమీటి దెబ్బకొట్టి తీరును. ప్రతి ఇంటిముందు దినం పది తేళ్లయినా ఊరక పారజూస్తే లభించును. వాటి అవసరముండే వారు మా గ్రామం దయచేసిన బాగా సహాయం చేస్తాము.

ఏమైనా కాస్త విశాల స్థలం కలదంటే అది ఊరిముందు కలదు. అచ్చట 600 చ.గజాల స్థలం కలదు. ఊరివారి యిండ్ల మరమ్మత్తు రాళ్ళు కుప్పలు, సేద్యం పనిముట్లు వాడుకొనని బండ్లు, రెండు కొత్తగా ఏర్పడిన పెంటలు, వడ్ల వాని చెట్టు కింది కార్ఖానా, కూలికి వచ్చిన పర గ్రామాల వారి వంట పొయ్యి వరుసలు, బిచ్చగాండ్ర విడిది ఇవన్నీ అందే గారడీ బుట్టవలె యిమిడి యుండును.

గ్రామంలో పుట్టినవారు 200 మంది యుండిరేమో యిప్పుడు 1100 మంది కలరు. కాని పది మాదిగ వారి కొత్త యిండ్లు తప్ప గ్రామమంతా మొదటి చెక్కందీ లోనే ఇరికియున్నది. గ్రామస్థులు అజ్ఞాన సంపన్నులును అభిమాన ధనులును అగుటచే స్థలానికై అధికారుల నడుగరు. అధికారులు లేవీలో మునిగిన వారగుటచేత ఈ అల్పపు ముచ్చట్లను వినిపించుకొనరు. మా గ్రామములో కల్లు సారా త్రాగని యిండ్లు అయిదే అయిదు. మా గ్రామంలో బ్రాహ్మణులు, బాతులు, నీరుకొళ్ళు కొంగలు ఆది నుండి నేటివరకు లేవు. ఘోటక బ్రహ్మచారియగు కోమటి యొకడుండెను. మొన్ననే కొంత అప్పును ఒక పాత బసివిని వదలి చచ్చిపోయెను. ఒకే ఒక తురక కుటుంబ మున్నందున పీర్లపండుగను హిందువులే చేస్తున్నారు. గంటసేపు వర్షము గట్టిగా కురిస్తే రెండు దినాల వరకు బండ్లు కదలవు. మొన్న మొన్ననే సర్కారీ పంతులిద్దరు మా గ్రామానికి వచ్చినారు. కాని వారికి ఉప్పునీరు సరిపడక నెలలో 20 దినాలు ఊరిలో ఉండరు. ఉండిన పది దినాలు ఎవ్వరికీ కనబడరు. మా పొలాలన పండే గోధుమలకు కర్నూలులో ఎక్కువ ధర యిచ్చి కొంటారు. మొత్తం హిందుస్థానంలో ఇంతమంచి గోధుమలు దొరకవన్నమాట. మా గ్రామంలో ఒక వరిగింజ పండకున్నా ఊరంతా వరియన్నమే తింటుంది.

అధికారులు బియ్యం సప్లయికి సెలవియ్యకున్నా మా గ్రామానికి బియ్యమెట్లు వచ్చెనో తెలియదు. కానీ, మా యూరి నీటిలో తెల్లబట్టలు వేస్తే మైలపడును. అందుచేత అధికారులు దౌరాకు రారు. విధిలేక వస్తే అప్పుడే మరొక గ్రామానికి వెళ్ళుతారు. ఇదొక్కటే ప్రశంసనీయమగు మా గ్రామ సులక్షణము.

మా గ్రామానికింతలో సర్ మీర్జా ఇస్మాయిల్ గారి నాహ్వానించి వారికి మా ఉప్పునీటి తీర్థమిచ్చి మా కప్పులేని చావడీలో బస యేర్పాటు చేసి మా ఊరి ముందటి ఫతేమైదానులో వారి వాహ్యాళికేర్పాటు చేసి మా స్థితిగతులను తెలుపుకోవలెనని మా గ్రామ యువకులు ఇస్పేట్ ఆట ఆడని కాలములో అనుకొంటూ ఉంటారు.

❖ ❖ ❖

హజరత్ ఉమర్

ఉమర్ భగవత్పాదుడు పైగంబర్ మహమ్మద్ ప్రవక్తగారి తర్వాత ఇస్లాం లోకములో అగ్రగణ్యుడు. ఇస్లాం మతములో అంతటివాడు పుట్టలేదు. పుట్టబోడు. (నభూతో నభవిష్యతి) అనవచ్చును. ఇస్లాం మత వ్యాప్తికి అతడే కారకుడు. అతడు ముసల్మానులకు ఆదర్శప్రాయుడు. అంతేకాదు అతని జీవిత విశిష్టతను, అతని న్యాయపద్ధతులను, అతని మత వ్యాప్తి రహస్యమును కనుగొనవలెనంటే ఇతర మతస్థులు కూడా అతని గురించి తెలుసుకొనవలెను. అతని జీవిత చరిత్రలు కొన్ని ఉర్దూలోను, ఇంగ్లీషులోను రచింపబడినవి. ప్రపంచ మహాపురుషులలో అతడు గణనీయుడు. కాని మన హైదరాబాదు సారస్వత పరిషత్తు వారీ కార్యమును చేయుట సమంజసము.

హజరత్ ఉమర్, పైగంబర్ హజరత్ మహమ్మదు గారి సమకాలికుడు. అతడు మొదట ఇస్లాం మతము ప్రతిఘటించినవాడు. విగ్రహారాధనతో కూడిన తన పాత మతమునే ప్రేమించినవాడు. కొత్త మతమును తెచ్చినందుకు కంటగించుకొని ఒకనాడు కత్తిదూసి మహమ్మదుగారినే చంపుటకై ఆవేశపూరితుడై బయలుదేరెను. దారిలో ఒక పెద్దమనిషి యెదురై "నీ యింటిలో నీ సోదరిని ఆమె భర్తను ఇస్లాం నుండి తప్పించలేవు కాని ప్రవక్తపై దాడిచేయబూనితి వెందుకయ్యా" అని మందలించగా ఆగ్రహోదగ్రుడై అదే కత్తిని ఆమె పై వినియోగించుటకు మరలిపోయెను. తన సోదరి నెత్తురు చూచువరకు కసిదీర్చుకొనదలిచెను. నీవు నన్ను చంపినను నా కొత్త మతమును వదలుకొనను, అని ఆమె పలుకగా చకితుడై నీవు మెచ్చిన ఖురానును చదువు విందునుగాని అని ఆమెచే చదివించి విని దాని భాషకు దానిలోని భావాలకు ముగ్ధుడై దీర్ఘాలోచనా నిమగ్నుడై మూకీ భావముతో నిలువెడల పైగంబరుగారి వద్దకు వెళ్లి

తమ దీక్ష నిచ్చుటకై ప్రార్థించెను. ఉమర్ ఇస్లాం పుచ్చుకొన్న సమయము ఆ మత విజృంభణకు నాందీభూతమగు విజయఘటిక. అతనికి ఆల్‌ఫారుఖ్ అను బిరుదు వచ్చెను. సత్యాసత్య విచక్షణ నెరిగిన వాడని దాని అర్థము.

అరబిస్థానములో చాలా గోత్రముల వారుండిరి. హిందువులలో ఋషి గోత్రాల వారెటుల నేటికిని యున్నారో అటులే అరబులో పూర్వము ప్రతివంశము వారును తమ మూలపురుషుల (గోత్రపతుల) పేరుతో వర్గాలుగా ఏర్పడి యుండిరి. అట్టి వర్గమును ఖబీలా యనిరి. ఉమర్ ఖురేషీ అను ప్రసిద్ధ గోత్రమువాడు. మనదేశములో నవ ముస్లిములు కూడా ఖురేషి అను అర్థములేని పేరును పెట్టుకొందరు. అట్టి వారందరును ఈ ప్రసిద్ధ ఉమర్ వంశమువారనిన హాస్యాస్పదము. ఖురేషీ గోత్రము వారు అరబులోని ఖబీలాలలో ముఖ్యమైనవారు.

ఉమర్ పైగంబరు గారి కన్న 17 ఏండ్లు చిన్నవాడు. చిన్న తనములో ఇతడు ఒంటెల కాపరిగా ఉండెను. ఇతని తండ్రి యీ పశుల కాపరితో పగలంతా మసలనీయక కఠినంగా పని తీసుకొనుచుండెను. ఇతనికొక ముతక బట్టను కట్టుకొనుట కిచ్చుచుండెను. ఈ కారణములచేత తర్వాత కాలములో హ॥ ఉమర్ తన విధులను నెరవేర్చుటలోను, ఇతరులతో పని తీసికొనుటలోను కఠినాతి కఠినుడై యుండెను. తాను సకల ఇస్లాం రాజ్యమునకు సర్వతంత్ర స్వతంత్రుడగు ఖలీఫాయయినను మోటు వస్త్రములనే కట్టుచుండెను. సొంతముగా కష్టించి, సంపాదించి జీవించుచుండెకాని మత పీఠకోశమునుండి ఏమియు తీసికొనకుండెను. చిన్నప్పుడు పొలాలలో తిరిగి పసుల మేపి, కర్కశ కాయుడైనందున అతి బలాఢ్యుడని పేరొందెను. అరబ్బు దేశము గుర్రాలకు ప్రసిద్ధి. ఇతడు గుర్రపు సవారీలో మహానిపుణుడు. ఆ కాలములో అరబ్బీ చదివిన కొలదిమందిలో ఉమర్ ఒకడు. అతడు మంచి ఉపన్యాసకుడు. బాగా వ్రాయగలడు. ఇంతో అంతో కవిత కూడా అల్లినవాడు. వ్యాపారములో దక్షుడు.

పైగంబర్ గారు ఈ లోకమును వదిలిరి. ఆ దుర్వార్తను విన్నవారుందరును హాహాకారములతో రోదనము చేసిరి. "పైగంబర్ గారు గతించినారు అని అన్న వారి తల లెగరింతును" అని ఉమర్ అనెను. పైగంబర్ గారిపై అతని భక్తి యెంతో గాఢమైనది.

పైగంబర్ గారు ఇస్లాం వ్యాప్తికై ఈరాఖ్, మెసోపటేమియా దేశాలపై దండెత్త బూనినప్పుడు ముసల్మానులందరును త్యాగము చేయవలెనని కోరెను. "నీవేమి తెచ్చినావు ఉమర్" అని యడుగగా నా ఆస్తిలో సగము తెచ్చితినెను. "మరి నీవేమి తెచ్చినావు అబూబకర్" అని విచారించగా, నా ఆస్తి యంతయు తెచ్చితినని అబూబకర్ అనెను.

పైగంబర్ అనంతరము అబూబ్కర్గారు మొదటి ఖలీఫా అయిరి. వారు చనిపోవునప్పుడు అబ్దుర్రహిమాన్ అనునతనితో "ఉమర్ను గూర్చి నీ అభిప్రాయమేమి" అని యడిగెను. అతడు చాలా గొప్పవాడు. కాని చాలా కఠినుడు" అని యతడనెను. అబూబకర్ చనిపోవునప్పుడు తన తర్వాత పీఠాధికారి (ఖలీఫా) హజరత్ ఉమర్ అని శాసించెను. అబూబకర్ కాలములో ముసల్మానులు సిరియా, ఈరాఖ్, పాలస్తీనులను జయించి యుండిరి. ఉమర్ జరుసలేమును జయించుటకు సేననంపెను. ఆ నగర జనులు ముట్టడికి తాళ జాలక తమ కోటను ఉమర్ గారికే యప్పగింతుమని చెప్పనంపిరి. ఉమర్ ఒక ఒంటెతో ఒక బానిసవానితో చద్దిమూటతో బయలుదేరెను. నీవొక అంచె నేనొక అంచెవంతు ప్రకార మొంటెనెక్కి పోవలెనని అతడు బానిసతో చెప్పి అటులే జేసెను. దారిలో చద్దిమూటను విప్పి ఇరువురును పొత్తుగుడిచి మరల బాట పట్టిరి. జరుసలేమును సమీపించినప్పుడు ఒంటెపై నెక్కు వంతు బానిసకే వచ్చెను. "ప్రభూ, ఇప్పుడు తాము దర్జాగా ఒంటెపై నెక్కుటయే నీతి" అని వాడు మనవి చేసుకొనెను. "మరి మన ఒప్పుదల?" అని ఉమర్ తర్జించి వాని నెక్కించెను. కోట వద్ద జరుసలెం ప్రజలు వేలు వేలుగా గుమికూడి ఒంటెపై నున్న గులామునే చూచి జోహారు లర్పించుకొనిరి. ఈ జోహారుల నందవలసిన భక్త జనాధిపతులగు ఖలీఫా గారిదిగో అని ఒంటె త్రాటిని బట్టి పాదచారియగు ఉమరును వాడు చూపగా ఆశ్చర్యచకితులై అతని నెగదిగ చూచిరి. అతని అంగీకి కోరినన్ని అతుకులతుకు లుండెను. అతని మోజాలకునూ అతుకులే యుండెను. జరూసలెం వారు అతనికి దివ్య వస్త్రాలను సమర్పించుకొనిరి. ఇస్లాం అలంకరణముతో నిండిన నాకు ఈ అలంకరణ లేమియు రుచించవు" అని మతాభినిష్ఠుడనెను.

ఈరాన్, (పర్ష్యా) సామ్రాజ్యముతో అరబ్బులు తలపడిరి. ప్రతిదినము యుద్ధ వార్తకై ఉమర్ ఊరు బయటకు పోయి వార్తా హరునికై యెదురు చూచుచుండెను.

ఈరానును అరబ్బులు జయించిరను సువార్తను ఖలీఫాకు తెలుపుటకై ఒక నవాబు దుమ్ము లేపుతూ దౌడు తీయుచు వచ్చెను. దారిలో ఖలీఫాగారు ఏమి వార్త అని వాని నడిగెను. "ఉండవయ్యా, నేను ఖలీఫాతోనే మొదలీ వార్త చెప్పవలెను" అని వాడు వేగాన్ని తగ్గించకుండా సవారి చేసెను. ఉమర్ గుర్రము తోకను పట్టుకొనియే వెంట నురికెను.

ఈరాన్ చక్రవర్తి ఉమర్‌కు కానుకలంపి యుండెను. అరబ్బుల దేశాలలో కానుకలు తెచ్చినవారు ఖలీఫా గారెక్కడ అని విచారించుచూ వెదుకుచుండిరి. తుదకొక సాధారణమగు డేరా ముందొక ఖర్జూర వృక్షము క్రింద ఖలీఫా గారొక చినిగిన ఉడుపును కుట్టుకొనుచు కూర్చుని యుండిరి. ఖలీఫా గారెక్కడ అని యతనితో వచ్చిన రాయబారులు ప్రశ్నించిరి. "నేనే" అను మాటను విని అతడౌనో కాదో యను విచికత్సలో మునిగితేలిరి. తెచ్చిన కానుకలన్నియు ప్రజాకోశము (బైతుల్ మాల్)లో చేరిపోయెను.

ఒక యుద్ధము నుండి వార్త తెచ్చిన సేనానులు మంచి వెలగల యుడుపుల ధరించి యుండిరి. "ఇది సిపాయిాల వేషము కాదు" అని ఖలీఫా మందలించెను. జంబియాలు కత్తులు నడుమున, చంకన కలవని వారు చూపించగా కొంత శాంతించెను.

ఖలీఫా బహు రాజ్యాలను గెలిచి వాటిపై సుబేదారులనుగా పలువురిని నియమించెను. వారికిచ్చిన యాదేశము లెట్టివనగా "తుర్కీ పెద్ద గుర్రాలపై సవారీ చేయరాదు. విలువ గల యుడుపుల తొడగరాదు. రుచిరాన్నముల తినరాదు. నౌకర్లను పెట్టుకొనరాదు. ప్రజలందరికి దర్శనమిచ్చుటకై దర్బారు తలుపులెప్పుడును తెరచి యుంచవలెను". ఈజిప్టు సుబేదారగు ఆయాజ్ అనునతడు తద్విరుద్ధముగా మహా వైభవముగా సుఖించుచుండుటను విని అతని పిలిపించెను. అతని మెరుగు బట్టలను స్వయముగా చించి పారవేసి మోటు బట్టలను కట్టించి మేకల గాయుటకై పంపెను. కొన్నాళ్ళీ పనిచేసిన తర్వాత అతనికి బుద్ధి వచ్చెను.

పూర్వము విక్రమాదిత్య చక్రవర్తి తన సామ్రాజ్యములో ప్రజల స్థితిగతులెట్టివో కనుగొనుటకై రాత్రులందు మారు వేషాలతో తిరుగుచుండెనట. అటులే హ॥ ఉమర్ గారున్నూ తిరిగెడివారు. ఒక రాత్రి ఒక యింటిలో పిల్లలేడ్చుటచే తలుపు తట్టి

కారణమేమని విచారింపగా ఆకలిచే వారేడ్చుచుండిరని తెలుసుకొనెను. అయితే ఆ మూలలో ఉడుకేదేమిటి? అని యతడు విచారించెను. ఉత్తనీరు మాత్రమే కుతకుతమని యుడుకుచున్నది. పిల్లల యోదార్చుటకై అటుల చేయుచున్నాను అని తల్లి పలికెను. ఉమర్ ఏమియు పలుకక మదీనాకు వెళ్ళి ఒక సంచి పిండిని తన వీపుపై మోసుకొని పోవుచుండెను. "ప్రభూ నేనీ మూటను తెత్తును లెండి తమ కెందుకీ శ్రమ" అని బానిస యనెను. "ఒరే ప్రళయ కాలము నాడు నీవు నా బరువు మోయుదువా? అని యతడనెను. మరొక రాత్రి ఒక అరబు గుడారములో ఆక్రందనమును విని కారణమడుగగా అయ్యా నా భార్య ప్రసవ వేదనలో నున్నది. దాయిని తెచ్చుకొను శక్తి లేదు. మరెవ్వరును నాకు దిక్కులేరు" అని భర్త యనెను. ఉమర్ తన భార్యను కాన్పు చేయుటకై పంపెను. మరొక రాత్రి ఒక స్త్రీ ఉమర్ పరిపాలనలో నాకు తిండి లేక పస్తుండవలసి వచ్చెనని తిట్టుకొనుచుండుటను ఖలీఫా విని ఆమెకు కడుపు నిండునటుల అన్నము తెచ్చి పెట్టెను. ఆమెయన్నమును తిని యిట్లనెను. "నీ వెంత మంచివాడవయ్యా నీవు ఖలీఫా కంటే మేలైనవాడవు నీవే ఖలీఫాగా నుండిన ఎంతో బాగుండును కదా".

ఇస్లాం వ్యాప్తికి బైతుల్ మాల్ ఒక ముఖ్య కారణము. అది ప్రజల ధన కోశము. గెలిచిన రాజ్యాల లూటి ధనములో అయిదవ పాలు బైతుల్ మాల్‌లో చేరుచుండెను. ప్రతి ముసల్మాను తన ఆదాయములో నూటికి రెండుపాళ్ళు బైతుల్ మాల్‌కు చెల్లించుచుండెను. దాని నుండి బీదలు వృద్ధులు వితంతువులు అనాథులను పోషించుచుండిరి.

అంతేకాదు విద్యాలయములు వైద్యశాలలు పైకమునుండియే పోషింపబడు చుండెను. ఒక అపశత్రు దేశపు లూటీలోని ధనము రాగా ఖలీఫా బిడ్డ కూడ అందు కొంత పైకము తన కిమ్మనెను. అది జనుల పైకము, నాకు దానిపై యధికారము లేదు అని ఉమరనెను.

ఒకనాడు ఖలీఫా కుమారుడు మద్యమును సేవించి అపరాధి యయ్యెను. ఖురాన్ ప్రోక్త ప్రకారము వానికి 100 కొరడాదెబ్బల శిక్ష విధించెను. ఖలీఫా కొడుకని సేవకులు మెల్లగా కొట్టుటచేత తానే కోరడా తీసుకొని శక్తి కొద్ది 100 వరకు ఎంచి యెంచి చావ మోదెను.

"నేను తప్పు చేస్తే దానిని చూపించి సవరింపుడు. మీకు సౌఖ్యమును చేకూర్చు విధానములను నాకాదేశింపుడు" అని ఉమర్ పలుమారు అనుచుండగా ఒకనాడొక శ్రోత కత్తి నొరనుండి లాగి "నీవు పెడత్రోవ పట్టితే నీకు దీంతో బుద్ధి చెప్పగలము" అని పలికెను. "భేష్ నాకు నీవంటి ధీరులు అనుచరులైనారని నా యానందము పారమందినది" అని ఉమర్ ప్రత్యుత్తరమిచ్చెను.

ఇస్లాం కొరకై చేసిన యుద్ధాలలో స్త్రీలు చాలా సహాయము చేయుచుండిరి. వారు పురుషులకు జియోహమ్మెత్తర్వా-యుద్ధము చేయవలెనని పురికొల్పుచుండిరి. కొన్ని సమయములలో తమ పురుషులు చచ్చినప్పుడు వారి ఆయుధములను గొని తాముసు యుద్ధము చేసిరి.

హజరత్ ఉమర్ గారి అంత్యదశ విషాదకరమైనది. ఒక నాడొక ఈరానీ బానిస ఖలీఫాతో తన యజమాని తనపై భరింపరాని పన్ను వేసెనని మొరపెట్టుకొనెను. ఎంత పన్నని విచారింపగా రెండు దిరములనెను. నీ వృత్తి యేమని యడిగెను. నేను వడ్ల పని కమ్మరి పని చేయుదుననెను. అట్లయితే పన్నధికము కాదు పొమ్మనెను. మరునాడు వాడు మసీదులో దాగి ఖలీఫా నమాజు చేయునప్పుడు బాకుతో పొడిచెను.

నన్ను పొడిచినదెవరు అని ఖలీఫా అడిగెను. ఈరానీ గులామని చెప్పిరి. ఇస్లాం భక్తుడు పొడువనందున ఆ దేవునికి ధన్యవాదాలు అని ఉమర్ పలికెను.

అతడు అతి మితజీవి. మసీదులో దినము బీద ముస్లింవలె కూర్చుండువాడు. న్యాయము చేయుటలో తనవారని పరులని విచక్షణ చేయలేదు. పెద్ద చిన్నలని కాని, ధనిక దరిద్రులని కాని, బాలవృద్ధులని ఆత్మీయ పరకీయులని కాని యెన్నడును భేదము చేయలేదు. ఇస్లాముకై జీవించెను. దాని సేవలో చనిపోయెను. దానికై తన సర్వస్వమును త్యాగము చేసెను. ఇతరులకు మేలు చేయించెను. ఈ గుణములు కలవాడగుటచే అతని నాయకత్వమున ఇస్లాం సామ్రాజ్యము అతి వేగముగా నలుదిక్కుల వ్యాపించెను.

"హజరత్ ఉమర్ ఇస్లాము లోకములో ఉత్తమోత్తముడు".

రాజా జైసింగు

250 ఏండ్ల క్రిందట ఉత్తర హిందూస్థానములో నొక మహావ్యక్తి యుండెను. అతడే రాజా జైసింగు. అతడు జయపుర సంస్థానమున తన పేర నగరము కట్టి, వ్యాప్తి నొందించి స్థాపించినట్టివాడు. "ఇదంబ్రాహ్మం ఇదంక్షాత్రం శాపాదపి శరాదపి" అన్నట్లుగా అతడు శస్త్రవిద్య యందేకాక శాస్త్రవిద్యయందును ఆరితేరినవాడు. క్రీ.శ. 1699లో సింహాసనాధిష్టుడయ్యెను. ఔరంగజేబు చక్రవర్తి యొక్క సుబేదారులలో నొకడైయుండెను. ఔరంగజేబు చనిపోయిన తర్వాత ఢిల్లీ సింహాసనానికై అన్నదమ్ములలో కలహములు జరుగగా అందొక పక్షము వహించి జయసింగు యుద్ధములు చేసియుండెను. తుదకు షా ఆలం చక్రవర్తి యైన వెంటనే తన కసిదీర్చుకొనుటకై జయసింగు రాజ్యమును లాగుకొనెను. జయసింగు మరల దానిని సంపాదించుకొనుటయే కాక తన రాజ్యాన్ని బాగా విస్తరింపజేసుకున్నాడు. పూర్వము తన రాజ్యానికి ముఖ్యపట్టణము అంబరు అను నగరమై యుండెను. అది తగినట్టిది కాదని ఇంకొక క్రొత్త నగరాన్ని తన పేరుతో జయపురమని పేరుపెట్టి నిర్మించెను. ఈ నగర నిర్మాణమునకు ప్లానులు వేసి యిచ్చినవాడు విద్యాధరుడు అను జైనుడు. చక్కని వీధులను గట్టినాడు. దానిని చూచిన వారది ఈనాడు కట్టినారు అన్నట్లు కనిపించును.

ఇట్లు జయసింగురాజు గొప్ప వీరుడనియు, రాజకీయ వేత్తయనియు ప్రసిద్ధి గాంచినను అతని జ్యోతిశ్శాస్త్రములోని ప్రఖ్యాతి ఖండ ఖండాంతరములలో వ్యాపించిపోయెను.

జయసింగు రాజుకు నక్షత్ర శాస్త్రముపై చాలా అభిమానము. ఆ కాలములో మహమ్మద్ షా చక్రవర్తి ఢిల్లీ సింహాసనముపై నుండెను. ఆ చక్రవర్తి కోరిక ప్రకారము జయసింగు హిందూ పంచాంగమును సంస్కారము చేసెను. ఇందుకై అతడు ఢిల్లీ, ఉజ్జయిని, కాశీ, మథురా (మట్రా) జైపూరు నగరములలో నక్షత్ర వేదికలను నిర్మించెను. ఆ వేదికలపై నక్షత్రములను పరీక్షించుటకై కొన్ని యంత్రములను సిద్ధము చేయించెను.

ఫారసీకుల యంత్రములు కొన్ని అతనికి సహాయపడెను. అయినను తన సొంత ఉపజ్ఞతో నూతన యంత్రములను సిద్ధము చేసినాడు. మరియు నక్షత్రశ్శాస్త్రమందు కొన్ని లెక్కలను సిద్ధము చేసినాడు. పోర్చుగల్ దేశములో జ్యోతిశాస్త్రము చాలా వృద్ధి పొందినదని ఒక పోర్చుగీసు ఫాద్రీవలన విని ఆ దేశ రాజధాని యగు లిస్బన్ నగరానికి ఒక రాయబారి నంపినాడు. పోర్చుగల్ రాజగు ఎమాన్యుయల్ రాజు, జేవియర్‌డా సిల్వా అను పండితుని పంపెను. అతడు 1702లో అప్పుడప్పుడే ముద్రితమైన పోర్చుగీసు భాషలోని జ్యోతిశ్శాస్త్ర గ్రంథమును జైసింగుకు తెచ్చి యిచ్చి విషయములను అవగాహనము చేసెను. జయసింగు ఆ శాస్త్రములను విమర్శించినాడు. అందుకొన్ని తప్పులు కనిపెట్టినాడు. తర్వాతి కాలములో ఇంగ్లాండు యొక్కయు యూరోపు ఖండమందలి యితర దేశముల యొక్కయు, మహా పండితులందరును జయసింగు యంత్రాలను పరీక్షించి వాటిలో ఒకటి రెండు క్షణముల భేదములు తప్ప తక్కిన లోపములేమియు నిరూపింపజాలక ఆశ్చర్యయుక్తులైరి. జయసింగు తన శాస్త్ర గ్రంథమును జీజ్ మహ్మద్ షాహీ అని పేరిడి తన చక్రవర్తికి అంకిత మిచ్చినాడు. ఇంతేకాక అతడు పండితులను ప్రోత్సహించి వారిచే గణిత శాస్త్రములను సంస్కృతములోనికి పరివర్తనము చేయించినాడు.

తన జయపురములో నిప్పటికి అతడు నిర్మించిన అనేక నక్షత్ర వేదికలు కనబడుచున్నవి. అవన్నియు శిథిలమై పోయినవి. చిత్ర విచిత్రములైన రూపములతో, అర్ధ చంద్రాకృతిగా, త్రికోణాకారముగా నానారూపములుగా ఈ నిర్మాణములున్నవి. వాటిపై తాను చూపించి చేయించిన చాలా పెద్ద యంత్రములను చెక్కించి యుండిరి. ఆ యంత్రములు రాగితో చేయబడి యుండెను. తర్వాతి రాజైన జగత్ సింగు యొక్క ఉంపుడు కత్తె యగు సస్‌కాపూర్ అను స్త్రీకి ఆ పెద్ద పెద్ద రాగి యంత్రములలో రాగి మాత్రమే కనిపించెను. అవన్నియు అమ్మిన వేలకొలది ధనము వచ్చునని ఆ గణిక గుణించెను. అప్పుడే ఆ యంత్రాల నన్నింటి లాగించి పాత్ర రాగికి మంచి ధర వచ్చుటను జేసి కరిగించి అమ్మించెను. ఇట్లొక బోగము దాని మూలమున ప్రపంచానికి జైసింగు యొక్క అపూర్వ మేధస్సుచే కనిపెట్టబడిన శాస్త్రీయ యంత్రములు నష్టమయ్యెను. తర్వాతి రాజులు అట్టి యంత్రాలను మరల సిద్ధము చేయించ ప్రయత్నించిరి. కాని ఆ పద్ధతి వారికి గాని పండితులకు గాని తెలియనందున ప్రయత్నములన్నియు వ్యర్థమయ్యెను.

దివాన్ బహద్దర్ వి. నాగమయ్య

ఆంధ్ర మహాపురుషుల జీవితములు పూర్వమందేమి యాధనిక కాల మందేమి వ్రాయుట యందు, పాశ్చాత్య సంపర్కము గల యిప్పటి కాలమందయిన నీ లోపమును బాపుకొనుటావశ్యకము. ఇందు తిరువాన్కూరు రాజ్యములో నలుబది సంవత్సరములు రాజకీయోద్యమమందు గడిపి, హిందుస్తానమందే కాక ఇంగ్లీషు దీవులయందును ప్రఖ్యాతిగాంచిన యాంధ్ర బ్రాహ్మణుడైన నాగమయ్య జీవితమును సూక్ష్మముగా నివేదించెదను.

దివాన్ బహద్దరు వి. నాగమయ్య బి.ఏ., యఫ్.ఆర్.హెచ్.యస్. తిరునల్వేరి జిల్లాలో తామ్రపర్ణ నదీతీరమునున్న వీరరాఘవపురమను గ్రామమున 1850వ సంవత్సరం డిసెంబరు నెలలో జన్మించెను. ఇతడారువేల నియోగి. వీరి పూర్వులు కృష్ణా జిల్లాలో బొంపూడి గ్రామమునుండి దక్షిణమునకు వెడలిరి. ఇతని మాతాపితరు లితడు జన్మించిన మూడు సంవత్సరాలకు తిరువనంతపురము (తిరువేంద్రము)లో బోయి చేరిరి. నాగమయ్య యచట మహారాజాగారి స్కూలులోను కాలేజిలోను విద్యాభ్యాసమొందెను. 1886వ సంవత్సరములో మెట్రికు పరీక్షలో గడతేరి 1870లోబి.ఏ. బిరుదమంది సర్.టి. మాధవరావు చేతి క్రింద సర్కారీ గుమాస్తాగా నౌకరీ చేయ ప్రారంభించెను. 1890వ సంవత్సరములో మన దేశమున ఇంగ్లీషు విద్యా చాల తక్కువ. అట్టి తరి యీతడే తిరువాన్కూరు సంస్థానములో మొదటి బి.ఏ. బిరుదమందినవాడు. ఇతడు విద్యాభ్యాసము చేయుకాలమున పాఠశాల యందలి బాలురలో నెల్లను బుద్ధి కౌశలమున మించియుండెను. ఇతడుద్యోగమున జేరిన రెండు సంవత్సరాల లోపలనే కొట్టయం భాగమునకు తహసీలుదారుగా తిరువాన్కూరు సర్కారుచే నియోగింపబడెను. ఇతని పై యధికారులు – ఇంగ్లీషువారును,

స్వదేశస్థులును - ఇతని చాతుర్యమునకు, గార్యనిర్వాహణమునకును మెచ్చుకొని యతనిని బాల తహసీలుదారు అని పిలుచుచుండెడివారు. గతించిన మహారాజు కూడ యతని శ్లాఘింపదొడగెను. 1894 సంవత్సరమున తిరువాన్కూరు జనాభా (census) పై నతడు సూపరింటెండెంటుగా నుండుటకై యేర్పాటు చేయబడెను. ఈ జనాభా లెక్కలు ముగిసిన వెంటనే మహారాజు, మంత్రి మొదలుగ ఇంగ్లీషువారును, నితరులు నాగమయ్య శక్త్యుత్సాహములతో నొక లోపమైయినను లేక నియుజ్య కార్యమును బూర్తి చేసినందులకు నతనిని బ్రశంసించిరి. ఈ సందర్భమున హైదరాబాదులో మంత్రియైన సర్ సాలర్‌జంగ్ నాగమయ్యకిట్లు వ్రాసెను. "మీ ఖ్యాతి నేను వినినాడను. మా రాజ్యపు బాలనా పద్ధతులను మీకు స్వయముగా నివేదింప నిచ్చగలదు." 1880వ సంవత్సరమున ప్రకృతపు మహారాజుగారు సింహాసనా రూఢులైరి. మరుసటి యేటనే నాగమయ్యకు దివాన్ పేష్కారి పదవినిచ్చిరి. తిరువాన్కూరులో నిప్పుడు చాలావఱకు తగ్గినను, బ్రాహ్మణ సత్రములు ధారాళముగా జరుగుచుండును. ప్రతి దివసమెందఱు వచ్చిన నందఱి బ్రాహ్మణులకు అనంతశయన పద్మనాభ దేవాలయములో భోజనము పెట్టబడును. కాని ప్రతి సంవత్సరమును మూరజప తులాభారాద్యుత్సవ సమయములందు నాగమయ్య కార్యక్రమమును జరిపించుచుండెను. ఈ సత్రముల విషయమై నాగమయ్య తన రిపోర్టులో నిట్లు వ్రాసెను.

"మూరజపోత్సవమున సుమారు 4000 బ్రాహ్మణులకు 80 వారముల వఱకు భోజనమిచ్చుచున్నారు. కడపటి వారమున భుజించువారు 10,000 జనులు. ఇట్టి పద్ధతి ప్రపంచమందెందును గమనింపజాలము".

నాగమయ్య రెండవ తూరి సహితము జనాభా లెక్కలపై నేర్పాటు చేయబడి యందఱి మెప్పు వడసెను. మహారాజాగారు హిందుస్థాన మందెచ్చటికైన బయలుదేరు సమయమున వారి సౌకర్యములకై యేర్పాటు చేయుటకు నాగమయ్యనే కోరుచుండెను 1881వ సంవత్సరమున మహారాజాగారు వీరి యేర్పాటులకు సంతసించి యుంగర మొకటి బహుమతిగా నిచ్చెను.

1890లో నితడు మూడవ తూరి జనాభాపై యధికారము వహించెను. ఈ సందర్భమున నితనిని రిప్పన్ గ్రాంటుడఫ్ బాల్ఫర్ వాచా మున్నగువారు

ప్రశంసించుటయేకాక హిందూస్థాన ఇంగ్లీషు స్థానమందలి పత్రికలు బహువిధముల శ్లాఘింపదొడగెను. 1892లో నితడు రాయల్ హిస్టారికల్ సంఘములో నొక సభ్యుడుగా నెన్నబడెను.

ఇతడు పేష్కారిగా నుండిన కాలములో సత్రములను, బావులను, బాటలను, పాఠశాలలను దేవతాయతనములను కొన్నింటిని నూతనముగా నిర్మించి, యన్నింటిని బాగుచేయించి ప్రజలకేలాటి కష్టములుండిన నివారించు నుపాయములను జేయు చుండెను. ఇతడు మత సంబంధమైన ఎండోమెంటు చట్టమును శాసన రూపము వహించునట్లు దీనికై యతడు తిరువాన్కూరు సభలో ఉపన్యాసములనిచ్చి యాక్షేపణముల కన్నింటికిని సమాధానములనిచ్చి బహు ప్రయాసముతో సభ యొక్కయు రాజాగారి యొక్కయు అనుమతి బొందెను. రమేశచంద్రదత్తు నాగమయ్యకిట్లు వ్రాసెను. "మీ గంభీరోపన్యాసముల జదివితిని. అందు మీరతి ప్రతిభాశక్తిని జూపించినారు. మా సంస్థానములో సహిత మిట్టి చట్టమును శాసింప యోజించు తమరు నాకును జాల సహాయపడినవారై యున్నారు". నాగమయ్య గంభీరోపన్యాసముల నిచ్చుటలో చాల ప్రవీణుడనుట కతని కంపిన లేఖలే నిదర్శనము, టాస్మేనియా గవర్నరుగానుండిన సర్ అర్థర్ హావ్లార్ ఇట్లు వ్రాసెను. 1897లో నేను తిరువనంతపురము వచ్చినప్పుడు మీతో గలసిన సందర్భము నెప్పటికిని మఱచిపోను. దక్షిణ హిందూస్థానములో నేగలసిన ధీ ప్రజ్ఞాశేఖరులలో మీరొకరని నా దృఢ విశ్వాసము".

1902లో రాజాగారు మంత్రియు ఢిల్లీలో చక్రవర్తి పట్టాభిషేకోత్సవమున కరిగినపుడు నాగమయ్యను రెండు నెలలు "దివాను"గా నియోగించిరి. మరల 15 మాసముల తర్వాత రెండవ తూరి యితడు దివానయ్యెను. పిమ్మట తిరువాన్కూరు నాణెముల యేర్పాటుకై నాగమయ్య "చక్రం కమిటీ కధ్యక్షుడయ్యెను. ఇది ముగిసిన పిమ్మట నాగమయ్యను తిరువాన్కూరు స్టేటు మాన్యుయల్‌ను తయారుచేయుటకై మహారాజాగారు కోరిరి. ఈ పని నాగమయ్యకే తగినట్టిది.

ఇతడు చిన్ననాటను గోలె యనేక శాఖలందు బ్రవీణత నొంది నానావిధ శాస్త్రములను గ్రంథములను ప్రతిదినమెంతటి కార్యముండినను గొంతవఱకవకాశము చేసుకొని యవలోకనము చేయుచుండెడివాడు. సర్కారు భాండాగార మందలి పుస్తకముల జదివినదే కాక తన సొంత లైబ్రరీలో 2500 యుత్కృష్ట పుస్తకముల

గూర్చుకొనియుండెను. తన తక్కిన రాజ్య కార్యముల నిర్వహించుచుండియు 2000 ముద్రిత పత్రముల విషయముల నీతడచిరకాలము లోపలనే ముగించి ప్రకటించెను. ఈ గ్రంథములందితడు తిరువాన్కూరులోని జనులకు విదితములైన వాని వెల్లడించుచు నచటి సర్వజనుల చారిత్రములను వృక్ష జంతు లోహాదుల విషయములను భాషా చరిత్ర దేశచరిత్ర మున్నగు వానిని సమగ్రముగా వ్రాసి శేముషీవిశేషములను బ్రకటించెను. మత విషయముల వ్రాయుచో "హిందూ గృహము ప్రపంచములో నుత్తమ నిర్మాణమని యభిప్రాయమిచ్చి ఫాద్రీల యాక్షేపణముల ఖండించెను. తిరువాన్కూరులో మెల్ల మెల్లన ప్రాకి దినదినము ప్రబలమైనట్టి క్రైస్తవ మతమును నిష్పక్షపాత బుద్ధితో బ్రశంసించుటచే ఫాద్రీలు సైతము మిక్కుటముగా హర్షించిరి. చరిత్రకారుడైన "లేకీ" యతనినిట్లు ప్రశంసించెను.

"ఆల్ ఫ్రెడులయల్" మలబారు మంత్రవాదమును గురించి మాకు గొంత తెలిపెను. కాని వీరు వ్రాసిన దానిలో ననేక నూతాంశములు దొఱకినవి, నాగమయ్య వ్రాసిన మాన్యుయలు నాధారముగా జేసికొనియే ఎన్‌సైక్లోపిడియాలో మలబారు విషయము వ్రాయబడెననుట వీరి యసమానబుద్ధి ప్రభావమును వేనోళ్ళ జాటుటయైనది.

ఇది ముగిసిన పిమ్మట నాగమయ్య 1904, 1905, 1907 సంవత్సరములలో వరుసగా మరల దివాను పదవి నందెను. తుదకు 1907లో తన యుద్యోగ పదవి నుండి సెలవు తీసుకొనెను. ఇతడు ముగ్గురు మహారాజుల కాలమునను, ఏడుగురి దివానుల దగ్గర నుద్యోగము చేసెను. మొదటి నాలుగు సంవత్సరములు విద్యాశాఖ యందును, 2 సంవత్సరములు దివాన్ కచ్చేరియందును, 2 యేండ్లు తహసీల్దారుగను, 12 యేండ్ల దివాన్ పేష్కారీగాను, 11 సంవత్సరములు రెవెన్యూ దివానుగాను, 5 మారులు దివానుగాను, మొత్తము 42 సంవత్సరములు రాజాగారి యుద్యోగమునకు ధారపోసెను. ఇట్లు ప్రపంచమందటను బ్రఖ్యాతి గాంచిన యీ యారువేల నియోగి, నాగమయ్య 1916 ప్రాంతమందు పరమపదించెను. ఇతని కుమారులిప్పుడు తిరువనంతపురములో మహారాజుగారి యున్నతోద్యోగములందు బ్రసిద్ధి వహించి వర్ధిల్లుచున్నారు.

పండిత మాడపాటి హనుమంతరావుగారు

"గోలకొండ పత్రిక మేనేజరుగారికి – అయ్యా నా యుపన్యాస ప్రతులలో 17 తక్కువగా వచ్చినవి. మహిళా సభాధ్యక్షురాలివి 100 తక్కువగా నున్నవి. దయచేసి పంపగలరు".

మహిళా సభాధ్యక్షురాలు మాడపాటి హనుమంతరావుగారి భార్య. నిజాం రాష్ట్ర చతుర్థాంధ్ర మహాసభకు అధ్యక్షులు శ్రీ రావుగారే. తమ తమ యుపన్యాస ప్రతులను (200లను) ఓపికతో స్వయముగా నెంచుకొనినారు. ప్రతి చిన్న విషయములోను కట్టుబాటు. అందు ఆవంత పొరపాటును గూడ గుమ్మడికాయంతగా జూతురు. సహింపనే సహింపరు. తమ యింటి లెక్కయెట్లో ప్రజానిధి లెక్కయు నట్లే దమ్మిడీ దమ్మిడీ లెక్కపెట్టవలె. ఆ లెక్క సరిగా కుదరవలె ఏదన్న వ్యర్థముగా పోరాదు. "అనెగొంది లెక్కలు" వారికి సరిపడనే సరిపడవు.

❖ ❖ ❖

ఇంచుమించు 17సంవత్సరాల నాటి మాట. ఆనాడు హైదరాబాదులో తెనుగు వారికి సంస్థలు లేవు. సంఘటన మంతకును తక్కువ. మహారాష్ట్రుల సంఖ్య తక్కువైనను వారిదే ప్రాధాన్యము. ఒక సభలో నొక తెనుగు పెద్ద మనిషి సభావేదికపై నెక్కి యుపన్యసింపబోయినాడు. మహారాష్ట్రులు గోలపెట్టినారు. ఆ పెద్దమనిషితోపాటు శ్రీ హనుమంతరావుగారున్నూ సభను వదిలి వెళ్ళినారు. ఆ చిన్నఘట్టమే ఆంధ్రోద్యమ శంఖుస్థాపనకు కారణమైనది. నేడు మహారాష్ట్రుల కన్న ముందంజ వేయుచున్నారు ఆంధ్రులు: ఇదంతయు రావుగారి నిరంతరకృషి ఫలితము వారి యాంధ్రాభిమానమునకు నిదర్శనము.

వక్తృత్వ పరీక్షలో బహుమానం పొందిన వక్త కాదు. గొప్ప పండితుడును కాదు. కవిత్వము చిన్నప్పు డేవో గణబద్ధముగా వ్రాసిన కొన్ని పద్యములు కలవు. పరిశోధకులకు తప్ప నితరులకాసంగతి తెలియదు ఇంగ్లీషులో మెట్రిక్కు హద్దు. ఫార్సీలో సాదీని సాధించెను. ఉర్దూలో మంచి పాండిత్యము. తెనుగులో గ్రాంధికవాది. కాని గ్రాంధిక వ్యావహారిక చర్చలో తమ విలువ వోటు నెవ్వరికి ఇయ్యరు. ఇతిహాసకుడు కాదు, పరిశోధకుడు మున్నేకాదు. అయితే యిన్ని "నఞ్"లతో ఒప్పియు వీరికీ ప్రాముఖ్య మెట్లువచ్చెను? అదియే వీరి జీవిత రహస్యము.

❖ ❖ ❖

శ్రీ పంతుల వారికి చేపట్టిన విషయములందెల్ల పట్టుదల మెండు. కార్యసాధకుడు. (ప్రజోపయోగార్థమై యా సాధన మరుదుగా యేనకేనా ప్యపాయేన అయిననూ సాధారణముగా నియమోల్లంఘున మభిలషించరు)

ఏ విషయమును గురించి ముచ్చటించినను - సభలో గానీ, ఇంటిలోగాని ఆ విషయమును విపులీకరించి, తిన్నగా, నెమ్మదిగా, కథాక్రమముగా, పూసగుచ్చినట్లు విషయము పెరిగినను సరే, శ్రోతల కానందముండునంతవరకు సాగదీయును.

❖ ❖ ❖

ఎవ్వరి మనస్సును గాని, ఏ కారణమునైనగాని, నొప్పింపగూడదనునది వారి నీతి మార్గములలో రాజమార్గము. "అన్యుల మనముల్ నొప్పింపక తానొవ్వక తప్పించుక తిరుగువాడు" అని యీనాడే రాష్ట్ర కవియైన వ్రాసియుండిన అది వీరిని మనసులో నుంచుకొనియే వ్రాసినాడేమోయని మిత్రులందరిలో గుసగుసలు బయలుదేరి యుండును. ఎవ్వరేని రావుగారి అభిప్రాయము గోరిన వారికి మనసిచ్చి చెప్పరు. "పుత్రోనుపుత్రి" వంటి జోస్యముగా నుండును. అభిప్రాయభేదమును విధిలేక ప్రకటింపవలసియే యుండిన అది ద్రావిడ ప్రాణాయామ న్యాయముచే సిద్ధింపజేతురు.

❖ ❖ ❖

నాయకుడైన వానికి ఒకానొక సమయములో శీఘ్ర నిర్ణయము (Quick decission) ఉండవలెను. వీరు తరచుగా వికల్ప న్యాయములో జిక్కియుందురు.

నాయకుడు సమయమునకై పొంచియుండవలెను. సమయము వచ్చినప్పుడు దానిని తటాలున గ్రహించి లాభము పొందవలెను.

అట్టి సాధనకు సహనము (Risk) కావలెను. రావుగారిలో (అవకాశము కలుగనందుననేమో) యీ గుణము వ్యక్తము కాలేదు.

వీరిలో నొక గొప్ప లక్షణము కలదు. ప్రజాసేవకులను, వ్రాయసకాండ్రను గుర్తించుటలో వీరికి పక్షి చూపు (Eagle eye) కలదు. అట్టి వారిని జారి పోదమన్నను జారనీయక తమ దృక్పథమందే యుంచుకొని ప్రోత్సాహపరచి రంగములోనికి సిద్ధము చేసుకొనుట నాయకుని లక్షణములలో నొకటి.

ఎత్తైన వారుకారు. స్థూల శరీరులు. ఆ స్థూలత వారి నడక నెటులో నడవడి కను నటులే నెమ్మదిగా సాగించును. స్వీయ ప్రకటనమును ఆత్మోత్కర్షను గోరరు. ఆడంబరము లేదు.

ఉడుపులందు సాధారణత యెట్లో జీవన మందున నట్లే. కళోపాసకులు కారు. భావానుగుణ్యముగా నింటిగోడలు క్యాలెండరు అలంకారములనైన నోచుకొనలేదు.

❖ ❖ ❖

సభా వేదికాలంకారకులు, వాగ్గంగసింహులు, స్వార్థ నిమిత్త కౌటిల్యులు, పత్రికా ప్రకటితులు, మతావేశోన్మాదులు, దాంభికోత్తంసులు - నాయకులు పలు తెరగులవారైయుందురు. మనరావుగారు పై తెరగులలో నొక్కదానికైనను చేరిన వారుకారు. తమ యుద్యమ మూలమున జీవనోపాధియగు ప్రాక్టీసును నష్టపరచుకొనినారు.

ఉత్సాహవంతులను ముందునకు నడిపించుటలో నానందింతురు. ఆంధ్రాభి మానము మెండు. మనవారు - ఏ ప్రాంతీయులైనను సరియే - పేరు ప్రతిష్టలు పొందుచున్నారనిన అది వారికి విందు. ప్రాంతీయ దురభిమాన పిశాచబాధితులై యాత్మోత్కర్షలో తగుల్కొని యైకమత్య దూరులైన యాంధ్రులలో రావుగారి యీ గుణము అనుకరణీయము.

❖ ❖ ❖

ఉత్సాహము, తాత్కాలికావేశము, ఉద్రేకము పొందకమున్నే శాంతించుట - ఇవి యాంధ్రునికి - పూర్వమందుగాని, పశ్చిమ మందుగాని వలసలోగాని - ప్రత్యేక లక్షణములని విశదములైన యంశములే. వీరీ ముఖ్యాంధ్ర లక్షణమునకు దూరులైనారు.

మాటలందుగాని, కార్యములందుగాని ఆవేశము చూపరు. శ్రద్ధను పూర్తిగా పూనియుందురు. ఇదియే నిష్కామకర్మ ప్రథమ సోపానము.

❖ ❖ ❖

తమ ప్రథమ కళత్రమువలన నొకే కూతురు. ఆ బాలికకు వివాహమైనప్పుడు యువకులు తమ యసమ్మతిని, రావుగారు తమ హృదయ దౌర్బల్యమును ప్రకటింపవలసి వచ్చెను. ఇప్పుడు సంఘ సంస్కారులు జిల్లాలలో ప్రచారార్థ మరిగినప్పుడు మాత్రము మడి పంచ తమ తోలుపెట్టెలో నుండి తీరును. పంతులుగారికి వేరు సంతానము లేనందున పిల్లల సందడి యెరుగరు. అందుచే తమ బల్లపైని కాగిదములు కలము పుల్ల యథాప్రకార సిద్ధిలోనే యుండును.

❖ ❖ ❖

హిందూ సమిష్టి కుటుంబముల గందరగోళముల నెరుగరు. వీరి కన్నగారు కలరు. వారితీవలనే చనిపోయిరి. పేరునకు సమిష్టి కుటుంబమే. కాని చిన్నప్పటి నుండియు వీరు బయట బయటనే పెరిగిన వారగుటచేత సమిష్టి కష్టసుఖములనంతగా నెరుగరు.

"అరే" అను మిత్రులు వీరికి లేనే లేరు. "ఓయ్" తెగ వారొకరిద్దరే! "ఆర్యవర్య" పరిచయస్థులే బహుళము.

❖ ❖ ❖

పంతులుగారింటిలో నొక పాత పటము కలదు. బుర్రమీసాలు, 24 అంగుళముల యెత్తుగల తుర్కీటోపీ, మోకాళ్ళపై చిందులాడు షేర్వానీ, పైజామా దిట్టమగు శరీర స్థౌల్యము – ఇవి ఆ పటమందలి విశేషాలు. సుమారు 30 ఏండ్ల వయస్సును సూచించును. ఆ జమీరు షరీఫు నుండి హైదరాబాదుపై సవాలు వేయవచ్చిన పైల్వానును సూచించును. ఆ పట మేమూలనో దాగియున్నది. బయటి వారికి గోచరించదు.

ఇప్పుడు రావుగారికి 52 సంవత్సరముల వయస్సు. ఈ 20 ఏండ్లలో నింత గొప్ప మార్పు.

నిజాం రాష్ట్రములోని విద్యావంతులైన యాంధ్రులలో నీ 10–15 ఏండ్ల నుండియు ఇట్టి మార్పులు జరుగుచున్నను "దొర" జాతివారు మాత్రము తమ "చిత్త నిత్య స్థితిని" నిరూపించికొనినారు.

రావుగారు మితజీవులు. (నగనాగరికుల యభ్యాసములు ఫ్యాషన్, సిగరెట్, టాకీ వగైరాలు బొత్తిగా లేవు) బెజవాడ సరిహద్దగు మధిర తాలూకా వారై ప్రాత ముల్కీ అయినను పూర్వాంధ్ర సంస్కారమే హెచ్చుగా కనబడుచున్నది. ప్రతి ప్రజాసంస్థలోను సభ్యులై ఆలోచనలు చెప్పి శ్రద్ధతో పనిచేసి లోక సంగ్రహార్థమై తమ శక్తి కొలది సేవజేయు హనుమంతరావు పంతులుగారు ఆంధ్ర మహాపురుషులలో ముఖ్యులనుటలో నేమియు సందేహములేదు.

శ్రీ రాజాబహద్దురు వేంకటరామారెడ్డిగారు

నిజాము రాష్ట్రములోని రాయచూరు పట్టణమున ఒకప్పుడు 18 ఏండ్ల రెడ్డి బాలుడొకడు తన మేనమామ చనిపోవుట వలన చాల చింతించుచుండెను. అతడు మిగుల బీద కుటుంబము లోనివాడు. మేనమామ జిల్లా పోలీసు సూపరింటెండెంటుగా నుండి అతనిని తన యింటనే యుంచుకొని చదివించుచుండెను. ఆ పోలీసు అధికారి చనిపోగా అతని బంధువులు వచ్చి యిల్లు ఖాళీ చేసి యీ బాలుని గూడ తమతో గొనిపోవ నుద్యుక్తులైరి.

బాలునకు విద్యాసక్తి యధికముగా నుండెను. గ్రామమునకు పోయిన వ్యవసాయమున ప్రవేశింపవలసి వచ్చును. అది బాలునకెంత మాత్రము నిష్టము లేకుండెను.

అతడుండిన యింటికి సమీపమున నొక మౌల్వీ యుండెను. బాలుడాతని చెంతకు బోయి కూర్చుండి దుఃఖింపసాగెను. అది చూచి మౌల్వీ "ఏల దుఃఖించెద"వని యడుగ బాలుడు సంగతి యంతయు చెప్పెను. దాని మీద మౌల్వీ "దేవుడున్నాడులే. దుఃఖించకు' అని ఓదార్చెను.

కాని బాలుని దుఃఖము ఓదార్పులతో పోలేదు. మరునాడు గూడ అతడు యథా ప్రకారముగ దుఃఖింపసాగెను. మౌల్వీ మరల అది చూచి బాలుని సమీపమునకు బిలిచి "ఏమి ఫర్వాలేదు పో, నీకు మేలే కలుగును" అని దృఢముగా పలికి పంపివేసెను.

మరునాడు బండ్లు కదలుటకు సిద్ధముగా నుండెను. బాలుడేమియు తోచక బిక్క మొగముతోనిలిచి యుండెను. ఒక క్షణమాలస్యమయిన బండ్లు సాగియే పోవును. కాని ఉన్నట్లుండగా యీ బాలుని మేనమామ అనుగ్రహమున ఉన్నతికి వచ్చిన ఒక పఠాను వచ్చి "ఈ బాలుని గూడ తీసుకొని పోయెదరా" అని అడిగెను.

"అవును?"

"తీసుకొనిపోయి"

"వ్యవసాయము చేయింతుము"

"చదివించరా?"

"ఎవరు చదివింతురు? ఖర్చెవ్వరు భరింతురు? అది మావల్ల కానిపని."

"సరే, మీరీ బాలుని నాకప్పచెప్పుడు"

"వీలులేదు"

"అప్పజెప్పవలసినదే. ఆ బాలుని ముట్టితిరా, ఖబడ్దార్!"

బంధువులు అందుకు మారు చెప్పలేక, "వాని తిప్పలు దైవమెరుగు"నని పఠానున కప్పగించి వెడలిపోయిరి.

బాలుడు బ్రహ్మానంద భరితుడయ్యెను.

మరునాడే పఠాను బాలుని వెంటనిడుకొని హైదరాబాదు నగరమున కరిగి పెద్ద పెద్ద అధికారుల వద్దకు పిలుచుకొనిపోయి "ఇతడు విలియం వహబు (పోలీసు మొహతెమీం) సూపరింటెండెంటు గారి మేనల్లుడు"అని చెప్పి పోలీసు శాఖలో అమీన్ (సబినస్పెక్టరు) పదవినిప్పించెను.

విలియం వహబ్ అను పదమును విన్నంతనే యీ పురుషుడు ఇంగ్లీషు వాడా, ముసల్మానా, లేక ఉభయ సంబంధము కలవాడా అనే పాఠకు లూహలకు పోవుదురు; కాని అతడు రెడ్డియే.

క్రీ.శ. 1865లో దివంగతులైన వనపర్తి సంస్థానాధీశ్వరులు ప్రథమరామేశ్వర రాయల వారు గొప్ప సంఘ సంస్కారపరులలో అత్యుత్తములు (ఈ మహారాజే ఆంధ్రులందరిలోను మొదటి సంస్కారి అని నేనిదివరలో గోల్కొండ పత్రికలో విపులముగా వ్రాసియున్నాను). తత్ఫలితముగా వారు తమ బంధువులలో ఏడుగురు బాలురను తమవద్దనే చేర్చికొని వారి పుట్టు పేరులను తుడిచివేసి ఇంగ్లీషువారి పేరు కొంత, ముసల్మానుల పేరు కొంత చొప్పున చేర్చి వారికి పేరులు పెట్టిరి. ఆ బాలురే విలియం వహబ్, చార్లెస్ వహబ్, హెన్రీ వహబ్ ఇత్యాదులు. ఈ వహబులందరును గొప్ప గొప్ప యుద్యోగములు చేసిరి. ఆ వహబులలో నొకడైన విలియం వహబ్ రామేశ్వర రాయల వారికి మేనల్లుడు. ఆ విలియం వహబు మేనల్లుడే యీ బాలుడు – అనగా వేంకట రామారెడ్డి.

రెడ్డిగారి బాల్య దశలోని యింకొక చిన్న ఘట్టము నిక్కడ చూపవలసి యున్నది. రెడ్డిగారు సుమారు 12-13 ఏండ్ల వయస్సులో కొన్ని దినములు హైదరాబాదులో చదువుకొనిరి. ఆ రోజులలో నొకరాత్రి ఇంద్ర సభ అనేది కాబోలు ఒక నాటకము ప్రదర్శింపబడినది. దానిని చూడవలెనని రెడ్డిగారికి సరదా పుట్టినది. కాని పెద్దలు పోనీయరు. మానలేడు. ఏమి చేయుట? తుదకు రెడ్డిగారొక యుక్తి పన్నిరి. మంచము మీద వారు దిండుపెట్టి దానిపై దుప్పటి కప్పిరి. చూచువారికి బాలుడే పడుకొని యున్నట్టు తోచెటట్టు సరిగా సర్దిరి. తరువాత మిత్రులతో కలిసి నాటకమునకు వెడలిపోయిరి. కొంతసేపయిన తరువాత యజమాని వచ్చి చూసి బాలుడే పడుకొని యున్నాడని వెడలిపోయెను. కాని అక్కడ నాటకమయిపోయిన తరువాత కళ్లు నులుముకొనుచు బాలుడు తన మిత్రులతో బయలుదేరి వచ్చుచు ఉస్మాన్‌గంజ్ నాకా (పోలీస్‌స్టేషన్) వద్ద ఎవరో తగవులాడుకొనుచుండ తమాషా చూచుచు నిలువబడెను. కొంతసేపటికిపోలీసులు వచ్చి "మాకీ తగవుతో సంబంధములే"దని బాలుడును, మిత్రుడునుఎంత మొరపెట్టుకొనినను వినుపించుకొనక తగవులాడుచుండిన వారితో పాటు వీరిని నాకాలో బంధించిరి. తెల్లవారిన పిదప యజమాని బాలుని లేపవచ్చి, దిండుచూచి అదిరిపడి బాలుడు రాత్రి మిత్రులతో గూడి ఎక్కడికోపోయి యుండునని తహతహపడును. కొంతసేపటికి బాలుడు పోలీసులు విడిచిపెట్టగా యింటికి వచ్చి యజమానిచే ప్రాయశ్చిత్తము పొందెను. రెడ్డిగారు ఇప్పటికి కూడా యీ సంగతి మరువకపోవుటయే కాక అప్పుడప్పుడు అది యంతయు చెప్పుచు "ఇప్పటికి గూడ నేను ఆ నాకాను చూసినప్పుడు చిన్నప్పటి ఆ ఘట్టము జ్ఞాపకము వచ్చు"ననుచుందురు.

పఠాను అనుగ్రహమువలన అమీన్ పదవి దొరికినది; కాని తన్నిర్వహణ విధానము మాటయేమి? అప్పటికి వారి పాండిత్యము ఉర్దూలో 5వ వాచకము వరకు మాత్రమే. తెనుగులో చదువుట, వ్రాయుట, కొంచెము వడ్డీ లెక్కలు కట్టుట వరకు మాత్రమే. పార్శీలో ఇంతకు చాలా తక్కువ ప్రవేశము మాత్రమే. పైగా ఉర్దూలోని నిశిందా వ్రాత చదువుటకే శక్తి చాలదయ్యెను. ఇక పోలీసు వ్యవహారముల జ్ఞానమా? పూర్తిగా సున్న.

ఈ స్థితిలో ఒక తాలూకాలో పోలీసు ఉద్యోగిగా వెళ్ళి ప్రవేశించినారు రెడ్డిగారు; కాని అదృష్టము బాగుగానుండెను. ఏమంటే? అక్కడి తహస్సీలుదారు రెడ్డిగారి

మేనమామ సిఫారసువలన ఉద్యోగము పొందినవాడు. ఇంక లోటేమి? దినదినమును పైనుండి వచ్చెడి ఆజ్ఞలతో రెడ్డిగారు ఏకాంతముగా తహస్సీలుదారు వద్ద కరిగి జవాబులు రాయించుకొని (ఈ సంగతి అక్కడి నౌకర్లకును తెలియదు) వచ్చుచుండెడివారు.

ఇట్లు కొలది దినములే జరిగెను. తరువాత రెడ్డిగారు స్వయముగా వ్యవహరించుటకు పూర్తిగా సమర్థులయిరి.

సుమారు 15 సంవత్సరముల క్రిందటి మాట. వనపర్తిలో మహారాజా శ్రీ రామేశ్వరరావు బహద్దరువారి రెండవ కుమార్తె వివాహము జరుగుచుండెను. ఆ సందర్భమున మనరెడ్డిగారు “రెడ్డి విద్యార్థుల విషయమున శ్రద్ధ చూపువారులే” రనియు, “వారికి సాయము చేయవలయుననే భావమే యెవరికినిలే” దనియు, “కాని ఇతరత్రా అనవసర వ్యయాలు చేయుటకు మాత్రము ఎవరూ జంక” రని ప్రసంగవశమున పలికిరి. అదివిని రాజులు మున్నగు పెద్దలు “మేము ద్రవ్యము ఇచ్చెదము; కాని దానిని సక్రముగ వినియోగించు వారెవ్వరు?” అనిరి. వెంటనే రెడ్డిగారు “నేనున్నా” నని ధైర్యముగా బదులుచెప్పిరి.

ఇంకేమి? వెంటనే పింగళి వెంకటరామరెడ్డి దేశముఖుగారు 10000–0–0, వనపర్తి మహారాజు 25000–0–0, గద్వాల మహారాజు 30000–0–0 ఇతరులు మరికొందరు తమ తమ శక్తికొలది చందాలు వాగ్దానము చేసిరి. జాపితా మొత్తము 80000–0–0 అయ్యెను. అందుకు చాలా సంతోషించి మన రెడ్డిగారు వెంటనే వసూళ్ళు ప్రారంభించి హైదరాబాదు నగరమున “రెడ్డి హాస్టలు” అనే పేరుతో నొక ప్రచండ రెడ్డిసంస్థను నెలకొలిపిరి. అది నేటికిని మన రెడ్డిగారి పర్యవేక్షణము క్రిందనే చక్కగా నడుచుచున్నది. దినదినాభివృద్ధియు గాంచుచున్నది.

ఈ రెడ్డి హాస్టలు విశ్వరూపము తాల్చునప్పటికి మన వేంకటరామారెడ్డిగారు అమీన్ పదవినుండి సర్కిల్ ఇనస్పెక్టర్, దానినుండి సూపరింటెండెంటు, దానినుండి నగరపు కొత్వాల్‌గారి మదదార్ (first assistant) తర్వాత నగరపుకొత్వాలు (Commissioner of City Police) గను అభివృద్ధి బడసిరి. ఈ నగరపు కొత్వాలు పదవి పొందుటలో హైదరాబాదు చరిత్రలో మొదటి హిందువు రెడ్డిగారే. (ముందు సంగతియేమో!)

రెడ్డిగారు కొత్వాలుగా నుండిన కాలములో నొకనాడు వీరి తల్లిగారి పుట్టింటి యూరగు (వనపర్తి సంస్థానము నందలి) రాయణిపేట గ్రామవాసి, వృద్ధుడైన యొకకాపు (రెడ్డి) నగరమున కేదోపని మీద వచ్చి రెడ్డిగారు తన గ్రామమున పుట్టి పెరిగినవారు గనుక చూచివత్తమని వీరి యింటికి వెళ్ళిరి. ఆ సమయమున రెడ్డిగారు కొందరు నవాబులు, రాజులు, ఉన్నతోద్యోగులు దర్శనము కోరి వచ్చియుండ వారితో మాట్లాడుచుండిరి. కాని బైటనుండి చూచువారికిప్రక్కల నున్న గొప్పవారు కనబడక ఎదుటనున్న రెడ్డిగారొక్కరును మాత్రమే కనబడుచుండిరి. అందుచేత మన వృద్ధకాపు రెడ్డిగారొక్కరే ఉన్నారని భావించి "ఏమిరా వేంకటరాముడూ బాగున్నావురా?" అని పలకరించుచు లోపల అడుగుబెట్టెను; కాని ఇంకేమున్నది? లోపల ఎందరో పెద్దలు, వారిమధ్య చుక్కలలో చంద్రునివలె రెడ్డిగారు! వృద్ధునకు వడకు ప్రారంభమైనది. మాట నిలిచిపోయినది. చూపులు చెదరిపోయినవి. అయితే రెడ్డిగారు సంతోషముతో బదులుచెప్పిరి. కుశల ప్రశ్న చేసిరి. ఒకటి రెండు నిమిషములు గడచినను వృద్ధుని భీతి ఇంకను అట్లేయుండుట చూచి "పనియున్నది, లోనికి పోవలయును" అని పెద్ద మనుష్యులను పంపివేసి, చేయిపట్టుకొని వృద్ధుని గృహాంతర్భాగమునకు తోడుకొని వెళ్ళి కులాసాగా మాట్లాడసాగిరి. దానితో వృద్ధుడు కొంతవరకును దేరికొనెను, గాని రెడ్డిగారు తమ ప్రక్క గూర్చుండబెట్టుకొని సరాగములాడుచు భోజనము చేయించునంత వరకును అతడు పూర్తిగా కుదుటబడలేదు. తరువాత రెడ్డిగారు అతని స్థిమితము గాంచి ఆనందించి సత్కరించి పంపివేసినారు.

హైదరాబాదులో కొత్వాలీ పదవీ అన్న అసిధారావ్రత వన్నమాట. ఒక ప్రక్క మహాఘనత వహించిన నిజాము ప్రభువు. ఒక ప్రక్క హిందువులు. మరొక ప్రక్క ముసల్మానులు, వేరొక ప్రక్క నవాబులు, రాజులును, అందరికిని పైని ఇంగ్లీషు ప్రభువులు. ఇందరికి తృప్తి కలిగించవలెనన్న సామాన్యముకాదు, కాని యీయసామాన్య కార్యమును మనరెడ్డిగారు మాత్రము చాలా కులాసాగా నెరవేర్చి అందరవలనను మెప్పుబడసిరి.

రెడ్డిగారు కొత్వాలుగానున్న కాలమునందే మన హిందూదేశమునకు వేల్సు యువరాజుగారు వచ్చిరి. అసహాయవాదులు దేశమందంతటను వారి రాకను నిరాకరించుచుండిరి. హైదరాబాదున నేమి చిక్కులు వచ్చునోయని ప్రభుత్వము వారు

తహతహలాడుచుండిరి. అది చూచి రెడ్డిగారు "ఏమియు భయము వలదు. వారిని ఆహ్వానింపుడు, వారి క్షేమమునకు, వారి సంతృప్తికి నేను పూచీ" అని బాసయిచ్చినారు.

ఆ సమయమున ఏలాటి కల్లోలములును జరుగకుండునట్లు రెడ్డిగారు కావించిన ఏర్పాటులు, రాత్రింబగళ్ళు వీరుపడిన శ్రమ చాలామందికి తెలియవు, కాని వేల్సు యువరాజాగమనము సక్రమముగను, దేవేంద్ర వైభవముగను జరిగి పోయినది.

ఆ సమయమున రెడ్డిగారి శక్తి సామర్థ్యములను బాగుగా – పూర్తిగా గ్రహించిన వారిలో వేల్సు యువరాజుగారు ప్రముఖులు. వారు నగరమునుండి వెళ్ళునపుడు గొప్ప గొప్ప అధికారుల కందరకును దర్శనమిచ్చి ప్రతివారికి నేదో బహుమానమిచ్చిరి.

ఆ సందర్భమున వంతు ప్రకారమున రెడ్డిగారికిని దర్శనము దొరకెను. వేల్సు యువరాజుగారు రెడ్డిగారితో చాలసేపు మాట్లాడి వారికొక వెండి సిగరెట్ డబ్బీ బహుమానమిచ్చి పంపివేసినారు. (రెడ్డిగారికి సిగరెట్ అభ్యాసము ఏ మాత్రమును ఇప్పటికిని లేదు)

రెడ్డిగారు బయటికి వచ్చిన తరువాత ప్రముఖులు చాలామంది వీరికి జరిగిన సత్కారమును వినగోరిరి. "నన్ను తమ ప్రక్కన కూర్చుండబెట్టుకొని వేల్సు యువరాజుగారు "నీవు చేసిన యేర్పాటులన్నియు నాకు మెప్పు కలిగించినవి" అని చెప్పినారు. అని రెడ్డిగారు పలుకగా తక్కిన అధికారులందరును ఆశ్చర్యపడి ఏమీ వారి ప్రక్కన కూర్చుంటివా? మేమందరము దూరమున నిలిచియే మాట్లాడితిమే? తెలియక నీవు వారి పక్క కూర్చుంటివేమో?" అని హేళనము చేసిరి. దానికి రెడ్డిగారు "నేనట్లు తెలివి తక్కువ పనిచేసిన నాతల తీయించి యుండరా? వారు స్వయంగా పిలిచి నన్ను కూర్చుండబెట్టుకొనిరి" అని బదులు చెప్పి వారిని నివ్వెరపడునట్లు చేసిరి.

వేల్సు యువరాజుగారు వచ్చునప్పటికి రెడ్డిగారి వయస్సు సుమారు 55 సంవత్సరములు. అప్పటివరకును వారింగ్లీషు ఒక్క ముక్క అయిన నెరుగరు. అట్టి రెడ్డిగారు వేల్సు యువరాజుగారు ఒక సంవత్సరమునకు హిందూస్థానమునకు వత్తురనగా "వారు హైదరాబాదుకు తప్పక వచ్చెదరు. అప్పుడు నేను వారితో ఇంగ్లీషున మాట్లాడవలెను" అని దీక్ష పట్టిరి. ఉపాధ్యాయుడు వచ్చి, ఏ,బీ,సీ,డీలు ప్రారంభించెను.

అప్పుడు రెడ్డిగారు ప్రయిమరీ విద్యార్థి కంటెను ఎక్కువ భయము శ్రద్ధ చూపసాగిరి. దినపాఠము తెల్లవారుజామున వల్లెవేయుట, రాత్రి పడుకొనబోవుటకు ముందు పాఠము గట్టిచేసుకొనుట, పాఠము నేర్చుకొనుటలో బిగ్గరగా చదువుట, ఇది నిత్యకృత్యము. రెడ్డిగారి గదిముందే జవానులు పహరా యిచ్చుచుండిరి. "ఎన్నడును లేనిది యీ మధ్య నేమోమో యెవ్వరికిని దెలియని మాటలతో తమకు తామే ప్రతి రాత్రియు గొణుగు కొనుచున్నారు వీరు. ఏదో దయ్యమో భూతమో ఆవేశించినట్లున్నది. ఇంకెట్లు?" అని జవాను లొకనాడు కూడబలుకుకొని వేగముగ పోయి యొక పోలీసు అధికారితో చెప్పివేసిరి. అంతట ఆ యధికారి వచ్చి రెడ్డిగారితో మాట్లాడి యథార్థము నెరిగి జవానుల భీతిని రెడ్డిగారి కెరింగించెను. దానిమీద ఇద్దరును చాలాసేపు నవ్వుకొని జవానుల భీతి తొలగించిరి.

వేల్సు యువరాజుగారు రెడ్డిగారి వచ్చీరాని ఇంగ్లీషు విని ముసిముసి నవ్వులు నవ్విరట.

రెడ్డిగారికి బీదలనిన చాలా ప్రీతి. సాధారణముగా పోలీసులు కఠినులనియు, భయంకరులనియు జనుల అభిప్రాయము; కాని రెడ్డిగారు 40 ఏండ్లకు పైగా పోలీసు ఉన్నతోద్యోగము నిర్వహించినను మార్దవము, క్షమ, దయ, కరుణ తప్ప కాఠిన్యము, ఆగ్రహము, క్రోధము, ద్వేషము ఎంతమాత్రమును దగ్గరకు రానిచ్చి యెరుగరు. గొంగటి వారిని (పేద రైతులను) జూచిన రెడ్డిగారికి ఎంతో ఆనందము. ఆదరమున్ను. బీద విద్యార్థులకు సాయము చేయుటయన్న వీరికి పండుగ. సంఘ సంస్కారమన్న వీరికి చాలా యిష్టము, ముందడుగున్నూ, పూర్వకాలపు మొగలాయి మనిషివలె కనబడుదురు. కాని నేటి సంస్కారి ప్రముఖులకంటె నెక్కువ సంస్కారులు.

రెడ్డిగారికి మహోఘనత వహించిన శ్రీనిజాము ప్రభువువారు శ్రీరాజా బిరుదమును, బ్రిటిషు ప్రభుత్వమువారు ఓ.బి.ఇ. బిరుదమును ప్రసాదించి గౌరవించిరి.

రెడ్డిగారు కొత్వాలీ ఉద్యోగమునుండి గత సంవత్సరము నందే విరమించుకొనిరి. పెన్షను సగము జీతము అనగా 750-0-0 మాత్రమే ఏర్పడ వలసియుండ శ్రీనిజాము ప్రభువువారు సమర్థమైన వీరి సేవను గుర్తించి 1000-0-0 ఇచ్చునట్లు ఫర్మానురూపముగా అనుజ్ఞ యిచ్చిరి. ఇంతేగాక ఒక ప్రక్క కొత్వాలీ ఉద్యోగము నుండి సెలవు పొందుచుండ శ్రీనిజాము ప్రభువు వారు తమ సొంత జిల్లాయగు

ఆత్రాపు బల్దాజిల్లాలో రెడ్డిగారికి ఒక ప్రత్యేక పదవిని కల్పించి "స్పెషల్ ఆఫీసరుగా 500-0-0 వేతనముమీద (పెన్షను 1000-0-0 లును గాక) నియమించినారు.

ఇప్పటికి రెడ్డిగారి వయసు సుమారు 62 సంవత్సరములు. ఇంకా వ్రాయవలసిన వీరి చారిత్రక విషయాలు ఎన్నో యున్నవి. ఇప్పటికి సెలవు.

కొండా వెంకట రంగారెడ్డిగారు

ఆ కొండకు ఈ కొండకు ఏమైనా సంబంధం ఉందా అని అన్నాడు ఒకాయన. కొండా వేంకటప్పయ్యగారు బ్రాహ్మణులు. కొండా వెంకటరంగారెడ్డిగారు బ్రాహ్మణేతరులు. ఇంటిపేరు కుదిరింది. అసలు పేరులో ముప్పాతిక కుదిరింది. నాయకత్వములోను సాటి పాటికి వచ్చింది. గుణములోను తూకము సరాసరిగా ఉంది. వయస్సులోనే కాస్త తేడా. మరి వారుండేది బ్రిటిషాంధ్రము వీరిది నిజామాంధ్రము.

హైకోర్టు వకీలటగా! కాదయ్యా అడ్వకేటు!! ఆ౯.ఎల్.ఎల్.బీయా? కాదు. బి.యల్లా? కాదు. మరేమి? వారు ఇంగ్లీషును సాధించే దానికి మెక్మిలన్ రీడరును నాలుగు మార్లు చేపట్టి గురు శుశ్రూష కూడా సాగించినారు. కాని కార్య బాహుళ్యము చేత 'పీ యూటీ, పుట్' అని ఉచ్చరించి చాలించుకొన్నారు. ఇంగ్లీషు రానిది వకీలెట్లయ్యి రందురా? ఉర్దూలో ఖానూన్ పరీక్ష యిస్తే హైద్రాబాదులో వకీలౌతారు లెండి. అట్లయితే వారికి అరబ్బీ బాగా వచ్చునన్నమాట. లేదు. వారికి అరబ్బీ, ఫార్సీరాదు. ఉర్దూ మాత్రమే వచ్చు. బ్రిటిషిలాకా వారికి యిక్కడి పరిస్థితులు తెలియనందున ఇన్ని ప్రశ్నలు వేసి అవస్థ పెట్టుతారు. అయితే యీ "నైజాం" లో అంతా ఉల్టాగా ఉందే వ్యవహారం. అబ్బే! అంత భయంకరంగా లేదులెండి.

కొండా వెంకట రంగారెడ్డిగారు తెనుగులో ఏమైనా గ్రంథాలు వ్రాసినారా? లేదు. కాని వారు ఉర్దూలో ఫౌజ్దారీ సంబంధంలో గ్రంథాలు వ్రాసినారు. వారు తౌరక్యాంధ్రం మాట్లాడుతారు. బ్రిటిషాంధ్రులు హౌణ్యాంధ్రము మాట్లాడితే మేము తౌరక్యాంధ్రము మాట్లాడుతాము వారిది ఇంగ్లీషు దడదడా, మాది ఉర్దూ గడబిడ.

బ్రిటిషాంధ్ర నాయకులు ఉపన్యాసాలిచ్చే దానిలో దక్షులు. తెనుగులోనైతే జీ.ఐ.పి. వేగంతో ఝూడించుతారు. "నిజాం"లో అట్టి ఘనులు లేరు. ఆ పొట్టి

బూర్గులవారు మంచి వక్త అని అంటే దోషం లేదు. మాడపాటివారు ముద్దుముద్దుగా మాట్లాడుతారు. ప్రతాపరెడ్డిగారు మీదికే ఉరికి వస్తారు.రావి మిత్రము ఒకటి తలచి ఒకటి అంటాడు. మందుముల సోదరులు మూల్గుతారు. వారికి ఎడమచేయిగా కొండావారు ఉంటారు.

ఇంతవరకు మదింపు చేస్తే ఏమి తేలినట్లు? కొండకు ఇంగ్లీషు రాదు. తెనుగు బాగా రాదు. గొప్ప వక్త కాదు. అట్లయితే ఇంకెందున్నది ఆయన గొప్పతనం. ఈ కాలంలో రంగం యెక్కి ఏకధాటిగా జడివానవలె ఉపన్యాసం విసరేవారే గొప్పవారు. ఏదో ఒకరాగం అలవాటు చేసుకొని గొంతెత్తి పాడేవారే కవిత్వ కోకిలలు. చతురాంగ్లాక్షరాతీత బిరుదలాంగూల విభ్రాజమానులే పండితమానులు. నేను సర్వజ్ఞుని అనే వాలకంతో నోరెత్తితినా జాగ్రత్త అనే బెదరింపుతో మానసష్టం దావాకు భయపడ కుండా వాదాన్ని వదలి ప్రతిపక్షులను సంస్కృత వ్యంగ్య ధ్వనులతో సత్కరించేవారే విమర్శకాగ్రేసర చక్రవర్తులు. మరి వేంకటరంగారెడ్డి గారు ధ్వన్యాలోకం చదువు కొన్నారా? అదికూడా లేదా శాంతం పాపం. వారికి "వక్రోక్తి జీవితము" సరిపడనే సరిపడదు.

మరెందున్నదండి వారి గొప్పతనం. ఏదో విసిగించకుండా రెండు ముక్కలతో చెప్పివేయండి అని అంటారా వినండి.

మా కొండ వేంకటరంగారెడ్డిగారి వంటి వకీళ్ళు మొత్తం హైద్రాబాదు రాజ్యంలో యిద్దరో ముగ్గురో అంతే! వారి కాదాయం నెలకు 1000 రూపాయిలే. సర్ సప్రూకు నెలకు 20 వేలట. మోతీలాల్ నెహ్రూకు నెలకు 50 వేలు వచ్చేదట. 1000 రూ॥ వకీలు గొప్ప వకీలెట్లామరి. హైద్రాబాదులో నెలకు 10 వేలు సంపాదించే వకీళ్లు కొందరున్నారు. కొందరు కక్షీదారులు న్యాయాధిపతిగారి అల్లుడు, చుట్టము, మిత్రుడు యెవరయ్యా అని విచారించుకొని అతనికి కోరిన 'ఫీసు'ను ఇచ్చి కోర్టులో దిష్టిబొమ్మవలె నిలబెట్టుతారని వింటూ ఉంటాము. తాలూకాలో కొత్త మున్సిపులను బండెడు పుస్తకాలతో, మేకచెవుల మెడ పట్టీలతో, 'అబద్ధంవా సుబద్ధంవా కుంతీపుత్రో వినాయకః' అను దబాయింపు వైతండిక వాదముతో కేసులో గెలుపును పొందే వకీళ్ళు కొందరు,చీమతలంత ఆనుకూల్యము లేకున్నను ఫీసు నష్టం కాకుండా నీ కేసును

గెలిపిస్తాను చూడు అని చిటికెలు వేసేవారు కొందరు. పండుగ దినాలలో ఈదెముబారక్ అని ఇగిలించుతూ అధికారుల యిండ్ల కెళ్ళి జీహుజూర్ సలాములు వంగివంగి బజాయించేవారు కొందరు. ఏజంట్లను పెట్టి కేసులు సంపాదించేవారు కొందరు. ఈ విధంగా ఎందరో వకీళ్ళు కలరు. కొండా వారు సెలవులు వస్తే చక్కగా మంగళారం లేకుంటే ధర్మసాగరం లేకపోతే షారాజూ పేటకు వేంచేస్తారు. బలహీనమైన కేసు వస్తే ఇందు నీకు బలం లేదు అని పుడక విరిచి కక్షిదారుని మొకం మీదనే అని వేస్తారు. ఏదైనా చిక్కు చీకు వస్తే నాకు బాగా బోధ కాలేదు. నా మిత్రులతో ఆలోచించుతానులే అని రహస్యం దాచుకోకుండా అంటారు. చాలా వేధించే కక్షిదారు దొరికితే నీకు తెలియదయ్యా నేను చెప్పినట్లు వింటావా లేదా అని గట్టిగా అంటారు. ఫీసు విషయములో ఇంత ఇస్తేనే కాని వల్ల కాదు అని యెన్నడున్నూ సాధించిన వారు కారు. తెలిసినవారు వెంటవెళ్ళితే వారెంత చెప్పితే అంతే అని తృప్తిపడతారు. కొందరు వకీళ్ల ఫీసు తక్కువ యిచ్చే కక్షిదారులను కూడ పోనీయరు. ఆ వారసు వేరే రూపంగా ఖర్చుల పేరుతో తీర్చుకుంటారు. కొండావారు కేసు పట్టిన తర్వాత ఖర్చులు లెక్క ప్రకారం తీసుకుంటారు. కక్షిదారుకు ఏ వివాదం కలుగకుండా చాలా శ్రద్ధ తీసుకొంటారు. అన్యాయముగా ఒక పైసా కూడా లాగే ఆలోచన చేయరు. అందుచేతనే వారు తమ వృత్తిలో విద్యలో గట్టివారైనా వారికి ఆదాయం మాత్రము తక్కువ. వారికి బంధువులైన అధికారులు లేరు. అధికారుల స్నేహానికి ప్రయత్నమే చేయరు.

రెడ్డిగారిది ఆత్రాపుబల్దా జిల్లాలోని మంగళారం అనే గ్రామం. వకీలు వృత్తి ప్రారంభించిననాడు ఆ గ్రామం పటేలుగిరి. ఆ గ్రామంలో తగుపాటి సేద్యం ఉ ఒడింది. వీరితో దానికి అయిదుగురు భాగస్తులు. వీరు వకీలు వృత్తి ప్రారంభించిన తర్వాత వీరే నాలుగు గ్రామాలలో పటేలుగిరీని, భూములను సంపాదించిరి. కాని 'అవన్నీ నావే' అన్న వారు కారు. మూడేండ్ల క్రిందట సమిష్టి కుటుంబ విభజన జరిగెను. మీరందరు మీ యిష్టం వచ్చిన భాగాలు తీసుకొనండి. అందరున్నూ పసందు చేసుకొని తీసుకొన్న తర్వాత 'మిగిలినదే నా భాగం' అని అన్నారు. అట్లే తీసుకున్నారు. అట్లు జరిగినను, ఒక భాగస్తుడు నాకు భాగం న్యాయంగా రాలేదు అని వీరివద్దనే పేచీ పెట్టుకొని తుదకు రెడ్డిగారికి వచ్చిన భాగం నుండియే మరికొంత లాగుకొనెను.

వీరు వకాలతును 30 ఏండ్ల నుండి చేస్తున్నారు. అందరునూ కలిసియుండిన కాలములో వీరి కుటుంబములో 22 వివాహాలైనవి. ప్రతి వివాహానికి అయిన వెండి, బంగారు, వస్త్రములకు వ్యయమును పూర్తిగా శ్రీ కొండా వేంకటరంగారెడ్డి గారే భరించిరి. అందులో వారి సొంత సంతానములో ఒక్కరికైనా వివాహం కాలేదు. విభాగమైన తర్వాతనే అయ్యెను.

హైదరాబాదు నగరములోని ప్రతి ప్రజాహిత సంస్థ కూడా కొండ వారి నుండి విరాళాలు, నెలచందాలు పొందుచూ వచ్చినవి. వేమన గ్రంథాలయానికి వారు ముఖ్యాధార భూతులు.

హైదరాబాదు నగరంలో రెడ్డి హాస్టల్ ఒకటి కలదు. వీరి యిల్లు రెండవ రెడ్డి హాస్టలు. వీరి బంధువుల పిల్లలు 20 మందికి పైగా ఎల్లప్పటికిని, వీరి ఇంటిలో భోజన, వస్త్ర, గ్రంథాలను పొందుచూ వచ్చినారు. అంతేకాదు, వారికి ముక్కునొచ్చిన వైద్యుని పిలిపించి చికిత్స చేయించుతారు. చదువు వారికి బాగా వంటబట్టవలెనని ఇంగ్లీషు, తెనుగు, ఉర్దూ భాషలను బోధించే పంతుళ్ళను నియమించి, చదువు చెప్పింతురు. అట్టి పిల్లలకు, తన పిల్లలకు తుదకు తనకు ఏమిన్నీ భేదము లేదు. అందరికినీ ఒకే విధమగు భోజన భాజనాదులు. అల్పబుద్ధి, కుటిలత కలవారిని పరిహరింతురు. అభిప్రాయ భేదాన్ని దాచుకొనరు మొగమాట మెరుగరు. వారి యౌదార్యాన్ని, సాధుత్వాన్ని పురస్కరించుకొని వేధించువారికి ఏమిన్నీ యెప్పుడున్నూ కొదువ యుండదు. కాని వారిలో ఓపిక అనుపమానంగా ఉండుటయే చాలా విచిత్రమగు విషయము.

అయితే వారు జెయిలుకు వెళ్ళలేదేమి? జెయిలుకు వెళ్ళితే నాయకుడు, ఒక నెలపాటు జెయిలుకు వెళ్ళేవారు సాధారణముగా తాము మహానాయకులమని అనుకొని పోనివారు నోరెత్తితే – 'మూలన గూర్చున్న వారికి దేశపరిస్థితులేమి తెలుస్తవి' అని యెద విరుచుకొని మాట్లాడే ధోరణి "నిజాం"లో కూడా మొదలైంది కదా! మరి యీ రెడ్డిగారు జైలుకెందుకు వెళ్ళలేకపోయిరి. జెయిలుకు పోవలసిన స్థితి వచ్చినదనియు అది నా ఆజ్ఞ అనియు చెప్పగలిగిన మహా నాయకుడు కానరాదని రెడ్డిగారనుకున్నట్లు న్నది. జెయిలు అంటే 'ఓ యబ్బా'యని దద్దరిల్లి బొబ్బరించేవారు కారులెండి. నిజమైన

అవసరం వచ్చిననాడు వారు వెళ్ళక మానరు. వారి వెంట వేలకొలది అనుసరించక మానరు. వారిలో అంతటి విశ్వాసం జనులకు కలదు.

ఎద్దుంచ పోయంగ ఏరులై పారంగ
ఉంకించి ఉంకించి దుంకినాడు

అన్న విధంగా 'చూడు నా దెబ్బ' అని మీసం పురిపెట్టి, భుజమెప్పళించి రంకె వేసి సవాల్ వేసేవారు కారు శ్రీ రెడ్డిగారు.

స్వయంకృషి వల్ల వృద్ధికి వచ్చినారు. ఒకరికి అపకారము చేసి ఎరుగరు. వివాదాలకు దిగరు. ఎంత అంటారో అంత చేస్తారు.


ఆంధ్ర సారస్వత పరిషత్తు
Andhra Saraswatha Parishath.
Tilak Road, Hyderabad - 500 001
NO PARKING

